చిన్న పిల్లలకు బైబిలు కథలు

హెచ్. వాన్ డామ్

చిన్న పిల్లలకు

బైబిలు కథలు

బొమ్మలు : జాప్ క్రామర్

ఉచిత పంపిణీ మాత్రమే
FOR FREE DISTRIBUTION ONLY

విషయ సూచిక

పాత నిబంధన

1.	దేవుడు సమస్తాన్ని సృష్టించాడు	ఆదికాండము 1:1-19	12
2.	దేవుడు ఇంకా ఏమి చేసాడు?	ఆదికాండము 1:20-31	14
3.	ఏదేను వనంలో	ఆదికాండము 2:15-25	16
4.	సాతాను మాట వినడం	ఆదికాండము 3:1-8	18
5.	దేవుడు ఆదాము హవ్వల కోసం వెదకుట	ఆదికాండము 3:9-24	20
6.	కయీను మరియు హేబెలు	ఆదికాండము 4:1-16	22
7.	సురక్షితంగా ఓడలో	ఆదికాండము 6	24
8.	ఓడ నుండి వెలుపలకి	ఆదికాండము 7	26
9.	ఒక ఎత్తైన గోపురము	ఆదికాండము 11:1-9	28
10.	అబ్రాహాము: దేవుని స్నేహితుడు	ఆదికాండము 12:1-8	30
11.	ఆబ్రాహాము, లోతు	ఆదికాండము 13	32
12.	దేవుడు మరిచి పోతాడా?	ఆదికాండము 16:1-4, 18:1-15	34
13.	సొదొమ పట్టణంపై దేవుని శిక్ష	ఆదికాండము 19:1-29	36
14.	ఇస్సాకు, ఇష్మాయేలు	ఆదికాండము 21:1-20	38
15.	అబ్రాహాము బలి	ఆదికాండము 22:1-19	40
16.	యాకోబు, ఏశావు	ఆదికాండము 25:19-34	42
17.	యాకోబు తన తండ్రిని మోసగించుట	ఆదికాండము 27	44
18.	బేతేలు వద్ద యాకోబు	ఆదికాండము 28:10-22	46
19.	లాబాను వద్ద యాకోబు	ఆదికాండము 29,30, 35:16-19	48
20.	యాకోబు తిరిగి రావడం	ఆదికాండము 31:3, 17, 18 ఆదికాండము 32, 33:1-4	50
21.	యోసేపు	ఆదికాండము 37:1-11	52
22.	గోతిలో నున్న యోసేపు	ఆదికాండము 37 :12-36	54
23.	ఐగుప్తులో యోసేపు	ఆదికాండము 39:1-20	56
24.	చెరసాలలో యోసేపు	ఆదికాండము 39:21-23 ఆదికాండము 40	58
25.	యోసేపు దేశమంతటిమీద అధికారిగా నియమింపబడుట	ఆదికాండము 41:1-46	60

26.	కోపించిన అధికారి	ఆదికాండము 41:47-57 ఆదికాండము 42	62
27.	ఐగుప్తుకు తిరిగి వచ్చుట	ఆదికాండము 43	64
28.	నేను యోసేపును	ఆదికాండము 44, 45:1-25	66
29.	ఐగుప్తులో యాకోబు	ఆదికాండము 45:26-28 46:1-30, ఆదికాండము 48	68
30.	బానిసలు	నిర్గమకాండము 1	70
31.	మోషే పుట్టుక	నిర్గమకాండము 2:1-10	72
32.	మోషే: ధనవంతుడైన రాకుమారుడు	నిర్గమకాండము 2:11-15	74
33.	గొర్రెల కాపరి యైన మోషే	నిర్గమకాండము 2:16-21; 3:1-12, 4:10-20	76
34.	ఐగుప్తులో మోషే, అహరోనులు	నిర్గమకాండము 4:29-31 5 7:10-25 8:1-15	78
35.	మరిన్ని తెగుళ్లు	నిర్గమకాండము 8:16-32 నిర్గమకాండము 9, 10	80
36.	ఒక పండుగ	నిర్గమకాండము 12:1-13, 29-41	82
37.	ఎర్రసముద్రాన్ని దాటుట	నిర్గమకాండము 14:5-31, 15:1-21	84
38.	దేవుడు తన ప్రజలను చూచుకొనును	నిర్గమకాండము 13:21-22 నిర్గమకాండము 15:22-25	86
39.	దేవుడు నిరంతరము తన ప్రజలను	నిర్గమకాండము 16, 17:1-7	88
40.	ఎవరు బలవంతుడు?	నిర్గమకాండము 17:8-16	90
41.	నీ దేవుడనైన యెహోవాను నేనే	నిర్గమకాండము 19, 20:1-21	92
42.	బంగారు దూడ	నిర్గమకాండము 32	94
43.	దేవుని కొరకు ఒక మందిరము	నిర్గమకాండము 36, 37, 38, 39	96
44.	కానానుకు సమీపముగా	సంఖ్యాకాండము 13, 14	98
45.	అరణ్యములో	సంఖ్యాకాండము 20:1-13 21:1-9	100
46.	రాహాబు మరియు వేగులవాళ్లు	యెహోషువ 2	102
47.	వాగ్దాన దేశములో	యెహోషువ 3, 6	104
48.	గిద్యోను	న్యాయాధిపతులు 6:1-28, 7	106
49.	సమ్సోను	న్యాయాధిపతులు 13, 14:1-6	108
50.	సమ్సోను గూర్చి మరిన్ని విషయములు	న్యాయాధిపతులు 14:7-20 16:1-3	110

51.	సమ్సోను మరణం	న్యాయాధిపతులు 16:4-31	112
52.	నయోమి, రూతు	రూతు 1	114
53.	బోయజు, రూతు	రూతు 2,3,4	116
54.	సమూయేలు పుట్టుక	1 సమూయేలు 1:1-20	118
55.	దేవుడు సమూయేలును పిలుచుట	1 సమాయేలు 1:21-28 3,4:1-18	120
56.	దావీదును రాజుగ అభిషేకించుట	1 సమూయేలు 16:1-13	122
57.	దావీదు, గొల్యాతు	1 సమూయేలు 17	124
58.	దావీదు తప్పించుకోవలసివచ్చింది	1 సమూయేలు 6:14-23 19:1-10	126
59.	మీ శత్రువులను ప్రేమించుడి	1 సమూయేలు 24	128
60.	నాబాలు, అబీగయీలు	1 సమూయేలు 25:1-38	130
61.	సౌలు మరల కాపాడబడుట	1 సమూయేలు 26	132
62.	దావీదు రాజు అగుట	1 సమూయేలు 31:1-8 2 సమూయేలు 1 : 1-11	134
63.	దావీదు యొక్క భయంకరమైన పాపము	2 సమూయేలు 11, 12:1-13	136
64.	చెడు హృదయము గల అందమైన	2 సమూయేలు 15:1-16, 18	138
65.	దావీదు, మెఫీబోషెతు	2 సమూయేలు 9	140
66.	జ్ఞాని యైన సొలోమోను రాజు	1 రాజులు 3	142
67.	రాకుమారుడు అబీయా	1 రాజులు 14:1-18	144
68.	దైవజనుడు ఏలీయా	1 రాజులు 17:1-6	146
69.	ఓబద్యా	1 రాజులు 18:3-4	148
70.	విధవరాలి ఇంటిలో ఏలీయా	1 రాజులు 17:7-24	150
71.	యెహోవాయే దేవుడు!	1 రాజులు 18:17-46	152
72.	కుష్టివాడైన నయమాను స్వస్థపడుట	2 రాజులు 5:1-19	154
73.	అవిధేయుడైన దైవసేవకుడు, యోనా	యోనా 1,2	156
74.	యోనా నీనెవె పట్టణానికి వెళ్ళుట	యోనా 3, 4	158
75.	దానియేలు, అతని స్నేహితులు	దానియేలు 1	160
76.	రాజు కన్న కల	దానియేలు 2	162
77.	అగ్నిగుండంలో ముగ్గురు మిత్రులు	దానియేలు 3	164
78.	సింహాల గుహలో దానియేలు	దానియేలు 6	166
79.	యేసు ప్రభువు ఎప్పుడు వస్తాడు?	మాలాకీ 4:2 ఆధారంగా	168

క్రొత్త నిబంధన

1.	శుభవర్తమానము	లూకా 1:5-25	171
2.	మరియకు వర్తమానం	లూకా 1:26-56	174
3.	యేసు పుట్టుక	లూకా 2:1-7	176
4.	పశువులశాల వద్ద గొర్రెల కాపరులు	లూకా 2:8-20	178
5.	సుమెయోను, అన్న	లూకా 2:22-38	180
6.	తూర్పు దేశం నుండి జ్ఞానులు	మత్తయి 2:1-12	182
7.	బెత్లెహేములోని చిన్న పిల్లలను హేరోదు చంపుట	మత్తయి 2:13-23	184
8.	యేసు ప్రభువు పన్నెండు యేండ్ల బాలుడుగా ఉన్నపుడు	లూకా 2:41-52	186
9.	బాప్తిస్మం ఇచ్చే యోహాను	మత్తయి 3, మార్కు 1:1-8	188
10.	యేసుని మొదటి శిష్యులు	యోహాను 1:35-51	190
11.	కానా అనే ఊరిలో వివాహం	యోహాను 2:1-12	192
12.	కుంటివాడు, అతని నలుగురు మిత్రులు	మార్కు 2:1-12 లూకా 5:17-26	194
13.	కుష్టురోగి స్వస్థపడుట	మార్కు 1:40-45	196
14.	సముద్రములో తుఫాను	మార్కు 4:35-41	198
15.	యేసు ప్రభువు సాతాను కన్న బలవంతుడు	మార్కు 5:1-9	200
16.	యాయీరు యొక్క చిన్న కుమార్తె	మార్కు 5:21-43	202
17.	రొట్టెలు, చేపల అద్భుతం	మార్కు 6:31-44	204
18.	గ్రుడ్డి బర్తిమయి	మార్కు 10:46-52	206
19.	చిన్న పిల్లలను నాయొద్దకు రానీయుడి	మార్కు 10:13-16	208
20.	మంచి కాపరి మరియు తప్పిపోయిన గొర్రె	యోహాను 10:1-5 లూకా 15:4-7	210
21.	నా పొరుగు వాడు యెవడు?	లూకా 10:25-37	212
22.	తప్పిపోయిన కుమారుడు	లూకా 15:11-24	214

23.	మనము ఎలా ప్రార్థించాలి?	లూకా 18:9-14	216
24.	బుద్ధిలేని ధనవంతుడు	లూకా 12:13-21	218
25.	మంచి నేలను పడిన విత్తనం	మత్తయి 13:1-9, 13:18-23	220
26.	రాకుమారుని వివాహం	మత్తయి 22:1-14	222
27.	హోసన్నా!	లూకా 19:28-44	224
28.	ద్రోహియైన యూదా	లూకా 22:3-6	226
29.	ఈస్టరు	లూకా 22:7-13 యోహాను 13:1-20	228
30.	చివరి భోజనము	లూకా 22:14-20, 31-34	230
31.	గెత్సేమనే తోటలో	మత్తయి 26:36-46	232
32.	యేసు బంధింపబడుట	యోహాను 18:1-11	234
33.	శత్రువులతో యేసు, పేతురు	మత్తయి 26:57-75	236
34.	పిలాతు యెదుట	మత్తయి 27:11-31	238
35.	కల్వరి కొండమీద	లూకా 23:26-43	240
36.	యేసు ప్రభువు మరణించినపుడు	మత్తయి 27:45-50, 57-60	242
37.	యేసు నిజముగా లేచెను	మత్తయి 28:1-10	244
38.	మగ్దలేనే మరియ	యోహాను 20:1-18	246
39.	ఎమ్మాయి గ్రామానికి వెళ్లే మార్గములో	లూకా 24:13-33	248
40.	యేసు తన శిష్యులను దర్శించుట	యోహాను 20:19-29	250
41.	గొప్ప సరస్సు నొద్ద	యోహాను 21:1-17	252
42.	ప్రభువైన యేసు పరలోకానికి వెళ్లుట	అపొస్తలుల కార్యములు 1:4-12	254
43.	పరిశుద్ధాత్ముడు వచ్చుట!	అపొస్తలుల కార్యములు 2:1-41	256
44.	చెరసాలలో పేతురు	అపొస్తలుల కార్యములు 12:3-17	258
45.	సౌలు మార్పు చెందుట	అపొస్తలుల కార్యములు 9:1-20	260
46.	జైలు అధికారి మారుమనసు పొందుట	అపొస్తలుల కార్యములు 16:16-34	262

ముందుమాట

ఈ పుస్తకంలోని కథలు చిన్న పిల్లల కోసం ఉద్దేశించ బడినవి. సరిగా ఏ వయసు పిల్లలకని చెప్పడం కాస్త కష్టమని పించినా వీటిని నాలుగు సంవత్సరాలు, అంతకు పైబడిన వయసు పిల్లలు చక్కగా అర్థం చేసుకోగలరు.

నేను కఠినపదాలను వాడకుండ జాగ్రత్తపడ్డాను. క్లుప్త వాక్యాలను ఉపయోగించి కథలు చకచకా సాగిపోయేలా ప్రయత్నించాను. చిత్రకారుడు జాప్ క్రామర్ కూడ చిన్నపిల్లలు సులువుగా అర్థం చేసికొనే రీతిలో బొమ్మలు గీసాడు.

సామాన్యమయిన ఈ కథలు చిన్నపిల్లల హృదయాలను ధన్యకరమయిన దేవుని సేవకొరకు సంపాదించేలా ఆయన చేయా లన్నదే లోతైన నా ఆకాంక్ష ఒక జనాంగం ఆయనను సేవిస్తుంది. ''అది దేవుని కొరకైన తరమని ఎంచబడుతుంది'' గౌడ, జూలి 2000

హెచ్. వాన్ డామ్

పాత నిబంధన

ఉచిత పంపిణి మాత్రమే
FOR FREE DISTRIBUTION ONLY

1. దేవుడు సమస్తాన్ని సృష్టించాడు

మనుష్యులు చాల తెలివైన వాళ్లు. వాళ్లు పెద్ద పెద్ద ఇళ్లు కడతారు. ఎత్తైన మేడలు, విశాలమైన ఆలయాలు కట్టగలరు. కార్మాగారాల్లో అందమైన కార్లు, చిన్నపిల్లల కోసం చక్కని ఆట వస్తువులు కూడా చేస్తారు.

మరి మనుష్యులు సువాసన వెదజల్లే నిజమైన పువ్వులు కూడ చేయగలరా? అబ్బే, అవి చేయలేరు.

నిజంగా ఎగిరే పక్షుల్ని చేయగలరా?

లేదు, అవి కూడ చేయలేరు.

నీలాకాశాన్ని ఎవరు చేసారు? సూర్యుడ్ని, చుక్కల్ని ఎవరు చేసారు? దేవుడు చేసాడు.

అలా చేయగలవాడు ఆయన ఒక్కడే. అన్ని వస్తువులూ దేవుడు చేసినవే. అన్నీ ఎదిగేలా చేసేది కూడ ఆయనే. పువ్వులనూ, చెట్లనూ, ఆయనే పెంచుతాడు. కలప కోసం మనుష్యులు చెట్లను నరుకుతారు. ఆ చెక్కతో బల్లలూ కుర్చీలూ తయారు చేస్తారు. ఇంకా ఎన్నో చేస్తారు. సమస్తం దేవుని నుండి వస్తున్నాయని నీకు తెలుసా? అవును, దేవుడే అన్నిటినీ చేసాడు. ఆయన మనుష్యుల్ని కూడ చేసాడు. నిన్ను కూడ నీవు చాలా చిన్నగ ఉన్నప్పుడు - చేసాడు.

దేవుడివన్నీ ఎలా చేసాడో తెలుసా? తెలియదా? సరే, అయితే ఈ కథ విను.

చాలాకాలం క్రిందట దేవుడు ఆకాశాన్నీ భూమినీ చేసాడు. దేవుడు పరలోకంలో ఉంటాడు. దేవదూత లంతా అక్కడే ఉంటారు. వాళ్ళు దేవుని సేవకులు.

మొదట్లో భూమి అస్సలు అందంగాలేదు. అది చాలా చల్లగ, నల్లగ ఉండింది. అప్పుడు దేవుడు "వెలుగు కలగాలి" అన్నాడు. హఠాత్తుగా వెలుగు వచ్చింది. అది ఎంత అందంగా ఉందో!

ఎందుకంటే దేవుడు చెప్పేదంతా జరుగుతుంది. దేవుడు నిజంగా గొప్పశక్తికలవాడు! ఆయన రాత్రి చీకటి తప్పక వచ్చేలా చేస్తాడు. మరునాడు ఉదయం, మళ్ళీ అందమైన వెలుగు వస్తుంది. రెండో రోజు. దేవుడు నీలాకాశం ఉండాలి. అందులో తెల్లని బూడిద రంగు మేఘాలుండాలి అన్నాడు. వెంటనే అవి అక్కడ ఉన్నాయి.

ఆకాశంలో తేలుతున్న మబ్బులు చూడండి! కొన్నిసార్లు ఈ మబ్బుల్లో నుండి వర్షం పడుతుంది. కాబట్టి పువ్వులు, చెట్లు, జంతువులు ఈ నీటిని తాగుతాయి. ఇది ఎంత బాగుంటుంది! కొన్నిసార్లు సూర్యుడు మబ్బుల చాటున దాగుంటాడు. ఇది ఎంత అందంగా ఉంటుందో తెలుసా!

మూడో రోజు వచ్చింది. ప్రతీదీ పొడిగ ఉండాలని దేవుడు చెప్పాడు లేదా సమస్తం ఆరిపోయి తడి లేకుండా ఉండాలని దేవుడు చెప్పాడు. కాబట్టి చాల నీళ్ళు సముద్రంలోకి వెళ్ళి పెద్ద పెద్ద కెరటాలు లేచాయి. ఆరిన భూమిని చూడండి! అక్కడ పువ్వులున్నాయి. పచ్చగడ్డి, పొదలు, చెట్లు కూడ ఉన్నాయి. అబ్బ, అప్పుడే భూమి ఎంత అందంగా కనిపిస్తోంది! ఎరుపు, పసుపు, నీలం రంగుల పువ్వులకు దాహం వేస్తే మబ్బుల నుండి వర్షం పడుతుంది. వాటికి చలివేసినపుడు సూర్యుడు ప్రకాశిస్తాడు. ఇదంతా చూస్తుంటే అవి దేవుడు మమ్ముల నెంత చక్కగా చేసాడో చూడండి అని చెబుతున్నట్టు అనిపిస్తుంది. ఎత్తైన చెట్లు తమ బలమైన కొమ్మలు ఊగుతున్నపుడు కూడ ఇలాగే అనిపిస్తుంది.

పువ్వుల నుండి, చెట్ల నుండి విత్తనాలు వస్తాయి. అవి చాల చిన్నవి, నీవు వాటిని చూడలేనంతచిన్నవి. అలాగే మామిడి టెంకలు, కొబ్బరి బోండాల్లాగ పెద్ద విత్తనాలూ ఉన్నాయి. ఆ తరువాత ఈ విత్తనాల నుండి కొత్త పువ్వులూ చెట్లూ మొక్కలూ పెరుగు తాయి. ఇలా ఇవి ఇంకా ఇంకా అభివృద్ధి అవుతాయి. ఇదంతా దేవుని యిష్ట ప్రకారం జరుగు తుంది.

చీకటి పడేసరికి పువ్వులు నిద్రపోతాయా అనిపిస్తుంది. చెట్ల కొమ్మలు సహితం కదలవు. రాత్రి కాగానే దేవుడు వాటిని కాపాడుతాడు. మరో కొత్త రోజు ప్రారంభం కాగానే భూమి మరింత అందంగా కనిపిస్తుంది.

నాలుగోదినాన దేవుడు సూర్యుడు, చంద్రుడు నక్షత్రాలు కలగాలి అని అన్నాడు, అంతే అవి అక్కడ ఉన్నాయి. అబ్బ, ఆ సూర్యుడు అచ్చమయిన బంగారంతో చేసినట్టు మెరిసిపోతున్నాడు! సూర్యరశ్మితో ప్రతీది మరింత అందంగ కనిపిస్తుంది. అంతేకాదు అది వెచ్చగ, హాయిగ ఉంటుంది.

సూర్యుడు మెల్లగ కిందికి వెళుతూండగ రాత్రి వస్తుంది. ఎరుపు పుసుపు కలిసిన రంగులో అది ఎంత


రమ్యంగ ఉంటుందో! అయినా లోకం పూర్తిగ చీకట్లో మునిగిపోదు. ఎందుకో తెలుసా? ఆపైన ఆకాశంలో ఏం వెలుగుతున్నాయో చూడు. అది చందమామ, ఆ చుక్కలన్నీ చూడు. వందా? వెయ్యా? అబ్బే, దానికంటే చాల ఎక్కువ, వాటిని దేవుడే లెక్కపెట్టగలడు. అవి ఎత్తయిన ఆకాశంలో మిణుకు మంటున్నాయి.

ఇప్పటికే దేవుడు ఎంతో చేసాడు. తాను చేసిన ప్రతి ఒక్కటీ మంచిగ ఉండాలని ప్రతి సారీ చూసాడు. అవి తప్పక మంచిగానే ఉన్నాయి. అలా అని దేవుడు తనకు తానే చెప్పుకున్నాడు. ఆయన చెప్పేదంతా నిజం. అది ఎల్లవేళలా నిజమే అవుతుంది.



2. దేవుడు ఇంకా ఏమి చేసాడు?

అయిదో రోజు వచ్చింది. మళ్లీ సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. ఆ నీటి కొలనులు చూడండి. వాటి నిండుగ చేపలున్నాయి. పెద్దవీ, చిన్నవీ. సముద్రం లోనయితే సొరచేపల్లాంటి ఇంకా పెద్ద చేపలున్నాయి. నీళ్లు ఎలా కదుల్తున్నాయో చూడండి. పైన ఆకాశం చూడండి. అక్కడంతా పక్షులు ఎగురుతున్నాయి. అందులో చిన్నవీ పెద్దవీ ఉన్నాయి. అవెంత తీయగ పాడుతున్నాయో విన్నారా? కాకి అరుపుకి కోయిల పాటకి భేదం ఉంది. దేవుడు నేర్పినట్టు అవి పాడుతూ ఎగురుతూ ఉంటాయి. దేవుడు వాటికి గూడు కట్టు కోవడం కూడ నేర్పించాడు. ఆ గూటిలో అవి గుడ్లు పెడతాయి. వీటి నుండి చిన్న పక్షి పిల్లలు వస్తాయి. తల్లి పక్షి తండ్రి పక్షి కలిసి తమ పిల్లల్ని జాగ్రత్తగ చూచుకుంటాయి.



ఆరవ రోజు దేవుడు వేటిని చేసాడు? మిగిలిన జంతువులన్నిటినీ చేసాడు. అదుగో, అక్కడ ఆవులు గడ్డి మేస్తున్నాయి. కొన్నిసార్లు అవి నెమ్మదిగ అరుస్తున్నాయి. అంటే గడ్డి రుచిగ ఉందన్నమాట. చిన్న రెక్కల పురుగులు, తేనెటీగలు రుమ్మని చుట్టూ ఎగురుతున్నాయి. అన్ని జంతువులకూ తగినంత ఆహారం ఉండేలా దేవుడు సిద్ధం చేస్తాడు. అదెంత అద్భుతం! అలా దేవుడొక్కడే చేయగలడు.


బలమైన సింహాలూ శక్తిగల ఏనుగులూ అడవిలో తిరుగుతుంటాయి. పువ్వుల మధ్య సీతాకోకచిలకలు ఎగురుతున్నాయి. చెట్ల మీద ఉడతలు కొమ్మనుండి కొమ్మకు గెంతుతున్నాయి. గొర్రె పిల్లలు పచ్చిక బయళ్లలో నాట్యమాడుతున్నాయి.

ఎంత అద్భుతమయిన దృశ్యం! దేవునికి ఎంత శక్తి, ఎంత మంచితనం ఉన్నది! ఎందుకంటే ఆయన సమస్తాన్నీ చేసాడు. ఈ జంతువులను చూస్తుంటే అవి దేవుని గూర్చి మనకు చెబుతున్నట్టు అనిపిస్తుంది. చెట్లు, పువ్వులూ అన్నీ ప్రభువును స్తుతిస్తున్నవి.

ఆరవ రోజున దేవుడు ఇంకా ఎన్నో చేసాడు, వినండి.

"నేనొక మనిషిని చేస్తాను" అన్నాడాయన. ఈసారి జంతువులను చేసినట్టు కాక వేరే విధంగా అతన్ని చేసాడు. ఆయన నేలమట్టిని తీసి ఒక శరీరాన్ని చేసాడు. అది ఇంకా ప్రాణం పోసుకోలేదు. కాబట్టి దేవుడేం చేసాడు? ఆ శరీరంలోకి ప్రాణవాయువును ఊదాడు. అప్పుడది ప్రాణం పోసుకుంది. అది ఒక పురుషుడు అయ్యింది. అతడు ఆత్మ ఉన్నవ్యక్తి అయ్యాడు. అంటే అతనికి దేవుడు తెలుసు. మరియు తనను సృష్టించాడని తెలుసు. ఆ దేవుడే అన్నిటిని చేసాడు. తన సృష్టికర్తకు అతడు చాలా లోబడ్డాడు. అతడు దేవుడ్ని ప్రేమించాడు. దేవుడు ఆ మొదటి మనిషిని ఆదాము అని పిలిచాడు.

దేవుడు ఆదాముతో "ఆదామూ, నీవు వీటన్నిటినీ పరిపాలిస్తావు. పక్షులూ, చేపలూ, ఇంకా మిగిలిన జంతువులన్నిటి మీద నీకు అధికారం ఉంది. ఆదామూ, నీ కోసమే నేను వీటన్నిటినీ చేసాను" అన్నాడు. ఆదాము ఎంతో ఆనందం పొందాడు. అతడు "దేవుడు అన్నిటినీ మంచిగా చేసాడు. ఆయన ఇంత మంచివాడు కావడం



వల్లనే నన్నిక్కడ ఉండనిచ్చాడు. నన్ను అన్నిటి మీద రాజును చేసాడు. అయితే దేవుడే నాకు రాజు. అదే అన్నిటికన్న శ్రేష్ఠం'' అనుకున్నాడు. ఆరు రోజులు గడిచాయి.

ఆ మరునాడు, అంటే ఏడవ రోజు దేవుడు విశ్రాంతి తీసుకున్నాడు. ఆయన అలసిపోలేదు. అయితే దేవుడు తన పనిని ముగించాడు. అన్నీ చాల మంచిగ ఉన్నాయి. అన్నీ ఆయన కోరినట్టే ఉన్నాయి.

ప్రజలంతా, తండ్రులు తల్లులూ అందరూ ఆరు రోజులు పనిచేస్తారు. కాని ఆదివారం పని చేయరు. పిల్లలు బడికి వెళ్లరు. ఆదివారం అందరికి విశ్రాంతి రోజు. ఆ దినం అందరూ పిల్లలతో సహా ఆరాధనకు వెళ్లవచ్చు. మనం దేవుని సేవించాలని ఆయన కోరిక. ఆలయంలో మనం భక్తి శ్రద్ధలతో వినాలి ఎందుకంటే అక్కడ దేవుని గూర్చి చెబుతారు. అక్కడ దేవునికి ప్రార్థన కూడ చేస్తాము. ఆయన మనలను కాపాడాలని ప్రార్థిస్తాం. అయితే మనం ముఖ్యంగా ఏం అడగాలో తెలుసా?

''ప్రభువా, నీవ మాకు కూడ రాజుగా ఉంటావా?'' అని.

అలా అడిగినప్పుడు మాత్రమే మనం నిజంగ ఆనందించగలము.

3. ఏదేను వనంలో

ఆదాము అందమయిన పెద్ద తోటలో నివసిస్తున్నాడు. దీనిని ఏదేను వనం లేదా పరదైసు అంటారు. ప్రపంచమంతటిలో అది అతి అందమయిన స్థలం.

జంతువులే ఆదాము స్నేహితులు. అవి హాని చేయవు. ఆదాము జంతువులతోసహా అన్నిటి మీద రాజు. అదిగో, చూడండి. అన్ని జంతువులూ ఆదాము దగ్గరకు వస్తున్నాయి. దేవుడే అవి ఆదాము దగ్గరకు వచ్చేలా చేసాడు. ఎందుకంటే అతడు వాటన్నిటికీ పేర్లుపెట్టాలి. వాటిని సరిగా ఏ పేరుతో పిలవాలో అతనికి తెలుసు.

జంతువులు ఒక్కొక్కటిగ రాలేదు. అవి జంటగ వచ్చాయి. ఆ బలమైన రెండు జంతువుల్ని అతడు సింహాలు అనిపిలిచాడు.ఇదిగో ఈరెండు చిన్నవాటినీ ఎలుకలు అన్నాడు. రెండు గుర్రాలు, రెండు సీతాకోకచిలుకలు-----ఇలా ప్రతి ఒక్కదానికీ పేర్లు పెట్టాడు. అవన్నీ జతలుగా ఎందుకు వస్తున్నాయి? ఎందుకంటే మొగ జంతువు ఒక ఆడ జంతువుకు చెందినది.

ఈ జంతువులు ఒక దానికొకటి కీడు చేసుకొనవు. ఒక చిన్న గొర్రెపిల్ల ఒక తోడేలు దగ్గర నిలుచుంది. చిన్న ఎలుక పిల్లిని చూచిపారిపోదు.

జంతువులన్నీ వెళ్లిపోయాక ఆదాము ఒంటరిగ మిగిలిపోయాడు. దేవుడది చూచాడు. ప్రతి మగ జంతువుకూ ఒక ఆడ జంతువు తోడుగ ఉంది. అయితే ఆదాము మాత్రం ఒంటరిగ ఉన్నాడు. అప్పుడు దేవుడు ''నేను ఆదాముకు మరింత సంతోషం కలిగిస్తాను. నేనతనికి ఒక స్త్రీని ఇస్తాను. ఆమె ఎప్పుడూ అతనితో ఉంటుంది. ఆమె అతనికి సహాయం చేస్తుంది'' అనుకున్నాడు.

దేవుడు ఆదామునకు గాఢనిద్ర పట్టేలా చేసాడు. అతడు మంచి నిద్రలో ఉండగా ఆయన అతని ప్రక్కటెముక ఒకటి తీసాడు. దానితో ఒక రూపాన్ని చేసాడు. అది అచ్చం ఆదాములాగే ఉంది కాని కాస్త తేడా ఉంది. అది ఒక స్త్రీ.

ఆదాము నిద్ర లేచినపుడు దేవుడామెను అతనికి ఇచ్చాడు. ఆదాముకు ఎంతో ఆనందం కలిగింది! ఈమెనా ఎముక నుండి తయారయ్యింది కాబట్టి ఈమెను ''మగువ'' అని పిలుస్తాను అన్నాడు. అందుకనే ఈమె నా సొంతం, నేను ఆమె సొంతం. ఈమె నా భార్య'' అన్నాడు ఆ తరువాత ఆమెకు 'హవ్వ' అనే పేరు వచ్చింది.

ఆదామూ, హవ్వా ఒకరి నొకరు చాల ప్రేమించుకున్నారు. ఇద్దరూ కలిసి అందమయిన ఈ తోటలో, అంటే ఏదేను వనంలో జీవించారు. వారిద్దరూ దేవునితో మాట్లాడే వాళ్లు. ఇద్దరూ ఆయనను చాల ప్రేమించారు. దేవుడు కూడ ఆదామునీ హవ్వనూ ఎంతో ప్రేమించాడు.

దేవుడు తరుచు వాళ్లని చూడ్డానికి వచ్చేవాడు. చెట్లగుండా వీచే గాలి, శబ్దం అది వినేవాళ్లు. వాళ్లెంతో సంతోషంగా ఉండే వాళ్లు! దేవుని మాటలు ఎంతో విధేయతతో ఆలకించే వాళ్లు! అన్ని సంగతులూ ఆయనతో చెప్పేవాళ్లు. దేవుడు వాళ్ల స్నేహితుడు!




ఆదాము హవ్వలు ఎన్నడూ భయపడలేదు. వారు ఏ బాధా అనుభవించలేదు. కష్టపడి పని చేసి కూడ అలసట పొందలేదు. వాళ్లెప్పుడు విచారంగా ఉండలేదు. వారు బట్టలేవీ వేసుకోకపోయినా చలి అనుభవించలేదు. దిగంబరులుగా ఉన్నా అది వింతగా అనిపించలేదు. దేవుడు వారిని ఎంతో అందంగా, పరిపూర్ణులుగ చేసాడు.

పరదైసులో చాల చెట్లు పెరుగుతున్నవి. వాటికి రుచి కరమయిన పండ్లు కాసేవి.మామిడి, ఆపిలు, సీతాఫలం ఇలాంటి పండ్లు ఉండేవి. ఆదామూ హవ్వా తమకు కావలసినన్ని పండ్లు తినవచ్చు. అయితే ఒక్క చెట్టుకు కాసిన పండ్లు మాత్రం తినకూడదు. అని దేవుడు చెప్పాడు. అదేం పరవాలేదు. అక్కడ ఇంకా ఎన్నో చెట్లు ఉన్నాయి.

ఆ ప్రత్యేకమైన చెట్టు పండ్లు తినవద్దని దేవుడు ఎందుకు చెప్పాడు?ఎందుకంటే వాళ్లు తన మాట వింటారా లేదా అని పరీక్షించడానికి. దేవుడు వాళ్లతో "మీరు నామాట వింటే పరదైసులో నిత్యం జీవించవచ్చు. అలాకాక ఆ చెట్టు పండు తింటే మీరిక్కడ ఉండడానికి వీలులేదు. మీరు చచ్చిపోతారు. వాళ్లు విధేయులుగ ఉన్నంతకాలం, వాళ్లు దేవుడ్ని ఎడతెగక ప్రేమించినంత కాలం ఏదేను వనంలో ఉండవచ్చు. అప్పుడు వాళ్లు సంతోషంగా నిత్యం జీవిస్తారు. మరి ఆదాము హవ్వలు ఈ పరీక్షలో నెగ్గుతారా?

వారికి అత్యంత ఆనందాన్నిచ్చేది ఏదో మీకు తెలుసా? వాళ్లు దేవుని పిల్లలుగా ఉండడమే! దేవుడే వారి తండ్రి.

మనం నిజంగా సంతోషంగా ఉండగలమా? మనం కూడ దేవుని పిల్లలమయితే ఆనందంగా ఉంటాము. ఈరోజే దాని కోసం ప్రార్థించు "దేవా, దయచేసి నన్ను నీ బిడ్డగ చేసుకో!".



4. సాతాను మాట వినడం

అదిగో, అక్కడ హవ్వ వుంది. ఆమె ఒంటరిగ నడుస్తున్నది. ఏదేను తోటలో, తన చుట్టూ ఉన్న అందాన్నంతా చూస్తుంది. ఆమె పక్షుల పాటలు వింటున్నది. చెట్ల నుండి వేలాడుతున్న తీయని పండ్లు తింటున్నది. అంతలో హఠాత్తుగా ఆమెకో స్వరం వినిపించింది. ఎవరు మాట్లాడుతున్నారు? అది ఆదాము కాదు. దేవుని స్వరం కూడా కాదు. అది ఓ పాము! సర్పం ఎలా మాట్లాడగలదు? అదెలాగో నీకు తెలుసా? పాము శరీరంలో ఎవరో దాక్కొని ఉన్నారు. అదే సాతాను. అతడు హవ్వతో మాట్లాడుతున్నాడు.

అసలు సాతాను ఎవడు? వాడు దేవుడికి గొప్ప శత్రువు. వాడికి దేవుడంటే యిష్టం లేదు. ఆయనను అసహ్యించుకుంటాడు. ఈ కారణంగా వాడు దేవుడు చేసిన అందమయిన లోకాన్నంతా నాశనం చేయాలని కోరుకుంటున్నాడు. వాడు "ఆదాము హవ్వలు దేవుని మాట వినకుండా చేస్తాను. అప్పుడిక వాళ్లు సంతోషంగ ఉండలేరు. ఆపైన వాళ్లు దేవున్ని ఇక ప్రేమించరు, స్తుతించరు. అప్పుడు వాళ్లు నిత్యం జీవించరు. అప్పుడు వాళ్లు చచ్చిపోతారు" అని మనసులో అనుకున్నాడు.



సాతాను హవ్వతో ఏం చెబుతున్నాడో వినండి. "ఈ చెట్టు పండ్లు మీరు నిజంగా తినకూడదా? దేవుడు నిజంగా అలా చెప్పాడా?

"దానికి హవ్వ సాతానుతో - ఈ ఒక్కచెట్టు పండు మాత్రమే తినకూడదు. మిగిలిన చెట్టు ఫలాలు తినవచ్చు. మేము ఈ చెట్టు ఫలాలు తింటే తప్పు చేసిన వారమవుతాము. పాపంలో పడతాం కాబట్టి మేము చావవలసి వస్తుంది", అని చెప్పింది.

నీచుడయిన సాతాను హవ్వతో ఏం చెబుతున్నాడో వినండి! "దేవుడు అబద్ధం చెబుతున్నాడు. మీరీ చెట్టు పండు తింటే చావరు. మీరింకా ఆనందంగా ఉంటారు. మీరు దేవుడిలా ఉంటారు. అచ్చం ఆయనలా తెలివిగ, బలంగ తయారవుతారు" అన్నాడు.

అదెంత నీచమయిన మాట! అబద్ధం చెప్పింది దేవుడు కాదు, సాతానే! హవ్వా, ఆ పాము మాటలు వినకు, త్వరగా అక్కడ నుండి వెళ్లిపో!

అయితే హవ్వ ఏం చేసింది? చెట్టు వైపు చూచింది. ఆ నీచుడు చెప్పిన మాట నమ్మింది. హఠాత్తుగా ఆ చెట్టు పండ్లలో ఒకటి తెంచి తినడం మొదలు పెట్టింది! ఎంత చెడ్డది!

వెంటనే హవ్వకు భయం వేసింది. ఇప్పుడామె ఎంత మాత్రం సంతోషంగా లేదు, విచారంగ ఉంది. ఆమె హృదయంలోకి పాపం ప్రవేశించింది. ఆమె అప్పుడేమి చేసింది? ఆదాము దగ్గరికి వెళ్లింది. సాతాను తనతో అబద్ధమాడి నట్టే హవ్వ ఆదాముకు అబద్ధం చెప్పింది. "ఆమె ఆదాము, రా. ఈ పండు తిను. ఇప్పటి కన్న మనం మరింత సంతోషంగా ఉంటాము. మనం అచ్చం దేవుడిలా అవుతాము" అన్నది.



ఆదాము కూడ తిన్నాడు. ఇప్పుడు వాళ్లిద్దరు దేవునికి అవిధేయులయ్యారు. ఇద్దరూ సంతోషంగ లేరు భయంతో వాళ్ల గుండెలు కొట్టుకున్నాయి. వారి హృదయాల్లో దుష్టత్వం నిండుకుంది. వారినిండా పాపమే.

పాము మెల్లగ తప్పించుకపోయింది. సాతాను క్రూరంగ నవ్వుతున్నాడు. అతని కుతంత్రం ఫలించింది. మరి ఆదాము హవ్వలేం చేసారు? వారు ఒకరినొకరు చూచుకున్నారు. తాము వస్త్రములు లేకుండ దిగంబరులుగ ఉన్నారని గ్రహించి సిగ్గుపడ్డారు. ఇది పాపం వల్ల కలిగే ఫలితం.

వాళ్లు చెట్లనుండి పెద్ద పెద్ద ఆకులు తెంచి మొలచుట్టూ కట్టుకున్నారు.

వినండి! అదేమిటి? అయ్యో, వాళ్లెంత భయపడిపోతున్నారు! దేవుడు వస్తున్నాడు! వారది చెట్ల గుండా వీస్తున్నగాలి వల్ల తెలిసుకున్నారు. ముందులా వారికిప్పుడు ఆనందం కలుగలేదు. ఇప్పుడు భయంతో గజగజలాడుతున్నారు. వాళ్లు పారిపోయి దాగి యున్నారు.

అటుచూడండి, పొదల వెనుక ఇద్దరూ దగ్గరగ చేరి ఎలా దాగున్నారో! హృదయంలో పాపం దాచుకున్న ఇద్దరు వ్యక్తులు.

తరువాత ఆదాము హవ్వలకు పిల్లలు కలిగారు.

వాళ్లక్కూడ పాపంతో నిండిన హృదయాలే ఉన్నాయి.

ఇంకా ఇంకా పిల్లలు పుడుతారు. వాళ్లంతా ఆదాము, హవ్వల్లాంటి వాళ్లే. మనుష్యులందరికీ పాపపు హృదయాలే, మనక్కూడ. అందువలననే కొన్ని సార్లు మనం కూడ లోబడం. అచ్చం ఆదాముచేసినట్టే. అందుకనే కొన్ని సార్లు మనం అబద్ధం చెబుతాము. అచ్చం హవ్వలా. ఇదెంత విచారం!

నీ పాపపు హృదయం గురించి దేవునితో చెప్పు. ప్రతిరోజూ ఒక కొత్త హృదయం ఇవ్వమని అడుగు లోబడే హృదయమే కొత్త హృదయం.

5. దేవుడు ఆదాము హవ్వల కోసం వెదకుట

ఆదామూ హవ్వా పాదల్లో దాక్కోడం గుర్తుందా? అదుగో, అక్కడున్నారు. ఇంకా దాక్కునే ఉన్నారు. దేవుడు వాళ్లని కనుక్కోగలడా? వాళ్లెక్కడున్నారో ఆయనకి తెలుసా? ఆ, తెలుసు. దేవుడు అన్నీ చూస్తాడు. మనం చేసేదంతా, ఆలోచించేదంతా మనం ఆయన నుండి దాచలేము అది మనం గుర్తుంచుకోవాలి.



కాస్త వినండి, దేవుడు ఆదామును పిలుస్తున్నాడు. ఆయన, ''ఆదామూ, నీవెక్కడున్నావు?'' అన్నాడు. ఆదాము తాను దాగున్నచోట నుండి బయటికి వచ్చాడు. హవ్వకూడ వచ్చింది. దేవుని ముందు వాళ్లు వణుకుతూ నిలబడ్డారు.

ఆదాము అన్నాడు కదా ''నాకు భయం వేసింది. అందుకనే దాగున్నాను.''

అప్పుడు దేవుడు ''నీవా చెట్టు పండుతిన్నావా?'' అని అడిగాడు. ఆదాము ''అవును కాని హవ్వే దాన్ని నాకిచ్చింది'' అన్నాడు. చూసారా, ఆదాము, హవ్వపై నేరం వేసాడు. అది అన్యాయం కదూ?

దేవుడు హవ్వవైపు చూసాడు. ఆమె మరొకరిని నిందిస్తున్నది. ''సర్పం నన్నలా చేయమన్నది'' అని చెప్పింది.

అవును, మనుష్యులు తరచుగ ఒకరినొకరు నిందించుకుంటారు. అయితే మనం యధార్థంగా ఉండాలని దేవుడు కోరుకుంటున్నారు. నీవేదైనా తప్పుచేస్తే అది చేసింది నేనే అని ఒప్పుకోవాలి.

ఇప్పుడు దేవుడు సర్పంతో మాట్లాడాడు. అప్పటి నుండి అది శాపం పొందిన జంతువై భూమి మీద ప్రాకవలసి వచ్చింది.

అయితే సాతాను ఆపాము లోపట ఉన్నాడు. తన పాపపు ఆలోచన పని చేసిందని సంతోసించాడు. ఇప్పటినుండి ఎప్పటికీ ఆదాము హవ్వలు తన మిత్రులవుతారు, ఎప్పటికీ సంతోషంగా ఉండలేరు. తనవలెనే, "నేను గెలిచాను" అనుకున్నాడు.

అయితే దేవుడేమంటున్నాడో వినండి. "నేను ఒకరిని ఈ భూలోకానికి పంపుతాను. సాతానుకన్న అతడు బలవంతుడు. ఆయన ఆదాము హవ్వలకు మళ్లీ సంతోషం తెస్తాడు. ఆయన ద్వారా వాళ్లు, మళ్లీ దేవుని పిల్లలవుతారు. ఆపై ఇక సాతాను మాట వాళ్లు వినరు.

అతడెవరో నీకు తెలుసా? ప్రభువైనయేసుక్రీస్తు. ఆయన దేవుని కుమారుడు. దేవుడు ఆయన తండ్రి కాబట్టి ఆయన కూడ పైన పరలోకంలోనే ఉంటాడు.

అయితే ఆదాముకీ హవ్వకీ శిక్ష పడాలి కదా? అవును పడాలి. అయితే యేసు ప్రభువు ఈ భూలోకానికి వచ్చినపుడు ఆ శిక్షను ఆయన భరిస్తాడు. అప్పుడు ఆదామూ హవ్వా పరలోకానికి వెళ్లవచ్చు. దేవునితో ఉండవచ్చు. అక్కడ ఏదేను తోట కన్న అందంగా ఉంటుంది. పరలోకంలో దుష్టుడయిన సాతాను ఉండడు. అప్పుడు వాళ్లిక అవిధేయులుగ ఉండరు. అబ్బ, అదెంత గొప్ప అద్భుతం! సాతాను దీని అంతటి గురించీ ఆలోచించలేదు.

ఆదాము హవ్వా ఇక మీదట ఏదేను తోటలో ఉండడానికి వీల్లేదు. అయినప్పటికీ దేవుడు వాళ్ల గురించి శ్రద్ధ తీసుకుంటాడు. మిగిలిన ఆహారంలా ధాన్యం కూడ పండుతుంది. అయితే దానితో పాటు కలుపు మొక్కలు కూడ పెరుగుతాయి. కాబట్టి ఇప్పటి నుండి ఆదాము చాల కష్టపడి పని చేయాలి.

దేవుడు వారికి వేరు బట్టలు యిచ్చాడు. ఆయన జంతువుల చర్మాలతో వాటిని తయారు చేసాడు. అవి వాళ్లు వేసుకున్నారు.

అప్పుడు ఆదామూ హవ్వా అందమైన ఆ ఏదేను తోట విడిచి వెళ్లిపోయారు. వాళ్లు మళ్లీ తిరిగి రాకుండ ఒక దూత కత్తిపట్టుకొని నిలిచింది. వాళ్లా తోటవదిలి ఒంటరిగా నున్న ప్రపంచంలోకి వెళ్తున్నారు.

సమస్తం ఎంత విచారంగా మారిపోయింది!

ఇప్పుడు ఆహారం సంపాదించుకోడానికి మనుష్యులు కష్టపడి పనిచేయాలి. వాళ్లు అలిసి పోతారు. చలికి వణుకుతారు. బాధపడుతారు. జంతువులు కూడ మారిపోయాయి. ఇప్పుడవి ఒక దానికొకటి కీడు చేసుకుంటున్నవి. సింహం చిన్న గొర్రెపిల్లను తినాలని చూస్తుంది. కొన్ని సార్లు జంతువులు మనుష్యులకు కూడ హాని చేయచూస్తాయి. పాపం వల్లనే ఇదంతా సంభవించింది. ఎంత విచారం! అవును కదూ?

పాపం వల్ల చాలమంది జబ్బు పడుతున్నారు. పాపం వల్ల అందరూ చచ్చిపోవలసి వచ్చింది.

అయినప్పటికీ ఆదాము హవ్వల్లా మనం కూడ నిజంగా సంతోషాన్ని కనుగొనవచ్చు. దేవుని కుమారుడు ప్రభువైన యేసుక్రీస్తు వలన అది జరుగుతుంది. ఎందుకంటే ఆయన సాతాను కంటె బలమైనవాడు.



6. కయీను మరియు హేబెలు

ఆదామూ హవ్వా చాల సంతోషంగా ఉన్నారు. ఎందుకో తెలుసా? దేవుడు వాళ్లకొక శిశువునిచ్చాడు. అతడో చిన్న బాలుడు. వాళ్లు అతన్ని కయీను అని పిలిచారు.

కొన్నిదినాలయ్యాక వాళ్లకి మరో చిన్నబాబు పుట్టాడు. అతని పేరు హేబెలు. ఇప్పుడు ఆదాముకి, హవ్వకి ఇద్దరు పిల్లలు. వారిని చక్కగా పెంచుతున్నారు. చూడండి, కొంత కాలం గడిచాక వారప్పుడే పాకుతున్నారు. తరువాత నడక నేర్చుకుంటారు. వాళ్లు చిన్న చిన్న మాటలు కూడ నేర్చుకుంటారు. తల్లిదండ్రులు వాళ్లకు నేర్పిస్తున్నారు. ఆదామూ హవ్వా వాళ్లకి దేవుడు గురించి కూడ చెప్పేవాళ్లు. ఏదేను తోట గురించి కూడ. పాపం గురించీ చెప్పారు. మనం చెడ్డ పనులు చేయడం దేవుడికిష్టం లే దని ఎందుకంటే అదిపాపం అని చెప్పేవాళ్లు. వాళ్లు ప్రభువైన యేసును గూర్చి మాట్లాడేవాళ్లు. ఆయన పాపాలన్నీ క్షమించగలడు. చివరికి చిన్న పిల్లల పాపాలు కూడ. భక్తితో ఎలా ప్రార్థన చేయాలో కయీను హేబెలు నేర్చుకున్నారు.

బాలురిద్దరూ పెరిగి పెద్దవారయ్యాక పని చేయడం మొదలుపెట్టారు. ఆదాము వలెనే, కయీను పొలంపని చేసేవాడు. అతడు వ్యవసాయకుడు. చూడండి, అతడెంత పని చేస్తున్నాడో! అతడు గోధుములు విత్తబోతున్నాడు. సూర్యుడు అవి పండేలా చేస్తాడు. అప్పుడు కయీను కోస్తాడు. గోధుములు పిండి చేసి పిండితో అతడు రొట్టెలు చేస్తాడు. అవి ఎంతో రుచిగ ఉంటాయి!

హేబెలు గొర్రెలను కాసేవాడు. అతడు వాటిని చాల జాగ్రత్తగా చూచుకునేవాడు. వాటికి తినడానికి తగినంత గడ్డి ఉండేలా జాగ్రత్తపడేవాడు. చాలచిన్న గొర్రెపిల్లలు పుడుతుండేవి. వాటిని అడవి మృగాలు ఎత్తుకు పోకుండా శ్రద్ధగా చూసేవాడు. కొన్ని సార్లు తినడానికి మాంసం అవసరమయితే ఒక గొర్రెను చంపేవాడు. ఆ మాంసం ఎంతోరుచిగ ఉంటుంది.

అటుచూడండి, హేబెలు కొన్ని రాళ్లను పేర్చుకున్నాడు. దాన్ని బలిపీఠం అంటారు. దాని మీద మూడు కొమ్ములు ఉంచాడు. ఆ కొమ్ములపైన ఒక చచ్చిపోయిన గొర్రెను పెట్టాడు. ఇది అతని అర్పణ. కయీను కూడ ఒక బలి పీఠం కట్టాడు. దాని మీద కొన్ని ధాన్యం పనలను ఉంచాడు. ఇది అతని అర్పణ. వాళ్లా కొమ్మలను అంటిస్తున్నారు. గాలి మంటను ఎక్కువ చేసింది. గొర్రె కాలుతోంది. అది దేవునికి అర్పణ. ధాన్యం పనలు కూడ మండుతున్నాయి. అది కూడ ప్రభువుకు అర్పణే.

హేబెలు బలి పీఠం ముందు వినయంతో మోకరించాడు. అతడు దేవునికి వందనాలు చెల్లించాడు. అతడు ఇలా ప్రార్థన చేస్తాడు. ''దేవా, నీవు నాపట్ల ఎంతో మంచిగ ఉన్నావు. నీవు నాకెన్నో గొర్రెలు ఇచ్చావు. గడ్డిని మొలిపిస్తున్నావు. వీటన్నిటినీ పొందడానికి నేను తగిన వాడను కాను. ఎందుకంటే నాకు పాపపు హృదయం ఉంది. ప్రభువా, నేనొక గొర్రెను చంపాను. నిజం చెప్పాలంటే దానికి బదులు నేను చచ్చిపోవాలి. ఎందుకంటే నేను చాల తప్పుడు పనులు చేసాను. దయచేసి నన్ను క్షమించవా?''

హేబెలు చాల వినయంతో అలా ప్రార్థన చేసాడు. పరలోకంలో ఉన్న దేవుడు దానిని విన్నాడు. హేబెలు తన నోటితోనే కాక హృదయంలో కూడ ప్రార్థన చేసాడు. అతడు దేవుడ్ని ప్రేమించాడు.

కయీను కూడ తన బలిపీఠం ముందు ప్రార్థన చేసాడు. అయితే తన హృదయంతో చేయలేదు. అతడు తన పాపాల కోసం విచారపడలేదు. అతనికి దేవుని మీద ప్రేమ లేదు.

మనం ఎలా ప్రార్థన చేస్తున్నదీ దేవుడు చూస్తాడు. మనం నోటితో మాత్రమే ప్రేమిస్తున్నామా? లేక మన హృదయంతో కూడ ప్రేమిస్తున్నామా? మనం హేబెలులా ఉన్నామా? లేక కయీను వలె ఉన్నామా?

చూడండి, హేబెలును గమనించండి. అతడెంత సంతోషంగ ఉన్నాడో. దేవుడు అతడు యిచ్చిన అర్పణ అంగీకరించాడు. ఆయన అతని ప్రార్థన విన్నాడు. దేవుడతని పాపాలు క్షమించాడు. అది సాధ్యమే, ఎందుకంటే గొర్రె పిల్లలాగ యేసు ప్రభువు వచ్చి చనిపోతాడు కాబట్టి ఇది హేబెలు పాపాల కోసం ఆయన చేస్తాడు. దేవుని పిల్లలందరి పాపాల కోసం అది చేస్తాడు. ఇందుకనే హేబెలు అంత ఆనందంగా ఉన్నాడు. కయీను ఎంత మాత్రం సంతోషంగా కనిపించడం లేదు.

హేబెలు సంతోషంగా ఉండటం కయీను చూసాడు కయీనుకు కోపం వచ్చింది. అతడు హేబెలు మీద దేవునిమీద కోపపడ్డాడు. దేవుడది చూచాడు. ఆయన



''నీవు ఎందుకంత కోపంగా ఉన్నావు? కయినూ, నీవు తప్పపని చేయకుండా జాగ్రత్తపడు. నీవు నన్ను ప్రేమిస్తే హేబెలును సంతోష పెట్టినట్టు నిన్ను కూడ సంతోషపెడతాను'' అన్నాడు.

అయితే కయీను దేవునిమాట వినలేదు. అతడు సాతాను మాట ఆలకించాడు.

అతడిప్పుడేం చేస్తున్నాడు? అమ్మో అది ఎంత భయంకరం! అతడు నెమ్మదిగ హేబెలు మీద పడబోతున్నాడు. హఠాత్తుగ హేబెలును చాల గట్టిగ కొట్టాడు. హేబెలు నేల మీదికి ఒరిగిపోయాడు. రక్తం కారుతోంది. అయినా కయీను అతన్ని కొడుతూనే ఉన్నాడు. అప్పుడు హేబెలు కదలకుండా పడి ఉన్నాడు. అతడు చచ్చిపోయాడు.


కయీనుకు భయం వేసింది. అతడు పారిపోయాడు. అయినా దేవుడతన్ని కనుగొనగలడు. దేవుడు ''నీ తమ్ముడు హేబెలు ఎక్కడ'' అని అడిగాడు. కయీను నిర్లక్ష్యంగా ''అతడెక్కడున్నాడో నాకు తెలియదు. అతన్ని గురించి నేనెందుకు శ్రద్ధ చూపాలి?'' అని జవాబిచ్చాడు. కయీను అబద్ధం చెబుతున్నాడు. తనను క్షమించమని దేవుని అడగలేదు.

కయీను గొప్ప శిక్షపొందాడు. ప్రశాంతంగ జీవించడానికి అతనికి ఎప్పటికి స్థలం దొరకదు. అతనికెక్కడా విశ్రాంతి లభించదు. అతడు నిత్యం భూమ్మీద తిరుగుతూనే ఉండాలి.

అతడెంత భయపడిపోయాడు! అతడు ఎప్పుడూ హేబెలునే తలంచ వలసి వచ్చింది. అతడిప్పుడో హంతకుడు. అన్నిటికంటె ఘోరమయిన సంగతి తెలుసా? హంతకుడు మంచిగ మారలేడని అతడు అనుకున్నాడు. అయితే అది నిజం కాదు. అతనికి కొత్త మనసు వస్తుంది. కయీను దీన్ని నమ్మలేదు. అది అతనికి అక్కరలేదు. అతడు దాని కోసం ప్రార్థన చేసి అడగలేదు.

ఆదామూ, హవ్వా తమ కుమారుల కోసం ఇంటిలో కనిపెడుతున్నారు. చాల సమయం గతించింది. వాళ్లు ఇద్దరి కోసం వెతికారు. ఎంత భయంకరం! నేలమీద పడి ఉన్న హేబెలును చూచారు. అతడు మౌనంగ, చల్లగ ఉన్నాడు. అతడు చచ్చిపోయాడు. వాళ్లెంతో విచారించారు.

వాళ్లతన్ని కప్పెట్టారు. హేబెలు శరీరం ఇప్పుడు భూమిలో ఉంది. అయితే అతని ఆత్మ పరలోకంలో ఉంది. అతడు నిత్యం దేవునితో అక్కడ ఉంటాడు. కోపంతో ఉన్న కయీను అక్కడ లేడు. పరలోకంలో హేబెలు మరెన్నడూ విచారంగా ఉండడు. అక్కడతడు ఎప్పుడూ ఆనందంగా ఉంటాడు. హేబెలు చాల అదృష్టవంతుడు. అవునా?



7. సురక్షితంగా ఓడలో

ఆదాము హవ్వలకు మరింత మంది పిల్లలు కలిగారు. అలాగే కయీనుకు కూడ. ఇప్పటికి భూమ్మీద చాల మంది జీవిస్తున్నారు. అయితే ఈ ప్రజలు కయీను కన్న దుర్మార్గులు. దేవుని మాట వినడం వాళ్ల కిష్టం లేదు. వాళ్లు దేవుడ్ని వెక్కిరిస్తున్నారు. చెడ్డపనులు చేయడం వాళ్లకిష్టం.

ఇది దేవునికి ఎంతో విచారం కలిగించింది. ఆయనకు కోపం కూడ వచ్చింది. దేవుడు ప్రజలను హెచ్చరించాడు. అయితే వాళ్లు ఆయన్ని చూచి నవ్వు తున్నారు. అప్పుడు దేవుడు ''నేను ఈ ప్రజల పాపాలను బట్టి వీళ్ళందర్నీ శిక్షిస్తాను'' అన్నాడు. ప్రజలందర్నీనా? కాదు. దేవుడ్ని ప్రేమించేవాడు ఇంకా ఒక వ్యక్తి ఉన్నాడు. అతని పేరు నోవహు. నోవహు దేవుని స్నేహితుడు.

దేవుడు అతనితో ఇలా అన్నాడు, ''నోవహూ నేను ప్రజలందర్నీ శిక్షిస్తాను. నేను చాల వర్షం కురిపిస్తాను. ఆ నీళ్లల్లో ప్రజలంతా మునిగిపోతారు.అయితే నీవు చచ్చిపోవు. నోవహూ, నీవు ఒక పెద్ద ఓడ తయారు చేయ్యాలి! అందులోకి వచ్చిన వాళ్లంతా బ్రతుకుతారు.''

కాబట్టి నోవహూ పని చేయడం ప్రారంభించాడు. అతడు చెట్లునరికాడు. అతని ముగ్గురు కొడుకులూ సహాయం చేసారు. చెట్లనుండి చెక్కపలకలు చేసారు. ఆ పలకలతో వాళ్లు ఓడను తయారు చేసారు. ఆ నలుగురూ ఎంత పని చేస్తున్నారు! ప్రతిదినం వాళ్లు సుత్తెలతో కొట్టే శబ్దం మీరు వినవచ్చు. టక్‌టక్‌టక్ అంటూ వినిపిస్తుంది కదూ?

అది చాల పెద్ద ఓడ అవుతున్నది. ఒక వరస యిళ్లన్నీ కలిపినంత పొడవైనది. ఆ యిళ్ల కంటె చాల ఎత్తైన ఓడ అది.

చాల మంది దానిని చూడ్డానికి వస్తున్నారు. అది వాళ్లకి చాల వింతగా ఉంది. ఓడ నీళ్లమీద తేలియాడాలి కదూ? అయితే దగ్గర్లో ఎక్కడా నీళ్లే లేవు! ''నోవహూ, నీవు చేసేదేమిటి?''అని అడిగారు. ప్రజలంతా భయపడిపోయారని అనుకుంటున్నారా? అబ్బే, ఏం భయపడలేదు. దానిని వాళ్లెంత మాత్రం నమ్మలేదు. నోవహును ఎగతాళి చేసారు. ''అలా జరగనే జరగదు'' అన్నారు. వాళ్ల మాటలు నోవహుకు ఎంతో విచారం కలిగించాయి. అతడు వాళ్లతో ''ఇది తప్పక జరుగుతుంది. ఈ మాట దేవుడే చెప్పాడు. మీరు మీ పాపాలు క్షమించబడాలని ప్రార్ధన చేయాలి. మీ మార్గాలు మార్చుకొని దేవుని వేపు తిరగాలి. అంటే ఆయన చెప్పినట్టు చేయాలి. అప్పుడు మీరు కూడ ఓడలోకి రావచ్చు. మీరు చచ్చిపోనవసరం లేదు'' అన్నాడు.

ప్రజలు ఇప్పుడు మరింతగ నవ్వారు. అయ్యో, ఇదెంత భయంకరం! వాళ్లు దీన్ని నమ్మడం లేదు.

చాల కాలానికి ఓడ తయారయ్యింది. తలుపు తెరిచి ఉంది. ఎవరు వస్తున్నారో చూడండి! ఓడలోనికి రావడానికి ఎవరు యిష్టపడుతున్నారు? అదిగో, రెండు పులులు, ఒకటి ఆడపులి రెండవది మగ పులి. రెండు కుక్కలు, రెండు చిన్న ఎలుకలు, ఇంకా చాల చాల. అది జంతువులతో కూడిన పెద్ద వరుస అవి ఒక దానికొకటి కీడు చేయడం లేదు. అవన్నీ చక్కగా ఓడలోకీ వెళ్తున్నవి. నోవహు వాటన్నిటికి ఓడలో ఉండడానికి చోటు చూపిస్తున్నాడు. అందులో పక్షులు కూడ ఉన్నాయి. అవి కూడ లోనికి రావచ్చు. దేవుడీ జంతువులన్నిటినీ ఓడలోకి పంపుతున్నాడు. ఇదెంత అద్భుతం! ఓ దుష్టులైన మనుష్యులారా, ఇలా చూడండి. జంతువులు రాడానికి యిష్టపడ్డాయి కాని మీ కిష్టంలేదు.

ఈ నలుగురు మనుష్యులు కూడ ఓడలోకి వెళ్తున్నారు. వాళ్ల భార్యలు సహితం. మొత్తం ఎనిమిది మంది.

దేవుడు తలుపు మూసివేసాడు. ఇప్పుడిక దానిని ఎవ్వరూ తెరువలేరు ఓడలోకి యిక ఎవ్వరూ కాలు పెట్టలేరు. చాల ఆలస్యం అయిపోయింది. బైట ఎంత చీకటిగ ఉంది! నల్లని మేఘాలు కమ్మడంతో అలా ఉంది. ఇక వర్షం మొదలయ్యింది. వర్షం వర్షం ఒకటే వర్షం. అదలా ఎడతెగక కురుస్తూనే ఉంది.

కొంత నీరు భూమిలో నుండి కూడ ఉబికి వస్తోంది. ఎక్కడ చూచినా నీళ్లు. నీళ్లు పైపైకి లేస్తున్నవి. అది ఇళ్లను, చెట్లను ముంచివేస్తున్నది. మనుష్యులు కొండలపైకి పారిపోతున్నారు. అయితే నీళ్లు అక్కడికి కూడవెళ్తున్నవి. అమ్మో, మనుష్యులు ఇప్పుడెంతో భయపడుతున్నారు! సహాయం కోసం కేకలు పెడుతున్నారు. అయితే



యిప్పుడిక ఎవ్వరూ వాళ్ళకి సాయం చేయలేరు. ఓడ తలుపు మూయబడింది. ప్రజలంతా నీటిలో మునిగి పోతారు. దేవుని శిక్ష వాళ్లమీదికి వచ్చింది.

చివరికి వర్షం కురవడం ఆగింది. ఓడ ఆ మహాసముద్రంపై తేలుతున్నది. అందరూ ఓడలో భద్రంగా ఉన్నారు. అందులో ఉన్న మనుష్యులనూ, జంతువులనూ దేవుడు పరామర్శిస్తున్నాడు. మిగిలిన వారికి ఎంత విచారం! అవును కదూ? అయితే అది వారి తప్పే. నోవహు వాళ్లని చాల సార్లు హెచ్చరించాడు. అతని మాట వాళ్లు విన వలసింది.

చాల సార్లు మనం కూడ చెడ్డపనులు చేస్తాం. దేవుని మాట వినం. సరిగా ఆ మనుష్యుల్లాగనే. మనం కూడ హెచ్చరిక పొందాము. ఇంట్లో మనతల్లిదండ్రులూ, బడిలో టీచర్లూ, ఆలయంలో దైవసేవకుడూ మనకు హెచ్చరిక చేసారు.

నిజం చెప్పాలంటే మనలను హెచ్చరించినది దేవుడే. ఆయన మనతో "దయచేసి చెడ్డపనులు చేయవద్దు, పాపం భయంకరమైనది. నోవహులా నా మాట వినండి. అప్పుడు ఓడలోని నోవహులా మీరూ సంతోషంగా ఉంటారని చెబుతున్నాడు.



8. ఓడ నుండి వెలుపలకి



ప్రశాంతంగా ఉన్న నీళ్ల మీద ఓడ చాల కాలం తేలుతూ ఉండినది. అయితే యింకా ఎంత కాలం? నోవహుకు తెలియదు. కాని అతడిలా అనుకున్నాడు. "దేవుడు మమ్మును మరువడు. ఆయన మమ్ములను, జంతువులను ఈ ఓడలో పరామర్శిస్తున్నాడు."

వర్షం ఆగిపోయింది. నెమ్మదిగా నీళ్లు భూమిలోకి ఇంకిపోతున్నాయి. అంతలో హఠాత్తుగా 'ఢాం' అనే శబ్దం! ఒక్క ఊపుతో ఓడ ఆగింది. అదో పర్వతం మీద నిలిచింది. ఇక ఓడ తేలి యాడ్డం లేదు. ఓడకు ఓ కిటికీ ఉంది. దాని గుండా బైటికి చూస్తే మిగిలిన కొండల శిఖరాలు కనిపిస్తున్నాయి. ఆ- మంచిదే! క్రమ క్రమంగా నీరు కనపడకుండా పోతోంది.

కొన్ని దినాలయ్యాక నీరంతా తగ్గిపోయిందా లేదా అని నోవహు తలస్తున్నాడు. దీని సంగతి తెలుసుకోవాలనుకున్నాడు. కాబట్టి నోవహు ఓ నల్ల కాకిని తీసాడు. దానిని బైటికి విడిచిపెట్టాడు. ఆ పక్షి బైటికీ లోపలికి సంతోషంగ ఎగిరింది. దానికి భూమ్మీద తినడానికి ఏదో ఆహారందొరికి ఉంటుంది. అది తిరిగి రాలేదు.

తరువాత నోవహు అందమైన తెల్లని పావురాన్ని బైటికి విడిచాడు. అది చిన్నచిన్న గింజల కోసం చూసింది. అయితే అది వెనక్కి వచ్చేసింది. అప్పటికింకా దానికి గింజలు దొరకలేదు.

ఒక వారం గడిచాక ఆ పావురం ఓడ కిటికీ గుండా మళ్లీ బైటికి ఎగిరింది. దినమంతా అది బైటనే ఉంది. చీకటి పడింది. అదిగో చూడు, అది తిరిగి వచ్చింది. దాని ముక్కున ఏమి ఉందో చూచావా? చెట్టు నుండి తుంపిన ఒక ఆకు.

ఒక వారం అయ్యాక పావురం మళ్లీ ఎగిరిపోయింది. అది తిరిగి రాలేదు. నేల పూర్తిగ ఆరిపోయి ఉంటుంది. ఇప్పుడు దేవుడు ఓడలోని వాళ్లందర్నీ బైటికి పంపించాడు. మనుష్యులందరూ, జంతువులన్నీ బైటికెళ్లాయి.

పరిగెడుతున్న ఆ జంతువులను చూడండి! ఆకాశంలో పక్షులు పాడుతున్నవి. ఆహా, అవెంత ఆనందంగా ఉన్నాయో!

భూమ్మీద మళ్లీ సమస్తం అందంగా తయారయ్యింది. పూలు తిరిగి వికసిస్తున్నాయి. చెట్లు తిరిగి చిగురులు తొడుగుతున్నాయి. ఇక వాటిపై పక్షులు గూళ్లుకట్టుకోవచ్చు.


మరి నోవహు ఏం చేస్తాడు? అతడు రాళ్లు ఏరుతున్నాడు. అతడు వాటిని కుప్పవేసాడు. అదో బలిపీఠం. దాని మీద అతడు కట్టెలు పేర్చాడు. తరువాత కొన్ని పక్షులునూ, గొర్రెలనూ చంపి బలిపీఠం మీద కాల్చాడు. అది దేవునికిచ్చిన అర్పణ.

ఆ బలిపీఠం ముందు నోవహు, మిగిలిన వాళ్లంతా వినయంతో మోకరించారు. వాళ్లు దేవునికి వందనాలు చేసారు. నోవహు ఇలా అన్నాడు. "దేవా, నీవు మా పట్ల ఎంత మంచిగా ఉన్నావు! మమ్మల్ని ఓడలో ఉంచావు. మాకు అర్హత లేదు ఎందుకంటే మేం కూడ నీకు వ్యతిరేకంగా పాపం చేసాము".

దేవుడతని మాటలు విన్నాడు. నోవహు నిజంగా కృతజ్ఞత కలిగి ఉన్నాడని ఆయన చూచాడు. అతని మనసులో నిజంగ కృతజ్ఞత ఉంది. దేవుడు ఏమన్నాడంటే "నేను ఇక ఎన్నటికీ భూమిని నీళ్లలో ముంచి వేయను. తిరిగి ఎప్పటికి జలప్రళయం రాదు. నేను సమస్తాన్నీ అంటే మనుష్యుల్నీ, జంతువుల్నీ, మొక్కలనూ కాపాడుతాను. అప్పుడు నోవహు తలయెత్తి ఆకాశం మీద రంగు రంగు ధనస్సును చూస్తాడు. ఎంత అందంగా ఉంది! అది వర్షచాపం.

దేవుడు "నోవహూ, దానిని చూడు. నేను చెప్పినదంతా సత్యం అనడానికిదో గుర్తు" అన్నాడు.

నీవెప్పుడన్నా రంగుల ధనుస్సును ఆకాశంలో చూచావా? అది అందంగా లేదూ? అది చూచినపుడు జలప్రళయాన్నీ, ఓడనూ గుర్తుకు తెచ్చుకో. పాపం చేసిన వాళ్ళందర్నీ దేవుడు శిక్షిస్తాడు. అయితే మనం కూడ మన పాపాలకు క్షమాపణ పొందవచ్చునని అది మనకు చెబుతుంది. నీకు బోధించమని దేవుడ్ని అడుగు. ఇది యింకా కృపాకాలమే.



9. ఒక ఎత్తైన గోపురము

గోపురం ఎంతపైకి పోతోంది! అవును, అదియింకా పైకి పోవాలి. కష్టపడి పని చేస్తున్న ఆ పని వాళ్లని చూడండి. వాళ్లు రాళ్లను కాలుస్తున్నారు. మిగిలిన వాళ్లు ఆ రాళ్లను గోపురం దగ్గరకు మోసుకపోతున్నారు. ఆ రాళ్ళను ఒకదానిపై ఒకటిగా పేర్చుతున్నారు. గోపురం మరింత ఎత్తుకు పోతున్నది. దాని శిఖారాగ్రం ఆకాశాన్ని అంటాలి. వాళ్లంతా చాల ఆనందంగా కనిపిస్తున్నారు. వాళ్ళు గర్వంతో ఇలా అంటున్నారు "మనం చాల తెలివైన వాళ్లం కదూ?", ఈ మనుష్యుల్ని యింత తెలివిగల వారినిగా ఎవరు చేసారు? దేవుడు చేసాడు. ఓహో, వాళ్లా సంగతి మరిచిపోయినట్టు కనిపిస్తోంది!

మనం ఆలోచించి తెలివిగ ఉండేలా మెదడునిచ్చినదెవరు? దేవుడు. మనం ఈ సంగతి మరచి పోకూడదు.

వీళ్లా గోపురాన్ని ఎందుకు నిర్మిస్తున్నారు? మరెన్నటికీ వాళ్లు అటూ యిటూ చెదిరిపోకుండా ఉండేందుకు. దూరం నుండి కూడ నీవీ గోపురాన్ని చూడగలవు. అది అంత ఎత్తుగాపైకి పోతోంది. నీవు తిరిగి ఎప్పుడూ దానిని చూడవచ్చు. మనుష్యులందరూ దానికి దగ్గరగా నివసిస్తున్నారు. వాళ్లు ఎప్పటికీ అక్కడే ఉండాలని అనుకొన్నారు.


అయితే దేవుడు "మీరు దగ్గరగా జీవించరు. మీరు దూరంగా కదిలిపోవాలి. నూతన ప్రదేశాలకు వెళ్లాలి. మీరెక్కడ ఉన్నా నేను మిమ్మును పోషిస్తాను".


ప్రజలాయన మాట వినలేదు. వాళ్లు "మేము తెలివిగల వాళ్లం. మా గురించి మేము శ్రద్ధ తీసుకోగలం. మేం పరిపాలన చేయాలి. మేం కలిసి ఉండాలనుకుంటున్నాం. అప్పుడు మేమూ, మాగోపురం చాల బలంగ ఉంటాం. ఇకమాకు దేవుడితో అవసరం కలుగదు" అన్నారు. అది భయంకరం కదా? అవును. మన పాపపు హృదయాలు చాలసార్లు దేవుడు అవసరం లేదుని అంటాయి. అది నిజం కాదు. దేవుడు లేకుండా మనం ఏమీ చేయలేము.

ఆ మనుష్యులింకా అలాగే కడుతున్నారు. వాళ్లు ఒకరికొకరు రాళ్లు అందించుకుంటున్నారు. వాళ్లు ఒకరితో ఒకరు మాట్లాడుకుంటున్నారు. అయితే హఠాత్తుగా వారి మాటలు ఒకరి కొకరికి అర్థకావడం లేదు. వాళ్లు విపరీతమయిన విధంగ మాట్లాడుతున్నారు. అది విచిత్రంగ వినిపిస్తోంది. వారిక ఒకరితో ఒకరు మాట్లాడలేకపోతున్నారు. కాబట్టి వారందరూ కలిసి ఒక గోపురాన్ని ఇకపై కట్టలేరు.

కొంతమంది దూరంగా వెళ్లిపోయారు. మరికొందరు వాళ్లని అనుసరించారు. కొద్దిసేపటికి గోపురం దగ్గర ఎవరూ పని చేయడంలేదు! ఇక వాళ్లంతా కలిసి ఉండడం లేదు. వాళ్లంతా ఈ విశాల ప్రపంచంలోకి ప్రయాణం చేస్తారు.

దీనిని చేసింది ఎవరు? నీకు జవాబు తెలుసు దేవుడే. మనుష్యులు తమకు తామే అధికారులమని తలంచవచ్చు. అయితే అది నిజం కాదు. మనక్కూడ ఇలాంటి పాపపు హృదయాలున్నాయి. మనం తరుచు మనయిష్టాను సారంగప్రవర్తించాలని అనుకుంటాం. అధికారం చలాయించాలని ఆశిస్తాం. అది ఎంత మాత్రం మంచిది కాదు. ప్రతిదినం దేవుడ్ని మనం యిలాప్రార్థించాలి. దేవా నేను ఏం చేయాలని నీవుకోరుతున్నావు?





10. అబ్రాహాము: దేవుని స్నేహితుడు

ఇటువైపుగ వస్తున్న మనుష్యులు, జంతువుల పొడవైన వరుస నీకు కనిపిస్తున్నదా? చాల ఆవులు, గొర్రెలు, చిన్న చిన్న గొర్రె పిల్లలు. పెద్ద ఒంటెలు కూడ. వాటి మీద మనుష్యులు కూర్చున్నారు. గుర్రాల మీద కూర్చునట్టే. వాళ్లంతా ప్రయాణం చేస్తున్నారు. ఆ గుంపంతటిలో ముఖ్యమయిన వాడెవడు? అబ్రాహాము. అతని భార్య శారా కూడ అతనితో ప్రయాణం చేస్తున్నది. వాళ్లకి పిల్లలు లేరు. ఇందువల్ల వారు విచారంగా ఉన్నారు.

అక్కడ చాలామంది పనివాళ్లు కూడా ఉన్నారు. వాళ్లంతా పశువులను చూచుకొనే కాపరులు. ముఖ్యంగా వాళ్లు చిన్న గొర్రెపిల్లల్ని, లేగదూడల్నీ కాస్తుంటారు. వాళ్లెందుకు ప్రయాణం చేస్తున్నారు? ఎందుకంటే దేవుడు వాళ్లను వెళ్లమన్నాడు. అబ్రాహాము ఇప్పటివరకూ నివసించినదేశంలో ప్రజలు విగ్రహాలకు పూజ చేసేవాళ్లు. అక్కడ బొమ్మలకు మొక్కేవాళ్లు. అప్పుడు దేవుడు అబ్రాహామును పిలిచాడు. ఆయన విగ్రహాలున్న దేశాన్ని విడిచిపెట్టమని అతనికి చెప్పాడు. అతని వేరే దేశానికి వెళ్లమన్నాడు. అబ్రహాము దేవుడు చెప్పినట్టే చేసాడు. అతడు విధేయత చూపాడు.

"అబ్రహాం, నీవెక్కడికి వెళ్తున్నావు?"

"నాకు తెలియదు?" అని అతడు జవాబిస్తాడు.

"అయినా పరవాలేదు, ఎందుకంటే అది దేవునికి తెలుసు."

అది దూర ప్రయాణం. చాల దినాలు వారాలు పడుతుంది. కొన్నిసార్లు వాళ్లకి దినమంతా కనిపించేది ఇసుక మాత్రమే. దానిని 'ఎడారి' అంటారు. తరచు అక్కడ చాల వేడిగ ఉంటుంది. మరి రాత్రివేళ



అతి చల్లగ ఉంటుంది. అంతేకాక అపాయకరమైన క్రూరమృగాల విషయం కూడ వాళ్లు జాగ్రత్తగ ఉండాలి. అయితే అబ్రహాం భయపడలేదు. అతడు దేవుడ్ని నమ్ముకున్నాడు. దేవుడు అతన్నీ, అతనితో ఉన్న వాళ్లందర్నీ, పశువులనూ జాగ్రత్తగా చూస్తాడు.

అబ్రహాం దేవునిబిడ్డ అని నీవు చెప్పగలవు కదూ?

చాల కాలం అయ్యాక వాళ్లంతా నీళ్లున్న ఒక స్థలాన్ని చేరుకున్నారు. అదొక నది. నీళ్లు మరీ లోతుగ లేని చోటు చూచుకోవాలి. వాళ్లు నీళ్లల్లోనడుస్తూ అవతలి ఒడ్డుకు వెళ్తున్నారు చూడండి. వాళ్లు చిన్న గొర్రెపిల్లల్ని ఎత్తుకొని తీసికెళ్తున్నారు. ఇప్పుడు వాళ్లంతా నది అవతలి ఒడ్డుచేరారు.



అబ్రాహాంతో దేవుడు ఏమంటున్నాడో విన్నారా? ''అబ్రహామూ, నీవు నివసించేది ఈ దేశంలోనే. నీ పశువులతోను, పనివారితోను యిక్కడ నివసించు''. అదో అందమయిన దేశం. అక్కడ పశువులకూ గొర్రెలకూ కావలసినంత గడ్డి ఉంది. అబ్రాహాం ధనవంతుడవుతాడు.

దేవుడు అబ్రాహాంతో మరోసంగతి కూడ చెప్పాడు. ''అబ్రాహామూ, నేను నీకో కొడుకును యిస్తాను. తరువాత చాలచాల మంది పిల్లలు పుడతారు. వాళ్లంతా గొప్ప జనాంగం అవుతారు. అబ్రాహామా, వాళ్లంతా ఈ అందమైన దేశంలో నివసిస్తారు. వాళ్లందర్నీ నేను జాగ్రత్తగ చూచుకుంటాను. వాళ్లని ఆశీర్వదిస్తాను''. అయితే అన్నిటికంటే శ్రేష్ఠమయిన సంగతి ఇప్పుడు వచ్చింది. దేవుడేమన్నాడంటే - ఒకానొకదినం దేవుని కుమారుడు ప్రభువునైన యేసు పుడతాడు. ఆయన ఈ గొప్ప జనాంగంలో ఈ అందమయిన దేశంలో జన్మిస్తాడు.

అబ్బో, అబ్రాహాంకు ఎంత ఆనందం! ఎందుకంటే యేసు ప్రభువు తన కోసం కూడ వస్తున్నాడని అతనికి తెలుసు. తనకు సంతోషం ఇవ్వడానికి, తనను రక్షించడానికి. అబ్రాహాం కూడ పరలోకానికి వెళ్తాడు. ఆ ప్రదేశం మరింత అందంగా ఉంటుంది. దేవుడు అక్కడే ఉంటాడు! అబ్రాహాం దేవున్ని ప్రేమిస్తున్నాడు. అతడు తరచు - యేసు ప్రభువు ఎప్పుడు వస్తాడు? అని ఆలోచిస్తూంటాడు. ఆయన కోసం అబ్రాహాంను పిలిచాడని గుర్తుంది కదూ? ఆయన మనలను కూడ పిలుస్తున్నాడు. అంటే మనం బైబిలు కథలు వింటున్నపుడు, అప్పుడాయన మనతో, ''నే చెప్పేమాటలు వింటున్నావా? నేను చెప్పినట్టు నీవు చేస్తే అబ్రాహామును దీవించినట్టే నిన్నూ దీవిస్తాను'' అంటాడు.

మనంతట మనం ఆయన మాటవినలేము. కాబట్టి మనం ప్రార్థన చేయాలి. ''ప్రభూ, అబ్రహాములా నేనూ నీ మాటవినే హృదయం నాకు దయచేయి.'' అప్పుడు అబ్రాహాంలా మనం కూడ ప్రభుయేసు కోసం ఆశతో ఎదురు చూస్తాము.

11. అబ్రాహాము, లోతు

అబ్రాహాం చేసిన దీర్ఘప్రయాణంలో అతనితోపాటు ఇంకెవరు వెళ్లారో తెలుసా? లోతు, ఇతడు అబ్రాహాము అన్నకొడుకు, అబ్రాహాం ఇతనికి చిన్నాన్న. లోతుకు కూడ చాల గొర్రెలూ, ఆవులూ ఉన్నాయి. వాటిని కాయడానికి అతనికి కూడ కాపరులు ఉన్నారు.

మరిన్ని గొర్రెపిల్లలూ, లేగదూడలూ పుడుతున్నాయి. అబ్రాహాం పశువుల మందలు ఎప్పుడూ ఎక్కువవుతూనే ఉన్నాయి. లోతు పశువులు సహితం వృద్ధి పొందుతున్నాయి.

అయితే ఇప్పుడు దాని వల్ల కొన్ని చిక్కులు వచ్చాయి. అబ్రాహాము లోతుల కున్న పశువులన్నిటికీ సరిపడినంత మేత దొరకడం లేదు. ఇప్పుడేం జరుగుతుందో చూడండి! అబ్రాహాము, లోతుల గొర్రెల కాపరులు ఒకరితో ఒకరు పోట్లాడుకొనుచున్నారు.

అబ్రాహాం పనివాడు - మా పశువులు గడ్డిమేయవలసిన చోటు ఇదే అన్నాడు.

"అలా కాదు, ఈ గడ్డి మా గొర్రెల కోసం" అన్నాడు లోతు పశువుల కాపరి.

వాళ్లు ఒకడిపై మరొకడు కోపపడుతున్నారు. ప్రతి దినం పోట్లాడుతున్నారు. ప్రతీదినం ఒకరినొకరు తరుముతున్నారు.

ఇది అబ్రాహాముకు విచారం కలిగించింది. అతడు సమాధానంగా ఉండాలని కోరుతున్నాడు. దానికి కారణం నీకు తెలుసు కదూ? పోట్లాడ్డం పాపం. ఈ పోట్లాట ఎలా ఆగుతుంది. వాళ్లు విడిపోవడం మంచిదని అబ్రాహాం నిశ్చయించాడు. కాబట్టి అబ్రాహాం లోతుతో - "లోతూ, నీ పశువుల మందతో నీవు ఎటువైపు వెళ్లాలను కుంటున్నావు? లోతు ఎడమ ప్రక్కకీ, తరువాత



కుడి ప్రక్కకి చూచాడు. అతడు చాల అందమయిన ప్రదేశాన్ని చూపించాడు. ''నేను అక్కడ నివసించాలని కోరుకుంటున్నాను'' అన్నాడు.

అబ్రహాం ''మంచిది, నీవటు వెళ్తేనేను మరో ప్రక్కకు వెళ్తాను'' అన్నాడు.

లోతు ఇలా చేయడం బాగులేదు. అతడు- చినాన్నా, దయచేసి నీవు ముందు ఏస్థలం కావాలో ఎంపిక చేసుకో అనవలసింది. లోతు తనగురించి మాత్రమే ఆలోచిస్తున్నాడు. అతడు అబ్రాహాం గురించి యేమాత్రం ఆలోచించలేదు. మరి మన మాట యేమిటి? చాల వరకు మనం కూడ సొంత లాభం చూసుకుంటాము. సాధారణంగా మనం ''నాకు అన్నీ మంచిగ జరిగితే చాలు'' అనుకుంటాము. ఇది సరికాదు. మనం ఇతరుల మేలును కోరాలని దేవుడు ఆశిస్తాడు. ఇప్పుడు అబ్రాహాము లోతు విడిపోయాడు. ఇక పై వాళ్ల పశుల కాపరులు దెబ్బలాడు కోలేరు.

లోతు ఎంపిక చేసిన ప్రాంతంలో గడ్డిచాల మొలుస్తుంది. అందుకు లోతు చాలా సంతోషించాడు. అతడు ''ఇప్పుడునా పశువుల మంద మరింత పెరుగుతుంది. నేను మరింత ధనవంతుడనవుతాను. అనుకొన్నాడు.

అయితే అతడు దేని గూర్చి ఆలోచించలేదో తెలుసా? అతడిప్పుడు నివసిస్తున్న చోట చాలామంది వింత మనుష్యులున్నారు. వాళ్లుపాపంలో బ్రదుకుతున్నారు. వాళ్లు సొదొమ పట్టణంలో ఉన్నారు. లోతుకూడ సొదొమలోనే ఉన్నాడు. ఇప్పుడతడు ఆ పాపం చేసే వాళ్ల మధ్య జీవిస్తున్నాడు.

అయితే లోతు సొదొమలో సంతోషంగా లేడు. అక్కడ ఉన్న పాపమంతటి వలన అతడు విచారిస్తున్నాడు. ఎందుకంటే లోతు దేవునికి భయపడేవాడు. నీవు దేవునికి భయపడినప్పుడు ఇతరులు పాపం చేయడం చూచి నీవు విచారిస్తావు.

అయితే అది లోతు చేసిన తప్పే. అతడు మరింత ధనవంతుడవ్వాలని ఆశపడ్డాడు. అతడు ఆలోచించే దంతా దీని గురించే.

అవును, దేవుని బిడ్డలు కూడ తప్పుచేస్తారు. అయితే దేవుడు వాళ్లెక్కడ పొరపాటు చేస్తారో చూపెడతాడు. అప్పుడు వాళ్లు తమ పాపాలు ఒప్పుకొంటారు. అబ్రాహాం లోతును గూర్చి వివరించాడు. అయితే దేవుడు- ''అబ్రాహామా, విచారపడకు. నేను నీకు ఏమి వాగ్దానం చేసానో మరచిపోయావా? నీవొక గొప్ప జనాంగం అవుతావు. ఆ జనాంగం ఈ దేశంలో నివసిస్తారు. ఈ దేశం అంతా నీ జనుల కోసమే. ఇలా నేను తప్పక జరిగిస్తాను'' అన్నాడు. అబ్రాహాం - అవును, అది నిజం. దేవుడు మాట ఇచ్చాడు కాని నాకు అర్థం కావడం లేదు. నాకు కనీసం ఒక్క కొడుకు కూడా లేడు. నేను ఇప్పటికే ముసలి వాడను. శారకూడ ముసలిదే. వృద్ధులకు పిల్లలు పుట్టరు కదా? అనుకున్నాడు.

అప్పుడు దేవుడు- వచ్చి చూడు, అని అబ్రాహాంను పిలిచాడు. అది రాత్రివేళ. ''అబ్రాహామా, పైన ఆకాశంలో ఉన్న తారలను చూస్తున్నావా? వాటిని లెక్కపెట్టగలవా?'' అన్నాడు దేవుడు. లేదు, అబ్రాహాం లెక్కపెట్టలేడు. అక్కడ చాల నక్షత్రాలు ఉన్నాయి!

''సరే విను, నీ సంతానం సహితం అంతపెద్దది అవుతుంది. ఆకాశంలో ఎన్ని చుక్కలు ఉన్నవో నీకు అంత గొప్ప సంతానం కలుగుతుంది. అదో గొప్ప అద్భుతం. అయినా అది తప్పక జరుగుతుంది. ఎందుకంటే అది దేవుని మాట. ఆయన ఒక్కడే అద్భుత కార్యాలు చేయగలడు.

మరి అబ్రాహాం మాట యేమిటి? అతడు దానిని నమ్మాడా? అవును. అతడు దేవుడు చెప్పిన మాట లన్నీ నమ్ముతాడు. ఇది అతనికి ఆనందం కలిగిస్తుంది. నిజమైన ఆనందాన్నిస్తుంది!

అబ్రాహాం ఒక బలిపీఠం కట్టాడు. అతడో గొర్రెను చంపాడు. దానిని ఆ బలిపీఠం మీద దహించాడు. అది దేవునికి చేసిన అర్పణ. అబ్రాహాం భక్తితో దేవునికి వందనాలు చెల్లించాడు. దేవుడే అతనికి ప్రభువు. అతనికెంతో ఆనందం కలిగిస్తుంది. అతన్ని ధనవంతునిగ, చాల ధనవంతునిగ చేస్తుంది.

నీవు కూడ నిజంగ ధనువంతుడివి కావాలని ఆశపడుతున్నావా?

ఎందుకంటే దేవుడు లేకపోతే నీవు పేదవాడివి, చాల పేద వాడివి. దేవునితో ధనవంతునిగ ఉండగోరు తున్నావా? నీవు దానికోసం ఆయనను అడగవచ్చు.

12. దేవుడు మరిచి పోతాడా?

చాల కాలం పట్టింది. ఎంతోకాలం గడిచిపోయింది. అది శారాకు చాల దుఃఖం కలిగిస్తున్నది. అవును అయితే దేవుడు మాట ఇచ్చాడు కదా? అబ్రహాం, శారాలకు కొడుకు పుడతాడని. మరయితే ఆ మాట ఇంకా జరగలేదు. దేవుడు తనను మరిచిపోయాడా యేమిటని శారా అనుకుంటున్నది.

ఆమె అబ్రాహాంతో "నేను ముసలిదానిని. ఇకనాకు పిల్లలు కలుగరు. అబ్రాహాం, నీవేమి చెయ్యాలో తెలుసా? నువ్వుహాగరును పెళ్ళి చేసుకోవాలి. అప్పుడొక శిశువు పుట్టవచ్చు. ఎందుకంటే హాగరు పడుచుపిల్ల" అన్నది. హాగరు ఎవరు? శారా యొక్క దాసి. ఆమె శారాకు సాయం చేస్తుంది. అబ్రాహాం శారామాట విన్నాడు. హాగరును పెళ్ళి చేసుకున్నాడు. అబ్రాహాం శారాలు చేసిన పని సరికాదు. వాళ్ళు ఓపికతో కనిపెట్టవలసింది.

కొంతకాలానికి ఒక కొడుకు పుట్టాడు. వానికి అబ్రహాం తండ్రి, హాగరు తల్లి. అతని పేరు ఇష్మాయేలు. అబ్రాహాముకు సంతోషంగానే ఉంది. అయినప్పటికీ దేవుడు ఏమని వాగ్దానం చేసాడు? శారాకు కూడ కుమారుడు పుడుతాడని కదూ, ఇష్మాయేలు వాగ్దాన పుత్రుడు కాదు.

ఒక రోజు అబ్రాహాం తన గుడారం వెలుపట కూర్చుని ఉన్నాడు. అతడొక చెట్టు నీడన విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆరోజు వేడిగ ఉంది.


అప్పుడు ముగ్గురు మనుష్యులు రావడం అతడు చూచాడు. వాళ్ళెవరు? అతనికి వాళ్లెవరో తెలియదు. వారు దగ్గరికి వస్తున్నారు. అబ్రాహాం లేచి వారి వైపుగ నడవడం ప్రారంభించాడు. అతడు వాళ్లతో "మీరు చెట్టు క్రింద కూర్చుంటే నేను కొంచం ఆహారం తీసుకువస్తాను" అన్నాడు. ఆ మనుష్యులు దానికి అంగీకరించారు.

అబ్రాహాం త్వరగా శారాదగ్గరికి వెళ్లాడు. అతడు ఆమెతో-నీవు వెంటనే కొన్ని రొట్టెలు తయారు చేస్తావా? అన్నాడు.

అప్పడతడు వెళ్లి ఒక చిన్నదూడను తెచ్చాడు. పనివాడు దానిని చంపి వచ్చిన వాళ్ల కోసం వంట చేస్తాడు. అప్పుడు ఆ మనుష్యులు చక్కగా భోజనం చేయవచ్చు. వాళ్లు తప్పక ఆకలితో ఉంటారు. అంతలో వారిలో ఒకడు మాటలాడుతూ - శారా ఎక్కడ? అని అడిగాడు.

"ఆమె గుడారంలో ఉంది" అన్నాడు అబ్రాహాము.

అప్పుడా వ్యక్తి "ఒక సంవత్సరంలోగా శారాకు కొడుకు పుడతాడు" అన్నాడు.



"ఓ, ఇప్పుడు అతడెవడో అబ్రాహాముకు తెలిసింది. అది దేవుడే! ఆ మిగిలిన ఇద్దరు కూడ సామాన్యమయిన మనుష్యులు కారు. వారిద్దరూ దేవదూతలు. ఇప్పుడు అబ్రాహాము భక్తితో వాళ్ల మాటలు వింటున్నాడు.

శారాకూడ విన్నది. ఆమె గుడారంలో నుండి వీళ్ల మాటలు వింటున్నది. ఈ వయస్సులో ఆమెకు పిల్లలు పుడతారా? ఒక కొడుకు. లేదు, అది జరగదు, తాను చాల వృద్ధురాలను అనుకుంటూ గట్టిగ నవ్వింది. అయితే దేవుడు సమస్తం చూస్తుంటాడు. ఆయన అన్నీ వింటాడు. "శారా ఎందుకు నవ్వింది? దేవుడు అద్భుతాలు చేస్తాడని ఆమె నమ్మదా?" అని అడిగాడు శారా భయపడిపోయింది. వెంటనే ఆమె "నేను నవ్వలేదు" అని అబద్ధమాడింది.

ఇప్పుడామె అబద్ధంకూడ చెబుతున్నది. అది ఎంత పొరపాటు! అయితే దేవుడు "నువ్వు నవ్వావు శారా" అని చెప్పాడు.

నీ వెన్నడయినా అబద్ధం చెప్పావా? అవును, మనం చెబుతాము. ఇది చాలా తప్పు, ఎందుకంటే అబద్ధమాడడం పాపం. అది దేవునికి విరోధంగా చేసే పాపం.

నీవు సత్యం చెప్పేలా సహాయం చేయమని దేవునికి ప్రార్థన చెయ్యి. నిన్ను, ఆయన పట్లనే కాక అందరి యెడలా యదార్థంగా ఉండేలా చేయమని ప్రార్థించు.



13. సొదొమ పట్టణంపై దేవుని శిక్ష

ఆ ముగ్గురు మనుష్యులు మీకు గుర్తున్నారా? వాళ్ళు అబ్రాహామును దర్శించారు. వారిలో ఒకడు దేవుడే! మిగిలిన ఇద్దరూ దేవదూతలు. దేవుడు తిరిగి పరలోకానికి వెళ్లిపోయాడు. అయితే ఆ ఇద్దరు దేవదూతలు వెళ్లలేదు. వాళ్లింకాముందుకు పోయారు. సొదొమ పట్టణానికి వెళ్లారు. అక్కడికి వెళ్లమని దేవుడు చెప్పాడు.

వాళ్లు సొదొమ చేరారు. ఆ పట్టణం చుట్టూ ఎత్తయిన గోడ ఉండి. దానికి ఒక ద్వారం ఉంది. పట్టణంలోకి వెళ్లే మార్గం అది.

లోతు ఆ ద్వారం దగ్గర కూర్చుని ఉన్నాడు. అతడు సొదొమలో నివసిస్తున్నాడు కదా. అది గుర్తుందా? ఆ ఇద్దరు మనుష్యులు రావడం లోతు చూచాడు. వాళ్లు దేవదూతలని లోతుకు యింకా తెలియదు అతడు వాళ్లతో - మీ కిష్టమయితే నాయింటికి రావచ్చు. మీకు నేను భోజనం పెడతాను. ఇప్పుడు దాదాపు రాత్రి కావస్తున్నది కాబట్టి నాయింటిలో మీరు నిద్రపోవచ్చును, అన్నాడు. లోతు దయగలవాడు. అతిథులను ఆదరించేవాడు.

అయితే కొంచం సేపయ్యాక ఏమయ్యింది? వినండి! ఆ కేకలేమిటి? ఏం జరుగుతున్నది?

సొదొమ పట్టణస్తులు తలుపుతడుతున్నారు. వాళ్లు చాల కోపంగా ఉన్నారు. వాళ్లు-తలుపుతెరవండి మాకాఇద్దరు మనుష్యులూ కావాలి'' అని అరుస్తున్నారు. లోతు కంగారు పడ్డాడు. అయ్యో, వీళ్లిద్దరికీ వాళ్లు కీడు చేస్తారు. అలా చేస్తారని లోతుకు ఖచ్చితంగా తెలుసు. అయినా అతడు భయపడలేదు. అతడు బయటికి వెళ్లాడు. ''మీరు ఈ మనుష్యులకు కీడు చేయడానికి వీలు లేదు. వాళ్లు మిమ్ములనేమీ చేయలేదు. వాళ్లు నాయింటిలో బస చేస్తున్నారు'' అని చెప్పాడు.

ఇప్పుడా మనుష్యులు ఇంకా కోపగించారు. వాళ్లు ''మేమే ఈ ఊరి పెద్దలము.

లోతూ, నీవు కాస్త ఆగి చూడు. నిన్నుకూడ వదిలిపెట్టం'' అని కేకలు వేసారు. వాళ్ళు లోతును పట్టుకోవాలని చూచారు. అయితే ఆ ఇద్దరు దేవదూతలు త్వరగా లోతును లోపలికి లాగారు, వాళ్ళు ఇంటి తలుపులు మూసివేసారు.

ఆ దుర్మార్గులు తలుపు పగలగొట్టడానికి ప్రయత్నించారు. అయితే ఇప్పుడు వాళ్ళకి తలుపు కనబడటం లేదు. వాళ్ళెంత చూచినా లాభంలేక పోయింది. తలుపు అదృశ్యమయిపోయింది. అది దేవుడు చేసిన అద్భుతం!


సొదొమ మనుష్యులు ఇంటికి వెళ్ళిపోతున్నారు. లోతుకది మంచిదే! లోతు మనసులో ఇలా అనుకున్నాడు-వీళ్లెవరో ఇప్పుడు నాకు తెలిసింది. వీళ్ళు దేవదూతలయి ఉంటారు. దేవుడే వీళ్ళను పంపాడు.

ఆ దూతలు లోతుతో యిలా అన్నారు - మేమెందుకు ఇక్కడికి వచ్చామో తెలుసా? ఈ పట్టణాన్ని శిక్షించడానికి వచ్చాము. సొదొమ పట్టణంలో ఉన్న మనుష్యులంతా చచ్చిపోవాలి. అందులో ఉన్నదంతా అగ్నిలో కాలిపోతుంది. అయితే నీవు చచ్చిపోనవసరంలేదు. లోతూ, నీ భార్య, నీ ఇద్దరు కుమార్తెలు కూడ చచ్చపోరు. మేము మిమ్మును రక్షించడానికే వచ్చాము. మాతో ఇప్పుడు మీరు రండి.

లోతుకు భయం వేసింది. కానీ ఈచోటు విడిచి పెట్టాలి. మరి తన ఇల్లు మాట యేమిటి? తన గొర్రెలు, ఆవులు ఎలా? లేదు, వాటన్నిటినీ వదిలి పెట్టాల్సిందే. అయ్యో, ఎలా? ఇక తన కేమీ మిగలదే! ఒక్క సారిగా అతుడు పేదవాడయిపోతాడు. అదే లోతు ఆలోచిస్తున్నాడు.

దేవదూతలు కనిపెడుతున్నారు. ''లోతూ, త్వరపడు, ఆలస్యం చేస్తే అగ్ని కురుస్తుంది!'' అన్నారు. కాని లోతు ఎంత మాత్రం తొందరపడడం లేదు. అప్పుడు దేవదూతలు అతని చేయిపట్టుకున్నారు. వాళ్లతో లాక్కొని పోయారు. అతని భార్యనూ, కుమార్తెలనూ కూడ, తొందరగా ద్వారం వెలుపలకి, పట్టణం వెలుపలకు తీసుకు పోయారు.

అప్పుడు దేవదూతలు పరిగెత్తడం మొదలుపెట్టారు. ''పరిగెత్తండి, ఆగకండి, వెనక్కి చూడకండి, చూస్తే మీరు



చచ్చిపోతారు" అన్నారు. అయ్యో, అది భయంకరం, ఇప్పుడేం జరుగుతుంది? వర్షం కురుస్తోంది. మేఘాలు నీటిని వర్షించడంలేదు. అగ్ని ఆకాశం నుండి కురుస్తోంది! సొదొమలో ఉన్న ఇళ్ళన్నీ కాలిపోతున్నాయి. వాటితో పాటు మనుష్యులూ పశువులూ కూడ.

భూమిలో పెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. అందులో సమస్తం పడిపోతున్నవి. ఇది దేవుడు పంపిన శిక్ష. అది భయంకరమైన శిక్ష. అయితే వాళ్ళు చేసిన పాపం కూడ భయంకరమైనదే. ఆ ప్రజలకు అది తగినదే.

లోతు తన శక్తికొలదీ పరిగెత్తుతున్నాడు. అతడు వెనక్కితిరిగి చూడ్డంలేదు. దేవదూతల ద్వారా దేవుడు వెనక్కి తిరిగి చూడవద్దని ఆజ్ఞఇచ్చాడు. అరె, చూడండి. ఏం జరుగుతుంది? లోతు భార్య వెనక్కి చూచింది! తన చక్కని ఇల్లు గురించి ఆమె ఆలోచిస్తోంది. అంతా కాలిపోవడం చూచి చాల విచారిస్తున్నది.

అయితే ఇప్పుడామె అవిధేయత చూపింది, కాబట్టి దేవుడామెను కూడ శిక్షించాడు. ఆమె చచ్చిపోయింది. వెంటనే ఆమెగట్టి ఉప్పస్తంభంగ మారిపోయింది. ఎంత భయంకరం మనం కూడ చక్కని ఇళ్లల్లో నివసిస్తున్నాము. ఇక్కడ మనం నిత్యం జీవించలేము. మనమంతా ఓ రోజు చచ్చిపోవాలి, ఎందుకంటే మనం దేవునికి విరోధంగా పాపం చేసాము.!

అయినప్పటికీ--- మనం రక్షణ పొందవచ్చు. లోతువలె. మనం మారుమనసు పొందాలి. మనం దేవుని పిల్లల మయితే మనం చచ్చిపోడానికి భయపడం. అలా కాక మనం అవిధేయులుగా ఉంటే లోతు భార్యలా నాశనమవుతాము.

14. ఇస్సాకు, ఇష్మాయేలు

కాస్త వినండి! శారా గుడారంలో ఆ శబ్దాలేమిటి? ఎవరా శబ్దం చేస్తున్నది? అదో శిశువు. అవును ఒక శిశువు జన్మించాడు. అబ్రాహాం, శారా చాల ఆనందంగా ఉన్నారు. దేవుడు వాగ్దానం చేసాడు అదిప్పుడు నెరవేరింది. ఆ బాలునికి ఇస్సాకు అని పేరుపెట్టారు.

అతడెంత ప్రియమయిన పిల్లవాడు! అతడు చేతులూపుతుంటే ఎంత ముద్దొస్తుంది! కాళ్లు తన్నుకుంటుంటే ఎంచక్కా ఉందో!

ఇస్సాకు ఎదుగుతున్నాడు. మొదట నేల మీద పాకాడాడు. కొంచం పెద్ద వాడయ్యాక నడవడం, చిన్న చిన్న మాటలు పలకడం ప్రారంభించాడు.



ఒకదినం విందు జరిగింది, ఎందుకంటే ఇస్సాకు తప్పటడుగులు వేస్తున్నాడు. హాగరు ఇష్మాయేలును కూడ ఆహ్వానించారు. హాగరు ఇష్మాయేలు తల్లి అని గుర్తుందా? ఇష్మాయేలు ఇప్పుడు బాగ ఎదిగిపోయాడు. ఆ విందులో అతడు తప్పక ఇస్సాకుతో ఆడుకుంటాడు. అబ్బే, అలా జరగలేదు. అతనికి ఇస్సాకుతో ఆడుకోవడం ఇష్టం లేదు. ఇస్సాకును విసిగిస్తున్నాడు. అది నీచమయిన పని కదూ?

ఇష్మాయేలు ఎందుకిలా చేసాడు? అతనికి అసూయ. అతడు మనసులో ఇలా అనుకున్నాడు- ఇస్సాకు అబ్రాహాం శారాలకు వాగ్దాన పుత్రుడు ఒకప్పుడు అబ్రాహాం చచ్చిపోతాడు.

అప్పుడు ఆస్తి అంతా ఇస్సాకే తీసుకుంటాడు. గొర్రెలు, ఆవులు అన్నీ అతనివే అవుతాయి. నాకేమీ ఉండదు.'' ఈ కారణంగా అతనికి కోపంవచ్చింది. అతడు ఇస్సాకుతో ఆడడు. అతన్ని ఎగతాళి చేస్తున్నాడు.

అతని తల్లి హాగరు ఇదంతా చూచింది. ఆమె ఇష్మాయేలును కోప పడిందా? లేదు. ఆమె ఏమీ అనలేదు. ఆమెకు కూడ అసూయయే.

శారాకూడ ఇది చూచింది. ఆమె ఇష్మాయేలుపై కోపించింది. ఆమెకు హాగరు మీద సహితం కోపం వచ్చింది. ఆమె అబ్రాహాం వద్దకు వెళ్లి అబ్రాహామా, వాళ్లిద్దరినీ దయచేసి పంపించి వెయ్యి అన్నది.

అబ్రాహాం దానికి ఒప్పుకోలేదు. ''వాళ్లని పంపి వేయడమా? అదికుదరదు. నేను పంపను. ఇష్మాయేలు కూడ నా కొడుకే'' అన్నాడు.

అంతా విచారం అలముకున్నది. అవును, మనుష్యులు ఒకనికొకరు నొప్పించు కుంటారు, ఎందుకంటే వాళ్లహృదయాల్లో పాపం ఉంది. కాబట్టి మనం-దేవా, దయచేసి మనుష్యులందర్నీప్రేమించడం నాకు నేర్పించు, అని ఎప్పుడూ ప్రార్థన చేయాలి.

విందు ముగిసింది. రాత్రి అయ్యింది. అందరూ నిద్ర పోతున్నారు.

హఠాత్తుగ అబ్రాహాంకి ఓ స్వరం వినిపించింది. అది దేవుని స్వరం.

దేవుడు-అబ్రాహామా, అని పిలిచాడు. ''శారాచెప్పిన మాట సరైనదే. నీవు హాగరును ఇష్మాయేలును పంపివేయాలి. దానికి విచారించకు. నేను ఇష్మాయేలును కూడ జాగ్రత్తగ చూస్తాను. అయితే ఇస్సాకు మాత్రమే వాగ్దాన పుత్రుడు. ఆ తరువాత అతడు సమస్తమూ పొందుతాడు.

అబ్రాహాం దేవుడు చెప్పినట్టే చేసాడు. అతనికి ఇప్పుడు శారా మీద కోపం లేదు. అది తెల్లవారు జాము. అప్పుడే సూర్యుడు పైకి లేస్తున్నాడు. అదుగో, హాగరు ఇష్మాయేలు వెళుతున్నారు. అబ్రాహాం వాళ్లకి కొంచం రొట్టె, ఒక బుడ్డిలో నీళ్లు ఇచ్చాడు. వాళ్ళు విశాలమయిన ఎడారిలోకి వెళ్తున్నారు.

ఎటు చూచినా ఇసుక. వాతావరణం అతి వేడిగ ఉంది. సూర్యకిరణాలు వాళ్ల తలల మీద పడి మాడ్చివేస్తున్నాయి. వాళ్లు అలిసిపోతున్నారు. చాల దాహంవేస్తున్నది. అదృష్టవశాత్తు వాళ్లు కొంచెం నీళ్ళు తెచ్చుకున్నారు. అవి ఎంతో మధురంగ ఉన్నాయి!

ఇష్మాయేలు తల్లితో-అమ్మా దయ చేసి నాకు మరి కొంచం నీళ్ళు ఇస్తావా?" అన్నాడు. అయితే నీళ్ళ బుడ్డి దాదాపు ఖాళీ అయ్యింది. తల్లికి భయంవేసింది. ఆమె కొడుక్కి మరికొన్ని గుటకల నీరుతాగనిచ్చింది. ఆమె మాత్రం గుక్కెడు నీళ్ళు మాత్రమే తీసుకొంది. ఇక బుడ్డి ఖాళీ!

"అమ్మా, దాహం వేస్తోంది, కాస్త నీళ్లిస్తావా?"

"లేదు బాబూ, బుడ్డి ఖాళీ అయింది. తరువాత కాస్త నీరు ఎక్కడన్నా దొరుకుతుందేమో" అంటూ హాగరు చుట్టూ చూసింది. ఎక్కడన్నా చిన్ననీటి మడుగు ఉందా? లేదా, ఎక్కడా చుక్కనీళ్ళు లేవు. ఆమెకు ఇసుక మాత్రమే కనిపిస్తోంది. వాళ్ళు ఒంటరిగ ఉన్నారు. ఎండవేడి విపరీతంగా ఉంది.

ఇష్మాయేలు ఇక ఓ అడుగు కూడ వేయలేక పోయాడు. అతడు నిట్టూర్పు విడుస్తున్నాడు చేతులు ప్రక్కకు వ్రేలాడుతున్నాయి. అతని కళ్లు తేలిపోతున్నవి. తల్లి హాగరు ఏడుస్తున్నది. ఆమె కుమారుడ్ని ఎత్తుకోవాలనుకున్నది. కాని అతడు చాల బరువుగ ఉన్నాడు. ఆమె ప్రయత్నం చేసింది. ఆమె అతనిని ఒక పొదనీడన పండుకోబెట్టింది.

హాగరు కొంత దూరం వెళ్లింది. ఆమె ఇష్మాయేలుకు దగ్గరగా ఉండలేక పోయింది. అదెంతో దుఃఖకరం. అతడు మూల్గుతున్నాడు. అతడు తెల్లబారాడు. తన కుమారుడు చావబోతున్నాడు. అతనికి సాయం చేసేవారే లేరు.


ఎవ్వరూలేరా? వాళ్ల దుఃఖం చూసేవాళ్లెవ్వరూ లేరా? తమ ఏడ్పువినేవాళ్లే లేరా? హఠాత్తుగ ఒక స్వరం వినవచ్చింది. "హాగరూ, విషయం ఏమిటి? ఎందుకు ఏడుస్తున్నావు? నేను ఇష్మాయేలును చూచాను. అతన్ని పరామర్శిస్తాను". ఓ అది దేవుని స్వరం!

హాగరుపైకి చూచింది. హఠాత్తుగ తాను కూర్చున్న చోటుకు దగ్గరగ ఒక బావి కనిపించింది. ఆ బావిలో నీళ్లుఉన్నాయి. మంచి చల్లని నీళ్లు. తనకు శక్తి ఉన్నంత వరకు తొందరగ అక్కడికి వెళ్లింది. బుడ్డిలో నీరు నింపుకొని కుమారుని దగ్గరకు వచ్చింది. అతడింకా బ్రతికే ఉన్నాడు! ఆమె తడారిన అతని నోటిలో నీళ్లుపోసింది. చూడండి, ఇష్మాయేలు కనులు విప్పుతున్నాడు. అబ్బ, నీరెంత రుచిగ ఉందో! నీరుత్రాగడంలో అతనికి బలంవచ్చింది. కొద్ది సేపటికి అతడు నడవగలిగాడు.

అప్పుడు వాళ్లిద్దరూ వెళ్తున్నారు. ఆ విశాలమయిన ఎడారిలో ఒక బుడ్డెడు నీళ్లతో ప్రయాణం సాగించారు.

దేవుడెంతమంచివాడో చూడండి. ఆయన హాగరు, ఇష్మాయేలులను కాపాడాడు. వాళ్లు దానికి అర్హులు కాకపోయినా సరే.

దేవుడు మన పట్ల కూడ మంచితనం చూపిస్తున్నాడు. ఆయన మన యందు శ్రద్ధ చూపుతున్నాడు. మనం దానికి అర్హులమేనా?



15. అబ్రాహాము బలి

ఇస్సాకు పెద్దవాడయ్యాడు. అతడు తండ్రికి సాయం చేసేవాడు. అది అతనికి చాల యిష్టం. అతడు తండ్రిని చాల ప్రేమిస్తాడు.అబ్రాహాం కూడ ఇస్సాకును చాల ప్రేమిస్తాడు. అబ్రాహాం దేవుని గూర్చి ఇస్సాకుకు చెబుతాడు. అతనికి ఆదాము హవ్వలను గూర్చి చెబుతాడు. పరదైసు గురించి పాపం గురించీ కూడ చెప్పేవాడు. తరచు యేసు ప్రభువును గూర్చి చెబుతుండేవాడు.

ఇస్సాకు శ్రద్ధగ వినేవాడు. తరచు అతడు దేవునికి ప్రార్థన చేసేవాడు. అది మరిచిపోయేవాడు కాదు. అతడు తన తండ్రిలా దేవుని బిడ్డగా ఉండాలని ఆశించాడు.

దేవుడు ఇస్సాకు ప్రార్థన ఆలకించేవాడు. అతడు దేవుని ప్రేమించాడు. అదెంత అద్భుతం! ఇస్సాకు ఎంత సంతోషించాడు!

అది రాత్రివేళ. అబ్రాహాం నిదురపోతున్నాడు. హఠాత్తుగ అతడు మేల్కొన్నాడు. అతనికి ఒక స్వరం వినిపించింది. దేవుడు అతనితోమాట్లాడుతున్నాడు. అబ్రాహాం విధేయతతో ఆయన మాటలు విన్నాడు. దేవుడు, అబ్రాహామా లే. నీవు ఒక ప్రయాణం చేయాలి. నీవు నాకొక అర్పణ తేవాలి. దూరాన ఉన్న ఒకానొక పర్వతం మీద దానిని అర్పించాలి. ఆ అర్పణయేదో నీకు తెలుసా? అది నీ కొడుకు ఇస్సాకు అన్నాడు.

అబ్రాహాం నిశ్చేష్టుడయ్యాడు. అతనికి నిద్ర పూర్తిగ ఎగిరిపోయింది. తాను ఇస్సాకును బలియివ్వాలా? బలిపీఠం మీద అతన్ని కట్టి పెట్టాలా? అంటే బలి పశువులా. అలా అయితే తానిక ఎన్నటకీ ఇస్సాకును చూడలేడు! అతడు తన కొడుకును ఎంతో ప్రేమిస్తున్నాడు. తన కుమారుడ్ని విడిచి ఒక్క క్షణం కూడ బ్రదుకలేడు. అలా అని దేవుని మాటను కూడ జవదాటలేడు. అబ్బ, ఎంత కఠినపరీక్ష. ఇప్పుడు తానేం చేయాలి? అయినా తానేం చేయాలో దేవుడు చెప్పాడు. కాబట్టి అలా తప్పక చేయాలి. అబ్రాహాం దేవునికి లోబడడానికి ఇష్టపడ్డాడు. ఎందుకంటే అతని మనసులో దృఢవిశ్వాసం ఉంది. ఇస్సాకును ప్రేమించిన దానికంటె అతడు దేవుడ్ని ఎక్కువగా ప్రేమిస్తున్నాడు!

అబ్రాహాం ఇస్సాకును నిద్రలేపాడు-ఇస్సాకూ, నీవూ వస్తావా? మనం ప్రయాణం అవ్వాలి. దేవుడు అలా చెప్పాడు.

ప్రయాణం చేయాలని ఇస్సాకుకు ఆశగ ఉంది. ఇద్దరు పనివాళ్లు కూడ వస్తున్నారు. కట్టెలు మోయడానికి ఓగాడిద ఉంది.

అబ్రాహాం ఒక కత్తి కూడ తెస్తున్నాడు. అయితే గొర్రె పిల్లను తేవడంలేదు. ఎందుకంటే బలి అర్పించేది గొర్రెనుకాదు, ఇస్సాకును.

అదుగో, వాళ్లు వెడుతున్నారు. అది దూరప్రయాణం వాళ్లు మూడు దినాలు నడవాలి.

అబ్రాహాం మౌనంగా ఉన్నాడు. కొన్ని సార్లు విచారంగ ఉన్నాడు. ఎందుకో మీకు తెలుసుకదూ? అతనికీ ప్రయాణం ఎంత కఠినమయినది! అతడు ఇస్సాకును బలియివ్వాలి. అప్పుడిక తనకు కుమారుడుండడు. అప్పుడిక తానొక గొప్ప జనాంగంగ ఎలా అవ్వగలడు? ఎందుకంటే దేవుడిచ్చిన వాగ్దానం అదేకదా? అప్పుడు తన వంశంలో నుండి యేసు ప్రభువు ఎలా వస్తాడు? అలా అని దేవుడే మాటయిచ్చాడు కదా? అబ్రాహాంకు ఏమీ అర్థం కాలేదు. అయినా అతడు దేవునికి విధేయుడై యుండాలనుకున్నాడు. దేవుడు వాగ్దానం చేసినదానిని ఆయనే నెరవేరుస్తాడు. అబ్రాహాంకు ఆ నమ్మకం ఉంది. అతడు దానిని నమ్మాడు. ఆ విశ్వాసం వలన అతడు దేవుని నమ్మగలడు. ఆ విశ్వాసమే అతన్ని బలవంతునిగా చేసింది.

వాళ్లు నడుస్తూనే ఉన్నారు. ఇద్దరూ కలిసి ఒక ఎత్తైన పర్వతం దగ్గరకు వచ్చారు.

'మీరిక్కడే కనిపెట్టండి. కొద్ది సేపటిలో మేం తిరిగి వస్తాము", అని అబ్రాహాం సేవకులతో చెప్పాడు.

ఆ మాట మీరువిన్నారా? అబ్రాహాం "మేము తిరిగి వస్తాము" అన్నాడు. అవును, అతనికానమ్మకం ఉంది. ఇస్సాకు ఒక వేళ చచ్చిపోయినా దేవుడతనిని తిరిగి బ్రతికించగలడు. సర్వశక్తిమంతుడు అలాంటి వాడే. అబ్రాహాము ఇస్సాకు కొండ ఎక్కుతున్నారు. ఇస్సాకు కట్టెలు మోస్తున్నాడు.

హఠాత్తుగ ఇస్సాకు "తండ్రీ, మన దగ్గర నిప్పులు కట్టెలు ఉన్నాయి కాని గొర్రెపిల్ల ఏది? అని అడిగాడు. అయ్యో, అబ్రాహాం దీనికి ఏమని జవాబు చెప్పాలి? ఏం చెప్పాలో అతనికి తెలిసింది. దేవుడు సహాయం చేస్తున్నాడు. "ఇస్సాకూ, దేవుడే ఇస్తాడు" అన్నాడు. చివరికి వాళ్లు పర్వత శిఖరం చేరారు. ఇద్దరూ కలిసి బలిపీఠం కట్టారు. దాని మీద కట్టెలు పేర్చారు. ఇప్పుడు అబ్రాహాం అసలు సంగతి చెప్పాలి." ఇస్సాకూ, దేవుడు ఏం చెప్పాడో తెలసా? నీవే ఆ అర్పణ కావాలని ఆయన ఉద్దేశం".


ఈ మాటలు విని ఇస్సాకు భయపడ్డాడా? అతడు పారిపోయాడా? లేదు, లేదు, ఇస్సాకు మౌనంగ ఉన్నాడు. అతడు దేవునికి కూడ విధేయుడు కావాలనుకున్నాడు తన తండ్రి వలెనే!

అబ్రాహాం కొడుకును త్రాళ్లతోకట్టి కట్టెల మీద పండ బెట్టాడు. అతడు పదునైన కత్తిని చేతపట్టు కున్నాడు. దానితో చేయిపైకెత్తాడు. ఇప్పుడు ఇస్సాకును చంపివేస్తాడు. మరి దేవుడలా చేయమన్నాడుకదా? అయితే... దేవునికి అదియిష్టంలేదు. దేవుడు - అబ్రాహామా, అబ్రాహామా అనిపిలిచాడు. "ఇస్సాకుకు హాని చేయకు. అతడు చచ్చిపోనవసరం లేదు. నీవు నిజంగా నన్ను ప్రేమిస్తున్నావని యిప్పుడు నాకు తెలిసింది.

ఎందుకంటే నీ ఒకే కుమారుడయిన ఇస్సాకును నాకు బలి ఇవ్వడానికి నువ్వు సిద్ధపడ్డావు" అన్నాడు.

అబ్రాహాం తన చెయ్యిదించాడు. అతడు ఇస్సాకును బంధించిన త్రాళ్లను విప్పివేసాడు. ఇక ఇస్సాకు జీవిస్తాడు.

హఠాత్తుగ పొదల్లో ఏదో శబ్దం వినిపించింది. కొమ్మల్లో చిక్కుకున్న గొర్రెపొట్టేలు కనిపించింది. అబ్రాహాం త్వరగ దాన్ని పట్టుకొని వధించాడు. ఇప్పుడు ఇద్దరూ కలిసి దేవునికి బలి యివ్వబోతున్నారు. వాళ్లెంత సంతోషంగా ఉన్నారు! అబ్రాహాం ఇస్సాకులు ఒకరినొకరు ఎంతగ ప్రేమించుకుంటున్నారు! అయితే వాళ్లు దేవుడ్ని అంతకంటె అధికంగ ప్రేమిస్తున్నారు. ఇస్సాకుకూ యేసు ప్రభువుకూ పోలిక ఉన్నదని నీకు తెలుసా? యేసు ప్రభువు సిలువకు కొట్టబడ్డాడు. ఆయన సిలువ నుండి దిగిరావడానికి దేవుడు అనుమతించాడా? లేదు. ఆయన చనిపోయాడు. ప్రజలందరూ స్వేచ్ఛ పొందడానికి వాళ్లకు బదులుగా ఆయన తనను తాను బలిగా అర్పించుకున్నాడు. దీని ఫలితంగా మనం అబ్రాహాం వలెనే నిజమయిన విశ్వాసం కలిగి ఉన్నాము. నీకు నిజమైన విశ్వాసం ఉన్నదా? అలాంటి విశ్వాసాన్ని యివ్వమని దేవున్ని ప్రార్థించు.



16. యాకోబు, ఏశావు

ఇస్సాకు యిప్పుడు పెద్దవాడయ్యాడు. అతనికి చాల గొర్రెలు, ఆవులు ఉన్నాయి. అతడు చాల ధనవంతుడు. అతని తండ్రి అబ్రాహాం వలెనే! అతడు ఇప్పుడు ఒక్కడే నివసించడం లేదు. అతడు పెండ్లి చేసుకున్నాడు. అతని భార్యపేరు రిబ్కా. ఇస్సాకు దేవుడ్ని ప్రేమించేవాడు. నీకది గుర్తుందా? రిబ్కాకూడ దేవుని పట్ల భయభక్తులు కలిగి ఉండేది. వారిద్దరూ కలిసి చాల సంతోషంగ బ్రదుకుతున్నారు!

అయితే కొన్ని సార్లు వాళ్లు విచారంగ ఉండేవాళ్లు. ఎందుకో తెలుసా? వాళ్లకి పిల్లల్లేరు. ఒక బిడ్డకోసం వాళ్లు ప్రతిదినం ప్రార్థన చేసేవాళ్లు. తమకో కుమారుడ్నివ్వమని వినయంగ దేవునికి విన్నపం చేసేవాళ్లు. చాలకాలం గడిచిపోయింది. చివరికి దేవుడు వారి మొరలకు జవాబిచ్చాడు. ఒకదినం రిబ్కాకు ఇద్దరు కొడుకులు పుట్టారు! కవలలు. పెద్దవాని పేరు ఏశావు. అతడు ముందు పుట్టాడు. రెండో వాని పేరు యాకోబు అతడు చిన్నకుమారుడు.

ఇస్సాకు రిబ్కాలు ఎంత ఆనందపడ్డారు! వాళ్లు దేవునికి వందనాలు చెల్లించారు.

వాళ్లిద్దరూ కొడుకులను మంచిగ చూచుకుంటున్నారు. ఏశావు యాకోబులు బలంగా ఎదుగుతున్నారు. తండ్రీ తల్లీ వాళ్లకి దేవుని గురించి చెబుతుండేవాళ్లు. వాళ్లకి ప్రార్థన సహితం నేర్పించారు. ఒక నూతనమైన హృదయం కోసం ప్రార్థించడం. ఎందుకంటే అందరి పిల్లల్లా వాళ్లకీ పాపపు హృదయాలే ఉన్నాయి. ఏశావు దీన్ని గురించి అంతగా ఆలోచించడు గాని యాకోబు ఆలోచిస్తాడు. ఏశావు తన ఇష్టానుసారంగ నడుస్తాడు. యాకోబు మాత్రం దేవుని మాట వినాలని ఆశిస్తాడు. యాకోబుకు ఏశావుకు మధ్య భేదం ఉందని నీవు చెప్పవచ్చు. ఎందుకా అని ఆశ్చర్యపడుతున్నావా? ఇది దేవుని చిత్తమని బైబిలు చెబుతున్నది.

మనం ఎవరిలా ఉన్నాం? యాకోబువలెనా లేక ఏశావు వలెనా? మనం చేసేతప్పుడు పనులను గురించి విచారిస్తున్నామా? దేవుని మాట వింటున్నామా? వినడం లేదా? అంటే నువ్వు ఏశావులా ఉన్నావన్న మాట. అయినా దేవుడు యాకోబులా మనం ఉండేలాగున మార్చగలడు.

తరువాత ఒకానొక దినం ఈయిద్దరిలో ఒక బాలుడు గొప్పదీవెన పొందుతాడు. గొప్పదీవెనయా? అంటే ఏమిటి? అది దేవుడిచ్చే గొప్ప ఆశీర్వాదం దేవుడు అబ్రాహాం కిచ్చిన ఆశీర్వాదం గుర్తుందా? చాలమంది పిల్లలు పుడతారు. వాళ్లు గొప్ప జనాంగమవుతారు. వాళ్లు దేవుని ప్రజలు. వారిలో నుండే ఆ తరువాత యేసు ప్రభువు పుడతాడు. ఈ దీవెన ఎంత గొప్పది! మొదట అబ్రాహాం ఆ దీవెన పొందాడు. తరువాత ఇస్సాకు. ఆపైన దీవెన ఎవరికి దొరుకుతుంది? అది ఏశావుకా? ఎందుకంటే అతడు పెద్ద కొడుకు కదా? అతడు మొదటి వాడు చాల ముఖ్యమయినవాడు. అయినా అతడు కాదు. దీవెన పొందేది యాకోబే. ఇలా అని దేవుడు రిబ్కాకు చెప్పాడు.

ఏశావు పెద్దవాడయ్యాక అతడు తరుచు బైటికి వెళ్లేవాడు. పొలంలోకి, అడవిలోకి వెళ్లేవాడు. అతడు అడవి జంతువులను వేటాడేవాడు. అతడు వేట గాడయ్యాడు. అతడో బలమైన అడవి వేటాగాడు. అతడు చాల సార్లు తాను చంపిన జంతువులను ఇంటికి తెచ్చేవాడు. ఆ మాంసాన్ని వండేవాళ్లు. తండ్రి ఇస్సాకు దానిని యిష్టపడేవాడు. అందువలన అతనికి ఏశావు అంటే చాల ప్రేమ.

యాకోబు ఎప్పుడూ ఇంటిలోనే ఉండేవాడు. అతడు తల్లి రిబ్కాకు సహాయం చేసేవాడు. కాబట్టి రిబ్కా యాకోబును ఎక్కువ ప్రేమించేది.

యాకోబు ఏం చేస్తున్నాడు? అతడు వంట చేస్తున్నాడు. రుచిగ ఉండే చిక్కుడు కాయల కూరవండుతున్నాడు. అది ఎర్రగ ఉంది. మంచి వాసన వస్తోంది!

యాకోబు ఆ గొప్పదీవెన గురించి ఆలోచించేవాడు. అది దేవుని దీవెన. అది తనకు దొరకాలని చాల ఆశపడేవాడు. అయితే ఏశావు మొదట పుట్టాడు కాదా? తండ్రి ఇస్సాకు బహుశ దానిని ఏశావుకే ఇస్తాడనుకుంట. మరి ఏంచేయాలి?

అదిగో ఏశావు. అతడు చాల అలసటగా ఉన్నాడు. అది వేటాడ్డంవల్ల అనుకో. అతడు చాల ఆకలిగ ఉన్నాడు కూడ! అతడు కూర వాసన చూచాడు. అది ఘుమఘుమ లాడుతోంది!



''యాకోబూ, ఆ కూర నాకుపెట్టవా?'' అని అడిగాడు. వెంటనే యాకోబు ఒక పథకం, తెలివిగల పథకం వేసాడు.

"సరే, నేనిస్తాను. అయితే నాకా గొప్పదీవెన కావాలి". "ఓ, అది మంచిదే. ఆ గొప్పదీవెన నాకవసరం లేదు. ఏదో ఒక రోజు నేనెలాగూ చచ్చిపోతాను'' అన్నాడు ఏశావు. ఓ ఏశావూ, నీవేం మాట్లాడుతున్నావు? ఎంత భయంకరం! దేవుని నుండి వచ్చే ఆ గొప్ప దీవెనను నీవు వెక్కిరిస్తున్నావు. దేవున్ని అపహాస్యం చేస్తున్నావు! ఏశావు కూరతిన్నాడు.

యాకోబూ ఆ గొప్పదీవెన నీవే పొందుకో.

యాకోబు పథకం ఫలించింది. అయితే అతడు గొప్ప తప్పుచేశాడు. దేవుని దీవెన నెరవేరడానికి అతడు దేవుడ్నే నమ్మవలిసింది. దానిని పొందడానికి దుష్టమైన పథకాలు వేయకుండానే యాకోబు ఆ దీవెన పొందేలా దేవుడు చేసి ఉండేవాడు. ఏశావు కూరంతా తినేసాడు, కాని అతడు చాల పెద్ద పాపం చేశాడు.

దేవున్ని పరిహాసం చేయడం భయంకరమైన పాపం. మనం ఎప్పుడూ భక్తిగలిగి దేవుని దీవెన కోసం వినయంతో ప్రార్థించాలి. దేవుని నుండి వచ్చే దీవెనలే మనలను ధనవంతులనుగా చేస్తాయి.



17. యాకోబు తన తండ్రిని మోసగించుట

ఇస్సాకు ముసలివాడయ్యాడు. అతనికి కళ్లు కనిపించడంలేదు. నేను త్వరలోనే చచ్చిపోవచ్చు అని అతడు అనుకున్నాడు. అయితే నేను ముందు ఆ గొప్పదీవెనను యివ్వాలి. ఎవరికి? ఏశావుకే. ఎందుకంటే ఏశావు పెద్దకొడుకు కదా? ఇస్సాకు చేయాలనుకున్నది అదే. అయితే దేవుని ఆలోచన వేరుగా ఉంది. ఇస్సాకు అది ఎరుగును. కాని అతనికి ఏశావు అంటే ఎక్కువ ప్రేమ. ఈకారణంగా అతడు ఏశావుకు ఆ గొప్ప దీవెన యివ్వాలని అనుకున్నాడు. అయితే అతడిలా అనుకోవడం సరికాదు.

ఏశావు అడవికి వెళ్లాడు.

తల్లి రిబ్కా అంతా విన్నది. ఆమె కంగారు పడింది. "యాకోబుకే ఆ గొప్ప దీవెన రావాలి" అనుకొంది. ఆమె యాకోబుతో-నీవు త్వరగా వెళ్లిరెండు మేక పిల్లల్ని తీసుకురా. నేను వాటిని వంట చేస్తాను. అప్పుడు నాన్న దగ్గరికి వెళ్లు. ఏశావులా నటించు. అప్పుడు గొప్పదీవెన పొందగలవు, అని చెప్పింది. ఇది రిబ్కా వేసిన మంచి పథకమా? కానే కాదు. ఇది ఆమె చేసిన పాపపు ఆలోచన.

మొదట యాకోబు భయపడ్డాడు. ఒక వేళ ఏశావు తనను గుర్తుపడితే. వచ్చినదెవరో తెలుసుకోడానికి తండ్రి తడిమి చూడవచ్చు. ఏశావు చేతులు నున్నగా ఉంటాయి. అయితే రిబ్కా అతని చేతులను మేక తోళ్ళతో కప్పింది. మెడ మీద కూడ. యాకోబు ఏశావు బట్టలు వేసుకున్నాడు. అవి అడవి వాసన వస్తున్నవి. ఇప్పుడతను ఏశావులా కనిపిస్తున్నాడు.

అదిగో యాకోబు వెళ్తున్నాడు. అతడు తండ్రిని మోసం చేయబోతున్నాడు. ఎంత భయంకరం!

అతడు గుడారంలోకి వెళ్లాడు. అక్కడ కాస్త చీకటిగా ఉంది.

"నీవెవరవు?" అని ఇస్సాకు అడిగాడు.

"నేను ఏశావును. నీకోసం రుచికరమైన మాంసం కూర తెచ్చాను".



"నీవు చాల తొందరగా వచ్చేసావే" అన్నాడు ఇస్సాకు.

"దేవుడు నాకు సహాయం చేసాడు" జవాబిచ్చాడు యాకోబు.

అతడు తండ్రికి దగ్గరగా వచ్చాడు. ఇస్సాకు అతని మెడ, చేతులు తడిమి చూసాడు. అతని బట్టలు వాసన చూశాడు. అవును, ఇది ఏశావే అయ్యుండాలి. కాని స్వరం యాకోబు స్వరంలా ఉంది! ఎంత విచిత్రం!

''నీవు నిజంగా ఏశావువేనా?'' అని ఇస్సాకు అడిగాడు. "అవును తండ్రీ, నేను ఏశావునే" అన్నాడు.

యాకోబు అబద్ధం చెబుతున్నాడు. ఇది భయంకరం కాదా?

ఇస్సాకు తిని త్రాగాడు. అప్పుడతను తన చేతులను యాకోబు తలమీద పెట్టాడు. అతడు యాకోబును దీవించాడు. అది దేవుని నుండి వచ్చిన గొప్ప దీవెన. ఇది అబ్రాహాము ఇస్సాకు పొందిన దీవెనయే. అప్పుడు యాకోబు వెళ్లిపోయాడు.

అదుగో ఏశావు వస్తున్నాడు. అతడు వేటాడి చంపిన జంతువును మోసుక వస్తున్నాడు. దాని మాంసాన్ని అతడు వండాడు. తరువాత ఆ కూరను తండ్రివద్దకు తీసుకుపోయాడు.

''తండ్రీ, నేను వచ్చాను. నీకు రుచికరమైన మాంసం కూర తెచ్చాను. ఇప్పుడు ఆ గొప్ప దీవెన నాకు దొరుకుతుందా? అని అడిగాడు. ఇస్సాకు ఖంగారు పడ్డాడు "నీవెవరివి?" అని ప్రశ్నించాడు. ఏశావుకు అర్థం కాలేదు. ఇదేమి వింత ప్రశ్న! "నేను ఏశావును" అన్నాడు. అవును, ఇస్సాకుకు ఆ స్వరం తెలుసు. ఇతడు అసలు ఏశావు!

"అయ్యో, నేను నీకా గొప్పదీవెనను ఇక ఇవ్వలేను" అని చెప్పాడు. అప్పుడు ఇస్సాకు జరిగినదంతా అతనికి తెలియచేసాడు.

ఏశావు చాల కోపగించాడు.

ఏశావుకు కూడ ఒక దీవెన దొరికింది. కాని అది గొప్ప దీవెన కాదు.


"కాస్త ఆగండి, ఇలా చేసినందుకు యాకోబును శిక్షిస్తాను. నాతండ్రి చచ్చిపోయాక ఆ పని చేస్తాను" అన్నాడు ఏశావు.

ఈమాటలు రిబ్కావిన్నది. ఆమె యాకోబుతో "ఏశావు నీకు కీడు చేయాలనుకుంటున్నాడు. అతడు నిన్ను చంపాలనుకుంటున్నాడు. నీవు తప్పించుకుపారిపోవాలి" అని చెప్పింది.

అదిగో, యాకోబు, ఈ విశాల ప్రపంచంలోకి వెళ్తున్నాడు. ఇక మీదట అతడు తల్లివద్ద ఉండడానికి కుదరదు.

ఇప్పుడు సమస్తం విషాదంగ మారింది. ఇక ఎవ్వరూ సంతోషంగా లేరు. ఇస్సాకు గాని రిబ్కాగాని, ఏశావుగాని యాకోబుగాని, దీనికి కారణం వారు చేసిన పాపాలే. పాపం ఎప్పుడూ కష్టాన్నే కొని తెస్తుంది. దేవుడు సమస్తం చూస్తాడు. నీవు ఎవరినన్నా మోసం చేస్తే ఆయన చూస్తాడు. దేవుడు అన్నీవింటాడు. నీవు అబద్ధం చెప్పినప్పుడు ఆయన ఆలకిస్తాడు.

ఆ పాపాలు మన హృదయంలో ఉంటాయి- దేవా, పాపాలను మాహృదయం నుండి తీసివేయి" అని ప్రార్థన చేద్దామా?



18. బేతేలు వద్ద యాకోబు

యాకోబు చాల అలసిపోయాడు. అతడు దినమంతా నడుస్తున్నాడు. నీకు గుర్తుందా? అతడు తన అన్న ఏశావు నుండి పారిపోవలసి వచ్చింది.

చీకటి పడుతున్నది. అది రాత్రి సమయం. అందరూ నిద్రపోతున్నారు. అయితే యాకోబు ఎక్కడ నిద్రపోవాలి? అతనికి ఇల్లులేదు. పడకలేదు. ఏమీలేదు. అదుగో, అక్కడ ఓరాయి ఉంది. అదేమిటో తెలుసా? అతడక్కడ పండుకోవచ్చు. తల ఆరాతిమీద పెట్టి నిద్రపోవచ్చు. ఆ రాయి అతని తలదిండు! అతడక్కడ పండుకున్నాడు. ఇప్పుడు పూర్తిగ చీకటి పడింది. అతని చుట్టూ అంతా నిశ్శబ్దం. యాకోబుపైకి చూశాడు. నక్షత్రాలు పైన ఆకాశంలో మిణుకు మిణుకు మంటున్నాయి. పరలోకం అక్కడ ఉంది. దేవుడు అక్కడ ఉంటాడు. ఆయన సమస్తాన్నీ చూస్తాడు. అన్నీ తెలుసుకుంటాడు.

యాకోబు చాల విచారంగా ఉన్నాడు. దేవుడు తనను గురించి యింకా ఆలోచిస్తున్నాడా? ఇంకా తనను కాపాడుతాడా? తాను చేసిన పాపం చాల గొప్పది. తన తండ్రిని మోసం చేసాడు. దేవుడే దానిని చూచాడు! యాకోబుకా సంగతి తెలుసు. దేవుడు తనపై కనికరం చూపుతాడా? తాను దాని కొరకు అడగవాచ్చా?

యాకోబూ, తప్పక అడగవచ్చు. దేవుడు అతిపెద్ద పాపాలను కూడ క్షమించగలడు, క్షమిస్తాడు కూడ. యాకోబు నిద్రపోయాడు. అతడొనిచ్చెన చూచాడు. అది నేల మీద తన ప్రక్కనే ఉంది. అది చాల ఎత్తుగ ఉంది. అది భూమినుండి ఆకాశాన్ని తాకుతున్నది. హఠాత్తుగ పరలోకం తెరవబడింది చూడు, ఆ నిచ్చెన మీద నుండి ఎవరు దిగుతున్నారు? ఆకాశం నుండి భూలోకానికి. వాళ్లు దేవదూతలు. చూడు, వాళ్లు తిరిగి పైకి-అంటే భమినుండి ఆకాశానికి వెళ్తున్నారు.

ఆదూతలు-మేము దేవుని సేవకులం. యాకోబూ, నిన్ను మేము చూచాము. మేము నిన్ను కాపాడుతాము. మేం అలా చేయాలని దేవుని కోరిక. మేం నిన్ను సంరక్షిస్తాము. నీకు ఎవ్వరూ హాని చేయలేరు.

ఆ నిచ్చెనపైన ఎవరు నిలబడి ఉన్నారు? అది దేవుడే!

ఆయన ఇలా చెబుతున్నారు-యాకోబూ, నేను అబ్రాహాం, ఇస్సాకుల దేవుడను. నీ దేవుడుగా కూడ ఉండాలని ఆశిస్తున్నాను. నీవు నా బిడ్డగా ఉండవచ్చు. ఆ గొప్ప దీవెన నీదే. నేను అందమయిన ఈ దేశాన్ని నీకిస్తాను. నీవొక గొప్ప జానాంగం అవుతావు. తరువాత నీ ప్రజలు ఇక్కడ నివసిస్తారు. ఆ పిదప ప్రభువైన యేసు ఈ జనాంగంలోనే జన్మిస్తాడు".

యాకోబు నిద్రలేచాడు. అదంతా ఓ కల. అయినప్పటికి అది సత్యం. ఎందుకంటే అది దేవుని నుండి వచ్చినది. అబ్బ, యాకోబు ఎంత సంతోషించాడు! ఇక అతడు విచారించడం లేదు. అతనిప్పుడు కూడ దేవుని బిడ్డగ ఉండగలడు. అదెంత అద్భుతం! అది పొందడానికి అతనికి అర్హత లేదు. రాత్రి గడిచి పోయింది. ఉదయం అయ్యింది. యాకోబు లేస్తున్నాడు. అతడు దేవునికి వందనాలు చెప్పాలనుకున్నాడు. అతడు దేవునికో అర్పణ యివ్వాలనుకున్నాడు. కాని అతని వద్ద ఏమీ లేదు. బలిపీఠం లేదు. గొర్రెపిల్ల కూడలేదు. అతని వద్ద చిన్న బుడ్డిలో కొంచం నూనె మాత్రం ఉంది. అతడా తరువాత ఏం చేసాడు? అతడా పెద్ద రాతిని తీసాడు. తన తలగడగ వాడిన రాయి. యాకోబు దానిని తిన్నగ నిలబెట్టాడు. ఆ బుడ్డిలోని నూనెను ఆ రాతి మీదపోసాడు. నూనె ఆ రాతి మీద నుండి కారుతోంది.

"ఇదే నా అర్పణ" అన్నాడు యాకోబు


దేవుడా అర్పణ నంగీకరించాడు. ఎందుకంటే ఆయన యాకోబు హృదయాన్ని చూచాడు. అది నిజంగ కృతజ్ఞతలో నిండిన హృదయం. అతడు దేవున్ని ప్రేమిస్తున్నాడు.

యాకోబు దేవునితో-ఆ తరువాత నేనునీకొరకు అసలైనఅర్పణ తెస్తాను. నేనిక్కడికి తిరిగి వచ్చాక నిన్ను సేవిస్తాను" అన్నాడు. యాకోబు ఆ చోటికి "బేతేలు" అనే పేరు పెట్టాడు. దానికి "దేవుని మందిరము" అని అర్థం. అవును, ఇక్కడే దేవుడతన్ని దర్శించాడు కదా? దేవుడిక్కడ యాకోబుతో నివపసించాడు.

యాకోబు తన మార్గాన సాగిపోయాడు. దినాలు తరబడి అతడు నడిచాడు. అప్పుడతడో పరదేశం చేరాడు. అయితే దేవుడతనితో ఉన్నాడు.







అ తడెక్కడికెళ్లినా ఉన్నాడు. దేవుడు నీతో ఉంటే ఆయన అన్నీ చక్కగా చేస్తాడు.

ఆయన నీతో కూడ ఉంటాడా అని నీవు ఆయనను అడగాలి.

ఆయన నీయందు శ్రద్ధకలిగి యాకోబుకు తోడైనట్టు నీకూ ఉంటాడా?

నీవాయన బిడ్డగ ఉంటానని అడగాలి.

ఇదో పెద్ద అద్భుతం! అయితే దేవునికి అసాధ్యమయినదేదీ లేదు. అది యాకోబుకు జరిగింది. అతడు మోసగాడయినా, అద్భుతం జరిగింది.

19. లాబాను వద్ద యాకోబు

యాకోబు ఎంత దీర్ఘప్రయాణం చేసాడు! చివరికి అతడీ పరదేశాన్ని చేరుకున్నాడు. యాకోబు మామ ఒకడు అక్కడ నివసిస్తున్నాడు. అతని పేరు లాబాను.

ఈదేశంలో వేరొకరు కూడ నివసించేవారు. అదెవరో తెలుసా? యాకోబు తల్లి రిబ్కా. దానికి ముందు యాకోబు తాత అబ్రాహాం అక్కడ జీవించాడు.

యాకోబు ఒక బావివద్దకు చేరాడు. అక్కడ చాల గొర్రెలున్నాయి. గొర్రెల కాపరులు కూడ ఉన్నారను కోండి! గొర్రెలు త్రాగడానికి వాళ్లా బావినుండి నీళ్లు చేదుతారు. యాకోబు వాళ్లతో-నా మామ లాబాను మీకు తెలుసా? అని ప్రశ్నించాడు. "ఆ తెలుసు, అదిగొ అతని కుమార్తె గొర్రెల మందతో వస్తున్నది, ఆమె పేరు రాహేలు" అని చెప్పారు. యాకోబు ఆమె రావడం చూచాడు. అతడు వెళ్లి ఆమెకు ముద్దు పెట్టాడు. అప్పుడు యాకోబు ఆమెకు సాయం చేసాడు. బావినుండి నీళ్లు చేది ఆమె గొర్రెలకు పెట్టాడు. రాహేలు అది చూచి సంతోషించింది.

ఆమె గొర్రెలతో ఇంటికి వెళ్లింది. తన తండ్రి, లాబానుతో జరిగినదంత చెప్పింది. లాబాను యాకోబు దగ్గరకు వెళ్లాడు. అతడు-యాకోబూ, నీవు వచ్చి నాతో ఉండవచ్చు అని పిలిచాడు. అది యాకోబుకు మంచిదే కదా? యాకోబు యిప్పుడు లాబాను దగ్గర పని చేస్తున్నాడు. ప్రతీదినం అతడు లాబాను గొర్రెలను కాస్తున్నాడు. అతనికి ఆ పని చాల యిష్టం.



ఎందుకో తెలుసా? ఆ తరువాత అతడు రాహేలును పెండ్లాడవచ్చు. రాహేలుకు ఒక అక్క ఉంది. ఆమె పేరు లేయా.

ఒక దినం విందు జరిగింది. యాకోబు రాహేలుపెండ్లి చేసుకుంటున్నారు. వాళ్లిద్దరూ ఆ రాత్రి కలిసి నిద్రపోతారు.

మరునాడు యాకోబు నిర్ఘాంతపోయాడు. ఇది రాహేలుకాదు! లేయా! అరె, యాకోబు రాహేలు బదులు లేయాను పెండ్లాడాడు. ఇలా ఏర్పాటు చేసింది లాబానే. అది అన్యాయం. అతడు యాకోబును మోసం చేసాడు.

''యాకోబూ, నీవు రాహేలును కూడ పెండ్లి చేసుకోవచ్చు. అయితే దాని కోసం నువ్వు చాలకాలం నాకు సేవ చెయ్యాలి'' అన్నాడు లాబాను.

కాబట్టి యాకోబు మళ్లీ అతనికి సేవకుడయ్యాడు. ఎందుకంటే యాకోబు రాహేలును చాల ప్రేమించాడు. లాబాను చాల సంతోషించాడు. యాకోబు మంచి పనివాడు!

తరువాత యాకోబు రాహేలును వివాహం చేసుకున్నాడు. చాలకాలం లాబాను గొర్రెలను కాచాడు. అయితే ఇప్పుడతనికి సొంత గొర్రెలు, ఆవులు ఉన్నాయి. చిన్న గొర్రెపిల్లలు పుడుతూనే ఉన్నాయి. యాకోబు మంద మరింత పెద్దదవుతున్నది. దేవుడే అలా జరిగేలా చేస్తున్నాడు!

లాబాను ఇది చూచాడు. ''యాకోబు నాకంటె ధనవంతుడవుతాడేమో'' అనుకున్నాడు. అది అతనికి కోపం కలిగించింది. లాబాను అసూయపడ్డాడు. అతడు యాకోబుతో ప్రేమగ ఉండడం లేదు. యాకోబు ఇది గ్రహించాడు. దేవుడుకూడ దీనిని చూచాడు. ''యాకోబూ, నీవీదేశం వదిలి పెట్టాలి. నీ తండ్రి ఇస్సాకు నివసిస్తున్నదేశానికి వెళ్లాలి. అదే వాగ్దానదేశం. నేను నీతో ఉంటాను'' అని దేవుడు యాకోబుతో చెప్పాడు. లేయా, రాహేలు కూడ అక్కడ నుండి వెళ్లిపోడానికి ఒప్పుకున్నారు. వాళ్లు కూడ యాకోబుతో వెళ్లిపోతున్నారు. ఎందుకంటే వాళ్లిద్దరూ యాకోబు భార్యలు కదా?

అబ్బ అదెంత పెద్ద ఊరేగింపు! ఎంతమంది మనుష్యులు, ఎన్ని జంతువులు! యాకోబు నిజంగానే చాల ధనవంతుడయ్యాడు!

వాళ్లలో చాలమంది చిన్న పిల్లలు కూడ ఉన్నారు. వాళ్లెవరు? వినండి.

యాకోబు అందరి కంటె ఎవరిని ఎక్కువగా ప్రేమిస్తాడో మీకు గుర్తుందా? రాహేలును కదూ? లేయా కాదు. యాకోబు ఇలా చేయడం బాగులేదు. వాళ్లిద్దరినీ సమానంగా ప్రేమించాలి. మనం కూడ తల్లిదండ్రుల్ని సమానంగా ప్రేమించాలి. తల్లిదండ్రులు తమ పిల్లలందర్నీ సమంగా ప్రేమించాలి. ఇది దేవుని కిష్టమయినది. చాలసార్లు లేయా వాచారంగా ఉండేది. నీవది అర్థం చేసికోగలవు కదూ? అయితే దేవుడామె గురించి ఆలోచించాడు. లేయాకు తప్పక పిల్లలు కలిగేలా ఆయన చేసాడు. దీనివలన ఆమె కాస్త సంతోషించింది. దీని వలన యాకోబుకు కూడ సంతోషం కలిగింది. ఎందుకంటే యాకోబు తండ్రి అయ్యాడు కదా!

యాకోబు నన్నిప్పుడు తప్పక ప్రేమిస్తాడని లేయా అనుకొంది. కాని అలా జరగలేదు. లేయా ఇంకా విచారంగానే ఉంది.

రాహేలు కూడ విచారంగానే ఉంది. ఎందు కంటే ఆమె కసలు పిల్లలే లేరు. కాబట్టి ఆమె దాని గురించి ప్రార్థించడం మొదలు పెట్టింది. దేవుడు తన ప్రార్థనకు జవాబిస్తాడని తెలుసు.

దేవుడు రాహేలు ప్రార్థన విన్నాడు. ఆమెకో శిశువు పుట్టాడు. చిన్న కుమారుడు. అతని పేరు యోసేపు. అబ్బ, రాహేలుకు ఎంత ఆనందంగా ఉందో, యాకోబుకు కూడ. ఎందుకంటే అతడిప్పుడు తండ్రి. కొంత కాలం అయ్యాక రాహేలుకు మరో కొడుకు పుట్టాడు. అతనిపేరు బెన్యామీను అయితే ఆ తరువాత ఏం జరిగిందో తెలుసా? బెన్యామీను యింకా పసివాడిగ ఉన్నప్పుడే రాహేలు చచ్చిపోయింది. అది ఎంత ఘోరం! ఇప్పుడు చిన్న బెన్యామీనుకు తల్లి లేదు. యాకోబు చాల దుఃఖ పడ్డాడు. అతడు రాహేలును చాలప్రేమించాడు.

రాహేలుకు నూతనమైన హృదయం ఉండి ఉంటే చచ్చిపోవడం భయంకరంకాదు, ఎందుకంటే అప్పుడు ఆమె పరలోకానికి వెళ్లి ఉండేది. ఈ సంగతి నీకు తెలుసు కదూ? నీవు దానిగురించి ప్రార్థించవచ్చు. ఎందుకంటే ఒకానొక దినం అందరూ చచ్చిపోవాలి. నీవూ నేనూ కూడా.

20. యాకోబు తిరిగి రావడం



దూరం నుండి వస్తున్న ఆ పెద్ద ఊరేగింపు చూడండి! ఒంటెలు, ఆవులు, గొర్రెలు, గాడిదలు. అమ్మో, వాటన్నిటిని లెక్కపెట్టడం చాల కష్టం. అవి లెక్కకు మించి ఉన్నాయి. అవన్నీ యాకోబు సొంతమే!

యాకోబు ఒక ప్రయాణం మొదలు పెట్టాడు. అలా వెళ్లమని అతనికి దేవుడే చెప్పాడు. అతని భార్యలూ పిల్లలూ కూడ అతనితో వస్తున్నారు. తన తండ్రి దేశానికి అతడు తిరిగి వస్తున్నాడు. అది దేవుడు వాగ్దానం చేసిన దేశం. కానాను అనే దేశం. అది చాల దూర ప్రయాణం. నెమ్మదిగా సాగుతున్నది. చిన్న పిల్లలూ, గొర్రెపిల్లలూ తొందరగ నడవ లేవుకదా.

చివరికి వాళ్లంతా అక్కడికి చేరుకున్నారు. యాకోబు సంతోషంగా ఉన్నాడా? అవుననుకో--- కాని---ఈ దేశంలో మరో వ్యక్తి కూడ నివసిస్తున్నాడు. అదెవరో నీకు తెలుసా? అతని అన్న ఏశావు. ఏశావు యాకోబు మీద చాల కోపంగ ఉన్నాడు. అసలతన్ని చంపాలనుకున్నాడు కదూ?

ఏశావు ఇంకా కోపంగానే ఉన్నాడా? అని యాకోబు ఆలోచిస్తున్నాడు. కాబట్టి తన సేవకులలో కొంత మందిని ముందు పంపించాడు. వాళ్లు ఏశావు దగ్గరకు వెళ్లాలి. కొంత సేపయ్యాక వాళ్లు తిరిగి వచ్చారు. చాల భయపడుతున్నట్టున్నారూ! వాళ్లు ఇలా చెప్పారు "ఏశావు వస్తున్నాడు. చాలమందితో వస్తున్నాడు. వాళ్లంతా బలంగా ఉన్నారు. చేతుల్లో బళ్లాలు, కత్తులు ఉన్నాయి.

యాకోబు చాల భయపడిపోయాడు. అతడు దేవునికిలా ప్రార్థన చేసాడు. "ఓ ప్రభువా, ఏశావు వస్తున్నాడు. బహుశా నన్ను చంపడానికేమో". యాకోబు తన భయాన్నంతా దేవునితో చెప్పుకున్నాడు.

మనం కూడ ఇలా చేయవచ్చు. మన భయాలను, విచారాలను, యాకోబులా, దేవునితో చెప్పుకోవాలి. ఏం జరిగిందో తెలుసా? "నేను ఏశావుకు మంచి బహుమానం పంపుతాను. అది చూసి అతనికి కోపం తగ్గవచ్చు" అని యాకోబు తలంచాడు. అతడు కొంత మంది సేవకులను ఏశావు దగ్గరకు పంపాడు. వాళ్లు

చాల ఆవులు, గొర్రెలు, మేకలు తీసుకవెళ్లారు. అది ఎంత గొప్ప బహుమానం! రాత్రి అయ్యింది. అందరూ నిద్రపోతున్నారు. అందరూనా? కాదు. యాకోబు నిద్రపోవడంలేదు. అతడు ఒంటరిగ బైట అటూ యిటూ తిరుగుతున్నాడు. అదేమిటి? హఠాత్తుగ అతని వైపు ఒక మనిషి వస్తున్నాడు. చాల విచిత్రమైన వ్యక్తి. అతడు యాకోబుతో కుస్తీపడుతున్నాడు! ఆ రాత్రంతా వాళ్లు పోరాడుతూనే ఉన్నారు. ఆ మనుష్యుడు యాకోబుకు కీడు చేయాలనుకుంటున్నాడా? అతన్ని చంపేద్దామను కుంటున్నాడా? లేదు లేదు. ఆయన ఎవరో నీకు తెలుసా? అది దేవుడే! వీరిద్దరిలో ఎవరు గెలుస్తారు? తప్పక దేవుడే. దేవుడు అందరి కంటె బలమయినవాడు. అయితే ఆయన గెలవడం లేదు. యాకోబు గెలుస్తున్నాడు. అదెలా సాధ్యం? దేవుడే యాకోబు గెలిచేలా చేసాడు. అందుకే యాకోబు మరింత బలవంతునిగ కనిపించాడు.

సూర్యోదయం కావస్తుండగ దేవుడే-యాకోబూ నన్ను పోనీయి, అన్నాడు.

అయితే అది దేవుడే అని యాకోబుకు తెలియడం వల్ల ''లేదు ప్రభువా, నన్ను ముందుగ ఆశీర్వదిస్తేనే కాని నేను నిన్ను పోనీయను'' అన్నాడు. యాకోబుకు ఏశావంటే చాల భయంవేస్తోంది దేవుడు మరి సహాయం చేస్తాడా? అతడెన్నో పాపాలు చేసాడు. అతడు మోసగానిగ ఉన్నాడు. దేవుడొక్కడే అతని పాపాలను క్షమించగలడు. ఆయన మాత్రమే అతనికి సహాయం చేయగలడు. అందుకనే యాకోబు దేవున్ని విడిచిపెట్టడంలేదు. అతడు వదలక ప్రార్ధన చేస్తున్నాడు! దేవుడతనికి సహాయం చేస్తాడా? అవును, చేస్తాడు, ఎందుకంటే యాకోబు హృదయ పూర్వకంగా ప్రార్థిస్తున్నాడు. అలాచేస్తే దేవుడు తప్పక వింటాడు.

దేవుడు యాకోబును దీవించాడు. తన పాపాలన్నీ క్షమించ బడ్డాయని అతనికిప్పుడు తెలుసు. తనకు ఆయన సాయం చేస్తాడని కూడ తెలుసు. ఇకపై ఏశావును గూర్చిభయపడనవసరం లేదు.

యాకోబుకు ఒక కొత్త పేరు వచ్చింది. చాల చక్కని పేరు. అతడికపై ''ఇశ్రాయేలు'' అని పిలవబడతాడు. అంటే అతడు దేవుని బిడ్డ అని అర్థం.

అదిగో ఏశావు! తన బలగమంతటితో వస్తున్నాడు. యాకోబుకిక భయంలేదు. అతడు ఏశావుకు ఎదురుగా వెళ్లాడు. చూడండి, మరి ఏశావు ఏం చేస్తున్నాడు? అతడు యాకోబును ముద్దు పెట్టుకుంటున్నాడు. అతని కోపమంతా మాయమయ్యింది. అతడు యాకోబుతో ప్రేమగ మాటలాడుతున్నాడు. ఇదెంత అద్భుతం!

దేవుడు యాకోబు ప్రార్థనాలకించాడు. మనం దేవునికి నిత్యం ప్రార్థన చేయాలి. యాకోబు వలెనే నిత్యం ప్రార్థించాలి. దేవుడు నిన్నుకూడ తన బిడ్డగ చేసికుంటాడు. యాకోబును చేసికొన్నట్టు. అప్పుడు నీవు నిజంగ సంతోషించగలవు.



21. యోసేపు

తండ్రి యాకోబుకు చాల మంది కుమారులున్నారు. అందరూ కలిసి పన్నెండు మంది అందరిలో మొదటి వాని పేరు రూబేను. అతడు అప్పుడే పెద్దవాడుగ ఉన్నాడు. అందరిలో చిన్నవాడి పేరు బెన్యామిను. బెన్యామిను చాల చిన్న బాలుడు. యోసేపు కూడ యాకోబు కుమారులలో ఒకడు. అతడు బెన్యామిను కంటె కొంచం పెద్దవాడని గుర్తుందా?

యాసేపు, బెన్యామీనుల తల్లి ఎవరో చెప్పగలరా? రాహేలు. అమె చచ్చిపోయింది. అది కూడ మీకు గుర్తుందని అనుకుంటాను. యాకోబు రాహేలును చాల ప్రేమించాడు! అందుకనే యిప్పుడు యోసేపు బెన్యామినులంటే అతనికి చాల ప్రేమ. అయితే అందరికంటే యోసేపంటే మరీ ప్రేమ!


యాకోబు ఇలా చేయడం సరికాదు. తల్లిదండ్రులు పిల్లలందరినీ సమంగా ప్రేమించాలి. యోసేపుకు తండ్రి అందమయిన బహుమతి యిచ్చాడు. అది ఒక రంగు రంగుల అంగీ.

మిగిలిన కొడుకులకు కూడ అలాంటి బహుమానం దొరికిందా? లేదు. యోసేపు ఒక్కనికే. అది యాకోబు



చేసిన పొరపాటు. సోదరులకు యోసేపు మీద అసూయకలిగింది. వాళ్లతనితో మంచిగా ఉండడం లేదు.

కొన్నిసార్లు సోదరులు చిలిపి పనులు చేసేవాళ్లు. మనం చేసిన పని నాన్నకు తెలియనంత వరకు ఫర్వాలేదు అని అనుకొనేవాళ్లు. ఇది యోసేపుకు విచారం కలిగించేది. ఎందుకంటే అతడు దేవుడ్ని ప్రేమించేవాడు. అతడు ఆయనకు భయపడేవాడు. అందువల్లనే వాళ్లు పాపం చేయడం చూచి విచారపడేవాడు. తన పాపాల కోసం ఇతరుల పాపాల నిమిత్తం విచారించే వాడు. యోసేపు అన్నలు చేస్తున్న పనులను గూర్చి తండ్రికి చెప్పేవాడు. అతడెందుకలా చేసేవాడు? ఎందుకంటే - ఒకవేళ ఈ విషయం తండ్రికి తెలుస్తుందనే భయంతో వాళ్ళు చెడ్డపనులు చేయడం మానేస్తారని. అయితే యోసేపు తండ్రితో చాడీలు చెబుతుండడం చూచి అన్నలతన్ని ద్వేషించారు. అతడంటే వాళ్లకి ఎంతమాత్రం యిష్టం లేదు. అదెంత విచారకరం! అన్నదమ్ములు అక్కచెల్లెళ్లు అందరూ కలిసి మెలిసి ఉండాలి. ఒకరినొకరు ప్రేమించుకోవాలి. దేవుడు కోరేది అదే.



ఒకరాత్రి యోసేపుకు ఒక అందమయిన కల వచ్చింది. తన అన్నలంతా పొలంలో పని చేస్తున్నారు. వాళ్లు ధాన్యం పనలుగ కడుతున్నారు. యోసేపు పన లేచి నిటారుగ నిలబడింది. మరి అతని అన్నలు కట్టిన పనలు ఏం చేస్తున్నవి? అవన్నీ యోసేపు పనచుట్టూ నిలబడ్డాయి. తరువాత అవన్నీయోసేపు పన రాజైనట్టు దాని ముందు మోకరించాయి. అదెంత చక్కని కల! యోసేపు ఈ కలను తన తండ్రికీ, అన్నలకీ చెప్పాడు. ఆహా, అతని అన్నలు ఇది విని చాల కోపం తెచ్చుకున్నారు. యోసేపును చూచి వాళ్లు-మేము నీ సేవకుల మనుకున్నావా? నీవు మాపై అధికారం చేస్తావా? మేం ఎంత మాత్రం అలా అనుకోము, అన్నారు.

యోసేపుకు మరో కలవచ్చింది. ఆ కలలో అతడు ఆకాశం పైకి చూస్తున్నాడు. అతడు సూర్యుడు, చంద్రుడు, పదకొండు నక్షత్రాలను చూచాడు సూర్యచంద్రులు అతని తల్లి దండ్రులు. పదకొండు నక్షత్రాలు అతని అన్నలు. అరే, ఏం జరుగుతున్నదో చూడండి! సూర్యచంద్రులు, నక్షత్రాలు అన్నీ యోసేపు ముందు మ్రొక్కుతున్నవి. మళ్లీ సరిగ్గ ముందు కలలో అతడు రాజైనట్టే.

ఈ కలను కూడ యోసేపు వాళ్లకి చెప్పాడు. ఇది విన్న అన్నలు మరింత కోపించారు. వాళ్లు యోసేపును ద్వేషించారు.

తండ్రి యాకోబు ఇలా అన్నాడు - యోసేపూ, నిజంగా మేమంతా నీకు మొక్కుతామని అనుకుంటున్నావా? నీవీ కలను మరిచిపోవడం మంచిది. అయితే యోసేపు దానిని మర్చిపోలేదు. ఆ కలలను దేవుడు పంపాడా? యోసేపు ఎప్పటికయినా రాజవుతాడా? దేవుడు చెప్పేదంతా, దేవుని వర్తమానం ఏదయినా సరే, అది నెరవేరుతుంది. దీని విషయంలో యాకోబుకు ఏ అనుమానం లేదు. మిగిలిన వాళ్లు చెప్పేవి అన్నివేళలా జరగకపోవచ్చు. మనుష్యులు చాల సార్లు మరిచి పోతారు. దేవుడు మాత్రం మరవడు. ఆయన చెప్పేది ఎప్పుడూ నెరవేరుతుందని గుర్తుంచుకో.

22. గోతిలో నున్న యోసేపు

ఒకసారి యోసేపు అన్నలు చాలదూరం వెళ్లారు. వాళ్లు గొర్రెలు కాస్తున్నారు. గొర్రెలకు మేతకోసం వాళ్లు వెతుక్కుంటూ వెళ్తున్నారు. యోసేపు ఇంటిలో ఉండిపోయాడు.

తండ్రి యాకోబు-యోసేపూ, నీవు అన్నలను చూచివస్తావా? ఇప్పటికి వాళ్లు వెళ్లి చాల కాలం అయ్యింది. వాళ్లేంచేస్తున్నారో, అని అన్నాడు.

కాబట్టి యోసేపు వెళ్లాడు. మొదట్లో అతని అన్నలు ఎక్కడా కనిపించలేదు. అయితే వాళ్లెక్కడ ఉన్నారో ఎరిగిన మనిషి కనిపించాడు. అవును, దూరాన వాళ్లతనికి కనిపించారు.

అన్నలు కూడ యోసేపును చూచారు. అతడు తన రంగుల అంగీవేసుకొని ఉన్నాడు. వాళ్లు ఒకరితో ఒకరు "ఎవరు వస్తున్నారో చూడండి. కలలు కనడంలో నేర్పరి వస్తున్నాడు" అని చెప్పుకున్నారు. వాళ్లిప్పుడు యోసేపును అలాగే పిలుస్తున్నారు. ఎందుకంటే అతనిపై వాళ్లకి కోపం యింకా తగ్గలేదు.

"వాడిని కొట్టి చంపేద్దామా? తరువాత గుంటలో పారేద్దాం" అని అన్నలు ఆలోచన చేసారు. పెద్దన్న రూబేను మాత్రం, "వద్దు అతన్ని చంపొద్దు. ప్రాణాలతో ఆగోతిలో పారవేద్దాం అన్నాడు."

ఆ తరువాత యోసేపును గోతిలో నుండి రక్షిద్దామని రూబేను అనుకున్నాడు.

యోసేపు అక్కడ ఉన్నాడు. అన్నల కళ్లల్లోని క్రోధాన్ని చూచాడు. అతనికి భయం వేసింది. ఆ ఇప్పుడు వాళ్లతనిని పట్టుకున్నారు. అతని రంగురంగుల అంగీని చింపేసారు. గోతి దగ్గరకి లాక్కుపోయారు. "దయ చేసి నన్ను వదిలిపెట్టండి" అని యోసేపు బ్రతిమాలాడు. వాళ్లతని మాట వినలేదు. గోతిలోకి తోసేసారు. అదృష్టం బాగుండి ఆ గోతిలో నీళులేవు. లేకుంటే యోసేపు అందులో మునిగిపోయేవాడే!

కాబట్టి అతడా లోతైన గొయ్యిలో పడిఉన్నాడు. అతడందులో నుండి పైకి రాలేడు. అతడు చాల భయపడ్డాడు. తన తండ్రి ఉంటే బాగుండును అనుకున్నాడు.

యోసేపుపైకి చూచాడు. నీలాకాశం చూసాడు. పైన పరలోకం ఉంది. దేవుడక్కడ ఉన్నాడు. దేవుడు నన్ను చూస్తున్నాడు - అనుకున్నాడు యోసేపు. కొందరు మనుష్యులు ఆ ప్రక్కగా వస్తున్నారు. వాళ్లు ఒంటెల మీద రకరకాల విలువైన, అందమైన వస్తువులతో వస్తున్నారు. వాళ్ళు వ్యాపారం చేసే వాళ్ళు. వాటిని దూర దేశంలో అమ్మి డబ్బు సంపాదిస్తారు.

వారిని చూచి అన్నలలో ఒకడు - ఒకవేళ ఈవర్తకులు యోసేపును కొంటారేమో, అన్నాడు. అన్నలు వాళ్లతో మాట్లాడారు. ఆ సమయంలో రూబేను అక్కడ లేడు. బహుశ తప్పు దోవలో వెళ్లిన గొర్రెలను చూడ్డానికి అతడు వెళ్లి ఉండవచ్చు.

అవును, ఆ వర్తకులు యోసేపును కొంటామన్నారు. అన్నలంతా తొందరగా గోతి దగ్గరకు వెళ్లారు. వాళ్లు యోసేపు కోసం ఒకత్రాడు కిందికి వేసారు. దానితో అతన్ని గోతిలో నుండి బైటికి తీసారు. యోసేపు ఎంతో సంతోషపడ్డాడు.

అయితే వర్తకులు యోసేపును ఒక ఒంటెకు కట్టారు. వాళ్లు-త్వరత్వరగ నడువు అని యోసేపును గద్దించారు.

ఒంటెలు నడవడం మొదలు పెట్టాయి. యోసేపు కూడ వాటి వెనుక నడుస్తున్నాడు "నన్ను పోనీయండి, నా తండ్రిని చూడాలి" అని యోసేపు మొరపెట్టాడు. అయితే అతని ఏడ్పును ఎవ్వరూ లెక్కచేయలేదు. పాపం, యోసేపు! కొంతసేపటికి రూబేను తిరిగివచ్చాడు. గోతిలోకి చూచి నిర్ఘాంత పోయాడు. యోసేపు అక్కడ లేడు! "యోసేపు ఎక్కడ"? అని ప్రశ్నించాడు.

"మేము అతన్ని అమ్మేసాము" అన్నారు అన్నలు. జరిగినదంతా వాళ్లు చెప్పారు. రూబేను ఆశ్చర్యపోయాడు.

"అయ్యో, నాన్న యాకోబు చాల దుఃఖపడతాడు. తండ్రికి యేమని చెప్పాలి?" అంటూ భయపడ్డాడు. వాళ్లొక పథకం వేసారు. తాము చాల తెలివిగల వాళ్లమని అనుకున్నారు. అయితే అదో నీచమైన పథకం.

మరి వాళ్లేం చేసారు? వాళ్లొక మేక పిల్లను చంపారు. తర్వాత యోసేపు రంగుల అంగీని ఆ రక్తంలో

ముంచారు. ఒక సేవకుడు ఆ మురికి అంగీని తండ్రి యాకోబు దగ్గరకు తీసుకుపోయాడు.


తండ్రి యాకోబు చాల భయపడ్డాడు. "ఇది యోసేపు అంగీ. దీని నిండా రక్తం మరకలున్నాయేమిటి? అయ్యో, ఏదో అడవి జంతువు యోసేపును చంపేసింది" అన్నాడు. యాకోబు చాల దుఃఖించాడు "నా కుమారుడా, యోసేపూ, అతడిక నా దగ్గరకు రాడు" అంటూ ఏడ్చాడు.

అన్నలు యింటికి వచ్చారు. వాళ్లు చేసిన దానిని గురించి ఏమీ చెప్పలేదు. వాళ్లు కూడ విచారంగా ఉన్నట్టు నటించారు. తమ తండ్రినలా మోసం చేసారు.


అయితే దేవుడు అంతా చూచాడు.

మనం కూడ ఇలాంటి నీచమైన పథకాలు వేస్తున్నామా? ఇతరులను ఎప్పుడయినా మోసం చేస్తున్నామా? యోసేపు సోదరులు చేసినట్టు?

ఒకటి మాత్రం గుర్తుంచుకోండి. దేవుడు అన్నీ గమనిస్తాడు. ఆయనకు సమస్తం తెలుసు. కీడు నుండి తప్పించుమని మనం ఆయనను ఎల్లప్పుడూ అడగాలి. ఎందుకంటే మనహృదయాలు దుష్టత్వంతో నిండి ఉన్నాయి. యోసేపు సోదరుల హృదయాల వలెనే!



23. ఐగుప్తులో యోసేపు



పాపం యోసేపు! అతన్ని దూరదేశం తీసుకు పోయారు. దాని పేరు ఐగుప్తు. అదెంత విచారకరమైన, దీర్ఘ ప్రయాణం!

ఆ దేశంలో ఒక ధనవంతుడున్నాడు. అతడు రాజాధికారులలో ముఖ్యుడు. అతనిపేరు పోతీఫరు. ఈ పోతీఫరు ఒక గొప్ప భవనంలో నివసిస్తున్నాడు. ఆయన దగ్గర పని చేయడానికి చాల మంది పని వాళ్లున్నారు. వాళ్లంతా బానిసలు, పోతీఫరు ఎలా చెప్పితే వాళ్లలా చేయాలి. ఎందుకంటే వాళ్లందర్నీ అతడు కొన్నాడు. చెప్పిన మాట వాళ్లు వినకపోతే? ఒకవేళ బద్ధకం చూపిస్తే? అలా చేస్తే వాళ్లని కొరడాతో కాని కర్రతోకాని కొడతారు.

యోసేపు కూడ పోతీఫరు ఇంటికి వచ్చాడు. అతడు యోసేపును కొన్నాడు. అందువల్ల యోసేపు చాల కష్టపడి పని చేయాలి. అసలు యోసేపు ఎప్పుడూ మంచిగా పని చేస్తాడు. అతనెప్పుడూ లోబడి ఉంటాడు. అతడెన్నడూ బద్ధకం చూపడు. అతడలా ఉండాలని దేవుని కోరిక. అది యోసేపుకు తెలుసు. దేవుని ఇష్టాన్ని చేయడమే యోసేపుకు ఇష్టం. మనం కూడ బద్ధకంగ ఉండకూడదు. మనం ఎప్పుడూ చురుగ్గా ఉండాలని ఆయన కోరుతున్నాడు.

యోసేపు మంచిసేవకుడని పోతీఫరు గమనించాడు. ''ఇలాంటి మంచి బానిస నాకెప్పుడూ లేడు. యోసేపు అన్ని విషయాలూ చక్కగ చూసుకుంటాడు'' అని అతడు అనుకున్నాడు.

పోతీఫరు మరోవిషయం కూడ గమనించాడు. అదేమో నీకు తెలుసా? తోటలో ఉన్న చెట్లన్నీ చక్కగా ఎదుగుతున్నవి. శాలలో పశువులు ఆరోగ్యంగా ఉన్నాయి! అవును, దేవుడే అలా చేసాడు. ఎందుకంటే యోసేపు దేవునితో జీవిస్తున్నాడు. దేవుడు పోతీఫరును కూడ దీవించాడు.

ఒకనాడు పోతీఫరు యోసేపు తోయిలా అన్నాడు. ''యోసేపూ నీవు నా ఇంటి అంతటిపై అధికారిగ

ఉండాలి. నా బానిసల మీద కూడ అధికారివై వాళ్లు చక్కగ పనిచేసేలా చూడాలి. వాళ్లు నీకు లోబడాలి''.

ఇది యోసేపుకు సంతోషం కలిగించింది. దేవుడు తనను గమనిస్తున్నాడని అతడెరుగును. ఆయనే అతనిని దీవిస్తున్నాడు.

అన్నీఉన్నా యోసేపు తండ్రిని మాత్రం మరిచిపోలేక పోతున్నాడు. రాత్రి మంచంమీద పడుకొనినపుడు తండ్రిని గూర్చి తలంచుతాడు. తండ్రి దగ్గరికి మళ్లీ వెళ్లాలని చాల ఆశిస్తాడు. అలాంటి సమయంలో అతడు ప్రార్థిస్తాడు. దేవుడ్ని అడుగుతాడు, ఎందుకంటే ఆయన చేయలేనిది ఏదీలేదని యోసేపుకు తెలుసు?



అందమయిన పోతీఫరు ఇంటిలో మరొకరు కూడ నివసిస్తున్నారు. అది పోతీఫరు భార్య. ఇప్పుడామెకు తన భర్త అంటే ప్రేమ లేదు. ఆమె యోసేపునే చూస్తూ ఉంటుంది. ''యోసేపు నా భర్త అయితే బాగుండును'' అని అనుకుంటుంది.

అది మంచి ఆలోచనకాదు. అది పాపం!

ఒకదినం పోతీఫరు ఇంటిలో లేనపుడు ఆమె యోసేపు దగ్గరకు వెళ్లింది. ఆమె అతనితో ''యోసేపూ, నా గదిలోనికి రా. నీవునా భర్తగ ఉండాలి'' అన్నది.

యోసేపు అదిరిపోయాడు. ''మనం అలా చేయకూడదు. నీవు పోతీఫరు భార్యవు. అతనిని మోసం చేయకూడదు'' అన్నాడు.

''ఆ దానిలో ఏం ఉంది. మనం చేసేది పోతీఫరుకు తెలియదు'' అని జవాబిచ్చింది.

''దేవుడు దీనిని చూస్తాడు. మనం ఇలా చేయడం ఆయనకిష్టం లేదు. దేవునికి విరోధంగా నేను పాపం చేయను'' అన్నాడు.

ఆమె యోసేపు మాట విన్నదా? లేదు. ఆమె మరునాడు అలాగే అడిగింది. మళ్లీ మళ్లీ అడిగింది. అయితే యోసేపు దేవునికి భయపడేవాడు. అతడు దేవునికి లోబడేవాడు. అతడు పోతీఫరు భార్య చెప్పిన చెడ్డ మాటలను వినలేదు.

ఒకదినం యోసేపు ఇంటిలో ఉన్నాడు. మిగిలిన పని వాళ్లెవరు లేరు. హఠాత్తుగ పోతీఫరు భార్య లోనికి వచ్చి యోసేపు అంగీపట్టుకుంది.

''నీవు నా మాట వినాలి. నేను చెప్పినట్టు చేయాలి'' అన్నది.

అయితే యోసేపు తన అంగీ విడిపించుకొని, దాన్ని ఆమె చేతిలో వదిలి పారిపోయాడు. యోసేపు తప్పించుకున్నాడు. అతడు శోధనలో పడకుండ దేవుడు తప్పించాడు.

బహుశ కొన్నిసార్లు ఒకానొకరు ''ఈ ఒక్కసారి ఇలా చేయి, ఎవ్వరూ చూడరు'' అని మనతో అంటే మనం వాళ్ల దగ్గర్నుంచి పారిపోవాలి. యోసేపులా. అప్పుడు దేవుడు మనలను కూడ పాపం నుండి రక్షిస్తాడు.

ఇప్పుడు పోతీఫరు భార్య యోసేపు అంగీ చేతితో పట్టుకొని ఉంది. ఆమె యోసేపు మీద ఎంత కోపంగా ఉందోతెలుసా? ఆమె కళ్లు నిప్పులు కురిపిస్తున్నది. ''యోసేపు నాకు కీడు చెయ్యాలని ప్రయత్నించాడు'' అని అబద్ధం చెప్పింది. అది నీచమైన పని. ఆమె అబద్ధం చెబుతోంది.

కొంతసేపటికి పోతీఫరు ఇంటికి వచ్చాడు. ఆమె అతనికి కూడ అబద్ధమే చెప్పింది.

''యోసేపు చెడ్డవాడు. అతడు నాతో పండుకోవాలని చూచాడు. నేనతని భార్యనయినట్టు అతడు నిన్ను మోసం చేయాలనుకున్నాడు. ఇది నిజం, అతని అంగీనాదగ్గరుంది'' అని చెప్పింది.

పోతీఫరు ఆమె మాటలను వెంటనే నమ్మాడు.

అతనికి చాల కోపం వచ్చింది. తన సేవకులను పిలిచి ''వీడ్ని ఖైదులో వేయండి'' అన్నాడు. యోసేపును జైలులో వేసారు. అదో చిన్న చీకటి గది తలుపుకు తాళం ఉంది. అతడు బైటికి రాలేడు ఇప్పుడు యోసేపు దొంగలా జైలుపాలయ్యాడు. అందరూ అతని గురించి అలాగే అనుకొని ఉంటారు.

అందరూనా? లేదు. దేవుడు సమస్తం చూచాడు. అంతావిన్నాడు. యోసేపు పాపం చేయలేదని ఆయన ఎరుగును. దేవుడు యోసేపుతో ఉన్నాడు.

నీవు యోసేపులా ఉండాలని దేవున్ని అడుగు. దేవుని భయం అతని హృదయంలో ఉంది. అందుకని అతడు పాపం చేయలేదు. సహజంగా మన హృదయాలు కూడ పోతీఫరు భార్యకున్న హృదయాల వంటివే. మనలోకూడ యోసేపులా దేవుని భయం ఉండాలి.

24. చెరసాలలో యోసేపు

ఇప్పుడు యోసేపు చెరసాలలో ఉన్నాడు. ఒక చిన్న చీకటి గదిలో. అక్కడ ఏమీ మంచిగ లేదు. చెరసాలలో మరికొందరు కూడ ఉన్నారు. వాళ్లెవరూ చెరసాల విడిచి బయటికి వెళ్లడానికి వీలు లేదు. తలుపులు ఎప్పుడూ తాళం వేసి ఉంటాయి. చాల సార్లు ఖైదీలు కోపగిస్తారు. అయితే అది వాళ్ల తప్పే. ఎందుకంటే వాళ్లు తప్పపనులు చేసారు. బహుశ దొంగతనం చేసి ఉండవచ్చు లేదా ఎవరినైనా చంపారేమో. ఇది వాళ్లకు పడిన శిక్ష.

ఇప్పుడు యోసేపుకూడ జైలులో ఉన్నాడు. అయితే అతడు ఏ తప్పు చేయలేదు. అతడు ఏ శిక్షకూ అర్హుడు కాడు. అయినా అతడక్కడ ఉండవలసి వచ్చింది. అది యోసేపుకు ఎంత భయంకరం. అతడు పాపం చాల విచారంలో ఉండి ఉండవచ్చు.

అవును...కాని అతడ నిరాశలో పడిపోలేదు. ఎందుకో తెలుసా? దేవుడు అతన్ని గుర్తుంచుకున్నాడు. ఖైదులో కూడ దేవుడతనితో ఉన్నాడు. ''దేవుడు నన్ను చూస్తున్నాడు. ఆయన ఈ ఖైదు నుండి నన్ను విడిపిస్తాడు. నేనాయన కోసం కనిపెడతాను. నేను ఓపిక చూపించాలి'' అని యోసేపు అనుకున్నాడు. యోసేపు కోపగించలేదు.

జైలు అధికారి యోసేపును గమనించాడు. జైలులోని మిగిలిన వాళ్లకీ యోసేపుకీ చాల భేదం ఉందని అతడనుకున్నాడు. యోసేపు దొంగైయుండడు. అతడు ఎవర్నీచంపిఉండడు. కొంతకాలం అయ్యాక ఆ జైలు అధికారి యోసేపుతో -యోసేపూ, నీవు నా సహాయకుడవుగా ఉండు. నీవు మిగిలిన ఖైదీలకు భోజనం తీసికెళ్లవచ్చు. నీవు అన్ని విషయాలూ చక్కబెట్టవచ్చు, అన్నాడు.

ఇది యోసేపుకు ఆనందం కలిగించింది. ఇప్పుడతడు దినమంతా ఆ చిన్న చీకటి గదిలోనే ఉండనవసరంలేదు. జైలు అధికారి యోసేపుతో స్నేహంగా ఉంటున్నాడు. యోసేపు ఇలా అనుకున్నాడు-దేవుడే ఇది చేసాడు. ఆయన నాకు మేలు చేసాడు. యోసేపు శక్తివంచన లేకుండ పని చేసాడు, అయినా అతడింకా ఖైదులోనే ఉన్నాడు.

ఒకనాడు ఇద్దరు మనుష్యులు జైలులోకి వచ్చారు. అందులో ఒకడు రాజు రొట్టెలు కాల్చేవాడు. రాజుతినే రొట్టెలను అతడే తయారు చేస్తాడు. అవి చాల రుచిగ ఉంటాయి. రెండవ వాడు రాజుకు ద్రాక్షారసం అందించేవాడు. రాజు త్రాగడానికి మంచి ద్రాక్షారసాన్ని అతడు సిద్ధం చేస్తాడు. వీరిద్దరినీ రాజు జైలులో పెట్టాడు. రాజు వారిపై కోపంగా ఉన్నాడు. వాళ్లేమయినా



తప్పపని చేసారా? ఒక ఉదయం వీళ్ళిద్దరూ ఉన్న గదిలోకి యోసేపు వచ్చాడు. అయితే వాళ్ళిద్దరూ అంత విచారంగా ఉన్నారెందుకని? "మీరెందుకు విచారంగా ఉన్నారు"? అని యోసేపు ప్రశ్నించాడు.

"మా ఇద్దరికీ కలలు వచ్చాయి, కాని మాకు వాటి అర్థం తెలియదు. అది తెలుసుకోవాలని మా ఆశ. కాని ఎవ్వరూ చెప్పలేకపోయారు" అన్నారు.

"అయితే దేవుని కది తెలుసు. కలయేమిటో నాకు చెప్పండి" అన్నాడు యోసేపు.

మొదట ద్రాక్షరసం చేసే సేవకుడు తన కల చెప్పాడు. "ద్రాక్ష తీగలపై ద్రాక్షపండ్లు చూచాను. అవి మూడు తీగలు. వాటి నుండి ద్రాక్షపండ్లు కోసిరసం తీసాను. అది మంచి ద్రాక్షారసం. దానిని పాత్రలో పోసి రాజు త్రాగడానికి అందించాను".

అప్పుడు యోసేపు ఆ కల అర్థం ఇలా వివరించాడు. అతనికి ఎలా తెలుసు? దేవుడు అతనికి చెప్పాడు. "మూడు దినాల్లో నీకు ఖైదు నుండి విడుదల కలుగుతుంది. నీవు తిరిగి రాజుకు సేవ చేస్తావు. అతనికి గిన్నె అందిస్తావు" అని చెప్పాడు.

రాజుకు గిన్నె అందించే అతనికి చాల ఆనందం కలిగింది. తరువాత యోసేపు మరో సంగతి కూడ చెప్పాడు. "నేనే తప్ప చేయలేదు. నేనీ ఖైదునుండి విడుదల పొందాలని కోరుతున్నాను. నేను కూడ నీలా విడుదలపొందగలిగేలా నీవుదయచేసి రాజుతో మనవి చేయగలవా?"

"తప్పక చేయగలను" అన్నాడు ఆ సేవకుడు. తరువాత రొట్టెలు కాల్చేవాడు కూడ యోసేపుకు తన కల చెప్పాడు-నేను నాతలపై మూడు గంపలు మోస్తున్నాను. పై గంపలో రొట్టెలు, భక్ష్యాలు ఉన్నాయి. అప్పుడు పక్షులు వచ్చి అన్నీ తినేసాయి" యోసేపు దుఃఖముఖంతో - మూడు దినాల్లో నీకూ విడుదల కలుగుతుంది. అయితే నిన్ను చంపుతారు" అని చెప్పాడు.

యోసేపు చెప్పినట్టే సమస్తం జరిగింది. రొట్టెలు చేసేవాడిని చంపేసారు. ద్రాక్షరసం అందించే వానికి తిరిగి అతని పని దొరికింది. "ఇప్పుడు బహుశ నాకు కూడ విడుదల కలుగుతుంది. రాజుకు గిన్నె నిచ్చేవాడు రాజును అడుగుతాడు" అని యోసేపు అనుకొని చాల దినాలు కనిపెట్టాడు. కాని అలా జరుగలేదు. ఎందుకంటే అతడు యోసేపును పూర్తిగ మరిచిపోయాడు. అది సరికాదుకదా. యోసేపుకు సాయం చేస్తానని చెప్పి అతడు చేయలేదు. అతడు యోసేపుకు సహాయం చేయలేదు. యోసేపు దేవునిపై ఆధారపడాలి, ఆయన్నే నమ్మాలి. దేవుడు యోసేపుని మరువడు. కాబట్టి అతడు దేవుని కోసం ఓపికతో కనిపెట్టాలి.

మనంకూడ ఇతరులను నమ్మకూడదు. దేవున్ని ఏం ప్రార్థించాలో నీకు తెలుసా? "దేవా, నిన్ను నమ్మడం ఎలాగో నాకు బోధించు. నీకోసం కనిపెట్టడం నాకు నేర్పించు" అని ప్రార్థించాలి.



25. యోసేపు దేశమంతటిమీద అధికారిగా నియమింపబడుట

ఐగుప్తులో ఒక అందమైన, పెద్ద రాజ భవనం ఉంది. అక్కడ రాజు నివసిస్తాడు. అతడే ఫరో. అతడు అందరి మీద ఉన్న పరిపాలకుడు. అందరూ అతని మాట వినాలి. ఫరోకు చాల మంది సేవకులున్నారు. వాళ్లంతా రాజు కోసం పని చేయాలి. వారతనికి సేవ చేయాలి.

అది రాత్రి వేళ. అందరూ నిద్రపోతున్నారు. రాజుకూడ. నిద్రలో ఉన్నాడు. అతడు కల కంటున్నాడు. ఆ కల యేమిటో నీకు తెలుసా? సరే, విను. రాజు నది ఒడ్డున నిలబడి ఉన్నాడు. ఏడు ఆవులు నీళ్లలో నుండి బైటికి రావడం అతడు చూచాడు. అవి పెద్దగ బలంగ ఉన్నాయి. చూడండి, అవి నీటి నుండి ఒడ్డు మీదికి ఎక్కివస్తున్నాయి. అవి రుచికరమయిన గడ్డి తినబోతున్నాయి. అప్పుడు రాజు మరో ఏడు ఆవులు నీటినుండి రావడం చూచాడు. అయితే ఇవి చాల సన్నగా ఉన్నాయి. ఓ, అవి ఎంత సన్నగ అసహ్యంగా ఉన్నాయో!

ఈ సన్నని ఆవులు, బలిసిన ఆవుల దగ్గరకు వచ్చాయి. అవి బలిసిన ఆవులను తినేసాయి! అయినా అవి సన్నగానే ఉన్నాయి.

రాజు నిద్రలేచాడు. అదెంత విచిత్రమయిన కల! కొంత సేపయ్యాక రాజు మళ్లీ నిద్రపోయాడు. అతడు కలలో ఏడు వెన్నులు ఒకదంటున పుట్టడం చూచాడు. అవి ధాన్యంతో నిండి ఉన్నాయి. కొంచం సేపటికి మరో దంటు పుట్టడం రాజు చూచాడు. అయితే ఈ వెన్నుల్లో ధాన్యం లేక పీలబడి ఉన్నాయి. చూడండి, ఈ సన్నని వెన్నులు బలమైన వెన్నులను తినేసాయి.

రాజు నిద్రలేచాడు. ఈసారి అతనికి మళ్లీ నిద్ర పట్టలేదు. అతడా కలలను గురించి ఆలోచిస్తున్నాడు. వీటి అర్థం ఏమిటి?

తెల్లవారింది. రాజభవనానికి చాల మంది ప్రముఖులు వస్తున్నారు. వాళ్లు మంత్రగాళ్లు, శాస్త్రాలు తెలిసిన వాళ్లు. వాళ్లంతా రాజును చూడ్డానికి వచ్చారు.

"నా కలల అర్థం యేమిటి?" అని రాజు వాళ్లని ప్రశ్నించాడు. ఎవ్వరూ జవాబివ్వలేదు. జ్ఞానులు దీర్ఘా లోచనలో పడ్డారు. అయితే ఎవ్వరూ యేమీ చెప్పలేదు. ఆకలల అర్థం యేమిటో ఎవ్వరికీ తెలియలేదు.

వినండి, ఎవరో మాట్లాడుతున్నారు. అది రాజుకు ద్రాక్షారసం అందించే వాడు. అతడు నీకు గుర్తున్నాడా? అతడు యోసేపుతో పాటు ఖైదులో ఉన్నాడు. అతడు యోసేపును గూర్చి పూర్తిగ మరిచిపోయాడు. అయితే ఇప్పుడు అతనిని గుర్తు చేసుకున్నాడు. అతడు రాజుతో "రాజా, నాకో వ్యక్తి తెలుసు. అతడు చెరసాలలో ఉన్నాడు. ఈ కలల అర్థం అతనికి తప్పక తెలుస్తుంది" అన్నాడు. రాజు "యోసేపు వెంటనే నన్ను చూడ్డానికి రావాలి. వెళ్లి అతన్ని చెరసాల నుండి తీసుకురండి" అన్నాడు.

వెంటనే సేవకులు వెళ్లారు. త్వరలో చెరసాలను చేరుకున్నారు. "యోసేపూ, నీవు రాజు దగ్గరకు రావాలి" అన్నారు. తాను రాజును ఎందుకు కలవాలో యోసేపుకు ఎంత మాత్రం తెలియలేదు. అయితే రాజు రమ్మన్నాడు కనుక తప్పక వెళ్లాలి. మొదట యోసేపుకు కొత్త బట్టలు ఇచ్చారు. అతని తల వెంట్రుకలను కత్తిరించారు. రాజు దగ్గరకు వెళ్లడానికి అతడు పరిశుభ్రంగా ఉండాలి.

అదుగో, అతడు వెళ్తున్నాడు. చెరసాలకు దూరంగా రాజభవనానికి వెళ్తున్నాడు.

రాజు అతన్ని చూసి "యోసేపూ, నా కలలకు అర్థం నీవు చెప్పగలవా?" అని ప్రశ్నించాడు. దానికి యోసేపు "లేదు రాజా, నేను చెప్పలేను. కాని దేవుడు చెప్పగలడు" అన్నాడు.


ఫరో తన కలలను యోసేపుకు వినిపించాడు. యోసేపు విన్నాడు. అవును, ఆ కలల అర్థం అతనికి తెలిసింది. దేవుడు దానినతనికి చెబుతున్నాడు. యోసేపు రాజుతో "రాజా, ఆ ఏడు బలిసిన ఆవులు ఏడు మంచి సంవత్సరాలకు గుర్తు. ఆ కాలంలో ధాన్యం దండిగ పండుతుంది. ఈ చిక్కిపోయిన ఏడు ఆవులు కూడ ఏడు సంవత్సరాలను సూచిస్తున్నాయి. ఈ ఏడు మంచి సంవత్సరాల తరువాత ఏడు చెడు సంవత్సరాలు

వస్తాయి. ఆ సమయంలో పొలంలో పంటలు పండవు. తినడానికి తగిన ఆహారం ఉండదు. కరవు వస్తుంది. బలమైన, సన్నని కంకులను గూర్చిన కల యొక్క అర్థం కూడ అదే" అని చెప్పాడు. అందరూ నిశ్శబ్ధంగ విన్నారు. రాజు కూడ యోసేపు మాటలు విన్నాడు. అయితే యోసేపు ఇంకా ఇలా చెప్పాడు. "రాజా, నీవు పెద్ద గోదాములు కట్టించాలి. వాటిని ధాన్యంతో నింపాలి. ఆ ఏడు మంచి సంవత్సరాల్లో చాల పంట పండుతుంది. మరి పంటపండని ఏడు సంవత్సరాల మాటయేమిటి? అప్పుడు ప్రజలు గోదాములలో నుండి ధాన్యం తీసుకోవచ్చు. దీనంతటినీ చూడ్డానికి ఓ తెలివిగల మనిషిని నీవు నియమించాలి". ఫరో ఈ మాటలకు చాల సంతోషించాడు. అవును యోసేపు నిజం పలికాడు. అప్పుడు ఫరో యిలా అన్నాడు-యోసేపూ, నీవు చాల తెలివైన వాడివి, నీవే ఆ గోదాములు కట్టేలా చూడాలి. వాటిని ధాన్యంతో నింపించాలి. యోసేపూ, నీవే నా ఇంటి అంతటి మీద ముఖ్యాధికారివి".

ఆ, యోసేపు ఆ మాటలు నమ్మలేకపోయాడు! అయితే అవి నిజమైన మాటలు! యోసేపుకు మంచి ఖరీదయిన వస్త్రాలు తొడిగారు. అవి రాజుకు తగినవి. అతనికో చక్కని రథాన్ని ఏర్పాటు చేసారు. ప్రజలంతా అతని ముందు మోకరించాలని రాజు ఆజ్ఞాపించాడు. వాళ్లంతా అతని మాట వినాలి.

యోసేపు నివసించడానికో చక్కని ఇల్లు కూడా ఏర్పాటయింది. అతడు ఒక మంచి పిల్లను వివాహమాడాడు. అతడు మెడలో బంగారు గొలుసు ధరించాడు!

అంతా ఎలా మారిపోయింది-అనుకున్నాడు యోసేపు. మొదట నేను ఖైదులో ఉన్నాను ఇప్పుడయితే ఫరో ఇంటికి అధికారినయ్యాను. ఇదంతా ఎలా జరిగింది? దేవుడే దీనిని చేసాడు. ఆయన ఎంత మంచివాడు!



ప్రజలంతా నామాటవినాలి. వాళ్లు నా ముందు మోకరించాలి, నన్ను సేవించాలి. అయితే నేను దేవుని మాట వింటాను. నేనాయన యెదుట మోకరించి ఆయనను సేవిస్తాను, అనుకున్నాడు.

మనం కూడ అలా చేయగోరుతున్నామా? స్వభావసిద్ధంగా మన మనసు దీనిని ఒప్పుకోదు. అయితే అది నూతన పరచబడితే మనం కూడ యోసేపులా చేయాలని ఆశిస్తాము!

26. కోపించిన అధికారి

ఐగుప్తు ప్రజలు కష్టపడి పని చేస్తున్నారు! వాళ్లు పంట కోస్తున్నారు. పంట చాల అధికంగా పడింది. ధాన్యంనుండి రొట్టెలు చేయవచ్చు, కాని చాల ధాన్యం మిగిలింది. అవును, మంచి సంవత్సరాలు వచ్చాయి. ఫరో కన్నకలలు గుర్తున్నాయా? ఆ బలిసిన ఆవులు, బలమైన వెన్నులు? దేవుడే ఆ కలలు పంపాడు. అందువల్లనే అవి జరుగుతున్నాయి. యోసేపు గోదాములు కట్టించాడు. మిగిలిన ధాన్యమంతా అందులో దాచి పెట్టారు.

ఏడు దీర్ఘసంవత్సరాలు గడిచిపోయాయి. ఆ తరువాత ఏం జరుగుతున్నదో తెలుసా? చూడండి, పొలంలో ఏమీ పండడం లేదు. అందువల్ల కోతలే లేవు! చెడ్డ సంవత్సరాలు వచ్చాయి.

బక్కచిక్కిన ఆవులు గుర్తున్నాయా? ఆ పీల వెన్నులు? ప్రజలు తినగానికి ఏమీ లేదు. ఇప్పుడు వాళ్లేం చేయాలి? ఫరో "యోసేపు దగ్గరకు వెళ్లండి. అతని గోదాముల్లో కావలసినంత ధాన్యం ఉంది". ప్రజలు అలాగే చేసారు. వాళ్లిపుడు ధాన్యం కొనుక్కోవచ్చు. అది కాస్తనయం. వాళ్లు చావనవసరంలేదు.

కానాను దేశంలో ధాన్యం లేదు. ఈ దేశంలో కూడ ప్రజలు ఆకలితో మాడిపోతున్నారు. యాకోబు ఇక్కడ జీవిస్తున్నాడు. యాకోబు కొడుకులు కూడ అక్కడే నివసిస్తున్నారు. వాళ్లు ఆకలితో బాధపడవలసినదేనా? వాళ్లేం చేయాలి? యాకోబు తన కొడుకులతో యిలా అన్నాడు-మీరు ఈజిప్టుకు వెళ్లండి. అక్కడ కావలసినంత ఆహారం ఉంది. కాబట్టి యోసేపు సోదరులు బయలు దేరారు. అయితే బెన్యామీను వాళ్లతో పోలేదు. తండ్రి యాకోబు అతన్ని పంపలేదు. అతనికి బెన్యామీను అంటే చాల ఇష్టం. దారిలో ఏమన్నా ప్రమాదం జరిగితే? లేదులేదు. బెన్యామీను ఇంటి వద్దనే ఉండాలి.

అది సుదీర్ఘమయిన ప్రయాణం సోదరులు గాడిదలెక్కి, వారితో ఖాళీ సంచులు తీసుకువెళ్లారు. ధాన్యం కొనడానికి డబ్బుకూడ తీసికెళ్లారు.

చివరికి వాళ్లు ఐగుప్తు చేరారు. వాళ్లు గవర్నరు (అధికారి) భవనం చేరారు. అది తమ తమ్ముడు యోసేపు అని వారికి తెలియదు. వాళ్లు అతనిని గుర్తుపట్టలేదు. అయితే యోసేపు గుర్తుపట్టాడు. ఇప్పుడతడు చాల మారిపోయాడు. యోసేపు మాత్రం తన అన్నలను గుర్తించాడు. చాల కాలం క్రిందట వాళ్లు తనను ఒక గోతిలో పడేసారు. అమ్మేసారు. అయినా యోసేపు వాళ్లమీద కోపగించలేదు. తన అన్నలను తిరిగి చూచినందుకు ఎంతో సంతోషించాడు. సోదరులు అతని ముందు మోకరించారు. యోసేపుకు వచ్చిన కలలు మీకు గుర్తున్నాయా? అవిప్పుడు నిజమవుతున్నవి, ఎందుకంటే అవి దేవుడు పంపిన కలలు. తన అన్నల మనసులు ఇంకా కఠినంగా ఉన్నాయా, లేదా అని యోసేపు తెలుసుకోవాలనుకున్నాడు. అందువలన అతడు వాళ్లతో కఠినంగా మాట్లాడాడు. అతడు మీరెవరు? అని అడిగాడు.



అన్నలు అతనితో సమస్తం చెప్పారు. వాళ్లు తమ తండ్రిని గురించీ, ఇంటిలో ఉన్న బెన్యామీను గురించీ చెప్పారు. అంతేకాక ఇప్పుడు బ్రతికి ఉండని...మరో తమ్ముడు గురించి కూడ చెప్పారు.

యోసేపు చాల కోపంగ కనిపించాడు. అతడు వాళ్లతో నేను మీ మాటలు నమ్మను. మీరు వేగులవాళ్లు. మా దేశాన్ని వేగు చూడ్డానికి వచ్చారు. ఆ తరువాత మీరు సైన్యం తీసుకొని వస్తారు. మాతోయుద్ధం చేస్తారు" అన్నాడు.

అన్నలు భయంతో వణికి పోయారు. "అయ్యా, నిజంగా మేము వేగుల వాళ్లం కామండీ" అన్నారు. అయినా లాభం లేకపోయింది. యోసేపు తన సేవకులతో-వీళ్లని జైలులో వేయండి అన్నాడు. వాళ్లు అక్కడమూడు రోజులు ఉన్నారు. వాళ్లు జైలు బయటికి వచ్చాక యోసేపు వాళ్లతో కఠినంగా మాటలాడాడు-మీరు ఇంటికి వెళ్లవచ్చు కాని మీలో ఒక్కడు ఇక్కడ ఉండాలి. మీరు వెళ్లి మీచిన్న తమ్ముణ్ని మీతో తీసుకురావాలి. అప్పుడు నేను మిమ్ములను నమ్ముతాను. అప్పుడు మీరు అబద్ధం చెప్పలేదని తెలుసుకుంటాను అన్నాడు.

అబ్బ, అన్నలు ఎంత భయపడ్డారో! వాళ్లు ఒకళ్లతో ఒకళ్లు-మనం చేసిన తప్పుకు ప్రతిఫలం ఇది. మనం యోసేపును చాల బాధపెట్టాం. అందుకే మనకీ శిక్షవచ్చింది-అని చెప్పుకున్నారు.



ఈ మాటలు మీరు విన్నారా? సోదరులు తాము చేసిన పాపాన్ని గురించి తలస్తున్నారు. ఇదిసరైనపని. మనం కూడ మన పాపాలను గురించి ఆలోచించాలి. యధార్థమయిన మనసుతో వాటిని దేవుని ఎదుట ఒప్పుకోవాలి.

వాళ్లు వేరే భాషలో మాట్లాడినా యోసేపు అర్థం చేసుకున్నాడు. అతడిలా అనుకున్నాడు-నా అన్నలు తాము చేసిన తప్పును గుర్తించి విచారపడుతున్నారు. ఇది చూచి అతని హృదయం మెత్తబడింది. అతడు ఏడ్వడం మొదలు పెట్టాడు, అది తన అన్నలు చూడకూడదు. అతడు త్వరగా తన ముఖం ప్రక్కకు తిప్పుకున్నాడు.

వాళ్లలో ఒక అన్నని బంధించారు. అతని పేరు షిమ్యోను. అతడు చెరసాలలో ఉండాలి. మిగిలిన సోదరులు వెళ్లవచ్చు. వారి సంచులు ధాన్యంతోనింపి గాడిదల మీద ఎక్కించారు. దానికి వాళ్లు డబ్బు చెల్లించారు. దారిలో వాళ్లు కాస్త విశ్రాంతి తీసుకుందామని ఆగారు. వారిలో ఒకడు తన గోనె విప్పాడు. అతడు తన గాడిదకు మేత వేయాలని సంచి విప్పాడు. "అరె చూడండి, నా సంచిలోని ధాన్యం మీద నేనిచ్చిన డబ్బు పెట్టేసారు" అని ఆశ్చర్యంతో కేక వేసాడు. మిగిలిన వాళ్లందరి సంచుల్లోనూ అలాగే ఉంది. వాళ్లంతా నిర్ఘాంత పోయారు. ఇప్పుడా దేశాధికారి వాళ్లు దొంగలని అనుకుంటాడు. అతనికి చాల కోపం వస్తుంది.

ఏమీ జరుగుతున్నదో మీకు తెలుసా? యోసేపు రహస్యంగా డబ్బును వాళ్ల సంచుల్లో పెట్టించాడు. మనసులో వాళ్లపై అతనికి ఏ కోపం లేదు. వాళ్లని సంరక్షించాలనేదే అతని కోరిక.

సోదరులు ఇంటికి తిరిగి వెళ్లారు. తండ్రితో జరిగిన దంతా చెప్పారు. "ఆ అధికారి మాతోపాటు బెన్యామీనును ఈజిప్టుకు తెమ్మన్నాడు. లేకపోతే షిమ్యోను ఖైదులో ఉండవలిసిందే" అన్నారు.

యాకోబు చాల విచారించాడు. "లేదు బెన్యామీను వెళ్లడానికి వీలులేదు. అతనికి ఏమైనా జరిగితే? ఓ, నేను దుఃఖంతో చచ్చిపోతాను. లేదు. బెన్యామీను నాతోనే ఇంటిలో ఉంటాడు".

అయితే యాకోబు దుఃఖంతో చచ్చిపోలేదు. దేవుడతన్ని కాపాడాడు. కొన్నిసార్లు దేవుని పిల్లలు విచారిస్తారు కాని వాళ్లెక్కడ ఉన్నా దేవుడు వాళ్లని విడిచి పెట్టడు. ఇదో అద్భుతమైన సత్యం.

27. ఐగుప్తుకు తిరిగి వచ్చుట

యోసేపు అన్నలు ఐగుప్తులో చాల ధాన్యం కొన్నారు. అయితే అదంతా అయిపోయింది. "మీరు ఈజిప్టు కు వెళ్లి మరికొంత ధాన్యం కొనితెండి" అని యాకోబు కుమారులకు చెప్పాడు.

సోదరులు వెళ్లడానికి సిద్ధంగానే ఉన్నారు. అయితే వాళ్లు బెన్యామీనును తమతో తీసుకుపోవాలి. ఎందుకంటే ఆ ఉన్నతాధికారి అతన్ని తీసుకురమ్మని ప్రత్యేకంగా చెప్పాడు.

యాకోబు దానికి ఒప్పుకోలేదు. "మీరు బెన్యామీన్ను ఇంటి వద్దనే ఉండాలని ఏదో ఒక సాకు చెప్పవలసింది" అన్నాడు.

'అతడు అన్ని' విషయాలూ ఖచ్చితంగా తెలుసుకోవాలని పట్టుపట్టాడు" అన్నారు సోదరులు.

చివరికి యూదా తండ్రితో ఇలా అన్నాడు. "తండ్రీ, బెన్యామీనును దయచేసి మాతో రానీయి. నేను అతన్ని భద్రంగ కాపాడుతాను"

దానికి యాకోబు-సరే, దేవుడే బెన్యామీనును కాపాడుతాడు. షిమ్యోనును కూడ ఆయనే కాపాడుతాడు అన్నాడు.

అప్పుడు సోదరులంతా ఐగుప్తుకు తిరిగి వెళ్లారు. వాళ్లు తమతో డబ్బు తీసుకుపోయారు. తమ సంచుల్లో ఉండిన డబ్బును కూడ తిరిగి తీసుకువెళ్లారు.

వాళ్లంతా ఉన్నతోద్యోగి భవనం చేరుకున్నారు. వాళ్లు రావడం యోసేపు చూచాడు. అతడు ఒక సేవకునితో "ఆ మనుష్యులను నా యింటికి తీసుకుపో. వాళ్లతో కలిసి ఈ రాత్రి నేను భోజనం చేయాలి" అని చెప్పాడు.

సేవకుడు ఆ సోదరులను యోసేపు భవనానికి తీసుకపోయాడు. వారు చాల భయపడ్డారు. తమను ఎందుకు ఇక్కడికి తెచ్చారు? తమ సంచుల్లో ఉంచిన డబ్బును గురించి వాళ్లు గుర్తు తెచ్చుకున్నారు. ఆ అధికారి తాము దొంగలమని అనుకుంటున్నాడా? తమ నిప్పుడు అతడు శిక్షిస్తాడా?

వాళ్లు ఆ సేవకునితో - మేమా ధనం దొంగిలించలేదు. అది మాసంచుల్లోకి ఎలా వచ్చిందో మాకు తెలియదు" అన్నారు.

ఆ సేవకుడు - భయపడకండి. ఆ సంగతి మీ దేవుడికి తెలుసు" అన్నాడు.

అక్కడ షిమ్యోను కూడ ఉన్నాడు. అతడు చెరసాల నుండి బయటికి రావడానికి సెలవు దొరికింది. తలుపు తెరవగా గవర్నరు లోపలికి వచ్చాడు. అతడు సహోదరులతో మంచిగ మాటలాడాడు. 'మీ తండ్రి ఎలా ఉన్నాడు? అతడింకా బదికి ఉన్నాడా?" అని అడిగాడు.

సోదరులు-అయ్యా, అతడు క్షేమంగానే ఉన్నాడు అని జవాబిచ్చారు.

బెన్యామీనును చూచి యోసేపు చాల ఆనందించాడు. అతనికి తమ్ముడంటే ఎంతో ప్రేమ. యోసేపు అతనితో "కుమారుడా, దేవుడు నీపై దయ చూపును గాక!" అన్నాడు.

వెంటనే యోసేపు అక్కడ నుండి వెళ్లిపోయాడు. అతనికి సంతోషంతో కన్నీరు కారుతున్నది. తన సోదరులు అది చూడడం అతనికి ఇష్టం లేదు.



యోసేపు తన సోదరుల నందరినీ భోజనం బల్ల వద్ద కూర్చుండ బెట్టాడు. మొదట రూబేను, అతడు సోదరులందరితో పెద్దవాడు కదా. తరువాత షిమ్యోను. ఎందుకంటే అతడు రూబేను తరవాతి వాడు. మూడో వాడు లేవి. తరువాత నాలుగో వాడు యూదా. ఈ విధంగా ఒకరి తరువాత ఒకరు చివరిగా బెన్యామీనును కూర్చోబెట్టారు ఎందుకంటే అతడే చివరివాడు. అధికారికి ఇదంతా ఎలా తెలిసింది అని సోదరులు ఆశ్చర్యపోయారు.


సేవకులు తెస్తున్న ఆ రుచిగల భోజన పదార్థాలు చూడండి! సోదరులందరికీ ఒకే రకమయిన వంతులు వస్తున్నవి బెన్యామీనుకు తప్ప. అతనికి మాత్రం మిగిలిన వాళ్ల కన్న అధికంగ వస్తున్నవి. దాదాపు అయిదు వంతులు ఎక్కువ. యోసేపు ఎందుకలా చేసాడు? తన సోదరులు ఇంకా అసూయ పడుతున్నారా అని తెలుసుకోడానికి అతడలా చేసాడు. గతంలో వాళ్లు యోసేపు పట్ల అసూయ పడ్డారు, గుర్తుందా? అయితే ఇప్పుడు బెన్యామీనుకు ఎక్కువ వంతులు వచ్చినా వాళ్లు బాధపడలేదు. వారి ప్రవర్తనను బట్టి యోసేపు దీనిని గ్రహించాడు. అవును, తన అన్నలు మారిపోయారు.

భోజనం చాల రుచిగ ఉంది. గవర్నరు (అధికారి) కూడ వారితో పాటు భోజనం చేసాడు. వాళ్లెంతగానో ఆనందించారు!

మరునాడు వాళ్లంతా ఇంటికి తిరిగి వెళ్లారు. వాళ్లంతా సంచుల నిండా ధాన్యం తెచ్చుకున్నారు. షిమ్యోను కూడ తమతో తిరిగి వస్తున్నందుకు వాళ్లు ఎంతో సంతోషంగా ఉన్నారు. బెన్యామీను కూడ వస్తున్నాడు. తండ్రియాకోబు ఎంత సంతోషిస్తాడు!

సోదరులు అర్థం చేసుకోలేనిది ఏమిటో తెలుసా? ఈ గవర్నరు తమ పట్ల అంత దయగ ఉండడానికి కారణం. అదెందుకో వారికి ఎంత మాత్రం తెలియలేదు.

మనపట్ల ఎల్లప్పుడు దయ చూపించేదెవరో మీకు తెలుసా? మనకు ప్రతిదినం ఆహారం ఎవరిస్తారు? అవును దేవుడే. కాని మనం ఇది గ్రహించలేకపోతున్నాము. అది పొందడానికి మనకు అర్హత లేదు ఎందుకంటే ప్రతిదినం మనం పాపం చేస్తున్నాము. మనం కూడ యోసేపు సోదరుల వంటి వాళ్లమే



28. నేను యోసేపును

సోదరులు వేగంగా గృహం చేరారు. తమ తండ్రి యాకోబును చూడాలని ఆశతో ఎదురు చూస్తున్నారు. తండ్రి చాల సంతోషిస్తాడు.

హఠాత్తుగ వెనుకనుండి ఒకడు రావడం వాళ్లు చూచారు. వాళ్లు రాజసేవకుడొకడిని చూచారు. అతడు గుర్రం మీద ఎంత వేగంగా వస్తున్నాడో! అతడెంత కోపంగా ఉన్నాడో! అతడు దగ్గరగా వచ్చాడు.

'మీరు కృతజ్ఞతలేని దొంగలు. మీరు మా యజమాని పాత్రను దొంగిలించారు. అందమయిన వెండిగిన్నెను ఎత్తుకపోయారు!

"లేదు, మేము దొంగిలించలేదు" అన్నారు అందరూ ఒకే కంఠంతో.

"అది నిజం కాదు"

"సరే, అయితే నేను మీ సంచులు తనిఖీ చేస్తాను"



అన్నాడాసేవకుడు. "అది ఎవరి దగ్గర దొరుకుతుందో అతడు నాతోపాటు మా యజమాని దగ్గరకు రావాలి. అతనికి బానిస అవ్వాలి. అదే శిక్ష" అన్నాడు.

వాళ్లంతా తమ గోనెలు విప్పారు. మొదట అతడు రూబేను సంచి చూచాడు. అందులో ఆ గిన్నె లేదు. తరువాత షిమ్యోను సంచి చూచాడు. అందులో కూడ ఏమీ కనిపించలేదు. చివరికి బెన్యామీను వంతు వచ్చింది. అతని సంచి విప్పిన సేవకుడు. "గిన్నెయిదిగో" అంటూ దానిని పైకితీసాడు.

అతడు దానిని పైకెత్తి పట్టుకున్నాడు. అందరూ దానిని చూచారు. అది బెన్యామీను సంచిలో ఉంది. వాళ్లకి ఏమీఅర్థం కాలేదు. బెన్యామీను ఆ గిన్నె తీయలేదు. ఆ గిన్నెను ఎవరు సంచిలో పెట్టారో మీకు తెలుసా? తన అన్నలు నిద్రపోతున్నపుడు యోసేపే ఆ గిన్నెను పెట్టాడు.

అయ్యో, అతని సోదరులు చాల భయపడిపోయారు! వాళ్లు చాల దుఃఖపడ్డారు! వాళ్లంతా తిరిగి రాజభవనానికి వెళ్లారు. వాళ్లు బెన్యామీనును విడిచిపెట్టలేదు. వాళ్లంతా అధికారి యెదుట మోకరించారు. అతడెంత కోపంగ కనిపించాడు! "మీరిలా ఎందుకు చేసారు?" అని అతడు కఠినంగా ప్రశ్నించాడు.

అతనికి జవాబీయడానికి వాళ్లలో ఎవడు ధైర్యం చేసాడు? యూదా!

అతడు ఇలా అన్నాడు. "అయ్యా, మేమంతా నీకు బానిసలమవుతాము. మా పాపాలకు దేవుడిచ్చిన శిక్షయిది".

దానికి యోసేపు "అలా వీలులేదు. బెన్యామీను మాత్రమే ఉండిపోవాలి, మిగిలిన మీరంతా వెళ్లవచ్చును" అన్నాడు.

"అయ్యో, దయచేసి వినండి. మా ముసలి తండ్రికి బెన్యామీనుపై చాల ప్రేమ ఉంది. బెన్యామీను ఇంటికి తిరిగి రాకపోతే దుఃఖంతో అతడు చచ్చిపోతాడు. బెన్యామీనును కాపాడుతానని నేను అతనికిమాట ఇచ్చాను. కాబట్టి నన్ను మీ బానిసగా చేసుకోండి. నేనా శిక్షభరిస్తాను. కాని దయచేసి బెన్యామీనును ఇంటికి పంపండి" అన్నాడు.


ఈ విషయంలో యూదా యేసు ప్రభుని పోలి ఉన్నాడు. ఆయన కూడ తన ప్రజల కొరకు శిక్ష భరించగోరాడు.

ఇదంతా చూచి యోసేపు మనసులో ఇలా అనుకున్నాడు. "మేము చిన్న వాళ్లంగా ఉన్నప్పటికి ఇప్పటికి వీళ్లలో ఎంత భేదం కనపడుతోంది! వీళ్లంతా బెన్యామీనును కాపాడాలని ప్రయత్నం చేస్తున్నారు. తమ పాపాలకు విచారిస్తున్నారు. కాబట్టి నేనెవరినో ఇప్పుడు వారికి చెబుతాను." సేవకులను ఆ గది బయటికి పొమ్మని యోసేపు తన సహోదరులతో మిగిలిపోయాడు. అప్పుడతడు గట్టిగ యేడ్చి "నేను యోసేపును, నా తండ్రి ఇంకా బ్రదికి ఉన్నాడా?" అని ప్రశ్నించారు. సోదరులు ఇదివిని ఆశ్చర్యపోయారు. "ఇంత ప్రముఖుడైన వ్యక్తి యోసేపా? తాము చంపేయాలనుకున్న యోసేపా? తాము అమ్మేసిన యోసేపు ఇతడేనా?" అనుకుంటూ వాళ్లెంత భయపడ్డారో! యోసేపు ఇప్పుడు వాళ్లను శిక్షాస్తాడని వాళ్లనుకున్నారు.

అయితే యోసేపు "మీరు భయపడవద్దు. అవును, మీరు నాకు కీడు చేయాలనుకున్నారు. అయితే దేవుడు నాకంతా మేలే చేసాడు. నేను మీ అందరినీ పోషించేలా దేవుడు నన్ను గొప్ప అధికారిగ చేసాడు. ఈ కారణంగ నేను ఈజిప్టు వెళ్లవలసి వచ్చింది. దేవుడెంతో జ్ఞానం కలవాడు-అని చెప్పి యోసేపు తన అన్నలందరినీ ముద్దుపెట్టుకున్నాడు. ముఖ్యంగా బెన్యామీనును. నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. మీ మీద నాకు కోపం లేదు. నేను మిమ్ములను క్షమించాను. మీరు తండ్రి యాకోబు దగ్గరకు వెళ్లండి. జరిగినదంతా చెప్పండి. ఆ తర్వాత ఈజిప్టుకు రండి. ఇక్కడ తినడానికి కావలసినంత ఆహారం ఉంది" అన్నాడు. ఇప్పుడు తిరుగు ప్రయాణం ఆనందంగ జరిగింది. అంతా సంతోషంగ ముగిసింది.

యోసేపుతన అన్నలను క్షమించడం అద్భుతంగా ఉంది కదూ? అతడు వారిని క్షమించాలనుకున్నాడు. వారు తమ పాపాల కోసం విచారించడం చూచాడు. మనుష్యులు మనలను క్షమించడం మంచిది. దానికంటె ముఖ్యం దేవుడు మనపాపాలను క్షమించాలి.

మన పాపాల నిమిత్తం చింతిస్తున్నామా? దేవుడు తప్పక వాటిని క్షమించగలడు, క్షమిస్తాడు. మరి దాని కోసం మనం ఆయనను అడగాలి కదూ?



29. ఐగుప్తులో యాకోబు

సోదరులందరూ తిరిగి రావడం యాకోబు చూచాడు. వాళ్లతో షిమ్యోను కూడ ఉన్నాడు. బెన్యామీను సహితం వస్తున్నాడు. అయితే గుర్రాలు, రథాలతో కూడిన అంత పెద్ద గుంపు వస్తున్నదేమిటి? దీని అర్థం యేమిటి? ఇదేమి వింత!

"తండ్రీ, విను. యోసేపు ఇంకా బ్రతికే ఉన్నాడు! ఈజిప్టు దేశానికి అతడు గవర్నరు" అని వాళ్లు కేక వేసారు.

యాకోబుకు మూర్ఛబోయినంత పనైంది. యోసేపు బ్రతికి ఉండడమా? అసాధ్యం! యోసేపును క్రూర మృగం తినివేసింది.

"లేదు, మీ మాట నేను నమ్మను", అన్నాడు యాకోబు. అది నమ్మజాలనంత మంచి వర్తమానం!

"తండ్రీ, మేము నిజమే చెబుతున్నాము. అతడు మమ్ములను తిరిగి వచ్చి ఐగుప్తులో నివసించమని చెప్పాడు. అదిగో, చూడు. యోసేపు పంపిన బండ్లుచూడు. అందులో ఎక్కి మమ్ములను ఐగుప్తుకు రమ్మని యోసేపు వాటిని పంపాడు".

యోసేపు కుమారులతనికి సమస్తం తెలియజెప్పారు. గతంలో వాళ్లు యోసేపును అమ్మివేయడం తండ్రిని మోసం చేయడం అన్నీ చెప్పారు. ఇప్పుడు నిజం బయట పడింది.

ఆవును, ఇదే విధంగ మన పాపాలు సహితం బయటికి వస్తాయి, ఎందుకంటే దేవుడు అన్నీ చూస్తాడు. ఆయన కంటికి కనిపించనిది యేదీ లేదు. చివరికి యాకోబు వాళ్ల మాటలు నమ్మాడు.

"అతడు జీవించి ఉన్నాడని నేను నమ్ముతున్నాను. నేను వెళ్లియోసేపును చూడాలి. నేను చచ్చిపోకముందు అతన్ని చూడాలని ఆశపడుతున్నాను" అన్నాడు.

వాళ్లంతా అంటే యాకోబు, అతని కొడుకులు, వాళ్ల భార్యలు పిల్లలూ అందరు ప్రయాణమయ్యారు. వాళ్ల పశువులు కూడ ఐగుప్తుకు బయలుదేరాయి. అయితే దానికి ముందు యాకోబు ఒక బలిపీఠం కట్టాడు. అతడు దేవునికి బలి అర్పించాడు. వినయంతో ఆయనకు వందనాలు చెల్లించాడు.

దేవుడు యాకోబుతో - నీవు ఈజిప్టుకు వెళ్లు. నేను నిన్ను దీవిస్తాను. ఐగుప్తులో నిన్ను పోషిస్తాను. నిన్ను గొప్ప జనంగా చేస్తాను. ఆ తరువాత ఆ జనాంగం కానానులో నివసిస్తుంది-అని చెప్పాడు.

అదిగో, ఓరథం వస్తోంది. అది చాలవేగంగా వస్తోంది. అది వచ్చి సరిగ్గా యాకోబు ముందు ఆగింది. దాని నుండి ఎవరు దిగారో తెలుసా? యోసేపు! అదిగో, చూడండి. అతడు తండ్రి దగ్గరకు పరిగెత్తుతున్నాడు! యాకోబు కూడ యోసేపును చూచాడు. అతని వైపు తన చేతులు చూపాడు. సంతోషంతో ఆ చేతులు వణుకున్నాయి! యోసేపు ఆ చేతుల్లో వాలిపోయి తండ్రిని కౌగిలించుకున్నాడు.

"నా బాబూ" అంటూ యాకోబు కుమారుడ్ని గుండెల కద్దుకున్నాడు. ఇద్దరూ చాల సేపు ఏడ్చారు. వాళ్లు సంతోషంతో ఏడ్చుచున్నారు.

అప్పుడు యాకోబు-యోసేపూ ఇప్పుడు చచ్చిపోడానికి నేను సిద్ధంగా ఉన్నాను, ఎందుకంటే నేను నిన్ను చూచాను" అన్నాడు.

అందరూ ప్రయాణమై ఐగుప్తు వెళ్లి అక్కడ నివసించారు. వారికి సమృద్ధిగ ఆహారం ఉండేలా యోసేపు ఏర్పాటు చేసాడు.

యోసేపును యేసు ప్రభువుతో పోల్చవచ్చు. ఎందుకంటే యేసు కూడ యోసేపులా శ్రమలనుభవించాడు. అయితే యేసుపడిన శ్రమలను యోసేపు పడిన కష్టాలతో పోల్చలేము. యేసు ప్రభువు రాజులకు రాజు, ప్రభువులకు ప్రభువు. యోసేపు తన కుటుంబానికి మాత్రమే సాయం చేసాడు. అయితే యేసు తన పిల్లలపట్ల అంతకన్న ఎంతో ఎక్కువ ప్రేమ చూపించాడు.

యాకోబు చాల వృద్ధుడయ్యాడు. అతడు చచ్చిపోయే సమయం వచ్చింది. అతని కొడుకులంతా మంచం చుట్టూ నిలబడ్డారు. రూబేను, షిమ్యోను, యుదా మిగిలిన కుమారులంతా ఉన్నారు. యోసేపు, బెన్యామీను కూడ నిలబడ్డారు. వాళ్ల తండ్రి యాకోబు వాళ్లందరినీ రమ్మని పిలిచాడు.

ఎందుకో తెలుసా? తరువాత యేమి జరుగుతుందో వినండి. ఒకరి తర్వాత ఒకరు సోదరులంతా మోకరించారు. తండ్రి యాకోబు తనముసలి చేతులను వాళ్లతలలపై పెట్టాడు. ప్రతి ఒక్కరూ దేవుని నుండి



ఒక దీవెనను పొందారు. అన్నిటికంటె గొప్ప ఆశీర్వాదం ఎవరికి వచ్చిందో తెలుసా? యూదాకు అతిశ్రేష్టమైన దీవెన వచ్చింది. ఆ తరువాత కాలంలో యూదా సంతానం నుండి యేసు ప్రభువుపుడతాడు!

యాకోబు తన కుమారులను దీవించి ముగించాడు. ఇప్పుడుతను అక్కడ పండుకొని కనిపెడుతున్నాడు. ఎవరి కోసం? దేవుని కోసం. ఆవును, ఎందుకంటే దేవుడు వచ్చి యాకోబును తీసుకుపోతాడు. యాకోబు దీనికోసం చాల ఎదురుచూస్తున్నాడు. అతడు దేవునితో ఉండాలని ఆశపడుతున్నాడు.

అందరూ చాల నిశ్శబ్దంగ ఉన్నారు. కొంతసేపటికి యాకోబు చచ్చిపోయాడు. అతని ఆత్మపరలోకానికి చేరుకొంది. ఇకపై అక్కడ అతనికి దుఃఖం ఉండదు. అక్కడ అతడిక ఎన్నడూ పాపం చేయడు. ఎప్పటికీ సంతోషంగ ఉంటాడు. ఎందుకంటే అతడు దేవునితో ఉంటాడు.

చూసావా? దేవుని పిల్లలు ఎంత ఆనందంగా ఉంటారో! వాళ్లకి చావంటే భయం ఉండదు. అసలు దానిలో ఎంతో ఆనందం ఉంది. మనం అంతా చచ్చిపోతాం. మనం పరలోకానికి వెళ్లాలని ఆశపడవచ్చు. అయితే అందరూ దేవునితో జీవించి ఆయనను అక్కడ స్తుతించాలని ఆశపడుతున్నారా? లేదు. యాకోబులా దేవుని ప్రేమించి, హృదయాన్ని మార్చుకున్న వాళ్లే అలా చేయగలరు. కాబట్టి అలా మారాలని నీవు ప్రార్ధన చేయడం మర్చిపోకు సుమా!

30. బానిసలు



యోసేపు చచ్చిపోయాడు. అతని సోదరులు సహితం ఒక్కొక్కరూ చచ్చిపోయారు. అయితే వాళ్లందరికీ పిల్లలున్నారు. వాళ్లు పెరిగి పెద్ద వాళ్లయ్యారు. తిరిగి వాళ్లకి పిల్లలు పుట్టారు. అవును, వాళ్లంతా ఓ గొప్ప జనాంగం అయ్యారు. వాళ్లింకా అభివృద్ధి చెందుతూనే ఉన్నారు. అది ఇశ్రాయేలు జనాంగం. ఆ ప్రజలు ఇశ్రాయేలీయులు.

ఈజిప్టులో కూడ ఒక క్రొత్త రాజు వచ్చాడు. ఓ కొత్త ఫరో. ఇతనికి ఇజ్రాయేలు ప్రజలంటే ఇష్టం లేదు. అందువల్ల అతడు తనసేవకులతో "ఇశ్రాయేలు జానాంగం చాల పెద్దదవుతున్నది. ఎవరు చెప్పగలరు, వాళ్లు మనతో యుద్ధం చేయవచ్చు. అప్పుడు మనం ఓడిపోతాము. ఇశ్రాయేలీయులలో చాల మంది బలవంతులున్నారు. కాబట్టి మనం ఏం చేయాలో తెలుసా? మనం వాళ్ల చేత కఠినమయిన పని చేయిద్దాము. అప్పుడు వాళ్లంతా అలిసిపోయి జబ్బుల పాలవుతారు. వాళ్లు బలహీనులై ఇక అభివృద్ధి చెందరు" అన్నాడు. అలాగే జరిగింది. ఇశ్రాయేలు ప్రజలు ఇటికలు కాల్చవలసి వచ్చింది. వాటిని ఎండుగడ్డి, బంకమన్ను, నీళ్లు కలిపి తయారు చేపేవాళ్లు. వాటిని ఎంతో దూరం మోసుకొని పోవలసి వచ్చేది. వాటితో బలమైన గోడలు, ఇండ్లు, గోపురాలు కట్టేవాళ్లు. వాటికోసం చాల ఇటికలు కావలసి ఉండేది.

పాపం వాళ్లెంత కష్టపడి పని చేసారో! ఎంతగా అలిసిపోయే వారో!

చూడండి, అక్కడొక మనిషి ఎన్నో ఇటికలు మోస్తున్నాడు. అతడు చాల అలసిపోయాడు. కాస్తంత విశ్రాంతి తీసుకోవాలని ఆశపడ్డాడు. అతడిక ఒక్క అడుగు కూడా వేయలేకపోయాడు. అయితే, అయ్యోపాపం. ఒక ఈజిప్టు అధికారి వస్తున్నాడు. పనివారి మీద అజమాయిషి చేసే వాళ్లలో ఒకడు. అతని చేతిలో పెద్ద కొరడా. అతడు ఆ ఇశ్రాయేలీయుని చాల గట్టిగా కొట్టడం మొదలు పెట్టాడు. అతని వీపు మీద ముఖం మీద కొడుతున్నాడు. "తొందరగ పని చెయ్యి. ఇంకా ఎక్కువ పని చేయి" అని అరుస్తున్నాడు.

అయ్యో, ఆ పనివాడు బాధతోను కోపంతోను అరుస్తున్నాడు. ఇలా ప్రతిరోజు జరుగుతుంది. వాళ్లని నిత్యం కొడుతూనే ఉంటారు. వాళ్లు మరింతపని చేయాలి, మరింత తొందరగా నడవాలి. ఈజిప్టు వాళ్లు నిజంగ బానిసల చేత చాల పనితీసుకుంటారు. ఇశ్రాయేలు ప్రజలు బానిసలయ్యారు. పాపం బానిసలు. చాల మంది నొప్పితోను, దుఃఖంతోను చచ్చిపోతున్నారు. అయితే ఆ జనాంగం మాత్రం తగ్గిపోవడంలేదు. వాళ్లింకా ఎక్కువగా, బలంగా తయారవుతున్నారు. అదెలా సాధ్యం? ఎందుకంటే దేవుడు వారిని కాపాడుతున్నాడు. అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులకు ఆయన వాగ్దానం చేసాడు కదా?

రాజు దీనిని గమనించాడు. అతనికింకా కోపం వచ్చింది. "నేను గెలవాలి. వీళ్లని అణచివేయాలి. ఈ ప్రజలకు పుట్టే పిల్లలు బలమయిన సైనికుల్లా ఎదగడానికి వీల్లేదు" అన్నాడు.

కాబట్టి రాజు ఒక పథకం వేసాడు. అది ఓ దుష్టమయిన పాపపు పథకం. రాజు దగ్గరకు ఇద్దరు స్త్రీలను పిలిపించారు. వాళ్లు మంత్రసానులు. అంటే శిశువు జన్మించేటప్పుడు సాయంచేసే దాయీలు. వాళ్లు తల్లినీ పిల్లనూ చూచుకుంటారు. ఫరో ఆఇద్దరితో ఇలా



అన్నాడు. ''ఒక తల్లికి ఆడపిల్లపుడితే బ్రదకనివ్వండి. ఒకవేళ మొగ పిల్లవాడు పుడితే చంపేయండి''. అదెంత భయంకరం. ఆ మంత్రసానులు ఫరో చెప్పినట్టు చేసారనుకుంటున్నారా? లేదు. వాళ్లు దేవునికి భయపడే స్త్రీలు. అందుచేత రాజుమాట వినలేదు.

కాబట్టి రాజు మరో పథకం వేసాడు. అది మరింత క్రూరమయినది. ''పుట్టిన మగ పిల్లలందరిని నదిలో పారవేయండి. వాళ్లు నీళ్లలో మునిగిచావాలి'' అన్నాడు.

రాజు సైనికులు రాజాజ్ఞప్రకారం చేసారు. అదిగో చూడండి. ఒక సైనికుడు ఒక ఇశ్రాయేలీయుని ఇంటికి వెళ్తున్నాడు. అక్కడ ఉయ్యాలలో ఉన్న ఓ చిన్న బాలుడ్ని చూచాడు. అవును, వాడు బాలుడే, అతడు వానిని పైకి లేపాడు ''వద్దు వద్దు, వాడు నాప్రియమైన కుమారుడు'' అని తల్లి ఏడ్చింది. సైనికుడు ఆమెను ప్రక్కకు నెట్టివేసాడు. అతడు ఆ శిశువును ఇంటివెలుపటికి తీసుకపోయి నదిలోకి విసిరేసాడు. ఆ పసివాడు మునిగిపోయాడు. ఎంత భయంకరం! ఆ ఇంటిలో గొప్ప దుఃఖం అలముకొంది!

ఇలా చాల మంది పసివాళ్లను నదిలో ముంచేసారు. ఇప్పుడు ఇశ్రాయేలు ప్రజలు ఏమి చేయాలి? వాళ్లా బలమైన సైనికులతో యుద్ధం చేయలేరు. వాళ్లు ఏమీ చేయలేరు. ఏమీ చేయలేరా? అయితే ఒకటి చేయగలరు! వాళ్లు దేవునికి ప్రార్థన చేయవచ్చు. అదే శ్రేష్ఠమయిన పని! దేవుడు వాళ్లకి సాయం చేయగలడు.

మనకి విచారం కలిగినపుడు మనం కూడా అదే చేయాలి. దేవునికి ప్రతీ విషయం తెలియజెప్పాలి. అది ఎంత పెద్ద కష్టమయినా ఆయన సహాయం చేయగలడు.

31. మోషే పుట్టుక



ఒకానొక ఇంటిలో ఇప్పుడే ఒక పసిబాలుడు పుట్టాడు. వాని తల్లిదండ్రులకు మరో కొడుకు కూడ ఉన్నాడు. అతని పేరు అహరోను. వాళ్లకో కూతురు ఉంది. ఆమెపేరు మిర్యాము.

అతని తల్లిదండ్రులు చాల ఆనందంగ ఉన్నారు. అహరోను, మిర్యాము కూడ చిన్న తమ్ముని చూచి సంతోషించారు, ...అయినా వాళ్లకి చాల ఆందోళనగా ఉంది.



"ఇదిగో, గుర్తుంచుకొనండి. మీరు కొత్తగ పుట్టిన తమ్ముని గురించి ఎవరితోను చెప్పకండి" అని వాళ్ల తల్లీతండ్రీ చెప్పారు. క్రూరమయిన సైనికులు ఆ చిన్న తమ్ముని గురించి వింటే! అమ్మో ఆ చిన్న బాలుడ్ని నదిలోకి విసిరేస్తే! అతడెంతో చక్కని పసివాడు. అతడు కూడ నదిలోకి విసిరివేయబడతాడా? అది రాజాజ్ఞ!

అయినా, అది కష్టమే మొదట్లో అతడు చిన్నగ ఉన్నాడు. అయితే మెల్లగ ఎదుగుతున్నాడు. మొదట వాడి స్వరం మృదువుగ ఉండేది. ఇప్పుడది పెద్దగ వినిపిస్తోంది! వాని ఏడ్పును సైనికులు వింటే! ఇప్పుడు తల్లి ఏం చేస్తోంది. ఆమె నది వద్దకు వెళ్లింది. నది ఒడ్డున జమ్ము గడ్డి మొలుస్తుంది. తల్లి వాటితో ఒక పెట్టె అల్లింది. అందులోకి నీళ్లు రాకుండా ఆమె ఆపెట్టెకు తారు పూసింది. అదిప్పుడు నీళ్ల మీద తేలగలదు. అదో చిన్న పడవలా ఉంది!

అదో, చూడండి, ఆతల్లి తన చిన్న బాలుడ్ని ఎత్తుకొంది. ఆమె వానిని ఆ బుట్టలో పెట్టింది. అవును, ఆ పెట్టె నీళ్ల మీద తేలుతోంది.

తల్లి తిరిగి ఇంటికి వెళ్లింది. పసివాడ్ని అక్కడ ఒంటరిగా వదిలి వేసిందా? లేదు, తన బిడ్డ ఒంటరిగా లేడని ఆమెకు తెలుసు. దేవుడు అతనితో ఉన్నాడు. తన బిడ్డ దేవుని చేతిలో క్షేమంగా ఉంటాడు. తల్లి వానిని గురించి ప్రార్థించడానికి ఇంటికి వెళ్లింది. ఎందుకంటే దేవుడు సహాయం చేయగలడని ఆమె ఎరుగును.

మనం భయంతో, విచారంతో ఉన్నపుడు ఎవరు సాయం చేస్తారు? దేవుడు మాత్రమే!

మిర్యాము ఇంటికి తిరిగి వెళ్లలేదు. ఆమె పాదల్లో దాగుంది. తన చిన్న తమ్ముడు ఏమవుతాడో చూడాలని ఆమె ఆతృతగా ఉంది.

చూడండి, ఎవరో నది ఒడ్డున నడుస్తున్నారు. ఆమె చాల ప్రాముఖ్యమయిన స్త్రీ. ఆమె రాకుమార్తె. దుష్టుడయిన ఆ రాజ మందిరంలో ఈమె నివసిస్తున్నది. ఆమె తన పనికత్తెలతో వస్తోంది. రాకుమారి ఆ నదిలో స్నానం చేస్తుంది. అది చాల ఎండగ నున్న సమయం.

అయితే ఆమె అక్కడ ఏం చూచింది? జమ్ములో ఓ చిన్నపెట్టె. అది ఏమిటా అని ఆమె ఆశ్చర్యపోయింది. "వెళ్లి ఆ పెట్టె ఇలా పట్టుక రా" అని తన సేవకురాలికి చెప్పింది. ఆమె వెంటనే వెళ్లి దానిని తీసుకవచ్చింది. "అబ్బ, ఎంత చక్కని బాలుడు! ఇతడు తప్పక ఇశ్రాయేలీయుల పిల్లవాడైయుంటాడు" అన్నది ఆ రాజకుమారి.

చిన్నవాడు ఏడుపు మొదలుపెట్టాడు. దీనితో ఆమె మనసు కరిగింది. "నేను ఈ పసిబాలుని పెంచుకుంటాను. అయితే నాకోసం వీనికి పాలిచ్చిపెంచేది ఎవరు? వీని తల్లి ఈ చుట్టు పట్ల లేదుకదా?" అని విచారించింది. రాకుమార్తె గాని ఆమె పనికత్తెలు కాని ఆ పని చేయలేరు.

మిర్యాము ఇదంతా చూచింది. వారి మాటలు విన్నది త్వరగా రాకుమారి వద్దకు వచ్చి ఆ పసివాడిని పెంచడానికి ఒక దాసిని తేవాలా అని అడిగింది. రాకుమారి తెమ్మని చెప్పింది.

మిర్యాము తన ఇంటికి పరుగెత్తింది. తల్లిని కలిసింది. తిన్నగ తల్లి రాకుమారి వద్దకు బయలుదేరింది. "దయ చేసి ఈ పసివాడిని నాకోసం పెంచు" మని రాకుమారి చెప్పింది. "వీడు కొంచం ఎదిగాక నా రాజ భవనానికి తీసికొనిరా. వాడునాతో ఉంటాడు. వాడు నాకొడుకు అవుతాడు. వీడిని నేను నీటిలో నుండి తీసాను కాబట్టి "మోషే" అని పేరుపెడుతున్నాను" అంది. వాళ్లంతా ఎంతో సంతోషించారు! రాకుమారి ఆ బాలుని వారితో తిరిగి ఇంటికి పంపివేసింది. ఇక మీదట సైనికులు ఆ పసివాడికి హాని చేయరు. ఎందుకంటే మోషే రాకుమారి కొడుకు అని వాళ్లకిపుడు తెలుసు.

అవును, రాకుమారి ఇప్పుడితడు నా కొడుకు అని చెప్పవచ్చు. ఆమెకు అతని తల్లి యెవరో తెలియదు. అయితే అసలు తల్లి-ఇతడు ఇప్పటికీ నాకొడుకే అనుకుంటున్నది.

అతడు కొంచం పెద్ద వాడయ్యాక తల్లి మోషేకు దేవుని గూర్చి చెప్పింది. ఎందుకో తెలుసా? మోషే దేవుని బిడ్డగా ఉండాలని తల్లి కోరిక! అప్పుడు చిన్నమోషే ఎప్పటికీ ఆనందంగా ఉంటాడు.

మరి మన మాట యేమిటి? నిజమైన సంతోషం అంటే ఏమిటో నీకు తెలుసా? నీకు తెలుసని నా నమ్మకం.

32. మోషే: ధనవంతుడైన రాకుమారుడు

మోషే రాజభవనానికి వెళ్తున్నాడు. అతడిప్పుడు నివసించునున్నది అక్కడే. అతడో ముఖ్యమయిన రాకుమారుడు. రాకుమార్తె కోరేదియిదే. బహుశ ఏదో ఒక సమయంలో అతడు రాజు కూడ కావచ్చు! మోషే కష్టపడి చదవాలి. అతనికి చదువు చెప్పడానికి తెలివిగల పండితులున్నారు. అతడు తాను చేయగలిగినంత చేసాడు! ఒకానొక దినం దేవుడు మోషేకు అప్పగించబోయే గొప్పపనికి ఈ శిక్షణ ప్రత్యేకంగా తగిఉంది. అప్పుడు అతడు ఇశ్రాయేలు ప్రజలకు సహాయం చేయగలడు.



ఇప్పుడు మోషే గొప్ప రాజకుమారుడు. అతని బట్టలు చూస్తే అది తెలుస్తుంది. అతడు నిజమైన ఈజిప్టు రాజకుమారునిలా తయారయినట్టు కనిపిస్తున్నది. అవును, అలాగే కనిపిస్తున్నది. కాని అది నిజం కాదు. తాను ఇశ్రాయేలీయుడనని మోషేకు తెలుసు. తన సొంత ప్రజలు బానిసలని కూడ తెలుసు. అతడు వాళ్లని మర్చిపోలేడు. మోషే ఇలా అనుకున్నాడు- నేను వీళ్లకు సహాయం చేసి వీళ్లని రక్షించాలని అనుకుంటున్నాను. రాజ భవనంలో ఉండడంకన్న నా ప్రజలతో ఉండడమే నాకిష్టం. ఇకపై నేను గొప్ప రాజకుమారునిగ ఉండకపోయినా ఫర్వాలేదు. ఎందుకంటే దేవుడే ఈ బానిసల దేశాన్ని కాపాడుతాడు. ఒక దినం వాళ్లు తిరిగి కనానుకు వెళ్తారు. తరువాత యేసు ప్రభువు వారిలో జన్మిస్తాడు. వాళ్లు దేవుని ప్రజలు కనుక వాళ్లు నిజంగా సంతోషిస్తున్నారు.

మోషే తన సొంత ప్రజలను ఎంతగా ప్రేమిస్తున్నాడో నీకు తెలుసా? ఎందుకో తెలుసా? ఎందుకంటే దేవుడు ఆప్రేమను అతని హృదయంలో పెట్టాడు.

ఒకరోజు మోషే రాజమందిరం నుండి బయటికి వెళ్లాడు. అతడు ఇశ్రాయేలు ప్రజలను దర్శించాలనుకున్నాడు. బహుశ వాళ్లకతడు సాయం చేయాలనుకున్నాడేమో. అయితే అతడక్కడ ఏం చూసాడు? చూడండి, పని చేస్తున్న బానిసల మీద అజమాయిషీ చేసే ఒకడు ఒక ఇశ్రాయేలీయుని కొరడాతో కొడుతున్నాడు. అది చూచిన మోషేకు చాల కోపం వచ్చింది! కాస్త ఆగండి, ఇప్పుడు మోషే సాయం చేస్తాడు. తాను నిజంగా ఎంత బలవంతుడో ఇప్పుడు చూపిస్తాడు. అతడు ఐగుప్టు దేశస్థుని దగ్గరకు వెళ్లాడు. అతన్ని గట్టిగ కొట్టాడు. మళ్లీ మళ్లీ కొట్టాడు. అతడలా కొడుతూనే ఉన్నాడు. అతడు చచ్చేదాక కొట్టాడు. అయ్యో, మోషే అతన్ని చంపేసాడు. అది చూచి మోషే తొందరగా ఒక గొయ్యి తవ్వాడు. అందులో అతని శవాన్ని కప్పేసాడు. తననెవ్వరూ చూడలేదని మోషే అనుకున్నాడు. అయితే అది దేవుడు చూడడా?

మరునాడు మోషే మళ్లీ బయటికి వెళ్లాడు. అతడో శబ్దం విన్నాడు. అదేమిటబ్బా? అంతలో ఆ దృశ్యం కనిపించింది. ఇద్దరు మనుష్యులు పోట్లాడుకుంటున్నారు.

వాళ్లిద్దరూ ఇశ్రాయేలీయులే. మోషే వాళ్ల దగ్గరకు వెళ్లాడు. "మీరెందుకు పోట్లాడుకుంటున్నారు? మీరు ఒకరినొకరు గాయపరచుకోకూడదు" అని చెప్పాడు. అయితే అందులో ఒకడు మోషే మీద కోపగించాడు. "నీవు మా మీద అధికారం చేయబోకు, నీవు నన్ను కూడ కొట్టి చంపాలనుకుంటున్నావా? నిన్న ఒక ఈజిప్టువాడ్ని చంపావు కదా?" అన్నాడు.

మోషేకు చాల భయంవేసింది. అతడిలా అనుకున్నాడు. నన్నెవ్వరూ చూడలేదని అనుకున్నాను. అయితే దాని గురించి ఈ మనుష్యులకు తెలుసు. బహుశ ఇంక చాల మందికి దీనిగురించి తెలిసి ఉండవచ్చు. ఒక వేళ రాజుకు ఈ సంగతి తెలిస్తే అతనికి చాలకోపం వస్తుంది. అతడు నన్ను చంపవచ్చు".

మోషే వణికిపోయాడు. రాజమందిరానికి తిరిగి వెళ్లడానికతనికి ధైర్యం చాలలేదు. ఆ రాత్రే అతడు తన ప్రాణం కాపాడుకోడానికి పారిపోయాడు. అతడో దూరదేశానికి తప్పించుకుపోయాడు. అలావెళ్లి చివరికొక బావి వద్దకు చేరాడు. అక్కడ కాసేపు విశ్రాంతి తీసుకున్నాడు.

అతడక్కడ ఒంటరిగ మిగిలిపోయాడు. అతనిప్పుడు ధనవంతుడయిన, ప్రాముఖ్యమయిన రాజకుమారుడు కాడు. అతడు కూడ తన సొంత ప్రజల్లో ఒకడైపోయాడు. అయినా ఫర్వాలేదు. దేవుడు తన వారిని సంరక్షిస్తాడు. ఎందుకంటే ఆయన వారిని సదా కనిపెడుతుంటాడు. మోషే తన ప్రజలతో కష్టాలను భరించడానికి సిద్ధంగా ఉన్నాడు. ఎందుకంటే నిజమైన ఆనందం అంటే యేమిటో వారికి మాత్రమే తెలుసు.

ఈనాడుకూడ దేవున్ని ప్రేమించి ఆయనకు భయపడే ప్రజలున్నారు. వాళ్లు రాజకుమారులు కాక పోవచ్చు. అయితే చచ్చిపోయాక కూడ వాళ్లు ధనవంతులే. అలాంటి వారిలా ఉండాలని నీవు కోరుతున్నావా? అలా అయితే నిన్ను తన పిల్లలలో ఒకనిగా చేసుకోమని దేవుడ్ని అడుగు.



33. గొర్రెల కాపరి యైన మోషే

మోషే ఐగుప్తునుండి తప్పించుకుపారిపోయాడు. అతడో బావి దగ్గర అలసట తీర్చుకుంటున్నాడు. అతడు ఒక్కడే అక్కడ ఉన్నాడు. అయితే చూడండి, కొన్ని గొర్రెలు కూడ ఉన్నాయి. అది చాల పెద్దమంద కొందరు ఆడపిల్లలు ఆ మందను కాస్తున్నారు. గొర్రెలకు దాహం వేస్తున్నది. బావిలో కావలసినంత నీరు ఉంది. ఆ బాలికలు నీళ్లు చేదుతారు. గొర్రెలు త్రాగడానికి తొట్లలో నీళ్లుపోస్తారు. అప్పుడు మరో మంద వస్తుంది. ఆ గొర్రెల కాపరులు-మా మంద ముందుగ నీళ్లు త్రాగాలి అని ఆ బాలికలతో చెప్పారు.

వాళ్లాబాలికల మందులను తరిమివేసారు. అది అన్యాయం కాదా? పాపం ఆ బాలికలు ఏమీ చేయలేకపోయారు, ఎందుకంటే ఆ కాపరులు బలంగా ఉన్నారు. మోషే ఇదంతా చూచాడు. అతడులేచి నిలబడ్డాడు. అతడు కోపంగా ఇలా అన్నాడు. "మీరు స్వార్థపరులు, ఈ బాలికలు ఇక్కడికి ముందు వచ్చారు". తర్వాత మోషే ఆ ఆడపిల్లల గొర్రెలు ముందు నీళ్లు తాగేలా చూచాడు. ఆ తర్వాత కాపరుల మందల వంతు. అది న్యాయం.

నీవుకూడ ఎల్లప్పుడూ న్యాయంగా ప్రవర్తించాలి. నీ ఎదుట వాడి కన్న నీవు బలవంతుడవయినా న్యాయం తప్పరాదు. తరువాత ఆ బాలికలు గొర్రెలతో ఇంటికి త్వరగా వెళ్లారు. అది చూచి తండ్రి ఆశ్చర్యపడ్డాడు. "మీరింత త్వరగా ఇల్లు చేరడానికి కారణం ఏమిటి?" అని ప్రశ్నించాడు.

వాళ్లు మోషేను గురించీ అతడు చేసిన సహాయం గురించీ చెప్పారు. తండ్రి వాళ్లతో - మీరు వెళ్లి దయచూపించిన ఆ పడుచువాడిని తీసుకొనిరండి. మనం అతనికి ఆహారమిచ్చి నీడ కల్పించాలి అన్నాడు.

మోషేకు ఇది చాల సంతోషాన్ని కలిగించింది.

అతడక్కడ నివసించవచ్చని వారతనిని పిలిచారు. ఆదినం నుండీ అతడక్కడే ఉండిపోయాడు. ఆ కన్యకలలో ఒక కన్నెను పెళ్లి చేసుకున్నాడు. ఇప్పుడు ప్రతి రోజూ అతడు గొర్రెలు మేపుతున్నాడు. అతడు తరుచు తన సొంత ప్రజలను గూర్చి ఆలోచిస్తుండేవాడు. పాపం, ఇశ్రాయేలు ప్రజలు కష్టపడి పని చేసినా దెబ్బలు తప్పడంలేదు. తాను వాళ్లకెలాంటి సహాయం చేయలేకపోతున్నాడు. అతడు వారిని రక్షించలేడు. ఇది మోషేకు తెలుసును. అయితే ఆపని దేవుడు చేయగలడు. అలా చేస్తానని ఆయన మాట ఇచ్చాడు.

చాల సంవత్సరాలు, అంటే నలభై దీర్ఘ సంవత్సరాలు గడిచిపోయాయి. ఒకనాడు మోషే తన మందతో ఒంటరిగా ఉన్నాడు. అతడు మందను తీసికొని ఎత్తైన పర్వతం మీద ఉన్నాడు. బహుశ అక్కడ గొర్రెలకు కొంచెం పచ్చిక ఉన్నదేమో. అయితే, అదిగో అక్కడ అతనికి ఏం కనిపించింది? అది అగ్ని. ఏదో కాలుతున్నది. అదేమిటో తెలిసింది. అదో పొద. మంటలు ఎత్తుగ లేచాయి. ఇక ఆపొద కొద్దిసేపటిలో కాలిపోతుంది. లేదు, లేదు, పొద మండుతూనే ఉంది. కొమ్మలు చూడండి. అవి కాలుతున్నవి గాని నల్లగ మాడి పోవడంలేదు, కాలిపోవడం లేదు. అవి పచ్చగ సజీవంగ నిలిచి ఉన్నాయి. ఎంత అద్భుతం! అతడు దగ్గరికి వెళ్లాడు ఆశ్చర్య పోయాడు.

హఠాత్తుగ ఆమంట నుండి ఒక స్వరం వినిపించింది-మోషే, దగ్గరకు రాకు, నీ చెప్పులు తీసివేయి. నీవు నిలబడి ఉన్న స్థలం పవిత్రమయినది. నేను దేవుడను. అబ్రాహాము, ఇస్సాకు, యాకోబుల దేవుడను.

ఆహా, ఇది దేవుని స్వరమే! మోషే భయంతోను భక్తితోను వణికిపోయాడు. అతడు తన ముఖాన్ని దాచుకున్నాడు. తన చెప్పులు తీసేసాడు.


దేవుడు మళ్లీ ఇలా అన్నాడు-మోషే, నీవు తిరిగి ఈజిప్టుకు వెళ్లాలి. నేను నా ప్రజలను రక్షిస్తాను. నేను వారి దుఃఖాన్ని చూచాను. మోషే, నీవే నా జనులను ఈజిప్టునుండి తీసుకుపోయి అందమయిన కానాను దేశానికి చేర్చాలి. నీవునాసేవకుడవుగా ఉండాలి.
మోషే అదిరిపోయాడు. ఈ పనిని తాను చేయాలా? అబ్బే, చేయలేడు. తాను ఒకానొకప్పుడు ధైర్యంగా బలంగా ఉన్నాడు కాని ఇప్పుడలాలేడు. అప్పుడు ధైర్యంగ చాల పనులు చేసాడు. కాని ఇప్పుడు కాదు. తానిప్పటికే ముసలివాడయ్యాడు. తాను సహాయం చేస్తానని దేవుడు మోషేకు చెబుతున్నాడు. ఆయనే

సమస్తం చూచుకుంటాడు. అయినా వెళ్లడానికి మోషే ఇష్టపడలేదు. "దేవా, నేను చక్కగ మాటలాడలేను. ఆప్రజలు, కోపంగా ఉన్న రాజు నామాట నమ్మరు. వాళ్లు నన్ను అబద్ధికుడని అంటారు. ప్రభూ, దయచేసి వేరెవరినయినా ఈజిప్టుకు పంపు" అన్నాడు మోషే.

ఇప్పుడు దేవునికి మోషే మీద కోపం వచ్చింది. "లేదు మోషే. నీవే ఈ పనిని చెయ్యాలి. అయితే నీ వొక్కడవే వెళ్లనవసరం లేదు. నీ అన్న అహరోను కూడ నీతో వస్తాడు. మీరిద్దరూ నాసేవకులుగ ఉంటారు" అన్నాడు.

మోషే తన మందను తిరిగి తీసుకపోయాడు. ఇకపై వేరొకరు ఆ మందను చూచుకుంటారు. ఎందుకంటే మోషే ఈజిప్టుకు వెళ్లాలికదా. అతనికి కాస్త భయం వేసినా సంతోషంగా కూడ ఉంది. తన సొంత ప్రజలు బానిసత్వం నుండి విడుదల పొందుతారు. ఈజిప్టు ప్రజలు తన ప్రజల పట్ల చాల క్రూరంగా ప్రవర్తిస్తున్నారు. అది పాదలోని అగ్నిలాంటిది. ఆ మంట కూడ పాదకు కీడు చేయాలనుకున్నది కాని అది దానిని కాల్చలేక పోయింది. దాని కొమ్మలు సజీవంగానే ఉన్నాయి, ఎందుకంటే దేవుడా పాదలో ఉన్నాడు! ఇశ్రాయేలు ప్రజలు సహితం నాశనం అవ్వరు, ఎందుకంటే దేవుడు తన ప్రజలతో ఉన్నాడు.

ఇశ్రాయేలు ప్రజలు తనవారు కావడం వల్ల దేవుడు వారినెలా కాపాడాడో చూచారా? "దేవా, మాకు నూతనమైన మనసు నివ్వు. అప్పుడు మేము కూడ నీ ప్రజలమవుతాము" అని మనం ప్రార్థన చేయాలి.



34. ఐగుప్తులో మోషే, అహరోనులు


మోషే అహరోనులు ఇద్దరూ కలిసి ఈజిప్టులో కాలుపెట్టారు. ప్రజలు రాజుకోసం ఎంతగా కష్టపడి పని చేస్తున్నారో వాళ్లు చూచారు. అయితే ఈ దృశ్యం త్వరలోనే మారిపోతుంది. వాళ్లంతా కనాను దేశానికి వెళ్తారు. మోషే అహరోనులు ఐగుప్తు ప్రజలకు ఇదే మాట చెప్పారు.

"దేవుడు ఈ వాగ్దానం చేసాడు" అని వాళ్లు చెప్పారు.

"ఇలా చూడండి, మేము మీకు దేవుని అద్భుతాలు కొన్ని చూపిస్తాము. దానిని బట్టి మా మాటలు నిజమని మీరు గ్రహించగలరు" అన్నారు.

మోషే చేతిలో ఓ కర్ర ఉంది. అది గొర్రెల కాపరులు ఉపయోగించే చేతి కర్ర. అతడు దాన్ని నేల మీద పడవేసాడు. చూడండి, హఠాత్తుగా అది పాముగా మారింది! అది మెలికలు తిరుగుతోంది. మోషే దానితోక పట్టుకున్నాడు. అది మళ్లీ కర్రగా మారింది.

అప్పుడు మోషే తన చేతిని అంగీలోపల ఉంచాడు. అతడు దానిని బయటికి తీసినప్పుడు చేతినిండా అసహ్యమయిన పుండ్లు కనిపించాయి. అతని చేయి అనారోగ్యం పాలైంది. దానికి కుష్ట రోగం వచ్చింది. ఎంత భయంకరం!



మోషే తిరిగి తన చేతిని అంగీలోపెట్టాడు. మరల బయటికి తీసాడు. ఏం జరిగిందో ఊహించగలరా? అతని చేయి ఇప్పుడు పూర్తిగ బాగయ్యింది.

ఇప్పుడు ఇశ్రాయేలియులు అతన్ని నమ్మారు. వాళ్లు తిరిగి స్వతంత్రులవుతారు. వాళ్లు కానాను దేశానికి వెళ్తారు. వినయంతో వాళ్లు దేవునికి వందనాలు చెప్పారు. అటుతరువాత మోషే, అహరోనులు రాజమందిరానికి వెళ్లారు. వాళ్లు రాజుతో - మా దేవుడు ఇశ్రాయేలు ప్రజలంతా అడవికి రావాలని కోరుతున్నాడు. అక్కడ మేము ఆయనకు పండుగ చేస్తాము. అక్కడ ఆయనకు బలులు అర్పిస్తాము అని చెప్పారు.

ఇది విని ఫరోచాల కోపగించాడు. అతడు "మీరు వెళ్లడానికి వీల్లేదు. మీ దేవుడెవరోనాకు తెలియదు. ఆయనకు నేను లోబడను. నేను ఇశ్రాయేలు ప్రజల చేత మరింతపని చేయిస్తాను. అన్నాడు. ఇది చూచిన ప్రజలు కలవరపడి మోషే, అహరోనులతో-ఇప్పుడు మా పరిస్థితి ఇంకా ఘోరమయింది. మేమంతా చచ్చిపోతాము. ఇదంతా మీ వల్లనే జరిగింది అన్నారు.

మోషేఅహరోనులు చాల విచారించారు. జరిగినదంతా వాళ్లు దేవునితో మొరపెట్టారు. దేవుడు వాళ్లతో ఇలా అన్నాడు-మోషే అహరోనూ నేను ఫరోను శిక్షాస్తాను. అతని మీదికి చాల శిక్షలు వస్తాయి. ఆ తరువాత అతడు ప్రజలను పోనిస్తాడు. అలా తప్పక జరిగేలా నేను చేస్తాను. ఈ సంగతి నీవు ఇశ్రాయేలీయులకు చెప్ప. నీవు తిరిగి రాజుదగ్గరికి వెళ్లాలి.

కాబట్టి మోషే అహరోను తిరిగి రాజమందిరానికి వెళ్లారు. ఫరోవాళ్లతో-నాకో సూచన చూపించండి. దానిని బట్టి మీదేవుడు ఎంత బలవంతుడో నేను చూస్తాను" అన్నాడు.

అహరోను తన కర్ర నేల మీద పడవేసాడు. అది పాముగా మారింది. అది నేల మీద అటూ ఇటూ ప్రాకుతున్నది. ఫరోతన పనివాళ్ల చేత తెలివిగల మంత్రగాళ్లను పిలిపించాడు. వాళ్లంతా తమ కర్రలను నేలమీద వేయగానే అవి కూడ పాములుగ మారాయి.

అయితే, ఏమయ్యిందో చూడండి. అహరోను సర్పం ఏం చేసిందో తెలుసా? మిగిలిన పాములన్నిటినీ అది మింగేసింది. అహరోను పాము మాత్రమే మిగిలింది! దేవుడు అందరికన్న బలవంతుడని నీవు చూసావు కదా? అయినప్పటికీ ఫరో దేవుని మాట వినడానికి ఇష్టపడలేదు. అందు వలన దేవుడు ఫరో మీదికీ, మిగిలిన ఈజిప్టు ప్రజలందరి మీదికీ తన శిక్షను పంపించాడు. వాటిని 'తెగుళ్లు' అని పిలుస్తారు.

మొదటి తెగులే చాల భయంకరం. ఐగుప్తులో ఉన్న నీళ్లన్నీ రక్తంగా మారాయి. దాన్ని త్రాగలేరు. మంచి నీరు ఎక్కడా కనిపించలేదు. మనుష్యులు పశువులు ఇప్పుడు ఏం త్రాగాలి? నదుల్లో ఉన్న చేపలు చచ్చి పోతున్నాయి. ఆ చచ్చిన చేపల వల్ల నీళ్లు కంపుకొడుతున్నాయి. అలా ఒక వారమంతా గడిచింది. ఆ తెగులు పోగానే ఐగుప్తు ప్రజలు ఎంతగానో సంతోషించారు.

ఆ తెగులు ముగిసాక ఫరో "నేను నీ ప్రజలను పంపను" అన్నాడు. అప్పుడు రెండో తెగులు వచ్చింది. హఠాత్తుగ ఆ దేశం అంతా కప్పలతో నిండిపోయింది. ఎక్కడ చూచిన వందలు, వేలు కప్పలు. ఇళ్లలో గెంతుతున్నాయి. బల్లలమీదా, మంచాల మీదా, తినే పదార్థాల్లో అన్నిచోట్లా కప్పలే.

అప్పుడు ఫరో "మోషే, దయచేసి ఈ కప్పల్నితీసి వేయమని దేవుడ్ని అడుగు. అప్పుడు నేను నీ ప్రజలను విడిచిపెడతాను" అన్నాడు.

మోషే దేవునికి ప్రార్థన చేసాడు. ఆయన కప్పల్ని చంపేసాడు. మరి ఐగుప్తులు ప్రజలు వెళ్లవచ్చా? "వీల్లేదు" అన్నాడు రాజు. "నేను వాళ్లని విడిచిపెట్టను", కాబట్టి మరెన్నో తెగుళ్లు వస్తాయి. అది ఎంత విచారకరం! ఫరో హృదయం అంత దుష్టమయినది. ఫరో, నీవు దేవుని మాట ఎందుకు వినవు?

మన హృదయం కూడ దుష్టమయినదే. పాపంతో నిండిన మన హృదయాలు దేవుని మాట వినడానికి ఇష్టపడవు. చాలసార్లు మనకు కూడ విచారకరమైన సంభవాలు జరుగుతాయి. ఫరో జీవితంలో జరిగినట్లే. దేవుడు తన వాక్యంలో మనతో ఇలా చెబుతున్నాడు. "మీరు నావైపు తిరిగి రక్షణ పొందండి." మన హృదయాలు మారడం ఎంత అవసరమో చూచారా? కాబట్టి మన మాయనకు లోబడదాము.

35. మరిన్ని తెగుళ్లు

మూడో తెగులు వస్తోంది. గాలిలో ఎగురుతున్న ఆ దుమ్మంతా ఏమిటి? నేల మీదా, గోడల మీదా చాల దుమ్ముఉంది. హఠాత్తుగ అదంతా పేలుగ మారింది. ఆ చిన్నజీవులు ప్రతి చోటా ప్రాకుతుండడం చూచావా? మనుష్యుల మీదా పశువుల మీదా. అబ్బ, అదెంత భయంకరం! ఇప్పుడన్నా ఫరో దేవుని మాట వింటాడా? అబ్బే, ఇప్పుడు వినడు.

పేలన్నీ మాయమయ్యాయి. అయితే మరో విధమయిన ప్రాణులు కనిపించాయి, అవి రకరకాల ఈగలు, మనుష్యులు కూర్చోలేరు. నడవలేరు. ఈగలు ప్రతి చోటా మనుష్యుల్ని బాధిస్తున్నవి. చివరికి రాజ భవనంలో ఉన్నరాజుని సహితం ఇవి వదలలేదు.


ఇప్పుడు ఫరో "నీ దేవునికి ప్రార్థించు. అప్పుడు నేను ప్రజలను పోనిస్తాను. మీరు బలి అర్పించడానికి కొద్దికాలం వెళ్లడానికి అనుమతిస్తాను" అన్నాడు. మోషే మళ్లీ ప్రార్థన చేసాడు. ఈగలన్నీ మాయమయ్యాయి. మరి ఫరో ఏమన్నాడు? "లేదు, ప్రజలు వెళ్లటానికి వీల్లేదు".

ఐగుప్తులో చాల గుర్రాలు, గాడిదలు, ఆవులు, ఒంటెలు ఉన్నాయి. చూడండి శాలలోని ఒక గుర్రం కింద పడి చచ్చిపోయింది. అరె, మరోటి. అలా చాల జంతువులు చచ్చిపడుతున్నాయి. పశువులకు ఏదో రోగం వచ్చింది. ఈసారి తెగులు పశువుల మీదికి వచ్చింది. అయితే ఇశ్రాయేలు ప్రజల జంతువులకు ఏతెగులూ రాలేదు. వాళ్ల జంతువులేవీ చావలేదు.

అయినప్పటికీ ఫరో వాళ్లని ఒదిలి పెట్టలేదు. తరువాత మరో తెగులు వచ్చింది. మనుష్యుల మీదా జంతువుల మీదా పుండ్లు, గడ్డలు కనిపించాయి. అవి దురద కురుపులు. చాల బాధపెడుతున్నాయి. వాళ్ల తలల్లోనూ, చేతులు కాళ్లపైనా అవి వచ్చాయి. ఎక్కడ చూచినా పుండ్లే. వాళ్లు ఆ దురద భరించలేక గోక్కుంటున్నారు. అయినా లాభం లేకపోయింది. ఇప్పుడన్నా ఫరోదేవుని మాటకులోబడ్డాడా? లేదు. ఇప్పటికీ లోబడలేదు.

ఒక వడగండ్లువర్షం వస్తున్నది. అది బహుభయం కరమైనది. మనుష్యులు జంతువులు అందరూ మెరుపులు చూచి భయపడుతున్నారు. అయితే ఇందులో మరీ భయంకరమైన దేదోనీకు తెలుసా? మేఘాలనుండి వడగండ్లు పడుతున్నాయి. అప్పటికే చాల మంది వాటిబారిన పడకుండ దాగున్నారు. చాల పశువుల్ని శాలల్లోకి తెచ్చారు. అలా చేయమని మోషే చెప్పాడు. అయితే ఇంకా బయటనే ఉన్న మనుష్యులూ జంతువుల మాటయేమిటి? ఓ, వాళ్లంతా ఆ బరువైన వడగండ్ల వల్ల చచ్చిపోయారు. చెట్లూ మొక్కలూ కూడ పడిపోతున్నాయి. అయితే ఐగుప్తులు ప్రజలు ఉన్న చోట మాత్రం వర్షం కాని వడగండ్లు కాని పడలేదు. తాను పాపం చేసానని ఇప్పుడు ఫరో తెలుసుకున్నాడు. కాని అతడు నిజంగా పశ్చాత్తాప పడలేదు. ఇంకా ప్రజలను పోనీయలేదు.

మరో భయంకరమయిన తెగులు వచ్చింది. ఆదేశంలోకి మిడతలు వస్తున్నవి. వందలు వేలుగా పెద్దమిడతలు! అవి ఎంత ఎక్కువగా వచ్చాయంటే నేలకనపడకుండా భూమినంతా కప్పేసాయి అవి పొలంలోనూ ఇళ్లలోనూ నిండిపోయాయి. పచ్చని ఆకులన్నిటినీ అవి తినేస్తున్నవి. దీనివల్ల చెట్లూ, మొక్కలూ చచ్చిపోతున్నాయి. మనుష్యులూ పశువులూ



ఇప్పుడేం తింటారు? ఫరోదేవుని మాట వింటున్నాడా?

అతని సేవకులు ఇలా అన్నారు-రాజా, ఈతెగుళ్లు చాల భయంకరంగా ఉన్నాయి. దయచేసి ఈ ప్రజలను పోనీయండి.

''వీల్లేదు. వాళ్లిక్కడే ఉండాలి'' అన్నాడు రాజు. ఆ తరువాత తెగులు అన్నిటికంటె భయంకరమైనది. దేశమంతా చీకటికమ్మింది. ఆ చీకటి రాత్రివేళ మాత్రమే కాదు, పగటి పూట కూడ. వాళ్ళకి సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు ఏవీ కనపడ్డంలేదు. ప్రతి ఒక్కడూ ఇంటిలోనే ఉండవలసి వచ్చింది. మనుష్యులు చివరికి ఒకరినొకరు చూచుకోలేకపోయారు. వాళ్లకెంత భయంవేసిందో! అసలు మళ్లీ వెలుగు వస్తుందా?


మూడు దినాలు గడిచాక చీకటి మాయమయ్యింది. మళ్లీ వెలుగు వచ్చింది.

ఇప్పుడు ఫరో-సరే, మీరు వెళ్లవచ్చు. అయితే మీ పశువులు మాత్రం ఇక్కడే ఉండాలి, అన్నాడు. ''అలా కుదరదు. మాతో పాటు మాగొర్రెలును ఆవులను తీసికెళ్లాలి'' అన్నాడు మోషే.

అదివిని రాజు మోషేను, అహరోనును తరిమివేసాడు. ఇక మళ్లీ తన ముఖం చూడవద్దని ఆజ్ఞాపించాడు. మోషే అహరోనులు తిరిగి ఎన్నటికీ రాజమందిరానికి రాలేదు. ఎందుకంటే ఆ తరువాత వచ్చేదే చివరి తెగులు, అదే అన్నిటి కంటె భయంకరమైనది, ఎందుకంటే ఫరో దేవునికి లోబడలేదు. అతని మనసు కఠినంగా ఉండిపోయింది. అతడు దేవునివైపు చూడలేదు. దేవుడతనిని చాలసార్లు హెచ్చరించాడు.

ప్రతితెగులూ అతనితో మాట్లాడింది. దేవుని ఎదుట తగ్గించుకోమని అవి ఫరోకు బోధించాయి.

దేవుని వాక్యంతో ఆయన మనతో మాట్లాడుతున్నాడు. మారుమనసుపొంది ఆయనవైపు నిండు మనసుతో తిరగమని అది బోధిస్తుంది. దీనికోసం ప్రార్థించేలా దేవుడు మనకు నేర్పించాలి.



36. ఒక పండుగ

అది అర్ధరాత్రివేళ. ఐగుప్తు ప్రజలు నిద్రకు ఉపక్రమిస్తున్నారు. అయితే ఐగుప్తులీయులు అలాలేరు. వాళ్లు చాల తొందరలో ఉన్నారు. ఆ మరునాడు వెళ్లిపోడానికి సిద్ధపడుతున్నారు. దేవుడు ఇలా చేయమని వారికి చెప్పాడు. ఇశ్రాయేలు ప్రజల ఇంటిలో ఒకదానిని కాస్త చూదామా? వాళ్లిప్పుడే రాత్రి భోజనం చేస్తున్నారు. తండ్రి, తల్లి పిల్లలు. బల్ల మీద రుచికరమయిన వండిన మాంసం ఉంది. అది గొర్రెపిల్ల మాంసం. దానిని పస్కా గొర్రెపిల్ల అంటారు.

తల్లి రొట్టెలు కాల్చింది. అదో ప్రత్యేకమయిన పండుగ. అవును, అది విందు. ఈ పండుగను పస్కా అని పిలుస్తారు. తండ్రి గొర్రెపిల్లలను చంపాడు. దాని రక్తాన్ని ఒక గిన్నెలో తీసుకున్నాడు.

పిల్లల్లో ఒకడు "తండ్రీ, నీవా గొర్రెపిల్లలను ఎందుకు చంపావు? దీని అర్థం యేమిటి?" అని ప్రశ్నించాడు. అందుకు తండ్రి "దేవుని గొర్రెపిల్ల అయిన యేసు ప్రభువు. ఆ తరువాత వస్తాడని ఈ గొర్రె సూచిస్తున్నది. ఆయన కూడ ఇలాగే చంపబడతాడు. అది పాపానికి శిక్ష తన బిడ్డలందరి కోసం యేసు ప్రభువు బలి అయ్యాడు" అన్నాడు.

ఆ తరువాత తండ్రి యేం చేస్తాడు? రక్తంతో ఉన్న ఆ గిన్నె తీసుకున్నాడు. చిన్న మొక్కతో చేసిన కుంచె కూడ



తీసుకున్నాడు. ద్వారం దగ్గరకు వెళ్లాడు. చూడండి, ఆ రక్తాన్ని, ద్వారంపై ఇరుప్రక్కలా, పైనా చిలకరించాడు. "తండ్రీ, నీవెందుకిలా చేస్తున్నావు"?

"దేవుడు ఇలా చేయమని ఆజ్ఞాపించాడని మోషే చెప్పాడు".

"అయితే తండ్రీ, దీని అర్థం యేమిటి?"

తండ్రిఇలా జవాబిచ్చాడు. "ఈ రాత్రి మరణదూత వస్తాడు. అతడు ప్రతి ఇంటికీ వస్తాడు. అతడు ద్వారబందాల మీద రక్తం లేకపోవడం చూస్తే ఆ ఇంటిలో ప్రవేశిస్తాడు. అప్పుడు అందులోని పెద్ద కుమారుడు చచ్చిపోతాడు. అయితే ఆదూత ఏ ఇంటిలోకి రాకుండ ఉంటాడో తెలుసా? అతడు ద్వారబందాల మీద రక్తం ఉంటే లోనికి రాడు. దూత ఆ ఇంటిని దాటిపోతాడు. అక్కడ ఎవ్వరూ చచ్చిపోరు. అక్కడ ఒక గొర్రె పిల్లను చంపారనడానికి రక్తం ఆ దూతకు గుర్తుగా ఉంటుంది. పస్కా గొర్రెలా యేసు ప్రభువు కూడ తనరక్తాన్ని చిందించి ప్రాణాన్నిస్తాడనడానికి ఇదో సూచన. దేవుని గొర్రెపిల్ల అయిన యేసులో నమ్మకం ఉంచి, ఆయన ప్రశస్త రక్తం చేత తడిచిన వాళ్లు పరలోకానికి వెళ్తారని దీని అర్థం. రాబోయే ఉగ్రతను వాళ్లు తప్పించుకుంటారు. రాత్రి అయ్యింది. నాశనం చేసే దూత పరలోకం నుండి దిగివచ్చాడు. అతడు ఐగుప్తు ప్రజల ఇళ్లను సమీపించాడు. అక్కడ గొర్రెపిల్ల ఏదీ చంపబడలేదు. ద్వారబందాల మీద ఏ రక్తమూలేదు. దూత లోపటికి వెళ్లింది. మొదటి కుమారుడు చచ్చిపోయాడు. ఆదూత రాజభవనంలోకి సహితం వెళ్లింది. అక్కడ మొదట పుట్టిన రాజకుమారుడు చచ్చిపోయాడు.

దూత ఐగుప్తులు ప్రజల ఇళ్లు దాటిపోయాడు. వాళ్ల ద్వార బందాలపై రక్తం ఉంది. కాబట్టి లోనికి వెళ్లడు. అక్కడెవ్వరూ చచ్చిపోనవసరం లేదు.

ఉదయం అయ్యింది. అయ్యో, ఈజిప్టు ప్రజల ఇళ్లలో విచారం అలముకొన్నది. వాళ్ల ఇళ్లల్లో ఒకడు చనిపోయాడు. వాళ్లంతా చాల ఏడుస్తున్నారు. అవును, ఇది దేవుని నుండి కలిగిన మరో శిక్ష. ఇది పదవ తెగులు.

అప్పుడు ఫరో ఇలా అన్నాడు "మోషే, దయచేసి నీవు త్వరగా వెళ్లిపో. నీతో సమస్తాన్నీ తీసుకపో" మిగిలిన ఈజిప్టు ప్రజలందరూ అదే మాట పలికారు.

అబ్బ, ఎంత మంది ప్రజలు, పశువులు ఐగుప్తు వదిలి వెళ్తున్నాయో చూచారా? ఎవ్వరయినా రావచ్చు, చిన్న పిల్లలు కూడ ఉన్నారు. వాళ్లు ఐగుప్టు ప్రజల నుండి బంగారం, వెండి, మంచి మంచి బట్టలు కూడ తీసుకున్నారు. ఇశ్రాయేలు ప్రజలు వెళ్లిపోవడం వాళ్లకి కూడ చాల ఆనందంగా ఉంది.

మేము పస్కాపండుగ గురించి యేం చెప్పామో గుర్తుందా? బలియిచ్చిన గొర్రెపిల్ల రక్తం చిలకరించడం గురించి. ఇదంతా దేవుని గొర్రెపిల్లయైన యేసు ప్రభుని వైపు చూపిస్తున్నది. ఆయన తన రక్తాన్ని ధారపోయడానికి ఇష్టపడ్డాడు. అంటే చచ్చిపోవడానికి ఇష్టపడ్డాడు. తన పిల్లలు చేసిన పాపాలన్నిటికి రావలసిన శిక్షను అనుభవించడానికి. పాపం ఎంత భయంకరమయినదో ఇప్పుడు అర్థం అయ్యిందా?

యేసు ఎవరి కోసం చచ్చిపోయాడు? ఆయనను ప్రేమించిన వారందరికోసం. అంటే తన పిల్లలకోసం. ఎందుకంటే వాళ్లంతా ఎన్నటెన్నటికీ పరలోకంలో తనదగ్గరే ఉండడానికి.

నిన్నుకూడ ఆయన తన పిల్లలలో చేర్చుకొనేలా యేసు ప్రభువుని ప్రార్థించు.



37. ఎర్రసముద్రాన్ని దాటుట

ఎంత గొప్పజన సమూహం! ఎన్నిపశువులు! వీళ్లంతా ఇశ్రాయేలు ప్రజలు. వాళ్లు ఈజిప్టు విడిచి కానాను దేశానికి వెళ్తున్నారు. ఎంత ఆనందంగా ఉన్నారు! వాళ్లికిపై బానిసలు కారు. వారు స్వేచ్ఛాజీవులు. దేవుడు వాళ్లకి మేలు చేసాడు. వాళ్లని విడిపించాడు.

వాళ్లు ఒక పెద్ద సముద్రం దగ్గరకు వచ్చారు. ఈ సముద్రం పేరు ఎర్రసముద్రం. అంతలో హఠాత్తుగ రథాల చప్పుడు గుర్రాల చప్పుడు వినబడింది. వెనక్కితిరిగి చూస్తే పెద్ద ఎత్తున దుమ్మురేగుతోంది. అదేమిటబ్బా! అది మరింత దగ్గరవుతున్నది. అవును, ఇప్పుడు కనిపిస్తోంది. అదుగో, ఈజిప్టు ప్రజలు! ఈజిప్టురాజు తన రథాలతో గుర్రాలతో వస్తున్నాడు. అందులో బలమైన సైనికులున్నారు. వారి చేతిలో కత్తులు బళ్లాలూ ఉన్నాయి. అవి ఎండలో తళతళలాడుతున్నాయి చూడండి.

"రండి, మనమా బానిసలను తిరిగి పట్టు కుందాం. వాళ్లు మళ్లీ మనకోసం పని చెయ్యాలి" అంటున్నాడు ఫరో. అయ్యో, ఇశ్రాయేలీయులు చాల భయపడ్డారు. వాళ్లు వణికిపోతున్నారు. ఇక తప్పించుకొనే మార్గం లేదు. వాళ్లముందు ఎర్ర సముద్రం. వారి వెనక పర్వతాలు. ఈజిప్టు ప్రజలతో యుద్ధం చేయాలా? చేయలేరు. వారిని జయించలేరు. సాయం కోసం దేవుని ప్రార్థించారు. వాళ్లు మోషేతో "మనం ఈజిప్టులోనే ఉండవలసింది, ఎందుకంటే వీళ్లతో మనం యుద్ధం చేయలేము" అన్నారు.

మోషే ఏమీ చెబుతున్నాడో వినండి. "భయపడకండి. మీరు యుద్ధం చేయనవసరం లేదు. మీ పక్షంగా దేవుడే ఆపని చేస్తాడు. మీరు ఊరక నిలుచుండి చూడండి".

వాళ్లు నీళ్లదగ్గరికి వచ్చారు. మోషే ముందు ఉన్నాడు. అతడు నీళ్ల దగ్గర ఆగిపోయాడు. అతడు తన చేతికర్రను నీటిపైన చాపాడు. అలా చేయమని దేవుడే చెప్పాడు. ఇప్పుడెంత అద్భుతం జరుగుతున్నది! నీళ్లల్లో ఒక మార్గం ఏర్పడడం వాళ్లు చూచారు. అదో చక్కని విశాలమైన దారి. అది ఈ ఒడ్డు నుండి ఆ ఒడ్డు వరకు ఏర్పడింది. దానికి రెండు వైపులా నీళ్లుగోడలా నిలిచి ఉన్నాయి. మోషేను చూడండి. అతడప్పుడే ఆదారిలో నడుస్తున్నాడు. మనుష్యులంతా, పశువులతో పాటు అతని వెంట వెళ్తున్నారు. వాళ్లంతా ఆరెండు నీటి గోడల మధ్య క్షేమంగా నడుస్తున్నారు. చివరికి వాళ్లు అవతలి ప్రక్కకు చేరారు.

అదుగో ఫరో సైన్యం. గుర్రాలు వాళ్లవైపుకు పరుగులు తీస్తున్నాయి. రథాలమీద బలమైన సైనికులున్నారు. నీళ్ల మధ్యనున్న చక్కని విశాల మార్గాన్ని ఫరో చూచాడు. "రండి, రండి. మనం కూడ దీని గుండా నడిచిపోదాం" అన్నాడు. అదిగో వాళ్లు రథాలమీద వెళ్తున్నారు. వాళ్లంతా ఇప్పుడు నీటి మధ్యనున్న దారిలో వెళ్తున్నారు. మరోక్షణంలో....

మోషే అవతలి ఒడ్డున నిలబడ్డాడు. తన సైన్యంతో పాటు కోపంగా వస్తున్న రాజును చూచాడు. మరి మోషే



ఏం చేసాడు? అతడు తన చేతిని నీటి మీద చాపాడు. దేవుడు చెప్పినట్టే చేసాడు.

అప్పుడు... అయ్యో, ఎంత భయంకరం! గోడల్లా నిలిచిన నీళ్లు క్రిందికి ప్రవహించాయి. అవి మార్గం మీదికి వచ్చిపడ్డాయి. రథాలమీద గుర్రాల మీద. రాజుమీద అతని సైన్యం మీదా ప్రవహించాయి. వాళ్లంతా ఆ నీటి ప్రవాహంలో మునిగిపోయారు. ఇది దేవుని శిక్ష, అవును. తమకోసం ఎవరుయుద్ధం చేసారో ఇప్పుడు ఇశ్రాయేలీయులకు తెలిసింది. దేవుడే దానిని చేసాడు. ఆయనే వాళ్లని రక్షించాడు. దేవుడు మాత్రమే దానిని చేసాడు. ఇశ్రాయేలీయులు ఏమీ చేయవలసిన అవసరం కలుగలేదు. మోషే దేవుని సేవకుడని వాళ్లిప్పుడు నమ్మారు.


వినండి. ఎవరు అంత తీయగా పాడుతున్నారు?

ఇశ్రాయేలు ప్రజలే. వాళ్లు దేవునికి ఒకగీతం ఆలాపిస్తున్నారు. ఆ అద్భుతం గురించి పాడుతున్నారు. నీటిలో ఏర్పడిన మార్గం గురించీ, నీటిలో మునిగిన శత్రువులను గురించీ. వారు ఆ పాటతో దేవునికి వందనాలు చెల్లిస్తున్నారు. వారి సంగీతం అద్భుతం. వారాయనను స్తుతిస్తున్నారు.

దేవుని స్తుతించే ఓ కీర్తన లేదా గీతం నీకు తెలుసా? దేవుని స్తుతించండి! పరలోకమా, ఆయనను ఆరాధించు.

పైనున్న దూతలారా, ఆయనను స్తుతించండి. సూర్యచంద్రులారా, ఆయన ఎదుట మోకరించండి. కాంతిగల నక్షత్రములారా, ఆయనను కీర్తించండి. దేవుని స్తుతించండి. ఎందుకంటే ఆయన సెలవీయగా ఆయన బలమైన స్వరానికి లోకాలన్నీ విధేయమయ్యాయి. ఆయన చేసిన న్యాయవిధులు ఎన్నటికీ తప్పిపోవు.

పాటలు పాడడం మంచిది. అయితే అది హృదయపూర్వకమైనదా కాదా అన్నది దేవునికి తెలుసు. మన హృదయం మారినపుడే నిజంగా పాడగలం. దీనికోసం దేవుని ప్రతిదినం ప్రార్థించడం మరువకండి.



38. దేవుడు తన ప్రజలను చూచుకొనును

ఇశ్రాయేలు ప్రజలు తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. వాళ్లు అరణ్యం గుండావెళ్తున్నారు. అక్కడ చక్కని రోడ్లు లేవు. ఎక్కడ చూచినా ఇసుక. వాళ్లకి త్రోవ తెలుసా? ఎక్కడికి వెళ్లాలో మోషే వాళ్లకి చెప్పాడా? లేదు. అది దేవుడే బెబుతాడు. చూడండి. ముందు అక్కడో తెల్లని దట్టమయిన మేఘం ఉంది. అది ప్రజల ముందే వెళ్తూ ఉన్నది. అదే వాళ్లకి మార్గం చూపిస్తున్నది. ఆ మేఘం ఉన్న చోట దేవుడుంటాడు. మేఘం ఎక్కడికి వెళ్తే ఇశ్రాయేలీయులు అక్కడికి దాని వెంటవెళ్తారు. కాబట్టి వాళ్లు దారితప్పిపోరు.

పగటి పూట చాల వేడిగ ఉండేది. సూర్యుడు తీక్షణంగ ప్రకాశించేవాడు. అప్పుడు దేవుడు వాళ్లకి నీడనిచ్చేవాడు. మేఘం ద్వారా, లేదా మనం పిలిచినట్టు మేఘ స్తంభం ద్వారా వాళ్లకి నీడ కల్పించేవాడు.

రాత్రి చీకటి పడినప్పుడు ప్రజలకు భయం వేసేదా? అడవి మృగాలు వచ్చేవా? లేదు, లేదు. ఎందుకంటే మేఘంలో అగ్నిమండుతుండేది. దానిని అగ్ని స్తంభం అనేవాళ్లు. ఆ అగ్నివారికి వెలుగునిచ్చేది. కాబట్టి రాత్రి పూట పూర్తిగ చీకటి ఉండేది కాదు. అడవి జంతువులు మరీ దగ్గరికి రాడానికి భయపడేవి. అవి ప్రజలకు హాని చేయడానికి భయపడేవి దేవుడు వారిని కాపాడుతున్నాడు. వారు భద్రంగ నిదురపోయే వాళ్లు.

ప్రజలు అలిసిపోయినపుడు, ముఖ్యంగా చిన్నపిల్లలు లేదా వాళ్లు చాల దినాలు నడిచినపుడు దేవుడు చూచేవాడు. అప్పుడు మేఘం ఆగిపోయేది. అంటే మీరిపుడు విశ్రాంతి తీసుకోవచ్చు అని అర్థం.

వాళ్లు విశ్రాంతి తీసుకున్న తరువాత, తిరిగి మేఘం కదిలేది. అంటే మీరు మళ్లి కదలవచ్చు అని అర్థం. మేఘం వేగంగా కదిలేది కాదు. పెద్ద వాళ్లలా చిన్న పిల్లలు త్వరగా నడవలేరని దేవునికి తెలుసు.

దేవుడు తన ప్రజల పట్ల ఎంత మంచితనం చూపిస్తున్నాడు! దీనిని వాళ్లు మరువనంత కాలం ఆయన వారినలాగే చూస్తాడు.

ఈజిప్టునుండి ప్రయాణమయ్యేటప్పుడు ప్రజలు రొట్టెలు, నీళ్లు తెచ్చుకున్నారు. అయితే ఆ నీళ్లన్నీ అయిపోయాయి. వాళ్లకి చాల దాహం వేసింది. వాళ్లు చుట్టూ చూచారు. ఎక్కడ చూచినా ఇసుక మాత్రమే కనిపించింది? చిట్టచివరకి పరుగెత్తారు. నీళ్లు త్రాగడం మొదలుపెట్టారు. కాని త్రాగలేక పోయారు. అవి చేదుగ ఉన్నాయి!

దీంతో ప్రజలకు చాల కోపంవచ్చింది. వాళ్లు మోషేకు ఫిర్యాదు చేసారు-మేమిప్పుడు ఏం త్రాగాలి? చేదునీళ్లు తప్ప మరేవీ లేవు అన్నారు.

అలా మాట్లాడడం ఎంత విచారకరం! దేవుడు ఇప్పటిదాక వాళ్లని పోషిస్తూ వచ్చాడు కదా? అదంతా అప్పుడే మరచిపోయారా?

మోషే సహాయం కోసం దేవునికి మొరపెట్టాడు. దేవుడు మోషే మొరవిన్నాడు. ఆయన తప్పక సహాయం చేస్తాడు.

అదుగో మోషే వస్తున్నాడు. అతని చేతిలో ఒ కర్రముక్క ఉంది. చూడండి, అతడు దానిని నీటిలో వేసాడు. మోషే ఎందుకు అలా చేసాడు? ఆ



కర్రముక్కనీటిని బాగుచేయలేదు కదా. అవును, అతడు నీటి రుచిని మార్చలేడు కాని దేవుడు చేయగలడు. ఏం చేయాలో దేవుడే మోషేకు చెప్పాడు. కాబట్టి అతడు దానిని నీటిలో వేసాడు.

అతడు ప్రజలతో "వెళ్లి త్రాగండి. ఇప్పుడు నీళ్లు తీయగా ఉంటాయి" అన్నాడు.

కొందరు నెమ్మదిగ ఆ నీళ్లు రుచిచూచారు. నిజమే, అవి తీయగ ఉన్నాయి! ఇప్పుడు ప్రజలు వాటిని త్రాగవచ్చు. వాళ్లదాహం తీరేంతవరకు. దేవుడు అద్భుతంగా వారిని మళ్లీ కాపాడాడు.

దేవుడు మనలను కూడ సంరక్షిస్తాడు. ఆయన నిత్యం మన అవసరాలు తీర్చుతాడు. మనం బడిలో ఉన్నా, ఆడుకుంటున్నా, రాత్రివేళ ఏడుస్తున్నా చూడగలడు. తన పిల్లలను ప్రత్యేకంగ సంరక్షిస్తాడు.

మనం ఆయన పిల్లలమయితే మనలను విడువడు, ఎడబాయడు. మనం చచ్చిపోయే సమయంలోకూడ మనతోనే ఉంటాడు.



39. దేవుడు నిరంతరము తన ప్రజలను పట్టించుకొనును

ఇశ్రాయేలు ప్రజలు ఈజిప్టునుండి ఆహారం కూడ తెచ్చుకున్నారు. అదంతా అయిపోయింది. అరణ్యంలో ఆహారం ఎక్కడ దొరుకుతుంది? అక్కడ ఏమీ దొరకదు.


వాళ్లు మోషే అహరోనులకు మళ్లీ ఫిర్యాదు చేసారు. "మేం ఈజిప్టులోనే ఉండిపోవలిసింది. అక్కడ కావలసినంత రొట్టె మాంసం దొరికేది. ఇక్కడ మాకేమీ లేదు. మేం ఆకలితో చచ్చిపోతాం" అన్నారు. వీరి మాటలు మోషేకు దుఃఖం కలిగించాయి. అతడు "మీరు మా మీద మాత్రమే కాదు దేవుని మీద కూడ సణుగుతున్నారు. ఆయన నిత్యం మీ అవసరాలు తీరుస్తున్నారు. ఇప్పుడు ఆకలితో చచ్చిపోతామనుకుంటున్నారా? లేదు. ఈ రాత్రి దేవుడు మనకు మాంసం ఇస్తాడు. రేపు మీరు రొట్టె తింటారు" అన్నాడు

సాయంకాలమయ్యింది. చూడండి, వేలకొలది పక్షులు వచ్చాయి. నేలంతా వాటితో కప్పబడి పోయింది. అవి ఎగిరిపోలేదు. ఇశ్రాయేలీయులు కావలసినన్ని పిట్టలను పట్టుకున్నారు. అబ్బ, వారు రుచికరమైన వంటవండుకొని తింటూన్నారు.

మరునాడు ప్రజలు నిదురలేచారు. వాళ్లు తమ గుడారాలనుండి బయటికి వచ్చారు. చూడండి, వాళ్లకేమీ కనిపించింది? నేల మీద పడి ఉన్నదేమిటి? వారి చుట్టూ ప్రతిచోటా చిన్నచిన్న గింజలు పడి ఉన్నాయి. అదేమిటబ్బా?

అదేమిటో మోషేకు తెలుసు. "ఇది మన్నా, దేవుడు పంపిన ఆహారం. పరలోకం నుండి పడినది. దీనిని సమకూర్చుకొనండి. దీనితో మీరు రొట్టెలు చేసుకొనవచ్చు" అని చెప్పాడు.

ప్రజలు వెంటనే అలా చేసారు. అది చాల రుచిగా ఉంది. తేనెలా తీయగ ఉంది. కొందరు ఎక్కువ కూర్చుకున్నారు. అయితే చివరకు వాళ్లకు ఎక్కువ



మిగలలేదు. కొందరు తక్కువ కూర్చుకున్నారు. అయినా వాళ్లకు తక్కువ కాలేదు. దేవుడు ప్రతి ఒక్కరికీ సరిపోయినంత దయచేసాడు.

"మీరు రేపటి కోసం దాచుకోవద్దు. ఎందుకంటే రేపు మళ్లి తాజాగా, మన్నాకురుస్తుంది" అని మోషే చెప్పాడు. అయినా కొందరు దాచుకున్నారు. అది మళ్లీ దొరకదేమోనని వాళ్ల భయం! అయితే మరునాడు ఏం జరిగింది? దాచుకున్న మన్నాపాడైపోయింది. అది కంపుకొట్టింది. పురుగు పట్టింది!

దీన్ని చూచి మోషేకు కోపం వచ్చింది. "మీరు దేవుని మాటకు లోబడాలి" అని చెప్పాడు.

ప్రతిదినం క్రొత్తమన్నా నేల మీద కురిసేది. ప్రతిదినం తినడానికి సరిపడినంత వారికి దొరికేది. అయితే వారంలో ఒక్కదినం మాత్రం మన్నా కురిసేది కాదు. అది సబ్బాతుదినం. మనం దానిని ఆదివారం అని పిలుస్తాము. అది ప్రభువు దినం. ప్రజలు విశ్రాంతి తీసుకునేరోజు, సబ్బాతుదినాన ఇశ్రాయేలు ప్రజలకు



తినడానికి ఏమీ ఉండదా? అబ్బే, ఉంటుంది. ఆ ముందు దినం ఒక వంతుకు బదులు రెండు వంతులు కూర్చుకుంటారు. అంటే రెండింతలు. ఇప్పుడు అందులో సగభాగం మరు నాటికి దాచుకోవచ్చు. సబ్బాతు దినాన మన్నా పాడవ్వదు.

కొన్ని దినాలయ్యాక ప్రజలు మళ్లీ గొణగడం మొదలు పెట్టారు. ఇప్పుడు దేని కోసం? నీళ్లు అయిపోయాయి. వాళ్లకి చాల దాహం వేస్తోంది. దానికోసం వాళ్లు వినయంగా దేవుని ప్రార్థించాలి. కాని వాళ్లు ప్రార్థించరు. వాళ్లు కోపంగా ఉన్నారు. వాళ్లు మోషేతో - నీవు మమ్ములను ఈజిప్టునుండి ఎందుకు బయటికి తెచ్చావు? ఇప్పుడు మేము దాహంతో చచ్చిపోతాం, అన్నారు.

చివరికి మోషేను చంపడానికి రాళ్లు కూడ తీసుకున్నారు. వాళ్లంత కోపంగా ఉన్నారు. దానికి మోషే చాల విచారించాడు. "దేవా, నేనిప్పుడేం చేయాలి?" అని అడిగాడు. దేవుడు "మోషే నేను ప్రజలకు నీళ్లిస్తాను. నాతోరా" అన్నాడు. మోషే ప్రజలతో దేవుడు మీకు నీళ్లిస్తాడు" అని చెప్పాడు.

మోషే ఒక పెద్ద బండదగ్గరికి వెళ్లాడు. తన కర్రతో ఆ బండను కొట్టాడు. హఠాత్తుగ దానిలో ఒక పెద్ద రంధ్రం ఏర్పడింది. దాని నుండి నీళ్లు బయటికి ప్రవహిస్తున్నాయి. స్వచ్ఛమైన తాజానీళ్లు. ఇదెంత గొప్ప అద్భుతం! బండ నుండి నీళ్లెలా వస్తాయి?

అవును, అది దేవుడు చేసిన అద్భుతం. మనుష్యులూ పశువులూ అందరూ ఆ నీళ్లు త్రాగారు. అందరికీ కావలసినంత నీళ్లు ఉన్నాయి.

ప్రజలు సణిగినందుకు అసలు శిక్షపొంద వలిసింది. వారికన్నీ ఉన్నా తృప్తిలేదు. అయినప్పటికీ దేవుడు వాళ్లకి మాంసం, రొట్టెలు, నీళ్లు ఇచ్చాడు. దేవుడెంత ఓర్పు కలవాడు!

దేవుడు మన పట్ల కూడ చాల ఓర్పు చూపిస్తున్నాడు. మనం కూడ చాల సార్లు అసంతృప్తి చూపిస్తాము. దీనికి కారణం మన చెడ్డమనసు. అయినా దేవుడు మనకు ప్రతిరోజు ఆహారం నీళ్లు ఇస్తున్నాడు. దీనిని అర్థం చేసుకోవడం కష్టం. మనపట్ల ఆయనకు గల ప్రేమ, దయ ఎంత గొప్పదో ఆయననీకు చూపించును గాక!

40. ఎవరు బలవంతుడు?

వినండి. ఆ శబ్దం ఏమిటి? ఏం జరుగుతున్నది? ఎవరో సహాయం కోసం పిలుస్తున్నారు. అవును, ఈ జన సమూహం చివర నున్న ప్రజలు సహాయం కోసం అరుస్తున్నారు. అక్కడ దొంగలున్నారు! బలమైన సైనికులు అన్నీ దోచుకోవాలను కుంటున్నారు. చివరికి వాళ్లు ప్రజలను చంపాలని కూడ అనుకున్నారు. వారు అమాలేకీయులు. వాళ్లెంత నీచులో చూడండి! వాళ్లు ప్రయాణం చేస్తున్న వారిలో చివరనున్న స్త్రీలను, పిల్లల్ని, పశువుల్ని పట్టుకున్నారు. వాళ్లకి భయం లేదు. బలహీనులు వీరి చేతినుండి తప్పించుకోలేరు.

ఇశ్రాయేలీయులిప్పుడు ఏం చేయాలి. వాళ్లలో పురుషులు యుద్ధం చేయడంలో తర్బీతు పొందలేదు. ఎందుకంటే వాళ్లు మొదట్నుంచీ బానిసలుగ ఉన్నారు. అయితే మోషే మాత్రం "మనం శత్రువులతో యుద్ధం చేద్దాం. రేపు యుద్ధం మొదలు పెడదాం" అన్నాడు.

మరునాడు అదే జరిగింది. ఇశ్రాయేలు ప్రజలలో నున్న మగవాళ్లంతా అమాలేకీయులతో యుద్ధం చేయడానికి సిద్ధమయ్యారు. వారి ముందు ఎవరున్నారు? వారినాయకుడెవడు? అది మోషే అయ్యుండాలి. కాదు, కాదు, సైనికుల్లో మోషే లేడు. అయితే అతడు యుద్ధం చేయడా? చేస్తాడు కాని కత్తితోను లేదా బల్లెంతోను కాదు. మరెలా చేస్తాడు? అదిగో, ఆ కొండ వైపు చూడండి. దాని శిఖరం మీద మోషే తన చేతికర్రతో నిలబడి ఉన్నాడు. అతడా కర్రను పైకెత్తి పట్టుకున్నాడు. ఆపైన, ఇంకాపైన పరలోకంలో ఎవరున్నారు? అక్కడ దేవుడున్నాడు. మోషే తన కర్రను పైకెత్తాడు. దానికి "ఓ దేవా, మాకు సహాయం చేయి" అని అర్థం! మోషే తన చేతి కర్రను పైకెత్తి ప్రార్థన చేస్తున్నాడు.

యుద్ధం చేస్తున్న ఆ మనుష్యులను చూడండి. అవును, ఇశ్రాయేలీయులు జయిస్తున్నారు. దేవుడు వాళ్లకి సహాయం చేస్తున్నాడు!





అయితే మోషే చేతులు నొప్పెడుతున్నాయి. అతడిక కర్ర ఎత్తి పెట్టలేకపోతున్నాడు. కర్రతో పాటు చేయిక్రిందికి వాలిపోతున్నది.

ఆ తరువాత ఏం జరిగింది? ఇప్పుడు శత్రువైన అమాలేకీయులు గెలుస్తున్నారు! అయ్యో, మోషే కర్రను ఎత్తిపట్టు. దేవునికి ప్రార్థించు. దేవుని దయవల్ల కొండ మీద మోషే ఒక్కడే లేడు. మరో ఇద్దరు కూడ ఉన్నారు. వాళ్లు అహరోను, హూరు అనే వాళ్లు. మోషే కూర్చోడానికి వాళ్లొక పెద్దరాయి వేసారు. మోషే కర్ర ఎత్తి పెట్టాడు. వాళ్లిద్దరూ అతని చేతులు ఎత్తిపెట్టారు. అతని చేతిక్రింద వాళ్లు తమ చేతులు పెట్టారు. ఇప్పుడు మోషే అంతగా అలిసి పోవడం లేదు. మోషే, దేవా, దయ చేసి ఇశ్రాయేలు ప్రజలకు సాయం చెయ్యి అని ప్రార్థించాడు. అహరోను, హూరు కూడ మోషేతో పాటు అదే విధంగా ప్రార్థన చేసారు.

అదిగో, మళ్లీ ఇశ్రాయేలీయులు గెలుస్తున్నారు. వాళ్లు ఇప్పుడు మోషే చేతులు ఎత్తి పట్టడం వల్ల గెలుస్తున్నారు.

చీకటి పడుతున్నది. చాల మంది అమాలేకీయులను చంపారు. మిగిలిన వాళ్లు తప్పించుకున్నారు. ఇశ్రాయేలీయులు గెలిచారు. వాళ్లే బలవంతులు. అదెలా సాధ్యం? ఎలా అంటే యుద్ధం యెహోవాయే చేసాడు కాబట్టి వారి దేవుడే అందరి కన్న బలవంతుడు. మోషే దేవునికి ప్రార్థన చేసాడు. అతని వద్దనున్న ఇద్దరు మనుష్యులు సాయం చేసారు. అవును, దేవుడు కోరేది అదే. మనమాయనకు ఎల్లప్పుడూ ప్రార్థన చెయ్యాలి. ఆ కొండ మీద నిలిచిన మనుష్యుల్లా.

మరి నీవు దేనికోసం ప్రార్థన చేయాలి? నీ హృదయంలో ఉన్న పాపాన్ని ఓడించేలా. ఇశ్రాయేలు ప్రజలు తమ శత్రువులను జయించినట్టే నీవు పాపాన్ని జయించేలా ప్రార్థించు.

41. నీ దేవుడనైన యెహోవాను నేనే

ఇశ్రాయేలు ప్రజలు ఒక ఎత్తయిన పర్వతం చేరుకున్నారు. దానిపేరు సీనాయి. దేవుని మేఘం వారికి మార్గం చూపిస్తోంది. వాళ్లక్కడ కొంత కాలం ఉన్నారు. ఆ మేఘం ఇప్పుడు పర్వత శిఖరం పైన ఉంది. ప్రజలు ఆ పర్వతాన్ని తాకడానికి వీల్లేదు. ఎందుకంటే దేవుడక్కడ ఉన్నాడు, ఆయన పరిశుద్ధుడు. ప్రజలు పాపులు.

మోషే ప్రజలతో ఇలా చెప్పాడు, "దేవుడు మనతో మాట్లాడబోతున్నాడు. మనం భక్తితో వినాలి. అయితే ముందుగా మనం శుద్ధి చేసుకోవాలి. మన వస్త్రాలు ఉతుక్కోవాలి. ఎందుకంటే దేవుని ఎదుట మురికి బట్టలతో కనపడకూడదు".

దీని అసలు అర్థం యేమిటో తెలుసా? మన హృదయాలు పాపం నుండి శుద్ధి కావాలి. ఎందుకంటే మనమందరం పాపులమే. మరునాడు ప్రజలు మోషే చెప్పినట్టు చేసారు. ఇశ్రాయేలీయులు వాళ్ల గుడారాల బయటికి వచ్చారు. చిన్న పిల్లలు కూడ వచ్చారు. వాళ్లంతా పర్వతపాదం దగ్గరకు వచ్చారు. వారు భక్తితో పైకి చూచారు. మేఘం నుండి అగ్నిరావడం కనిపించింది! గొప్ప శబ్దంతో ఉరుములతో కూడిన తుఫాను ప్రారంభం కానున్నది. మెరుపులు ఆకాశంలో ఒక దిక్కునుండి మరో దిక్కును మెరిపిస్తున్నాయి. అది సామాన్యమయిన ఉరుముల తుఫాను కాదు. దేవుడే సాక్షాత్తు ఆ పర్వతం పైకి దిగివచ్చాడు. పర్వతమంతా కదులుతున్నది. సర్వశక్తిమంతుడయిన దేవుడు అలాంటివాడు. ప్రజలు కూడ వణికిపోతున్నారు. వాళ్లకి భయం, ఆశ్చర్యం వేస్తున్నవి. ఎందుకంటే దేవుడు అంతటి పరిశుద్ధుడు.

వాళ్లకి బూరధ్వని కూడ వినిపించింది. పెద్ద శృంగాన్ని ఎవరో ఊదుతున్నధ్వని అది. అది ఇంకా ఇంకా గట్టిగ వినిపిస్తున్నది.

మళ్లీ అంతా నిశ్శబద్ధం. వినండి. ఇప్పుడు దేవుడు మాట్లాడుతాడు. ప్రజలు ఆయన స్వరాన్ని విన్నారు. "మీ దేవుడనైన యెహోవాను నేనే." అబ్బ, ఎంత అద్భుతం. యెహోవాయే వారి దేవుడు! ఆయన వారికి తండ్రిగా ఉండాలని కోరుతున్నాడు. వాళ్లంతా ఆయన పిల్లలు. దేవుడే వాళ్లని పోషిస్తాడు. తండ్రి తన పిల్లలను పోషించినట్లే.

అయితే వాళ్లాయనకు లోబడాలి. ఎందుకంటే పిల్లలు తండ్రి చెప్పిన దంతా చేయాలి. మరి వాళ్లేం చేయాలని దేవుడు కోరుతున్నాడు? ప్రజలు ఆయనను ఎలాసేవించాలి? దేవుడింకా ఏం చెప్పాడో వినండి! "మీరు వేరే ఏ విగ్రహమునుగాని పూజించకూడదు". ఇది దేవుడిచ్చిన పది ఆజ్ఞలలో మొదటిది. ఇది దేవుడిచ్చిన పరిశుద్ధమయిన ధర్మశాస్త్రం. దేవుడు అన్ని ఆజ్ఞలూ చెప్పాడు. మనం ఆదివారం గుడిలో విన్నట్టే. దేవుడ్ని ఎలా సేవించాలో ఇప్పుడు ప్రజలకు తెలిసింది. వాళ్లు భక్తితో ఆయన మాటలన్నీ విన్నారు.

మళ్లీ కాసేపు నిశ్శబ్దం. దేవుడు మౌనంగా ఉన్నాడు. అయితే మళ్లీ ఉరుముల శబ్దం వినవచ్చింది. మళ్లీ ఆకాశంలో మెరుపులు మెరుస్తున్నవి. బూరధ్వని కూడ తిరిగి వినిపించింది. ఆ గొప్ప పర్వతం మళ్లీ కంపించుతున్నది! ప్రజలు చాల భయపడ్డారు! వాళ్లా పర్వతం దగ్గరగా నిలవలేకపోయారు. వాళ్లు వెనక్కి, ఇంకా ఇంకా వెనక్కి వెళ్లారు.

వాళ్లు మోషేతో "ఇక మేమిక్కడ నిలబడే ధైర్యం మాకు లేదు. నీతోనే మాట్లాడమని దేవునికి చెప్పు. ఆయన మాటలు ఆ తరువాత నీవు మాకు చెప్పవచ్చు" అన్నారు. మోషే అలాగే దేవునికి మనవి చేసాడు. దేవుడు అంగీకరించాడు. ఇప్పటి నుండి ఆయన సమస్తం మోషేకు తెలియజేసాడు. తర్వాత మోషే ప్రజలకు చెప్పేవాడు. ప్రజలు మోషేతో - దేవుడు చెప్పినట్టే మేం చేస్తాము. మేము దేవునికి లోబడతాము-అని చెప్పారు.

వాళ్లు నిజంగా లోబడతారా? అలా చేసే శక్తి వాళ్లకున్నదా? ఆయన వాళ్లకి సాయం చేస్తేనే అలా లోబడగలరు!

మరి మన మాటయేమిటి? మనం కూడ తనకు లోబడాలని దేవుడు కోరుతున్నాడు. అయితే మన హృదయంలో పాపం ఉంది. కాబట్టి మనం "దేవా, మేము నీకు లోబడేలా సాయం చేస్తావా?" అని దేవున్ని ప్రార్థించాలి.





42. బంగారు దూడ

చూడండి, మోషే తిరిగి కొండ ఎక్కుతున్నాడు. దేవుడు అతనితో ఇంకా ఏదో చెప్పాలనుకున్నాడు. దేవుడు చెప్పిన మాటలను మోషే తిరిగి వచ్చి ప్రజలకు చెబుతాడు.


మోషే దినమంతా అక్కడే ఉండిపోయాడు. అతడు తిరిగి వచ్చేదెప్పుడు? మరునాడు కూడ మోషే రాలేదు. అతడు కొండమీద చాల రోజులు ఉండిపోయాడు. అతడు మేఘంలో, దేవునికి దగ్గరగ ఉన్నాడు.

ప్రజలు ఇక మోషే రాడేమో అని అనుకుంటున్నారు. బహుశ అతనికి భయంకరమైన ఆపద యేమన్నా కలిగిందా? మనం ఇకపై మోషేను చూడలేము. దేవున్ని కూడ చూడలేము. మనం ఏం చేయాలో నీకు తెలుసు కదా? మనం ఒక విగ్రహాన్ని చేద్దాం. దాన్ని పూజిద్దాం. పెద్ద పండుగ చేసుకుందాము. ఆ విగ్రహమే మన దేవుడు. అప్పుడు కనీసం మన దేవుడ్ని చూడవచ్చు-అని ఒకరితో ఒకరు అనుకున్నారు.

వాళ్లంతా అహరోను దగ్గరకు వచ్చారు. ఈ పనిలో వారు అతని సహాయం కోరారు. అహరోను నిర్ఘాంతపోయాడు. ''అది దేవునికి వ్యతిరేకమయిన గొప్పపాపం! దేవుని ధర్మశాస్త్రం కూడ అలాగే చెబుతున్నది. అయితే ఇలా అని ప్రజలతో చెప్పడానికి అహరోను భయపడ్డాడు. అదే అహరోను చేసిన పొరపాటు. అతడు ప్రజలకు చాల భయపడ్డాడు.''

ఇశ్రాయేలు ప్రజలు తమ దగ్గర ఉన్న చక్కని విలువైన వస్తువులను ఇచ్చారు. బంగారంతో చేసిన చేతికడియాలు, చెవిపోగులు ఇచ్చారు. అహరోను వాటిని కరిగించి ఒక బంగారు దూడను చేయించాడు. ప్రజలు సంతోషంతో దాని చుట్టూ చేరారు. పాటలు పాడుతూ నాట్యం చేసారు. విగ్రహానికి అర్పణలు తెచ్చారు. ''ఇదే మన దేవుడు!'' అని అరిచారు. ఇదెంత భయంకరమయిన పాపం! ఇక వాళ్లు యెహోవా దేవున్ని సేవించడంలేదు. వాళ్లొకబొమ్మని, విగ్రహాన్ని పూజిస్తున్నారు! వాళ్లు ఏం మాటయిచ్చారో గుర్తుందా? యెహోవా దేవుడ్నే సేవిస్తామని వాగ్దానం చేసారు. అది అప్పుడే మరచిపోయారు. ఎంత విచారకరం! నీవెప్పుడన్నా దేవునికి లోబడి ఉంటానని వాగ్దానం చేసావా? తరువాత దాని గూర్చి మరచిపోయావా?

హఠాత్తుగ వాతావరణం అంతా నిశ్శబ్దం అయ్యింది. ఆ కొండ దిగివస్తున్నది ఎవరు? అది మోషే! అతడు రెండు రాతి పలకలు పట్టుకు వస్తున్నాడు. పది ఆజ్ఞలు వాటి మీద వ్రాసి ఉన్నాయి. దేవుడే స్వయంగ రాసాడు. దేవుడే వాటిని మోషేకు ఇచ్చాడు. మోషే చాల దుఃఖంగ కనబడుతున్నాడు. అతడు చా---ల కోపంగా ఉన్నాడు కూడ. అవును, ఏం జరిగిందో అతనికి తెలుసు. దేవుడు దానిని గూర్చి మోషేకు కొండమీద చెప్పాడు. మోషే ఆ రెండు పలకలనూ క్రిందపడవేసాడు. అవి ముక్కలయ్యాయి. అంటే వాళ్లు దేవుని పరిశుద్ధమైన ధర్మశాస్త్రానికి విరోధంగా పాపం చేసారు. అప్పుడు మోషే బంగారు దూడ వద్దకు వెళ్లాడు. దానిని ముక్కలు



ముక్కలుగ పగలగొట్టాడు. ఆ ముక్కలను అగ్నిలో తగల బెట్టాడు.


మోషే ప్రజలను శిక్షించాడు. చాల మంది చచ్చిపోయారు. అయితే అన్నిటికంటె పెద్ద శిక్షయేమిటో తెలుసా? దేవుడు మోషేతో-మోషే, నేను ఈపాపిష్టిజనంతో రాను. దానికి బదులుగ నిన్ను నడిపించడానికి ఒక దూతను పంపుతాను, అన్నాడు.

అయ్యో, అదెంత ఘోరం! మోషే దేవుని ఎదుట సాగిలపడ్డాడు. అతడు వినయంతో ఆయనకు మొరపెట్టాడు. అతడు ఈపాపిష్టి జనాంగం కోసం ప్రార్థన చేస్తున్నాడు. ''ప్రభువా, నీవు మాతో రాకపోతే మేము ఇక్కడనే ఉండిపోవడం మంచిది. ఓదేవా, నీవీ పాపాన్ని క్షమించవా? నీవు మమ్మును విడిచిపెట్టక మాతోరావా?'' అని ప్రార్థించాడు.

దేవుడు దయతో అతని ప్రార్థన విన్నాడు. ఆయన వాళ్లతో వస్తాడు. మోషేకు మరో రెండు క్రొత్త రాతి పలకలను దేవుడిచ్చాడు. వాటిపై పది ఆజ్ఞలు ఉన్నాయి.

ఒకవేళ ప్రజలు దేవుని సేవించకపోతే? మన మందరం ఆయనను సేవించాలని దేవుడు కోరుతున్నాడు. మనం నిండు హృదయంతో నిజంగ తనను సేవించాలని ఆయన ఆశిస్తున్నాడు.

మనం దేవున్ని సేవించాలని కోరుతున్నామా? లేదు మనం కోరడం లేదు. ఎందువల్ల? మనహృదయంలో పాపం నిండి ఉండడంవల్ల, మనం కూడ ఇశ్రాయేలు ప్రజల వంటి వారమే. నీకు నూతనహృదయం కావాలని గ్రహించావా? ఎందుకంటే అప్పుడు మాత్రమే మనం దేవుని నిండు మనసుతో సేవించగలము.



43. దేవుని కొరకు ఒక మందిరము

మనమంతా చక్కని గృహాల్లో నివసిస్తున్నాము. అందుకు మీకు సంతోషంగా ఉంది కదూ?

ఇశ్రాయేలీయులు కూడ ఇలాగే గృహాల్లో నివసిస్తున్నారు. అయితే వారి గృహం ఒక గుడారం మాత్రమే. ఎందుకంటే వారు ప్రయాణంలో ఉన్నారు కాబట్టి ప్రయాణం చేసేటప్పుడు ఇటికలతో కట్టిన ఇంటిని నీతో పాటు తీసికెళ్లలేవు కాని గుడారాన్ని తీసుకపోగలవు.


దేవునికి ఇల్లు అవసరమా? లేదు, ఎందుకంటే దేవుడు అన్ని చోట్లా ఉన్నాడు. అందువలననే ఆయనకు అన్నీ తెలుసును. అందుకనే ఆయన అన్నీ చూస్తాడు. నిజంగా దీనిని మనం అర్థం చేసికోలేము. చాల జ్ఞానం కలవారికి కూడ ఇది అర్థం కాదు.

అయినప్పటికీ దేవుడు ఏదో ఒక చోట ఉండనాశిస్తున్నాడు. దేవుడు తన దూతలతో పరలోకంలో ఉంటాడు. ఈ కారణంగా దేవ దూతలు ఎప్పుడూ ఆనందంగా ఉంటారు.

దేవుడు మనష్యులతో సహితం నివసించాలని కోరుతున్నాడా? పాపులయిన మనుష్యులతో? అవును, ఆయన అలా కోరుతున్నాడు. ఆయన ఇశ్రాయేలు ప్రజలతో ఉండనాశించాడు.

కాబట్టి ఇశ్రాయేలు ప్రజలు దేవునికి ఒక మందిరం నిర్మించదలచారు. అదో పెద్దగుడారం. అది చాల ఆందంగా ఉండాలి. అది దాదాపు ఒక రాజమందిరంలా ఉంటుంది. ఎందుకంటే వాళ్ల రాజు దేవుడే! దానిని "మందిరం లేదా గుడారం" అన్నారు. ప్రజలు మోషే దగ్గరకు చాల చాల అందమయిన వస్తువులు తెచ్చారు. తెరలు, చర్మాలు, కలప మొదలయినవి. బంగారం, వెండి కూడ తెచ్చారు. వాళ్లు సంతోషంతో ఇచ్చారు. ఎందుకంటే అవన్నీ దేవుని మందిరం కోసం!

చెక్కపలకలను బంగారు రేకులతో కప్పారు. వాటిని తిన్నగ నిలబెట్టారు. ఆ పనిని పురుషులు, బాలురు చేసారు. గుడారం కప్పును జంతు చార్మాలతో చేసారు. వాటికి ఎరుపు, తెలుపు, నలుపు రంగులు వేసారు.



అప్పుడు వాటన్నిటినీ కలిపి స్త్రీలు, బాలికలు కుట్టారు. వాళ్లు తెరలమీదా తోళ్లమీదా నగిషీలుకుట్టారు. అందమయిన పువ్వులూ, దూతల బొమ్మలు కుట్టారు. మందిరాన్ని నిలబెట్టడానికి అందరూ సాయపడ్డారు. దేవుడు చెప్పినట్టే చేసారు.

గుడారం పెద్ద భవనంలా తయారయ్యింది. అది ఇంటి కంటె పెద్దగా ఉంది. దానిలో రెండు గదులున్నాయి. ఒకటి పెద్దది, ఒకటి చిన్నది. ఆ గదుల్లో అందమయిన వస్తువులున్నాయి. వెలుగు నిచ్చే ఒక పెద్ద దీపస్తంభం. దానికి ఏడు కొమ్మలు, వాటికి ఏడుదీపాలు. అదెంత అందంగా ఉంది! చిన్నగదిలో ఒక పెట్టె ఉంది. ఆచెక్క పెట్టె బంగారంతో కప్పబడి ఉంది. దాని మూతపూర్తిగ బంగారంతో చేసారు. రెండు బంగారు దూతలు ఆ మూత మీద ఉన్నాయి. వాటికి పొడవైన రెక్కలున్నాయి. ఆ పెట్టెను 'మందసం' అని పిలుస్తారు. ఆ మందసం వద్ద దేవుడు ఉంటాడు. మందసం ఎక్కడ ఉంటే దేవుడు అక్కడ ఉంటాడు. వాళ్లు పెద్ద బలిపీఠం కూడ చేసారు. దానిని గుడారం ముందు ఉంచారు. ఇదంతా ఎంత అందంగా ఉందో!

మరివాళ్లు కదిలివెళ్లేటప్పుడు ఎలా? వాళ్లు తెరలను తోళ్లను మడిచి సులువుగా తమతో తీసుకు వెళ్లవచ్చు. చెక్కవలకలనూ మిగిలిన వస్తువులను సహితం తీసుకపోవచ్చు.

వీటన్నిటిని ఎవరు చూచుకోవాలి? బలిపీఠం మీద ఎవరు బలులు అర్పించాలి? గుడారంలో ఎవరు దేవునికి సేవ చేయాలి? యాజకులు. వీళ్లుపొడవైన అంగీవేసుకోవాలి. ఆయన గుడారంలో వాళ్లే సేవ చేయాలి.

ఒక యాజకుడు మిగిలిన వారందరిపై అధికారిగ ఉంటాడు. అతడు ప్రధాన యాజకుడు. అహరోను ప్రధాన యాజకునిగ ఎంపికయ్యాడు. అతను ఎంత చక్కగ కనిపిస్తున్నాడో! అతడు క్రింద పొడవైన అంగీని దానిపై నీలం రంగు వస్త్రాన్ని ధరించాడు. అతడు రంగు రంగుల దారాలతో నగిషీలు కుట్టిన చొక్కాకూడ వేసుకున్నాడు. అతడు నడుస్తున్న చప్పుడు నీవు వినవచ్చు. ఎలా అంటే అతని అంగీ చివర చిన్నచిన్న గంటలు వేలాడుతున్నాయి. అతడు నడిచినపుడు అవిమ్రోగుతూంటాయి.

ప్రధాన యాజకుడు మిగిలిన యాజకులు ప్రజలకు దేవుని గూర్చి చెబుతారు. గుడారం, అందులో ఉన్న వస్తువులు కూడ ఆయనగురించి చెబుతాయి, వినండి.

చిన్న గదిలో దేవుని సన్నిధి ఉంటుంది. కాబట్టి ఈగది పరలోకం గురించి చెబుతుంది. ఎందుకంటే దేవుడుండేది అక్కడే. ఈ చిన్నగదిలోకి ఎవ్వరూ ప్రవేశించకూడదు. ప్రజలు కాని యాజకులుకాని మనం ఉన్నస్థితిలో పరలోకంలోకి వెళ్లలేము, ఎందుకంటే మనం పాపులము. దేవుడు పరిశుద్ధుడు.

అయితే కొన్నిసార్లు అహరోను ఆ చిన్నగదిలోకి వెళ్లవచ్చు. అప్పుడతడు ఒక గిన్నెలో రక్తం తీసుకువెడతాడు. బలియిచ్చిన జంతువు రక్తం అది. అందులో కొంచెం రక్తాన్ని మందసం మూత మీద అతడు చిలకరిస్తాడు.

ఈ విధంగా అహరోను యేసును పోలి ఉన్నాడు. ప్రభువైన యేసుదేవున్ని సమీపించవచ్చు. అదే విధంగా ఆయన పిల్లలుకూడ, అహరోను ఆ చిన్న గదిలోనికి వెళ్లినట్టే. ఎందుకంటే యేసు తన రక్తాన్నిచ్చాడు. ఆయన పాపానికి శిక్షగా చనిపోయాడు. తన పిల్లలకు రావలసిన పాపశిక్షను ఆయన మోసాడు.

గిన్నెలోని రక్తం యేసు ప్రభుని రక్తం గురించి చెబుతుంది. యేసుప్రభువు కూడ ఒక ప్రధాన యాజకుడే! అవును, ఆయన పరలోకపు గొప్ప ప్రధాన యాజకుడు. ఆయన అహరోను కంటె చాల ముఖ్యమైనవాడు. ఎందుకంటే ఆయన జంతువు రక్తాన్ని కాక తన సొంత రక్తాన్ని ఇచ్చాడు.

మన కిప్పుడు గుడారంలేదు. అయితే దేవుని ఇల్లు ఉంది. అదే మందిరం. ప్రతి ఆదివారం మనం అక్కడికి వెళ్తాం. అక్కడ దేవుని గూర్చి వింటాము. నీవు భక్తితో వినడానికి ప్రయత్నం చేస్తావా?

మన హృదయం కూడ ఒక ఇల్లే, చిన్న ఇల్లు అక్కడ పాపం నివసిస్తున్నది. సాతానుకూడ. ఇది వాచారకరం కదా? అయితే నీవేమని ప్రార్థించాలో తెలుసా? "ప్రభువా, దయచేసి నా హృదయంలోనికి నీవు వచ్చి అక్కడ నీవాసం చెయ్యి" అని ప్రార్థించు.

దేవుడు అలా వచ్చినపుడు నీ హృదయమే ఆయన మందిరమవుతుంది. నీవెంత ఆనందంగ ఉంటావో!

44. కానానుకు సమీపముగా

చివరికి ఇశ్రాయేలు ప్రజలు కానాను దేశాన్ని చేరుకున్నారు. అక్కడ, ఎత్తయిన పర్వతాల వెనుక వాళ్ల అందమయిన దేశం ఉంది. ఆ దేశాన్ని వారికిస్తానని దేవుడు వాగ్దానం చేసాడు.

ఆదేశం చూడ్డానికి ఎలా ఉంటుంది? అక్కడ ఎలాంటి మొక్కలు ఉంటాయి? ఎలాంటి ప్రజలుంటారు? అక్కడ బలమయిన సైనికులు ఉంటారా? ఇశ్రాయేలు ప్రజలకు ఈ సంగతులేమీ తెలియవు. కాబట్టి మోషే "ఆ దేశాన్ని చూడ్డానికి కొందరిని పంపాలి" అన్నాడు.

అతడు పన్నెండు మందిని ఎంపిక చేసాడు. అదిగో వాళ్లు వెళ్తున్నారు. ఆ ఎత్తయిన పర్వతాలు ఎక్కుతున్నారు. వాళ్లు కానాను దేశంలోకి వెళ్తున్నారు. వాళ్లు ఆ దేశాన్ని పరిశీలిస్తున్నారు. వాళ్లు అందులోని పట్టణాలను, అడవులను పొలాలను చూస్తున్నారు. అందుకనే వాళ్లని కొన్ని సార్లు 'వేగులవారు' అని కూడ పిలుస్తారు.

వాళ్లు చాలా దినాలు అక్కడ ఉండిపోయారు. ఎందుకంటే అది చాల పెద్ద దేశం. చిట్ట చివరికి వాళ్లు తిరిగి వచ్చారు. వాళ్లు రావడం ఇశ్రాయేలు ప్రజలు చూచారు. అదిగో, వాళ్లేం మోసుక వస్తున్నారో చూడండి! ఇద్దరు గూఢచారులు తమ భుజంమీద ఒక కర్ర మోస్తున్నారు. దానికి ఒక ద్రాక్షల గెలవ్రేలాడుతోంది. అబ్బ, అది ఎంత పెద్దగెల! అది ఎంత పెద్దదంటే దానిని ఇద్దరు మోయవలసి వచ్చింది. దాంతో పాటు మరెన్నో రుచికరమయిన పండ్లు వాళ్లు తెచ్చారు. వీటిని చూడగానే కానాను సారవంతమయిన దేశమని ప్రజలకు తెలిసిపోయింది.

వేగులవాళ్లిపుడు ఆ దేశం గురించి చెప్పారు. అక్కడ మంచి పంటలున్నాయి. పశువులకు కావలసినంత గడ్డి ఉంది. ఆ, అది చాల గొప్పదేశం! అయితే వారింకా ఏం చెప్పారో తెలుసా? అక్కడ బలమైన, పెద్ద మనుష్యులున్నారు. వాళ్లు ఎత్తైన రాక్షసుల్లా ఉన్నారు. వాళ్లంతా బలమైన పట్టణాల్లో జీవిస్తున్నారు. వాటి చుట్టూ ఎత్తైన పెద్ద గోడలున్నాయి. వాళ్లు "మనం ఆ రాక్షసుల్లాంటి మనుష్యులతో యుద్ధం చేయాలా? మనం ఎన్నటికీ వాళ్లని జయించలేము. వాళ్లు మనకన్న చాల బలవంతులు. నగరాల్లోకి మనం ఎలా చొరబడగలం? ఆ గోడలు చాల పెద్దవి, వెడల్పయినవి," అన్నారు. వెళ్లిన వేగుల వాళ్లంతా ఇలాగే చెప్పారా? లేదు, వారిలో ఇద్దరు మాత్రం-ఆ మనుష్యులు చాల బలం కలవారై యుండ వచ్చును, అయినా మన దేవుడు వాళ్ల కన్న బలవంతుడు. కాబట్టి మనం తప్పక గెలుస్తాము. మనం తప్పక వాళ్ల పట్టణాల్లో ప్రవేశిస్తాము. అలా చేస్తానని దేవుడు మాట ఇచ్చాడు, అన్నారు. వాళ్లు యెహోషువ, కాలేబులు, దేవున్ని వాళ్లు ప్రేమించారు.



అయితే ఇశ్రాయేలీయులు వీళ్ల మాట నమ్మలేదు. మిగిలిన వేగుల వాళ్లు చెప్పినదే నమ్మారు. వాళ్లు వేస్తున్న కేకలు వినండి. "మనం ఎన్నటికి కానానులో ప్రవేశించలేము. ఆ దేశ ప్రజలు చాల బలవంతులు. మనం అసలు ఈజిప్టులోనే ఉండవలిసింది. లేదా అరణ్యంలో, ఇప్పుడా బలవంతులు మనలను చంపేస్తారు. మనం ఈజిప్టుకు తిరిగి వెళ్లిపోదాము" అంటూ వాళ్లు దేవునికి విరోధంగా మాటలాడారు.

యెహోషువ, కాలేబులు వారి మాటలకు ఆశ్చర్యపోయారు! "మీరు గొప్పపాపం చేస్తున్నారు. దేవుడ్ని మీరు నమ్మాలి. మనం తప్పక కనానులోకి వెడతాం. దేవుడు స్వయంగ ఇలా అని వాగ్దానం చెయ్యలేదా? దేవుడు ఎన్నడూ అబద్ధం చెప్పడు" అన్నారు.



ఇప్పుడు ప్రజలకు యెహోషువ, కాలేబులపై చాల కోపం వచ్చింది. కోపంతో వాళ్లని రాళ్లతో కొట్టడం మొదలు పెట్టారు. ప్రజలు వాళ్లిద్దర్నీ చంపేయాలనుకున్నారు.

అయితే దేవుడలా జరగనీయలేదు, ఎందుకంటే యెహోషువ, కాలేబులు దేవుని సేవకులు. హఠాత్తుగ మేఘస్తంభం నుండి ఒక మెరుపు మెరిసింది. ప్రజలు భయపడి పోయారు. యెహోషువ, కాలేబులను రాళ్లతో కొట్టడం ఆపారు. దేవునికి ప్రజలపై కోపం వచ్చింది. ఆయన "మోషే, నేను ఈ ప్రజలందర్నీ చంపేస్తాను. ఆ తరువాత నేను నిన్ను గొప్ప జనాంగంగా చేస్తాను" అన్నాడు. అయితే మోషే, పాపం చేసిన ఆ మనుష్యుల నిమిత్తం ప్రార్ధన చేసాడు-దేవా, దయచేసి వీళ్లని కాపాడు. దయచేసి వాళ్ల పాపాలను క్షమించు".

అప్పుడు దేవుడు "మోషే, సరే నేను ఈ ప్రజలను కాపాడుతాను. అయినా వాళ్లని శిక్షిస్తాను. వీళ్లు కనాను దేశంలో ప్రవేశించరు. వాళ్లీ ఎడారిలో చాల కాలం-అంటే నలభై సంవత్సరాలు తిరుగులాడాలి. పెద్ద వాళ్లంతా ఇక్కడే చచ్చిపోతారు. వాళ్ల పిల్లలు మాత్రం పెరిగి పెద్దవారై కనానులో ప్రవేశిస్తారు", అన్నాడు.

ఇశ్రాయేలీయులు చాల విచారించారు. అయితే అది వారు చేసిన పొరాపాటే.

ఆ తరువాత ఒక భయంకరమైన సంఘటన జరిగింది. హఠాత్తుగ వాళ్లంతా నేలపై పడి చచ్చి పోయారు. యెహోషువ కాలేబులు తప్ప మిగిలిన వాళ్లంతా మరణించారు. వాళ్లు చాల ముసలివారై కానానులో ప్రవేశిస్తారు, ఎందుకంటే వాళ్లు దేవుని నమ్మారు. వారి హృదయంలో విశ్వాసం ఉంది. మిగిలిన వేగుల వారికి మనుసులో విశ్వాసం లేదు, దేవుడ్ని నమ్మలేదు. ఆయన తమ్మును మోసం చేసాడనుకున్నారు! అది భయంకరం కదా?

మన హృదయాల్లో సహితం అవిశ్వాసం గూడు కట్టుకొని ఉంటుంది. విశ్వసించని మన దుష్టహృదయాలు దేవుడ్ని నమ్మవు. అయితే యెహోషువ, కాలేబులకు ఇచ్చినట్టు దేవుడు మనక్కూడ విశ్వాసంఇస్తాడు.

"అడుగుడి మీకీయబడును" అని దేవుని వాక్యం చెబుతోంది.

45. అరణ్యములో

మేఘస్తంభం తిరిగి అరణ్యంలోకి వెళ్లిపోయింది. కానానుకు దూరంగా. ఇశ్రాయేలీయులు కానానుదేశంలోకి వెళ్లడానికి వీల్లేదు. అది ఆ తర్వాత జరుగుతుంది. అప్పటికి చిన్న పిల్లలంతా ఎదుగుతారు. ఇప్పుడయితే అందరూ మేఘాన్ని అనుసరిస్తున్నారు. అది వాళ్లని తిరిగి అరణ్యంలోకి నడిపిస్తోంది. అయినప్పటికీ దేవుడే వాళ్లని సంరక్షిస్తాడు. ఇకవినండి.

కొంత కాలం అయ్యాక మళ్లీ నీటికొరత వచ్చింది. వాళ్లకి నీళ్లు ఎక్కడా కనిపించలేదు. కాబట్టి మళ్లీ సణ గడం మొదలు పెట్టారు. కోపంతో వాళ్లిలా అన్నారు. "మోషే, నీవు మమ్మును ఐగుప్తుగుప్త దేశం నుండి ఎందుకు బయటికి తెచ్చావు? మేము దాహంతో చచ్చి పోతాము. మాకిప్పుడు నీళ్లు కావాలి". వాళ్ల మాటలకు మోషేకు కూడ కోపం వచ్చింది. ఈప్రజలకు ఎప్పటికీ తృప్తిఉండదు. వాళ్లు ఏదో ఒక దానిగూర్చి సణగకుండ ఉండరు. అందుకని మోషే ప్రజలతో - రండి. మేము మీకు నీళ్లిస్తాము" అన్నాడు.



వాళ్లంతా ఒక పెద్ద రాతిదగ్గర ఆగారు. దేవుడు - మోషే, అహరోనూ, మీరు ఈ బండతో మాట లాడండి. అప్పుడు బండనుండి నీళ్లు వస్తాయి" అని చెప్పాడు. అయితే మోషే అహరోనులు ఏం చేసారు? వాళ్లు బండతో మాట్లాడలేదు. దానికి బదులు మోషే రెండు సార్లు బండను కొట్టాడు. ఎందుకంటే అతనికి కోపం వచ్చింది. వెంటనే బండ చీలింది, నీళ్లు అందుండి బైటికి ప్రవహించాయి. ప్రజలు, పశువులు కూడ కావలసినంత నీరు త్రాగారు. వాళ్లు చాల సంతోషించారు.

అందరూనా? కాదు. మోషే అహరోనులు కాదు. వాళ్లు దేవుడు చెప్పినట్టు చేయలేదు. వాళ్లు ఆయనకు లోబడలేదు.

అప్పుడు దేవుడిలా అన్నాడు. ''మోషే, అహరోనూ, మీరిప్పుడు వాగ్దానదేశంలో ప్రవేశించరు. మీరుకూడ అరణ్యంలో చచ్చిపోతారు. మిగిలిన పెద్దమనుష్యులవలెనే. ఇదే మీ శిక్ష".

ఇది మోషే అహరోనులకు దుఃఖం కలిగిస్తుంది కదూ? అయితే ఆ తరువాత వాళ్లు దేవునితో సదా జీవించడానికి పరలోకంలో చేరుతారు.

దేవుడు ఇశ్రాయేలీయులకు ప్రతిదినం మన్నా యిచ్చాడు. అదేమో మీకు గుర్తుందా? ప్రతీ ఉదయం నేల మీద గుండ్రని ధాన్యం కురిసేది. ఎవ్వరూ ఆకలితో ఉండవలిసిన అవసరం లేదు.

అయినప్పటికీ ప్రజలు సణుగుతునే ఉండే వాళ్లు. ఇప్పుడా మన్నా వాళ్లకి రుచిగ అనిపించడం లేదు. ''అస్తమానం అదే మన్నా రొట్టెలు! మాకు మరోరకముయిన ఆహారం కావాలి" అన్నారు.

ఎంత కృతజ్ఞతహీనులు! ఎంత తృప్తిలేని వాళ్లు! ఇదో పెద్ద పాపం. కాబట్టి వారికి మరోగొప్ప శిక్షవచ్చింది. హఠాత్తుగ అరణ్యంలో ఎక్కడ చూచినా పాములు. వందలు, వేలు. నేల మీద చుట్టలు చుట్టి పాకుతూ కనిపించాయి. అవి విష సర్పాలు.

అదిగో, అక్కడ చూడండి. ఒక మనిషిని పాము కరిసింది. వెంటనే అతడు కిందపడి చచ్చిపోయాడు. అయ్యో, చాలమంది పాము కాటుతిన్నారు.

పురుషులు, స్త్రీలు, పిల్లలూ, అందరూ. వాళ్లంతా అనారోగ్యం పాలయ్యారు. వాళ్లంతా ఇప్పుడు చావ వలసిందేనా?


"మోషే, మాకోసం దేవునికి ప్రార్థన చేయి. ఈ భయంకరమైన పాములను తీసివేయమని అడుగు. రోగపీడితులయిన వీళ్లంతా బాగుపడేలా దయచేసి ప్రార్థించు" - అని వాళ్లు మోషేను బ్రతిమాలారు.

అవును, మోషే మళ్లీ ప్రార్థన చేసాడు. తర్వాత అతడేం చేసాడు? చూడండి, అతడో ఇనుప స్తంభాన్ని నిలిపాడు దానిపై ఒక పామును అతికించాడు. అది నిజమైన పాముకాదు. అది ఇత్తడితో చేసింది.

అప్పుడు మోషే ప్రజలతో - నీకు పాము కరిచినప్పుడు ఈ ఇత్తడి సర్పాన్ని చూడండి. అప్పుడు మీరు బ్రదుకుతారు అన్నాడు. అలాగే జరిగింది. అదిగో, అక్కడ చూడండి. ఓ బాలుడు నేలమీద పడి ఉన్నాడు. వాడిని పాము కరిచింది. అతనికి ఏమీ బాగులేదు. అతడు తప్పక చనిపోతాడు. అయితే వాడేం చేస్తున్నాడు? అతడు తల ఎత్తవచ్చు. అతడు పామును చూచాడు. వెంటనే లేచాడు. అతడు పూర్తిగ బాగయ్యాడు.

మరి పాము కాటు తిన్న వాళ్లు ఇత్తడి సర్పాన్ని చూడకపోతే? మరి స్వస్థత రాదు. చచ్చిపోతారు. అది వాళ్ల పొరపాటే.

ఎవరు ఆ ఇత్తడి సర్పమువలె ఉన్నారో తెలుసా? యేసు ప్రభువు. ఆయన కూడ కర్రసిలువకు మేకులతో కొట్టబడ్డాడు. ఆయన సిలువపై చనిపోయాడు. మన హృదయాలు కూడ పాపంవల్ల రోగపూరితమయ్యాయి. అయితే మనం కూడ బాగు కాగలము. ఇశ్రాయేలీయులు స్వస్థపడినట్టే. ఎవరి వలన అని అడుగుతున్నావా? యేసు ప్రభువు మూలంగానే. ఆయన మనలను బాగుచేయగలడు. నీ పాప హృదయం కూడ బాగయ్యేలా చేయమని నీవు ప్రార్థిస్తావా?



46. రాహాబు మరియు వేగులవాళ్లు

చాల సంవత్సరాలు గడిచిపోయాయి. నలభై దీర్ఘసంవత్సరాలు! ఇశ్రాయేలీయుల పిల్లలంతా ఎదిగిపోయారు పెద్దవాళ్లంతా చచ్చిపోయారు. ఎందుకంటే వాళ్లు కానాను దేశంలో ప్రవేశించడానికి అనుమతిలేదు. యెహోషువ, కాలేబులు జీవించే ఉన్నారు. వారు కనానులో ప్రవేశించవచ్చు. ఆ కథ నీకు గుర్తుంది కదూ?

మరి మోషే సంగతి యేమిటి? అతడు కూడ చచ్చిపోవలసిందే. ఎత్తైన పర్వతం మీద. అతడా పర్వతం ఎక్కుతోంటే ప్రజలంతా విచారంగ చూస్తున్నారు. అతడు వెళ్లిపోక ముందు "దేవుడు మీ అందరినీ సంరక్షిస్తాడు. మీరాయనను ప్రేమించి లోబడతారా?" అని ప్రశ్నించాడు.

ఆ పర్వత శిఖరం నుండి దేవుడు మోషేకు కానాను దేశాన్ని చూపించాడు. తర్వాత మోషే చచ్చిపోయాడు. అతడు పరలోకం చేరుకున్నాడు. నిత్యం దేవునితో ఉంటాడు. ఇప్పుడు యెహోషువ ప్రజలను నడిపిస్తున్నాడు. అతడు వారిని సంరక్షిస్తాడు. ఎందుకంటే మోషేవలె ఇతడు కూడ ఇశ్రాయేలు ప్రజలను ప్రేమించాడు.

ఇశ్రాయేలీయులు కానానుకు తిరిగి వచ్చారు. ఇంక కొంత సేపటిలో వారక్కడ చేరుతారు. దేవుడా దేశాన్ని వాళ్లకిస్తాడు. అయితే ఆ బలమైన దేశవాసులు ఇంకా అక్కడ ఉన్నారా? అని యెహోషువ ఆలోచిస్తున్నాడు. ఆ పట్టణం చుట్టూ ఉన్నగోడలు ఇంకా బలంగా దళసరిగ ఉన్నాయా?

కాబట్టి ఈ విషయాలు తెలుసుకోడానికి అతడు ఇద్దరు మనుష్యులను కనానులోకి పంపాడు. వాళ్లు వేగులవాళ్లు. వాళ్లు వెళ్లి ఆదేశాన్ని పరిశీలించాలి. దగ్గరలోనే యెరికో అనే పట్టణం ఉంది. అక్కడికి వీళ్లు వెళ్లాలి.

కాబట్టి వాళ్లు ప్రయాణమైపోయారు. యెరికో చేరారు. అబ్బో, ఆ పట్టణం చుట్టూగోడలు చాలబలంగా ఉన్నాయి. దానికి ద్వారం ఉంది. అది తెరిచి ఉంది. ఆ వేగులవారు నెమ్మదిగ ప్రవేశించారు. వాళ్లు చాల జాగ్రత్తగ ఉన్నారు. ఒకవేళసైనికులు వాళ్లని చూస్తే?

పట్టణంలో ఉన్న ప్రతిదాన్నీ వాళ్లు చూచారు. అంతలో చీకటి పడింది. వాళ్లెక్కడ నిద్రపోవాలి? అదృష్టవశాత్తు నిద్రపోడానికి ఓ ఇల్లు దొరికింది. అది ప్రాకారం పైన ఉంది. ఈ ప్రాకరం చాల దళసరిగ ఉండడంవల్ల ఇల్లుదాని మీద కట్టబడింది.

ఆ ఇంటిలో ఓ స్త్రీ నివసిస్తున్నది. ఆమె పేరు రాహాబు. రాహాబు పాపపుస్త్రీ. ఆమె పాపపు పనులు చేయడానికి తన ఇంటిని ఉపయోగిస్తుంది.

ఆ ఇద్దరు వేగుల వాళ్లూ ఆమె ఇంటిలో నిద్రపోవచ్చు. అయితే ఆ పట్టణస్థులు వీరిని చూసేసారు!

వాళ్లు రాజుకీ సంగతి తెలిపారు. మరిరాజు ఏం చేసాడు? అతడు రాహాబు ఇంటికి సైనికులను పంపాడు. రాజు వాళ్లతో - వెళ్లి ఆ వేగుల వాళ్లని తెచ్చి ఖైదులో పడవేయండి అన్నాడు.

అయితే రాహాబు వేగుల వారికి సాయం చేసింది. ఆమెవారితో త్వరగా రండి, మీరు దాగుండ గలిగిన స్థలం నాకు తెలుసు" అని చెప్పింది.

మిద్దెమీద చాల ఎండు గడ్డి ఉంది. ఆ ఇద్దరు మనుష్యులూ దాని కిందికి దూరారు. కాబట్టి ఇక ఎవ్వరూ వాళ్లని కనుగొనలేరు.

రాహాబు ఎందుకిలా చేసింది? ఎందుకంటే ఆమె ఇశ్రాయేలు ప్రజలను గూర్చి విన్నది. వాళ్లు ఎర్ర సముద్రం గుండా నడిచారని, తమ శత్రువులను జయించారనీ విన్నది. వారి దేవుడు వాళ్లకు సహాయం చేసాడు. ఆయన నిజంగా సర్వశక్తి మంతుడు. ఈ దేవుడు నాకు కూడ దేవుడయితే బాగుండును - అని రాహాబు అనుకొంది. నేనాయనను ప్రేమించి, ఆయనకు లోబడతాను. నాకు ఆ జనులతో కలిసి ఉండడం ఇష్టం- అనుకొంది. అందువలన ఆమె వేగుల వారికి మేలు చేసింది. అందుకే వారికి సాయం చేయాలనుకొంది.

వినండి, సైనికులు తలుపుతడుతున్నారు - రాహాబూ, మేమా ఇద్దరు మనుష్యులను పట్టుకోడానికి వచ్చాం. వాళ్లు గూఢచారులు-అన్నారు.


దానికి రాహాబు-అలాగా, అయితే వాళ్లిప్పుడు ఇక్కడ లేరు. ఈ పట్టణం విడిచివెళ్లిపోయారు. మీరు

త్వరగా వెళ్తే వాళ్లని కలుసుకోగలరేమో, అని చెప్పింది. అదృష్టవశాత్తు సైనికులామె మాట నమ్మారు. వెంటనే వెళ్లిపోయారు. ఆ వేగుల వారి కోసం వాళ్లు పట్టణం బయట వెదకడానికి వెళ్లారు. వేగుల వాళ్లు తాము దాగొన్న స్థలం నుండి బైటికి వచ్చారు. అప్పుడు రాహాబు "ఇశ్రాయేలీయులు వచ్చి ఈ పట్టణాన్ని జయిస్తారని నాకు తెలుసు. మీ దేవుడు చాల బలవంతుడు. యెరికో ప్రజలు చంపబడతారు. మీరు నన్ను రక్షిస్తారా? నా ప్రాణాన్ని కాపాడుతారా? అని అడిగింది. వేగుల వాళ్లు అది చేస్తామని మాటయిచ్చారు.

అది రాత్రివేళ. పట్టణప్రాకారపు ద్వారం మూసివేసారు. ఇప్పుడు వేగుల వాళ్లు పట్టణం నుండి ఎలా బయటికి వెళ్లగలరు? రాహాబు వాళ్లతో - రండి అని చెప్పి ఒక కిటికీ తెరిచింది. ఆమె ఒక బలమైన తాడు తీసింది. దానిని కిటికీకి బిగించి కట్టింది. ఆ తాడు కిటికీనుండి గోడ పొడవునా వ్రేలాడుతున్నది. అది నేలను తాకింది. ఇప్పుడు ఎలా తప్పించుకపోవాలో వేగుల వారికి అర్థం అయ్యింది. వాళ్లామె ఇల్లు వదలి వెళ్లకముందు - ఈ త్రాడును కిటికీకి ఇలాగే వ్రేలాడుతూ ఉండనీయి. అప్పుడు ఇశ్రాయేలీయులకు ఇది నీ ఇల్లని తెలుస్తుంది. నీ ఇంటిలో ఉన్న వాళ్లంతా రక్షింపబడతారు. నీ తల్లిదండ్రులు, అన్నదమ్ములు అక్కచెల్లెళ్లంతా-అని చెప్పారు.

వాళ్లు ఆ త్రాడును గట్టిగ పట్టుకున్నారు. వాళ్లు నెమ్మదిగా త్రాడు పట్టుకొని క్రిందికి దిగారు. వాళ్లు నేలకు జారి పట్టణం బయట పడ్డారు. రాహాబు ఇల్లు పట్టణ ప్రాకారం మీద కట్టబడినట్టు గుర్తుంది కదూ. రాహాబు వేగుల వారి కాలి చప్పుడు ఒకటి రెండు క్షణాలు విన్నది. తరువాత అంతా నిశ్శబ్దం. వాళ్లు తప్పించుకున్నారు. మరి రాహాబు మాట యేమిటి? ఆమె ఎర్రని త్రాటివైపు చూచింది. ఆమె దానిని తప్పక అలాగే ఉంచుతుంది. ఎందుకంటే ఇశ్రాయేలీయులు తప్పకవస్తారని ఆమె ఎరుగును. అయితే నేను రక్షింపబడుతాను అనుకొంది. అదో అద్భుతం. దానికి తాను తగిన దానను కాను. ఎందుకంటే తానొక పాపాత్మురాలు. అయినా దేవుడు నాకు మేలు చేసాడు. ఇకపైనేను పాపం చేయను, ఎన్నటికీ చేయను - అని ఆమె నిశ్చయించుకొన్నది.

రాహాబు హృదయం మారిపోయిందని నీవుగమనించావా? అదో అద్భుతం కాదా? అవును. మనమంతా చెడు మార్గాలను విడిచి తనను సేవించాలని దేవుని కోరిక. మనం దీనిని మరువ వద్దు. దేవా, దయచేసి మమ్మును కూడ మార్చు.



47. వాగ్దాన దేశములో

అవును, ఇప్పుడు దేవుడు వాళ్లకి కానాను దేశం దయచేస్తాడు! యెహోషువ అలా అని వాళ్లకి చెప్పాడు కదా. అయితే ముందుగ వాళ్లొక నది దాటాలి. అది యొర్దాను నది. వాళ్లు దానిని ఎలా దాటగలరు? ఆ మార్గం యెహోషువకు తెలుసు. ప్రజలూ, పశువులూ ఒక పెద్ద వరసలో నిలబడాలి. యాజకులు వాళ్లముందు నిలబడాలి. వాళ్లు మందసం మోస్తూ నడవాలి. ఎందుకంటే మందసం ఎక్కడ ఉందో దేవుడు అక్కడ ఉంటాడు. అంటే దేవుడు వాళ్లముందు వెళ్తున్నాడన్నమాట!

యాజకులు అప్పుడే నీటి అంచుకు చేరారు. "మీరలా నడుస్తూనే ఉండండి" అన్నాడు యెహోషువ. అవును. వాళ్లు కూడ నీటివైపు అలా నడుస్తూనే ఉన్నారు. మరి వాళ్లు తడిసిపోరా? బహుశ వాళ్లు నీటిలో మునిగిపోవచ్చు. లేదు లేదు. అలా చూడండి. వాళ్ల పాదాలు నీటికి తగల గానే... వారి ముందున్న నీళ్లు మాయమయ్యాయి. యొర్దాను నది గుండా ఒక మార్గం ఏర్పడింది. అది పొడిగ ఉంది! ఈ త్రోవలో నడిచి మనుష్యులు పశువులన్నీ అవతలి ఒడ్డు చేరవచ్చు. ఎంత అద్భుతం! అవును. దేవుడు తమకు ముందుగా నడుస్తున్నాడని వారు గమనించారు. దేవుడు వారికి మార్గం చూపుతుంటే వాళ్లంతా ఆయన వెనుకవెళ్తున్నారు.

"దేవా, నీవు మాకు మార్గదర్శిగ ఉంటావా? నీ మార్గాన్ని అనుసరించడం మాకు నేర్పించు" అని మనం కూడ దేవున్ని అడగాలి.

అదిగో, అక్కడ యెరికో పట్టణం ఉంది. దానిచుట్టూ ఎత్తైయిన గోడలు, అమ్మో, వాటిని ఎన్నటికీ ఎక్కలేరు. బలమైన సైనికులు ఆ ప్రాకారాల మీద నిలబడి కాపలా కాస్తున్నారు. వాళ్లిప్పుడేమి చేయాలి? ఆ గోడలు బద్దలు కొట్టాలా? అదెన్నటికీ సాధ్యం కాదు. అయితే ఏం చేయాలో యెహోషువకు తెలుసు. తమ కోసం ఆ కార్యాన్ని చేసేది దేవుడే! ఆ పొడవైన వరుసలో అందరూ పట్టణం చుట్టూ తిరిగారు. వాళ్లముందు ఎవరు ఉన్నారు? మందసం మోస్తున్న యాజకులు. అంటే సాక్షాత్తు దేవుడే వాళ్ల ముందు నడుస్తున్నాడు.

మరునాడు కూడ వాళ్లదే చేసారు. మళ్లీ పట్టణంచుట్టూ తిరిగారు. మూడోరోజు, నాలుగు, అయిదు, ఆరు రోజులు ఆ విధంగా తిరిగారు.

యెరికో ప్రజలకది వింతగా తోచింది. వాళ్లది చూచి నవ్వారు. ఏడవరోజు వచ్చింది. మళ్లీ ఇశ్రాయేలీయులు పట్టణం చుట్టూ తిరిగారు. అయితే ఈరోజు ఒక్క సారికాదు, ఏడుసార్లు తిరిగారు. ఎందుకని? దేవుడు అలా చేయమని చెప్పడం వల్ల. వాళ్లు దేవుని మాటకు లోబడ్డారు. అలా చేసినపుడు అన్నిపనులూ చక్కగా జరుగుతవి. ఏడవ సారి చుట్టు తిరగడం పూర్తయ్యింది. అందరూ కదలకుండా నిలబడ్డారు. అంతా శ్రద్ధగ ఆలకిస్తున్నారు. యెహోషువ "అందరూ పెద్దగా కేకలు వేయండి" అని చెప్పడం విన్నారు.



యాజకులలో కొందరి వద్ద బూరలు ఉన్నాయి. వాళ్లు వాటిని గట్టిగ ఊదడం మొదలుపెట్టారు. ప్రజలు కేకలు వేయడానికి ఇదో గుర్తు. ప్రజలు కేకలు వేయడం మొదలుపెట్టారు. వాళ్లప్పుడే ఎందుకు కేకలు వేస్తున్నారు? వాళ్లింకా ఏదీ జయించలేదు! వాళ్లసలు యుద్ధమే మొదలుపెట్టలేదు! ఆ పెద్ద గోడల మాట యేమిటి?

ఇశ్రాయేలు ప్రజలు దేవునిలో నమ్మకముంచారు. ఆయనను విశ్వసించారు. వాళ్లా నగరాన్ని తప్పక జయిస్తారు. దేవుడు అలా అని మాటయిచ్చాడు. కాస్తవినండి. ఇప్పుడేం జరుగుతున్నది? అబ్బో, అలా చూడండి! ఆ బలమైన గోడలు కదులుతున్నవి. అవి ముక్కలు ముక్కలుగా క్రింద పడుతున్నవి. పెద్ద పెద్ద రాళ్లు నేలమీద దొర్లుతున్నవి. గోడలన్నీ కుప్పకూలిపోయాయి. ఇది దేవుడు చేసినపని. ఇప్పుడు ఇశ్రాయేలు సైనికులు నులువుగా పట్టణంలో ప్రవేశించగలరు. యెరికో ప్రజలు ఆశ్చర్యపోయారు. వాళ్లిక ఏమీ చేయలేకపోయారు. మనుష్యులు, పశువులు అందరూ చచ్చిపోయారు.

అన్ని గోడలూ పడిపోయాయా? లేదు. అలాకాస్త చూడండి. గోడలో చిన్న భాగం ఇంకా నిలిచి ఉంది. దాని మీద ఒక ఇల్లు కూడ. ఆ ఇంటి కిటికీనుండి ఒక ఎర్రని త్రాడు వ్రేలాడుతోంది. అదెవరి ఇల్లో నీవు ఊహించగలవు. అది రాహాబు ఇల్లు! ఇశ్రాయేలు సైనికులకు అది తెలుసు. ఆ ఇంటిలో నున్న వాళ్లెవ్వరికీ వాళ్లుహాని చేయకూడదు. అందులోని వాళ్లంతా క్షేమంగా ఉంటారు. ఎందుకంటే రాహాబు వేగులవారికి సాయం చేసింది.

అదుగో ఇద్దరు వేగుల వాళ్లు. వారు రాహాబు ఇంటికి వెళ్తున్నారు. "రాహాబూ, బయటికిరా. మాతోరా. మీ తల్లిదండ్రులూ, అందరూ రావచ్చు" అని పిలిచారు. అప్పటినుండి రాహాబు ఇశ్రాయేలు ప్రజలతో నివసించడం మొదలు పెట్టింది.

ఇశ్రాయేలీయులు యెరికోలో నివసించలేదు. వాళ్లింకా చాల పట్టణాలను జయించాలి. శత్రువులను కానాను నుండి తరిమి కొట్టాలి. వాళ్లకి ఇష్టం వచ్చిన చోట ఇశ్రాయేలు ప్రజలు నివసించవచ్చు. ఇకపై వారికి మన్నా అవసరం లేదు. ఇప్పుడు పొలంలో ధాన్యం పండించవచ్చు. చెట్లపై మంచి పండ్లున్నాయి. ద్రాక్షతీగలపై పెద్ద పెద్ద ద్రాక్షగెలలున్నాయి. అవును, ఇది సారవంతమయిన దేశం. సంపదలతో కూడినది. దేవుడు తన ప్రజలకు గొప్ప మేలు చేసాడు. ఆయన ఇంత మంచిదేశాన్ని వాళ్లకిచ్చాడు కాదా?

దేవుడు మనకూ మేలు చేస్తున్నాడు. కావలసినవన్నీ ఇస్తున్నాడు. తినడానికి త్రాగడానికీ కావలసినంత ఇస్తున్నాడు. మంచి దుస్తులను, ఇంటిని ఇచ్చాడు. మనకింకా యేమయినా కావాలా? అవును ఒక క్రొత్త హృదయం కావాలి. ఎందుకంటె రాహాబులా మనం దేవుని ప్రజలము.



48. గిద్యోను

అందమయిన కానానులో ఇశ్రాయేలీయులు అన్నిచోటలా నివసిస్తున్నారు. అయినా ఆదేశంలో అంతగా సంతోషం లేదు. అదెలా సాధ్యం? ఇకపై దేవుడు తన ప్రజల పట్ల శ్రద్ధ చూపడం లేదా? వినండి.

యెహోషువ చనిపోకముందు ఇశ్రాయేలీయులతో ఇలా చెప్పాడు, "మీరు దేవున్ని సేవిస్తూనే ఉంటారా? శత్రువులందరినీ చంపుతారా? దేవుడు తప్పక సహాయం చేస్తాడు". ఆ సమయంలో ప్రజలు "అవును, యెహోషువా, మేము తప్పక చేస్తాము" అన్నారు.

అయితే వాళ్లలా చేయలేదు. వాళ్లకిక యుద్ధం చేయాలనిపించలేదు. శత్రువులు నిలిపిన విగ్రహాలను చూచారు. వాళ్లంతా ఆ విగ్రహాలకు మ్రొక్కడం చూచారు. ఆ విగ్రహాలే వాళ్ల దేవుళ్లు. ఇక ఇశ్రాయేలు ప్రజలుకూడ విగ్రహాలు చేయడం మొదలుపెట్టారు. వాళ్లు కూడ వాటికి మ్రొక్కడం ప్రారంభించారు. వాటిని సేవించారు. తమ దేవున్ని మరిచి పోయారు, కాబట్టి దేవుడు వారికి సాయం చేయడం మానేసాడు. ఈ కారణంగా శత్రువులు చాల బలవంతులయ్యారు. వాళ్లు దొంగలు. దొంగలైన ఈ శత్రువులు పొలాల్లో పండిన ధాన్యాన్ని దొంగిలించుకుపోయే వాళ్లు. ఇశ్రాయేలీయుల పశువులను కూడ ఎత్తుకపోయేవాళ్లు. దీనివల్ల వీళ్లు పేదలైపోయారు. చాల విచారంలో మునిగి పోయారు. అయినా ఇదంతా వాళ్లు సొంతంగా చేసుకొన్న తప్పే. అయితే అదృష్టవశాత్తు వాళ్లు తమ పాపం గుర్తించారు. తిరిగిదేవునికి ప్రార్థన చేసారు.

దేవుడు వాళ్ల పాపాలు క్షమిస్తాడా? ఆ దొంగల నుండి ఆయన వారిని కాపాడుతాడా? మనం మన పాపాలను గురించి విచారిస్తే ఆయన తప్పక కాపాడుతాడు. దేవుడు ఎల్లప్పుడూ మన ప్రార్థన విని మనకు సహాయం చేస్తాడు.

ఒక మనుష్యుడు హడావుడిగ పని చేసుకుంటున్నాడు. అతని పేరు గిద్యోను. అతడు గోధుమలను దుళ్లుగొడుతున్నాడు. చూడండి, అతను గోధుమలను ఒక పాత్రలో వేసి కర్రతో కొడుతున్నాడు. గింజలు పైకి ఎగురతున్నాయి.

ఇలాచేస్తూ అతడు భయంభయంగా చుట్టూ చూస్తున్నాడు. దొంగలు వస్తారేమోనని భయపడుతున్నాడు. వాళ్లు చూస్తే వచ్చి గోధుమలు ఎత్తుకపోతారు. అందుకే అతడు చాల వేగంగా పనిచేస్తున్నాడు. అలా చేస్తే గింజలను తొందరగ ఇల్లు చేర్చవచ్చు.

హఠాత్తుగ అతన్ని ఏదో భయపెట్టింది. ఒక వ్యక్తి తన దగ్గరకు వచ్చినిలిచాడు. అది యెవరు? దొంగయా? కాదు. అతడు దేవుని దూత. పరలోకంనుండి వచ్చాడు. నిజం చెప్పాలంటే ఆయన సాక్షాత్తు దేవుడే. అయితే గిద్యోనుకింకా అది తెలియలేదు. ఆ దూత శూరుడా, దేవుడు నీతో ఉన్నాడు, అని చెప్పాడు. ఈ మాటలు గిద్యోనుకు దుఃఖం కలిగించాయి. అతడు-లేదు, దేవుడు మమ్మును విడిచిపెట్టాడు. అదే మా శిక్ష. ఇప్పుడు దొంగలు మమ్మును ఏలుతున్నారు, అన్నాడు.

దేవుడు "గిద్యోనూ, నీవు శత్రువుతోపోరాడాలి" అని చెప్పాడు.

గిద్యోను "నేను పోరాడలేను. నేనింకా చిన్నవాడిని. ఈ దొంగలు చాల బలవంతులు" అన్నాడు.

అయితే దేవుడు "గిద్యోనూ, నేను నీకు సహాయం చేస్తాను. అప్పుడు నీవు వాళ్ల కన్నా బలవంతుడవవుతావు. వాళ్లని జయిస్తావు" అని చెప్పాడు.

ఇప్పుడు గిద్యోనుకు ధైర్యం వచ్చింది. అతడు శత్రువుల నెదిరించడానికి సిద్ధమయ్యాడు. అయితే ముందు అతడు మరోపని చేయాలి.

అదిరాత్రివేళ. వీధుల్లో కొద్దిమంది మాత్రమే తిరుగుతున్నారు. నీవు వాళ్లని దాదాపు చూడలేవు. వాళ్లముందు గిద్యోను నడుస్తున్నాడు. వాళ్లొక అరణ్యంలోకి వచ్చారు. అక్కడో విగ్రహం, బలిపీఠం ఉన్నాయి. అది బయలు దేవత విగ్రహం. పూజ చేయడానికి ప్రజలు వచ్చి దానిముందు మోకరిస్తారు. అయితే గిద్యోను ఏంచేసాడు? అతడోగొడ్డలి పట్టుకుని ఆ విగ్రహాన్ని ముక్కలు చేసాడు. నేలమీద పడిన ఆ ముక్కలు చూడండి. వాళ్లు బలిపీఠాన్ని కూడ బ్రద్దలు చేసారు.

అప్పుడొక క్రొత్త బలిపీఠాన్ని కట్టారు. అది యెహోవా దేవుని బలిపీఠం. అక్కడికి వారొక అర్పణ తెస్తారు. అప్పుడామనుష్యులు వెళ్లిపోయారు.

మరునాడు పగిలిపోయిన బలిపీఠాన్ని ప్రజలంతా చూచారు. యెహోవా దేవుని కోసం కట్టిన బలిపీఠాన్ని కూడ చూచారు. అప్పుడు బయలు దేవుడు కాడని వాళ్లు తెలుసుకుంటారు. బయలుకు సేవ చేయకూడదు. మనం యెహోవా దేవున్ని మాత్రమే సేవించాలి.

గిద్యోను ఇశ్రాయేలులోని మగవాళ్లందరినీ పిలిచాడు. శత్రువులతో యుద్ధం చేయడానికి వాళ్లంతా రావాలి. అందరూ వచ్చారు.

ఒక గొప్ప సైన్యం తయారయ్యింది. మనకు కావలసింది ఇదే, చాల మంది శత్రువులున్నారు - అనుకున్నాడు గిద్యోను.

అయితే యెహోవాదేవుడు ఇలా అన్నాడు. "గిద్యోనూ, నీ దగ్గర చాల మంది సైనికులున్నారు. భయపడుతున్న వాళ్లందరినీ ఇంటికి తిరిగి పంపివేయి. గిద్యోను అలాగే చేసాడు. అతనిసైన్యం ఇప్పుడు చాల చిన్నదయ్యింది. రెండవసారి దేవుడు గిద్యోనుతో "నీవు మరింత మందిని ఇంటికి పంపివేయి" అన్నాడు.

అబ్బో, దొంగలు చాల భయపడ్డారు. ప్రతిచోటా బూరల శబ్దమే. ప్రతిచోటా వెలిగే కాగడాలే! దొంగలు తమ కత్తులూ, బళ్లాలూ పట్టుకున్నారు. వాళ్లు దానితో ఒకరినొకరు కొట్టుకుంటున్నారు. గిద్యోను సైనికులు తమను చుట్టుముట్టారని వారనుకుంటున్నారు. అయితే వాళ్లు ఒకరినొకరు చంపుకుంటున్నారు. వాళ్లేం చేస్తున్నారో వాళ్లకే తెలియనంత చీకటిగ ఉంది. చాలమంది శత్రువులు చచ్చిపడి ఉన్నారు. మిగిలిన వాళ్లు పారిపోడానికి ప్రయత్నిస్తున్నారు. ఒక్కదొంగ కూడ దేశంలో నిలవలేదు! దేవుడు వారికి జయం ఇచ్చాడు! ఆ జయం ఇశ్రాయేలు ప్రజలు దేవున్ని సేవిస్తూ ఉన్నంతవరకే!

మనమంతా దేవుని సేవించాలని ఆయన ఆశ. నీవు అలా చేస్తే సంతోషంగా ఉంటావు, ఎందుకంటే గిద్యోనుకు సాయం చేసినట్టు ఆయన నీకూ సాయం చేస్తాడు.



49. సమ్సోను

మళ్లీ ఇశ్రాయేలీయులు తమ దేవుడ్ని మర్చిపోయారు. వాళ్లిక ఆయనను సేవించడం మానేసారు. మళ్లీ వాళ్లు విగ్రహారాధన ప్రారంభించారు.

కాబట్టి మళ్లీ దేవుడు వాళ్లని శిక్షించాడు. వాళ్ల శత్రువులు మళ్లీ వచ్చి యుద్ధం చేయడం, పంటలు దొంగిలించడం మొదలుపెట్టారు. వాళ్లు ఫిలిష్తీయులు. అయ్యో, అది చాల భయంకరం! ఇశ్రాయేలీయులు చాల విచారించారు, భయపడ్డారు కూడ! అదృష్టవశాత్తు వాళ్లు తిరిగి దేవుడ్ని ప్రార్థించడం మొదలుపెట్టారు. అవును, దేవుడు తిరిగి వాళ్లకి సహాయం చేసాడు. దేవుడు ఫిలిష్తీయులతో యుద్ధం చేయడానికి ఒక బలమైన వీరుని లేవదీసాడు.

ఒక ఇంటిలో భార్యభర్త నివసిస్తున్నారు. భర్త పేరు మనోహ. వాళ్లకి పిల్లలు లేరు.

ఒక దినం మానోహ భార్య ఇంటిలో ఒంటరిగా ఉంది. హఠాత్తుగ ఒక వ్యక్తి తన ప్రక్క నిలబడి ఉండడం చూసి భయపడింది, ఎందుకంటే అతను సాధారణమైన వ్యక్తికాదు. అతని ముఖం ప్రకాశిస్తున్నది. ''ఇతడు దేవుని నుండి వచ్చిన ముఖ్యమయిన వార్తావహుడు. ఇతడు పరలోకంనుండి వచ్చిన దూతయా? అవును అది యెహోవాదూత. నిజంగా అది యెహోవాయే!'' అని ఆమె అనుకుంది.

దూత ఇలా అన్నాడు ''ఇప్పుడు మీకు పిల్లలు లేరు. అయితే త్వరలోనే మీకు పిల్లలు కలుగుతారు. మీకో చిన్న కుమారుడు పుడతాడు. అతని తలవెంట్రుకలు కత్తిరించకూడదు. అతడు దేవునిసేవకుడు అవుతాడు. అతడు ద్రాక్షారసం ఎంతమాత్రం త్రాగకూడదు. అతడు ఫిలిష్తీయులతో పోరాడి ఇశ్రాయేలీయులను రక్షిస్తాడు.

మానోహ భార్య భక్తితో అతని మాటలు విన్నది. ఆమె చాల సంతోషించింది! వెంటనే ఆమె భర్తకు ఇదంతా చెప్పడానికి పరుగెత్తింది. మానోహ స్వయంగా ఆవార్త వినాలని ఆశించాడు. అతడు వినయంతో దేవుని ఇలా ప్రార్థించాడు ''దేవా, దయచేసి ఆ చిన్న కుమారుని గురించి అన్నీనాకు చెప్పగలవా?'' కొన్ని దినాలయ్యాక ఆ దూత ఆ స్త్రీని మరల దర్శించాడు. ఆమె వెంటనే భర్తను పిలిచింది. ఆదూత పుట్ట బోయే కుమారుని గూర్చి అతనికి కూడ చెప్పాడు.

మనోహ వెళ్లి ఒక మేకపిల్లను బలిగ అర్పించాడు. అది దేవునికి అర్పణ. చూడండి మంటలు చాల ఎత్తుకు లేచాయి. ఆ మంటలో దేవుని దూత పరలోకానికి వెళ్లడం వాళ్లు చూచారు. ఇప్పుడు అది దేవుడే అని వాళ్లకి నిశ్చయంగా తెలిసింది.

మానోహ భయపడ్డాడు. అతడు ''బహుశ మనం చచ్చిపోతామేమో'' అన్నాడు. అతని భార్య మాత్రం ''లేదు, దేవుడు మన అర్పణను అంగీకరించలేదా? మనకు కుమారుని దయ చేస్తానని మాట ఇవ్వలేదా?'' అని అన్నది. కొంత కాలం అయ్యాక వారికో కుమారుడు పుట్టాడు. అతని పేరు సంసోను.

చాలకాలం గడిచింది. సంసోను పెద్ద వాడయ్యాడు. అతడు తరచు ఫిలిష్తీయుల దేశానికి వెళ్లేవాడు. ఒక దినం అతడో ఫిలిష్తీయుల పిల్లను చూచాడు. ఆమెతో ప్రేమలోపడ్డాడు. ఆమెను పెండ్లి చేసుకుంటానని తల్లిదండ్రులకు చెప్పాడు.

వాళ్లకది ఇష్టం లేదు. వాళ్లు ''సమ్సోనూ, నీవు ఫిలిష్తీయుల పిల్లను పెండ్లి చేసుకోకూడదు'', అని చెప్పారు కాని అతడు వాళ్ల మాట వినలేదు.

కాబట్టి వాళ్లు ముగ్గురూ ఫిలిష్తీయుల దేశానికి వెళ్లారు. వాళ్లు చాల దూరం నడిచారు. సంసోను తన తల్లిదండ్రులతో కలిసి నడవలేదు. అతడు ఒంటరిగ నడుస్తున్నాడు. అంతలో హఠాత్తుగ..ఆ శబ్దం యేమిటి? అంత గట్టిగ గర్జిస్తున్న దేమిటి? సంసోను చుట్టూ చూచాడు. పాదలలో అతడొక బలమయిన జంతువును చూచాడు. అదో సింహం. అది ఒక్కసారి అతనిపైకి దూకింది. ఓ సంసోనూ, ఇప్పుడది నిన్ను ముక్కముక్కలుగా చీల్చి తినేస్తుంది!

సమ్సోను ప్రాణాన్ని రక్షించుకోడానికి పరుగెత్తాడా? లేదు, లేదు. అతనేమి చేస్తున్నాడో చూడండి. అతడు దాని తలను పట్టుకున్నాడు. తన చేతులతో సింహం




నోటిని రెండుగా చీల్చాడు. సింహం చచ్చిక్రింద పడింది!

సమ్సోను తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లాడు. అతడు వాళ్లకీ సంగతి చెప్పలేదు. ముగ్గురూ కలిసి ఫిలిష్తీయుల దేశానికి వెళ్లారు.

సమ్సోను ఎంత బలవంతుడు! ఆ బలాన్ని దేవుడే అతనికి ఇచ్చాడు. అతడు ఫిలిష్తీయులను జయించాలని. ఎందుకంటే అతడు దేవుని సేవకుడు.

సమ్సోను కన్న బలమైన వాడెవడోనీకు తెలుసా? అది ప్రభువయిన యేసు! ఎందుకంటే ఆయన దేవుని కుమారుడు. ఆయన సాతాను కన్న బలవంతుడు. మన హృదయంలో ఉన్న పాపం కంటె బలమైనవాడు. దేవుడు మాత్రమే మనకు నిజమైన ఆనందాన్ని ఇవ్వగలడు. ఆయన అది ఇస్తాడు కూడ. దానికోసం నీవు ప్రార్థన చేస్తావా?



50. సమ్సోను గూర్చి మరిన్ని విషయములు

సమ్సోను ఆ సింహాన్ని ఎలా చీల్చాడోగుర్తుందా? అతడెంత బలవంతుడో నీకు తెలుసు. దేవుడే అతన్ని అంత బలవంతునిగా చేసాడు.

కొంతకాలం అయ్యాక సంసోను పెళ్లి చేసుకోబోతున్నాడు. కాబట్టి అతడు మళ్లీ ఫిలిష్తీయుల దేశానికి వెళ్తున్నాడు. అతడు తన తల్లిదండ్రులను తనతోపాటు తీసుకుపోయాడు. త్రోవలో తాను అంతకు ముందు చంపిన సింహాన్ని చూచాడు. అవును, అది అక్కడే పడి ఉంది. దాన్ని చూడండి. ఆ చచ్చిన సింహపు అస్తిపంజరంలో ఒక తేనెపట్టు ఉంది. అందులో తీయని తేనెఉంది. సమ్సోను అది కొంత తీసికొని తిన్నాడు. అది తీయగ, రుచిగ ఉంది. అతడు అందులో కొంత తీసి తల్లిదండ్రులకు కూడ ఇచ్చాడు. అబ్బ, ఎంత రుచిగ ఉందో!

పెళ్లి ప్రారంభం అయ్యింది. అది ఒక వారం పాటు కొనసాగుతుంది. ఆ సమయంలో పెళ్లివారు ఆటలు ఆడుతారు, పొడుపు కథలు వేస్తారు. సమ్సోను కూడ ఒక పొడుపు కథ వేసాడు -"తినుదానిలో నుండి తిండి, బలమైన దానిలో నుండి తీపి".

దీని భావం యేమిటి? అదేమంటే - తీపి అంటే తేనె. బలమైనది అంటే సింహం అని సంసోను భావం. కాబట్టి పొడుపు కథ సింహం, తేనెపట్టును గూర్చినది. "మీరు నాపొడపు కథ భావం చెబితే మీ అందరికీ నేను మంచి క్రొత్త బట్టలిస్తాను. మీరు చెప్పలేకపోతే నాకు క్రొత్త బట్టలివ్వాలి" అని సంసోను చెప్పాడు.

దీని గూర్చి ఫిలిష్తీయులు ఆ దినమంతా ఆలోచించారు. మారునాడు కూడ ఆలోచించారు, ఆ వారమంతా ప్రయత్నించారు. అయినా వారికా పొడుపు కథ అర్థం తెలియలేదు. అప్పుడు వాళ్లు సమ్సోను భార్య దగ్గరికి వచ్చి. "ఈ కథ అర్థం యేమిటో నీవు నీ భర్తను అడగాలి. అప్పుడుమాకు అది చెప్పాలి. నీవలా చెప్పక పోతే నీతో పాటు నీ ఇంటిని తగలబెడతాం" అన్నారు.

అమ్మో, సమ్సోను భార్య చాల భయపడింది. ఆమె సమ్సోనుతో-దయచేసి ఆ కథ అర్థం చెప్పమని బ్రతిమాలింది. మొదట అతడు దానిని చెప్పడానికి ఇష్టపడలేదు. ఆమె చెప్పమని చాలసార్లు అడిగింది.

మొదట సమ్సోను దాని అర్థాన్ని ఆమెకు చెప్పడానికి ఇష్టపడలేదు. అయితే ఆమె భయపడి పదేపదే అడిగింది. చివరికి అతడామెకు దాని అర్థాన్ని చెప్పాడు. సింహం, తేనె గురించి చెప్పాడు.

అతని భార్య వెంటనే వెళ్లి ఈసంగతి ఫిలిష్తీయులకు చెప్పింది. అది విని వాళ్లెంతో సంతోషించారు. వాళ్లు సంసోనుతో "నీ ప్రశ్నకు మాకు జవాబు తెలుసు. తీపి అంటే తేనె బలమైనది సింహం" అన్నారు. సంసోను ఆశ్చర్యపడ్డాడు. అవును, ఇది నా భార్య చెప్పి ఉంటుంది-అనుకున్నాడు. అతనికి చాల కోపం వచ్చింది! అది అన్యాయం అనుకున్నాడు.

ఫిలిష్తీయులు అతనితో "సమ్సోను, కథను విప్పాము కాబట్టి ఇప్పుడు నీవు మాకు మంచి బట్టలు ఇవ్వాలి. సమ్సోనుకు కోపం వచ్చింది. "సరే, అలాగే చేస్తాను", అన్నాడు.

అతడప్పుడేం చేసాడు? పట్టణానికి వెళ్లాడు. అక్కడతడు చాల మంది ఫిలిష్తీయుల్ని కొట్టి చంపాడు. స్వయంగా ముప్పైమందిని చంపాడు! అతడంత బలమైనవాడు. ఆ మరణించిన వారి దుస్తులను తెచ్చి పెండ్లి వారి కిచ్చాడు. సమ్సోను ఒంటరిగ తిరిగి వచ్చాడు. అతడు చాల కోపంగ ఉన్నాడు. అతడికపై తన భార్యతో కలిసి ఉండదలచలేదు.

సమ్సోను సాధారణంగా ఫిలిష్తీయులతో ఒంటరిగ యుద్ధం చేసే వాడు. వారి సంఖ్యచాల ఎక్కువ. అయినా ఎప్పుడూ అతడే గెలిచేవాడు. అతడంత బలమైన వాడు! ఈ విధంగా ఫిలిష్తీయులకు వ్యతిరేకంగా దేవుడు ఇశ్రాయేలీయులకు సాయం చేశాడు.

ఒకనాడు సమ్సోను మరోఫిలిష్తీయుల పట్టణానికి వెళ్తున్నాడు. అతడు ఆ పట్టణ ప్రాకారం దగ్గరికి వచ్చాడు. బలమైన ఆ ప్రాకారద్వారం తెరచి ఉంది. సంసోను లోపటికి వెళ్లాడు. అతడొక ఇల్లు వెదకుతున్నాడు. అందులో చాల పాపాలు చేసే ఒక స్త్రీ ఉంది. సమ్సోను



ఆమె ఇంటిలోకి వెళ్లాడు. అతడా రాత్రి అక్కడ గడపదలచాడు. సమ్సోను అలా చేయడం తప్పు. మనం కూడపాపాలు చేసే వాళ్ల ఇంటికి వెళ్లరాదు.

సమ్సోను ఆ ఇంటికి వెళ్లడం ఫిలిష్తీయులు చూచారు. అతన్ని పట్టుకోడానికి ప్రయత్నిం చేసారు. వాళ్లా ద్వారం మూసి తాళం వేసారు. కాబట్టి సంసోను ఆ రాత్రి అక్కడ నుండి వెళ్లడానికి వీలుకాలేదు. ఉదయం వారతన్ని పట్టుకొని చంపాలనుకుంటూన్నారు.

అది మధ్యరాత్రి సమయం. ప్రజలంతా నిద్రపోతున్నారు. అయితే సమ్సోను నిద్రపోలేదు. అతడు ఆ పట్టణం నుండి వెళ్లిపోవాలనుకున్నాడు. కాని అదెలా సాధ్యం? ద్వారం మూసి ఉంది! సరే, అనుకున్నాడు సంసోను, ఏమీ ఫర్వాలేదు. అతడు ఏం చేసాడు? ఆ బరువైన పెద్ద ద్వారాలను గట్టిగ పట్టుకొని గోడ నుండి లాగాడు. తర్వాత దానిని తనవీపు మీద పెట్టుకున్నాడు. చూడండి, అతడు దానిని మోసుకపోతున్నాడు! అతడొక ఎత్తయిన పర్వతం ఎక్కాడు. పర్వత శిఖరం చేరాక ఆ ద్వారాన్ని దింపాడు. అతని బలం ఎంతగొప్పది!

మరునాటి ఉదయం ఫిలిష్తీయులు ఆశ్చర్యపోయారు! ద్వారంలో పెద్ద రంధ్రం అయ్యింది. ఆ ద్వారం పర్వతం పైన ఉంది!

సమ్సోను బలవంతుడయి ఉండవచ్చు. కాని అతడో పాపి!

యేసు ప్రభువు కూడ చాల బలవంతుడని నీకు గుర్తుందా? కాని ఆయన పాపం చేయలేదు. కాబట్టి ఆయన ఒక్కడే మనలను పాపంనుండి రక్షించగలడు. మనం మన పాపాలను క్షమించమని ప్రార్థించాలి.

51. సమ్సోను మరణం

ఒక చిన్న ఏటి ఒడ్డున ఒక చిన్న ఇల్లు ఉంది. అక్కడో స్త్రీ నివసిస్తున్నది. ఆమెపేరు దెలీలా. చూడండి. సమ్సోను ఆచిన్న ఇంటిలోనికి వెళ్తున్నాడు. అతనికి దెలీలాతో ఉండడం చాల ఇష్టం. అయినప్పటికీ.. ఆమె చాల చెడ్డస్త్రీ. ఈ కథ వినండి.

ఆమె ఇలా అంటోంది-నవ్సోను, నీవెంతో బలవంతుడవు. అదెలా సాధ్యం?

దెలీలా అలా ఎందుకు అడుగుతోంది? ఎందుకంటే ఫిలిష్తీయులు అతని బలంలోని రహస్యాన్ని తెలుసుకోవాలనుకున్నారు. ''నీవు ఆ రహస్యం తెలుసుకొని మాకు చెప్పాలి. అప్పుడు మేమతనిని బంధిస్తాము. ఇలా చేస్తే మేము నీకు చాలడబ్బు ఇస్తాము'' అని వాళ్లు దెలీలాతో అన్నారు.

దెలీలాకు డబ్బంటే చాల ఇష్టం. సమ్సోనును బంధించినా ఆమె లెక్కచేయదు. అది చాల నీచమయిన పనికదా?

సమ్సోను దెలీలాతో - నన్ను బలమైన ఏడు త్రాళ్లతో బంధిస్తే బలహీనుడనవుతాను. అప్పుడు నేను తప్పించుకోలేను.

దెలీలా అలాగే చేసింది. సంసోను నిద్రపోతున్నపుడు ఆమె అతన్ని త్రాళ్లతో కట్టివేసింది. ఫిలిష్తీయులు ఆమె ఇంటి మరో గదిలో దాగున్నారు.

హఠాత్తుగ దెలీలా-సంసోనూ, ఫిలిష్తీయులు నీమీదికి వస్తున్నారు! అని అరిచింది. సమ్సోను లేచివాటిని విదిలించుకోగానే --- ఆ త్రాళ్లు తెగిపోయాయి. అప్పుడిక ఫిలిష్తీయులు సంసోను దగ్గరకు రాలేదు. అప్పుడు దెలీలా-సంసోనూ నీవు నన్ను మోసం చేసావు అన్నది. దానికి సంసోను-నన్ను క్రొత్త త్రాళ్లతో కడితే నేను బలహీనుడనవుతాను, అన్నాడు. కాబట్టి రెండో సారి ఆమె అతన్ని క్రొత్త త్రాళ్లతో బంధించింది. మళ్లీ ఆమె-సంసోనూ, ఫిలిష్తీయులు వచ్చారు, అని చెప్పింది.

సమ్సోనుఆ త్రాళ్లను దారం తెంపినట్టు తెంపిపారేసాడు. దెలీలా తాను చాల విచారంగ ఉన్నట్టు నటించింది. వెంటనే సమ్సోను-దెలీలా, నా తలవెంట్రుకలను ఒక స్తంభానికి కట్టు. అప్పుడు నేను మిగిలిన మనుషుల్లా అవుతాను, అన్నాడు.

కాబట్టి ఆమె అలాగే చేసింది. అయితే ఇది కూడ నిజంకాదు. సమ్సోను తన తలవెంట్రుకలను వదిలించుకొన్నాడు. ఇది చూచి దెలీలా-సంసోనూ, నీవునన్ను ప్రేమించడం లేదు. ఇన్నిసార్లు నీవు నాకు అబద్ధం చెప్పావు.

దీనితో సమ్సోను కలవరపడ్డాడు. కాబట్టి అతడు ఆమెకు నిజం చెప్పేస్తాడు. ''నేను దేవుని సేవకుడను. కాబట్టి నా తలవెంట్రుకలు కత్తిరించుకోలేదు. లేకపోతే నేను ఇక నా బలాన్ని కోల్పోతాను'' అన్నాడు. అయ్యో, ఇప్పుడు సమ్సోను ఆ దుర్మార్గపు స్త్రీకి ఆ రహస్యాన్ని చెప్పేసాడు!

సమ్సోను నిద్రపోయాడు. మళ్లీ ఫిలిష్తీయులు వెనకగదిలో దాగున్నారు. దెలీలా వాళ్లని నెమ్మదిగ పిలిచింది. ఫిలిష్తీయులలో ఒకడు గదిలోకి నెమ్మదిగ వచ్చాడు. వాడు సమ్సోను పొడవైన తలవెంట్రుకలను కత్తిరించాడు. ఇదేమీ సమ్సోనుకు తెలియదు.

అప్పుడు దెలీలా ఇలాపిలిచింది-సంసోనూ, ఫిలిష్తీయులు వచ్చి పడుతున్నారు. సంసోను అప్పటికే నిద్రలేచాడు. అవును, నిజమే. ఫిలిష్తీయులు వచ్చారు. కాస్త ఆగండి. అతడు తప్పక---అయ్యో లేదు. అతడిప్పుడు బలంగా లేడు. అయ్యో, ఎంత భయంకరం! ఫిలిష్తీయులు అతన్ని పట్టుకున్నారు. వాళ్లు అతన్ని కట్టి పారేసారు. వాళ్లు సమ్సోనును ఖైదులో వేసారు. అతని పట్ల భయంకరంగా ప్రవర్తించారు. వాళ్లతని రెండు కళ్లూ ఊడబెరికారు. అతడికపై ఎన్నటికీ చూడలేడు. అదే సమ్సోనుకు పడిన శిక్ష!

పాపం బహు భయంకరమైనది కదూ? మనం అనుభవించబోయే శిక్షను గూర్చి ఒక్కసారి ఆలోచించండి. ఆనాడు ఫిలిష్తీయులంతా పండుగ చేసుకుంటూన్నారు. వాళ్లంతా చాల సంతోషంగా ఉన్నారు. ఇక సంసోను తమ్మును తిరిగి హింసించలేడు అని అనుకున్నారు. చాల మంది ఫిలిష్తీయులు గుంపుగ వాళ్ల గుడిలో చేరారు.

''మనం వెళ్లి నవ్సోనును తీసుకువద్దాము. అప్పుడతనిని ఎగతాళి చేయవచ్చు'' అని వాళ్లు అనుకున్నారు. వాళ్లు సంసోనును తీసుకవచ్చారు.

అతడిప్పుడు గ్రుడ్డివాడు. అయితే అతని తలపై వెంట్రుకలు పెరిగాయి! అంటే దేవుడతన్ని జ్ఞాపకం చేసుకున్నాడు. అవును, తాను దెలీలాతో చేసిన పాపాన్ని గురించి సమ్సోను చాల విచారించాడు. దేవుడతని పాపాన్ని క్షమించాడు. సంసోను చుట్టూ ఫిలిష్తీయులు నిలబడి ఉన్నారు. వాళ్లతన్ని చూచి నవ్వుతున్నారు. వాళ్లతని దేవుడ్ని కూడ వెక్కిరిస్తున్నారు. ఇది సంసోనుకు చాల వేదన కలిగించింది. అతడు తన దేవుడ్ని ఎంతో ప్రేమించాడు! అదిగో, వినండి. అతడు చాల ప్రార్థన చేస్తున్నాడు "దేవా, నాకు తిరిగి ఒక్కసారి మంచి బలం దయ చేయవా?" దేవుడతని ప్రార్థన విన్నాడు. సమ్సోను రెండు పెద్ద స్తంభాల మధ్య నిలబడి ఉన్నాడు. అతడు తన రెండు చేతులతో వాటిని గట్టిగా తోసాడు. చాల గట్టిగా! అదో చూడండి, అవి విరిగిపోయాయి! ఎంత భయంకరం! దేవాలయం కప్పంతా పడిపోయింది! అది ఫిలిష్తీయుల మీద కూలి పడుతున్నది. చచ్చిపోతున్న వాళ్లకేకలతో ఎంత పెద్ద శబ్దం! చాల మంది రాళ్ల క్రింద పడి నలిగి చచ్చిపోయారు.

సమ్సోను సహితం చచ్చిపోయాడు. కాని అతడు చచ్చిపోడానికి భయపడలేదు. ఎందుకంటె అతని శత్రువులు సహితం చచ్చిపోతారని అతడెరుగును. అప్పుడిక వాళ్లు దేవుడ్ని వెక్కిరించలేరు. అతడంతగా దేవుడ్ని ప్రేమించాడు. అతడు దేవుని సేవకుడు. కాబట్టి అతడు తప్పక పరలోకం చేరుకుంటాడు, ఎందుకంటే అతని పాపాలు క్షమించబడ్డాయి. అతనికి నూతన హృదయం వచ్చింది.

సమ్సోను కూడ యేసువలె పరలోకంలో ఉన్న దేవుని సేవకుడు. యేసు ప్రభువు తన తండ్రికి విధేయుడయిన కుమారుడు. ఆయన తన పిల్లలు పరలోకం చేరేలా తాను చచ్చిపోయాడు. సంసోనులా నిన్ను తన కుమారులలో ఒకనిగా చేసికొమ్మని దేవునికి ప్రార్థన చేయి.



52. నయోమి, రూతు

నలుగురు మనుష్యులు ప్రయాణమై వెళ్తున్నారు. ఒక తండ్రి, ఒక తల్లి, వాళ్ల ఇద్దరు కొడుకులు. తల్లి పేరు నయోమి. ఈపేరు తప్పక గుర్తుంచుకోండి!

వాళ్లు బెత్లేహేం నుండి వస్తున్నారు. వాళ్లు మరో దేశానికి వెళ్తున్నారు. అది మోయాబు దేశం. వాళ్లు అక్కడ జీవించదలచారు. ఎందుకోతెలుసా? తమ సొంత దేశంలో తినడానికి తిండి దొరకడం లేదు. మనుష్యులు ఆకలితో అలమటిస్తున్నారు.

మోయాబులో ఇంకా సమృద్ధిగ ధాన్యం ఉంది. కాబట్టి ఆ కుటుంబం అక్కడికి వెళ్తోంది. అయితే వాళ్లంతా మోయాబు చేరగానే ఒక విచారకరమైన సంఘటన జరిగింది. ఒకనాడు తండ్రి చచ్చిపోయాడు. ఇప్పుడిక నయోమికి భర్తలేడు. ఇద్దరు కుమారులకూ తండ్రి లేడు. మనకున్న తల్లిదండ్రులకోసం మనమెంత కృతజ్ఞత కలిగి ఉండాలి! మీరు మీ తల్లిదండ్రులను ఇప్పుడూ ప్రేమిస్తున్నారని తలుస్తాను.

కొంతకాలం అయ్యాక నయోమి కొడుకు లిద్దరూ పెండ్లి చేసుకున్నారు. వాళ్లు ఇద్దరు మోయాబు స్త్రీలను పెండ్లాడారు. అందులో ఒక అమ్మాయి పేరు ఓర్పా, మరొక అమ్మాయి పేరు రూతు

అయ్యో, ఎంత విచారం! అసలు ఏం జరిగిందో తెలుసా? నయోమి ఇద్దరు కొడుకులూ చచ్చిపోయారు. వాళ్లు వయసులో చిన్నవాళ్లు. చిన్నవాళ్లు సహితం చచ్చిపోతారు. అయితే నీకు నూతనమైన మనసు ఉంటే పరలోకానికి వెళ్తావు. అక్కడ ఏ దుఃఖమూ ఉండదు.

ఇప్పుడు నయోమికి భర్తగాని కొడుకులుగాని లేరు. పాపం, నయోమి ఒంటరిదయింది. ఆమెతో ఎవ్వరూలేరా? ఉన్నారు, దేవుడు ఆమెను విడిచిపెట్టలేదు. కాబట్టి ఆమె ఎప్పటికి ఒంటరిది కాదు.

నయోమి ఓర్పాకు, రూతుకు యెహోవా దేవుని గురించి చెప్పింది. వాళ్లిద్దరూ జాగ్రత్తగా విన్నారు. రూతు దానిని గురించి అలా ఆలోచిస్తూనే ఉంది. "తల్లి రూతు నిజంగ ఆనందంగ ఉంది. నేను దుఃఖంతో ఉన్న దేవుని ఎరుగని ఒక అన్యస్త్రీని. నయోమి కొలుస్తున్న నిజదేవుడు నాకు నూతనమైన హృదయాన్ని దయచేస్తాడా? అని రూతు హృదయంలో ప్రార్థన చేసుకొంది.

కొంతకాలం తరువాత నయోమి "నేను తిరిగి నా సొంత దేశమయిన బెత్లెహేంకు వెడుతున్నాను. కరవు కాలం ముగిసింది. అక్కడ మళ్లీ ధాన్యం పండుతున్నది" అని కోడళ్లతో చెప్పింది.

ఓర్పా, రూతు తమ అత్త నయోమితో వెళ్లదలచారు. వాళ్లామెను చాల ప్రేమించారు. కొంత సేపయ్యాక నయోమి "మీరు తిరిగి వెళ్లండి. దేవుడే మిమ్మును సంరక్షిస్తాడు" అన్నది.

వాళ్లిద్దరూ ఏడవడం మొదలుపెట్టారు. "మేము తిరిగిపోము. మేము కూడ నీతోపాటు నీ దేశానికి వస్తాము" అన్నారు. "ఇదెలా కుదురుతుంది? మిమ్ములనెవరు వివాహం చేసుకుంటారు? వెనుకకు తిరిగి మీ సొంత దేశానికి వెళ్లండి" అని నయోమి వాళ్లకి నచ్చచెప్పబోయింది. వాళ్లిద్దరూ మళ్లీ ఏడ్చారు. అప్పుడు



ఓర్పా, నయోమికి ముద్దుపెట్టి తిరిగి తనదేశానికి వెళ్లిపోయింది. అయితే రూతు ఏమి చేసింది? ఆమెతిరిగి తన స్వదేశానికి వెళ్లలేదు. నయోమి వద్దనే ఉండిపోయింది. "నీవు ఓర్పాతో కలిసి నీస్వదేశానికి వెళ్లాలి" అని నయోమి చెప్పింది. దానికి రూతు-లేదు, నేను వెళ్లను. నేను నీతోవస్తాను. నీ ప్రజలే నా ప్రజలు, నీ దేవుడే నాదేవుడు" అని చెప్పింది.

ఆమె చెప్పింది మీరు విన్నారా? రూతు నయోమిని చాల ప్రేమించింది. దేవుడామె హృదయాన్ని తాకాడు. ఆమె యోహోవా దేవుడ్ని ప్రేమించింది. ఇకపై మోయాబులోని విగ్రహాలను పూజించడం మానేసింది. యెహోవాను మాత్రమే సేవించదలచింది. అందువలన ఆమె ఇశ్రాయేలు ప్రజల మధ్యకు వెళ్లాలని నిశ్చయించింది ఎందుకంటే ఆయన అక్కడ ఉన్నాడు.

దేవుడు రూతు హృదయాన్ని మార్చాడని నీవు గ్రహించావా? యెహోవా ఆమె ప్రార్థనలు విన్నాడు.

నయోమి, రూతు కలిసి బెత్లేహేం చేరుకున్నారు. ప్రజలు వాళ్లని చూసి "ఇది నయోమి యేనా? ఎంత ముసలిదయ్యింది!" అన్నారు. అవును, మోయాబులో ఆమెకు జరిగిన విషాద సంఘటనలవల్ల అలా అయ్యింది. అయితే ఇప్పుడు నయోమి, రూతు కలిసి బెత్లేహేంలో జీవించారు.



53. బోయజు, రూతు

ఆ పొలాల్లో కష్టపడి పని చేస్తున్న ఆ ప్రజలను చూడండి. అక్కడ గోధుమ పంట బంగారు రంగుకు తిరిగింది. ఇప్పుడు దానిని కోస్తున్నారు. కోతపని వారి చేతిలోనున్న పదునైన కొడవళ్లతో వాళ్లు చకాచకా కోస్తున్నారు. వాటిని పెద్ద కట్టలుగా కడుతున్నారు.

అప్పడప్పుడూ ఒక్కోవన క్రిందపడుతున్నది. చాలసేపు అది అక్కడ ఉండదు. ఒక స్త్రీ వచ్చిదానిని త్వరగ తీసికొంటున్నది. అలా చాల పనలు పడుతున్నవి. వాటిననిన్నిటినీ ఆమే ఎత్తుతున్నది. అలాసమకూర్చుతున్న స్త్రీ ఎవరు? అది రూతు!

ఆమె ఎందుకు ఈపని చేస్తున్నది? నయోమి రూతు చాల పేదవాళ్లు. వాళ్లకోసం డబ్బు సంపాదించడానికి భర్తలు లేరు. ధాన్యం కొనాలంటే డబ్బు లేదు. అందుకనే రూతు పొలంలో పరిగయేరు కొంటున్నది. అక్కడి రైతు ఆమెను ఏమీ అనడు. ఆ గోధుమలతో ఆమె రుచికరమైన రొట్టెలు తయారు చేస్తుంది.

ఆ పొలం యజమానిని చూడండి. అతని పేరు బోయజు. అతడు చాల డబ్బుగలవాడు. అతడు రూతును చూచాడు. ఆమె వంగి పరిగె ఏరుతున్నది. ఎంత కష్టపడుతోంది! ఆమె సోమరి కాదు.

మనం కూడ సోమరులముగా ఉండకూడదు. మన పనిని మనం చేసుకోవాలని దేవుడు కోరుతున్నాడు. మనం దానిని సంతోషంగా చక్కగా చేయాలని ఆయన ఆశ.

"ఈ యువతి ఎవరు?" అని బోయజు కోతపని వారిని ప్రశ్నించాడు.

వాళ్లు, "ఈమె రూతు, ఆమె మోయాబు నుండి నయోమితో కలిసి వచ్చింది. ప్రతి రోజు పరిగ యేరు కోడానికి ఇక్కడికి వస్తున్నది" అని చెప్పారు. బోయజు రూతు దగ్గరకు వెళ్లాడు. అతడు ఆమెపట్ల దయ చూపించాడు. "నీవు నా పొలంలో ప్రతి రోజూ పరిగె యేరు కోవచ్చు" అని చెప్పాడు. ఆ, రూతు చాల సంతోషించింది. ఈ ధనవంతుడయిన యజమాని తన పట్ల అంత దయ ఎందుకు చూపిస్తున్నాడో ఆమెకు అర్థం కాలేదు. తానొక పేదరాలు కాదా? పరదేశం నుండి వచ్చిన అన్యురాలు కాదా? అని ఆమె బోయజుతో అన్నది. అయితే బోయజు "నీ సంగతి అంతా నాకు తెలుసు. నీవునీ అత్త నయోమిని పరామర్శిస్తున్న విషయం నేనెరుగుదును! యెహోవా దేవుడు తప్పక నిన్ను కాపాడుతాడు" అన్నాడు.

అది విని రూతు తన మనసులో "అయ్యా, నీవు నాపట్ల ఎంత దయచూపిస్తున్నావు! నా కిదేమీ అర్థం కావడం లేదు" అనుకున్నది.

అది మధ్యాహ్న కాల భోజన సమయం. బోయజూ, కోతపని వాళ్లూ భోజనం చేయబోతున్నారు. రూతును కూడ రమ్మని పిలిచారు. బోయజు, ఆమెకు కొంచెం ఆహారం, కొంచెం పానీయం ఇచ్చాడు. అబ్బ, అతడెంత మంచివాడు!

భోజనం అయ్యాక వాళ్లంతా పని ప్రారంభించారు. బోయజు మెల్లని స్వరంతో పనివాళ్లకు ఇలా చెప్పాడు. "మీరు పంట కోస్తున్నపుడు కొన్ని పనలను పడవేయండి. రూతు కాస్త ఎక్కువ పరిగెయేరు కొనేలా చూడండి".

అది రాత్రివేళ. రూతు ఇంటికి తిరిగి వెళ్తున్నది. ఆమె చాల గోధుమలు తీసుకపోతోంది! అది చూచి అత్త నయోమి ఆశ్చర్యపోయింది. రూతు జరిగిన సంగతి అత్తకు చెప్పింది. మంచి వాడైన బోయజు గురించి చెప్పింది.

నయోమి "యెహోవా మన యెడల ఎంతదయ చూపించాడు!" అన్నది.

నయోమికి బోయజు ఎవరో తెలుసు. అతడు వాళ్లకి బంధువే. ఆ కారణంగా అతడు వారిపట్ల శ్రద్ధ చూపవచ్చు. అయితే పొలంలో కోత ముగిసిన తరువాత కూడ అతడు సహాయం చేస్తాడా? సరే వినండి.


చివరికి కోత ముగిసింది. ఇక రూతుకు ధాన్యం దొరకదు. ఇక మీదట నయోమి, రూతు ఆకలితో బాధ పడవలిసిందేనా? లేదు లేదు. ఒక అద్భుతం జరుగోతున్నది. బోయజు పెళ్లి చేసుకోబోతున్నాడు. ఎవరినో తెలుసా? రూతునే! ధనవంతుడయిన బోయజు ఆ పేదరాలు రూతును పెండ్లి చేసుకున్నాడు. వాళ్లొక అందమయిన ఇంటిలో నివసిస్తారు. ఇప్పటి నుండి బోయజు నయోమిని రూతును సంరక్షిస్తాడు. రూతు బోయజును పెండ్లి చేసుకోవడం వల్ల ధనవంతురాలయ్యింది. బోయజు, రూతు ఒకరినొకరు చాల ప్రేమించుకున్నారు. అయితే వారు అందరికన్న

ఎక్కువగా ఎవరిని ప్రేమిస్తారో తెలుసా? యెహోవా దేవున్ని. వాళ్లెంత ధనవంతులో! వారికి నిజమైన ఆనందం అంటే యేమిటో తెలుసు. వారు మరణించినపుడు కూడ.

కొంతకాలం అయ్యాక రూతు బోయజులకు ఓ చిన్న కుమారుడు కలిగాడు. వాళ్లతనికి ఓబేదు అని పేరుపెట్టారు.

ఓబేదు పెద్దవాడై పెళ్లి చేసుకున్నాడు. అతనికి ఒక కొడుకు పుట్టాడు. అతనికి మళ్లీ పిల్లలు కలిగారు. అలా అలా చాల మంది పుట్టి అదో పెద్ద కుటుంబం అయ్యింది.

తరువాత, చాల కాలం తర్వాత రక్షకుడైన యేసుప్రభువు ఈ కుంటుంబంలోనే జన్మించాడు. ఇలా జరుగుతుందని ఎవరనుకున్నారు?



54. సమూయేలు పుట్టుక

గుడారం గురించి మీకు గుర్తింది కదూ? ఆ గొప్ప, అందమయిన గుడారం. అది దేవుని మందిరమని జ్ఞాపకం ఉందా? దానిని ఇశ్రాయేలీయులు తమ అరణ్య ప్రయాణంలో తమతో పాటు తీసుకపోయేవాళ్లు.

ఇప్పుడు వాళ్లు ఇండ్లు కట్టుకొని అందులో నివసిస్తున్నారు. వాళ్లు కనాను దేశంలో స్థిరపడ్డారు. మరి గుడారం ఎక్కడ ఉంది? కానానులో కూడ దానికో ప్రత్యేక స్థలం ఉంది. అది షిలోహులో ఉంది. కొన్నిసార్లు ఇశ్రాయేలీయులు షిలోహు వెళ్లేవారు. గుడారంలో దేవునికి అర్పణలు ఇచ్చే వాళ్లు. అక్కడ ఆయనకు ప్రార్థన కూడ చేసేవాళ్లు. ఆ గుడారమే వాళ్ల ఆలయం. మనమయితే ప్రతి ఆదివారం ఆలయానికి వెళ్లగలం. ఇశ్రాయేలీయులు ఇలా క్రమంగా వెళ్లలేరు. ఎందుకంటే అందులో చాలమంది దూర ప్రాంతాల్లో నివసించే వాళ్లు.

ఇలా సుదూర ప్రాంతంలో వేరెవరు నివసిస్తున్నారో తెలుసా? ఎల్కానా. ఇతడు సంవత్సరానికోసారి షిలోహుకు వెళ్లేవాడు. అతడు తన ఇద్దరు భార్యలను తనతో పాటు తీసుకపోయేవాడు. వాళ్లపేర్లు హన్నా, పెనిన్నా. ఎల్కానాకు ఇద్దరు భార్యలు. అసలతడలా చేసుకోకూడదు. ప్రతి ఒక్కడికి ఒకే భార్య ఉండాలి.

పెనిన్నా తన పిల్లలను కూడ గుడారానికి తీసుకపోయేది. మరి హన్నా మాట యేమిటి? హన్నాకు పిల్లలు లేరు. అది ఆమెకు విచారం కలిగించేది. ఎల్కానా కూడ దీనిగూర్చి బాధపడేవాడు. అయితే పెనిన్నాకు ఏబాధా లేదు. దీనిని గురించి ఆమె నవ్వేది హన్నాను విసిగించేది. ఆమె హన్నాతో "చూడు నాకుపిల్లలున్నారు. నీకు లేరెందుకు?" అని ప్రశ్నించేది. దీనితో హన్నా దుఃఖం ఇంకా ఎక్కువయ్యేది. ఎల్కానా హన్నాతో 'హన్నా, ఏడ్వవద్దు. నేను నిన్ను ప్రేమిస్తున్నానని నీకు తెలుసుకదా?" అనేవాడు.



మనం ఇతరులకు ఎప్పుడయినా దుఃఖం కలిగించామా? వారి పట్ల నిర్దయగ ఉండి విసికించామా? అదోపెద్ద పాపమని నీకు తెలుసా?

ఒకనాడు వాళ్లు మళ్లీ షిలోహుకు వెళ్లారు. వాళ్లక్కడ బలియివ్వడానికి జంతువును తీసికువెళ్లారు. వాళ్లంతా కలిసి భోజనం చేస్తారు. చూడండి, ఎల్కానా హన్నాకు మరోవంతు ఎక్కువ మాంసం ఇస్తున్నాడు! ఎందుకంటే హన్నాచాల విచారంగా ఉంది. అయితే ఆమె దుఃఖంతో ఉండడంవల్ల సరిగా భోజనం చేయలేక పోతున్నది.

భోజనం అయ్యాక హన్నా మందిరానికి వెళ్లింది. ఆమె అక్కడికి ఒంటరిగా వెళ్లింది. ఆమె ఒక ప్రశాంతమయిన స్థలం చూచి అక్కడ మోకరించింది. ఆమె దేవునికి ఇలా ప్రార్థన చేసింది "ప్రియమయిన దేవా, నీవు నాకొక కుమారుని దయ చేస్తావా? నేను వానిని జాగ్రత్తగ పెంచుతాను. ఆ తరువాత తిరిగి నీకు సమర్పిస్తాను. ఈ మందిరంలో అతడు నీకు సహాయం చేస్తాడు"! హన్నా భక్తితో ఇలా ప్రార్థన చేస్తున్నది. అది ఎవ్వరికీ వినబడలేదు. ఆమె నిశ్శబ్దంగా తనలో తానే ప్రార్థిస్తున్నది. ఆమె పెదవులు మాత్రమే కదులుతున్నాయి. ఆమె హృదయంతో ప్రార్థిస్తున్నది. ఆమె దేవుడ్ని ప్రేమించడం వల్ల తన కుమారుడ్ని తన కోసం ఉంచుకోదలచలేదు. అతడు దేవుని సేవకుడు కావాలని ఆమె ఆశించింది.

అంతలో ప్రధాన యాజకుడు ఆ ప్రక్కగా వెళ్లాడు. ఆయన పేరు ఏలీ. ప్రధానయాజకుడు గుడారం అంతటి మీద అధికారి అని నీకు గుర్తుందా? ఆమెను చూచి ఎంత కోపించాడు. హన్నా పెదవులు కదలడం అతడు చూచాడు. ఆమె త్రాగిన మత్తులో ఉందని అతడునుకున్నాడు. ఆమె చెడుస్త్రీయని అతడు తలంచాడు. ఆమె దేవున్ని సేవించడానికి రాలేదు కాని పాపం చేయడానికి వచ్చిందని అతడు అనుకున్నాడు.

అప్పుడు ఏలీ హన్నాతో-నీవు ఇలా త్రాగి గుడారానికి రాకూడదు" అన్నాడు.

ఈ మాటవిని హన్నా ఆశ్చర్యపడింది. ఆమె "లేదండి నేను త్రాగలేదు. కాని నాహృదయం చాల దుఃఖంతో నిండి ఉంది. దాని గురించి నేను దేవునితో మొరపెట్టుకుంటున్నాను" అని ఏలీకి చెప్పింది.

ఏలీ "నీవు దేవునికి ప్రార్థన చేసావా? ఆయననీ



మొరలు వింటాడు. నీవు అడిగిన దానిని తప్పక దయచేస్తాడు" అన్నాడు. ఏలీకి ఈ విషయం ఎలా తెలుసు? దేవుడే చెప్పాడు. ఎందుకంటే ఏలీ దేవుని సేవకుడు.

వాళ్లు తిరిగి ఇంటికి వెళ్లారు. ఎల్కానా, పెనిన్నా హన్నా-అందరూ తిరిగి వెళ్లారు. అవును, ఏలీ చెప్పినట్టు కొంత కాలానికి హన్నాకు ఒక కుమారుడు పుట్టాడు. అతని తండ్రి ఎల్కానా, తల్లి హన్నా, అబ్బో, ఇప్పుడు హన్నా ఎంతో ఆనందంగా ఉంది! ఆమె ప్రభువును స్తుతించింది. ఆమె దేవుని కీర్తించింది. ఆమె నిండు మనసుతో వందనాలు చెల్లించింది. ఆమె తన కుమారునికి సమూయేలు అని పేరు పెట్టింది. ఆ పేరుకు "నేను ప్రభువును అడిగి తిని" అని అర్థం. ఎందుకంటే నిజంగానే ఆమె కుమారుడుకావాలని అడిగింది కదూ? దేవుడామెకు ఇచ్చాడు కదూ?

మనం కూడ హన్నావలె మన విచారాలను దేవునికి చెప్పుకోవచ్చు. మనం దేవునికి మన కష్టాలన్నీ చెప్పవచ్చు. మన కేమి కావలసినా అడగవచ్చు. అన్నిటికంటె ముఖ్యంగా మనకు కావలసింది ఏదో మీకు తెలుసా? తెలుసని అనుకుంటున్నాను.

55. దేవుడు సమూయేలును పిలుచుట

ప్రతీదినం ఎందరో మందిరాన్ని దర్శిస్తుంటారు. అందరూ ప్రార్థన చేయడానికే వస్తారా? హన్నా వచ్చినట్టు? లేదు. కొందరు అక్కడ పాపపు పనులు కూడ చేస్తారు. వినండి.

ఏలీకి ఇద్దరు కుమారులున్నారు. వారి పేర్లు-హోఫ్ని, ఫీనెహాసు. వాళ్లు యాజకులు. కాబట్టి దేవునికి మంచిగ సేవచేయాలి. అయితే వీళ్లిద్దరూ అలాగునలేరు. వాళ్లు చెడ్డసేవకులు. వాళ్లు పాపాలు చేస్తారు. కొందరు మనుష్యులలాగే చేస్తారు. వాళ్లు హృదయపూర్వకంగా దేవునికి సేవ చేయడంలేదు.

ఏలీ హోఫ్ని, ఫీనెహాసులతో-మీరిలాంటి చెడ్డపనులు చేయకూడదు, అని చెప్పాడు. అయితే వాళ్లు అలాగే చేస్తున్నారు. ఏలీ వాళ్ళపై కోపించాలి. వాళ్ళని శిక్షించాలి. అయితే అతడలా చేయలేదు. అది అతడు చేసినతప్ప. అలా చూచండి. ఆ దారివెంబడి ఎవరు వస్తున్నారు? అది హన్నా. ఒక చిన్న బాలుడు ఆమె చేయిపట్టి నడుస్తున్నాడు. అతనెవరో మీకు తెలుసనుకుంటున్నాను. అతడే సమూయేలు! హన్నా ఏలీ దగ్గరకు వెళ్లి-ఒక కుమారుని కోసం దేవుడ్ని అడగడానికి నేనిక్కడికి వచ్చాను. మీకది గుర్తుందని తలుస్తాను. నాకు దేవుడొక కుమారుని దయచేసాడు. ఇదుగో, ఇతడే ఆ కుమారుడు. ఇతని పేరు సమూయేలు. ఇతడు మీతోపాటు ఈ గుడారంలో ఉండవచ్చునా? అప్పుడతడు దేవుని సేవించగలడు. అలా చేస్తానని నేను దేవునికి మాట ఇచ్చాను, అని చెప్పింది. ఏలీ ఆమె చేసినది మంచిపని, అని తలచాడు.

హన్నా తిరిగి తన ఇంటికి వెళ్లింది. సమూయేలును మందిరంలో విడిచివెళ్లింది. ఆమె అతని గూర్చి ఆలోచిస్తుంది, ప్రార్థిస్తుంది కూడ. ఆమె ప్రతియేడూ మందిరానికి వెళ్తుంది. తిరిగి తన కుమారుడు సమూయేలును చూడడం ఆమెకెంతో సంతోషం. ప్రతిసారీ సమూయేలుకు అతని తల్లి ఏమీ ఇస్తుందో తెలుసా? ఒక క్రొత్త తెల్లని అంగీ. అది యాజకులు ధరించే అంగీవలెనే ఉంటుంది.

సమూయేలు ఏలీకి చాల సాయంచేస్తాడు. అతడు దేవునికి మంచి సేవకుడు కావాలని అతని ఆశ. అదెందుకో తెలుసా? ఎందుకంటే దేవుడతనికి ఒక క్రొత్త హృదయం ఇచ్చాడు. కాబట్టి అతడు దేవున్ని ప్రేమిస్తున్నాడు. దేవుడు పిల్లలకు నూతన హృదయం ఇవ్వగలడని గమనించారా? పెద్దవాళ్లకి ఇచ్చినట్లే పిల్లలక్కూడ ఇవ్వగలడు.

అది రాత్రివేళ. ఏలీ నిద్రపోతున్నాడు. సమూయేలు కూడ నిద్రపోతున్నాడు. అతనికి గల చిన్న గదిలో పండుకున్నాడు.

హఠాత్తుగ సమూయేలు నిద్రలేచాడు. ఎవరో తనను పిలవడం విన్నాడు. ఒక స్వరం "సమూయేలూ, సమూయేలూ" అనడం వినిపించింది. అతడు వెంటనే లేచి ఏలీ దగ్గరకు పరుగెత్తాడు. "అయ్యా, నీవు నన్ను పిలిచావు కదా? నేను వచ్చాను" అన్నాడు సమూయేలు.

"లేదు, నేను నిన్ను పిలవలేదు. వెళ్లి నిద్రపో" అని ఏలీ చెప్పాడు. మరి కొంత సేపయ్యాక "సమూయేలూ, సమూయేలూ" అని మళ్లీ వినిపించింది. అవును, ఆ స్వరం స్పష్టంగా వినిపించింది. సమూయేలు తిరిగి ఏలి వద్దకు వెళ్లాడు. అయితే ఏలీ మళ్లీ-నేను నిన్ను పిలువలేదు సమూయేలూ, వెళ్లి నిద్రపో అన్నాడు.

అప్పుడు మూడవసారి అదే స్వరం సమూయేలుకు వినిపించింది. అతడు త్వరగా ఏలీ దగ్గరకు వెళ్లాడు. అది దేవుని స్వరమే అని ఏలీ యిప్పుడు అర్థం చేసికొన్నాడు. ఏలీ-నీవు మళ్లీ ఆ స్వరం వింటే - దేవా, సెలవీయి, నీదాసుడు ఆలకిస్తున్నాడు అని చెప్పమన్నాడు.

సమూయేలు. మంచం మీద పరుండి కనిపెడుతున్నాడు. అదిగో, అదే స్వరం! "సమూయేలూ, సమూయేలు" అని వినవచ్చింది.

సమూయేలు భక్తితో-దేవా, సెలవీయి, నీ దాసుడు ఆలకిస్తున్నాడు, అని చెప్పాడు. సమూయేలుకు దేవుని స్వరం వినడం ఎంతో ఆనందాన్నిచ్చింది.

దేవుడు మనతో కూడ మాట్టాడుతాడు. ఉదాహరణకు బైబిలు ద్వారా మాట్లాడుతాడు. దేవుని స్వరం విని మనం సంతోషిస్తున్నామా?

దేవుడు సమూయేలుతో ఇలా అన్నాడు- ''సమూయేలూ, నేను ప్రజలను శిక్షిస్తాను. నాకు వ్యతిరేకంగా పాపం చేసిన వారిని నేను శిక్షిస్తాను. నేను హోఫ్నీ, ఫీనెహాసులను కూడ శిక్షిస్తాను. ఎందుకంటే వాళ్లు దుష్టులు, పాపులైన యాజకులు. వాళ్లిద్దరూ ఒకే రోజు చచ్చిపోతారు.

తెల్లవారింది. సమూయేలు ఏలీతో ఇది చెప్పడానికీ భయపడ్డాడు. చాల దుఃఖపడ్డాడు. అయితే దేవుడు చెప్పినదేమని ఏలీ సమూయేలును అడిగాడు.

అప్పుడు సమూయేలు సమస్తం అతనికి తెలియజేసాడు. ఆ మాటలకు ఏలీ చాలకలవరపడ్డాడు. అయినా దేవుడు న్యాయవంతుడని అతడెరుగును. శిక్షించడంలో కూడ ఆయన న్యాయాన్నే జరిగిస్తాడు. కాబట్టి ఏలీ - దేవుడు ఏమి చేసినా అది న్యాయంగానే చేస్తాడని అన్నాడు.

కొంతకాలానికి ఆ దేశంలో యుద్ధం వచ్చింది. ఇశ్రాయేలు ప్రజలు ఫిలిష్తీయులతో యుద్ధం చేసారు. హోఫ్నీ, ఫీనెహాసులు గుడారంలోనున్న మందసాన్ని తీసికెళ్లారు. మందసం మనతో ఉంటే విజయం తప్పక కలుగుతుందని వాళ్లనుకున్నారు. అయితే అది నిజంకాదు. దేవుడు ఇశ్రాయేలు ప్రజకు సాయం చేయడం లేదు. ఫిలిష్తీయులే జయం పొందుతున్నారు. అది ఇశ్రాయేలు ప్రజకు దేవుడిచ్చిన శిక్ష. హోఫ్నీ, ఫీనెహాసులిద్దరినీ శత్రువులు చంపేసారు. ఫిలిష్తీయులు మందసాన్ని ఎత్తుకపోయారు.

జరిగిన సంఘటన ఏలీ విన్నాడు. అతడు దిగ్భ్రాంతి చెందాడు. తాను కూర్చున్న పీటమీద వెనుకకు పడి... ఏలీ చచ్చిపోయాడు.

అంతా విషాదంగా మారింది. పాపం ఎంత భయంకరం! పాపం ఎప్పుడూ దుఃఖాన్ని తెస్తుంది. అందుకోసమే మనకు నూతన హృదయం కావాలి. అప్పుడిక తప్పు చేయగోరము. అప్పుడు పాపాన్ని ఎదిరిస్తాం. సమూయేలు వలె దేవుని మాట వింటాం.



56. దావీదును రాజుగ అభిషేకించుట

సమూయేలు పెరిగి పెద్దవాడయ్యాడు. అతడు ఇప్పుడొక ప్రవక్త. దేవుని మంచి సేవకుడు. అతడు దేవుని గూర్చి ప్రజలకు బోధించేవాడు. అతడు ప్రజలకు దేవుని సేవించుమని తరచూచెప్పేవాడు. అక్కడ మరోదైవ సేవకుడుండేవాడు. అది ఆ దేశాన్ని పాలించేరాజు. దేశంలో అతడే ముఖ్యమయిన వ్యక్తి. అతడే ప్రజలను పరిపాలించేవాడు. ఆరాజుపేరు సౌలు. సౌలు ఒక మంచి దైవసేవకుడయితే ఎంత బాగుండును! అతడు దేవుని మాట వినాలి! మొదట్లో అతడలాచేసాడు. అయితే ఆ తర్వాత అతడు దేవుని మాట వినడం మానేసాడు. ప్రతి పనీ తన ఇష్టం వచ్చిపట్టు చేయదలచాడు. అతడు దేవునికి అవిధేయుడయ్యాడు.

ఇది చూచి సమూయేలు చాల విచారించాడు. దేవుడతనితో "సమూయేలూ, నేను ఇశ్రాయేలీయులకు ఒక కొత్త రాజు నిస్తాను. నన్ను ప్రేమించి నాకు లోబడే రాజును" అన్నాడు.

సమూయేలు ఆ రాజును అభిషేకించాలి. అదుగో, సమూయేలు వెళ్తున్నాడు. అతడు బెత్లెహేంకు ప్రయాణమయ్యాడు. అక్కడ యెష్షయి నివసిస్తున్నాడు. అతనికి ఎనిమిది మంది కొడుకులు. వీరిలో ఒకడు తప్పక రాజవుతాడని సమూయేలుకు తెలుసు. దేవుడు అలా అని చెప్పాడు. అయితే ఆ కుమారుడెవడు? సమూయేలుకు అది ఇంకా తెలియదు.

సమూయేలు యెష్షయితో ఇలా అన్నాడు. "మనం దేవునికి బలి అర్పించి అప్పుడు అందరం కలిసి భోజనం చేద్దాం.

యెష్షయి కొడుకులు కూడ వస్తున్నారు. ఒకరి తరువాత ఒకరు వచ్చారు. మొట్టమొదట జ్యేష్ఠుడు. అతడు ఎంత బలంగ ఉన్నాడు! ఇతడే తప్పక రాజవుతాడని సమూయేలు అనుకున్నాడు.

అయితే యెహోవా-కాదు సమూయేలూ, ఇతడు కాడు. ఎందుకంటే నేను హృదయాన్ని చూస్తాను. తరువాత రెండవ కొడుకు వచ్చాడు. సమూయేలు అతడ్నికూడ అభిషేకించలేదు. ఆ తరువాత వాడిని సహితం అభిషేకించలేదు. యెష్షయికొడుకులందరూ సమూయేలు ఎదుటికి వచ్చారు. కాని ఎవరికీ రాజుగా అభిషేకం జరగలేదు. ప్రతిసారీ దేవుడు-సమూయేలూ, నేను ఇతన్ని కూడ ఎంచుకోలేదు అని చెప్పాడు. సమూయేలుకు ఏమీ అర్థం అవ్వలేదు. "నీ కుమారులందరూ వీరేనా?" అని సమూయేలు యెష్షయిని ప్రశ్నించాడు. "కాదు, నా చిన్నకుమారుడు ఇంకా పొలంలో ఉన్నాడు. అతడు గొర్రెలు కాస్తున్నాడు. అతని పేరు దావీదు". అని యెష్షయి జవాబిచ్చాడు.

అవును, దావీదు ఎప్పుడూ గొర్రెలను కాస్తూంటాడు. అది అతనికెంతో ఇష్టం. దావీదు మంచి గొర్రెల కాపరి. ఈ కథ వినండి.

ఒకదినం సింహం ఒకటి దావీదు గొర్రెలకు సమీపంలో దాగుంది. అది ఆకలిగొని ఉంది. ఒక్కగెంతున అది మందలోని గొర్రెను తన పెద్ద నోటితో పెట్టుకొని పోయింది. అది దానిని లాక్కుపోవాలని అనుకొంది. ఏదో ఒక ఏకాంత ప్రదేశంలో దానిని తినాలనుకొంది. దావీదు దానిని చూచాడు. తన కర్రతో చితకబాదాడు. దాంతో ఆ సింహం గొర్రె పిల్లను వదిలేసింది. ఆ తర్వాత ఏమయ్యింది? దావీదు దానిని కర్రతోబాది చంపేసాడు!

దావీదు ఇంత ధైర్యంగా ఎలా ఉండగలిగాడు? సింహాన్ని ఎలా చంపగలిగాడు? దావీదు దేవున్ని నమ్మాడు. అవును, అతడు యెహోవాదేవుని ప్రేమించాడు.

కొన్నిసార్లు గొర్రెలు విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో దావీదు తన సితారా తీసుకుంటాడు. ఇది తీగలతో కూడిన ఒక వాయిద్యం. అదిగో, వినండి. దావీదు తన సితారా వాయిస్తున్నాడు. దానితో అతడు తీయని సంగీతాన్ని వినిపిస్తాడు. అతడు చక్కగా పాటలు కూడ పాడతాడు. తనను ఎంతో భద్రంగా కాపాడుతున్న యెహోవా దేవుని గూర్చి పాడతాడు. అతడు పాడుతున్న "యెహోవా నా కాపరి" అనే కీర్తన ఎంతో మధురంగ ఉంటుంది!

దావీదు తన గొర్రెలను ఒక్కడే కాస్తున్నా, అతడు ఒంటరివాడు కాడు దేవుడు అతనితో ఉన్నాడు. అది అతనికి ఎంతో సంతోషాన్నిస్తుంది!


తన తండ్రి సేవకుడొకడు వేగంగా రావడం దావీదు చూచాడు. అతడు ''దావీదూ, నీవువెంటనే ఇంటికి రావాలని నీతండ్రి చెప్పినన్ను ఇక్కడికి పంపాడు'' అన్నాడు.

దావీదు వెంటనే ఇంటికి వెళ్లాడు. ఇంటి వద్ద యేమి జరిగిందా అని దావీదు అనుకున్నాడు. అతడు ఇంటిలోనికి వెళ్లాడు. అక్కడ తండ్రి యెష్షయి, అతని అన్నలందరూ ఉన్నారు. ఓ, అక్కడ దేవుని ప్రవక్త సమూయేలు కూడ ఉన్నాడు.

యెహోవా దేవుడు సమూయేలుతో- నీవు దావీదుకు అభిషేకం చెయ్యి. అతడే కాబోయే రాజు, అని చెప్పాడు. సమూయేలు దావీదు దగ్గరకు వెళ్లాడు. దావీదుమోకరించాడు. సమూయేలు నూనెతో నిండిన ఆవు కొమ్మును చేతపట్టుకొని ఉన్నాడు.

అదిగో, చూడండి. సమూయేలు ఆ నూనెను దావీదు తలపై పోసాడు. ఈ విధంగా ప్రభువైన దేవుడు-నేను నీవు రాజు అవ్వాలని కోరుతున్నాడు. నేను నీతో ఉండినీకు సహాయం చేస్తాను, అని చెప్పాడు.

దావీదు తిరిగి తన గొర్రెల వద్దకు వెళ్ళిపోయాడు. యేసు ప్రభువుకూడ గొర్రెల కాపరియే. ఆయన మంచి కాపరి. ఆయన గొర్రెలు ఎవరు? ఆయన పిల్లలే. క్రొత్త మనసు కలవారంతా ఆయన పిల్లలు దావీదు తన గొర్రెలను చక్కగ చూచుకుంటాడు. అయితే యేసు తన పిల్లలను మరింత శ్రద్ధగ కాపాడుతాడు. దేవా, ఆ మంచి కాపరియొక్క గొర్రెలనుగ మమ్ము ను చేస్తావా?



57. దావీదు, గొల్యాతు

ఫిలిష్తీయులు ఇశ్రాయేలు ప్రజలకు శత్రువులు. ఇదిగో వాళ్లు మళ్లీ వచ్చారు. చాలమంది సైనికులు కత్తులు బల్లాలు పట్టుకుని ఉన్నారు. వాళ్లు తిరిగి ఇశ్రాయేలీయులతో యుద్ధం చేయడానికి వచ్చారు. అయితే సౌలు రాజుకు కూడ వీరులైన సైనికులున్నారు. వాళ్లకి యుద్ధం అంటే భయంలేదు. ఫిలిష్తీయులంతా ఒక వైపు నిలబడ్డారు. ఇశ్రాయేలీయులు మరోప్రక్క. ఫిలిష్తీయుల్లో ఎవరన్నా ఇశ్రాయేలీయులతో యుద్ధం చేయడానికి సాహసిస్తారా? ఎవ్వరు చేయరు. కాని ఒక్కడు మాత్రమే ముందుకు వచ్చాడు. అతడో పెద్ద సైనికుడు చాలబలవంతుడు. అతని పేరు గొల్యాతు. అతడొక ఇనుప కవచం ధరించి ఉన్నాడు. పెద్ద శిరస్త్రాణం తల మీద పెట్టుకున్నాడు. అది కూడ ఇనుపదే. అతడో పొడవైన బల్లెం పట్టుకున్నాడు. దాని మొన చాల సూదిగ ఉంది. అతనికో పెద్ద ఖడ్గం ఉంది. అతడు దానితో చాల గట్టిగ కొట్టగలడు.

గొల్యాతు ఇలా అరుస్తున్నాడు-ఇక్కడికి వచ్చి ఎవడు నాతో యుద్ధం చేయగలడు? మీకెవరికయినా గుండె ధైర్యం ఉంటే ముందుకు రండి! ఇశ్రాయేలీయులెవ్వరికీ ధైర్యం చాలలేదు. గొల్యాతంటే వాళ్లందరికీ భయం. వాడు అందరినీ ఎగతాళి చేస్తున్నాడు.

మరునాడు గొల్యాతు మళ్లీవచ్చాడు. వాడు కేకలు వేస్తూ అపహాస్యం చేస్తున్నాడు. వాడు చివరికి యెహోవా దేవుడ్ని కూడ వెక్కిరిస్తున్నాడు. అదెంత భయంకరం! ప్రతీదినం గొల్యాతు మళ్లీ వస్తున్నాడు. ప్రతీదినం ఎగతాళి చేస్తున్నాడు. అతడు శపిస్తున్నాడు. అయినా సైనికుల్లో ఒక్కడు కూడ వాడితో యుద్ధం చేయడానికి సాహసం చేయలేదు.

ఒకదినం దావీదు వచ్చాడు. అతడు సైనికుడు కాదు. అయితే అతని అన్నలలో ముగ్గురు సైనికులు వాళ్లు సౌలు సైన్యంలో ఉన్నారు. యెష్షయి దావీదుతో-నీవు వెళ్ళినీసోదరులు ఎలా ఉన్నారో చూసిరా. కొన్ని రొట్టెలు, వేయించిన గోధుమలు తీసుకువెళ్లు, అని చెప్పాడు.

అందువల్ల దావీదు అక్కడికి వెళ్లాడు. అన్నలను కలుసుకున్నాడు. అయితే ఆ గందర గోళం ఏమిటి? అంత బిగ్గరగా ఎవరు కేకలు వేస్తున్నారు? అతడు గొల్యాతును చూచాడు. అతడెంత బలవంతుడు! అతడు ఎలా శపిస్తున్నాడో వినండి! అతడు ఇశ్రాయేలీయులను వెక్కిరిస్తున్నాడు. అంతేకాదు యెహోవాదేవున్నికూడ. ఇది దావీదును చాల కలత పెట్టింది. ఎందుకంటే దావీదు యెహోవా దేవుడ్ని చాల ప్రేమిస్తున్నాడు.

"ఇతనితో పోరాడే వాడెవ్వడూ లేడా?" అన్నాడు దావీదు.

"లేరు ఎవ్వరూ లేరు, ఎందుకంటే అతడు చాల బలమయిన వాడు" అని సైనికులు చెప్పారు. వెంటనే దావీదు "అయితే నేను అతనితో యుద్ధం చేస్తాను" అన్నాడు.

దానికి అతని సోదరులు "వద్దు, ఎంత మాత్రం నువ్వు అతనితో పోట్లాడవద్దు" అన్నారు.

మిగిలిన సేవకులు కూడ అదేమాట చెప్పారు. అయితే దావీదు అతనితో పోరాడాలనుకున్నాడు. అప్పుడు ఆసైనికులు దావీదును రాజు దగ్గరికి తీసుకవెళ్లారు. సౌలు రాజు కూడ దావీదుతో ఇదే చెప్పాడు. "నీవు గొల్యాతుతో యుద్ధం చేయడం మంచిది కాదు. అతడు చాల బలవంతుడు. నీవు ఇంకా చాల చిన్నవాడవు. నీవు సైనికుడవు కూడ కాదు" అన్నాడు. అప్పుడు దావీదు "రాజా, గొల్యాతు యెహోవా దేవున్ని



ఎగతాళి చేస్తున్నాడు. కాబట్టి ఆయన నాకు సహాయం చేస్తాడు" అని జవాబిచ్చాడు. అది విని సౌలు దావీదు యుద్ధం చేయడానికి అంగీకరించాడు.

అదిగో, దావీదు వెళ్తున్నాడు. అతడు ఇనుప కవచం వేసుకోలేదు. అది వేసికొని అతడు నడవలేడు. అది చాల బరువుగా ఉంటుంది. అతడు ఏం పట్టుకొని వెళ్తున్నాడు? అది బల్లెమా? లేక కత్తా? అబ్బే, అదేమీ కాదు. ఒక కర్ర, ఒక వడిసెల. వడిసెల అంటే ఒక చర్మపు సంచిలాంటిది. అతని జేబులో కొన్ని రాళ్లు కూడ ఉన్నాయి.

చూడండి, అక్కడ గొల్యాతు నిలబడిఉన్నాడు. అతడు దావీదును చూచి చాల కోపగించాడు! అతడెలా శాపాలు పెడుతున్నాడో చూడండి! "నన్ను నీవు గెలుస్తానని అనుకుటున్నావా? కర్రతో కొట్టి చంపుతావా? నేను నిన్ను చంపుతాను. అప్పుడు నీ మాంసాన్ని పక్షులు తింటాయి" అని వాడుగట్టిగ అరుస్తున్నాడు.

అయితే దావీదు ఎంత మాత్రం భయపడలేదు. అతడు దేవుడ్ని నమ్ముకున్నాడు. అతడు గొల్యాతుతో "నీవు యెహోవా దేవుడ్ని దూషించావు. నేనిప్పుడు నిన్ను జయిస్తాను. ఎందుకంటే ఆ దేవుడే నాకు సహాయం చేస్తాడు. అప్పుడు నాదేవుడు ఎంత బలవంతుడో అందరూ చూస్తారు" అని చెప్పాడు.

దావీదు ఒక గులకరాయి తీసుకున్నాడు. దానిని వడిసెలలోపెట్టాడు. దానిని గిరగిరా తిప్పాడు. అది వేగంగా గాలిలోకి దూసుకుని గొల్యాతు నొసటిని కొట్టింది. అతడు నేలకు ఒరిగిపోయాడు. అతడు పెద్ద శబ్దంతో క్రిందపడుతున్నాడు చూడండి. దావీదు అతని వద్దకు వెళ్లాడు. గొల్యాతు ఒరలోనున్న కత్తిని తీసాడు. అతని తల నరికాడు. వాడు చచ్చిపోయాడు.


ఇది చూచి ఫిలిష్తీయులంతా పారిపోయారు. వాళ్లు భయపడిపోయారు. ఇశ్రాయేలు ప్రజలు వారిని తరిమివేసారు. ఆ దినం చాలమంది ఫిలిష్తీయులు చచ్చిపోయారు.

మరి దావీదు మాటేమిటి? అతడిదంతా చూచి గర్వపడ్డాడా? "నేను చాల బలవంతుడ్ని. చివరికి గొల్యాతు కన్నా బలవంతుడ్ని" అనుకున్నాడా? లేదు, లేదు. "దేవుడు నాకెంత మేలు చేసాడు! ఆయనే నా సహాయకుడు", అనుకున్నాడు.

దావీదులో గర్వం ఎంత మాత్రం లేదు. అతడెంతో దీనమైన మనసు కలిగి ఉన్నాడు.

మనహృదయం చాలసార్లు "నేను చాల తెలివికలవాడను. నాకెంతో బలం ఉంది" అని చెబుతుంది. అదే గర్వం. గర్వం చాల గొప్పపాపం! మనకు అన్నీయిచ్చేది దేవుడే కాదా? తెలివినిచ్చేవాడు కూడ ఆయనే.

నూతన హృదయాన్నిమ్మని దేవుడ్ని అడుగుదాము. ఎందుకంటే క్రొత్త మనసే వినయంగల మనసు!



58. దావీదు తప్పించుకోవలసివచ్చింది

సౌలురాజు ఒక రాజభవనంలో నివసించేవాడు. అందులో ఉన్నవన్నీ చాల అందమయినవి. అయినప్పటికీ---రాజుకు మాత్రం సంతోషం లేదు. అతడు తరచుగ కోపగించే వాడు, చాల కోపం తెచ్చుకునేవాడు. అతడాకోపంతో పిచ్చివాడయ్యేవాడు. అప్పుడు కేకలు వేస్తూ చిందులు తొక్కేవాడు. పిడికిలి బిగించి గుద్దేవాడు. ఆ సమయంలో అతని సేవకులు ఎంతో భయపడేవాళ్లు! ''అయ్యో, మనరాజుకు అనారోగ్యం కలిగింది. మనం ఆయనకెలా సాయం చేయగలం? అతన్ని నెమ్మది పరచడం ఎలా? బహుశ ఆయనకు తీయని సంగీతం వినిపించడం ద్వారా అది చేయగలమేమో'' అని వాళ్లు అనుకొనే వాళ్లు.

మంచి సంగీతాన్ని ఎవరు వినిపించగలరు? దావీదు తన సితారాపై తీయగ వాయించగలడు. రాజుకోసం అతడు సంగీతం వినిపిస్తాడా? సేవకులు దావీదును అడగాలని అనుకున్నారు.

అవును, సితారా వాయించడం దావీదుకు ఇష్టం. రాజ భవనం రావడం కూడ అతనికిష్టం. రాజుకు సాయం చేయడం కూడ అతనికిష్టం.

అదిగో చూడండి. రాజుమళ్లీ చికాకుగ ఉన్నాడు. అతడు చేతులు ముందుకూ వెనక్కీ ఊపుతున్నాడు. ఎందుకో తెలుసా? సౌలు రాజు దేవుని మాట వినడు. అందువల్ల దేవుడు అతన్ని వదిలివేసాడు.

దావీదు వేగంగా తన సితార తీసుకున్నాడు. తన వ్రేళ్లతో తీగలు మీటాడు. వినండి! ఎంత మధురమైన సంగీతం! అది వినగానే రాజునిజంగా నెమ్మది పొందాడు. అతని కోపం చల్లబడింది.

మొదట్లో సౌలురాజుకు దావీదు పట్ల చాల ప్రేమ ఉండేది. ఎందుకంటే దావీదు చాల తీయగ వాయించేవాడు. అతడు ధైర్యవంతుడు. గొల్యాతును చంపాడు. అందుచేత సౌలు అతన్ని సైన్యాధిపతిగ చేసాడు. అంటే దావీదు సైనికులందరిపై అధికారి. తరచుగ అతడు సైనికులను తీసుకొని శత్రువులపై యుద్ధం చేసేవాడు. విజయం ఎప్పుడూ దావీదుదే. ఎందుకంటే దేవుడతనికి సహాయం చేసేవాడు.

సైనికులకు దావీదంటే చాల ఇష్టం. దావీదుతో వెళ్లి శత్రువులతో యుద్ధం చేయడానికి వాళ్లు భయపడరు! చాలమంది దావీదును ప్రేమించే వాళ్లు. దానిని గూర్చి నీవు తరచు విని ఉంటావు. అదెప్పుడో తెలుసా? దావీదు గొల్యాతును చంపినప్పుడు. అప్పుడు స్త్రీలు, బాలికలు కలిసి దావీదును గురించి ఒక పాట పాడారు.

దీనిగురించి సౌలువిన్నాడు. ప్రజలు దావీదును తనకంటె ఎక్కువగా ప్రేమిస్తున్నారని అతడు గమనించాడు. దాంతో అతనికి చాల కోపం వచ్చింది. అతనికి దావీదుపై అసూయ కలిగింది. సౌలు నిత్యం యేమి తలస్తున్నాడో తెలుసా? సమూయేలును గురించి. ఎందుకంటే అతడొక సారి సౌలుతో ''సౌలూ, నీవికపై రాజుగ ఉండ తగదు. ఎందుకంటే నీవు దేవునికి లోబడలేదు. మరో కొత్త రాజును దేవుడు ఏర్పాటు చేయ నిశ్చయించాడు. తనకులోబడే రాజు'' అన్నాడు.

సౌలు మనసులో ఇలా అనుకున్నాడు. ''ఆ కొత్త రాజు తప్పక దావీదే అయ్యుంటాడు. అందుకే అతడు అంత ధైర్యంగా ఉన్నాడు. అందుకే ప్రజలు అతన్ని గూర్చి అంత మంచి పాటలు పాడారు. కాని దావీదు ఎన్నటికీ రాజవ్వడానికి వీల్లేదు. నేనే రాజుగ ఉండాలి. కాబట్టి నేను దావీదును చంపుతాను. అప్పుడు అతడిక రాజవ్వడు''.

ఒకదినం సౌలు రాజుకు మళ్లీ మనసులో కలవరం రేగింది. అతడు కాళ్లతోనేలను తన్నుతున్నాడు. త్వరగా దావీదు తన సితార తీసుకున్నాడు. తీయగా వాయించడం మొదలు పెట్టాడు. అది విని రాజు తిరిగి బాగవుతాడా? దావీదు వాయించడం ప్రారంభించాడు. అతడు రాజు ఏం చేస్తున్నాడో గమనించలేదు -- సౌలు నెమ్మదిగ ఒక బల్లెం తీసాడు. అది అతని సింహాసనం ప్రక్కనే నేలమీద పడిఉంది. ఓ, దావీదూ, కాస్త చూసుకో! కాని దావీదు యిదేమీ గమనించడంలేదు. అంతలో ఒక బల్లెం గాలిలో రివ్వున ఎగిరి వస్తున్నది. దానిసూదైన మొన దావీదు తలకు దగ్గరగ వచ్చింది. అతడు వేగంగా తలదించాడు. సరైన సమయానికి! అది గోడకు గుచ్చుకుంది. దేవుడే దావీదును కాపాడాడు! దావీదు ఆశ్చర్యపోయాడు! అతడు పారిపోయాడు. సౌలు అతన్ని చంపజూస్తున్నాడు! అతడెక్కడికి వెళ్లాలి?

దావీదు తన స్నేహితుని దగ్గరకు వెళ్లాడు. అతని పేరు యోనాతాను. యోనాతాను సౌలు కొడుకు. కాబట్టి అతడు ముఖ్యమయిన రాజకుమారుడు. నిజంగా యోనాతాను దావీదుకును మంచి స్నేహితుడు. అతడు కూడ యెహోవా దేవుని ప్రేమించినవాడు. అతడు దావీదుతో "దావీదూ, నేను నా తండ్రితో మాట లాడుతాను. బహుశా అతడు నీకు చేసిన దాని గురించి విచారిస్తూండవచ్చు," అన్నాడు.

అతడు అన్నట్టుగానే యోనాతాను తన తండ్రి సౌలుతో దావీదును గూర్చి మాట్లాడాడు. అయితే సౌలు అతని మాట వినలేదు. దావీదు పై మరింత కోపగించాడు. "కాస్త ఆగిచూడు. నేను దావీదును కనుగొంటాను. నేనతన్ని చంపుతాను," అన్నాడు.


యోనాతాను చాల దుఃఖించాడు. దావీదుతో జరిగినదంతా చెప్పాడు. "దావీదూ, ఇప్పుడు దేవుడే నిన్నుకాపాడుతాడు. నీవు తప్పక రాజువవుతావు. దేవుడు అలా అని వాగ్దానం చేసాడుకదా"? అన్నాడు.

దావీదు, యోనాతానులు ఇద్దరూ చాల ఏడ్చారు. వాళ్లిద్దరూ ఒకరినొకరు చాల ప్రేమించుకుంటారు. వాళ్లిద్దరూ ఒకరినొకరు మళ్లీ చూచుకోకపోవచ్చు. దావీదు తప్పించుకు పారిపోవాలి. ఎందుకంటే సౌలు తప్పక అతని కోసం వెదుకుతాడు. యోనాతాను తన రాజభవనానికి తిరిగి వెళ్లాడు.

దావీదు అందరికన్న ఎక్కువగా ఎవరిని ప్రేమిస్తున్నాడు? యోనాతానునా? యోనాతాను ఎవరిని ప్రేమిస్తున్నాడు? దావీదునా? కాదు, వాళ్లిద్దరూ అందరి కన్నా ఎక్కువగా దేవుని ప్రేమిస్తున్నారు!

మనం ఎవరిని ప్రేమించాలో తెలుసా? నీకది గుర్తుందా? దేవుడ్ని ప్రేమించాలి. ఎప్పుడు మనం అలా ప్రేమించగలం? మన హృదయం మార్పు చెందినపుడు.

మన హృదయాన్ని మార్చమని మనం దేవునికి ప్రార్థన చేయాలి.




59. మీ శత్రువులను ప్రేమించుడి

దావీదుకు ఎక్కడా భద్రతలేదు. తన సొంత ఇంటిలోనే లేదు. బెత్లెహేంలోని తన తండ్రి యింటిలో కూడ లేదు. సౌలు, అతని సేవకులూ దావీదు కోసం ప్రతిచోటా వెదుకుతున్నారు. అడవుల్లో, ఎడారుల్లో, పర్వతాల్లో.

మొదట్లో దావీదు ఏకాంతంగా ఉన్నాడు. రానురాను మరికొందరు అతనితో కలిసారు. వాళ్లకు కూడా సౌలు రాజంటే భయం. సౌలు వాళ్లనికూడ చంపాలనుకున్నాడు. అవును, సౌలు నిజంగా దుర్మార్గుడయిన రాజుగా తయారయ్యాడు.

కొన్నిసార్లు సౌలు దావీదు ఉన్న వరినర ప్రాంతాల్లోనే ఉండేవాడు. అప్పుడు వాళ్లు వెంటనే పారిపోవాలసివచ్చేది. లేదా దాక్కోవలసి వచ్చేది.



ఒకసారి ఇలాగే సౌలు దావీదుకు సమీప ప్రాంతానికి వచ్చాడు. అతనితో చాలమంది సైనికులు కూడ వచ్చారు. దావీదూ, అతని సైన్యం ఒక గుహలో దాగున్నారు. గుహ అంటే ఓ పెద్ద పర్వతంలో ఉండే ఖాళీ స్థలం అన్నమాట. వాళ్లు గుహలోపల దాగున్నారు. అక్కడ చాల చీకటిగా ఉంది. సౌలు వారినక్కడ చూడలేకపోవచ్చు.

బయటచాల వేడిగా ఉంది. సౌలు, అతని సైన్యం అలిసిపోయారు. వాళ్లకి విశ్రాంతి అవసరం. సౌలు అలాంటి స్థలం కోసం వెదకుతున్నాడు. అతడెక్కడికెళ్లాడో నీకు తెలుసా? అతడు గుహలోపటికి వెళ్లలేదు. గుహ ద్వారం దగ్గరనే ఉన్నాడు. లోపటికి వెళ్లి ఉంటే అతడు దావీదును చూచి ఉండేవాడు. అది గొప్పప్రమాదాన్ని తెచ్చిపెట్టి ఉండేది.

దావీదు అతని మనుష్యులూ లోపటికి వస్తున్నారు. వాళ్లు నిశ్శబ్దంగా ఉండడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే వాళ్ల హృదయాలు భయంతో గజగజలాడుతున్నాయి!

సౌలు క్రిందపండు కొని ఉన్నాడు. ఒక నిమిషంలో అతనికిగాఢ నిద్రపట్టింది. అది చూచి దావీదు సేవకులు "దావీదూ, మనం యిప్పుడు సౌలును చంపగలం. మరి అతన్ని చంపమంటావా?" అని చిన్న స్వరంతో అడిగారు.

దావీదు లేచి సౌలు వద్దకు చప్పుడు చేయకుండా వెళ్లాడ. అతని వద్ద పదునైన కత్తి ఉంది. చూడండి, అతడు దానితో సౌలు అంగీ అంచును జాగ్రత్తగ కోసాడు. తరువాత నెమ్మదిగ తన మనుషుల వద్దకు తిరిగి వెళ్లారు.

వాళ్లు దావీదుతో "నీవు సౌలును ఎందుకు చంపలేదు? మేము ఆ పని చేయమా? అప్పుడిక అతడు మనకు ఏహానీ చేయలేడు" అన్నాడు.

అయితే దావీదు "మనం అలా చేయకూడదు. సౌలు యిప్పటికీ దేవుని సేవకుడే. అతడు అభిషేకం పొందిన వాడు. మీరు అతనికి హాని చేయడానికి వీలులేదు" అన్నాడు.



సౌలు నిద్రలేచి ఆ ప్రాంతాన్ని విడిచి పోవడానికి సిద్ధపడుతున్నాడు. ఒక క్షణం తరువాత దావీదు కూడ గుహను విడిచి వెళ్తున్నాడు. అతనికి దూరంగా సౌలు కనిపించాడు. అపుడు దావీదు "రాజా, నా ప్రభువా" అని గట్టిగ పిలిచాడు.

ఆ శబ్దం విని సౌలు వెనక్కి తిరిగి దావీదును చూచాడు. అప్పుడతడు సౌలుతో "నేను నీకు చాల దగ్గరగా వచ్చాను. నా కత్తిపట్టుకవచ్చాను. చూడు, నీ బట్ట చెంగులో చిన్న ముక్కకోసాను. నేను నిన్ను చంపగలను. కాని నేనలా చేయలేదు. నీవునన్ను ఎందుకు తరుముతున్నావు? నన్నెందుకు చంపాలని చూస్తున్నావు? నేను నీకే అపకారమూ చేయలేదు. అది నా ప్రభువుకు తెలుసు" అన్నాడు. సౌలు అతని మాటలను ఆశ్చర్యంతో విన్నాడు. అతడు ఖంగారు పడ్డాడు. అవును, దావీదు నిజంగా తనను చంపగలిగి ఉండేవాడు.

సౌలు ఏడవటం ప్రారంభించాడు. అతడు, "దావీదూ నీవు నాకు ఎంత మేలు చేశావు! నేను నీకు ఎంతో కీడు చేసినా నీవు మాత్రం నన్ను చంపకుండా వదిలిపెట్టావు. నాకంటె నీవెంతో మంచివాడవు" అన్నాడు.

దావీదు పట్ల అంత క్రూరంగా ప్రవర్తించినందుకు సౌలు చాల విచారించాడు.

సౌలు తన సైనికులతో ఇంటికి తిరిగి వెళ్లిపోయాడు. మరి దావీదు అతని మనుష్యులమాట యేమిటి? వారు కూడ తమ యిళ్లకు వెళ్లారా? లేదు. వాళ్లు వెళ్లలేదు. ఎందుచేత? ఇక రాజు వాళ్లకి కీడు చేయడుగా, ఇప్పుడే కాదు కాని ఆ తర్వాత చేయవచ్చు. తరువాత సౌలు దావీదును నిజంగానే తరిమాడు. తరువాత అతడింకా దావీదును చంపాలనే చూస్తున్నాడు. సౌలు తాను అన్నమాట ప్రకారం చేయలేదు.

తన శత్రువయినా దావీదు అతనికి మేలు చేయలేదా? అవును చేసాడు. మనం కూడ అలాగే చేయాలని దేవుడు కోరుతున్నాడు. మనం ఎవ్వరికీ కీడు చేయకూడదు. వాళ్లు మనకు హాని చేసినాసరే.

దేవుడు "మీ శత్రువులను ప్రేమించండి" అని చెప్పుతున్నాడు.

60. నాబాలు, అబీగయీలు

నాబాలు చాల ధనవంతుడు. అతడొక పెద్ద పొలంలో నివసిస్తున్నాడు. అతనికి గొర్రెలు, మేకలు చాల ఉన్నాయి. అతని క్రింద చాల మంది గొర్రెల కాపరులు ఉన్నారు. ప్రతి దినం వాళ్లు అతని మందలను కాస్తూండే వాళ్లు. ఎడారిలో ఎక్కడ కొంచం గడ్డి దొరుకుతుందా అని వాళ్లు వెతుకుతుండే వాళ్లు. ఎందుకంటె గొర్రెలకు మేకలకు కాస్తమంచి గడ్డి అవసరం.

అడవిలో చాలా సార్లు అపాయకరమయిన పరిస్థితులు ఎదురవుతాయి. అక్కడ దొంగలుంటారు. వాళ్లు గొర్రెలను మేకలను దొంగిలించ చూస్తారు. నాబాలు పశువులను ఎప్పుడయినా దొంగిలించారా? లేదు. దొంగిలించలేదు. ఎందుకో తెలుసా? దావీదు, అతని అనుచరులు కూడ అదే అడవిలో నివసిస్తున్నారు. అతడు నాబాలు గొర్రెల కాపరులను, గొర్రెలను కాపాడేవాడు. అందువలన దొంగలు వాళ్లదగ్గరకు రావడానికి భయపడే వాళ్లు. అది నాబాలుకూ అతని గొర్రెలకాపరులకూ మేలు కదా? ఒకనాడు నాబాలు తన గొర్రెల బొచ్చు కత్తిరిస్తున్నాడు. ప్రతి గొర్రెకూ బొచ్చు కత్తిరిస్తారు. లేకపోతే వాటి చర్మాలు చాల బరువెక్కుతవి. అదినమే పెద్ద విందు కూడ జరుగుతుంది. దానిని గొర్రెబొచ్చు కత్తిరింపు విందు అంటారు. అప్పుడు చాల ఆహార పదార్థాలు ఉంటాయి. నాబాలు అతని పనివాళ్లు విందారగిస్తారు.

దావీదు ఈవిందు గురించి విన్నాడు. బహుశ నాబాలు తనవారికి కూడ భోజనం పెడతాడని తలంచాడు. అందువల్ల దావీదు తన మనుష్యులలో కొందరిని నాబాలు వద్దకు పంపాడు. వాళ్లు వెళ్లి "నాబాలూ, మేము దావీదు సైనికులము. మాకు కూడ కొంత ఆహారం తినడానికి ఇస్తావా? ఎందుకంటే మీ గొర్రెలకు చాలసార్లు మేము రక్షణ కలిపించాము. మేము దొంగలను తరిమి వేసాము. కావలిస్తే నీసేవకులను అడుగు" అని దావీదు చెప్పాడని తెలియజేశారు.

దానికి నాబాలు "మీకు నేను ఏమీ యివ్వను. దావీదు ఎవడు? నాకు అతనికి సంబంధం యేమిటి? అతడు రాజు కోసం యుద్ధం చేస్తూండవచ్చు. బహుశ అతడు రాజు మాట విని ఉండకపోవచ్చును. నేను మీకు ఏమీ యివ్వను" అన్నాడు.

నాబాలు ఎంత పిసినారి వాడు! అతడు చాల ధనవంతుడు అయినా అతడెవ్వరికీ ఏదీ దానం చేయడు. పైగా దావీదును గూర్చి చాల చెడ్డ మాటలు చెబుతున్నాడు. అతడు అబద్ధికుడు. అతని వద్దకు వెళ్లిన మనుష్యులు దావీదు దగ్గరకు తిరిగి వచ్చారు. అతను అన్న మాటలన్నీ దావీదుకు చెప్పారు. దావీదుకు చాల కోపం వచ్చింది. అతడు తన మనుష్యులతో "మీరు కత్తులు పట్టు కొనండి. మనం నాబాలు దగ్గరకు వెళ్తాము. వాళ్లందర్నీ చంపుదాము. నాబాలునూ, అతని సేవకులనూ, అందరినీ చంపుదాము!" అన్నాడు.

దావీదు ఇలా అనడం పొరపాటే. నాబాలు చెడ్డవాడు కావచ్చు కాని అతని సేవకులు ఏ తప్పు చేయలేదు. దావీదు వాళ్లందర్నీ చంపేస్తాడా? అలా చేస్తే అతడు హంతకుడవుతాడు!

నాబాలు ఇంటిలో మరొకరు కూడ ఉన్నారు. అది అబీగయీలు. ఆమె నాబాలు భార్య. దావీదు మనుష్యులతో తన భర్త చెప్పిన మాటలు ఆమె విన్నది. మరి ఆమె ఏం చేసింది? ఆమె తన సేవకులతో "మనం దావీదు దగ్గరికి వెళ్దాం. అతనికి ఏమన్నా యిద్దాము" అని చెప్పింది. అబీగయీలు పిసినారి కాదు. వాళ్ళు గాడిదలపై రొట్టెలు, మాంసం, మంచి మంచి పండ్లు ఎక్కించి బయలు దేరారు. అబీగయీలు తన భర్తకు ఏమీ చెప్పలేదు.

అదిగో చూడండి. దావీదు అతని మనుష్యులు వస్తున్నారు. దావీదు ఎంత కోపంగా ఉన్నాడో! తన సైనికులతో అతడు ఎక్కడికి వెళ్తున్నాడు? వాళ్లు ఏం చేయాలని చూస్తున్నారు? ఆ... అబీగయీలుకుఅది అర్థం అయ్యింది. ఆమె దావీదు దగ్గరకు వెళ్లి అతని యెదుట మోకరించింది. ఆమె అతనితో "దావీదూ, నా భర్త నాబాలు తప్పు చేసాడు. అతడు నీకేమీ యివ్వడానికి యిష్టపడలేదు. అది ఎంత మాత్రం సరికాదు. అయినా నీకవసరమైనదంతా నీకు దొరుకుతుంది. చూడు, ఇవన్నీ నీకూ నీసేవకులకూ నేను తెచ్చాను. దయచేసి నీవు కోపగించకు. దయచేసి నాబాలును మరియు అతని సేవకులనూ చంపవద్దు. ఎందుకంటె నీవెలాగూ రాజువవుతావు. అదే యెహోవాదేవుని చిత్తం! అని చెప్పింది.



దేవుని దయవల్ల దావీదు కోపం తగ్గింది. అతడు ఆమెతో ''నేను మీ అందరినీ చంపాలనుకున్నాను. అయితే నీవు వచ్చావు కాబట్టి, అబీగయీలూ, నేను ఎవ్వరినీ చంపను. నీవు రావడం మంచిదయింది. లేకపోతే నేను హంతకుడనై యుండేవాడిని'' అన్నాడు. అబీగయీలూ తిరిగి యింటికి వెళ్లింది. ఆమె నాబాలుతో యేమీ చెప్పలేదు. ఎందుకంటే అతడు త్రాగిన మత్తులో ఉన్నాడు. అయితే మరునాటి ఉదయం ఆమె అతనికి సమస్తం చెప్పింది. దావీదు అతనినీ అతని సేవకులందరినీ చంపాలని నిశ్చయించినట్టు కూడ చెప్పింది. నాబాలు ఆశ్చర్యపడ్డాడు. భయంతో బిగుసుకుపోయాడు. క్రిందపడ్డాడు. కొంచెం కూడ కదలలేక పోయాడు. చాల జబ్బుపడ్డాడు. కొన్ని రోజుల తరువాత నాబాలు చచ్చిపోయాడు. అది దేవుని శిక్ష.

దావీదు నాబాలును చంపనవసరం లేదు. అతనికి బదులుగా దేవుడే అతన్ని శిక్షించాడు! దావీదు మిగిలిన వాళ్లని కూడ చంపాలనుకున్నాడు. వాళ్లు ఏమిచేయలేదు. దావీదు కోపించినందువల్ల అలా చేయాలనుకున్నాడు. అయితే అతడా పాపం చేయకుండా దేవుడే ఆపాడు. మనం కోపంలో ఎన్నో చెడ్డపనులు చేస్తాం. ఎందుకంటే ఆ సమయంలో దావీదులా మనం మంచి చెడ్డలు ఆలోచించము. కాబట్టి ఇలాంటి పాపంలో పడకుండా చేయమని దేవున్ని ప్రార్థించాలి.



61. సౌలు మరల కాపాడబడుట

అది రాత్రి వేళ. అంతా నిశ్శబ్దంగా చీకటిగా ఉంది. అందరూ తమ తమ యిళ్లలో నిద్రపోతున్నారు. దూరంగా అరణ్యం. అక్కడ మనుష్యులుంటారా? వాళ్లు కూడ నిద్రపోతున్నారా? అవును, చూడండి. అక్కడ చాల మంది నిద్రపోతున్నారు. వాళ్లంతా సౌలు సైనికులు. రాజు కూడ అక్కడే ఉన్నాడు. అతడూ నిద్రపోతున్నాడు. అతని ప్రక్కనేల మీద అతని బల్లెం గుచ్చి ఉంది. ఒక కూజాలో నీళ్లు కూడ ఉన్నాయి. రాజుకు దాహం వేస్తే ఆ నీళ్లుతాగుతాడు.

అసలు రాజు ఆ అరణ్యంలో ఎందుకున్నాడు? అక్కడ తనసైనికులతో ఏం చేస్తున్నాడు? సౌలు రాజు మళ్లీ దావీదు కోసం గాలిస్తున్నాడు. అతడు దావీదును పట్టుకోవాలనుకున్నాడు. అతన్ని చంపాలనుకున్నాడు.

ఈ దిక్కున వేగంగా వస్తున్న అతడెవడు? ఆ ఇద్దరు మనుష్యులు ఎవరు? వాళ్లేం చేస్తున్నారు? వారిలో ఒకడు దావీదు. రెండవ వాడు అతని స్నేహితుడు. గొప్ప వీరుడు. అతని పేరు అబీషై.

ఒక్కొక్క అడుగూ వేసుకుంటూ వాళ్లు ముందుకు వెళ్తున్నారు. వాళ్లు సౌలు ఉన్నచోట చేరారు. సౌలు కూడ నిద్రపోతున్నాడు. అబీషై దావీదుతో చిన్న స్వరంతో ఇలా అన్నాడు. "దావీదూ, నేను సౌలును చంపనా? బల్లెంతో ఒక్క పోటు పొడవనా? అప్పుడిక అతడు నీకెన్నడూ కీడు చేయలేడు." దానికి దావీదు మెల్లగా ఇలా జవాబిచ్చాడు, "లేదు, నీవలా ఎన్నడూ చేయకూడదు. దేవుడు సౌలును అభిషేకించాడు. యెహోవా దేవుడు అతనిని రాజుగా చేసాడు. సౌలు ఎప్పుడో ఒకప్పుడు చనిపోతాడు. అయితే అది ఎప్పుడు జరుగుతుందో దేవునికే తెలుసు. ఇప్పుడు నీవేం చేయాలో తెలుసా? ఆ నీటి కూజాను, బల్లెమును తీసుకురా"

చాల మెల్లగా వాళ్లిద్దరూ ఆ స్థలం విడిచివెళ్లిపోయారు. వాళ్లా కూజాను బల్లెమును తమతో తీసుకుపోయారు. ఎవ్వరూ అది చూడ లేదు. సైనికులందరూ నిద్రపోతున్నారు దేవుడు తన బిడ్డలను ఎంత భద్రంగా కాపాడుతాడో చూచారా?

దావీదు అబీషై ఒక కొండ ఎక్కారు. త్వరలోనే వాళ్లాకొండ శిఖరం చేరుకున్నారు.

రాత్రి గడిచి ఉదయం అయ్యింది. మనుష్యులంతా నిద్రలేచారు. సౌలు రాజు అతని సైనికులు కూడ మేల్కొన్నారు.

అదిగో వినండి. ఆకొండ శిఖరం మీద నుండి దావీదు, అబ్నేరును కేకవేస్తున్నాడు. "నీవు నీరాజును ఎందుకు కాపాడలేదు? నా దగ్గర ఏమీ ఉన్నదో చూడు" అని చెప్పి దావీదు సౌలు బల్లెమును నీటి కూజాను ఎత్తిచూపించాడు. వాటిని సైనికులంతా చూచారు. దావీదు తమ రాజుకు చాల దగ్గరగా వచ్చాడు. అతడు సౌలును అతి సులువుగా చంపగలడు. సౌలు కూడ దావీదును చూచి, అతని మాటలు విన్నాడు. అతడు విన్నది నిజమా? అది దావీదు స్వరమేనా?" అని అడిగాడు.

దావీదూ "అవును రాజా, నేను దావీదునే. నన్ను నీవు ఎందుకు తరుముతున్నావు? దేవుడు నిన్ను అభిషేకించాడు కాబట్టి నేను నిన్ను చంపను. అయితే నీవు నన్నెందుకు చంపతలచావు? నేను నీకు యేమి కీడు చేసాను"? అని అడిగాడు.

అందుకు సౌలు దుఃఖపడి "ఓ దావీదూ, నేను తప్పచేశాను. నేను పాపం చేశాను. నేనిక తిరిగి వెళ్లిపోతాను. నీవు నాతోరా. ఇకపై నేను నీకు కీడుచేయను. దేవుడు నిన్ను దీవించాలి" అని చెప్పాడు.

"సౌలు ఒక సైనికుని దావీదు వద్దకు పంపాడు అతడు నీళ్లకూజా, బల్లెం తీసుకొని వెళ్లిపోయాడు. అయితే దావీదు అతని సైన్యం అడవిలోనే ఉండిపోయింది. దావీదు తన మనసులో యిలా తలంచాడు - సౌలు నాకు కీడు చేయనని చెప్పినా అది నిజమో కాదో తెలియదు".

సౌలు ఆ మాటలు నిజంగా చెప్పలేదు. ఎందుకంటే కొన్ని దినాలయ్యాక అతడు మళ్లీ దావీదును తరిమాడు. అతడు ఇంకా దావీదును తరిమాడు. అతడు ఇంకా దావీదును చంపాలనే ప్రయత్నించాడు.

సౌలా, నీ హృదయం ఎంత చెడ్డది! అందుకనే నీవు దేవున్ని ప్రేమించడం లేదు. అందుకే నీవు పాపం చేస్తూనే

ఉన్నావు. సౌలా, నీకు నూతన హృదయం కావాలి దాని గురించి నీవు ప్రార్థించాలి!

మరి మన మాట యేమిటి? మన హృదయాల్లో కూడ కోపం, పాపం ఉన్నాయి. మనకు కూడ ఒక క్రొత్త మనసు కావాలి. దాని కోసం దేవున్ని ప్రార్థించు.



62. దావీదు రాజు అగుట

సౌలు దావీదును చంపలేకపోయాడు. ఎందుకో తెలుసా? ఎందుకంటే దేవుడు దావీదును కాపాడాడు.

కొన్నిసార్లు సౌలు దావీదుకు చాల దగ్గరగా వెళ్లాడు. అందుకే దావీదు దుఃఖించి, భయపడేవాడు. "సౌలు నన్ను పట్టుకుంటే!" అని దావీదు కలవరపడేవాడు.

అప్పుడు దేవుడు దావీదుతో "దావీదూ, నాలో నమ్మకముంచు. నేను నిన్ను కాపాడుతాను. నీవు నా బిడ్డవు కాబట్టి నేను నిన్ను రాజును చేస్తాను" అని చెప్పాడు.

ఒకసారి మళ్లీ యుద్ధం వచ్చింది. సౌలూ, అతనిసైన్యం ఫిలిష్తీయులతో పోరాడుతున్నారు. యోనాతాను కూడ యుద్ధం చేస్తున్నాడు. యోనాతాను ఎవరోనీకు గుర్తున్నది కదూ? అతడు రాజకుమారుడు. దావీదుకు ప్రాణ స్నేహితుడు.

సౌలూ, అతని సైన్యం ధైర్యంగా పోరాడారు. అయితే దేవుడు వాళ్లకి సాయం చేయలేదు. అలాంట ప్పుడు విజయం కలుగదు. చాల మంది సైనికులు చచ్చిపోయారు. కొందరు తప్పించుకు పారిపోతున్నారు. శత్రువులు వాళ్లని తరుముతున్నారు.

అప్పుడు ఫిలీష్తీయులు సౌలురాజును చూచారు. వాళ్లు అతన్ని పట్టుకోవాలనుకున్నారు. అతన్ని వెంటబడి తరిమారు. శత్రువులు తన వెనుక రావడం సౌలు చూచాడు. వాళ్లు చాల దగ్గరకు వచ్చేసారు. వాళ్ల చేతికి చిక్కడం అతనికి ఇష్టంలేదు. ఎందుకంటే వాళ్లు తనను ఎగతాళి చేస్తారు. కాబట్టి అతడు అతడు తన ప్రక్కనడుస్తున్న సైనికునితో "నన్ను నీ కత్తితో త్వరగా చంపు. అప్పుడు శత్రువులు నన్ను ప్రాణాలతో పట్టుకోలేరు" అన్నాడు. అయితే రాజును చంపడానికి అతడు భయపడ్డాడు.

అప్పుడు సౌలు ఏమి చేసాడు? అయ్యో, అతడు తన కత్తిమీద పడి తనను తానే చంపుకున్నాడు. అదుగో, అతడక్కడ నేలమీద చచ్చిపడి ఉన్నాడు. అది ఎంత భయంకరం! సౌలు పరలోకానికి పోలేదు. ఎందుకంటే అతనికి నూతన హృదయం లేదు. అతడు తప్పక నరకానికి వెళ్లవలసిందే. అక్కడ ఎప్పుడూ బాధ దుఃఖం ఉంటాయి. అక్కడ దేవుడతనిని పరామర్శించాడు. సౌలు అంతం ఎంత విచారకరంగా ముగిసింది! అదంతా అతని తప్పే!

యోనాతాను కూడ చచ్చిపోయాడు. ఫిలిష్తీయులు అతనిని కూడ చంపేసారు. అయితే అతడు పరలోకానికి వెళ్తాడు. ఎందుకో తెలుసా? యోనాతాను దానికి అర్హుడా? కాదు. యేసు ప్రభువే దానిని అతని కోసం సంపాదించాడు.

సౌలు సైనికులలో ఒకడు అటు ప్రక్కగా నడిచి వెళ్తున్నాడు. శత్రువులు అతన్ని చంపలేదు. అతడు తప్పించుకున్నాడు. అతడు దావీదు వద్దకు వెళ్తున్నాడు. అతడు దావీదుకు జరిగిన దంతా చెప్పాలనుకున్నాడు. అతడు దావీదును కలిసినపుడు 'యుద్ధం ఎలా ముగిసింది? ఎవరుగెలిచారు? అని అడిగాడు.

సైనికుడు ఇలా అన్నాడు "ఫిలిష్తీయులు గెలిచారు. సౌలు సైనికులలో చాలమంది చచ్చిపోయారు. మిగిలిన వాళ్లు పారిపోయారు. సౌలు రాజు చచ్చిపోయాడు. యోనాతాను కూడ చచ్చిపోయాడు."


దావీదు చాల దుఃఖపడ్డాడు. అతడొక విషాద గీతం రాసాడు. తాను ఎంతగానో ప్రేమించిన యోనాతాను మరణం వలన తనకు కలిగిన దుఃఖం గురించి అతడు ఆ పాట రాసాడు. ఇప్పుడు ఇశ్రాయేలీయులకు రాజులేడు. మరి వాళ్లకి ఎవరు రాజుగా ఉంటారు? నీకు తెలుసని అనుకుంటాను, అవును. ఇప్పుడు దావీదే వాళ్ల రాజు. అది దేవుని చిత్తం. ఆయన అలా అని వాగ్దానం చేసాడు.

దావీదొక అందమయిన రాజభవనంలో నివసించబోతున్నాడు. ఇప్పుడు అతడు ప్రజలందరినీ పరిపాలిస్తాడు. వాళ్లంతా అతనికి లోబడాలి. అయితే దావీదు యిలా అనుకుంటున్నాడు. "ఇప్పుడు నేను రాజును కావచ్చును కాని నేను రాజాధిరాజును కాను. దేవుడే నాకు రాజు. నేను ఆయనకు లోబడతాను". అవును దావీదు మంచి రాజుగా ఉండాలంటే ఇదే సరియైన మార్గం.

దేవుడు దావీదుకు మరో వాగ్దానం చేసాడు. ‘‘దావీదూ, నీకు పిల్లలు కలుగుతారు. వాళ్లు పెద్దవాళ్లయ్యాక వారికీ పిల్లలు కలుగుతారు. అలా కొంత కాలానికి అది పెద్ద కుటుంబం అవుతుంది. నీవంశంలో చివరికి ఎవరు పుడతారో తెలుసా? ప్రభువైన యేసు. అందుకనే మనం యేసు ప్రభువును దావీదు కుమారుడని కూడా పిలుస్తాము. యేసుప్రభువు కూడా రాజే. ఆయన దావీదు కన్నా చాల ముఖ్యమైన రాజు. ఎందుకంటే ఆయన దేవుని కుమారుడు. అందుకనే ఆయన రాజులకు రాజు.


దావీదు ఎంతో సంతోషించాడు. అతడు నిజంగా దీనిని అర్ధం చేసికోలేదు. అది అంత గొప్ప అద్భుతం. అయితే అది తప్పక జరుగుతుంది. ఎందుకంటే దేవుడే అలా అని వాగ్దానం చేసాడు.

దావీదును దేవుడు ప్రేమించాడు. అతడు రాజు అయినందుకా? కాదు. అతడు దేవుడ్ని తన రాజుగా చేసికొన్నందుకు. ఆయన అతని హృదయానికే రాజు. మనం దేవుడ్ని ఏమి అడగాలో తెలుసా? ‘‘దేవా, నీవు నాహృదయంలోకి వచ్చి రాజుగా ఏలుతావా’’? అని.



63. దావీదు యొక్క భయంకరమైన పాపము

ఒకరోజు దావీదు మహారాజు తన రాజమందిరం మిద్దెపైన పచారు చేస్తున్నాడు. అతడు యెరూషలేములో చుట్టునున్న గృహాలను చూస్తున్నాడు. అప్పుడు ఒక తోటలో స్నానం చేస్తున్న స్త్రీని చూచాడు. ఆమె పేరు బెత్షెబ. అతడు మనసులో ఇలా అనుకున్నాడు. "ఈమెను నేను పెళ్లి చేసుకుంటే బాగుండును". కాని, దావీదూ ఆమెకు ఇంతకు ముందే వివాహం అయ్యింది. ఆమె ఊరియాకు భార్య. ఊరియా దావీదు సైనికులలో ఒకడు. అయినప్పటికీ దావీదు ఆమెయింటికి ఒక సేవకుడ్ని పంపాడు. ఆమె రాజభవనానికి రావడానికి యిష్టపడుతుందా? అని అడగమన్నాడు. ఓ, బత్షెబ రావడానికి సంతోషంగా ఒప్పుకుంది. రాజభవనానికి వచ్చి రాజుతో కలిసి జీవించడానికి కూడ యిష్టపడింది. వాళ్లిద్దరూ భార్య భర్తల్లా బ్రదకడానికి సిద్ధపడింది. దావీదు ఒక గొప్ప పాపం చేస్తున్నాడు. బత్షెబకు కూడ అందులో భాగం ఉంది. "ఊరియా దూరంగా యుద్ధ భూమిలో ఉన్నాడు. శత్రువులతో యుద్ధం చేస్తున్నాడు. అతడు మనలను చూడలేడు" అనుకున్నారు. అయితే వాళ్లొక సంగతి మరచిపోయారని నీకు తెలుసా? దేవుడు సమస్తాన్నీ చూడగలడని మరిచిపోయారు!



దావీదు తన మనసులో ఇలా అనుకున్నాడు. ''త్వరలో ఊరియా తిరిగి వస్తాడు. నేను, బత్షెబ చేసిన దానిని అతడు తెలుసు కుంటాడు. అయితే అలా జరగడానికి వీల్లేదు.'' కాబట్టి దావీదు ఒక కుటిలమయిన పన్నాగం పన్నుతాడు. అతడు తన సైన్యాధిపతికి ఒక ఉత్తరం రాసి పంపుతాడు. ''నీవేమి చేయాలో తెలుసా? బలమైన శత్రు సైనికులున్న చోటికి ఊరియాను పంపు. తరువాత మన సైనికులెవరూ అతనికి సహాయం చేయకూడదని చెప్పు. అప్పుడు ఊరియా తప్పక శత్రువుల చేతిలో చచ్చిపోతాడు.''

ఓ, దావీదూ, అది కుటిలమయిన ప్రణాళిక కదా? దావీదు చెప్పినట్టే జరిగింది. ఊరియా బహుధైర్యంగా శత్రువులతో పోరాడాడు - అతడు చివరికి చచ్చిపోయాడు. ఇప్పుడు దావీదు ఒక హంతకుడయ్యాడు. దావీదు తన మనసులో ''ఇప్పుడు ఊరియా, నేను చేసిన పాపాన్ని ఇక తెలుసుకోలేడు. అతడు దాన్ని గురించి ఎవరికీ చెప్పలేడు కూడ. ఇది నిజమా? నీ వేమనుకుంటావు? దేవునికి అన్నీ తెలుసుకదా? మనం చేసే ప్రతీ కార్యం ఆయనకి తెలుసునని మరిచిపోవద్దు!

ఒక వ్యక్తి రాజమందిరం వైపు నడిచి వెళ్తున్నాడు. అతనిపేరు నాతాను. అతడు దేవుని సేవకుడు. ప్రవక్త కూడ. దేవుడు అతన్ని పంపాడు. నాతాను రాజుతో మాట్లాడదలచాడు. రాజు కూర్చుండి ఉన్న అందమయిన గదిలోకి అతడు అడుగుపెట్టాడు. ఇప్పుడు నాతాను రాజుకు ఓ కథ చెబుతాడు. ''ఒకానొక కాలంలో యిద్దరు మనుష్యులు ఉండేవాళ్లు. అందులో ఒకడు చాల ధనవంతుడు. తనికి చాల గొర్రెలమందలు ఉండేవి. రెండవ వాడు నిరుపేద. అతనికి ఒకే ఒక గొర్రెపిల్ల ఉండేది. అతడు దానిని చాల ప్రేమించాడు. ఆ గొర్రెపిల్ల అతని యింటిలో నివసిస్తూండేది.

ఒకనాడు ధనవంతుని ఇంటికి ఒక అతిథి వచ్చాడు. ఆ గొప్పవాడు - నా స్నేహితునికి విందు చేస్తాను. నేనొక గొర్రెపిల్లను కోసి వంట చేస్తాను, అని అనుకున్నాడు. ఆ తరువాత అతడేమి చేసాడో తెలుసా? అతడు పేద వాని గొర్రె పిల్లను పట్టుకున్నాడు. దానిని చంపాడు. ఇక ఆ పేద వానికి ఏమీ మిగులలేదు.

కథ ముగిసింది. అది నిజంగా జరిగిన కథ కాదు. అయితే అది నిజమైన కథ అని దావీదు అనుకున్నాడు. అతనికి చాల కోపం వచ్చింది. ''ఆ ధనవంతుడెవడు? నేనతనని చంపుతాను. అదే అతనికి తగిన శిక్ష'' అన్నాడు.

నాతాను దావీదు వైపు చూచాడు. అతని కళ్లలోకి సూటిగ చూసాడు. ''ఆ ధనవంతుడవు నీవే! నీవొక గొప్ప రాజువయ్యావు. అది దేవుడే చేసాడు. ధనవంతుడు పేదవాని గొర్రెను తీసుకున్నాడు. నీవు కూడ అదే చేసావు. నీవు బత్షెబను ఊరియా నుండి దొంగిలించావు. నీవు అలా చేయకూడదు. ఆమె అంతకు ముందే ఊరియా భార్య అని నీకు తెలియదా? అంతేకాక నీవు అతన్ని చంపించావు. నీవో హంతకుడవయ్యావు. దేవుడు దీని నంతటి చూచాడు. ఆయన నిన్ను శిక్షిస్తాడు అని చెప్పాడు.

ఆ గదిలో నిశ్శబ్దం రాజ్యం చేసింది. దావీదు యిప్పుడు ఏమి చెప్పగలడు? అదో చూడండి. అతడు ఏడ్వడం ప్రారంభించాడు. అతడు తలవంచుకున్నాడు. అతడు దుఃఖంలో మునిగిపోయాడు. ''అయ్యో, నేను దుర్మార్గుడను. నేను దేవునికి విరోధంగా పాపం చేసాను. ఆయన నాకెప్పుడూ మేలే చేసాడు. నేనొక గొప్ప పాపం చేసాను'' అన్నాడు.

ఇప్పుడు దావీదు తాను చేసిన పాపాన్నంతటినీ ఒప్పుకున్నాడు. అతడు చాల విచారించాడు. తాను దేవునికి విరోధంగా పాపం చేసానని గ్రహించాడు. అతడు దేవునితో వినయంగా యిలా విన్నవించాడు. ''దేవా, నీవునన్ను కరుణించవా? ఇంకా నేను నీ కుమారునిగా ఉండగలనా? అని అన్నాడు.

నాతాను తిరిగి ఇలా అన్నాడు ''దావీదూ, దేవుడు నీపాపాలన్నీ క్షమించాడు!'' దావీదుకు ఈ మాట ఎంతో సంతోషాన్నీ కలిగించింది. దేవుడు ఇప్పటికీ తన రక్షకుడే. దేవునికిక నాపై కోపం లేదు. అవును, తన శిక్షను ఎవరు భరిస్తారో దావీదుకు తెలుసు. అది యేసు ప్రభువు. ఆయన తన వంశంలో పుట్టనున్నాడు. దావీదు కుమారుడయిన యేసు ప్రభువు. ఆయన దేవుని కుమారుడు. దావీదు ఆయననెంతో ప్రేమించాడు!

''దేవా, మా పాపాల కోసం మేము నిజంగా చింతించేలాగ దయచేసి మాకు సహాయం చేయవా? మా పాపాలను క్షమించవా? దేవా, నీనామమును బట్టి తప్పక నీవది చేయగలవు.

64. చెడు హృదయముగల అందమైన రాకుమారుడు

అదిగో చూడండి. అందమైన రథాలతో ఒక ఊరేగింపు ఈ దిక్కుగా వస్తున్నది. ఆ రథాలను బలమైన గుర్రాలు లాగుతున్నాయి. అందులోని శ్రేష్ఠమయిన ఒక రథంలో అబ్షాలోము ఉన్నాడు. అతడు దావీదు కుమారుల్లో ఒకడు. కాబట్టి అతడు ముఖ్యమయిన రాకుమారుడు. అతని సేవకులు మిగిలిన రథాల్లో ఉన్నారు.

సాధారణంగా అబ్షాలోము తరుచు యెరూషలేము వీధుల్లో ఈ విధంగా సవారి చేస్తుంటాడు. యెరూషలేము చాల ప్రాముఖ్య మయిన పట్టణం. దావీదు మహారాజు కూడ అక్కడే నివసిస్తున్నాడు. ప్రజలు అబ్షాలోంను చూచినపుడు చేతులు ఊపుతూ అభినందిస్తారు. అతడు మంచి రాకుమారుడు. అతడే రాజైనట్లు ప్రజలు అతనికి వంగి నమస్కరిస్తారు. కొన్నిసార్లు అతడు ప్రజలకు ముద్దుపెడతాడు.

అబ్షాలోము చాల అందమయిన రాకుమారుడు. అతనికి అందమైన తలవెంట్రుకలున్నాయి. అతడు అందంగా అలంకరించిన చక్కని దుస్తులు ధరిస్తాడు. ప్రజలు ఒకరితో ఒకరు, అబ్షాలోము అందమయిన స్నేహ పూరితమైన రాకుమారుడు కాడా? అని అనుకుంటారు. అయితే వారు అతని హృదయాన్ని చూడలేదు. అబ్షాలోము పైకి అందంగా మంచిగా కనిపించవచ్చు! కాని అతని హృదయం సరిగాలేదు. అది దుష్టత్వంతో నిండి ఉంది. అసలు కథ వినండి.

అబ్షాలోము ఒక పథకం వేశాడు. అతని స్నేహితులతో సంప్రదించాడు. వాళ్లు అతనికి సహాయం చేస్తామన్నారు. అయితే వారా పనిని రహస్యంగా చేయాలి. ఈ సంగతి దావీదుకు తెలియకూడదు.

ఒక దినం విందు జరుగుతున్న ఏదో హడావిడి వినిపించింది. బూరలు మ్రోగుతున్నావి. దీని అర్థం యేమిటి? వినండి, ప్రజలు "అబ్షాలోము రాజయ్యాడు" అని అరుస్తున్నారు. అది మంచిదే కదూ? అతడొక మంచి రాజవుతాడు. ఇంకా చాలమంది "అబ్షాలోము రాజయ్యాడు. చాలా గొప్ప సంగతి కదూ?" అంటూ అబ్షాలోము ఊరేగింపులో చేరారు. చాలమంది బలమైన యుద్ధ వీరులు కూడ అతనితో కలిసారు. అబ్షాలోము పెద్ద సైన్యాన్ని తయారు చేసాడు. దీనితో అతడు యేమి చేయాలనుకుంటున్నాడు? ఈ సైన్యంతో అతడెక్కడికి వెళ్తున్నాడు? అతని తండ్రి దావీదు నివసించే రాజభవనం ఉన్న యెరూషలేంకు వెళ్తున్నాడు. దావీదుకు ఈ సంగతి తెలిసింది. అబ్షాలోము పెద్ద సైన్యంతో వస్తున్నాడు! దావీదు నిర్ఘాంత పోయాడు. అది అతనికి చాల దుఃఖం కలిగించింది. తన సొంతకుమారుడే తనను తరిమివేయాలని చూస్తున్నాడు. బహుశ అతడు రాజును చంపాలని అనుకుంటున్నాడేమో! అబ్షాలోంకు రాజు అవ్వాలనే కోరిక ఉంది. అందుకనే అతడు ప్రజలతో అంత స్నేహంగా ఉండేవాడు.

నీ సొంత తండ్రికి అంత కీడుచేయడం ఎంత భయంకరం! మనం తల్లిదండ్రులను ప్రేమించి గౌరవించాలని దేవుడు కోరుతున్నాడు.

దావీదు ఇప్పుడేమి చేయాలి? అతడు తన సైనికులను తీసికొని అబ్షాలోముతో యుద్ధం చేస్తాడా? దావీదు చాల ధైర్యశాలి కదా? అవును, దావీదు శత్రువులతో యుద్ధం చేయడానికి భయపడడు. అయితే సొంత కొడుకుతో యుద్ధమా? లేదు. అలా చేయ డానికి ఎంత మాత్రం ఇష్టపడలేదు. అది మంచిది కాదు.

అందువలన దావీదు తన సైనికులతో - మనం తప్పించుకు పోవడానికి అన్నీ సిద్ధం చేయండి అని చెప్పాడు.

కాబట్టి దావీదూ అతని సేవకులూ వెళ్లిపోయారు. దావీదును ప్రేమించే చాల మంది ప్రజలు కూడ దావీదుతో బయలుదేరారు. అదో పెద్ద సమూహం అయ్యింది. వాళ్లంతా రాజ భవనం వదిలి వెళ్లిపోయారు. వాళ్లు యెరూషలేమును విడిచి పెట్టారు. దావీదు దుఃఖంలో మునిగిపోయాడు.

కొంతసేపటికి అబ్షాలోము యెరూషలేముకు వచ్చాడు. ఇప్పుడతడు రాజమందిరంలో నివసిస్తాడు. అతని తండ్రి వెళ్లిపోయాడు. ఇప్పుడు అతడే రాజు!

అతని తండ్రి దావీదు ఎక్కడున్నాడు? అతడు ఏమి చేస్తాడు? బహుశ అతడు పెద్ద సైన్యంతో తిరిగిరావచ్చు.

అబ్షాలోమును తరమవచ్చు. కాబట్టి అబ్షాలోము తన సైనికులను పిలిపించాడు. వాళ్లు దావీదు సైన్యంతో పోరాడాలి.

అయ్యో, ఇప్పుడు దావీదు అబ్షాలోముతో పోరాడాలి! అదిగో, అతని సైన్యం వెళ్తున్నది. దావీదు తన సైన్యంతో వెళ్లడంలేదు. అతడు చాల కలవరపడుతున్నాడు. అతడు తన సైనికులతో ''మీరు అబ్షాలోమును ఎంత మాత్రం చంపవద్దు'' అని చెప్పాడు. దావీదు, అబ్షాలోమును ఇంకా ప్రేమిస్తూనే ఉన్నాడు.

అబ్షాలోము సైన్యం దావీదు సైన్యంతో చాల కష్టపడి యుద్ధం చేస్తున్నారు. అబ్షాలోము కూడా స్వయంగా యుద్ధం చేస్తున్నాడు. కాని అతడూ, అతని సైన్యం ఓడిపోతున్నారు. ఎందుకంటే దేవుడు వాళ్లకి సహాయం చేయలేదు. వాళ్లు పారిపోతున్నారు. చూడండి, ఒక గాడిత పై ఎక్కి వేగంగా పారిపోతున్నది ఎవరు? అది అబ్షాలోము. అందమైన అతని జుట్టు గాలికి ఎగురుతున్నది. అబ్షాలోము తలవంచాడు. ఎందుకంటే చెట్లకొమ్మలు చాల క్రిందికి ఉన్నాయి. హఠాత్తుగా తల వెంట్రుకలు గట్టిగ గుంజినట్టు అనిపించింది. అయ్యో, అతని జుట్టు కొమ్మలలో చిక్కుకుంది. అది గాడిద గమనించలేదు. అది అలానే వెళ్లిపోయింది. అదుగో అబ్షాలోము తల వెంట్రుకలు చెట్ల కొమ్మలలో చిక్కుకుపోగా అతడు వ్రేలాడుతున్నాడు. అతడా చిక్కు నుండి విడివడలేకపోయాడు. అదిగో సైనికులు. వాళ్లు దావీదు సైనికులు. వాళ్లు చెట్టు కొమ్మలకు వ్రేలాడుతున్న అబ్షాలోమును చూచారు. వాళ్లేం చేసారు? బాణం వేసి అతన్ని చంపివేసారు. అదే దేవుడతనికి యిచ్చిన శిక్ష.

దావీదు కనిపెడుతున్నాడు. అతను చాలా కలవరపడుతున్నాడు. ఇదంతా ఎలా ముగుస్తుంది? ఒక సైనికుడు పరుగెత్తి రావడం అతడు చూచాడు. ఏం జరిగిందని దావీదు అతన్ని అడిగాడు. దానికా సైనికుడు - రాజా, అంతా చక్కగా జరిగింది. మనం గెలిచాము అన్నాడు.

''మరి అబ్షాలోము సంగతి ఏమిటి?'' అన్నాడు దావీదు. ''అబ్షాలోము చచ్చిపోయాడు'' అన్నాడా సైనికుడు. అయ్యో, దావీదు చాల దుఃఖించాడు.

అబ్షాలోము కోపంతో నిండిన తన హృదయంతో



దేవుని ముందు నిలవాలని దావీదుకు తెలుసు. అప్పుడతడు నరకానికి వెళ్లాలి. అక్కడ ఎప్పుడూ బాధ, దుఃఖమే. అక్కడ అతని హృదయం ఎన్నటికీ మారదు. అందువలననే దావీదు అంత విచారిస్తున్నాడు. అతడు తన కుమారుని యింకా ప్రేమిస్తున్నాడు.

''అయ్యో, అబ్షాలోము, నా కుమారుడు అబ్షాలోము నీకు బదులుగా నేను చచ్చిపోయి ఉండవలసింది. నాకుమారుడా, నా కుమారుడా'' అని దావీదు దుఃఖించాడు. దావీదు అతన్ని అంతగా ప్రేమించాడు. అయితే అబ్షాలోము దావీదును ప్రేమించలేదు. అతడు పాపాన్ని ప్రేమించాడు. అతడు తన మార్గాన్ని మార్చుకొని దేవుని వైపు తిరగడానికి యిష్టపడలేదు. అందువలననే అతని అంతం అంత చెడుగా మారింది.

''పాపాన్ని ప్రేమించవద్దు, నావైపు తిరిగి రక్షణ పొందండి'' అని దేవుడు చెబుతున్నాడు.

''దేవా, మా హృదయాలు మార్చి మమ్ములను సరిచేయు'' అని ప్రతిదినం ప్రార్థించడం మరువకండి.

65. దావీదు, మెఫీబోషెతు

దావీదూ, అతని సైన్యమూ తరచు యుద్ధం చేస్తూండే వాళ్లు. దావీదుకు ఎక్కడ చూచినా శత్రువులే. అయితే ఎప్పుడూ వాళ్లు ఓడిపోయేవాళ్లు. ఎందుకంటే దేవుడు దావీదుకు సహాయం చేసేవాడు.

దావీదు మంచిరాజు. అతడు తనప్రజలను మంచిగా చూచేవాడు.

ఒకనాడు దావీదు విశ్రాంతి తీసికొంటూ యోనాతాను గూర్చి ఆలోచిస్తున్నాడు. అతడు దావీదు ప్రాణ స్నేహితుడు. చాల కాలం క్రిందట చనిపోయాడు. దావీదు అతన్ని మరిచిపోలేకపోయాడు. ఇప్పుడు యోనాతానుకు తానేమీ చేయలేడు. కాని యోనాతాను పిల్లల మాటేమిటి? వాళ్లింకా బ్రతికి ఉన్నారా? ఉంటే ఎక్కడ ఉన్నారు?

దావీదు వాళ్లను గురించి ఒక సేవకుని అడిగాడు అతడు - యోనాతాను కుమారులలో ఒకడు మిగిలిఉన్నాడు. అతని పేరు మెఫీబోషెతు. అతడు చాల దూరాన నివసిస్తున్నాడు. అతడు కుంటివాడు నడవలేడు అని చెప్పాడు. దానికి దావీదు - నీవు వెంటనే వెళ్లి అతన్ని తీసుకురావాలి అని చెప్పాడు.

అతన్ని తేవడానికి కొందరు సేవకులు వెళ్లారు. మెఫీబోషెతు నివసించే చిన్న ఇల్లు చేరారు. "నీవు వచ్చి రాజును చూడాలి" అని చెప్పారు. వారి మాటలకు మెఫీబోషెతు భయపడిపోయాడు. అతడు మనసులో - రాజు నామీద కోపంగా ఉండి ఉండవచ్చు. నేను సౌలు బంధువును కదా? నా తాత సౌలు దావీదు రాజుకు కీడుచేసాడు. బహుశ అతడు మా కుటుంబాన్ని పూర్తిగ నాశనం చేయాలని అనుకుంటున్నాడేమో" అని తలచాడు.

మెఫీబోషెతు ఎందుకు అంతగా భయపడ్డాడో మీకిప్పుడు తెలిసింది కదా? అయినా అతడు వెళ్లితీరాలి. రాజైన దావీదు ఆజ్ఞ అది.

దావీదు రాజు ఒక గొప్ప గదిలో కూర్చున్నాడు. తలుపు తెరవబడింది. సైనికులు మెఫీబోషెతును లోనికి తెచ్చారు. అతడు రాజు ఎదుట నేలపై మోకరించాడు. ఎందుకంటే కుంటి కాళ్లతో అతడు నిలబడలేడు. అతడు తన తలను క్రిందికి వంచాడు. అది రాజుకు చూపే గౌరవం. అతడు భయంతో వణికిపోయాడు. రాజు యిప్పుడు తనను చంపేస్తాడా? దావీదు - మెఫీబోషెతూ, అని పిలిచాడు. ఆ స్వరం ఎంత దయగ ఉంది! "మెపీబోషెతూ, భయపడకు. నేను నిన్ను పోషిస్తాను. నీవు యెరూషలేములో నివసించ వచ్చు. నీవు ప్రతిదినం నా రాజ భవనానికి వచ్చి నాతో భుజించు. నేను నీకు పొలాలు యిస్తాను. అవి సౌలురాజువి. అందులో పని చేయడానికి సేవకులను యిస్తాను" అన్నాడు.



మెఫీబోషెతు నిశ్శబ్దంగా ఆ మాటలు విన్నాడు. ఓ - ఆ మాటలను అతడు నమ్మలేకపోయాడు. రాజు తన పట్ల అంత దయగా ఎందుకు ఉన్నాడు? వినండి. దావీదు ఇంకా ఏదో చెబుతున్నాడు. "మెఫీబోషెతూ, నేనిదంతా ఎందుకు చేస్తున్నానో తెలుసా? నీవు యోనాతాను కుమారుడవు కాబట్టి. నీ తండ్రీ నేనూ ప్రాణ స్నేహితులము.



మెఫీబోషెతు తిరిగి రాజు ఎదుట మోకరించాడు. రాజు తన పట్ల ఎంత మంచితనం చూపుతున్నాడు! అతనికింకా అర్థం కాలేదు. అయితే అది తప్పక నిజం అయ్యుండవచ్చు. ఎందుకంటే రాజు స్వయంగా ఈ మాటలు చెబుతున్నాడు. "రాజా, నేను మీ దయకు అర్హుడను కాను. నేను అల్పుడను, చచ్చిన కుక్కవంటి వాడను. అయినా నీవునాపట్ల ఇంత మంచి తనం చూపిస్తున్నావు" అన్నాడు.

అవును, దావీదు మంచి రాజు. పేదవారిపట్ల దయచూపించే రాజు.

దావీదు కొద్దిగ ఎవరి వలె ఉన్నాడు? యేసు ప్రభువువలె. యేసుకూడ మంచి రాజు. దావీదు కన్నాచాల మంచి రాజు. ఎందుకో తెలుసా? సంతోషంలేని వాళ్లు సంతోషంగా ఉండాలని ఆయన కోరిక. ఆయన పాపులను రక్షిస్తాడు. నీవు దానికొరకు ఆయనను అడగాలంతే!

66. జ్ఞానియైన సొలోమోను రాజు

దావీదు మరణించాడు. ప్రజలంతా కలవరపడ్డారు. ఎందుకంటే అతడు చాల మంచి రాజు. చచ్చిపోవడం వల్ల దావీదుకు ఏ దుఃఖం లేదు. ఎందుకంటే అతడిప్పుడు పరలోకం చేరుకున్నాడు. అక్కడ అతడు నిత్యం దేవునితో ఉంటాడు. అక్కడ అతడు ఇక పాపం చేయడు. అక్కడతడు పవిత్రమయిన హృదయంతో దేవుని స్తుతిస్తాడు. అయితే మరి యిప్పుడు ఎవడు రాజవుతాడు? అతని కుమారుడు సొలోమోను.

సొలోమోను యింకా చిన్నవాడు. అతనికి రాజుగ ఉండడం కష్టం అనిపించింది. అతనికెవరు సహాయం చేస్తారు? అది సొలోమోనుకు తెలుసు. దేవుడు తనకు సహాయం చేయగలడు. తన తండ్రియైన దావీదుకు ఆయనే సహాయం చేసేవాడు. ఆయన తనకు కూడ సహాయం చేస్తాడా?

సొలోమోను పర్వతం మీదికి వెళ్లి బలి అర్పించాడు. అతడు దేవునికి వెయ్యి జంతువులను బలిగా అర్పించాడు! తాను దేవుడ్ని ప్రేమిస్తున్నానని ప్రకటించాలని అతడలా చేసాడు. ఎందుకంటే రాజులకు రాజు ప్రభువులకు ప్రభువు ఆయనే.

చీకటి పడింది. సొలోమోను నిద్రపోయాడు. ఆ నిద్రలో అతనికి ఓ కలవచ్చింది. అది దేవుని నుండి వచ్చిన కల. ఆ కలలో దేవుడు అతనితో మాట్లాడాడు. దేవుడు - సొలోమోనూ అనిపిలిచాడు. "నేను నీకు ఒక దీవెన నివ్వాలనుకుంటున్నాను. నీ కిష్టమైనది కోరుకో" అని చెప్పాడు. సొలోమోను ఏమి కోరుకుంటాడు. ధనమా?

సొలోమోను ఎక్కువ సేపు ఆలోచించలేదు. "దేవా, నీ ప్రజలను చక్కగా పరిపాలించడం నాకు యిష్టం. అయితే అదెలా చేయాలో నాకు తెలియదు. నేనింకా చిన్నవాడను. నాకు చాలినంత జ్ఞానం లేదు. ప్రభువా, నాకు జ్ఞానంయిస్తావా? నన్ను జ్ఞానిగా చేస్తావా? అప్పుడు నేను మంచి రాజును కాగలను. అప్పుడు నేను నిన్ను సేవిస్తాను" అన్నాడు.

సొలోమోను మాటలు విన్నారా? దేవున్ని సేవించడానికి అతడు జ్ఞానాన్ని కోరుతున్నాడు. మనం కూడ దీనిని కోరుతున్నామా? లేకవేరొక దానిని ఆశిస్తున్నామా?

తరువాత దేవుడు సొలొమోనుతో చెప్పిన మాటలు వినండి. "నేను నీ ప్రార్థనకు జవాబిచ్చాను. నేను నీకు కావలసినంత జ్ఞానం యిచ్చాను. ఈ ప్రపంచంలో ఉన్న రాజులందరికన్నా ఎక్కువ జ్ఞానం నీకిస్తాను. అప్పుడు నీవు నా ప్రజలను చక్కగా పరిపాలిస్తావు" అన్నాడు.

అయితే దేవుడు సొలోమోనుకు మరొకటి కూడ యిచ్చాడు. "సొలొమోనూ, నేను నీకు సంపద కూడ దయచేస్తాను. లోకంలో మిక్కిలి ధనవంతుడవయిన రాజువు నీవే. ఏ శత్రువూ నిన్ను ముట్టకుండానేను చేస్తాను. అయితే సొలోమోనూ, నీవు నాకు ఎప్పుడూ లోబడి ఉంటావా? అలా చేస్తే నీ తండ్రి వలె నీవు కూడ చాల కాలం పరిపాలిస్తావు" అని దేవుడు చెప్పాడు.

సొలోమోను నిద్రలేచాడు. అతడు చాల సంతోషించాడు! దేవునికి వందనాలు చెల్లించాడు. తరువాత అతడు ఏం చేసాడు? యెరూషలేముకు వెళ్లాడు. అక్కడ దేవుని మందిరం ఉంది. దేవుడు ఉండేది అక్కడే. అక్కడ సొలోమోను చాల బలులు అర్పించాడు. అది అతడు దేవునికి చెల్లించిన కృతజ్ఞత.

దేవుడు సొలోమోనుకు ఎంత జ్ఞానం ఇచ్చాడో తెలుసా? ఈ కథ వినండి.

ఇద్దరు స్త్రీలు ఒక ఇంటిలో నివసించేవాళ్లు. వాళ్లిద్దరికీ చెరొక పిల్లవాడూ కలిగాడు. ఆ తల్లులు తమ శిశువులతో ఒక్కో మంచం మీద పండుకునేవాళ్లు. ఒక దినం అందులో ఒక తల్లి ఉదయాన్నే నిద్రలేచింది. అయ్యో, ఆమె అక్కడ యేమి చూచింది? తన బిడ్డ కదలడంలేదు. చచ్చిపోయి ఉంది! నిద్రలో ఆమె ఆ శిశువుపై పడగా ఆ శిశువు చచ్చిపోయింది.

మరి యిప్పుడు యేమి చేయాలి? మరణించిన తన శిశువును ఎత్తుకుంది. నెమ్మదిగ ఆమె ఆ రెండవ స్త్రీమంచం దగ్గరికి వెళ్లింది. ఆమె యింకా నిద్ర పోతూ ఉంది. ఆమె ప్రక్కలో చనిపోయిన తన శిశువును పరుండ బెట్టి బ్రతికి ఉన్న ఆమె శిశువును తీసికొని తన మంచం చేరింది. ఆమె తన మనసులో "కనీసం నాకు బ్రదికి ఉన్న శిశువు దక్కింది" అని తలచింది. ఇంతలో రెండో స్త్రీ నిద్రలేచింది. చచ్చిపోయిన శివువును చూచింది. బాగ నిదానించి చూచింది.

...అది తన బిడ్డ కాదు! వెంటనే ఆ రెండో మంచం చేరింది. అక్కడ ఉన్నది తన శిశువే. కాని రెండో స్త్రీ దానిని తీసికొంది.



''నాబిడ్డను నాకివ్వు. బ్రతికి ఉన్నది నా శిశువు. చచ్చిపోయింది నీ బిడ్డ'' అన్నది.

రెండవ తల్లి ''కాదు, బ్రతికి ఉన్నది నా బిడ్డ. చచ్చిపోయినది నీ బిడ్డ'' అన్నది.

అయితే ఇప్పుడేమి జరుగుతుంది?

వాళ్లిద్దరూ సొలోమోను రాజు వద్దకు వెళ్లారు. ఈ ఇద్దరు స్త్రీలలో ఎవరు నిజం చెబుతున్నారో అతడు నిర్ణయించాలి. ఎందుకంటే వాళ్లిద్దరూ బ్రదికి ఉన్నదే నా బిడ్డ అంటున్నారు.

అప్పుడు సొలోమోను తన సేవకునితో - వెళ్లి కత్తి ఒకటి పట్టుకురా అని చెప్పాడు. అతడు అలాగే చేసాడు. సొలోమోను - ఇప్పుడు బ్రదికి ఉన్న ఈ బిడ్డను రెండు ముక్కలు చేసి ఒక్కో తల్లికి ఒక్కో ముక్క ఇవ్వు అన్నాడు.

వెంటనే అందులో ఒక తల్లి వెంటనే ''వద్దు రాజా వద్దు. దయచేసి బిడ్డను కోయవద్దు. శిశువును ఆ స్త్రీకి ఇచ్చివేయండి'' అని చెప్పింది. ఆమె భయంతో వణికిపోతోంది.

అయితే రెండవ స్త్రీ - అవును రాజా, నీవు చెప్పినట్టు బిడ్డనురెండుగా కోసి యివ్వండి, అన్నది.

ఆ మాటలు వినగానే రాజు ''నిజమైన తల్లి ఎవరో నాకిప్పుడు తెలిసింది. ఈమెకే ఆ బిడ్డను ఇవ్వండి'' అని కలవరపడుతున్న స్త్రీని చూపించాడు.

మరి సొలోమోను చాల జ్ఞానం కలవాడు కదూ? అతనికి ఈ జ్ఞానం ఎవరు యిచ్చారో తెలుసా? యేసుప్రభువు. ఆయనకు సత్యమేదో తెలుసు. ఇతరులెవ్వరికీ తెలియక పోయినా ఆయన ఎరుగును. తనకు ప్రార్థన చేసే వారి ప్రార్థన వింటానని ఆయన చెప్పారు.

67. రాకుమారుడు అబీయా

రాజమందిరమంతా నిశ్శబ్దంగా ఉంది. సేవకులు మెల్లగా మాటలాడుతున్నారు. ''రాజకుమారుడు అబీయా తీవ్రంగా జబ్బుపడడం ఎంత విచారం! అతడసలు బాగుపడతాడా?'' అని వాళ్లు ఒకరితో ఒకరు చర్చిస్తున్నారు.

అవును రాజకుమారుడు చాల జబ్బుగా ఉన్నాడు. అతడు పడక మీద పడుకొని ఉన్నాడు. ఎంత పాలిపోయాడు! అతని రోగం కుదర్చడం డాక్టర్లకు వశంకావడం లేదు.

అతని తండ్రి యరోబాము రాజు. అబీయా తల్లిదండ్రులు చాల దిగులుగా ఉన్నారు. తమ కుమారునికి ఎలాగయినా సాయం చేయాలని వారి ఆశ! అబీయాను బాగుచేస్తావా అని వాళ్లు దేవునికి ప్రార్థన చేస్తారా? మనం ఆయనను ఏదైనా అడగవచ్చు కదా?

ప్రార్థించడమా? యరోబాము, అతని భార్య ప్రార్థన చేయరు. వాళ్లిద్దరికీ దేవునితో ఏ సంబంధమూ లేదు. వాళ్లు చాల పాపాలు చేసారు. ఇతరులను పాపంలోకి నడిపించారు. వాళ్లు ప్రజలంతా విగ్రహాలకు మ్రొక్కేలా చేసారు.

మరి అబీయా సంగతి యేమిటి? అతడు కూడ దేవునిపట్ల భక్తిలేని రాజకుమారుడా? కాదు. అతడు విగ్రహారాధన చేయడు. దేవుని ప్రేమించేవాడు. తానొక్కడూ దేవుని సేవించాలని ఆశించాడు.

రాజగృహంలో ఎవ్వరూ దేవుడ్ని సేవించడం లేదు. ఒక్క అబీయాతప్ప. ప్రతివాడూ ఎలా పాపం చేస్తున్నాడో అతడు గమనించాడు. అది అతనికి చాల బాధ కలిగించింది. దేవుడు అబీయాకు నూతన హృదయాన్నిచ్చాడని మనం చెప్పవచ్చు.

అబీయా రోగం దినదినానికి ముదిరిపోయింది. చివరికి ఇది యేమవుతుందని తల్లిదండ్రులు విచారించారు. వాళ్లకేమీ తెలియ లేదు. అది ఎవరికి తెలుసు? అహీయా ప్రవక్తకు తెలుసు. అతడు దేవుని సేవకుడు. చాల కాలంగా యరొబాము అతనిని ఎరుగును. అతడు రాజవుతాడని అహీయా ప్రవక్తయే యరోబాముకు చెప్పాడు. అతడు చెప్పినటే జరిగింది.

అందువలన యరోబాబు తన భార్యతో - నీవు అహీయా ప్రవక్త దగ్గరకు వెళ్లు. మన కుమారుడు బాగుపడతాడో లేదో అతడు తప్పక చెప్పగలడు, అన్నాడు. యరోబాము స్వయంగ ప్రవక్త వద్దకు ఎందుకు వెళ్లడు? అతడు భయపడ్డాడు. తాను చాల పాపాలు చేసానని అతనికి తెలుసు. దానిని బట్టి దేవుని పరంగా ప్రవక్త తనకు శిక్ష విధించవచ్చునని భయపడ్డాడు. కాబట్టి అతడు ప్రవక్తను దర్శించలేదు.

యరోబాము తన భార్యతో - నీవు రాణులు ధరించే మంచి బట్టలు వేసుకోవద్దు. సామాన్య స్త్రీలు వేసుకొనే బట్టలు వేసుకో. అప్పుడు ప్రజలు కాని, ప్రవక్త కాని నీవెవరివో గుర్తు పట్టలేరు, అన్నాడు.

కాబట్టి రాణి మారు వేషం ధరించింది. వాళ్లు ప్రజలను, ప్రవక్తను మోసం చేయాలని అనుకున్నారు. అయితే వాళ్లు ప్రభువును కూడా మోసం చేయగలరా?


లేదు లేదు. మనం ప్రజలను మోసం చేయగలమేమోగాని దేవుడ్ని మాత్రం చేయలేము. అది మరువకండి. అదిగో, రాణి బయలు దేరింది. ఆమె ప్రవక్త నివసించే చిన్న గృహాన్ని సమీపించింది. ఆమె తలుపు తెరించింది. అక్కడ అహీయా ప్రవక్త ఉన్నాడు. అతడు చాల ముసలి వాడు. కళ్లు కనిపించవు. అయితే ఎవరో యింటిలోనికి వస్తున్న శబ్దం విన్నాడు. అతడు వెంటనే - యరోబాము భార్యా, లోపలికి రా, నీవు ఎందుకు మారువేషంలో వచ్చావు? అని అడిగాడు.

రాణి కంగారు పడింది. అహీయాకు ఇది ఎలా తెలిసింది? అవును, దేవుడే అతనికీ సంగతి తెలియజేసాడు. రాణి లోనికి రాక ముందే అతనికి తెలిసింది. నీవు దేవున్ని మోసం చేయలేవు!

ప్రవక్త ఇంకా ఇలా చెప్పాడు. ''నేను నీకు దుఃఖకరమయిన వార్త చెబుతాను. మీరు చేస్తున్న ఘోర పాపాలు దేవుడు చూచాడు. కాబట్టి రాకుమారులూ, రా కుమార్తెలూ అందరూ చచ్చిపోతారు. నీ కుంటుంబమంతా మరణిస్తుంది. వారు సమాధి చేయబడరు. కుక్కలూ పక్షులూ వాళ్ల శవాలను తింటాయి. జబ్బుగా ఉన్న అబీయా రాకుమారుడు కూడ చచ్చిపోతాడు. అయితే అతడు మాత్రమే సమాధి చేయబడతాడు. ఎందుకంటే అతడు ఒక్కడే యెహోవా దేవునికి భయపడి ఆయనకు సేవించడానికి ఆశించాడు.

రాణి చాల భయపడి వెంటనే తిరిగి వెళ్లింది.





రాజమందిరం చేరింది. అబీయా చచ్చిపోయినట్టు ఒక సేవకుడు చెప్పాడు. అది ఎంత విచారకరం! అబీయాకు కాదు. అతని ఆత్మపరలోకం చేరింది. అది దేవునితో ఉంటుంది. ఎందుకంటే అబీయామంచి రాకుమారుడు. అతడు దేవుని సేవించాడు.

నీవు కూడ దేవుని బిడ్డగ మరణించాలని కోరుతున్నావా? అయితే నీవూ అతనిలా జీవించాలి. నీవు దేవుని వెదకి అబీయావలె మంచిగ బ్రదికేలా దేవుడు నీకు బోధించును గాక!

68. దైవజనుడు ఏలీయా

దావీదు, సొలోమోనులు మంచిరాజులు. వాళ్లు దేవుని ప్రేమించి సేవించారు.

ఇప్పుడు మరో రాజు వచ్చాడు. అతని పేరు అహాబు. ఇతడు దేవున్ని ప్రేమించలేదు. అతనికి దైవ భక్తి లేదు! అతడు ప్రజలలో, "మీరు యెహోవాదేవునికి లోబడనవసరంలేదు. అక్కడ చూడండి, నేనొక మంచి విగ్రహాన్ని చేయించాను. ఇదే మన దేవుడు. ఇతని పేరు బయలు. ఇక నుంచి మీరు బయలుకే ప్రార్థన చేయాలి. అతనికే మ్రొక్కాలి" అని చెప్పాడు. ఇది భయంకరం కదూ. ఈ విధంగా అహాబు తన జనులను విచారకరమైన దేశ ప్రజలుగా చేసాడు. చాలమంది అతని మాట విన్నారు. అయితే అందరూ బయలును పూజించడం లేదు. యెహోవా దేవుని ప్రేమించే వాళ్లు బయలును పూజించలేదు.



చూడండి, ఒక వ్యక్తి రాజమందిరంలోకి వెళ్తున్నాడు. అతడు రాజుతో మాట్లాడాలని వెళ్లాడు. అతడు ముఖ్యమయిన వ్యక్తిలా కనిపించడం లేదు. బూడిద రంగు అంగీధరించాడు అతడెవడు? అతడు ఏలీయా ప్రవక్త. దైవజనుడు. చాల కలవరపడుతున్నట్టు కనిపిస్తున్నాడు. అవును నిజమే. ఎందుకంటే ప్రజలంతా పాపం చేస్తున్నారు. చివరికి అహాబు రాజు కూడ అదే చేస్తున్నాడు. కాబట్టి ప్రవక్త దేవుని వర్తమానాన్ని పట్టుకుని రాజు దగ్గరకు వచ్చాడు.


కొంతసేపటికి అతడు రాజు యెదుట నిలువబడ్డాడు. అతడు రాజును గంబీరంగా చూచి ఇలా అన్నాడు - రాజా, దేవుడు నిన్నూ నీ ప్రజలనూ శిక్షించబోతున్నాడు. ఇకపై చాల కాలం వరకూ వర్షం కురవదు. అదే దేవుని శిక్ష.

తరువాత ఏలీయా వెళ్లిపోయాడు. అతని మాట ప్రకారమే జరిగింది. ప్రతీదినం సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. ఆకాశంలో ఒక్క మబ్బు తునక కూడ కనిపించడం లేదు. ఒక్కచుక్క వర్షం పడలేదు. చెట్ల ఆకులు ఎండిరాలిపోతున్నాయి. పువ్వులు వాడిపోతున్నాయి. బీడులలో గడ్డి మొలవడంలేదు. కరవు వచ్చింది. పొలంలో గోధుమలు మొక్కలు ఎదగడంలేదు. అది ఎండకు ఎండిపోతున్నది. మరి ప్రజలు రొట్టె ఎలా కాల్చుకుంటారు? "అయ్యో, వర్షం మళ్లీ ఎప్పుడు వస్తుంది?" అని ప్రజలు కనిపెడుతున్నారు. అయినా వర్షం రాలేదు. అంతా ఎండిపోయింది. ఏదీ ఎదగడం లేదు. ప్రజలు, పశువులు ఆకలితో అలమటిస్తున్నారు.

ఆహాబు రాజు చాల కోపగించాడు. ఎవరి మీద? ఏలీయా మీద.

"ఇదంతా ఏలీయా చేసినతప్పే" అనుకున్నాడు. అయితే అది ఎంతమాత్రం నిజంకాదు. అది అతడు, అతనిప్రజలూ చేసిన పాపం. వాళ్లంతా బయలును ఆరాధించడం వల్ల వచ్చినకీడు.

అహాబు తన సైనికులతో - వెళ్లి ఏలీయా ఎక్కడ ఉన్నాడో వెదకండి. మీరు అతన్ని యిక్కడికి



తీసుకురావాలి అన్నాడు. వాళ్లు ప్రతి చోటా వెదకారు కాని ఏలీయా మాత్రం కనిపించలేదు. అతడెక్కడుంటాడు?

ఏలీయా చాలదూరం తరలిపోయాడు. అతడో ఏకాంత స్థలంలో ఉన్నాడు. ఎత్తైన పర్వతాల్లో ఉన్నాడు. ఆ స్థలాన్ని దేవుడే ఎంపిక చేసాడు. రాజు సైనికులు అతన్ని పట్టుకోకుండా దేవుడే కాపాడాడు. అక్కడ ఒక చిన్న ఏరు ప్రవహిస్తున్నది. అది మంచినీటి వాగు. ఏలీయా ఆనీరు త్రాగవచ్చు.

అయితే అతనికి ఆహారం ఎక్కడ దొరుకుతుంది? ఇక్కడ కూడ అన్నీ ఎండిపోయాయి. ఏదీ మొలవడం లేదు.

అరె, అలా పైకి చూడండి. ఆకాశంలో పెద్దపెద్ద పక్షులు ఎగురుతున్నవి. అవి కాకులు. అవి ముక్కున ఏమి కరుచుకొని వస్తున్నవి? చిన్న రొట్టె ముక్కలు, మాంసం ముక్కలు. అవి ఏలీయా దగ్గరకు వచ్చాయి. అవి తమ నోరువిప్పగా చిన్న చిన్న రొట్టె మక్కలు మాంసం ముక్కలు నేలమీద పడుతున్నవి. కాకులు తిరిగి వెళ్లిపోయాయి. ఇప్పుడు ఏలియాకు తినడానికి సరిపడినంత ఆహారం దొరికింది.

సాయంకాలం మళ్లీ ఏలీయాకు ఆకలి వేసింది. మళ్లీ పక్షులు రొట్టె మాంసం తేవడం అతడు చూచాడు. అవి ప్రతి ఉదయం, ప్రతి సాయంకాలం వస్తున్నవి. ఎందుకు? దేవుడే పంపుతున్నాడు. అన్ని ప్రాణులమీద ఆయనకు అధికారం ఉంది. అవన్నీ ఆయన కోరిక ననుసరించి పని చేస్తాయి.

అదో గొప్ప అద్భుతం కాదా? దేవుడు ఏలీయాను భద్రంగా కాపాడుతున్నాడు కదూ? అవును. ఎందుకంటే ఏలీయా దేవుని సేవకుడు! దేవుడు మనందరినీ కాపాడుతున్నాడు. మరి ముఖ్యంగా తన బిడ్డలను వారు చనిపోయే సమయంలో మరింతగా వారిని సంరక్షిస్తాడు. కాబట్టి దేవుని బిడ్డలు అదృష్టవంతులు కారా? మనం కూడ దానిని బట్టి సంతోషించవచ్చు.

69. ఓబద్యా

అహాబు రాజుకు, యెజెబెలు రాణికి చాలమంది సేవకులున్నారు. రాజ గృహంలో వాళ్లంతా తమ తమ పనులు చేస్తూంటారు. గుర్రపు శాలలల్లో ఉన్న గుర్రాలను గాడిదలనూ కూడ వారు జాగ్రత్తగ పెంచుతారు. ఆ రాజ సేవకులలో ముఖ్యుడు ఓబద్యా. అతడు రాజూ, రాణీ, వాళ్ల సేవకులందరి ఆహారం గురించి శ్రద్ధ వహిస్తాడు. ఓబద్యా కష్టపడి పని చేస్తాడు. అతడు రాజుకు మంచి సేవకుడిగా ఉండడానికి ప్రయత్నిస్తాడు. అయినా తరచు అతడు విచారంగా ఉంటాడు. ఎందుకంటే రాజు రాణీలకు దైవ భక్తి లేదు. నీకు గుర్తుందా? వీళ్లు యెహోవా దేవున్ని ప్రార్థించరు. వాళ్లాయనకు లోబడరు. బయలు దేవతలకు మొక్కుతారు.

ఓబద్యా మాత్రం యెహోవా దేవునికి ప్రార్థన చేస్తాడు. అతడు బయలు విగ్రహం ముందు మోకరించడు. అంటే అతడు యెహోవా దేవున్నే గౌరవించి ప్రేమిస్తాడన్న మాట.

ఓబద్యా నిజంగా సంతోషంతో ఉన్నాడు కదా? చాలకాలం క్రిందట దేవుడు అతనికి నూతన హృదయాన్ని యిచ్చాడు. అతడింకా బాలునిగ ఉండినప్పుడే ఇది జరిగింది. నీవు పెద్దవాడివయినా చిన్న బాలునివయినా దేవుడు నీకు కొత్తమనసును ఇవ్వగలడు. ఓబద్యావలె దేవునికి భయపడే మనసునిమ్మని ఆయనను ప్రార్థించు.

పట్టణం వెలుపట పర్వతాలున్నాయి. వాటిలో గుహలున్నాయి. సాధారణంగా ఇందులో ఎవరూ నివసించరు. అక్కడ చాల చీకటిగా ఉంటుంది. అయినా బాగ చూడండి...అక్కడ ఆ చీకటి గుహలో కొందరున్నారు. చాల మంది పురుషులు అక్కడ నివాసం చేస్తున్నారు. అందరూ కలిసి యాభైమంది ఉంటారు. మరో గుహలో మరో యాభై ఉన్నారు.

వీళ్లంతా యెవరు? ఇక్కడ నివసిస్తున్నారెందుకు? వీళ్లంతా ప్రవక్తలు. దేవుని సేవకులు. వాళ్లు తమ ఇళ్లల్లో నివసించలేరు. అది చాల ప్రమాదకరం. దేశంలో ఉన్న ప్రకర్తలందరినీ పట్టుకోవాలని అహాబు రాజు సేవకులు వెదుకుతున్నారు. యెజెబెలు రాణి - యెహోవా ప్రవక్తలందర్నీ చంపండి అని చెప్పింది.

ఈ కారణం వల్ల ప్రవక్తలంతా గుహల్లో దాగున్నారు. అప్పుడు సైనికులువారిని పట్టుకోలేరు. వాళ్లంతా గుహల్లోనే తిని, అక్కడే పండుకుంటున్నారు. బైటికి వెళ్లే ధైర్యం వాళ్లకిలేదు. ఒకవేళ సైనికులు చూస్తే!...

మరి వాళ్లకి తినడానికి రొట్టెలెలా దొరుకుతవి? వాళ్లు ప్రతి రోజూ భోజనం చేయాలి కదా?

ఓబద్యా రాజమందిరంలో హడావుడిగ ఉన్నాడు. రాజుకూ, రాణికీ, వాళ్ల సేవకులందరికీ ఆహారం సమృద్ధిగా ఉందా లేదా అతడు చూడాలి. అయితే అటు చూడండి, ఓబద్యా ఏం చేస్తున్నాడు? అతడు




కొన్ని పెద్ద సంచులు తీసికొన్నాడు. అతడు వాటిని రొట్టెలతో నింపుతున్నాడు. వాటిని రాజగృహం బయటికి తీసుకెళ్లాడు. తాను వెళ్తుండగ ఎవ్వరూచూడకుండా జాగ్రత్తపడ్డాడు. అతడు వేగంగా నగరం దాటి వెళ్లాడు. ఆ గుహలను చేరుకున్నారు. అతడు రావడం ప్రవక్తలు చూచారు. వాళ్లెంత సంతోషించారో! ఓబద్యా వాళ్లందరికీ ఆహారం ఇస్తాడు. కాబట్టి ప్రతీదినం జరుగుతున్నది యిదే. అనుదినం ఓబద్యా వాళ్లకి రొట్టెలు, నీళ్లు యిచ్చాడు.

ఇలా చేయడం అతనికి ప్రమాదాన్ని తేవచ్చు. ఆహాబుకు ఈవిషయం తెలిస్తే? లేక యెజెబెలు ఈ సంగతి కనుగొంటే? అబ్బో, అలాంటిది జరిగితే ఓబద్యాను వెంటనే చంపివేస్తారు!

అయినప్పటికీ అతడలాగే చేస్తూ వచ్చాడు. ఎందుకంటే అతడు ప్రవక్తలను ప్రేమించాడు. వాళ్లు దేవుని సేవకులవడమే దానికి కారణం! అవును ఓబద్యా దేవున్ని ప్రేమించాడని మనం గ్రహించగలము.

బహు విచిత్రమయిన సంగతియేమో నీకు తెలుసా? ఆహాబుగాని యెజెబెలు కాని దీని సంగతి యేమాత్రం కనుగొనలేక పోయారు. దేవుడు తన ప్రజలను కాపాడుతాడు. సైనికులు కూడ ప్రవక్తలను కనుగొనలేక పోయారు. దేవుడే అలాచేశాడు. దేవుడు తన పిల్లలను, సేవకులను ఎలా కాపాడుతాడో చూచారా?



70. విధవరాలి ఇంటిలో ఏలీయా

ఏలీయాను ప్రతిరోజూ కాకులు ఎలా పోషించాయో నీకు గుర్తున్నదా? పర్వతంలో నుండి ప్రవహించే సెలయేరు అతనికి త్రాగు నీటిని ఎలా అందిచ్చిందో జ్ఞాపకం ఉంది కదూ?

ఇప్పుడిక ఆ ఏటిలో నీళ్లులేవు. అది ఎండిపోయింది. ఏలీయాకు త్రాగడానికి నీళ్లులేవు. ఎండవేడిమి చాల అధికంగా ఉంది. సూర్యుడు తీవ్రంగ ప్రకాశిస్తున్నాడు. ఏలీయాకు చాల దాహంవేస్తూండాలి. అయితే దేవుడివన్నీ చూస్తున్నాడు.



దేవుడు "ఏలీయా, నీవు మరో దేశానికి వెళ్లు. అది చాల దూరదేశం. అక్కడో స్త్రీ నివసిస్తోంది. ఇప్పుడామెకు భర్తలేడు. ఆమె విధవరాలు. ఆమె నిన్ను పరామర్శిస్తుంది" అని చెప్పాడు.

చాల దూరం ప్రయాణం చేసి ఏలీయా ఆ దూర ప్రాంతం చేరుకున్నాడు. అక్కడ చూడండి. ఒక స్త్రీ ఏదో పని చేస్తోంది. ఆమె కట్టె పుల్లలు ఏరుకుంటున్నది. ఏలీయా ఆమె దగ్గరకు వెళ్లి. అమ్మా, నాకు కొంచం మంచి నీళ్లిస్తావా? నాకు చాల దాహం వేస్తోంది, అన్నాడు. ఆమె నీళ్లు ఇవ్వడానికి ఒప్పుకున్నది. నీళ్లు తేడానికి బయలుదేరింది. అయితే ఏలీయా తిరిగి ఏదో చెప్పాడు. "నాకు కొంచం రొట్టె తీసుకురాగలవా? నాకు ఆకలి కూడ వేస్తోంది" అన్నాడు. ఆ స్త్రీ విచారంగా అతని వేపు చూచి "నా వద్ద రొట్టెలు లేవు. తొట్టిలో కొంచం పిండి, బుడ్డిలో కొద్దిగ నూనె మాత్రమే ఉన్నాయి. నేను పుల్లలతో మంటచేసి రొట్టె కాల్చుతాను. అది నాకు, నా కుమారునికి మాత్రమే. దాంతో మాకున్న కొంచెం అయిపోతుంది. ఆ తరువాత మేము ఆకలితో చచ్చిపోతాము" అని చెప్పింది.

మరి ఏలీయా ఏం చెబుతున్నాడో వినండి. తిరిగి వెళ్లినాకొక రొట్టె ముందుగా కాల్చు. తరువాత నీకూ నీ కుమారునికీ తయారు చేయి. ఎందుకంటే నీ తొట్టిలో పిండీ, బుడ్డిలో నూనె తరిగిపోవని యెహోవా దేవుడు నాకు చెప్పాడు.

ఆ స్త్రీ ఏలీయా దేవుని సేవకుడని నమ్మింది. కాబట్టి ఆమె త్వరగా ఇల్లు చేరింది. పొయ్యి వెలిగించింది. రొట్టెలు కాల్చడం మొదలు పెట్టింది. మొదట ఏలీయా కోసం ఒక రొట్టె. తరువాత తన కోసం ఒకటి, కుమారునికోసం ఒకటి --- ఇంకా తొట్టిలో పిండి మిగిలింది. ముందు ఎంత ఉందో అంతే పిండి ఉంది. మరి బుడ్డిలో చూడండి --- నూనె కూడ అలాగే ఉంది. ఇదెంత అద్భుతం! ఆమె ప్రతి రోజూ రొట్టెలు కాల్చుతూనే ఉంది. తనకోసం, కుమారుని కోసం, ఏలీయా కోసం కూడ. ఎందుకంటే అతడు ఇప్పుడు వాళ్ల యింటిలోనే ఉంటున్నాడు. వాళ్లా చిన్న ఇంటిలో ఎంత సంతోషంగా ఉన్నారు! దేవుడు వాళ్ల పట్ల ఎంత మేలు చేశాడు!



ఒక రోజు ఆ స్త్రీ చాల కలవరపడుతున్నాది. ఆమె కొడుకు జబ్బుపడ్డాడు. వాడు పాలిపోయాడు. చాల మెల్లగ ఊపిరి పీల్చి ఒదులుతున్నాడు. కొంత సేపటికి ఊపరి పీల్చడం మానేసాడు. అతడు చచ్చిపోయాడు!

ఆ తల్లి ఎంతో దుఃఖిస్తున్నది. ఆమె ఏలీయాతో ఇప్పుడు ప్రియమైన నా కొడుకు చచ్చిపోయాడు. అది నేను చేసిన పాపానికి దేవుడిచ్చిన శిక్ష కావచ్చు, అంది. దానికి ఏలీయా - నీకుమారుని నాకు యివ్వు అని చెప్పి ఆ శవం తీసికొని తన గదిలోకి వెళ్లాడు. దానిని తన మంచం మీద పరుండబెట్టాడు. అదిగో వినండి. అతడు వినయంతో దేవునికి ప్రార్థన చేస్తున్నాడు. ఆ విధవరాలు ఎంత దుఃఖిస్తున్నదో దేవునికి చెప్పాడు. ఆ కుమారుని బ్రదికేలా చేయమని విన్నవించాడు.

అరె, అటు చూడండి. ఆ చచ్చిపోయిన బాలుని చూడండి. అతడు కదలు తున్నాడు! ఊపిరి తీస్తున్నాడు! కండ్లు తెరిచాడు. తిరిగి ప్రాణం వచ్చింది!

బ్రదికిన కుమారుని తీసుకొని ఏలీయా తల్లికి అప్పచెప్పాడు. "చూడు, నీ కుమారుడు తిరిగి బ్రదికాడు" అన్నాడు. తల్లి ఆ కుమారుని కౌగలించుకొంది. ముద్దాడింది. సంతోషం పట్టలేక ఏడ్చింది. ఆమె ఏలీయాతో "నీవు నిజంగా దైవ సేవకుడవని ఇప్పుడు నాకు తెలిసింది" అన్నది.

దేవుడు ఈమెకూ, కుమారునికీ మేలు చేసాడు కదూ? దీనికంటె గొప్ప అద్భుతం యేమో తెలుసా? దేవుడు మనకు క్రొత్త మనసును యివ్వడం. ఆయన ఒక్కడే దానిని చేయగలడు. ఆయనే సర్వశక్తిగల దేవుడు. ఎవరూ నశించడం ఆయనకిష్టంలేదు. అందరూ మారుమనసు పొంది ఆయనను నమ్మాలి. దీనికోసం ప్రార్థించడం మరిచిపోవు కదూ?

71. యెహోవాయే దేవుడు!

దేవుడు ఏలీయాతో ఇలా అన్నాడు "ఏలీయా, నీవు మళ్లీ ఆహాబు రాజు దగ్గరికి వెళ్లాలి. నేను తిరిగి వర్షం కురిపించబోతున్నాను. నేను విధించిన శిక్షముగిసింది."

చాల దూరం ప్రయాణం చేసి ఏలీయా అహాబు రాజును తిరిగి కలుసుకున్నాడు. రాజు ఏలీయాపై చాల కోపంగా ఉన్నాడు. అతడు ఏలీయాతో "ఈ కీడంతటికి కారణం నువ్వే. మమ్ములను దుఃఖంలో ముంచింది నువ్వే" అన్నాడు.

రాజు మాటలకు ఏలీయా ఎంత మాత్రం భయపడలేదు. "అతడు నీవే దీనికి కారణం. ఎందుకంటే నీవు యెహోవా దేవున్ని సేవించడం లేదు. కాబట్టి రాజా, విను. నీవు ఆ ఎత్తైన పర్వతం మీదికి రావాలి. ప్రజలందరూ రావాలి. బయలు దేవత ప్రవక్తలు కూడ రావాలి", అన్నాడు.

అహాబు అలాగే చేసాడు. కొంతసేపయ్యాక కర్మెలు పర్వతం అంతా హడావిడిగా ఉంది. అక్కడ చాల మంది చేరారు. బయలు ప్రవక్తలు కూడ వచ్చారు. వాళ్లు యెహోవా ప్రవక్తలు కారు. వాళ్లు అబద్ధ ప్రవక్తలు. ఏలీయా ప్రజలతో ఇలా అన్నాడు. "మీరు యెహోవా దేవుని, బయలును కూడ పూజించాలని అనుకుంటున్నారు. కాని అది సాధ్యం కాదు. కాబట్టి ఇప్పుడు మీరు ఎవరిని సేవించాలనుకుంటున్నారు? యెహోవా దేవుని పూజిస్తారా? లేక బయలునా?" జవాబు యివ్వడానికి ప్రజలు బయపడ్డారు. అప్పుడు ఏలీయా "ఎవరు నిజమైన దేవుడో మీరీదినం చూస్తారు. యెహోవా? లేదా బయలు?" అన్నాడు. ఏలీయా బయలు ప్రవక్తలతో ఇంకా యిలా అన్నాడు. "మీరు బయలుకు ఒక జంతువును బలియివ్వండి. నేను యెహోవా దేవునికి బలి అర్పిస్తాను. బలిని దహించడానికి మనం అగ్ని ముట్టించరాదు. మీ అర్పణను దహించమని బయలుకు మీరు ప్రార్ధన చేయండి. నాబలిని దహించమని నేను యెహోవాకు ప్రార్ధన చేస్తాను. అప్పుడు ఏ దేవుడు అగ్ని పంపగలడో చూద్దాము. బయలు అగ్ని పంపితే అతడే నిజమయిన దేవుడు. యెహోవా పంపితే ఆయనే నిజమయిన దేవుడు."

ఇది మంచి పరీక్ష అని ప్రజలంతా ఒప్పుకున్నారు. మొదట బయలు ప్రవక్తలు బలి సిద్ధం చేస్తారు. వాళ్లు బలి పీఠం మీద కట్టెలు పేర్చి జంతువును చంపి దాని మీద పెట్టారు. అప్పుడు ప్రార్ధన చేయడం ప్రారంభించారు. వాళ్లు కేకలు వినండి. "బయలూ, మాకు జవాబివ్వు, అగ్ని పంపించు."

మరి బయలు అగ్నిపంపాడా? లేదు. పంపలేదు. ఎందుకంటే అతడు దేవుడు కాడు. అతడు లేనేలేడు!

ప్రవక్తలు మరింత గట్టిగ కేకలు వేస్తున్నారు. గంటలు తరబడి అరిచారు కాని అగ్ని మాత్రం దిగిరాలేదు! అప్పుడు ఏలీయా వారితో యిలా చెప్పాడు "ఇప్పుడు నేను అర్పణను సిద్ధం చేస్తాను. మీరు వచ్చి చూడండి" ఏలీయా బలి పీఠం మీద, చంపిన జంతువునుంచాడు. దానిపై నీళ్లు కుమ్మరించాడు. అంతా తడిసి పోయింది. ఏలీయా చేసింది ప్రజలంతా చూచారు. వినండి. అతడు ప్రార్ధన చేస్తున్నాడు. చాల వినయంగా ప్రార్ధించాడు. గట్టిగ కేకలు వేయడం లేదు. దేవుడు వింటాడని తెలుసు.

"దేవా, నీవు అబ్రాహాము, ఇస్సాకు, యాకోబుల దేవుడవు. నీవు ఇశ్రాయేలుకును దేవుడవే. నీవే నిజమయిన దేవుడవని చూపించు. నీవే సేవించదగిన వాడవు. నా ప్రార్ధన ఆలకించు. దేవా నా మొర ఆలకించు" అని ప్రార్ధించాడు.

హఠాత్తుగా! ప్రజలంతా నిర్ఘాంతపోయారు. అగ్ని ఆకాశం నుండి దిగి వచ్చింది. అది ఏలీయా బలిపశువుపై పడింది. అది కాలడం మొదలుపెట్టింది. బలి పశువూ, కట్టెలూ మండుతున్నవి. చివరికి బలిపీఠం రాళ్లు కూడ మండుతున్నవి. అగ్నికి నీళ్లు కూడ ఆవిరి అయ్యాయి. ఇదెంత అద్భుతం!

ప్రజలంతా "యెహోవాయే దేవుడు! యెహోవాయే దేవుడు!" అని కేకలు వేసారు. నిజమే, వాళ్లు తమ కళ్లతో అది చూచారు, యెహోవా అగ్ని నిచ్చాడు కాని బయలు ఇవ్వలేకపోయాడు!



అప్పుడు ఏలీయా ప్రజలతో "మీరిప్పుడు బయలు ప్రవక్తలందరినీ పట్టుకోండి" అన్నాడు. వాళ్లు అలానే చేశారు. అప్పుడు వాళ్లందరినీ చంపేసారు.

"మీరంతా తిరిగి ఇళ్లకు వెళ్లండి. ఎందుకంటే ఇప్పుడు దేవుడు మీకు వర్షం యిస్తాడు" అని ఏలీయా చెప్పాడు.

అయితే ఏలీయా ఇంతటితో వదిలిపెట్టలేదు. అతడేమి చేస్తున్నాడు? ప్రార్ధన చేస్తున్నాడు. అతడు దేవుని ముందు మోకరించాడు. తన తలను మోకాళ్ల మధ్య ఉంచాడు. అతడంతగా విధేయుడయ్యాడు. అప్పుడు వర్షం కురిపించమని దేవుని ప్రార్ధించాడు.

ఆకాశం మీద మేఘం వచ్చిందా అని చూడమని ఏలీయా తన సేవకుల్ని పంపాడు. లేదు, ఇంకా రాలేదు. అతడు మళ్లీ ప్రార్ధన చేసాడు. అయినా మేఘం రాలేదు. అతడు తిరిగి ప్రార్ధించాడు. ఏడుమారులు ప్రార్ధన చేశాడు. అప్పుడు సేకునికి ఒక చిన్న మేఘం కనిపించింది. అది పెద్దపెద్దగా ఎదిగింది. ఆకాశమంతా మేఘాలతో నల్లగా తయారయ్యింది. అప్పుడు---వర్షం కురవడం ప్రారంభం అయ్యింది. చాల జోరుగ, చాల సేపు కురిసింది.

కరవు ముగిసింది. సమస్తం తిరిగి ఎదిగి, పూయడం మొదలయ్యింది. గడ్డి, గోధుమ - అన్నీ! శిక్ష ముగిసింది. పాపుల పట్ల దేవుడు దయ చూపుతాడు. ఇశ్రాయేలు ప్రజలు దీనికి అర్హులని మీరనుకుంటున్నారా?

దేవుని శిక్ష మనుష్యులను మార్చితే ఎంత బాగుండును! ప్రజలిపుడు దేవుని వైపు తిరిగితే ఎంత బాగుండును! ఎందుకంటే యెహోవా ఒక్కడే దేవుడు.

మనం కూడ తనను సేవించాలని దేవుడు ఆశిస్తున్నాడు. హృదయ పూర్వకంగా! అయనను మాత్రమే సేవించాలి.

ఈ కారణంగా మనకు క్రొత్త మనసు కావాలి. ఎందుకంటే వాళ్లే దేవుని సంతోషంగా సేవించగలరు. వాళ్లే నిజంగా ఆనంద మయ జీవితం గడపగలరు!

72. కుష్టివాడైన నయమాను స్వస్థపడుట

చాల దూరదేశంలో ఒక పెద్ద భవనం ఉంది. అందులో చాల ధనవంతుడయిన ఒక వ్యక్తి నివసిస్తున్నాడు. అతడు చాల ఘనత కలవాడు. ఆ దేశంలో ఉన్న సైన్యానికి అధిపతి. పేరు నయమాను.

అయినా అతనికి సంతోషం లేదు. ఎందుకంటే అతడు కుష్టురోగి. అతని ముఖం మీద పెద్ద కురుపులున్నాయి. అవి అతని చేతుల మీదా కాళ్ల మీద కూడ ఉన్నాయి. అవును, శరీరమంతటిపైనా ఉన్నాయి. అతన్ని ఎవ్వరూ బాగుచేయలేరు. చివరికి మంచి తెలివైన వైద్యులు కూడ నయం చెయలేరు. అది ఇంకా ఎక్కువగుతోంది. చివరికతడు చచ్చిపోవలసి ఉంటుంది.

మనుష్యులకు జబ్బు లెందుకు వస్తాయో తెలుసా? పాపం వలన. నీవు ఆరోగ్యంగా ఉన్నావంటే అదో అద్భుతం! ఆరోగ్యంగా ఉండే హక్కు ఎవ్వరికీ లేదు. అది మరువకు.

నయమాను గృహంలో మరొకరున్నారు. అదో పనిపిల్ల. ఆమె నయమాను భార్యకు చిన్న చిన్న పనులు చేసి పెడుతుంది. ఆమె ఇశ్రాయేలు దేశం నుండి వచ్చింది. ఆమె తనకు దూరంగా ఉన్న ఈ పరదదేశానికి ఎలా వచ్చి పడింది? ఆమె తన తల్లిదండ్రులతో ఎందుకు ఉండదు?

అయ్యో, అదో విచారకరమయిన గాధ. వినండి. ఒకనాడు సైనికులు ఇశ్రాయేలు దేశంపైకి వచ్చారు. వాళ్లు నయమాను సైనికులు. వాళ్లు దేశాన్ని దోచుకోడానికి వచ్చారు. వాళ్లు రకరకాల వస్తువులు తీసుకున్నారు. అందులో ఈ చిన్నబాలిక కూడ ఉంది. అదూర దేశానికి తీసుకపోయారు. అక్కడ ఆమె నయమాను ఇంటిలో పనిపిల్లగ మారింది. ఆమెను తిరిగి తల్లిదండ్రుల వద్దకు పోనీయలేదు. ఇక ఎప్పటికీ వెళ్లలేదేమో!

నీ ఇంటిలో, నీ తల్లిదండ్రులతో ఉండడం సంతోషం కదూ?

ఆ బాలిక నయమాను అనారోగ్యంగా ఉండడం చూచింది. అది ఆమెకు చాల విచారం కలిగించింది. ఒకనాడు ఆమె అతని భార్యతో ఇలా చెప్పింది. "నాదేశంలో ఒక ప్రవక్త ఉన్నాడు. అతడు యెహోవా దేవుని సేవకుడు. అతని పేరు ఎలీషా. నా యజమాని నయమాను అతని దగ్గరకు వెళ్తే తిరిగి ఆరోగ్యం పొందవచ్చు. ఎందుకంటే దేవుడు ఆ ప్రవక్త ద్వారా చాలా అద్భుతాలు చేసాడు."

ఆ బాలిక ఎంత మంచిదో చూచావా? "నయమానుకు ఈ శిక్ష తగినదే. ఎందుకంటే అతని సైనికులు నన్నెత్తుకువచ్చారు". అని అనుకోలేదు. ఆమె అలా తలంచలేదు. నయమానుకు మేలు జరగాలని ఆశించింది.

బైబిలు చెప్పేది కూడ అదే. దేవుడు ఏమంటున్నాడంటే "మనుష్యులు నీకు కీడు చేస్తే నీవు తిరిగి కీడు చేయకూడదు"

నయమాను భార్య, అతనికి సంగతి తెలియజేసింది. నయమాను బహుశ ఇది నిజమేనేమో. నేను ఆ ప్రవక్తను తప్పక చూడాలి, అనుకున్నాడు.

కాబట్టి అతడు ప్రయాణమయ్యాడు. ఒక చక్కని రథంలో సేవకులతో వెళ్లాడు. మంచి కానుకలు తీసుకవెళ్లాడు. అవి ఎలీషా కోసం.

నయమాను ఎలీషాను చూడడం ఎంతమంచిది! నిజంగా అతడు యెహోవాను చూడబోతున్నాడు. ఎందుకంటే ఎలీషా దేవుని సేవకుడు. మనకు జబ్బు చేసినపుడు కూడ మనం అదే చేయాలి. మనలను తిరిగి ఆరోగ్యవంతులముగా చేయమని ప్రార్థించాలి. ఎందుకంటే వైద్యులు తమంత తాము రోగులను బాగు చేయలేదు.

చాల దూరం ప్రయాణం చేసాక చివరికి నయమాను ఎలీషా ఇల్లు చేరారు. అతడు ఇలా అనుకున్నాడు, - ఎలీషా తప్పక బయటికి వచ్చివందనం చేస్తాడు. అప్పుడు నాకురుపుల మీద తన చేతిని అడిస్తాడు. నాకోసం ప్రార్థన చేస్తాడు. అయితే ఎలీషా తనయింటిలోనే ఉండిపోయాడు. నయమానును చూడమని తన సేవకుడు గెహజీని బయటికి పంపాడు. గెహజి అతన్ని చూచి "నీవు యొర్దాను నదికి వెళ్లి అందులో ఏడు సార్లు

స్నానం చేయి. అప్పుడు నీకు స్వస్థత కలుగుతుంది" అని చెప్పాడు.


నయమానుకు చాల కోపం వచ్చింది! అతడు యొర్దాను నదిలో స్నానం చేయాలా? అదెలా సహాయం చేస్తుంది? నేనింతకు ముందు ఎన్నోసార్లు స్నానం చేసాను. మాదేశంలోని నదులు ఈ యొర్దానుకన్న ఎంతో గొప్పవి. నేనిది చేయను. నా సొంత దేశానికి తిరిగిపోతాను అన్నాడు. నయమాను తిరిగి వెళ్లిపోవడానికి సిద్ధపడ్డాడు.

అయితే నయమాను సేవకులు - నయమానూ, నీవు కాస్త ఓపిక పట్టి ప్రవక్త చెప్పినట్టు చేయరాదా? ఈ పని చాల సులువైనది కదా? ఇది పని చేస్తుందేమో ఎవరికి తెలుసు? అన్నాడు.

సరే అలాగే ప్రయత్నం చేద్దాం - అనుకొని నయమాను యొర్దాను నదికి వెళ్లాడు. నీటిలోకి దిగాడు. స్నానం చేసాడు. మళ్లీ మునిగాడు. మరోసారి, ఇలా ఏడుసార్లు స్నానమాడాడు. అప్పుడు నీటినుండి బయటికి వచ్చాడు. అరె, చూడండి ----- అతని పుండ్లు అన్నీ మాయమయ్యాయి! శరీరమంతా ఆరోగ్యవంతమయ్యింది. ఎంత గొప్ప అద్భుతం! నయమాను చాల సంతోషంగా ఉన్నాడు! ఎలీషా సేవించే దేవుడు ఈ కార్యం చేసాడు. ఎలీషా అతనికోసం ప్రార్థన చేసాడు. తాను వెనక్కి వెళ్లి అతనికి కృతజ్ఞత చెప్పాలి. వెంటనే అతడు తన రథాన్ని ఎలీషా ఇంటికి మరలించాడు. అతడు ఎలీషాతో - నీ దేవుడు సర్వశక్తిగలవాడు. నేను నీకు మంచి కానుకలిస్తాను. ఎందుకంటే నీవు నిజంగా దేవుని సేవకుడవు, అన్నాడు.

అయితే ఎలీషా - ఫర్వాలేదు. నాకేమీ అవసరం లేదు. ఎందుకంటే నిన్ను స్వస్థపరచింది నేను కాదు. దేవుడే ఇది చేశాడు అన్నాడు. అవును, ఈ మాటనిజమే. దేవుడు మాత్రమే రోగులను బాగుచేయగలడు. ఆయనే సహాయం చేయగలడు. మనుష్యులు సాయం చేయకపోయినా ఆయనే చేస్తాడు. మన దుష్ట హృదయాన్ని తీసివేసి పవిత్రహృదయం ఇచ్చేవాడు దేవుడే.

నయమాను - ఇప్పటి నుండి నేను యెహోవా దేవుడ్ని మాత్రమే నా దేశంలో ఆరాధిస్తాను అని చెప్పి తన స్వదేశానికి తిరిగి వెళ్లాడు.



73. అవిధేయుడైన దైవసేవకుడు, యోనా

యోనా ఒక ప్రవక్త, దైవ సేవకుడు.

దేవుడు ఒక నాడు అతనితో యిలా చెప్పాడు. యోనా, నీవు తప్పక నీనెవేకు వెళ్లాలి. అది చాల పెద్ద నగరం. అందులో చాల మంది ప్రజలు ఉన్నారు. వాళ్లంతా ఎన్నో పాపాలు చేస్తున్నారు. ఆ పనులు చేయడం మానమని వాళ్లకి చెప్ప లేదా నేను వాళ్లని శిక్షిస్తాను, అని చెప్పాడు.

యోనా ప్రయాణమయ్యాడు. అయితే చూడండి, అతడు వేరు మార్గం పట్టి మరో దిక్కుకు వెళ్తున్నాడు! నీనెవేకు పోవడంలేదు. అతడు నీనెవేకు దూరంగా, మరింత దూరంగా వెళ్తున్నాడు. అతడెందుకలా చేస్తున్నాడు? ఎందుకంటే అక్కడికి వెళ్లడం యోనాకు యిష్టంలేదు. నీనెవె ప్రజలు ఇశ్రాయేలీయులకు శత్రువులు. శత్రువుల వద్దకు వెళ్లడం అతనికిష్టంలేదు. ''వాళ్లను అలాగే పాపం చేయనివ్వాలి. దేవుడు వాళ్లని శిక్షించాలి. నేను మాత్రం వెళ్లను'' అని యోనా నిశ్చయించాడు. కాబట్టి అతడు అవిధేయుడయిన దైవ సేవకుడు. దేవునికి లోబడకపోవడం గొప్పపాపం. మన అందరి హృదయాల్లో ఈ పాపం ఉంటుంది.

యోనా సముద్ర తీరానికి వచ్చాడు. అతడు ఇక ముందుకు పోలేడు. తీరంలో ఒక ఓడ ఎక్కడికో వెళ్లడానికి సిద్ధంగా ఉంది. ఓడలోని వారు ప్రయాణమవుతున్నారు. తాను కూడ రావచ్చునా అని యోనా అడిగాడు. రావచ్చు, వెంటనే అతడు డబ్బు చెల్లించాడు. తరువాత అది కదిలింది. యోనా వెళ్లి ఓడ అడుగు భాగంలో నిద్రించడానికి పండుకున్నాడు. అతడు చాల అలసి ఉన్నాడు.

మొదట సూర్యుడు చక్కగా ప్రకాశించాడు. అయితే త్వరలోనే ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. నల్లని బరువైన మేఘాలు. గాలి మరింత బలంగా వీస్తోంది. భయంకరమయిన తుఫాను చెలరేగింది. ఆ గాలి వీచే శబ్దం వినండి! ఆ గాలి వలన అలలు ఎగిరి పడుతున్నాయి. అవి ఓడను గట్టిగ కొడుతూన్నాయి, గాలి, అలలు కలిసి ఓడను బద్దలు చేయవచ్చు!

ఓడలో ఉన్న వాళ్లంతా భయపడుతున్నారు! ఒకవేళ ఓడ పగిలిపోతే? అప్పుడు అందరూ నీళ్లల్లో మునిగిపోతారు! వాళ్లు తమ తమ దేవుళ్లకు ప్రార్థన చేయడం మొదలుపెట్టారు. అయితే అవి విగ్రహాలు మాత్రమే. అవి ఎటువంటి సహాయం చేయలేవు.

మరి యోనా మాట యేమిటి? అతడు చక్కగా నిద్రపోతున్నాడు. తుఫాను సంగతి అతనికేమీ తెలియదు.

ఓడ నావికుడు క్రింది భాగానికి వెళ్లాడు. అతడు నిద్రపోతున్న యోనాను చూచి ''ఓ నిద్రబోతా లే. వెళ్లి నీ దేవునికి ప్రార్థన చేయి. ఒకవేళ ఆయన మనలను రక్షించవచ్చు,'' అన్నాడు.

యోనా లేచాడు. ఖంగారుపడ్డాడు. అబ్బో, ఎంత గొప్ప తుఫాను! ఆ ఎత్తయిన అలను చూడండి! దీనిని చేస్తున్నది దేవుడే. ఎందుకంటే ఆయన మాట తాను వినలేదు.

నీవేమి చేసావని ఓడలోనున్న మిగిలిన వాళ్లు యోనాను ప్రశ్నించారు. యోనా తాను అవిధేయతను చూపిన సంగతి వాళ్లకి ఉన్నది ఉన్నట్టు చెప్పాడు. దానికి దేవుడిచ్చిన శిక్ష ఇది అని కూడ చెప్పాడు.

''మరి మేమేమి చేయాలి? ఎందుకంటే తుఫాను అంతకంతకూ అధికమవుతున్నది'' అని వాళ్లు ప్రశ్నించారు. ''మీరు నన్ను సముద్రంలో పడవేయండి. అదే నాకు తగిన శిక్ష. అప్పుడు తుఫాను అణిగిపోతుంది'' అని యోనా జవాబిచ్చాడు.

అయితే ఆ మనుష్యులు అలా చేయడానికి యిష్టపడలేదు. ఎందుకంటే యోనా సముద్రంలో మునిగిపోతాడు!

వాళ్లు ఓడను ఒడ్డు చేర్చడానికి చాల ప్రయత్నించారు. కాని లాభంలేకపోయింది. అలల తాకిడి ఎక్కువయింది. గాలి, తుఫాను పెరిగిపోయాయి. అప్పుడిక వేరు మార్గం లేక ఆ మనుష్యులు యోనాను ఎత్తి సముద్రంలో పారవేశారు. అయితే ముందు వాళ్లు ప్రార్థన చేసారు. ఎందుకంటే ఇలా చేయవలసి వచ్చినందుకు వాళ్లు కలవరపడ్డారు.

అప్పుడు ----- హఠాత్తుగా సముద్రం సర్దుమణిగింది. ఇప్పుడు ఎగిరివడే అలలు లేవు. తుఫాను మాయమయ్యింది. ఇది దేవుని కార్యం. ఓడలోని మనుష్యులు వినయంతో దేవునికి వందనాలు చెల్లించి,

బలి అర్పించారు. వాళ్లు ప్రశాంతంగా ప్రయాణం కొన సాగించారు.


మరి యోనా మాట యేమిటి? అతడు నల్లని నీళ్లలో దిగజారుతున్నాడు. అతడిప్పుడు మునిగి పోతాడా? లేదు. అది దేవుని చిత్తం కాదు. ఒక గొప్ప చేప అతనివైపుగ ఈదుకొని వస్తోంది. అది తన నోరు తెరచి --- యోనాను మింగేసింది. చేప అతన్ని తినలేదు. చేప కడుపులోకి చేరినా యోనా ఇంకా బ్రదికే ఉన్నాడు. ఇదో పెద్ద అద్భుతం కాదా? చేప కడుపులో ఉండి యోనా దేవుడికి ప్రార్ధన చేసాడు. దేవునికి లోబడనందుకతడు విచారించాడు. తన పాపం నిమిత్తం కలవరపడ్డాడు. వినయంతో దేవుని క్షమాపణ కోరాడు. దేవుడతని మొరవిన్నాడు.

కొద్దిసేపయ్యాక ఆ చేప ఒడ్డుకు వచ్చింది. యోనాను బయటికి కక్కివేసింది. అవును, చివరికి చేపకూడ దేవుని చిత్తానికి లోబడుతున్నది. యోనా సజీవుడుగా పొడి నేలమీద ఉన్నాడు.

యోనా చేప కడుపులో మూడు రాత్రులు మూడు పగళ్లు ఉన్నాడు. యేసు ప్రభువు కూడ చీకటి సమాధిలో మూడు రాత్రులు మూడు పగళ్లు ఉన్నాడు. యోనా సముద్రం నుండి బయటికి వచ్చాడు. యేసు ప్రభువు సమాధి నుండి బయటకు వచ్చారు. ఎందుకంటే ఆయన లేచాడు.

అందువలన అవిధేయులంతా క్షమాపణ కోసం దేవుని ప్రార్ధించాలి. సరిగా యోనా వలె ప్రార్ధించాలి. దేవుడు మన పాపాలను క్షమించగోరుతున్నాడు. యోనాను క్షమించినట్టే.

చాలసార్లు మనం కూడ లోబడము. మన తల్లిదండ్రులకూ దేవునికీ లోబడము. మనం కూడ క్షమాపణ అడుగుదామా? యోనా చేసినట్టు చేద్దామా?



74. యోనా నీనెవె పట్టణానికి వెళ్లుట

దేవుడు మళ్లీ యోనాతో - నీవు తప్పక నీనెనేకు వెళ్లాలని చెప్పాడు. కాబట్టి అతడు వెళ్లాడు. ఈసారి అతడు దేవుని ఇష్టప్రకారం చేస్తున్నాడు.

అతడు నీనెవే చేరాడు. అది ఎంత పెద్ద నగరం! దానిలో ఎంత మంది నివసిస్తున్నారు! యోనా అక్కడ దేవుని మాట ప్రకటిస్తున్నాడు. గుడిలో పాదిరిగారు బోధించినట్టే. అయితే అక్కడ గుడిలేదు. అతడు వీధులలో జనులకు బోధించాడు. "మరో నలభై దినాల్లో నీనెవే నాశనం అవుతుంది" అన్నాడు. "బలమైన గోడలు, ఇళ్లు కూలిపోతాయి."




నీనెవే ప్రజలు యోనా బోధవిన్నారు. వాళ్లు చాల భయపడ్డారు. అతని మాట నమ్మారు. ఎందుకంటే అది దేవుని నుండి వచ్చిన వర్తమానం. అది దేవుడిచ్చిన శిక్ష. ఎందుకంటే వాళ్లు చాల పాపాలు చేసారు. అవును, వాళ్లకీ శిక్ష తగినదే. పట్టణ ప్రజలిప్పుడు ఏం చేస్తారు? వాళ్లు దేవునికి ప్రార్థన చేయడం ప్రారంభించారు. తాము చేసిన పాపాలను బట్టి విచారిస్తున్నట్టు వాళ్లు కనపరిచారు. చివరికి రాజ భవనంలోనున్న రాజుకూడ ఇలా అన్నాడు. "బహుశ దేవుడు మనలను శిక్షించకపోవచ్చును. ఆయన మనలను రక్షించ వచ్చును."

ఇలా విచారించి వాళ్లంతా చెడ్డ పనులు చేయడం మానివేసారు. మనుష్యులు ఎలా ప్రవర్తిస్తున్నారో దేవుడు చూస్తాడు. ఆయన వారి ప్రార్థన ఆలకిస్తాడు. దేవుడు వారిని శిక్షించలేదు. ఆయన పాపుల పట్ల ఎంత దయచూపిస్తాడు!

యోనా ఆ పట్టణాన్ని వదిలి ఒక ఎత్తైె కొండ మీద కూర్చున్నాడు. అక్కడ నుండి ప్రజలకు ఎప్పుడు శిక్ష కలుగుతాదో చూడవచ్చు. అతడలా కనిపెడుతూ ఉన్నాడు. అయితే శిక్ష మాత్రం రాలేదు. అప్పుడు యోనా దేవునితో ఇలా అన్నాడు. "నీవు వాళ్లని శిక్షించలేదు. నీవుదయామయుడవని నాకు ముందే తెలుసు. నీవు వాళ్లని రక్షిస్తావు". యోనా నీనెవె పట్టణస్తులపై జాలిపడలేదు. వారికి శిక్ష కలగాలని కోరాడు. దానికోసం కనిపెట్టాడు. యోనా భయంకరంగా ప్రవర్తించాడు కదూ?

మనం ఎప్పుడూ ఇతరుల పట్ల దయ చూసిస్తామా? లేదు, చూపించం. యోనా పాపం మనలోనూ ఉంది. అటువంటి గుణం ఎంత చెడ్డదో దేవుడు యోనాకు ఇప్పుడు చూసిస్తున్నాడు. తరువాతి కథ వినండి.

అక్కడ చాల వేడిగ ఉంది. ఎండ వేడిమి తీవ్రంగా ఉంది. యోనా ఎండకు మాడుతున్నాడు. అటు చూడండి. అక్కడో చిన్న చెట్ట ఉంది. అది పెరుగుతురావడం నీవు చూడగలవు. అది యోనాకు సమీపంలో ఉంది. అది చాల వేగంగా ఎదుగుతోంది. అదిప్పటికే పెద్ద చెట్టు. దానికి కొమ్మలు ఆకులు ఉన్నాయి. ఎంత వింత! అదో వింత వృక్షం!



యోనా ఆ చెట్టు నీడలో హాయిగా ఉన్నాడు. ఇప్పుడతడు ఎండలో మాడడంలేదు. ఆ చెట్టునీడ చల్లగ ఉంది. మరునాడు తెల్లవారు జామున యోనా నిద్రలేచాడు. అతడేమి చూచాడు? చెట్టు ఆకులు వాడిపోయాయి! ఇక చెట్టు నీడలో అతడు కూర్చోలేడు. ఆ చెట్టు వేరును తినడానికి దేవుడొక పురుగును పంపాడు.

సూర్యుడు మళ్లీ తీవ్రంగా ప్రకాశిస్తున్నాడు. ఎండ తిన్నగా యోనాతలమీద పడుతున్నది. యోనా ఎండకు మాడిపోతున్నాడు! దానిని ఎంతమాత్రం భరించలేకపోతున్నాడు. చివరికి చచ్చిపోదామన్నంత కోపం వచ్చింది. ఎందుకంటే అద్భుతంగా మొలిచిన ఆ చెట్టు చచ్చిపోయింది. వినండి, దేవుడు యోనాతో మాట్లాడుతున్నాడు - యోనా, నేనీ వింత వృక్షాన్ని కాపాడి ఉంటే నీకు సంతోషం కలిగేది కదూ? అలా అయితే నేను నీనెవేలోని మనుషుల్నీ, పిల్లలనూ, జంతువులనూ ఎందుకు కాపాడకూడదు?

యెహోవా దేవుడు దయగలవాడు! అంటే ఆయన పాపులపట్ల దయ, కనికరం చూపిస్తాడు. ఆయన ఎంత కనికరం కలవాడో తెలుసా? మార్గం తప్పినవారి పట్ల దయను, మారు మనసుపొందిన పాపుల పట్ల కనికరాన్నీ ఆయన చూపిస్తాడు.

75. దానియేలు, అతని స్నేహితులు

అహాబురాజు దైవ భక్తిలేని రాజని గుర్తుందా? అతడు చచ్చిపోయాడు. అతని తరువాత చాలమంది రాజులు వచ్చారు. దాదాపు వాళ్లంతా దైవభక్తిలేని వాళ్లే. ప్రజలు ఇంకా విగ్రహాలను పూజిస్తూ బొమ్మలకు మ్రొక్కుతున్నారు.

దేవుడు - ఈ దేశాన్ని వాళ్ల పాపాన్ని బట్టి శిక్షిస్తాను అనుకున్నాడు. అయితే ఏం జరిగిందో తెలుసా? చాల దూరంగా ఉన్న ఓ దేశంలో దుర్మార్గుడైన ఓ రాజు ఉన్నాడు. అతనికి పెద్ద బలమైన సైన్యం ఉంది. వాళ్లు ఇశ్రాయేలీయుల మీద యుద్ధానికి వెళ్లారు. వాళ్లు ఇళ్లు నాశనం చేసారు. అందమయిన దేవాలయాన్ని పాడు చేసారు. నమస్తాన్నీ అగ్నితో కాల్చేసారు. చాలమందిని చంపారు. మిగిలిన వాళ్లని బంధించారు. వాళ్లంతా ఆ దూరదేశానికి, అంటే బబులోను దేశానికి తీసుకుపోబడ్డారు.

వాళ్లతో ఇంకా ఎవరు వెళ్లారో తెలుసా? దానియేలు, అతని ముగ్గురు మిత్రులు. వాళ్లు ముఖ్యమయిన యువకులు, రాకుమారులు. ఈ నలుగురు మిత్రులు రాజమందిరంలో నివసించబోతున్నారు. మిగిలిన రాకుమారులు కూడ అక్కడే ఉంటారు. వాళ్లక్కడ విద్య నేర్చుకొని జ్ఞానం సంపాదించాలి. ఎందుకంటే ఆ తరువాత వాళ్లు మంచి రాజసేవకులు కావాలి. వాళ్లంతా మంచి భోజనం తినాలని రాజు ఆజ్ఞ. వాళ్లకి మాంసం, ద్రాక్షారసం, అనేక రుచికరమైన పదార్థాలు ఇచ్చారు. దీనివల్ల వాళ్లు ఆరోగ్యంగా కనపడాలి. రాజసేవకులలో ఒకడు వారిని పరామర్శించేవాడు.


అయితే దానియేలూ అతని మిత్రులూ ఆ మాంసం తినడానికి యిష్టపడలేదు. ద్రాక్షారసం కూడ త్రాగలేదు. "దేవుడు దానిని తినడానికి అనుమతి యివ్వలేద"ని వారు చెప్పారు. ఎందుకంటే ఆ ఆహారాన్ని మొదట దేవతలకు నైవేద్యం పెట్టారు. కాబట్టి మేము దానిని తినడానికి అనుమతి లేదని అన్నారు.

ఆ నలుగురు మిత్రులూ - మాకు రొట్టె, నీళ్లు కాయగూరలు మాత్రమే ఇవ్వండి. మా దేవుడు వాటిని తినవచ్చునన్నాడు. అని చెప్పాడు.

మీరీ మాటలు విన్నారా? వాళ్లు దేవుని యిష్టప్రకారం జీవించాలని నిశ్చయించారు.

మనతోకూడ దేవుడు - నేను అనుమతించిన పనులనే మీరుచేయాలి. చివరికి మనుష్యులు మిమ్ములను చెడ్డ పనులు చేయమని చెప్పినా చేయకూడదు, అని చెబుతున్నాడు.

అయితే రాజు సేవకుడు ఏమన్నాడు? "మీరు రొట్టె, కాయగూరలు మాత్రమే తింటారా? వీలులేదు. నేను దానికి సెలవీయను. ఎందుకంటే మీరా పదార్థాలు మాత్రమే తింటే మిగిలిన బాలురకన్న బలహీనంగా కనపడతారు. అప్పుడు రాజు నా మీద కోపపడతాడు", అన్నాడు.



అందుకు దానియేలు ''మేము ఈ ఆహారాన్ని కొన్ని దినాలు మాత్రమే తిని చూడవచ్చా?'' అని అడిగాడు. దానికా అధికారి ఒప్పుకున్నాడు. అప్పుడు వాళ్లు రొట్టె కాయగూరలు, నీళ్లు మాత్రమే యిచ్చారు. కొన్నిరోజుల తరువాత వాళ్లెలా కనిపించారు? మిగిలిన రాకుమారులకంటె వీళ్లే ఆరోగ్యంగా కనిపించారు! ఆ అధికారికి ఇది అర్థం కాలేదు. ఇది దేవుని కార్యం. అప్పటి నుండి వాళ్లకి త్రాగడానికి నీళ్లు తినడానికి రొట్టె కాయగూరలు పెట్టారు. ఈ నలుగురు మిత్రులూ కష్టపడి చదవాలి. వాళ్లు దీనికి శాయశక్తులా శ్రమపడ్డారు. ఎందుకంటే దేవుడు కోరేది అదే. మనం శక్తివంచన లేకుండ పనిచేయాలని దేవుడు కోరుతున్నాడు. మనం సోమరులముగా ఉండడం ఆయన కిష్టంలేదు.


చాలా కాలం అయ్యాక ఈ రాకుమారులంతా ఏమి నేర్చుకున్నారో రాజు తెలుసుకోవాలనుకున్నాడు. అతడు వాళ్లని కఠినమయిన ప్రశ్నలు అడిగాడు. మిత్రులు అన్నిటికీ జవాబులిచ్చారు. వాళ్లు ఆదేశంలోని జ్ఞానులందరికన్న తెలివిగలవారు. ఇది కూడ దేవుని కార్యమే. దేవుడు దానియేలునూ అతని మిత్రులనూ దీవించాడు.

దానియేలూ, అతని మిత్రులూ దేవున్ని ఎలా ప్రేమించారో గమనించారా? దేవుని చిత్తప్రకారం నడవడం వారికెంత ఆనందం! వాళ్లు ఆయన యందు భయభక్తులు చూపారు. అట్టి వారిని దేవుడు దీవిస్తాడు.

మనలను కూడ అలాదీవించమని ప్రతి దినం ప్రార్థించాలి. దానియేలు, అతని మిత్రుల్లా మనం ఆయన యందు భయం కలిగి ఉండేలా దీవించుమని ప్రార్థించాలి.




76. రాజు కన్న కల



నెబుకద్నెజరు రాజు నిద్రపోతున్నాడు. హఠాత్తుగ అతడు నిద్రలేచాడు. అతడో కలకన్నాడు. కాని దాన్ని మరచిపోయాడు. అది ఏమిటా అని రాజు చాల తీవ్రంగా ఆలోచించాడు. అబ్బే, లాభంలేదు. అది గుర్తురాలేదు. అయినా అతడు అదేమిటో తెలుసుకోవాలని చాల ఆశించాడు. దాని అర్థం కూడ తెలుసుకోవాలనుకున్నాడు. అతనికి తిరిగి నిద్రపట్టలేదు.

ఉదయమయ్యింది. జ్ఞానులంతా రాజు ఎదుటికి రావాలి. రాజు కన్న కలయేమిటో వాళ్లు చెప్పాలి. దాని అర్థం కూడ చెప్పాలి. కాని వాళ్లు చెప్పలేకపోయారు.



రాజుకు చాల కోపం వచ్చింది. అతడు తన సైనికులతో బబులోనులో నున్న జ్ఞానులందరినీ వెదకి చంపండి అని ఆజ్ఞ యిచ్చాడు.

ఇప్పుడు దానియేలూ, అతని మిత్రులూ కూడ చచ్చిపోవాలి. ఎందుకంటే వాళ్లూ రాజు ఆస్థానంలో ఉన్న జ్ఞానులే కదా?

దానియేలు త్వరగా రాజ గృహం చేరాడు. అతడు రాజుతో-రాజా, రేపు ఉదయం వరకు కాస్త వేచి ఉండగలరా? ఒకవేళ నేను మీ కలనూ దాని భావాన్నీ చెప్పగలనేమో'' అన్నాడు. రాజు సరే అన్నాడు.

దానియేలు, అతని మిత్రులూ దేవునికి ప్రార్థన చేశారు. ఎందుకంటే యిప్పుడు దేవుడొక్కడే వాళ్లకి సాయం చేయగలడు. అ రాత్రంతా ప్రార్థన చేశారు. దేవుడు ఆ కలను గూర్చి దానియేలుకు తెలియజేశాడు. దానిభావాన్ని కూడ చెప్పాడు. ఆ నలుగురూ దేవునికి కృతజ్ఞత తెలిపారు. ఎందుకంటే ఇప్పుడు వాళ్లూ, మిగిలిన జ్ఞానులూ చచ్చిపోనవసరంలేదు.

దానియేలు రాజు వద్దకు వెళ్లాడు. రాజు దానియేలుతో - నీవు నాకల యేదో చెప్పగలవా? దాని భావాన్ని కూడ వివరించగలవా? అన్నాడు. అందుకు దానియేలు ''నేను చెప్పలేను రాజా, అంతేకాదు, ఏ జ్ఞానీ చెప్పలేడు. కాని దేవుడొక్కడే దానిని చెప్పగలడు. ఆయనే దానిని నాకు తెలియజేశాడు'' అన్నాడు. వినండి. దానియేలు ఆ కలను చెబుతున్నాడు - రాజూ, నీ కలలో ఒక పెద్ద విగ్రహాన్ని నీవు చూచావు. దాని శిరస్సు బంగారంతో చేయబడింది. దాని రొమ్ము చక్కని వెండితో చేయబడింది. ఉదరం రాగితోనూ, కాళ్లు ఇనుముతోనూ చేయబడ్డాయి.

అప్పుడొక పెద్దరాయి ఎత్తయిన పర్వతం నుండి దొర్లిపడింది. అది ఆ విగ్రహం మీదపడింది. ఆ విగ్రహం కిందపడింది. ఆ రాతి వల్ల అది పూర్తిగ నాశనం అయ్యింది. ఆ రాయి అంతకంతకూ పెద్దదయ్యింది. ఈ ప్రపంచమంత పెద్దగా ఎదిగింది. అతని మాటలకు రాజు తల ఊపాడు. అవును, తాను కన్నకల అదే. ఇప్పుడు గుర్తు వచ్చింది.

అప్పుడు దానియేలు - రాజా, ఇప్పుడా కల భావాన్ని చెబుతాను, విను. అందమయిన బంగారు శిరస్సునీవే. ఎందుకంటే నీవు చాల బలమైన గొప్ప రాజువు. అయితే నీవు మరణించిన తరువాత మరో రాజువస్తాడు. అతడు కూడ గొప్ప రాజే కాని నీ అంతటి వాడుకాడు. ఆ తరువాత, ఆ తరువాత రాజులు వస్తారు. ఆ పిదప మహాశక్తిగల ఒక ముఖ్యమయిన రాజు వస్తాడు. అతడు అందరిపై పరిపాలన చేస్తాడు. అంటే అన్నిటివీ పగలగొట్టిన రాయి లాంటివాడు. అతడు సర్వప్రపంచాన్నీ ఏలుతాడు. ఆయన నిత్యం రాజుగ నిలిచిపోతాడు, అని చెప్పాడు.

ఇప్పుడు నెబుకద్నెజరు రాజుకు కల భావం తెలిసింది. అతడు సంతోషించాడు. అతడు - దానియేలూ, నీ దేవుడే నిజమయిన దేవుడు ఆయనకు సమస్తం తెలుసు, అన్నాడు.

దానియేలు ఇప్పుడు రాజ సేవకులందరిలో ముఖ్యుడు. ఆ ఒకే ఒక్క గొప్పరాజు ఎవరో తెలుసా? మిగిలిన రాజులందరికంటె శక్తిమంతుడు, ఆ రాతివంటి వాడు ఎవరు? ఆయనే ప్రభువయిన యేసు! అందువలన ఆయన రాజులకు రాజు అనే బిరుదు పొందాడు.

ఈ రాజుకు చెందినవారెవరు? ఆయనను ప్రేమించిలోబడే వాళ్లు. రాజైన యేసు తన ప్రజలను జాగ్రత్తగ చూస్తాడు! వాళ్లు మరణించినపుడు కూడ. ఎప్పుడూ కాపాడుతాడు. దేవునికి భయపడేవాళ్లు ఎంత ధన్యులు వాళ్లు ఆయన స్వరం గుర్తించి ఆయనను వెంబడిస్తారు.

77. అగ్ని గుండంలో ముగ్గురు మిత్రులు



ఎత్తయిన ఆ విగ్రహాన్ని చూడండి. అది గుడి గోపురమంత ఎత్తుగా ఉంది. అది ఎంత కాంతివంతగా ప్రకాశిస్తున్నదో! ఎందుకంటే దాన్ని బంగారంతో చేసారు. అవును. నెబుకద్నెజరు రాజు దానిని అలా చేయించాడు.

ఇప్పుడో పెద్ద పండుగ జరుగుతుంది. క్రొత్తగా చేయించిన ఆ విగ్రహం కోసం. అది రాజుగారి కోరిక. ఆ విందుకు ప్రముఖులంతా రావాలని రాజు చెప్పాడు. దానియేలు యొక్క ముగ్గురు మిత్రులు కూడ వస్తున్నారు. వాళ్లు రాజుకు ముఖ్యమయిన, తెలివిగల సేవకులు కదా? చాలమంది వాద్యగాళ్లు కూడ వచ్చారు. ఆ పండుగ సందర్భంగా మంచి సంగీతం కూడ ఉంటుంది!

దానికి కొంచెం దూరంలో ఓ అగ్నిగుండం ఉంది. అది రాతితో చేయబడిన పెద్ద పొయ్యి. భయంకరమైన మంట అందులో మండుతోంది.

రాజసేవకులలో ఒకడు ఏదో ప్రకటిస్తున్నాడు వినండి. సంగీతం వినబడగానే అందరూ విగ్రహానికి వంగి నమస్కరించాలి. ప్రతి ఒక్కరూ విగ్రహాన్ని పూజించాలి. ఒకవేళ పూజించపోతే? అప్పుడు ఆ అగ్నిగుండంలో పడవేస్తారు!

ఒక్క క్షణం అంతా నిశ్శబ్దంగ ఉంది. అప్పుడు --- వినండి. వాయిద్యాలు మ్రోగడం ప్రారంభమయ్యింది. చూడండి. అందరూ విగ్రహానికి వంగి నమస్కారం చేస్తున్నారు. అందరూ మ్రొక్కారా? లేదు, ముగ్గురు యింకా నిలబడే ఉన్నారు. వాళ్లు మ్రొక్కలేదు. వాళ్లు దానియేలు మిత్రులు.

కొందరిది చూచారు. వాళ్లు త్వరగా వెళ్లి రాజుకీ సంగతి చెప్పారు. రాజు ఎంత కోపంగా కనబడుతున్నాడు! ''మీరు నా విగ్రహానికి ఎందుకు మ్రొక్కలేదు? మీరు బుద్ధిపూర్వకంగానే యిలా చేసారా? నేను మీకు మరో అవకాశం యిస్తాను. వాయిద్యాలు వినిపించగానే మీరు కూడ విగ్రహానికీ వంగి నమస్కారం చేయాలి. అలా చేయకపోతే మిమ్ములను అగ్నిగుండంలో పారేస్తాను. ఇప్పుడు మా దేవుడు మిమ్ములను రక్షిస్తాడని అనుకుంటున్నారా? లేదు. అంతా నేను చెప్పినట్టే జరుగుతుంది'' అన్నాడు రాజు.

అప్పుడా ముగ్గురు మిత్రులూ ఇలా అన్నారు - రాజా, మా దేవుడు ఈ అగ్నిగుండం నుండి మమ్ములను రక్షిస్తాడో లేదో తెలియదు. అయితే మేము మాత్రం ఆయన చిత్తప్రకారమే చేస్తాము. ఆయన సర్వశక్తి గల దేవుడు! కాబట్టి మేము వేరు ఏ విగ్రహానికి నమస్కారం చేయము. మా దేవుడు దానికి యిష్టపడడు. మాకు కూడ అది యిష్టంలేదు. ఎందుకంటే మేము మా దేవుడ్ని మాత్రమే సేవిస్తాము'' అన్నారు.

అమ్మో, రాజు యిప్పుడెంత కోపంగ ఉన్నాడు! అతడు తన సేవకులను చూచి - అగ్నిగుండాన్ని మరింత వేడిగా చేయండి. అప్పుడీ ముగ్గుర్నీతీసుకపోయి అందులో పారేయండి, అన్నాడు.

వాళ్లు అలాగే చేసారు. అగ్నిగుండం చాల వేడిగ మండుతున్నది. ముగ్గురు మిత్రులనూ కట్టివేసారు. బలమైన మనుష్యులు వాళ్లను ఎత్తి గుండంలోకి విసిరేసారు.

ఇప్పుడు ప్రాణాలతోనే వాళ్లు కాలిపోతారని రాజు అనుకున్నాడు. కొంతసేపయ్యాక రాజు ఆ గుండం వేపు చూచాడు. ఎంత ఆశ్చర్యం! అతడు సేవకులను చూచి "మనం ముగ్గురు మనుష్యులను అగ్నిలో వేసాం కదూ? ఇప్పుడు నాకు నలుగురు కనబడుతున్నారు. వాళ్లు గుండంలో అటూ ఇటూ తిరుగుతున్నారు. అందులో ఒక వ్యక్తి ప్రకాశిస్తున్న బట్టలు ధరించి ఉన్నాడు" అన్నాడు.

అగ్నిగుండం తలుపువెంటనే తెరిచాడు. ఆ ముగ్గురూ బయటికి వచ్చారు. అందరూ వాళ్లని పరీక్షించారు. వాళ్లకే హాని జరగలేదు. వారి బట్టలు కాలలేదు. వారి తలవెంట్రుకలకు హాని కలుగలేదు. ఏవిధమయిన వాసనా లేదు! మరి నాల్గవవ్యక్తి మాటేమిటి? అతడొక దేవదూత. దేవుడు పంపినవాడు. అగ్ని వారికి ఏ హాని చేయకుండా అతడు చూచాడు. ఇప్పుడు తిరిగి పరలోకానికి వెళ్లిపోయాడు. నెబుకద్నెజరు - మీ దేవుడే నిజమైన దేవుడని నాకిప్పుడు తెలిసింది. ఆయన ఎంత శక్తిగలవాడు! అందుకే మిమ్మును రక్షించగలిగాడు అన్నాడు.

అదో గొప్ప అద్భుతం కదా? మిత్రులు కాలిపోకపోవడం వింతకాదా? అది దేవుని కార్యం.

మరో అద్భుతం మీకు తెలుసా? దేవునికి విరోధంగా పాపం చేయడానికి బదులు వాళ్లు అగ్నిగుండంలోకి వెళ్లారు. వాళ్లు దేవున్ని ఎంతగా ప్రేమిస్తున్నారో దీనివల్ల తెలుస్తున్నది!

మీరాయన్ని ఏం అడగాలో తెలుసా - మమ్మును కూడ ఆ ముగ్గురిలా చేయండి - అని.



78. సింహాల గుహలో దానియేలు

నెబుకద్నెజరు రాజు చచ్చిపోయాడు. కొత్తరాజు పేరు దర్యావేషు. అతని వద్ద చాల మంది ముఖ్యమయిన రాజసేవకులున్నారు. వారందరిలో ముఖ్యుడెవరో తెలుసా? దానియేలు. ఇది దేవుడు చేసినదే.

మిగిలినవాళ్లు దానియేలు అంత ప్రముఖులు కారు. అందువల్ల వాళ్లకి దానియేలు మీద అసూయ. "ఇతడు చచ్చిపోతే బాగుండును" అని వాళ్లు అనుకొనేవాళ్లు. కాబట్టి వీళ్లంతా దానియేలు శత్రువులే. వాళ్లు ఒకరితో ఒకరు - దానియేలు ఏదన్నా పొరపాటు చేస్తాడేమో చూద్దాం. అప్పుడు రాజుతో చెప్పచ్చు అని చెప్పుకున్నారు.

అయితే అతనిలో వాళ్లకే తప్పు కనబడలేదు. ఎందుకంటే అతడెంతో మంచి రాజసేవకుడు. కాబట్టి వాళ్లంతా ఒక పథకం వేసారు. వాళ్లు రాజు దగ్గరకు వెళ్లి - రాజా, మేమొక చక్కని ఆలోచన చేసాము. నీవెంత గొప్పరాజువో అందరూ తెలుసుకోవాలి. ప్రజలంతా మీ ఒక్కరికే మనవి చేయాలి. వేరెవరినీ, చివరికి దేవుడ్నికూడ ఏమీ అడగరాదు. ఎవరు ఈ ఆజ్ఞకు లోబడరో వాళ్లని సింహాలున్న గుహలో పడద్రోయాలి. అప్పుడా సింహాలు ఆ వ్యక్తిని తినేస్తాయి. దీని గురించి నీవు ఏమంటావు? అని అడిగారు.

రాజు అది మంచి ఆలోచనయే అని తలంచాడు. నిజంగా అది ఎంత చెడ్డ పథకమో అతడు గ్రహించలేదు. ఆ మనుష్యులెంత నీచులు! దానియేలుకీ విషయం ఏమీ తెలియదు. అయితే దేవునికి అంతా తెలుసు?

మనుష్యులు నీచమయిన పథకాలు వేసినపుడు దేవునికి అంతా తెలుసు. మన తలంపులు కూడ ఆయన ఎరుగును!

దానియేలు ప్రతిదినం మూడుసార్లు దేవునికి ప్రార్థన చేస్తాడు. తన యింటిలో ఒక గదికిటికీ విప్పి దాని ఎదుట మోకరించి ప్రార్థన చేస్తాడు. అక్కడ అతడు వినయంగా మోకరించి ప్రార్థన చేస్తాడు. అయితే అతడిప్పుడు అలా ప్రార్థన చేయడానికి వీలులేదు. రాజు అలా ఆజ్ఞ ఇచ్చాడు. మరి ఇప్పుడు దానియేలు ఏంచేస్తాడు? అతడొక వేళ ప్రార్థన చేస్తే...

దానియేలు శత్రువులు మెల్లగా అతని ఇంటికి వచ్చారు. రహస్యంగ వినడానికి వారు తెరచి ఉన్న కిటికీ దగ్గర నిలబడ్డారు. అవును, దానియేలు మోకరించి ఉండడం వారు చూచారు. అతడు ప్రార్థన చెయ్యడం విన్నారు.

సింహాలంటే దానియేలుకు భయములేదా? ఉంది అయితే అతడు తన దేవునికి లోబడాలనుకున్నాడు. అతడు దేవుడ్ని ప్రేమిస్తున్నాడు.

శత్రువులు వెంటనే రాజు వద్దకు వెళ్లారు. వాళ్లు రాజుతో - రాజా అక్కడొక అవిధేయుడయిన వ్యక్తి ఉన్నాడు. అతని పేరు దానియేలు. అతడు తన దేవునికి దినంలో మూడుసార్లు ప్రార్థన చేస్తాడు, అని చెప్పారు. దర్యావెషు రాజు కలవరపడ్డాడు. దానియేలు తనకు ఇష్టమైన సేవకుడు, స్నేహితుడు. ఇప్పుడతన్ని సింహాలగుహలో వెయ్యాలా? తప్పక వెయ్యాలి. రాజా అలా అని నీవే చెప్పావు కదా, అన్నారు. వాళ్లు పరమ నీచులు. ఈ పథకం వాళ్లు ఎందుకు వేసారో రాజుకు ఇప్పుడు అర్థం అయ్యింది. అయితే పరిస్థితి రాజు చెయ్యిదాటిపోయింది.

దానియేలును రాజువద్దకు తెచ్చారు. రాజు చాల విచారంతో - దానియేలూ, నీదేవుడు నిన్ను రక్షిస్తాడని ఆశిస్తున్నాను అని అన్నాడు.

దానియేలును సింహాల గుహకు నడిపించారు. అది భూమిలో త్రవ్విన పెద్ద చీకటి గది. అందులో సింహాలున్నాయి. అవి చాలా ఆకలిగా ఉన్నాయి. ఆ గుహ మీద ఒక పెద్దరాయి కప్పి ఉంది. దానిని తొలగించారు, ఆ వినండి ఆ సింహాలు ఎలా గర్జిస్తున్నాయో! దానియేలును ఆ గుహలో పడవేసారు. తిరిగి రాయి దొర్లించారు. అది రాత్రి వేళ. రాజుకు నిద్రపట్టలేదు. అతడు దానియేలు గురించి ఆలోచిస్తున్నాడు. ఎంతగానో కలవరపడ్తున్నాడు.

చివరికి ఉదయమయ్యింది. రాజులేచాడు. త్వరగా సింహాల గుహయొద్దకు వెళ్లాడు. వణకుతున్న స్వరంతో దానియేలూ నీ దేవుడు నిన్ను సింహాల నుండి రక్షించాడా అని అడిగాడు.

అప్పుడు.....ఆ, తాను సరిగానే వింటున్నాడా? గుహలో నుండి ఒక స్వరం వినిపిస్తున్నది. అవును అది దానియేలు స్వరమే. "రాజా, నేను దానియేలునే



నా దేవుడు దేవదూతను పంపాడు. సింహాలు నాకు హాని చేయకుండా కాపాడాడు. ఎందుకంటే నేను ఏ తప్పు చేయలేదు. రాజా నీకు విరోధంగా దేనిని నేను చేయలేదు'' అన్నాడు.

రాజు ఎంతో సంతోషించాడు! తన సేవకులలో కొంత మందిని పిలిచాడు. వాళ్లు గుహలోకి త్రాళ్లు వేసి దానియేలును పైకి లాగారు. సింహాలు అతనికే హానీ చేయలేదు. అతని శరీరం మీద ఒక్కగీత కూడా పడలేదు.

దర్యావెషురాజు సైనికులను పిలిచాడు. దానియేలు శత్రువులను తీసికొని రమ్మని ఆజ్ఞాపించాడు. అదిగో వాళ్ళక్కడ ఉన్నారు. ఎంత భయపడ్తున్నారో చూడండి. ఇప్పుడు వాళ్లకేమి సంభవిస్తుందీ? వాళ్ళందరిని సింహాల గుహలో పడేసారు. ఈసారి వీళ్ళని రక్షించడానికి పరలోకం నుండి ఏ దూతా రాలేదు. సింహాలు వాళ్ళందర్నీ తినేసాయి. అది దేవుని శిక్ష.

రాజు ప్రజలతో ఇలా అన్నాడు - దానియేలు దేవుడే సర్వశక్తిమంతుడు. ఆయన అద్భుతాలు చేయగలడు. ప్రతివాడు ఆయనకు లోబడాలి.

మరి దానియేలు సంగతి ఏమిటి? అతడు రాజుకు ప్రధాన సేవకుడిగా ఉన్నాడు. ఎప్పటిలా దినానికి మూడుసార్లు తన దేవునికి ప్రార్థన చేస్తున్నాడు. దానినతడెన్నడూ మరువడు. అలా ప్రార్థించడం అతనికి సంతోషం. అతడు దేవుడికి అన్నీ చెబుతాడు. అ

న్నీ అడుగుతాడు. దేవుడు తనకి సమీపంగా ఉంటాడు. దానియేలు నిజంగా ధన్యుడు.

మనంకూడా దానియేలులా ప్రతిదినం మరచిపోకుండా ప్రార్థన చేసుకొందామా?

79. యేసు ప్రభువు ఎప్పుడు వస్తాడు?

రాత్రివేళ అందరూ నిద్రపోతారు. మనం కూడ నిద్రపోతాము. కొన్నిసార్లు కొంత సేపు నీవు మెళకువగా ఉండవచ్చు. రాత్రి సమ యంలో ఎంత నిశ్శబ్దంగా ఉంటుంది! ఎంత చీకటి! సూర్యుడు అస్తమించడంవల్ల అలా ఉంటుంది.

రాత్రి చాల పొడవుగ ఉంటుంది. మళ్లీ ఉదయం ఎప్పుడవుతుంది? సూర్యుడు తిరిగి ఎప్పుడు ఉదయిస్తాడు. తెరకొంచం తొలిగింది. దాని గుండా చీకటిగ ఉన్న ఆకాశం వైపు నీవు చూస్తావు. ఆకాశం అంతా మెరిసే నక్షత్రాలు. ఎంత అందంగా ఉన్నాయి! అవి మనకు కొంచం కాంతినివ్వడానికి ప్రయత్నిస్తున్నాయి. అయినా ఇంకా చీకటిగానే ఉంది. సూర్యోదయం అయితేనే పూర్తిగ వెలుగు వస్తుంది. కాస్త ఆగండి, సూర్యుడు తిరిగి వస్తాడు - అని నక్షత్రాలు చెబుతున్నాయి.

సూర్యుడు సమస్తాన్నీ వెలిగిస్తాడు. అప్పుడు అన్నీ అందంగా కనిపిస్తాయి. పక్షులు మళ్లీ పాటలు పాడుతవి. రంగురంగుల పూలను మనం చూడగలం. అవును, సూర్యుడు లేకుండా మనం జీవించలేము. ఒక్కదినం కూడా బ్రదుకలేము!

సూర్యునిలా ఉండే వేరొకరు తెలుసా? అది ప్రభువయిన యేసు. ఎందుకో తెలుసా? నీకు తెలియదా? అయితే విను!

ఆదాము హవ్వలను గురించి నీకు గుర్తుందా? మొదట్లో వాళ్లు నిజాయితీపరులుగ, నీతిమంతులుగ ఉన్నారు. అయితే వాళ్లు అవిధేయులై సాతాను మాట విన్నారు. వాళ్లు అలా చేయడంవల్ల పాపం వాళ్ల హృదయంలో చొరబడింది. వాళ్ల హృదయంలో ఎంత చీకటి!

అప్పుడు వాళ్లు దేవుని స్వరం విన్నారు. దేవుడు వారికిలా మాట యిచ్చాడు - ఒక రక్షకుడు వస్తాడు. ఆయన సాతాను కన్న బలవైనవాడు. ఆయన మిమ్మును మార్చి మీయందు కనికరం చూపుతాడు.

దేవుని వాగ్దానం చీకటి ఆకాశంలో మెరిసే చుక్కలాంటిది. ఆ చుక్క, సూర్యుడు ఉదయిస్తాడు. యేసు ప్రభువు వస్తాడు - అని చెప్పింది.

నీకు అబ్రాహాం గుర్తున్నాడా? అబ్రాహాం చాల విచారంగా ఉన్నాడు. అతడు చాల ముసలివాడయ్యాడు. భార్య శారాకూడ ముసలిది. తనకి యిక పిల్లలు కలగరని అనుకున్నాడు. అతని హృదయంలో ఎంత చీకటి!

అప్పుడు దేవుడు - అబ్రాహామా, అని పిలిచి నీకు ఒక కుమారుడు కలుగుతాడు. అతని ద్వారా యింకా ఇంకా పిల్లలు వస్తారు. ఆ తరువాత ఆ సంతానం నుండి రక్షకుడు పుడతాడు అని చెప్పాడు.


అప్పుడు అబ్రాహాము ఎంత సంతోషించాడు! అతడు దేవుని వాగ్దానాన్ని నమ్మాడు.

ఈ వాగ్దానం కూడా ఆకాశంలోని అందమయిన నక్షత్రం లాంటిది. ఇది కూడ - రక్షకుడు వస్తాడు. యేసుప్రభువు వస్తున్నాడు అని చెప్పింది.

నీకు యాకోబు గుర్తున్నాడా? అతడెన్ని పాపాలు చేసాడు? అతని హృదయం గొప్ప చీకటితో నిండింది. అయితే దేవుడు యాకోబుకు ఏం వాగ్దానం చేసాడు? నీ కుటుంబంలో ఓ బలమైన రాజు పుడతాడు. అతనే రక్షకుడు.

అప్పుడు యాకోబు సమాధానంతో మరణించాడు. ఆ వాగ్దానం కూడ చీకటి ఆకాశంలో ఓ వెలుగు లాంటిది. ఈ చుక్కకూడ సూర్యుడు వస్తున్నాడు. ప్రభుయేసు వస్తున్నాడు, అని చెప్పింది. ఇశ్రాయేలీయుల గూర్చి జ్ఞాపకం ఉందా? వాళ్లొక పెద్ద జనాంగం. దావీదు రాజు మంచి రాజు. కాని ఆ తరువాతి రాజులు చెడ్డవాళ్లు. వాళ్ల పాలనలో ప్రజలు దేవున్ని ఆరాధించడానికి ఇష్టపడలేదు. దేవుడు వారిపైకి బలమైన శత్రువులను పంపాడు. వాళ్లు ప్రజలను తమ దేశానికి చెరగొని పోయారు. అది దూరంగ ఉన్న ఓ విదేశం. అదెంత భయంకరం! అంతా ఎంతగా చీకటి అయ్యింది!

దేవుడు ప్రవక్తలను పంపాడు. వాళ్లు దేవుని సేవకులు. వాళ్లు - నీవు భయంకరమైన పాపాలు చేసినా



దేవుడు నిన్ను మరువడు. ఆయన తన కుమారుని పంపుతాడు. ఆయనే గొప్ప రక్షకుడన్నారు.

చీకటి రాత్రికి మరో కాంతి నక్షత్రం చేరింది. ఈ విధంగా దేవుడు ఆ చీకటి రాత్రికి అనేకమయిన నక్షత్రాలను తెచ్చాడు. అవి ఆకాశాన్ని కొంచంగ వెలిగించాయి.

చివరిగా రాత్రి ముగిసింది. ఒకప్రవక్త - ఇప్పుడు సూర్యుడు త్వరగా వస్తాడు అని చెప్పాడు. అతడే ప్రవక్తలలో చివరివాడు.

మరి యిప్పటి మాటయేమిటి? దేశంలో చాల విచారం కలిగింది. రాజమందిరంలో దుర్మార్గుడయిన రాజు ఒకడున్నాడు. సైన్యంలో విదేశీ సైనికులు చాలమంది ఉన్నారు. వాళ్లు దేశాన్ని పాలిస్తారు ప్రజలుయేసుప్రభు కోసం కనిపెడుతున్నారు. వాళ్లు - ఆయన శత్రువుని తరిమేస్తాడు అనుకున్నారు. మరి యేసు అలా బలమయిన రాజుగ ఉంటాడా? అని అనుకున్నారు. అయితే యేసు శత్రువును పరిగెత్తించడానికి రాలేదు. ఆయన వారిని శత్రువు నుండి రక్షించడానికి రాలేదు. కాని పాపం నుండి రక్షించడానికి వచ్చాడు!

చాలమంది దీని గూర్చి ఆలోచించరు. ప్రార్థించరు. అలా అయితే వారికోరిక యధార్థమయింది కాదు.

యేసు ప్రభువు దగ్గరికి నిజంగా రావాలని ఆశించే వాళ్లున్నారు. వీళ్లు తమ పాపాల కోసం పశ్చాత్తాప పడుతున్నారు. పాపమే వారి గొప్ప శత్రువు. యేసువారిని ఆ గొప్ప బలమైన శత్రువు నుండి రక్షిస్తాడు. అవును, నిజంగా వారాయన రాకకోసం ఆశిస్తున్నారు. "సూర్యుడొస్తాడు, యేసు ప్రభువు వస్తాడు" అని చెప్పే ఆకాశ నక్షత్రాలను గూర్చి వాళ్లు ఆలోచిస్తున్నారు.

కొన్ని సార్లు వారి హృదయంలో నిజమైన ఆనందం ఉంటుంది. అప్పుడు - యేసు ప్రభూ తిరిగి త్వరగారా అని ప్రార్థిస్తారు.

ఈ కోరిక నీకూ ఉందా? ఎందుకంటే మన హృదయాల్లో కూడ పాపం వల్ల చీకటి అలుముకొని ఉంది. యేసు ప్రభువే సూర్యుడు. ఆయన మన చీకటిని వెలుగుగా మార్చగలడు.

క్రొత్త నిబంధన

ఉచిత పంపిణి మాత్రమే
FOR FREE DISTRIBUTION ONLY

1. శుభవర్తమానము

ప్రశాంతమయిన పర్వతాలలోని ఓ చిన్న గ్రామంలో ఒక భార్య భర్త నివసిస్తున్నారు. వారిపేరు జెకర్యా, ఎలీసబెతు. వాళ్లిద్దరూ నిజంగ సంతోషంతో జీవిస్తున్నారు. ఎందుకంటే వాళ్లు దేవుని యందు భయభక్తులు కలిగి ఉన్నారు. అయినా వారి హృదయాల్లో విచారం దాగి ఉంది. దానికి కారణం - వాళ్లకి పిల్లలు లేరు. వాళ్లు ఒక బిడ్డ కోసం చాలసార్లు ప్రార్ధన చేసారు. కాని దేవుడు ఆ ప్రార్ధనలకు జవాబీయలేదు. ఇప్పుడు వాళ్లు ముసలి వాళ్లయ్యారు. ముసలి వాళ్లకి పిల్లలు కలుగరు కదా?

ఒక రోజు జెకర్యా యెరూషలేము కు ప్రయాణమయ్యాడు. అక్కడే అందమయిన పెద్ద ఆలయం ఉంది. అది దేవుని ఇల్లు. ఇక్కడ యాజకులు తమ పనులు చేయాలి. అక్కడికి వచ్చే ప్రజలకు సాయం చేయాలి. ప్రజలు దేవునికి అర్పణలు తెస్తారు. జెకర్యా యాజకుడు, దైవసేవకుడు.

చూడండి, దేవాలయానికి చాల మంది వస్తున్నారు. వాళ్ళు దేవునికి బలులు తెస్తున్నారు. యాజకులు వాళ్ళకి సాయం చేస్తున్నారు. ఆ పెద్ద బలిపీఠం మీద పశువులను దహించాలి. అందుకనే దానిని "దహన బలి పీఠం" అంటారు. ఇది దేవాలయ ఆవరణలో ఉంటుంది. ఆలయంలో ఎదుటనున్న పెద్ద చదరంలో ఉంటుంది.

అయితే వేరొక బలిపీఠం కూడ ఉంది. అది చిన్నది. దానిని "ధూప వేదిక" అంటారు. అది ఆవరణలో ఉండదు. అది దేవాలయంలో ఉంటుంది. జనులు అక్కడికి వెళ్లరాదు. యాజకుడొక్కడే వెళ్లాలి. అతడు ఆ చిన్న బలిపీఠం మీద అర్పణ అర్పిస్తాడు.

ఈ రోజు ఏ యాజకుడు ధూపం వేస్తాడు? ఒక్కడు మాత్రమే అది చేయాలి.

కాబట్టి వాళ్లు చీట్లు వేస్తారు. అది న్యాయం. అందరూ వంతులు వేసుకుంటారు. ఆ వంతు యిప్పుడు జెకర్యాకు వచ్చింది. అతడెంత ఆనందంగా ఉన్నాడు!

జెకర్యా భక్తితో ఆలయంలో ప్రవేశించాడు. అతడులోనికి వెళ్ళడం ప్రజలు చూచారు. లోపట ప్రతి వస్తువూ మెరిసే బంగారంతో చేయబడింది. ఒక పెద్ద బంగారు దీపస్తంభం నుండి వెలుగు వస్తోంది.

జెకర్యా నిశ్శబ్దంగా ధూపవేదిక వద్దకు వెళ్లాడు. అది కూడ బంగారంతో చేసినదే. బలి యివ్వడానికి అతడు గొర్రెపిల్లను కొని పోలేదు. అతడు వేరొక అర్పణ తెచ్చాడు. అక్కడొక చిన్న బంగారు గిన్నె ఉంది. దానిలో మండుతున్న కట్టెముక్కలున్నాయి. చూడండి, జెకర్యా చిన్న చిన్న ధూప గోళీలు అందులో వేస్తున్నాడు. అవి అగ్గిలో కాలగానే సువాసన వస్తుంది. ఆ ధూపం పొగలా పైకి లేస్తుంది. కాబట్టి దానిని 'ధూప వేదిక' అంటారు.

జెకర్యా ఆ వేదిక ఎదుట నిలబడ్డాడు. అతడు ప్రార్ధన చేస్తున్నాడు. అతని ప్రార్ధనలు పైకి లేచి దేవుని వద్దకు చేరుతున్నాయి, ఆ సువాసన వలెనే!

హఠాత్తుగ అతడు ప్రార్ధన చేయడం ఆపేసాడు. అతడు ఖంగారుపడ్డాడు. ఎందుకంటే ఎవరో తన ప్రక్క వేదికముందు నిలబడి ఉన్నాడు. ఇప్పుడు జెకర్యా ఒక్కడే లేడు. అతడు పరలోకం నుండి వచ్చిన దేవదూత. జెకర్యా భయపడ్డాడు!

"జెకర్యా, భయపడవద్దు, నీ ప్రార్ధనలు దేవుడు విన్నాడు. నీకు ఒక కుమారుడు పుడతాడు. అతని పేరు యోహాను. అతడు దేవుని సేవకుడుగా ఉంటాడు. అతడేమి పని చేస్తాడో నీకు తెలుసా? అతడు యేసు ప్రభువు రాకడను గురించి ప్రజలకు ప్రకటిస్తాడు. దానివలన అనేకులు దేవుని వైపుకు తిరుగుతారు", అని దేవదూత చెప్పాడు.

అదెంత అద్భుతమయినవార్త! జెకర్యా ఎంత సంతోషించాలి! లేదు లేదు, జెకార్య ఎంతమాత్రం సంతోషంగా కనిపించలేదు. అతడు తల ఆడించాడు. దూతతో యిలా అన్నాడు. "మాకిక పిల్లలు కలిగే అవకాశం లేదు. నేనూ, ఎలీసబెతూ యిప్పటికే చాల ముసలి వాళ్లము. నీవు చెప్పేది నిజమని నాకెలా తెలుస్తుంది?"

జెకర్యా దూత మాట నమ్మక పోవడం విచారకరం. అయితే దేవునికి సమస్తం సాధ్యం కదా? దేవుడు ఎన్నడూ అబద్ధమాడడు.

దూత ఏమీ చెబుతున్నాడో వినండి. "జెకర్యా, నే నెవరినో నీకు తెలుసా? నేనొక దేవదూతను. నాపేరు గబ్రియేలు. నేను పరలోకంలో దేవుని వద్ద ఉంటాను. ఆయనే నన్ను యిక్కడికి పంపాడు. ఇది దేవుడు పంపిన వర్తమానం. ఇప్పటి నుండి నీకు కుమారుడు కలిగే వరకు నీవు మాటలాడలేక మూగవాడవైయుంటావు. జెకర్యా, అదే నీకు శిక్ష. ఎందుకంటే నీవు దేవుని మాట నమ్మలేదు".

దూత తిరిగి పరలోకం చేరాడు. మరి జెకర్యా సంగతి యేమిటి? అతడు ఆలయం విడిచి వెళ్లాడు. ఆవరణ లోకి వచ్చాడు. అక్కడ అతని కోసం చాల మంది కనిపెడుతున్నారు. ఎందుకంటే ఆలయంలో ధూపం వేసాక అతడు బయటికి వచ్చి ప్రజలను దీవించాలి. గుడిలో పాదిరిగారు మనకు దీవెన యిచ్చినట్టే.

జెకర్యా ఆలయంలోపట అంతసేపు ఎందుకు ఉండిపోయాడా అని ఆశ్చర్యపడ్డారు. చివరికి అతడు బయటికి వచ్చాడు. కాని అతడు మాట్లాడలేకపోతున్నాడు. అతడు మూగవాడయ్యాడు. దూత చెప్పినట్టే జరిగింది.



జెకర్యా చేయి ఊపాడు. ప్రజలు ఇంటికి తిరిగి వెళ్లాలి. అందరూ ఆశ్చర్యపడ్డారు. ఆలయంలో ఏం జరిగి ఉంటుంది?

జెకర్యా యింటికి వెళ్లాడు. ఆలయంలో ఏం జరిగిందో ఎలీసబెతుకు చెప్పలేకపోయాడు. కాబట్టి అతడు జరిగిందంతా పలకమీద రాసాడు. అప్పుడు ఎలీసబెతు దానిని చదవవచ్చు.

తనకొక కుమారుడు కలుగుతాడని కొంతసేపటికి ఎలీసబెతు తెలుసుకున్నది. ఆమె దానికోసం ఆశతో ఎదురుచూస్తున్నది. అతడో చిన్న కుమారుడు. అతడు దేవుని సేవకుడవుతాడు. అలా అని దేవుడే చెప్పాడు.

దేవుడి వాగ్దానాలు తప్పక నెరవేరుతవి. మనుష్యులు వాటిని నమ్మకపోయినా సరే. జకర్యా సంగతి యేమిటి? దేవుడు పంపిన వర్తమానాన్ని నమ్మనందుకు జెకర్యా చాల బాధపడ్డాడు. అవిశ్వాసం గొప్ప పాపం.

అవిశ్వాసం మన హృదయంలో కూడ ఉంటుంది. కఠినమయిన మన హృదయాలు - నేను చాల చిన్నవాడిని నాకు నూతన హృదయం ఇప్పుడే వద్దు, అనవచ్చు. లేదా చిన్న స్వరం - దేవుడు నన్ను మార్చడానికి యిష్టపడడు, అని చెప్పవచ్చు.

అయితే దేవుడేమి చెబుతున్నాడు? ''నాకు అసాధ్యమయినది ఏదీ లేదు''.

దేవుడు మన అవిశ్వాసాన్ని తీసివేసి ఆయనయందు విశ్వాసం కలిగేలా చేయగలడు. దాని కోసం ప్రార్థన చేస్తావా?



2. మరియకు వర్తమానం

దేవదూతలు పరలోకంలో ఉంటారు. వాళ్లు దేవునికి లోబడి పనిచేసే సేవకులు. అప్పుడప్పుడూ ఒక దూత భూలోకానికి వస్తాడు. దేవుడు అతనిని అలా పంపుతాడు. నీకు గబ్రియేలు దూత గుర్తున్నాడా? అతడు జెకర్యాకు శుభవార్త చెప్పాడు గదా?

మళ్లీ అతడు గబ్రియేలే. ఒకనాడు దూత ఒకడు భూలోకానికి దిగివచ్చాడు. దేవుడతన్ని ఈలోకానికి పంపాడు. అతడు మరో అద్భుతమైన వర్తమానం తేబోతున్నాడు. ముఖ్యమైన ఈ దూత ఆశుభవార్తను ఎక్కడికి తెస్తాడు? అతడు మహాపట్టణమైన యెరూషలేముకు వెళ్తాడా? లేక అందమైన రాజమందిరానికి వెళ్తాడా? లేదు. అతడు చిన్న గ్రామమైన నజరేతుకు వెళ్తున్నాడు. అక్కడ గొప్పవాళ్లెవరూ నివసించరు.



మరియ అనే యువతి నజరేతులో నివసిస్తున్నది. ఆమె దావీదు సొలోమోను రాజులకు దూరపు బంధువు. వీళ్ళిద్దరూ పేరు పొందిన గొప్ప రాజులు, మరియ బంధువులు గొప్పవారైను ఆమె మాత్రం ఒక చిన్న ఇంటిలో నివసించే సామాన్యురాలు.

మరియ త్వరలోనే ఒక యువకుని పెండ్లి చేసుకోబోతున్నది. అతని పేరు యోసేపు. అతడు కూడ దావీదు మహారాజుకు దూరపు చుట్టమే. అయితే యోసేపు మాత్రం ఒక వడ్రంగి. చిన్న ఇంటిలో నివసిస్తున్నాడు. అతని బంధువులవలెనే అతడు కూడ పేదవాడు.

అయితే యోసేపు మరియలు చాల ధనవంతులు! ఎందుకో తెలుసా? వాళ్లు దేవుని పిల్లలు. నూతన హృదయంతో దేవుడు వాళ్లను దీవించాడు.

హఠాత్తుగా మరియ తనముందు ఎవరో నిలిచి ఉండడం చూచింది. అతడు ఎవరు? అతడు గబ్రియేలు దూత. గబ్రియేలు మరియకు వందనాలు చెప్పాడు. అతడు మరియా దేవుడు నీకు తోడుగా ఉన్నాడు. స్త్రీలలో నీవు బహుగా ఆశీర్వదించబడ్డావు, అని చెప్పాడు. ఆ మాటలకు మరియ ఆశ్చర్యపోయింది. ఈ దూత ఏమి చెబుతున్నాడు? అతని మాటలకు అర్థం ఏమిటి? అని తలంచి ఆమె వణికిపోయింది.

అప్పుడు దూత - మరియా భయపడవద్దు అని ఆమెకో అద్భుతమైన వర్తమానం చెప్పాడు. మరియా, నీకొక కుమారుడు పుడతాడు. ఆయన ప్రభువైన యేసు, రక్షకుడు. ఆయన త్వరగా రానున్నాడు. ఆయన తల్లివినీవే. యేసు రాజు అవుతాడు. దావీదు కూడా రాజే. అయితే ప్రభువైన యేసు చాలా ముఖ్యమైన రాజు ఎందుకంటే ఆయన దేవుని కుమారుడు. ఆయన తరతరాలకు రాజు అని దూత చెప్పాడు.

ఎంత అద్భుతమైన వర్తమానం! మరియ దానిని నమ్మింది ఎందుకంటె అది దేవుడు పంపిన వర్తమానం. కాబట్టి మరియ - అది నీవు చెప్పినట్టే జరగాలి. దేవుడెప్పుడూ మేలే చేస్తాడు అన్నది. తరువాత దూత పరలోకానికి వెళ్లిపోయాడు.

మరియ తన చిన్న ఇంటిని విడిచి వెళ్లింది. ఎక్కడికి? ఆమె కొండలలో ఉన్న ఒక చిన్న గ్రామానికి వెళ్తున్నది. అక్కడ జెకర్యా, ఎలీసబెతుకు నివసిస్తున్నారు. ఎలీసబెతుకు కూడ కుమారుడు పుట్టనున్నాడని దూత మరియకు చెప్పాడు. ఆమె ఇప్పుడు ఎలీసబెతుతో మాట లాడాలని ఎదురు చూస్తున్నది.

మరియను చూడగానే ఎలీసబెతు ఎంతో సంతోషించింది. ఎందుకంటే ఆమెకు కూడ మరియ రహస్యం తెలుసు. మరియకు ప్రభు యేసు పుట్టబోతున్నాడని ఆమె ఎరుగును. దేవుడే ఆ మాట ఆమెకు బయలుపరచాడు.

మరియ జెకర్యా ఎలీసబెతుల వద్ద చాల కాలం ఉంది. ఎలీసబెతు, మరియ మాటలాడుకోడానికి చాల సంగతులు ఉన్నాయి. వాళ్లు యేసు ప్రభువు రాక గురించి మాట్లాడుకొన్నారు. ఆయన త్వరలో పుట్టబోతున్నాడు. వాళ్ళు చాల సంతోషించారు. మరియ సంతోషంతో పాట పాడింది. అది ఓ చక్కని స్తుతిగీతం. ఆ పాటను పెదవులతో కాక, హృదయపూర్వకంగ పాడింది.

అప్పుడు మరియ తిరిగి నజరేతులో ఉన్న తన ఇంటికి వెళ్ళింది. ఆమె ఎంతో సంతోషంగా ఉంది. ప్రభుయేసుకు తల్లి కాబోవడం ఎంత ఘనత? అయితే అదే ఆమె సంతోషానికి కారణమా? కాదు. యేసు ప్రభువు తన రక్షకుడుగా కూడా ఉండడానికి ఈ భూలోకానికి వస్తున్నాడని ఆమెకు తెలుసు. అదే ఆమె సంతోషానికి కారణం.

అవును, యేసు మన రక్షకుడని తెలుసుకొనడమే నిజమైన ఆనందం. అద్భుతమైన ఈ దీవెన దేవుడు నీకివ్వాలని ప్రార్థన చెయ్యి.


3. యేసు పుట్టుక

"మరియా, బయలుదేరు, మనం వెలుదాము" అన్నాడు యోసేపు. అదిగో, వాళ్లు వెళ్తున్నారు. ఇద్దరూ కలిసి దూర ప్రయాణం చేయబోతున్నారు.

వాళ్లీ ప్రయాణం ఎందుకు చేస్తున్నారు? వాళ్లు ఎక్కడికి వెళ్తున్నారు?

ఈ క్రింది కథ వినండి. ఆ కాలంలో దాదాపు ప్రపంచాన్నంతా ఏలుతున్న చక్రవర్తి వారినలా వెళ్లమని చెప్పాడు. ప్రతివాడూ తన పేరు జనాభా లెక్కలలో రాయాలని అతని ఆజ్ఞ. తన రాజ్యంలో ఎంత మంది ప్రజలు ఉన్నారో తెలుసుకోవాలని అతని కోరిక. తమ బంధువులు నివసిస్తున్న ప్రాంతానికి వెళ్లి అక్కడ వాళ్ల పేర్లు రాయాలి. కాబట్టి యోసేపు, మరియలు నజరేతులో ఉండడానికి వీలులేదు. వాళ్లు బెత్లెహేముకు వెళ్లాలి. అక్కడ వాళ్లపేర్లు రాయించుకోవాలి. వీళ్లిద్దరూ దావీదు రాజుకు దూరపు బంధువులని మీకు గుర్తుందా? దావీదు జన్మస్థలం బెత్లెహేము అని మీకు తెలుసుకదూ?

కాబట్టి వాళ్లిద్దరూ కలిసి నడుస్తూ వెళ్తున్నారు. అప్పుడప్పుడూ అద్భుతమయిన తమ రహస్యం గురించి వాళ్లు మాట్లాడుకుంటున్నారు ఆ గొప్ప అద్భుతం గురించి, పుట్టబోయే శిశువు గురించి. తాము





బెత్లెహేముకు ఎందుకు వెళ్లవలసి వచ్చిందో యిప్పుడు వారికి తెలిసింది. ప్రభువైన యేసు బెత్లేహేములో పుడతాడు. అలా అని బైబిలు చెబుతోంది. కాబట్టి వాళ్లక్కడ ఉండేలా దేవుడు చేసాడు. ప్రపంచాన్ని పరిపాలించేవాడు చక్రవర్తి కాడు, దేవుడు!

చిట్టచివరికి దూరంగా బెత్లెహేములోని చిన్న చిన్న యిళ్లు కనిపించాయి. అలసట కలిగించిన అంత దూర ప్రయాణం చేసాక ఇది వారికెంతో ఆనందాన్నిచ్చింది! దావీదు తన గొర్రెలను యిక్కడే కాసేవాడు. అతడు తనసితారాను వాయించినది యిక్కడే. తనను కాపాడిన మంచి కాపరిని గూర్చి పాట పాడింది కూడ యిక్కడే. దావీదు యేసు ప్రభుని ప్రేమించి ఆయన కోసం ఆశించాడు.

మరియ యోసేపుల హృదయాల్లో సహితం ఇదే ఆశ ఉన్నదని నేను గట్టిగ నమ్ముతాను.

వాళ్లు ఇదిగో బెత్లెహేము చేరారు. అప్పటికే చీకటి పడింది. వాళ్లెక్కడ నిద్రపోవాలి?

బెత్లెహేములో ఒక సత్రం ఉండేది. వచ్చేవారు ఉండడానికి అదో పెద్ద యిల్లులాంటిది. వాళ్లు వేగంగా ఆ సత్రం చేరారు. అయితే ఆ సత్రం యజమాని తల అడ్డంగా ఊపాడు - సత్రం నిండిపోయింది, స్థలం లేదు, అన్నాడు.

పోనీ మరో చోటికి వెళ్తే? లాభం లేదు. వాళ్లకి ఎక్కడా స్థలం లేదు. యోసేపు మరియలకీ, దేవునికి చివరికి యేసుకు కూడ ఈ లోకంలో స్థలం లేదు. ఎంత విచారకరం! ఎందుకంటే కొద్దిసేపట్లో మరియకు యేసు ప్రభువు పుట్టబోతున్నాడు!

ప్రభు యేసు తన పరలోకపు గృహాన్ని విడిచిపెట్టాలని ఆశిస్తున్నాడు. పాపులకు సంతోషాన్నివ్వడానికి. ఇప్పుడు ఆయనకే చోటు లేదు. అవును ఆయనకెవ్వరూ చోటీయరు. ఎంత విచారకరం!

యోసేపు - మరియా, రా అన్నాడు, యోసేపు చివరికో స్థలం చూచాడు. అయితే ఎక్కడ? పశువుల పాకలో! అక్కడ మనుష్యులు ఉంటారా? లేదు. పశువులు మాత్రమే ఉంటాయి. యోసేపు మరియ ఉండవలసిన స్థలం ఇదా? ప్రభువైన యేసు పశువుల పాకలో పుట్టాలా? అక్కడ పసుల తొట్టె తప్ప వేరె పడక లేదు. అది పశువుల గడ్డివేసే తొట్టి.

ఇప్పుడో అద్భుతమయిన పుట్టుక జరుగుతుంది. ఆరాత్రి, అదే పశువుల శాలలో యేసు ప్రభువు పుట్టాడు. మరియ ఆ శిశువును చాల జాగ్రత్తగ ఎత్తుకుంది. యోసేపు ప్రశాంతంగా వారిని చూస్తున్నాడు. అతడు మామూలు శిశువులా కనిపిస్తున్నాడు. అయితే --- ఆ శిశువులో ఏదో ప్రత్యేకత ఉంది. మిగిలిన వాళ్లంతా పాపులుగా పుడతారు. అయితే ఈ శిశువు అలాంటివాడు కాడు. ఇతడు పరిశుద్ధమయిన వాడు. అతడు దేవుని కుమారుడు. రక్షకుడు! మరియకు యోసేపుకు ఆ శిశువు తమ రక్షకుడని తెలుసు. ఆయన వారి కోసమూ, ఇంకా ఎంతో మంది కోసమూ ఈ లోకానికి వచ్చాడు. ఆయన పాపులను రక్షించడానికి వచ్చాడు.

మరియ ఆ శిశువును పొత్తి గుడ్డల్లో చుట్టి పశువుల తొట్టెలో పరుండబెట్టింది. ఆ స్థలం తప్ప వేరే ఏ చోటూ వారికి దొరకలేదు. ఒక రాజు తొట్టిలో పరుండాడు. అది సరియేనా?

అవును, వినండి!

యేసు ప్రభువు అటువంటి నీచమయిన చోట పుట్టాడు అంటే ఆయన ఈ లోకానికి రావడానికి ఎంత యిష్టపడ్డాడో తెలుస్తున్నది. ఇది గొప్ప అద్భుతం కదా? అతడు తన పరలోక నివాసాన్ని విడిచి పాపుల కోసం భూలోకానికి వచ్చాడు.

మన హృదయం ఓ యిల్లులాంటిది. ప్రభువు అచ్చట జీవించి మన హృదయాన్ని రాజులా పరిపాలించాలని ఆశిస్తున్నాడు. అయితే అవి ఈ పశుల పాకలా మురికిగా ఉన్నాయి. యేసు ప్రభువుకు అక్కడ చోటులేదు. నీ హృదయం కూడ మురిగ్గా ఉన్న పశువుల పాకలా ఉందని నీవు ఒప్పుకొనేలా ప్రభువు సాయం చేయాలి. నీవు ఆయనను రాజుగా చేసుకోవాలి. యేసు ప్రభువీ లోకానికి రాడానికి ఎంత యిష్టపడ్డాడో గుర్తుకు తెచ్చుకో. పాపులను ఆనందింప చేయడానికి ఆయన పశువుల శాలలో పుట్టాడు.

4. పశువులశాల వద్ద గొర్రెల కాపరులు

యేసు ప్రభువు పుట్టినట్టు ఎవ్వరికీ తెలియదు. ఆ శుభవార్త ఎవరు చెబుతారు? యోసేపు చెప్పడు, అతడు అసలు తండ్రి కాడు. పరలోకంలో ఉన్న దేవుడే అసలు తండ్రి. కాబట్టి ఆయనే ఆ సువర్తమానాన్ని చెబుతాడు. ఎంత అద్భుతంగా అది ప్రకటించ బడిందో కాస్త వినండి.

అది మధ్యరాత్రి సమయం. బెత్లెహేములో అందరూ నిద్రపోతున్నారు. అయితే ఆ ఊరిబయట కొందరు మాత్రం నిద్రపోవడం లేదు. వాళు గొర్రెల కాపరులు. వాళ్లొక మంట చేసుకున్నారు. చలివేయకుండేందుకు. ఆ మంట వలన క్రూర జంతువులు దగ్గరకు రావు. గొర్రెలన్నీ ప్రశాంతంగా నిద్రపోతున్నవి.

కాపరులు దిగులుగా ఉన్నారు. ఇశ్రాయేలు దేశంలో పరిస్థితులు బాగాలేవు. విదేశాలకు చెందిన సైనికులు వాళ్లని పరిపాలిస్తున్నారు. ఒక విదేశీ రాజు రాజ మందిరంలో నివసిస్తున్నారు. ఈ శత్రువుల నుంచి ఇశ్రాయేలు దేశాన్ని రక్షించేదెవరు? ఎవరూ లేరా? ఉన్నాడు. ఒకానొక దినం ఒక బలమైన రాజు వస్తాడు. దేవుడు అలా అని వాగ్దానం చేశాడు. ప్రజలీ రాజు కోసం చాల కాలంగా కనిపెడుతున్నారు. కాని ఆ రాజు రాలేదు. ఈ కాపరులకు అన్నిటి కన్నా ఎక్కువ దుఃఖం కలిగించేదేమో తెలుసా? మరో శత్రువున్నాడు. ఈ సైనికులకన్న అతడు బలమైన వాడు. ఆ శత్రువు పాపం.



పాపమనే ఈ శత్రువు వాళ్ల హృదయాల్లో నివసిస్తున్నాడు. దీని నుండి వాళ్లని రక్షించేదెవరు? వారిని నిజంగా సంతోష పరచే ఒకే ఒక వ్యక్తి ఎవరు? ఆ రాబోయే బలవంతుడయిన రాజు ఒక్కడే. ఆయనే రక్షకుడు. ఆయన రావాలని ఆశతో వాళ్లు కనిపెడుతున్నారు. వాళ్లాయన కోసం చాల కాలం కనిపెట్టారు. వాళ్లు చాల ప్రార్ధన చేసారు. అయినా ఆరాజు యింకా రాలేదు.

హఠాత్తుగా గొప్పకాంతి! అది పరలోకం నుండి వస్తోంది! ఓ, అది ఎంత భయం కలిగిస్తున్నది! అది ఏమిటబ్బా! గొర్రెల కాపరులు చాల భయపడ్డారు! వాళ్లు భయంతో వణుకుతున్నారు. వారి చుట్టూ గొప్ప వెలుగు ప్రకాశిస్తోంది. ఆ వెలుగులో ఎవరో నిలబడినట్టు కనిపిస్తున్నాది. అది ఒక దేవదూత. పరలోకం నుండి వచ్చాడు. ఇప్పుడు వాళ్లు చచ్చిపోతారా? వినండి. ఏదో స్వరం వినవస్తుంది! అది ఎంతో మృదువుగా ఉంది. ''కాపరులారా, భయపడకండి. నేను మీకు సంతోషకరమైన వర్తమానం తీసుకవచ్చాను. అదేమంటే రక్షకుడయిన యేసు ప్రభువు వచ్చాడు. ఆయన చిన్న శిశువుగా ఈ లోకంలో పుట్టాడు. ఆయన పొత్తిగుడ్డలతో చుట్టబడి, యొక తొట్టిలో పండుకొని ఉన్నాడు'' అని చెప్పింది.

అదిగో చూడండి, మరింత మంది దేవదూతలు! బహుశ వంద మంది, కాదు వేయిమంది దూతలు పరలోకం నుండి వస్తున్నారు. వాళ్లు పాటలు పాడుతున్నారు వినండి. ''ఉన్నతమయిన స్థలంలో దేవునికి మహిమ. మనుష్యులందరికీ భూమి మీద శాంతి సమాధానం కలుగుగాక'' అని పాడారు. ఆ దూతలు ఎంత తీయగా పాడుతున్నారు! గొర్రెల కాపరులు ఆశ్చర్యంతో ఆ పాట విన్నారు.

అప్పుడు ఆ దూతలు మాయమయ్యారు. వాళ్లంతా పరలోకానికి తిరిగి వెళ్లారు. మళ్లీ అంతా చీకటి. మరి గొర్రెల కాపరుల సంగతి యేమిటి? వాళ్లు - రండి, మనం బెత్లెహేముకు పోదాము. యేసు ప్రభుని చూద్దాం, అనుకున్నారు మరి గొర్రెల మాట యేమిటి? ఏదన్నా క్రూర జంతువు వస్తే? అబ్బే, వాళ్లలా భయపడనక్కరలేదు. దేవుడే ఆ గొర్రెలను కాపాడుతాడు.

అదిగో చూడండి. వాళ్లు ఆ చీకటి రాత్రిలో బయలుదేరారు. వాళ్లు చాల వేగంగా నడుస్తున్నారు. ఎందుకంటే వారి హృదయాల్లో అంత ఆశ ఉంది. వాళ్లు ఎక్కడికి వెళ్లాలి? ప్రభు యేసు వాళ్లకి ఎక్కడ కనిపిస్తాడు? పశువుల పాకలో. ఎందుకంటే ఆయన పశువుల తొట్టిలో పరుండి ఉంటాడని దూత చెప్పింది కదా?

చివరికి వాళ్లక్కడికి వెళ్లారు. భక్తితో పాకలో ప్రవేశించారు. చుట్టూ చూచారు. వారికేం కనబడింది? మరియ, యేసేపు --- ఓ, అక్కడ పశుల తొట్టి ఉన్నాయి. నెమ్మదిగా వాళ్లక్కడికెళ్లారు. వారి హృదయాలు సంతోషంతో కొట్టుకున్నాయి. వారు శిశువును చూచారు. వినయంతో మోకరించారు. ఈయనే ప్రభువయిన యేసు. ఈయనే రక్షకుడు. వాళ్లాయనను పూజించారు. ఆ శిశువు - గొల్లలారా, నేను మీ కోసం వచ్చాను. నా కోసం కనిపెడుతున్నారు. నా తండ్రి నన్ను మీ వద్దకు పంపాడు. నేను మీ రక్షకుడను, అని చెప్పుతున్నట్టు అనిపించింది.

మరియ యోసేపులు ఆశ్చర్యపడ్డారు. యేసు ప్రభువు పుట్టినట్టు గొల్లలకు ఎలా తెలిసింది? అప్పుడు గొల్లలు జరిగినదంతా మరియ యోసేపులకు చెప్పారు. దూతలు రావడం, పాటలు పాడడం అంతా చెప్పారు.

తరువాత గొల్లలు వెళ్లిపోయారు. తమ గొర్రెల వద్దకు వెళ్లారు. అయితే మార్గంలో కనిపించిన వారందరితో తాము చూచినవన్నీ తెలియచేసారు. వాళ్లు - మీరంతా పశుల పాక వద్దకు వెళ్లండి. యేసు ప్రభువు మిమ్మును కూడ రక్షింప నాశిస్తున్నాడు అని చెప్పారు.

అయితే మిగిలిన వాళ్లు ఎవ్వరూ పశుల పాకకు వెళ్లినట్టు కనిపించదు. చాలమంది కన్నులూ, చెవులూ ఈ అద్భుతాన్ని చూడ లేదు, వినలేదు. తమకో రక్షకుడు అవసరం అని వాళ్లు గ్రహించడం లేదు. అయితే దేవుని వెదికే చిన్న పిల్లలు, పెద్దవాళ్లు కొందరున్నారు. దేవుడు వారిని తన దగ్గరకు చేర్చుకుంటాడు.

దేవుడు మనతో కూడ ఇలా అంటున్నాడు - ఆ గొర్రెల కాపరులవలె నన్ను వెదికే వారికి నేను తప్పక దొరకుతాను.

5. సుమెయోను, అన్న

అందమయిన గొప్ప ఆలయం యెరూషలేములో ఉంది. ఆ ఆలయం దేవుని నివాసస్థలం. ప్రతిరోజూ ఎంతోమంది అక్కడికి అర్పణలు తెస్తూంటారు. కొన్ని సార్లు తల్లీ తండ్రీ తమ శిశువును అక్కడికి ఎత్తుకొని రావడం నీవు చూడగలవు. ఆ దినాల్లో బిడ్డ పుట్టి నపుడు ఆలయంలోని యాజకునికి తల్లిదండ్రులు కానుక తెచ్చే అలవాటు ఉండేది. అది ఒక గొర్రెపిల్ల లేదా రెండు పావురాలు. అక్కడ వాళ్లు దేవునికి కృతజ్ఞత చెల్లిస్తారు.

చూడండి, ఇంకా అక్కడ కొందరు తల్లిదండ్రులు ఆలయానికి వస్తున్నారు. వాళ్లొక కుమారుని ఎత్తుకొని వస్తున్నారు. వాళ్లు ఎత్తైన ఆలయం మెట్లు ఎక్కి వస్తున్నారు. అదెవరు? ఆ, వాళ్లు యోసేపు, మరియలు. వాళ్లు బాలయేసును తీసుకువచ్చారు. అవును, వాళ్లు అర్పణ నివ్వడానికే వచ్చారు.

యోసేపు ఓ చిన్న బుట్ట తీసుకవచ్చాడు. అందులో రెండు పావురాలున్నాయి. మరి గొర్రెపిల్ల ఎక్కడ? యోసేపు గొర్రెపిల్లను తేలేదు. ఎందుకంటే అది చాల ఖరీదయింది. యోసేపు మరియలు పేదవాళ్లు . అది కొనడానికి వాళ్ల దగ్గర కావలసినంత డబ్బు లేదు. అందుకని యోసేపు రెండు పావురం పిల్లల్ని తెచ్చాడు. దేవుడు దానికి అనుమతిస్తాడు, ఎందుకంటే వాళ్లు పేదవాళ్లు.

అయినా వారొక గొర్రెపిల్లను తెస్తున్నారు. చూడండి, మరియ దానిని జాగ్రత్తగా ఎత్తుకొని వస్తోంది. అది ప్రభు యేసు. అవును, అది బాలయేసే. ఆయనను చాలసార్లు దేవుని గొర్రెపిల్ల అని కూడ పిలుస్తాము. ఎందుకంటే ఆయనకూడ గొర్రెపిల్లలా చనిపోతాడు. తనబిడ్డల పాపాలకోసం. ఆయన వారి పాపశిక్షను భరిస్తాడు.

యెరూషలేములోని ఒక ప్రాంతంలో ఒక ముసలి వ్యక్తి నివసిస్తున్నాడు. ఆయన పేరు సుమెయోను. అతడు దేవున్ని ప్రేమిస్తాడని అందరికీ తెలుసు. అవును, అతనికి నూతన హృదయం ఉంది. అయితే కొన్ని సార్లు అతడు విచారంగా ఉంటాడు. ఎందుకంటే తన హృదయంలో ఇంకా పాపం ఉంది. అది అతనికి దుఃఖాన్ని కలిగిస్తున్నది. అయినా యేసు ప్రభువు వస్తాడని అతనికి తెలుసు. అందరి పాపాలను తీసివేయడానికి వస్తాడు. ఇది సుమెయోను మనసును సంతోషపరుస్తుంది! అతనికింకా ఏమి తెలుసునో మీరెరుగుదురా? అతడు చచ్చిపోక ముందు ప్రజలంతా ఎంతో కాలంగా కనిపెడుతున్న రక్షకుడిని చూస్తావని దేవుడు అతనికి చెప్పాడు.

ఆలయానికి వెళ్లడం సుమెయోనుకు చాల యిష్టం. అక్కడతడు దేవుని ఆరాధించవచ్చు. ఒక రోజు అతడక్కడికి వెళ్లాడు. ఈసారి అతడు చాల సంతోషంగా ఉన్నాడు! ఇప్పుడతడు అక్కడికి వెళ్లాలని దేవుడు చెప్పాడు. అతని హృదయంలో గొప్ప ఆశ ఉంది!

అతడు ఆలయం చేరాడు. యాజకులు అటుగా వెళ్లడం చూచాడు. అతడు బలిపీఠాన్నీ పశువులనూ చూచాడు. అయితే, అదిగో అక్కడ -- ఇద్దరు వ్యక్తులను చూచాడు. ఒక పురుషుడు, ఒక స్త్రీ. ఆమె శిశువును ఎత్తికొని ఉంది. ఆమె ఆ శిశువును యాజకునికి చూపిస్తోంది. ముసలి వాడైన సుమెయోను హృదయం ఆనందంతో గంతులు వేస్తోంది. ఎందుకంటే ఆ శిశువు ఎవరో అతడు గ్రహించాడు. దేవుడు దానినతనికి బయలుపరచాడు.

తాను నడవగలిగినంత త్వరగా సుమెయోను యోసేపు మరియల దగ్గరకు వెళ్లాడు. అతడు తన చేతులను చాపాడు. అవి ఆశతో వణకుతున్నవి. ఆనందంతో కళ్లు మెరుస్తున్నాయి. ఆ శిశువును అతడు తన చేతుల్లోకి తీసుకున్నాడు. అతడు సాక్షాత్తూ యేసు ప్రభువే. రక్షకుడు తన కనుల యెదుటే ఉన్నాడు! సుమెయోను ఎంత ఆనందించాడు! ఆ శిశువు తన కోసం వచ్చాడని అతడెరుగును. ప్రభుయేసే రక్షకుడని యెరుగును. సుమెయోను యేమి చెబుతున్నాడో వినండి "ప్రభువా, నేనిపుడు సమాధానంతో చచ్చిపోగలను." అతడిలా ఎందుకన్నాడు? చచ్చిపోవడం విచారకరం కదా? లేదు. సుమెయోనుకది విచారకరం కాదు. ఎందుకంటే అతడు పరలోకానికి వెళ్తాడు. అక్కడ సదా



దేవునితో ఉంటాడు. సుమెయోను నిజంగా ధన్యుడు.

అదే సమయంలో ఒక వృద్ధురాలు కూడ అక్కడికి వచ్చింది. ఆమె పేరు అన్న. ఆమె కూడ చాల సంతోషంగా కనిపించింది. ఆమె కూడ దేవుని బిడ్డయే. ప్రభుయేసు ఆమెకు కూడ రక్షకుడు. సుమెయోను శిశువును తిరిగి మరియకు అప్పగించాడు. యోసేపు మరియలు యేసుతో పాటు బెత్లెహేముకు వెళ్లిపోయారు.

సుమెయోను, అన్న కూడ తమ యిళ్లకు వెళ్లారు. అన్న వెళ్లి యేసు ప్రభుని రాకను గురించి యెరూషలేము లోనున్న అనేక మందికి చెప్పింది.

బాలయేసును ఎత్తుకొనినపుడు సుమెయోను ఇంకా ఏం చెప్పాడో తెలుసా? చాల మంది రక్షణ పొందుతారని చెప్పాడు. ప్రపంచంలో నున్న అనేక దేశాలవాళ్లు కూడ. ఇది దేవుడు చెప్పిన వర్తమానం. అందరికీ దీనిని ప్రకటించమని దేవుడు సుమెయోనుకు చెప్పాడు. దేవుడు తన వాగ్దానాన్ని సదా నెరవేర్చుతాడు. దేవుడు సుమెయోను అన్నలకు ఇచ్చినట్టు నీక్కూడ నిజమైన సంతోషం యివ్వగలడు!

6. తూర్పు దేశం నుండి జ్ఞానులు

చాల దూర దేశంలో కొందరు తెలివిగల మనుష్యులు నివసిస్తున్నారు. ఆదేశం తూర్పు దిక్కున ఉంది. అందువల్ల వాళ్లను "తూర్పు దేశపు జ్ఞానులు" అని పిలిచారు.

రాత్రి సమయంలో వాళ్లు నక్షత్రాలను పరిశీలిస్తుంటారు. ఆ అందమయిన మిణుకు మనే చుక్కలను గురించి వాళ్లకి చాల తెలుసు! వాళ్లు నిజంగా తెలివైన జ్ఞానులు. కొన్ని సార్లు వాళ్లు నక్షత్రాల ద్వారా కొన్ని విషయాలు తెలుసుకుంటారు.

ఒక రాత్రి ఈ జ్ఞానులు చుక్కలను పరిశీలిస్తున్నారు. "అదో, చూడండి, అక్కడ చూడండి,---ఎంత పెద్ద అందమయిన నక్షత్రమో!" అన్నాడు ఒక జ్ఞాని.

మిగిలిన వాళ్లు కూడ దానిని చూచారు. అంత చక్కని చుక్కను వారంతకు ముందు ఎన్నడూ చూడలేదు. వాళ్లు "ఈ చుక్క పుట్టడానికి ఏదో అర్థం ఉంది" అని అనుకున్నారు. "ఇది ఎవరో ఒక గొప్ప వ్యక్తి పుట్టుక తెలుపుతోంది. అది ఒక రాజబిడ్డ కావచ్చును. ఎందుకంటే చుక్క కాంతితో ప్రకాశిస్తోంది". అది అన్నిటికన్న అందంగా ఉంది. జ్ఞానులు ఆ చుక్క గురించే ఆలోచిస్తు న్నారు. ప్రతి రాత్రి దానిని చూస్తున్నారు అప్పుడు దేవుడు అది ఎందుకు వచ్చిందో వాళ్లకి తెలిపాడు. అద్భుతమయిన ఓ రాజు పుట్టాడు. వాళ్లా చుక్కవెంట వెళ్తే ఆయనను కనుగొంటారు.

వెంటనే వెళ్లి ఆ రాజును చూడాలని వాళ్లు నిశ్చయించారు. విలువైన, అందమయిన కానుకలు వాళ్లు తీసుకపోయారు. ఈ చిన్న రాకుమారునికి సువాసన గల నూనెలు, లేపనాలు, బంగారు వస్తువులు తీసుకపోయారు. ఎందుకంటే జ్ఞానులు చాల ధనవంతులు.

కాబట్టి వాళ్లు సిద్ధపడి బయలుదేరారు. తమతో ఆహారం, నీళ్లు తీసికెళ్లారు. అది చాల దూర ప్రయాణం. అన్నీ ఒంటెల మీద ఎక్కించారు. అవి బలమైన, పెద్ద జంతువులు. నీవు గుర్రం మీద కూర్చున్నట్టు కూర్చోవచ్చు. అదిగో వెళ్తున్నారు. వాళ్లు పెద్ద అడవులు, నిశ్శబ్దంగా ఉండే ఎడారుల గుండా ప్రయాణం చేయాలి. రాత్రివేళ చాల చలిగా ఉంటుంది. పగలు చాల వేడిగా ఉంటుంది. అయినా వాళ్లు చుక్క వెంబడి వెళ్తున్నారు. అడవి జంతువులు వాళ్ల నెదిరించవా? దొంగలు దోచుకోరా? లేదు, దేవుడే వీరిని కాపాడుతాడు. ఎందుకంటే వారు యేసు ప్రభువును వెదకుతున్నారు.

చివరికి వారు ఇశ్రాయేలు దేశం చేరారు. పెద్ద నగరమయిన యెరూషలేముకు వెళ్లారు. అక్కడ రాజు గారి భవనం ఉంది. రాజకుమారుడు ఇక్కడే పుట్టి ఉంటాడని అనుకున్నారు. వాళ్లా యెరూషలేములో కొందరిని అడిగారు. "రాజకుమారుడు ఎక్కడ పుట్టాడు"? వాళ్లు ఆశ్చర్యంగా చూచారు. "రాజభవనంలో ఎవరూ పుట్ట లేదు" అని చెప్పారు. అయితే జ్ఞానులు "మేము ఆయన తారను తూర్పు దిక్కున చూచాము" అన్నారు.

వాళ్ల మాటలు ఎవ్వరికీ అర్థం కాలేదు.

హేరోదు రాజు రాజభవనంలో ఉంటాడు. అతడు క్రూరమయిన రాజు. అతనికి దేవుడన్నా ఇశ్రాయేలు ప్రజలన్నా యిష్టంలేదు. హేరోదు జ్ఞానులు వచ్చిన సంగతి విన్నాడు. వాళ్లు కొత్తగా పుట్టిన రాజును వెదకుతున్నారని తెలుసుకున్నాడు. దీనికి అతడు భయ పడ్డాడు. రాజు పుట్టాడా? ఈ కొత్తరాజు నన్ను వెళ్లగొడతాడా? లేదు, ఎంతమాత్రం వీల్లేదు, నేనే రాజుగ నిలిచి ఉండాలి. ఈ కొత్త రాజును చంపేస్తాను అనుకున్నాడు. ఇతడెంత క్రూరుడు! అయితే ఆ రాజు ఎక్కడ ఉన్నాడు? అది తెలుసుకోడానికి హేరోదు శాస్త్రులను అడిగాడు. వీళ్లు బైబిలు పండితులు. వాళ్లిలా చెప్పారు. "రాజా, నిజమే. బెత్లెహేములో ఓ రాజు పుడతాడని బైబిలు చెబుతోంది."



అప్పుడు హేరోదు తన సేవకునితో - వెళ్లి ఆ జ్ఞానులను పట్టుకురా అన్నాడు. కొద్దిసేపటిలో తూర్పు నుండి వచ్చిన ఆ జ్ఞానులు రాజభవనంలోని ఓ గొప్పగదిలో నిలబడ్డారు. రాజు పైకి స్నేహ పూర్వకంగా కనబడ్డాడు కాని అతని హృదయంలో మోసం ఉంది. హేరోదు వారితో ''ఇక్కడ శిశువులెవ్వరూ పుట్టలేదు. అయితే మీరు బెత్లెహేము వెళ్లి అతడు కనబడే దాక వెదకండి. దొరికాక నా వద్దకు వచ్చి తప్పక తెలియజేయండి. అప్పుడు నేనూ వెళ్లి పూజిస్తాను.

జ్ఞానులు అలాగేనని మాట యిచ్చారు. హేరోదు అబద్ధం చెబుతున్నట్టు వాళ్లకి తెలియదు. అతడు యేసును పూజించాలనుకోవ డం లేదు. ఆయన్ని చంపాలనుకుంటున్నాడు. జ్ఞానులు మళ్లీ ప్రయాణమయ్యారు. వాళ్లు బెత్లెహేముకు వెళ్తున్నారు.

మళ్లీ అది రాత్రి వేళ. హఠాత్తుగా ఒక జ్ఞాని - ఓ, అలా పైకి చూడండి. ఆ తార మళ్లీ వచ్చింది - అన్నాడు.

అంతా పైకి చూచారు. అందమయిన ఆ తార తిరిగి వెలిసింది. జ్ఞానులెంత సంతోషించారు! దేవుడే తమను నడిపిస్తున్నాడు.

''మీరు సరైన మార్గంలో నడుస్తున్నారు. మీరెక్కడికి వెళ్లాలో నేను చెబుతాను. నన్ను వెంబడించండి'' అని తార చెప్పినట్టు అనిపించింది.

చూడండి, ఆకాశం గుండా కదులుతోంది. జ్ఞానులు దానిని అనుసరిస్తున్నారు. అది ఒక చిన్న ఇంటి పైన సరాసరి ఆగింది. ఇది ప్రభువుకార్యం. ఆయనే వారిని నడిపించాడు. జ్ఞానులారా, చూడండి. రాజకుమారుడ్ని మీరు ఇక్కడే చూస్తారు!

వారు చాల దూరం వచ్చారు. చివరికి వాళ్లు గమ్యం చేరారు. ఎంతో ఆశతో వాళ్లు ఇంటిలో అడుగు పెట్టారు. వాళ్లు తల్లి మరియమ్మను చూచారు. అదిగో చూడండి...అక్కడ రాజుగా పుట్టిన శిశువు ఉన్నాడు! వాళ్లు వినయంతో మోకరించారు. ఆయన్ని ఆరాధించారు. దేవున్ని ఆరాధించినట్టే. ఈ రాజు తమ రాజుగ ఉండాలనుకోవడం దేవుడు చేసిన అద్భుతం. తమ కోసం కూడ ఈయన భూలోకానికి దిగివచ్చాడు. వాళ్లెంతో ఆనందించారు. ఆయన్ని నిత్యం ప్రేమించి సేవించాలనుకున్నారు.

వాళ్లు తమ కానుకలు విప్పారు. వాటిని తమ రాజుకు అర్పించారు. అయితే వారు సమర్పించిన వాటన్నిటిలో అతి శ్రేష్ఠమయినదేదో తెలుసా? అవి వాళ్ల హృదయాలు.

ఇదే విషయాన్ని దేవుడు మనతో చెబుతున్నాడు.

''మీ హృదయాలు నాకివ్వండి''. అప్పుడు మాత్రమే జ్ఞానులకు వలె మనకూ నిజమైన ఆనందం కలుగుతుంది.



7. బెత్లెహేములోని చిన్న పిల్లలను హేరోదు చంపుట

తూర్పుదేశం నుండి వచ్చిన జ్ఞానులు తిరిగి వాళ్ల ఇంటికి వెళ్తున్నారు. వాళ్లు తమ స్వదేశానికి వెళ్తున్నారు.

వాళ్లు యెరూషలేముకు వెళ్తారా? తాముయేసు ప్రభుని కనుగొన్నామని హేరోదు రాజుకు చెబుతారా? లేదు. చెప్పరు. మరి చెబుతామని రాజుకు మాటిచ్చారుగా? అవును యిచ్చారు కాని. దేవుడు - హేరోదు దగ్గరకు వెళ్లక వేరే త్రోవలో యింటికి వెళ్లిపొమ్మని వాళ్లతో చెప్పాడు. అందుకని వాళ్లలాగే చేసారు.

హేరోదు రాజు వీళ్ల కోసం చాల దినాలు కనిపెట్టాడు. ఈ జ్ఞానులు ఇన్నిదినాలు రాలేదేమిటి? అనుకున్నాడు. మరి కొన్ని రోజులు చూచాడు. అప్పుడు ఇక వేచి చూడలేక - జ్ఞానులు తిరిగి రాలేదు, మోసం చేసారు, అని అన్నాడు.

రాజు ఆ జ్ఞానుల మీద చాల కోపించాడు. తరువాత అతడొక క్రూరమయిన పథకం వేసాడు. అతడు సైనికులను పిలిచాడు. వాళ్లతో - మీరు బెత్లెహేముకు వెళ్లి రెండు సంవత్సరాలకు తక్కువ వయసుగల మొగపిల్లలందర్నీ చంపండి అన్నాడు. ఎంత భయంకరం! రాజు ఎందుకలా చేసాడు? రాజు ఇలా అనుకున్నాడు - నేనిలా చిన్న పిల్లల్ని చంపించితే రాజబిడ్డ యేసుప్రభువు కూడ చచ్చిపోతాడు. అప్పుడు అతడు పెద్దవాడయ్యాక నన్ను తరిమి వెయ్యడు.

కాబట్టి సైనికులు బెత్లెహేముకు బయలుదేరారు. బెత్లెహేము లోని ప్రజలు ఖంగారు పడ్డారు. సైనికులు ఎందుకు వస్తున్నారు అయ్యో, వాళ్లు ఇళ్లల్లోకి చొరబడుతున్నారు. పిల్లల పడకల్లో చిన్న పిల్లలున్నారా అని వెదుకుతున్నారు. వీళ్లందర్నీ ఏంచేస్తారు? చంపేస్తారు! ఎంత భయంకరం! ఆ తల్లుల ఘోష వినండి! వారి దుఃఖానికి అంతులేదు.

అయితే యోసేపు, మరియ బాల యేసు నివసిస్తున్న చిన్న యింటి మాట యేమిటి? సైనికులు ఆ యింటిలోకి కూడ వెళ్లారా? అవును వెళ్లారు. కాని అందులో ఎవ్వరూ లేరు. అంతా ఖాళీ? ఇప్పుడు యోసేపు మరియ అక్కడ లేరు. బాలయేసూ లేడు. వీళ్లంతా ఎక్కడి కెళ్లారు? ఈ కథ వినండి.

ఒక రాత్రి యోసేపు నిద్రలో కలకన్నాడు. అందులో దేవుడు అతనితో ''యోసేపూ, నీవు మరియనూ, బాలయేసునూ తీసుకొని పారిపో. నీవు మరో దేశానికి తప్పించుకపోవాలి. హేరోదు యేసుని చంపజూస్తున్నాడు.''

యోసేపు నిద్ర లేచాడు. మరియను కూడ లేపాడు. అది రాత్రి వేళ. చీకటిలోనే త్వరగా ఇల్లు విడిచి పెట్టారు. బాలయేసును కూడా తీసుకుపోయారు. అలా వాళ్లు చీకిటిలో దూరదేశానికి తప్పించుకు పోయారు. వాళ్లు ఈజిప్టు చేరారు. అది దూర ప్రయాణం, ప్రమాదంతో కూడినది. అయినా దేవుడు వారిని కాపాడాడు. ఎందుకంటే యేసు ప్రభువు ఆయన కుమారుడు.

సైనికులు తిరిగి యెరూషలేము చేరారు. బెత్లేహేములోని చిన్న పిల్లలందరినీ చంపామని హేరోదుకు తెలిపారు. అతడు - మంచిది. రాజకుమారుడు, కొత్త రాజు కూడా చనిపోయి ఉంటారు అనుకున్నాడు. కాని అలా జరుగలేదు. దేవుడు ఆ శిశువును కాపాడాడు. తండ్రి అయిన దేవుడే ఆ శిశువు తండ్రి కనుక.

ఇక నిత్యం తానే రాజుగా ఉంటానని హేరోదు అనుకున్నాడు. కొంత కాలానికి అతను కూడ చచ్చిపోవాలి. తన చెడ్డ మనసుతో దేవుని ఎదుట కనిపించాలి. శిక్ష అనుభవించాలి, నరకానికి పోవాలి. అక్కడ ఎప్పుడూ బాధయే, దుఃఖమే. అదెంత భయంకరం! అయితే అతనికి అదేతగిన శిక్ష.


ఇప్పుడు యోసేపు మరియలు బాలయేసుతోపాటు ఇశ్రాయేలు దేశానికి తిరిగి వెళ్లారు. అలా చేయడం క్షేమకరమని ఒక దూత కలలో యోసేపుకు తెలిపాడు.

వాళ్లు ఈజిప్టు నుండి ఇశ్రాయేలు దేశం చేరారు.

వాళ్లు నజరేతులో నివసిస్తారు. అక్కడికి వెళ్లమని దేవుడు వారికి చెప్పాడు. యోసేపు తాను ముందు చేస్తున్న వండ్రంగి పనినే చేస్తాడు. బాలయేసును భద్రంగా చూస్తాడు. మరియ ఆయన తల్లి కనుక ఆమె కూడ జాగ్రత్తగ చూస్తుంది. దేవుడు వారిని కాపాడుతాడు. ఎందుకంటే దేవుడే యేసు తండ్రి. మరియ యోసేపుకు ఆయన పరమ తండ్రి.

దేవుడు హేరోదు పట్ల దయచూపించాడు. అతడు దేవుని వైపు తిరుగక ఆలస్యం చేసాడు. మనసు మార్చుకోకుండా చచ్చిపోయాడు.

అయితే అది నీకు ఆలస్యం కాదు. మనపై దయ చూపమని ఇప్పుడు కూడ దేవుని అడగవచ్చు. మనలను రక్షించడానికి ఆయన ఇష్టపడుతున్నాండు.



8. యేసుప్రభువు పన్నెండు యేండ్ల బాలుడుగా ఉన్నపుడు

యేసుప్రభువు నజరేతులో నివసిస్తున్నాడు. ఆయన ఇప్పుడు పన్నెండేళ్ల బాలుడిగా ఎదిగాడు. చాలమంది ఆయన అందరిలాంటి సామాన్యమయిన బాలుడని అనుకుంటారు. ఆయన దేవుని కుమారుడని వాళ్లు గ్రహించడంలేదు. మరియు యోసేపులకు అది తెలుసుననుకోండి. నజరేతులోని మిగిలిన పిల్లలకీ యేసుకీ మధ్య చాల భేదం ఉందని వారు గమనించారు. ఆయన చిన్నవాడుగా ఉన్నపుడు చిలిపి పనులు చేయలేదు. పెద్దవాడయ్యాక చెడ్డపనులు చేయలేదు. ఆయనను శిక్షించవలసిన అవసరం ఎన్నడూ కలుగలేదు. యేసు ప్రభువు ఎన్నడూ పాపంచేయలేదు, ఒక్కసారి కూడ. ఆయన పరిశుద్ధమయిన బాలుడు.

పస్కాపండుగ దగ్గర పడుతోంది. చాలమంది యెరూషలేం వెళ్తున్నారు. అక్కడో పెద్ద దేవాలయం ఉంది. దేవుడ్ని ప్రార్థించడానికి అందరూ అక్కడికి వెళ్తారు. అర్పణలు అర్పిస్తారు. యోసేపు మరియలు కూడ అక్కడికి వెళ్తున్నారు. వాళ్లతో యేసు కూడ వెళ్తున్నాడు. బహుశ ఆయనకిది మొదటి సారి ఆయ్యుండవచ్చు. ఎందుకంటే ఆయనకు పన్నెండేండ్ల వయసు వచ్చింది. ఆయనకు అది సంతోషాన్ని కలిగించింది, ఎందుకంటే అది తన తండ్రి యిల్లు.

అది దీర్ఘప్రయాణం. వాళ్లు చాల దినాలు నడవాలి. దారిలో అందరూ మాట్లాడుకొంటారు. వాళ్లు మంచి పాటలు పాడుతారు. వాళ్లు యెరూషలేము గురించీ, దేవాలయం గురించీ, దేవుని గురించీ మంచి పాటలు పాడుతారు.

వాళ్లంతా యెరూషలేము చేరారు. దూరంలో అందమయిన దేవాలయం కనబడుతోంది. ఎందుకంటే అది ఎత్తయిన కొండమీద కట్టబడింది. యెరూషలేము వీధుల్లోనూ, దేవాలయంలోనూ అంతా హడావుడిగా ఉంది!

బలిపీఠంమీద చాల పశువులను బలియిస్తున్నారు. ఒక పంద లేదా వెయ్యి గొర్రెలూ, గొర్రెపిల్లలూ చంపబడ్డాయి. ఇది నిజమయిన దేవుని గొర్రెపిల్లను గుర్తు చేస్తున్నది. అదెవరో ఎవ్వరికీ తెలియదు. అది ప్రభువైన యేసే. అసలయిన గొర్రెపిల్ల ఇప్పుడు ఆలయంలో ఉంది! పండుగ ముగిసింది. ప్రజలంతా ఇళ్లకు తిరిగి వెళ్తున్నారు. మరియ యోసేపులు కూడ తిరుగు ముఖం పట్టారు. మొదటి రోజు ప్రయాణంలో వాళ్లు స్నేహితులతో మాట్లాడుతున్నారు. యేసు వారితో లేడు. అతడు మిగిలిన మిత్రులతో తప్పక ఉంటాడని వాళ్లనుకున్నారు. చీకటి పడేసరికి తమను కలుసుకుంటాడు. ఎందుకంటే నిద్రపోవడానికి వాళ్లొక స్థలం వెతుక్కోవాలి.

బయట చీకటి పడుతోంది. ఇక రాత్రికి ఆగాలి. కాని యేసుకనిపించలేదు. ఆయన కోసం వాళ్లు వెతికారు కాని ఎక్కడా కనిపించలేదు. "మా కొడుకు యేసును చూచారా?" అని అందరినీ అడిగారు.

లేదు, ఎవ్వరూ చూడలేదు. యోసేపు మరియలు చాల కలవరపడ్డారు! ఆయన ఎక్కడ? అనుకుంటూ తిరిగి యెరూషలేము వెళ్లారు. నిండు మూడుదినాలు ఆయనకోసం చాల వెదికారు. చివరికి వాళ్లు ఆలయానికి వెళ్లారు. అక్కడ ఒక గదిలో ఎవరో మాటలాడుతున్న స్వరం వినిపించింది! వాళ్లు కొంత మందిని చూచారు. వాళ్లంతా పండితులు. బైబిలు గూర్చి చాల తెలిసిన వాళ్లు. అక్కడ మరెవరిని చూచారు? యేసు ప్రభుని!

ఆ పండితులు ఆయన మాటలకు ఎంత ఆశ్చర్యపడుతున్నారు! ఈ బాలుడు ఎంత ఎరుగును! ఎంత తెలివిగలవాడు! అతడు దేవునికుమారుడని వారెరుగరు.

చిట్ట చివరికి యేసు కనిపించినందుకు యోసేపు మరియలు చాల ఆనందించారు. మరియ - నా కుమారుడా, ఎందుకిక్కడ నిలిచిపోయావు? మేము ఎంత కలవరపడ్డామో తెలుసా? ఎన్నో రోజులుగా నేనూ మీ నాన్నా నీ కోసం వెదకుతున్నాము, అన్నది.

అయితే మరియ ఏం చెబుతున్నది? మీ నాన్నా నేనూ అన్నది! యోసేపు యేసు తండ్రికాడు. ఆయన తండ్రి దేవుడు. ఒక్క క్షణం ఈ మాట మరియ మరిచిపోయింది.



అప్పుడు యేసు "మీరెందుకు నా కోసం చూచారు? నేను నా తండ్రి యింటిలో ఉండాలని మీరు ఎరుగరా? నేను నా తండ్రి గురించి మాటలాడాలి కదా? అన్నాడు. యేసు చిలిపివాడుకాడు. ఆయన తన పరలోకపు తండ్రి చిత్తాన్ని జరిగించాలి. కాబట్టి ఆయన ఆ పండితులతో తన తండ్రి గురించి చెబుతున్నాడు. అందుకే ఆయన దేవాలయంలో ఉండిపోయాడు. అది ఆయన తండ్రి యిల్లు. ఇప్పుడు యేసు మరియ యోసేపులతో తిరిగి నజరేతు వెళ్లాడు. ఆయన వారికి విధేయుడుగా ఉన్నాడు.

మనం కూడ విధేయత చూపాలని, పిల్లలు తల్లిదండ్రుల మాట వినాలనీ ఆయన కోరుతున్నాడు. అయితే అందరం దేవునికి లోబడాలి. కాని తరచు మనం వినం. చాలసార్లు లోబడం. పిల్లలూ, పెద్దలూ ఇది చేస్తారు.

మన హృదయాలు మారడం చాల అవసరం. దేవుని వెంబడించే మనసు కలిగి ఉండాలి. అప్పుడు మన మంతా ఆయనకు లోబడతాము.

9. బాప్తిస్మం ఇచ్చే యోహాను

యేసు ఇప్పుడు పెరిగి పెద్దవాడయ్యాడు. బాలునిగా ఉన్నప్పుడు నజరేతులో నివసించాడు. అయితే ఇప్పుడు వేర్వేరు స్థలాలకు వెళ్తున్నాడు. మొదట ఆయన ఎక్కడికి వెళ్లాడు? యొర్దాను నదికి.

అక్కడ చాల సందడిగా ఉంది! ప్రజలు నిశ్శబ్దంగా నిలబడి వింటున్నారు. ఎవరి మాటలు వింటున్నారు? బాప్తిస్మం యిచ్చే యోహాను మాటలు. అతడు జెకర్యా ఎలీసబెతుల కుమారుడు.

చాల కాలం యోహాను అరణ్యంలో ఒంటరిగా జీవించాడు. అతడు దేవుని గూర్చి చాల ఆలోచించాడు. అతడాయనకు చాల ప్రార్థించాడు. యోహాను చిన్నవాడిగా ఉన్నపుడే దేవుడతనికి ఒక నూతన హృదయాన్నిచ్చాడు. చిన్న పిల్లల హృదయాలను కూడ దేవుడు నూతనపర్చగలడు.

ఇప్పుడు యోహాను యొర్దాను నదివద్ద ఉన్నాడు. దేవుని వర్తమానాన్ని అతడు ప్రజలకు అందిస్తున్నాడు. అతడు దైవసేవకుడు. నదిఒడ్డున చాల మంది ఉన్నారు. అతడా ప్రజలకు చెప్పేది వినండి - మారు మనసుపొంది, దేవుని వైపు తిరగండి. అంటే మీ పాపాల కోసం విచారించి వాటిని విడిచిపెట్టండి. దేవుని సేవించండి. ఎంత విచారకరం! కాని వాళ్లు తాము తప్పులో ఉన్నామని అనుకోరు. తమ హృదయం నిండా పాపం ఉందని అనుకోరు.

అప్పుడు యోహాను గట్టిగ ఇలా చెప్పాడు. "మీరు మారు మనసు పొందకపోతే దేవుడు శిక్షిస్తాడు". ఇది విని కొందరు అతడే రక్షకుడనుకున్నారు. "నేను రక్షకుడ్ని కాను" అన్నాడు యోహాను, "నేనాయన సేవకుడను. ఆయన నాయజమాని. నేనాయన గూర్చి ప్రకటించడానికి వచ్చాను. ఆయన త్వరగా వస్తున్నాడు."

చూడండి, కొందరతని మాటలు విని విచారిస్తున్నారు. వాళ్లు తమ పాపాల కోసం నిజంగా విచారిస్తున్నారు. వాళ్లు "మేం పాపం చేసాము. మా హృదయం దుష్టత్వంతో నిండి ఉంది. మా హృదయాలు శుభ్రమవుతాయా?" అని అడిగారు.

యోహాను వాళ్లతో "రండి, మీరు బాప్తిస్మం తీసుకోవాలి" అన్నాడు.

చూడండి, యోహాను వాళ్లని యొర్దాను నది దగ్గరకు తీసికెళ్తున్నాడు. వాళ్లకి బాప్తిస్మం యిస్తాడు. దాని అర్థం యేమిటి? వినండి.

నీ చేతులెప్పుడయినా మురికి అయ్యాయా? నీవు వాటిని శుభ్రమయిన నీటితో కడుక్కుంటావు కదూ? పాపంతో నిండిన మీ హృదయాలను కూడ కడుగవచ్చు. కాని నీళ్లతో కాదు. యేసుప్రభువు ద్వారా. ఆయన నీ పాప శిక్షను అనుభవిస్తాడు. ఆయన తన జీవితాన్ని, అంటే తన రక్తాన్ని ధారపోసాడు! ఈ కారణం వల్ల "యేసురక్తము మన పాపములన్నిటి నుండి మనలను కడిగి విముక్తులను చేయును" అని బైబిలు చెబుతున్నది. యేసు తన పిల్లలకోసం, తనను ప్రేమించే వారి కోసం యిది చేస్తాడు.

చూడండి. ఎవరో వస్తున్నారు. యోహాను భక్తితో ఆయనను చూస్తున్నాడు. ఆయన యెవరో యోహానుకు తెలుసు. ఆయన యేసు ప్రభువు!

యేసు తనకు బాప్తిస్మ మిమ్మని యోహాను నడిగాడు. అతడు తల అడ్డంగా తిప్పాడు. యేసు ప్రభువు బాప్తిస్మం తీసుకోనవసరం లేదు. ఆయన పాపం చేయలేదు. ఆయన హృదయం పవిత్రమయినది.


యోహాను "ప్రభువా, నేను నీకు బాప్తిస్మం యివ్వాలా? లేదు లేదు, నాకే అది కావాలి, ఎందుకంటే నేనే పాప హృదయం కలిగి ఉన్నాను" అన్నాడు. అప్పుడు యేసు "యోహానూ, అలా అనకు. నీవు నాకు బాప్తిస్మం యివ్వడం నా తండ్రి చిత్తం" అన్నాడు.

ఇద్దరూ నీటిలోదిగారు. యోహాను యేసుకు బాప్తిస్మం యిచ్చాడు. అప్పుడు ఆకాశం నుండి ఏదో దిగి వస్తున్నది. అదేమిటి? అదో పక్షిలా కనిపిస్తున్నది. అది ఒక పావురంలా ఉంది. అది యేసు తలపై కూర్చుంది. అది పరలోకం నుండి వస్తున్న పరిశుద్ధాత్మ, పరిశుద్ధాత్ముడు దేవుడు కూడ. యేసుకు ఆయన పనిలో సహాయం చేయడానికి వచ్చాడు. ఇది యేసు అభిషేకం పొందినట్టు


కనిపింప చేసింది. దావీదుకు జరిగినట్టు నూనెతో కాదు, పరిశుద్ధాత్మతో!

అప్పుడు---హఠాత్తుగ ప్రజలంతా ఒక స్వరం విన్నారు. అది పరలోకం నుండి వినిపించిన దేవుని స్వరం. "ఈయన నా ప్రియ కుమారుడు, ఈయనయందు నేనానందించుచున్నాను" అని వినిపించింది. ఇప్పుడు ప్రజలు స్వయంగా యేసు నిజంగా దేవుని కుమారుడని తెలుసుకున్నారు.

బహుశా నీవు కూడా బాప్తిస్మం పొంది ఉండవచ్చు. అప్పుడు నీవు చిన్నవాడవేమో. ఆ సమయంలో దేవుడు నీతో "నీకొక అపవిత్రమయిన హృదయం ఉంది. అది పాపం వలన కలిగింది. అయితే దానిని శుభ్రపరచవచ్చు. నీ మురికి మనసును శుభ్రంగా కడగవచ్చు అన్నాడు. అలా చేయమని దేవుడ్ని అడగడం మర్చిపోకు. ఒక వేళ నీవు బాప్తిస్మం పొందలేదేమో. అయినా దేవుడు నీ హృదయాన్ని కూడ శుభ్రపరచగలడు. ఆ తరువాత నీవు బాప్తిస్మం తీసుకోవచ్చు. దీని గూర్చి ప్రార్థించడం మర్చిపోకుసుమా.



10. యేసుని మొదటి శిష్యులు



బాప్తిస్మమిచ్చే యోహాను మరోసారి యొర్దాను నదికి వచ్చాడు. మళ్లీ అతడు "పశ్చాత్తాపం పొంది మారుమనసు పొందండి" అని ప్రజలకు ప్రకటించాడు. యోహాను ఒంటరిగా లేడు. అతనితో ఇద్దరు మనుష్యులున్నారు. వాళ్ళిద్దరూ యోహాను మాటలు వినాలని ఆశించారు. అతడు చెప్పేదంతా వారు నమ్ముతారు. తమ పాపాలను గురించి విచారించారు. యోహాను బోధిస్తున్నప్పుడు వాళ్లు తమ హృదయాలను తెరచారు. వారిలో ఒక వాంఛ ఉండింది. ఎందుకంటే బాప్తిస్మ మిచ్చే యోహాను త్వరలో రక్షకుడు వస్తాడని చెప్పినందున.

అంతలో యేసు అటువైపుగా నడిచి రావడం యోహాను చూచాడు. ఆ ఇద్దరు జాలరులు దగ్గర నిలబడి ఉన్నారు. వాళ్లకి యేసు ఎవరో తెలియదు. కాబట్టి యోహాను యేసును చూపించి "దేవుని గొర్రె పిల్లను చూడండి" అని చెప్పాడు.

అవును. యేసుప్రభువు నిజంగా దేవుని గొర్రెపిల్లయే. ఆయన మరణించే దినం వస్తుంది. ఆలయంలో అర్పించే చిన్న గొర్రెపిల్లలా ఆయన ఒక రోజు మరణిస్తాడు. అలాగే పాపపరిహారం కోసం ఆయన తనను తాను అర్పించుకుంటాడు.

యోహాను ఆండ్రెయ ఈ మాటలు విన్నారు. తమ యెదుట ఉన్నయేసే దేవుని గొర్రెపిల్ల అని వాళ్లు నమ్మారు. వెంటనే ఆయనను వెంబడించాలని ఆశించారు.

యేసు వాళ్లని చూచి ''మీరు దేనికోసం చూస్తున్నారు?'' అని దయతో అడిగాడు. ''బోధకుడా, నీవెక్కడ బస చేస్తున్నావు?'' అని వాళ్లు వినయంగా ప్రశ్నించారు.

యేసు ''మీరు వచ్చి చూడండి'' అని వారిని ఆహ్వానించాడు అప్పటి నుండి వాళ్లు యేసును వెంబడించారు. ఆదినమంతా వాళ్లాయనతో గడిపారు. ఆయన చెప్పిన దంతా భక్తితో ఆలకించారు. వారి హృదయంలో యేసు ప్రభువే రక్షకుడని తెలుసుకున్నారు! ఇప్పుడు వారాయనను కనుగొన్నారు. వాళ్లకెంత ఆనందం! ఇప్పుడు వారాయన శిష్యులు. ఇక ఎప్పటికీ వాళ్లు ఆయనవారే!

అంద్రెయకు ఒక సోదరుడున్నాడు. అతని పేరు సీమోను. అంద్రెయ వెంటనే వెతుక్కొంటూ అతని వద్దకు వెళ్లాడు. ''సీమోనూ, త్వరగా రావాలి. మేము క్రీస్తును కనుగొన్నాము'' అన్నాడు. ప్రభుయేసుకు మరో పేరు క్రీస్తు.

అంద్రెయ సీమోనును యేసు వద్దకు తెచ్చాడు. అతన్ని చూచి యేసు ''నీ పేరు సీమోను, అయితే నేను నీకు వేరు నామాన్ని యిస్తాను. ఇప్పటి నుండి నిన్ను పేతురు అని పిలుస్తారు''. కాబట్టి పేతురు కూడ యేసు ప్రభుని శిష్యులలో ఒక ముఖ్యమయిన శిష్యుడయ్యాడు.

మరునాడు మరో శిష్యుడు యేసును వెంబడించాడు. అతని పేరు ఫిలిప్పు. అతడు కూడ జాలరివాడే. యేసు అతనితో రెండే రెండు చిన్న మాటలు పలికాడు ''నన్ను వెంబడించు''. ఫిలిప్పు వెంటనే ఆయన వెంట వెళ్లాడు. ఇప్పుడు నలుగురు యేసు శిష్యులయ్యారు.

ఫిలిప్పుకు కూడ ఒక సోదరుడున్నాడు. అతని పేరు నతానియేలు. నతానియేలుకు ప్రభుయేసుని గూర్చి చెప్పాలని ఫిలిప్పు చాల ఆశపడ్డాడు. అలా చెబితే నతానియేలు కూడా ఆనందిస్తాడుకదా? తరువాత అతడు సోదరుని కలిసి సంతోషంతో ఇలా అన్నాడు. ''నతానియేలూ, మేము క్రీస్తును కనుగొన్నాము. ఆయన యేసు. నజరేతులో నున్న యోసేపు కుమారుడు''.

అయితే నతానియేలుకు ఇది అర్థం కాలేదు. అతడు తల అడ్డంగా తిప్పి ''అదెలా సాధ్యం? నజరేతు చాల చిన్న గ్రామం. రక్షకుడు అలాంటి చోట నుండి ఎందుకు వస్తాడు?'' అని ప్రశ్నించాడు.

ఫిలిప్పు అతన్ని ఎలా ఒప్పించగలడు? నతానియేలును నమ్మించ లేకపోయాడు. నేను నా సోదరుని యేసు దగ్గరకు తీసికెళ్తాను. అప్పుడు తప్పక అతడు నమ్ముతాడు - అనుకొన్నాడు. కాబట్టి అతడు - వచ్చి చూడు అని సోదరునితో చెప్పాడు.

వెంటనే అతడు యేసు ప్రభువును కలవడానికి వెళ్ళాడు. యేసు నతానియేలు రావడం చూచి, ''ఇతడు నిజమైన ఇశ్రాయేలీయుడు. ఇతనిలో ఏ కపటమూ లేదు'' అన్నాడు. దీని అర్థం - నతానియేలు యధార్థపరుడు. ఇతనిలో మోసంలేదు అని.

ఈ మాటలు విని నతానియేలు చాల ఆశ్చర్యపోయాడు. ఇది యేసుకు ఎలా తెలుసు? ఆయన తనను ఇంతకు ముందు ఎప్పుడూ చూడలేదు కదా? కాబట్టి అతడు యేసును ''నన్ను నీవెలా ఎరుగుదువు? అని ప్రశ్నించాడు. దానికి ప్రభువు, ''నతానియేలూ, నేను నిన్ను ఇంతకు ముందే చూచాను. నీ సోదరుడు ఫిలిప్పు నిన్ను పిలువక ముందే. నీవు అంజూరపు చెట్టు క్రింద కూర్చుని ఉన్నప్పుడు. ఆ సమయంలో నీవు - ఈ చెట్టుక్రింద నన్నెవ్వరూ చూడలేరు, అని అనుకొన్నావు, కాని నేను నిన్ను చూచాను.

ఇప్పుడు నతానియేలు యేసు నిజమయిన రక్షకుడని గ్రహించాడు. అది నమ్మాడు. అతడు సంతోషంతో, ''బోధకుడా, నీవు దేవుని కుమారుడవు, ఇశ్రాయేలు రాజువు'' అన్నాడు. నతానియేలు కూడ యేసు శిష్యుడయ్యాడు.

మరింత మంది యేసు శిష్యులలో చేరారు. కొంత కాలానికి పన్నెండు మంది శిష్యులయ్యారు. వాళ్లు యేసు వెళ్లే ప్రతి చోటికీ ఆయనతో వెళ్లేవారు. ఎందుకంటే వాళ్లు ఆయనను ప్రేమించారు. వాళ్లాయనతో ఉండిపోయారు. ఆయన మాటలు వింటూ ఆయనకు లోబడ్డారు. వాళ్లిప్పుడు ఆయన సేవకులు.

మనం కూడ ఆయన మాట వినాలని ప్రభువు కోరుతున్నాడు. మనం ఆయన్ని ప్రేమించి లోబడాలి. అప్పుడు మనమాయన సేవకులము కాగలము.

మనలను ఆయన సేవకులనుగా చేయుమని ప్రతి రోజూ ప్రభువును ప్రార్థించడం మరువకండి.

11. కానా అనే ఊరిలో వివాహం

కానా నజరేతుకు దగ్గరగా ఉన్న ఓ చిన్న గ్రామం. ఒక రోజు అక్కడ వివాహం జరుగుతున్నది. పెండ్లి చేసుకుంటున్న స్త్రీని పెండ్లి కుమార్తె అనీ, పురుషుని పెండ్లి కుమారుడనీ అంటారు.

పెండ్లికి ఎవరు వస్తారు? పెళ్లికుమారుడు, పెళ్లి కుమార్తె కుటుంబాలు తప్పక ఉంటాయనుకోండి. వాళ్ల తల్లీ తండ్రీ, అన్నలు, అక్కలు ఉంటారు. వాళ్ల స్నేహితులనూ, బంధువులను కూడ పిలుస్తారు.

వధూవరులు మరి ఎవరిని ఆహ్వానించారో తెలుసా? యేసు ప్రభువును, ఆయన శిష్యులను. యేసు తల్లి మరియను కూడా పిల్చారు. అది ఎంతో సంతోషమయిన సమయం. అందరూ విందారగిస్తున్నారు. అందరూ భోజనం చేస్తూ ద్రాక్షారసం త్రాగుతున్నారు. అందరికీ సరిపడినంత ఆహారం, పానీయం ఉండేలా సేవకులు శ్రద్ధ వహిస్తున్నారు. అందులో ఒక సేవకుడు విందు ప్రధాని. విందు చక్కగా జరిగేలా చూచే బాధ్యత అతనిది. సేవకులంతా హడావుడిగా ఉన్నారు. అతిథులకు ద్రాక్షారసం పోస్తున్నారు. వివాహంలో ద్రాక్షారసం త్రాగడం వాళ్ల ఆచారం.

అయితే కొంతసేపటికి వాళ్లు ద్రాక్షారసం పోయడం ఆపుచేశారు. ఎందుకని? అది అయిపోయింది. అయితే పెండ్లి విందు ముగియలేదు. వాళ్లిప్పుడేం చేస్తారు?

ఈ విషయం యేసు తల్లి మరియ గమనించింది. తానేమీ సాయం చేయలేదుకాని సాయం చేయగలవాడు లేడా? తన కుమారుడు, యేసు ప్రభువు. ఆమె మెల్లగ ఆయన వద్దకు వెళ్లింది. ద్రాక్షారసం అయిపోయిందని ఆయనకు చెప్పింది.

యేసుప్రభువు యిప్పుడేం చేస్తాడు? వెంటనే వెళ్లి సాయం చేస్తాడా? లేదు. ఆయన మరియతో "నా సమయ మింకను రాలేదు" అని చెప్పాడు.

మరియ సేవకుల దగ్గరకు వెళ్లి - యేసు మీకు ఏదన్నా చెబితే వెంటనే అలా చేయండి - అని చెప్పింది. కొంతసేపయ్యాక యేసు అ పనివాళ్ల దగ్గరకు వెళ్లాడు. వాళ్లకు సమీపంలో ఆరు పెద్ద రాతి బానలు ఉన్నాయి. యేసు పని వాళ్లతో ఆ బానలను నీళ్లతో నింపమని చెప్పాడు. వాళ్లు అలాగే నింపారు. "ఇందులో కొంచెం తీసి విందు ప్రధానికి రుచి చూడమని ఇవ్వండి" అని యేసు చెప్పాడు. ఎందుకంటే అతిథులు రుచి చూడక ముందు అన్ని పదార్థాలనూ విందు ప్రధాని రుచి చూడాలి.

పనివాళ్లు అలాగే చేసారు. వాళ్లు ఆ బానల్లోని నీళ్లలో కొంచెం తీసి ప్రధాని వద్దకు తీసుకపోయారు. అతడు దానిని రుచి చూచాడు. అబ్బో, అదెంత రుచిగా ఉంది! అవును యేసు ప్రభువు బానల్లో ఉన్న నీళ్లను ద్రాక్షారసంగా మార్చాడు! అయితే ఈ సంగతి విందు ప్రధానికి తెలియదు. అతడు ఆశ్చర్యపోయాడు. ఎందుకంటె పెండ్లి విందుల్లో మంచి రసం ముందు ఇస్తారు. అంత మంచిగాలేని దాన్ని చివరగా వడ్డిస్తారు. కాబట్టి విందు ప్రధాని పెండ్లి కుమారునితో - నీవు మంచి రసాన్ని చివరివరకూ దాచిపెట్టా వేమిటి? అన్నాడు.


ఇప్పుడిక విందు హాయిగా కొనసాగవచ్చు. ఎందుకంటే కావలసినంత ద్రాక్షారసం ఉంది. యేసు ఆ వివాహానికి



వెళ్లడం వల్ల ఎంతమేలు జరిగింది! ఎందుకంటే ఆయన ఒక్కడే అద్భుతాలు చేయగలడు!

ఈ గొప్ప అద్భుతాన్ని శిష్యులు కూడ గమనించారు. వాళ్లు - యేసు దేవుని కుమారుడని మనకు యిప్పుడు ఖచ్చితంగా తెలిసింది. ఎలా అంటే దేవుడొక్కడే ఇలాంటి క్రియలు చేయగలడు, అని చెప్పుకున్నారు.

ప్రభుయేసు ఈనాడు కూడ సహాయం చేయగలడా? ఆయన యిప్పుడు పరలోకంలో ఉన్నాడు కదా? అవును చేయగలడు. మనం ఆయనను ఏదయినా అడగవచ్చు. మనుష్యులు మనకు సాయం చేయలేనపుడు యేసు ప్రభువు చేస్తాడు. అందుకనే మనతో ఎల్లప్పుడూ ఉండమని ఆయనకు ప్రార్ధన చేయాలి. వధూవరులు యేసును ఆహ్వానించినట్టు ఆయనను పిలుచుకోవాలి.



12. కుంటివాడు, అతని నలుగురు మిత్రులు

వీధులు చాల రద్దీగా ఉన్నాయి. అవును యేసు అక్కడ ఉన్నాడు. ప్రతివాడూ ఆయనను చూడాలని ఆశిస్తున్నారు ఎందుకంటే ఆయన అద్భుతాలు చేస్తాడు. రోగులను బాగు చేస్తాడు.

యేసు ప్రభువు అక్కడ ఒక గృహంలో ఉన్నాడు. ఇక్కడ ఆయన ప్రజలతో మాట్లాడుతున్నాడు. ఇంకా ఎక్కువ జనం ఇంటిలోకి వెళ్తున్నారు. త్వరలోనే ఇల్లంతా నిండిపోయింది.

చూడండి, అక్కడ నలుగురు మనుష్యులు రోడ్డు మీద వస్తున్నారు. వాళ్లొక మంచం మోసుకొస్తున్నారు. ఒక మనిషి దానిపై పండుకొని ఉన్నాడు.

వాళ్లు అతన్ని ఎందుకు మోస్తున్నారు? అయ్యో పాపం. అతడు నడవలేడు. కాళ్లు పక్షవాతం వల్ల పడిపోయాయి. అతడు చేతులు కూడ కదపలేడు. అవికూడ పడిపోయాయి. తనంత తాను ఏమీ చేయలేడు. అతనికి ప్రతిదినం ఎవరో ఒకరు సాయం చేయాలి. అతడు చిన్న శిశువులా ఉన్నాడు. అది ఎంతో విచారకరం కదా?

అయితే ఈ మనుష్యులు ఎక్కడికెళ్తున్నారు? వాళ్లు యేసు ప్రభువు దగ్గరకు వెళ్తున్నారు. తమ కుంటి మిత్రుని ఆయన బాగు చేయగలడని వాళ్ల విశ్వాసం. కాబట్టి వాళ్లు - మేము నిన్ను యేసు దగ్గరకు తీసుక వెళ్లమా? అని అడిగారు. పాపం అతడు అదే కోరుకుంటున్నాడు. ఎందుకంటే తాను ఎంతో దుఃఖిస్తున్నాడు. తన కాళ్లు చేతులు మరెన్నటికీ కదిలించలేనని బాధపడుతున్నాడు.


అంత కంటె బాధయేమిటో తెలుసా? తన పాప హృదయం గురించి! దేవునికి విరోధంగా అతడెన్నో పాపాలు చేసాడు. అది అతన్ని అన్నిటికంటె ఎక్కువగా కలవరపరచింది. అందుకే అతడు యేసును చూడగోరాడు. ఆయనను క్షమాపణ అడగాలని ఆశించాడు.

యేసు ఉన్న యింటికి మిత్రులతన్ని తీసుకొచ్చారు. గుమ్మంలో నుండి ఇంట ప్రవేశించాలనుకున్నారు. కాని అది సాధ్యం కాలేదు. ద్వారం ముందు పెద్ద గుంపు ఉంది. వాళ్లులోనికి వెళ్లలేదు. మనుష్యులు చోటు యివ్వడం లేదు. ఎందుకంటే అందరూ యేసును చూడాలని ఆశపడుతున్నారు. ఆయన మాటలు వినాలనుకుంటున్నారు. మరి వాళ్లిప్పుడేం చేయాలి? ఇంటికి తిరిగి వెళ్లిపోవాలా? లేదు లేదు. అలా వెళ్లరు. వాళ్లు అలాగేలోనికి వెళ్లడానికి ప్రయత్నం చేస్తున్నారు. తమ మిత్రుడు ఎలాగైనా యేసును చూడాలి. ఈ నలుగురూ నిజమైన మిత్రులు. నిజమైన మిత్రులు కష్టమయినాసరే ఎప్పుడూ ఒకరికొకరు సాయంచేసుకుంటారు. అలా చూడండి, ఇంటి మీదికి వెళ్లడానికి మెట్లున్నాయి. అవిరాతిమెట్లు. అది మిద్దె ఇల్లు కాబట్టి మిద్దె మీద నడవవచ్చు.

ఆ నలుగురు మిత్రులూ ఒక ఆలోచన చేసారు. వాళ్లు ఆ మెట్లు ఎక్కారు. అది సులభం కాదు. ఎందుకంటే కుంటివాడైన తమ మిత్రుడు కూడ పైకి రావాలి. అయినా వాళ్లు తమ ప్రయత్నం మానలేదు. చివరికి వాళ్లు మిద్దె మీదకి వెళ్లారు. మిద్దెమీద పెంకులున్నాయి. వాళ్లిప్పుడేం చేయాలి? వాళ్లు ఒక పెంకు తొలగించారు. మిద్దెకిపుడు చిన్న రంధ్రం అయ్యింది. వాళ్లు కింది గదిలోకి తొంగి చూచారు. ఓ, యేసు ప్రభువు అక్కడ నిలబడి ఉన్నాడు! వాళ్లు మరి కొన్ని పెంకులు తీసారు. ఇప్పుడు రంధ్రం పెద్దదయింది. మంచానికి నాలుగు వేపులా బలమయిన తాళ్లు కట్టారు. మంచాన్ని రంధ్రంలో నుండి మెల్లగా కిందికి దింపారు. కొంత సేపటికి మంచం నేలను తాకింది. అది సరిగా యేసు ముందు దిగింది. ఆ కుంటివాడు ఇప్పుడు యేసుకు దగ్గరగా ఉన్నాడు.

ఆయన ఏమనగలడు? పావం అతడెంతో నిరాశతో ఉన్నాడు. అతడు మాటలాడ్డానికి కూడ భయపడుతున్నాడు. అయితే యేసు అతని అవసరతలు ఎరుగును. ఎందుకంటే ఆయన దేవుని కుమారుడు. ఆయన దయతో అతని వైపు చూచి - భయపడవద్దు. నీ పాపాలు క్షమించబడ్డాయి, అన్నాడు.

ఆ మాట విని అతని కనులు సంతోషంతో మిమిలమెరిసాయి! అతని మనసులో ఉన్న భయం, దుఃఖం అన్నీ ఎగిరిపోయాయి. అదే యేసు చేసేపని. అది ఎంత పెద్ద అద్భుతం! ఇప్పుడతడు తాను యేసుప్రభు బిడ్డనని గ్రహించాడు.



అయితే యితడు పక్షవాతంతో బాధపడ్డాడు కదా? అవును. యేసుకు అది కూడ తెలుసు. వినండి, ఆయన ఇంకా ఏదో చెబుతున్నాడు. నీవు లేచి నిలబడు. నీ పడక ఎత్తికొని ఇంటికి వెళ్లు అన్నాడు. అదెలా సాధ్యం? ఆ వ్యక్తి ఇప్పుడు కాళ్లు చేతులు కదుపుతున్నాడు. ఇది యేసు ప్రభువు చేసిన మరో అద్భుతం.

అదిగో చూడండి, అతడు యింటికి తిరిగి వెళ్తున్నాడు. అతని పరుపు భుజంపై వేసుకున్నాడు. ఇక స్నేహితులు అతన్ని ఎత్తుకొని పోవలసిన అవసరంలేదు!

వినండి. అతను నిండు మనసుతో ప్రభువును స్తుతిస్తున్నాడు. అతడెంతో కృతజ్ఞుడైయున్నాడు. ఎందుకంటే ప్రభువు తనను బాగుచేయడం మాత్రమే కాక తన పాపాలను క్షమించాడు. అదే అన్నిటికంటె ముఖ్యమయినది.

బహుశ మన కాళ్లు చేతులు ఆరోగ్యంగా ఉండవచ్చు. కాని హృదయం మాట యేమిటి? స్వభావ సిద్ధంగ అది ఆరోగ్యంగా లేదు. పక్షవాయువు గల వాని హృదయంలా మన హృదయం కూడ పాపంతో నిండి ఉంది. అతని వలెనే మన పాపాలు కూడ ఆయన క్షమించగలడు. ఆయనను ప్రార్థించడం విడువకండి. ఆ నలుగురు మిత్రులు తమ పట్టు వదలలేదని గుర్తుంచుకోండి.

13. కుష్టురోగి స్వస్థపడుట

అక్కడ నడిచి వెళ్తున్నవానిని చూడండి. అతడు మురికిగా కనిపిస్తున్నాడు కదూ? అతని శరీరం నిండా పుండ్లు తలమీద, కాళ్ల మీదా కూడ. అతడు చాల జబ్బుగ ఉన్నాడు. అతడో కుష్టురోగి.

కుష్టురోగులు దయనీయులు. వాళ్లు ఇతరులకు దగ్గరగా పోకూడదు. ఎందుకంటే ఆ రోగం మిగిలిన వాళ్లకు అంటుతుంది. ఒక వేళ ఎవరన్నా కుష్టురోగిని సమీపిస్తే? వెంటనే ఆ రోగి ''నేను అపవిత్రుడను, అపవిత్రుడను'' అని కేకవేయాలి. అంటే నేను కుష్ట రోగిని, దూరంగా ఉండండి, లేకపోతే మీక్కూడ ఈ రోగం అంటుకోవచ్చు, అని అర్థం.

కుష్టురోగులు అందరిలో కలిసి జీవించకూడదు. వాళ్లు అందరికీ దూరంగా ఒంటరి జీవితం గడపాలి. వాళ్లు పొలంలో చిన్న గుడిసెలో నిద్రపోవాలి

మరి వాళ్లకి ఆహారం ఎలా? కొన్నిసార్లు ఎవరికయినా జాలి కలిగితే కొంచెం భోజనం వాళ్లకి దూరంగా నేలమీద పెడతారు. కుష్టురోగులు దానిని తెచ్చు కొని తింటారు.

కుష్టురోగులు ఎన్నటికీ బాగుపడరు. వాళ్ల కురుపులు ఇంకా ఎక్కువవుతాయి. కొంత కాలానికి ఆ రోగంతో చచ్చి పోతారు. ఇది భయంకరమయిన రోగం కదూ?

నిజం చెప్పాలంటే మన మందరం కుష్టురోగులమే. మన శరీరాలమీద అసహ్యమయిన పుండ్లులేకపోవచ్చును. అయితే మన హృదయాలు అపవిత్రంగా ఉన్నవి ఎందుకంటే పాపం మనలో నివసిస్తున్నది. ఈ పాపం వల్ల మనం ఒకనాడు తప్పక చనిపోవాలి. మనలను బాగు చేసే వారులేరా? ఇప్పుడీ కథ వినండి!

చూడండి. ఆ కుష్టురోగి ఏం చేస్తున్నాడు? ఆ జనమూహానికి దగ్గరకు వెళ్లాడు. మరి అలా వెళ్లనిస్తారా? లేదు. మరి ఎందుకలా వెళ్లాడు. ఎందుకంటే యేసుఅక్కడ ఉన్నాడు. ఆయనను చూడాలని అతడు చాల ఆశిస్తున్నాడు. ఎందుకంటే యేసు రోగులను బాగు చేయగలడు. ప్రజలు నిమిషంలో స్థలం ఇచ్చారు. వాళ్లు అతన్ని తాకడానికి యిష్టపడరు. వాళ్లక్కూడ ఆ రోగం అంటుకుంటుందని భయం.

అదిగో, అతడు యేసు వద్దకు వచ్చాడు. యేసుప్రభువు కూడ భయపడ్డాడా? ఆయన ఆ రోగిని పంపివేస్తాడా? లేదు. పంపనేపంపడు. ఆయన అతన్ని దయతోచూచాడు. పాపం! ఆ రోగి భక్తితో ఆయన ఎదుట మోకరించాడు. ''ప్రభువా, దయతోనన్ను బాగుచేస్తావా? అలా చేయగలవని నేను నమ్ముతున్నాను'' అన్నాడు.

అవును, నిజంగా అతడు నమ్మాడు. అయితే ప్రభువు అతడు బాగుపడాలని కోరుతున్నాడా? అలా స్వస్థపడే అర్హత అతనికి లేదు. తన హృదయంలో కూడ పాపమనే కుష్టురోగం ఉందని అతనికి తెలుసు.

అదిగో, చూడండి. ఇప్పుడు యేసు ఏం చేస్తున్నాడు? ఆయన కుష్టురోగిని ముట్టుకున్నాడు. ప్రజలది చూచి భయపడ్డారు. యేసు కూడ కుష్టురోగి అవుతాడా?

యేసు చెప్పేది వినండి ''నీవు బాగుపడడం నాకిష్టమే'' అన్నాడు. వెంటనే అతని కురుపులన్నీ మాయ మయ్యాయి. అతడు పూర్తిగ బాగయ్యాడు. అతని తల, చేతులు, కాళ్లు, శరీరం అంతా బాగుపడింది. అవును 'స్వస్థ పడు' అని యేసు ఒక్కమాట చెబితే చాలు. అలా జరుగుతుంది. ఆయన మాటల్లో శక్తి ఉంది.

ఇప్పుడా మనిషి తన ఇంటిలో నివసించవచ్చు. మనుష్యులమధ్య తిరగవచ్చు. ఎందుకంటే అతడికపై కుష్టురోగి కాడు.

అతడెంత సంతోషంగా ఉన్నాడు! యేసు తనపట్ల చేసిన అద్భుతం గురించి అందరికీ చెప్పాడు.

యేసు యేమి చేయగలడో నీకిప్పుడు తెలిసిందా? ఆయన పాపరోగంతో ఉన్న మన హృదయాలను కూడ బాగు చేయగలడు. పూర్తిగ స్వస్థపరచగలడు. నీవు కూడ అలా చేయమని భక్తితో ప్రార్థించడం మరిచిపోవద్దు.



14. సముద్రములో తుఫాను


ఒక పెద్ద సరస్సులో ఓ పడవ వెళ్తోంది. వాతావరణం ప్రశాంతంగా, చక్కగా ఉంది. సూర్యుడు ప్రకాశవంతంగా ఉన్నాడు. చిన్న చిన్న మేఘాలు గొర్రెపిల్లల్లా కనిపిస్తున్నాయి.

ఆ పడవలో ఎవరున్నారు? యేసు ప్రభువు, ఆయన శిష్యులు. శిష్యులు జాలరులు. పడవ నడపడం వాళ్లకి బాగాతెలుసు. ఆ సరసు మీద ఎన్నోసార్లు పడవ నడిపారు.

శిష్యులంతా నిశ్శబ్దంగా ఉన్నారు. ఎందుకంటే పడవ క్రింది భాగంలో యేసు నిద్రపోతున్నారు. ఆయన ఒక దిండు మీద తల వాల్చి నిద్రిస్తున్నారు. యేసు దేవుని కుమారుడయినా ఆయన నిజంగా మానవుడు కూడ. కొన్నిసార్లు ఆయన చాల అలిసిపోతాడు. ఆయనకు మనవలెనే నిద్ర అవసరం.

యేసు నిద్ర పోవడం వేరెవరు చూసారో తెలుసా? సాతాను. వాడు యేసుకు పెద్ద శత్రువు. యేసు లేకుండా ఉంటే బాగుండునని వాడు అనుకుంటాడు. ఎందుకంటే ఆయన పాపులను రక్షించడానికి వచ్చాడు. అది సాతానుకు ఎంత మాత్రం యిష్టంలేదు. అందరూ పాపంలోపడి దుఃఖపడుతూండాలని వాడి ఆశ.

సాతాను చాల బలవంతుడు. వాడు సముద్రం మీద గాలిని, అలలను లేపగలడు చూడండి. అలలు ఎలా ఎగిరెగిరి పడుతున్నాయో. అవి ఒక దానితో ఒకటి పోరాడుతున్నాయి. పడవను బలంగా తాకుతున్నాయి. గాలి కూడ చాల తీవ్రంగా వీస్తోంది. అదెంత బలంగా కొడుతున్నదో చూడు. దాని శబ్దం కూడ భయంకరంగా ఉంది కదూ? గాలి పడవను అటూ ఇటూ కొట్టడం చూడండి. గాలితో కూడిన అలలు పడవను బ్రద్ధలు చేయగలవు. అవును, ఇదంతాసాతాను పనే! పడవ పగిలితే యేసు మునిగిపోతాడని సాతాను ఆలోచన. వినండి, పడవ బీటలు పడుతున్నది, ఇటూ అటూ ఊగుతున్నది!



పాపం శిష్యులు, భయపడిపోతున్నారు. ఇప్పుడు అలలు పడవలోకి వచ్చాయి. అదినీటితో నిండుతున్నది. అయ్యో, ఇలాంటి భయంకరమయిన తుఫానును వాళ్లింత వరకూ చూడలేదు!

మరియేసు ప్రభువు యేం చేస్తున్నారు? మంచి నిద్రలో ఉన్నారు. శిష్యులు ఆయన్ని లేపారు. యేసు వద్దకు వెళ్లడం సర్వదా మంచిది. ఎందుకంటే మన భయాలు ఎంత పెద్దవయినా ఆయన ఎల్లప్పుడూ సహాయం చేయగలడు. ఈ సత్యాన్ని ఎన్నడూ మరువకండి!

''బోధకుడా, మేముమునిగిపోతున్నాము. నీకు చింతలేదా? మాకు సహాయం చేయవా?'' అని వాళ్లు కేకలు వేస్తున్నారు.

యేసు మేల్కొన్నాడు. ఎగిరిపడుతున్న అలలను చూచాడు. తన చుట్టూ ఉన్న తుఫానును గమనించాడు. పడవ అటూ ఇటూ కొట్టు కోవడం తెలుస్తున్నది.

శిష్యులు ఎంత భయపడుతున్నారో యేసు అర్థం చేసుకున్నాడు. భయం ఎందుకు? వాళ్లు భయపడవలసిన అవసరం లేదు. ఎందుకంటే యేసు వాళ్లతో ఉన్నాడు. అలలూ, గాలీ వాళ్లకి ఏహానీ చేయలేవు. వాటికన్న యేసు ఎంతోశక్తిమంతుడు. ఆయన సాతాను కన్న బలవంతుడు!


యేసువాళ్లతో ''మీరెందుకు భయపడుతున్నారు? నేను మీతో ఉన్నాను కదా?'' అన్నాడు. తరువాత ఆయన గాలితోను అలలతోను ''నిమ్మళించండి, సద్దు మణగండి!'' అని చెప్పాడు. వెంటనే అంతా నిమ్మళమయింది. అలలు తగ్గిపోయాయి. మేఘాలు మాయమయ్యాయి. ఆ సరసు ప్రశాంతంగా మారిపోయింది. పడవ నీటిపై చక్కగా నడుస్తోంది.

ఈ విధంగా అత్యవసర సమయంలో యేసు తన శిష్యులకు సాయం చేసాడు. వారి భయం అంతా పోయింది. ఆశ్చర్యంతో వాళ్లు యేసును చూచి ఈయన ఎంత శక్తిమంతుడు! చివరికి గాలి నీరు కూడ ఈయనకు లోబడుతున్నాయి'' అని చెప్పుకున్నారు.

మన జీవితంలో కొన్నిసార్లు చాలవిచార కరమైన విషయాలు జరుగవచ్చు. అప్పుడు నీ అవసరం ఎంత గొప్పది. అది శిష్యుల అవసరం వంటిది కావచ్చు. నీవు నాకిప్పుడు ఎవ్వరూ సాయం చేయలేరు. చివరికి నా తల్లిదండ్రులు కూడ, అని అనుకొనవచ్చు.

అయితే దేవుడు సహాయం చేయగలడు. ఆయన సర్వ శక్తిమంతుడు. ఆయన ఏదయినా చేయగలడు. ఈ సత్యాన్ని మరువవద్దు.

నీవు దేవుని బిడ్డవా? అయితే ఆయన నిత్యం నీకు సహాయం చేస్తాడు. నీవు మరణాన్ని సమీపించినపుడు కూడ ఆయన నీతో ఉంటాడు.



15. యేసు ప్రభువు సాతాను కన్న బలవంతుడు

గదరేనీయుల ప్రాంతం చుట్టూ చాల పర్వతాలున్నాయి. ఇందులో కొన్నిటికి గుహలున్నాయి. కొన్నిసార్లు ఈ గుహలలో చనిపోయిన వారిని ఉంచుతారు. ఇక్కడ మనుష్యులెవ్వరూ నివసించరు. ఆ ప్రాంతం అంతా నిశ్శబ్దంగా ఉంటుంది.



అయితే వినండి ఎవరో అరుస్తున్నారు. ఈ వైపుగా ఎవరు పరుగుపెడుతున్నారు? అతడొక పురుషుడు. తన చేతులను విపరీతంగా ఊపుతున్నాడు. అతడు నేలమీద పడి ఉన్న రాళ్లు చూచాడు. వాటిని ఏరుకున్నాడు. చూడండి, ఆ రాళ్లతో తన శరీరాన్ని కోసుకుంటున్నాడు! తిరగి పరుగెడుతున్నాడు. ఎంత భయంకరమయిన శబ్దం చేస్తున్నాడు!

అతనంటే అందరికీ భయం. అతని దగ్గరకు ఎవరూ వెళ్లరు. ఒకవేళ నిన్ను పట్టుకుంటే?. ...నిన్ను చచ్చేలా కొట్టవచ్చు!

ఇతడింత వింతగా ఎందుకు ప్రవర్తిస్తున్నాడు? అయ్యో పాపం! అతనికి దయ్యం పట్టింది. దయ్యం అతని హృదయంలో నివసి స్తోంది. అదే అతని మీద అధికారం చెలాయిస్తోంది. అందుచేత అతడు సరిగా ఆలోచించ లేకపోతున్నాడు. అందుకు అలా వింతగా ప్రవర్తిస్తున్నాడు. అతడు తన బట్టలన్నీ చింపు కున్నాడు. బట్టలు లేకుండా పరుగులు పెడుతున్నాడు. అతడిక పట్టణంలోనున్న ఇంటిలో నివసించలేదు. ఒంటరిగా సమాధుల మధ్య తిరుగుతున్నాడు. ఈ మనిషిమీద దయ్యానికి ఎంత శక్తి!

మనం అలా ప్రవర్తించకపోవడం ఎంత అదృష్టం! మనం కేకలు పెడుతూ, వస్తువులు విసరుతూ అటూ ఇటూ తిరగకపోవచ్చు. సరిగా ఆలోచించే మనసు దేవుడు మన కిచ్చాడు. అది ఆయన దయ. అయితే దయ్యం మాట వింటే అది మన హృదయంలో కూడ నివసిస్తుంది. అలా చేస్తే అది సాతానుకు ఎంతోయిష్టం.

ఒక రోజు చాల మంది మనుష్యులు కలిసి ఆ దయ్యం పట్టిన వానిని పట్టుకోవాలని ప్రయత్నించారు. వాళ్లు అతన్ని పట్టుకున్నారు కూడ. అయితే వాడేం చేస్తాడు? త్రాళ్లను తెంపాడు. వాడు చాల బలమైన వాడు. అప్పుడు ఇనుప సంకెళ్లతో బంధించారు. అయితే

వాటిని కూడ తెంపేసాడు. వాడిని ఎవ్వరూ లొంగదీయ లేక పోయారు. దయ్యం కూడ బలమైనది. మనకన్న బలమైనది. అందుకే అది మన హృదయంలో అంత బలంగా పని చేస్తుంది!

కొందరు మనుష్యులు రోడ్డుదిగివస్తున్నారు. ఆ గుంపు యేసు, ఆయన శిష్యులూ. వాళ్లిప్పుడే సరసు ఒడ్డు చేరారు. ఇప్పుడేం జరుగుతుంది?

వినండి, దయ్యం పట్టిన వాడు దూరం నుండి యేసును చూచాడు. వెంటనే ఆయన దగ్గరకు పరుగెత్తాడు. అతని కళ్లు క్రూరంగా ఉన్నాయి. అతడు పెద్దగా అరుస్తూ చేతులూపుతున్నాడు. శిష్యులు భయ పడిపోయారు. అయితే యేసు మాత్రం ప్రశాంతంగా ఉన్నాడు. ఆ మనుష్యుడు యేసు ముందు మోకరించి నీవు దేవుని కుమారుడవయిన యేసువు. నీవు మా దగ్గరకు ఎందుకు వచ్చావు? మమ్మును బాధించవద్దు, అని అరిచాడు.

అలా మాట్లాడుతున్న దెవరో తెలుసా? అది దయ్యం. ఆవును చివరికి దయ్యాలు కూడ యేసు ఎదుట వణకును. అయితే యిప్పుడది ఆ మనిషి నాలుకను వాడుకొంటున్నది.

యేసు - నీపేరేమిటి? అని అడిగాడు.

అందుకతడు - నాపేరుసేన, అన్నాడు. అంటే చాల దయ్యాలు అతని హృదయంలో ఉన్నాయని అర్థం.

అప్పుడు యేసుప్రభువు - ఇతనిలో నుండి బయటికిరా, అని ఆజ్ఞాపించాడు.

దయ్యాలు వదలిపెట్టాలి. ఎందుకంటే యేసు ఆజ్ఞ అది.

ఆ మనిషిని చూడండి ..... అతడిప్పుడు అరవడం లేదు. చేతులు తిప్పడం లేదు. చాల ప్రశాంతంగా ఉన్నాడు. ఇకపై అతన్ని చూచి ఎవరూ భయపడనవసరం లేదు. అతని ఆలోచనలు యిప్పుడు చక్కగా ఉన్నాయి. బట్టలు ధరించుకున్నాడు. అతడు తిరిగి తన యింటికి వెళ్లవచ్చు. యేసు ఎంత శక్తిమంతుడు! ఎందుకంటే ఆయన దేవుని కుమారుడు. అందుకే ఆయన సాతానుకన్న బలవంతుడు. సాతాను శక్తిమంతుడు, కాని దేవుడు సర్వశక్తిమంతుడు.

మన హృదయాల్లో ఉన్న సాతానును యేసు ప్రభువు ఒక్కడే జయించగలడు. యేసు మన హృదయంలో ఉంటే మనం పాపం చేయము. దానికి వ్యతిరేకంగా పోరాడుతాము..

దేవుని పిల్లలు నిజమైన ఆనందం ఎందుకు అనుభవిస్తారో తెలుసా? వాళ్లు పరలోకానికి వెళ్తారుకాబట్టి. సాతాను, పాపం ఎన్నటికీ పరలోకంలో ప్రవేశించలేవు.



16. యాయీరు యొక్క చిన్న కుమార్తె

యాయీరు ఇంట్లో శబ్దం వినిపించడం లేదు. యాయీరు అతని భార్య చాల విచారంగా కనిపిస్తున్నారు. ఏం జరిగింది? వాళ్ల చిన్న కుమార్తె చాల జబ్బుగా ఉంది. వైద్యులు ఆమెను బాగుచేయలేక పోతున్నారు. వాళ్లు-ఈమె త్వరలోనే చనిపోతుంది, అని చెప్పారు.

యాయీరు దంపతులకు ఒక్కతే కుమార్తె, ఆమెకు పన్నెండు సంవత్సరాలు. వాళ్లు ఆమెను చాల ప్రేమిస్తారు.

ఆ చిన్న కుమార్తెకు దినదినానికి, జబ్బు ఎక్కువ అవుతున్నది. తల్లిదండ్రులిపుడు ఏం చేస్తారు? వారికీలోకంలో ఎవ్వరూ సాయం చేయలేరు. ఎవ్వరూ చేయలేరా?

చూడండి, యాయీరు ఇల్లు విడిచి వెళ్తున్నాడు. అతడు జబ్బుగా ఉన్న కుమార్తె దగ్గర ఎందుకు ఉండడంలేదు? ఎందుకు పరుగెడుతున్నాడు?

యేసు తమ ఊరు వచ్చాడని యాయీరు విన్నాడు. అతడు వెళ్లి వెదకి ఆయనను ఇంటికిరమ్మని పిలుచుక వస్తాడు. ఎందుకంటే యిప్పుడు ఆయన మాత్రమే సహాయం చేయగలడు. ఇక మరీ ఆలస్యం చేస్తే లాభం లేదు.

కాబట్టి యాయీరు దుఃఖపడుతూ యేసు దగ్గరకు వెళ్లాడు. అతడు వెళ్లి తన కష్టాన్ని ఆయనతో చెప్పుకున్నాడు. మనం కూడ అదే చేయాలి. మీరేమంటారు?

యేసు చుట్టూ జనులు గుంపుకూడి ఉన్నారు. వీరిని ప్రక్కకు తోసుకొని అతడు యేసుకు దగ్గరగా వెళ్లాడు. భక్తితో ఆయన యెదుట మోకరించాడు. అతడు తొందర పడుతూ - ప్రభువా, నీవునా యింటికి రావా? నా కుమార్తె చనిపోయే స్థితిలో ఉంది. నీవునీ చేతులు ఆమెపై ఉంచితే తప్పక బ్రతుకుతుంది'' అని అన్నాడు.

వెంటనే యేసు అతనితో వెళ్లాడు. అయితే వాళ్లు తొందరగా వెళ్లలేక పోయారు. యేసు చుట్టూ చాల జనం ఉన్నారు. చూడండి, అనారోగ్యంగా ఉన్న ఓ స్త్రీ వస్తోంది. ఆమె కూడ స్వస్థ పడాలని కోరుతోంది. ఆమె రహస్యంగా యేసు అంగీ అంచునుతాకింది. పూర్తిగ స్వస్థపడింది.

యేసు ప్రభువు ఆమెతో మాట్లాడాలనుకున్నాడు. ''అయ్యో, చాల సమయం గడిచిపోతోంది''. అనుకుంటున్నాడు యాయీరు. తన కుమార్తె ఎంత జబ్బుగా ఉందో యేసు గమనించలేదా?

చూడండి, వాళ్లవైపు ఎవరో నడిచి వస్తున్నారు. అతడు యాయీరు సేవకులలో ఒకడు. అతడు చాల విచారంగా కనిపిస్తున్నాడు. యాయీరు అది చూచి ఖంగారు పడ్డాడు, అతడెందుకు వచ్చాడు?

యాయీరును చూచి అతడు - ''అయ్యా, యేసు ప్రభువు మన యింటికి రావలసిన అవసరం లేదు. చాల ఆలస్యం అయ్యింది. నీ కుమార్తె చనిపోయింది'' అని చెప్పాడు. అయ్యో, యాయీరు ఎంత దుఃఖిస్తున్నాడు! ఇక తన చిన్న కుమార్తెను చూడలేడు.

అప్పుడు యేసు యాయీరు వైపు చూచాడు. యాయీరు ఎంత విచారిస్తున్నాడో ఆయన గ్రహించాడు. ఆయన అతనితో - ''భయపడవద్దు, నమ్మిక మాత్రం ఉంచు'' అన్నాడు.

యాయీరు ఆ మాటలు విన్నాడు. అవి అతనికి ఎంతో ఆదరణ యిచ్చాయి. సేవకుడు అతని కుమార్తె చనిపోయిందని చెప్పినా యేసు యాయీరు యింటికి వెళ్లాడు.

వాళ్లతని యిల్లు చేరారు. యేసులోపలికి వెళ్లాడు. ఆయన శిష్యులలో కొందరు కూడ వెళ్లారు. ఇంటిలో చాల మంది గుంపు కూడి ఉన్నారు. అందరూ ఏడుస్తున్నారు. యేసు అందరినీ బయటికి వెళ్లమని చెప్పాడు. ఆ బాలిక తల్లిదండ్రులను, శిష్యులనూ తీసికొని ఆయన గదిలో ప్రవేశించాడు. ఆమె పడక వద్దకు వెళ్లాడు. ఆమె కనులు మూసికొని పండుకొని ఉంది. ఆమెకదలడంలేదు. ఊపిరి తీయడంలేదు.



చనిపోయింది. యేసు, ''చిన్నదానా, లెమ్మని నేను చెబుతున్నాను'', అన్నాడు. అప్పుడో అద్భుతం జరిగింది. ఆమెకనులు విప్పింది. కదలడం మొదలుపెట్టింది.

యేసు ఆమె చేయి పట్టుకున్నాడు. ఆమెలేచి తిన్నగా కూర్చుంది. తల్లిదండ్రులను, యేసును చూచింది, లేచి నడిచింది. యేసు-ఆమెకు తినడానికి ఏదయినాయివ్వండి, అని చెప్పాడు.

అందరూ చూస్తున్నారు. ఆమె తిరిగి ప్రాణంపోసుకుంది. ఆమె జబ్బునయమయింది. దుఃఖం ఎగిరిపోయింది. సంతోషం వెల్లి విరిసింది. తల్లిదండ్రులకు తిరిగి కుమార్తె దొరికింది. దీనిని యేసే చేశాడు.

యేసు సర్వశక్తిగలవాడు. చనిపోయిన వారిని బ్రతికించగలడు. పాపంలో పడి చచ్చిన వారికి కూడ నూతన జీవం యివ్వగలడు. సహజంగా మన హృదయాలు పాపంలో చచ్చి ఉండడం వల్ల మనం దేవున్ని ప్రేమించ లేక పోతున్నాము. అయితే ఆ నూతన జీవాన్ని పొంది దేవుని ప్రేమించి యాయీరు కుమార్తెలా తిరిగి ఆయన యందు సజీవులము కాగలము.

17. రొట్టెలు, చేపల అద్భుతం

యేసు ప్రభువు అలసి పోయాడు. శిష్యులు కూడ అదే పరిస్థితిలో ఉన్నారు. యేసు మాటలు వినడానికి చాల మంది వచ్చేవారు. రోగం బాగుచేసుకోడానికి అనేకులు ఆయన వద్దకు చేరేవాళ్లు.

యేసూ ఆయన శిష్యులూ ఒక పడవలో వెళ్తున్నారు. ఆయన సరస్సు మధ్యలో ఉన్నాడు. ఆవలిఒడ్డుకు వెళ్లాలని అనుకుంటు న్నాడు. అక్కడ విశ్రాంతి తీసుకోడానికి తప్పక ఒక స్థలం దొరుకవచ్చు.

అయితే యేసును చూడ్డానికి మనుష్యులు యింకా వస్తున్నారు. వాళ్లు సరస్సుచుట్టూ నడిచి ఆయన వద్దకు వస్తున్నారు. అప్పుడాయన పరలోకంలో ఉన్న తన తండ్రిని గురించి వాళ్లకి చెబుతాడు. తాను పాపులను రక్షించడానికి పరలోకం నుండి ఈ భూలోకానికి ఎందుకు వచ్చాడో కూడ చెబుతాడు. చాలమంది రోగులు ఆయన దగ్గరికి మళ్లీ వచ్చారు. ఆయన వాళ్లందరినీ బాగు చేసాడు.

రాత్రి కావస్తోంది. త్వరలోనే చీకటి వ్యాపిస్తుంది. జనులు తిరిగి యింటికి వెళ్లాలి. చాల దూరం నడవవలసి ఉంటుంది. మరి వారికి భోజనం కావాలి కదా? అందరూ ఆకలితో ఉన్నారు. శిష్యులు వచ్చి - ప్రభువా, ప్రజలను యింటికి పంపివేయి. అప్పుడు భోజనం చేస్తారు, అని చెప్పారు. ప్రభువు వాళ్లు చెప్పినట్టు చేస్తాడా? లేదు. ఆయన వారితో మీరే వారికి భోజనం పెట్టాలి, అన్నాడు.

శిష్యులు ఆశ్చర్యపోయారు! వారిదగ్గర ఆహారం ఏమీ లేదు. ప్రజలు చూస్తే చాలా మంది ఉన్నారు. వాళ్లందరికీ భోజనం పెట్టడం ఎలా? శిష్యుల కేమీ అర్థం కాలేదు. అయితే ఏమి చేయాలో యేసు ఎరుగును. ఆయన వారితో - మీరు వెళ్లి జన సమూహంలో ఎన్ని రొట్టెలు దొరుకుతవో చూడండి, అని చెప్పాడు.

శిష్యులు వెళ్లి అందరినీ అడిగారు. ఒక బాలుని దగ్గర అయిదు రొట్టెలూ రెండు చేపలూ దొరికాయి. అయితే అవి సరిపోవు కదా? కనీసం వెయ్యి రొట్టెలూ వెయ్యి చేపలన్నా కావాలి! అయినా శిష్యులు ఆ అయిదు రొట్టెలూ, రెండు చేపలనే యేసు వద్దకు తెచ్చారు.

యేసు ప్రజలను గడ్డి మీద వరసగా కూర్చోమని చెప్పాడు. అంతా నిశ్శబ్దంగా ఉన్నారు. ఆయన ప్రార్థన చేసారు. రొట్టెలనూ చేపలనూ దీవించమని యేసు తండ్రిని ప్రార్థించారు. మీరు భోజనం చేయక ముందు దేవునికి వందనాలు చెబుతారా? మీరు దీనిని మరువరని ఆశిస్తాను.

యేసు ఆ రొట్టెను విరవడం ప్రారంభించారు. ఆయన అలా విరుస్తూనే ఉన్నారు. వందలు, వేలుగా రొట్టె ముక్కలు చేసారు. అప్పటికే ఒక గంపనిండా రొట్టె ముక్కలు ఉన్నాయి. శిష్యులు ఆ రొట్టెలను జనులకు పంచుతున్నారు.

యేసు ప్రభువు రొట్టెను అలా విరుస్తానే ఉన్నారు. కొంతసేపట్లో రెండవ గంప నిండిపోయింది. మరోగంప మరో గంప!

యేసు అలా చేస్తూనే ఉన్నాడు, గంపలు రొట్టె ముక్కలతో నిండుతూనే ఉన్నాయి. జనులకు చేపలు కూడ వడ్డించారు. అందరూ తృప్తిగ తిన్నారు. వేలాది రొట్టెలు, చేపలు ఉండినవి. ఇదెంత అద్భుతం!

చివరికి కొంత ఆహారం మిగిలి పోయింది. వాటిని శిష్యులు సమకూర్చారు. ఆహారం వ్యర్థం చేయడం యేసు ప్రభువుకు యిష్టం లేదు! ఆకలితో అలమటించే వాళ్లు ఈ లోకంలో ఎందరో ఉన్నారు.

ప్రజలంతాఎంత ఆనందించారు! వాళ్లు - యేసు ఎంత శక్తి మంతుడు! ఆయన మన రాజు కావాలి. పెద్ద భవనంలో నివసించాలి, శత్రువులతో పోరాడి జయించాలి, అని ఒకరితో ఒకళ్లు చెప్పుకున్నారు.

అయితే ఆయనకు అలా చేయడం యిష్టం లేదు. తన ప్రజల హృదయాల్లో మాత్రమే రాజుగా ఉండడం ఆయన కిష్టం. ఆయన వారిని రక్షించడానికి వచ్చాడు. ప్రజలు ఇళ్లకు తిరిగి వెళ్తున్నారు. చీకటి పడకముందే వారు వెళ్లిపోవాలి. యేసు ప్రభువు శిష్యులతో - మీరు పడవ మీద అవతలి ఒడ్డుకు వెళ్లండి, అని చెప్పాడు.

అయితే యేసు వారితో వెళ్లలేదు. మరి ఎక్కడికి వెళ్లాడు? ఆయన ఎత్తయిన ఒక కొండ ఎక్కాడు. ఆ రాత్రంతా ఒంటరిగా అక్కడ ఉన్నాడు. అక్కడ ఏం



చేస్తున్నాడు? యేసు విధేయతతో మోకరించి ప్రార్థన చేస్తున్నాడు. తన పరలోకపు తండ్రితో మాటలాడు తున్నాడు. తన శిష్యుల కోసం ప్రార్థిస్తున్నాడు. తన పిల్లలందరికోసం ప్రార్థిస్తున్నాడు. ఆయన అందరి కోసం ఎంతో ప్రార్థిస్తున్నాడు! వారినెన్నడూ మరువడు!

అవును, దేవుడు మన అందరికీ ఆహారం దయచేస్తాడు. మరొకటి కూడ తన పిల్లలకు యిస్తాడు. అది నూతన హృదయం. అప్పుడు వాళ్లు పరలోకంలో దేవునితో ఉంటారు. ఇదే యేసు తన తండ్రిని అడుగుతున్నాడు. తండ్రి ఆయన ప్రార్థన వింటాడు.

నిన్ను ప్రతిరోజు తన బిడ్డగ ఉండేలా చేయమని దేవుని అడగడం మరచిపోవద్దు.



18. గ్రుడ్డి బర్తిమయి



రోడ్డు ప్రక్క ఒకడు కూర్చుని ఉన్నాడు. దినమంతా అతడు అలాగే కూర్చున్నాడు. అతని పేరు బర్తిమయి.

ఒక్కో సమయంలో మనుష్యులు ఆ ప్రక్కగా నడచి పోతున్నారు. అప్పుడు బర్తిమయి చేయి చాపుతాడు. దాని అర్థం. దయచేసి నాకు ధర్మం చేస్తారా? నేను చాల పేద వాడిని. అవును అతడు భిక్షకుడు.

అతడెందుకు బిచ్చం ఎత్తుకుంటున్నాడు? వెళ్లి ఏదన్నా ఉద్యోగం చేయరాదా? పాపం అతడు ఏపనీ చేయలేడు, అతడు గ్రుడ్డివాడు. అందుకని యేమీ కనపడదు.

వసంత కాలంలో సూర్య కాంతి వల్ల ప్రకృతి అంతా ఎంతో అందంగా ఉంటుంది. కాని బర్తిమయి దీనిని చూడలేడు. పక్షుల పాటలను వినగలడు కాని వాటిని చూడలేడు, మనుష్యుల మాటలు వింటాడు కాని వాళ్లు ఎలా ఉంటారో తెలియదు. అతనికి అంతా, ఎప్పుడూ చీకటియే. పాపం బర్తిమయి! ఇది ఎంతో విచారకరం కదూ?

ఈ లోకంలో చాలమంది విచారంతో ఉంటారు. గ్రుడ్డివాళ్లు, చెవిటి వాళ్లు, జబ్బుగా ఉన్నవాళ్లు, ఎందుకో తెలుసా? పాపం వల్ల, ఈ లోకం లోని విచారానికి పాపమే కారణం.

చూడండి. ఆ మనుష్యులంతా రోడ్డు మీద ఏం చేస్తున్నారు? బర్తిమయి వాళ్లని చూడలేడు. కాని వారి శబ్దం వినగలడు.

"అక్కడేమీ జరుగుతోంది?" అని అడిగాడు.

"అదా? యేసు ప్రభువు ఈదారిని వెళ్తున్నాడు. కొద్దిసేపటిలో ఇక్కడికి వస్తాడు" అని జవాబిచ్చారు. "యేసు ప్రభువా? ఈ దారిని వెళ్తాడా? అయితే ఆయన నాకు సహాయం చేయగలడు. ఆయన ఇప్పటికే ఎంతో మందిని బాగు చేసాడు". అని అనుకున్నాడు.

బర్తిమయి యేసును చూడలేక పోవచ్చును కాని ఆయనను పిలువగలడు. కాబట్టి ఆయన వస్తున్న శబ్దం వినగానే బర్తిమయి - యేసూ, దావీదు కుమారుడా, నన్ను కరుణించు, అని అరచాడు, అంటే దేవా, దయ చేసి నాకు సహాయం చేయి, అని అర్థం. యేసు అతని కేక వింటాడా? అతనికి సాయం చేస్తాడా? బర్తిమయి కేకను చుట్టునున్న ప్రజలు విన్నారు. వారికి కోపం వచ్చి- అలా గట్టిగా అరవకు, అని గద్దించారు.

అయితే బర్తిమయి కేకవేయడం ఆపలేదు. అతడు మనసులో-యేసు ప్రభువు ఈదారిన యిప్పుడు వెళ్తున్నాడు. ఇదే మంచి సమయం. ఆయన నాకు సాయం చేయగలడు, అనుకొని మరింత గట్టిగ కేకలు వేయసాగాడు. "దావీదు కుమారుడా, నన్ను కరుణించు." యేసు దావీదు వంశపువాడని అతనికి తెలుసు. ఆయన రక్షకుడు!

యేసు బర్తిమయి కేకవిన్నాడు. ఆగాడు. ఆయన తన చుట్టున్న వారితో "బర్తిమయిని నాదగ్గరకు తీసుక రండి" అన్నాడు.

వాళ్లు త్వరగా వెళ్లి - ధైర్యం తెచ్చుకో యేసు ప్రభువు స్వయంగా నిన్నురమ్మని పిలుస్తున్నాడు" అని చెప్పారు.

బర్తిమయి త్వరగా లేచాడు. ఒక్క క్షణంలో అతడు యేసు యెదుటికి వెళ్లాడు.

యేసు అతన్ని చూచి - "నీకేం కావాలి? నీకు నేను ఏమి చేయాలి?" అన్నాడు. అబ్బ, ఆ స్వరం ఎంత మృదువుగా ఉంది!

బర్తిమయి భక్తితో యిలా అన్నాడు - "ప్రభువా, నేను తిరిగి చూడగలగాలని నాకెంతో ఆశగ ఉంది. నీవు నన్ను బాగు చేస్తావా?" అవును. యేసు తనను బాగు చేయగలడని అతడు నిజంగా నమ్మాడు.

దీనికి యేసు ఏం చెప్పారు? "నీవు వెళ్లు, నీవిశ్వాసమే నిన్ను బాగు చేసింది", అన్నాడు.

అప్పుడు బర్తిమయి కన్నులు వెంటనే ప్రకాశించడం మొదలు పెట్టాయి. అతడు చూడగలుగుతున్నాడు! సూర్యకాంతి సమస్తాన్నీ వెలిగించడం అతడు చూచాడు. రంగు రంగుల పువ్వులను చూచాడు. సమస్తాన్నీ చూచాడు. అంతా ఎంత అందంగా ఉంది!

అయితే అతడు ఇంకా ఏం చూచాడో తెలుసా? యేసు ప్రభువును! ఈ అద్భుతం చేసిన వానిని! యేసు తన పట్ల ఎంత దయ చూపాడు! ఈ మేలు పొందే అర్హత తనకులేదు. బర్తిమయి ఆయనను వెంబడించాడు. యేసును హత్తుకొని ఉండగోరాడు.

మనం గ్రుడ్డి వారముకాకపోవచ్చు. అయినా మనమంతా గ్రుడ్డివారమని బైబిలు చెబుతోంది. మనం ఎంత పాపులమో మనం చూడం, ఎంత దుస్థితిలో ఉన్నామో చూడము.

అయితే దేవుడు బర్తిమయి కనులను తెరిచినట్టే మన కనులను కూడ తెరువగలడు. కాబట్టి మీ గ్రుడ్డి హృదయాలను తెరువ మని దేవుని ప్రార్థించండి.

19. చిన్న పిల్లలను నాయొద్దకు రానీయుడి

యేసు ప్రభువును చూడడానికి ప్రతిరోజూ చాల మంది వస్తూంటారు. చాల మంది రోగులు వస్తూంటే ఆయన వారిని బాగు చేసేవాడు.

చూడండి, ఇంకా చాల మంది వస్తున్నారు. వాళ్లు ఎవరిని తమతో పాటు తెస్తున్నారు? చిన్న పిల్లలను కొంచెం ఎదిగిన పిల్లలు తమ తల్లిదండ్రులతో నడిచి వస్తున్నారు. చంటి పిల్లలను ఎత్తుకొని వస్తున్నారు.

వాళ్లెందుకు వచ్చారు? ఆ పిల్లలు జబ్బుగా ఉన్నారా? లేదు. అయినా తల్లిదండ్రులు వారిని యేసు దగ్గరకు తెస్తున్నారు. ఎందుకోతెలుసా? వాళ్లు తమ పిల్లలను యేసు దీవించాలని ఆశపడ్డారు. ఆయన చేత ప్రార్ధన చేయించుకోవాలని కోరుకున్నారు. యేసు తమ పిల్లలను దీవించగలడని ఆ తల్లిదండ్రులకు తెలుసు. ఇది పెద్దలకు అవసరమయినట్టే పిల్లలకు కూడ అవసరం. మరి యేసు వాళ్లను దీవిస్తాడా? అవును. ఆయనమనలను దీవించడానికి యిష్టపడతాడు. చిన్న పిల్లలను ఆశీర్వదించడానికి కూడ యిష్టపడతాడు. ఆయన ఆహారం దయచేస్తాడు. నివసించడానికి ఇల్లు ఇస్తాడు. చదవడానికి బలం యిస్తాడు. మనం పనులు చేసుకోడానికి ఆరోగ్యం దయ చేస్తాడు. ఇంకా చాలా చాలా ఇస్తాడు. ఇవన్నీ ఆయన మన కిచ్చేదీవెనలు. అయితే అన్నిటి కన్న గొప్ప దీవెన ఏదో తెలుసా? ఆయన తన కృపతో నిన్ను దీవించడం! అవును. నీవాయన బిడ్డవయితే నీవు నిజంగా ధనవంతుడవు. అందు వలనే తల్లిదండ్రులు తమ పిల్లలను యేసు దగ్గరకు తెస్తున్నారు.

హఠాత్తుగా వాళ్లు ముందుకు వెళ్లలేక పోయారు. యేసుకు దగ్గరగా వెళ్లలేకపోయారు. ఎందువల్ల? యేసు శిష్యులు వాళ్లని అడ్డగించారు! వాళ్లు చాల కోపంగా ఉన్నారు. "మీరు పిల్లలను యేసు దగ్గరకు తేడానికి వీల్లేదు. ఆయన చాల తొందరలో ఉన్నారు. ఈ పిల్లలు చిన్న వాళ్లు. ఆయన బోధించే దేమీ వీళ్లకి అర్ధం కాదు" అన్నారు.

ఎంత విచారకరం! పాపం వాళ్లంతా తమ పిల్లల్ని తీసుకొని వెనక్కి తిరిగి పోవలసిందేనా? లేదు, అలా జరుగ లేదు. ఎందుకంటే యేసు ప్రభువు అంతా విన్నాడు. ఆయన కూడ కోపంగా కనిపించాడు. శిష్యులపై ఆయనకు చాల కోపం వచ్చింది. ఆయన - మీరు చేస్తున్న దేమిటి? పిల్లలను నా దగ్గరకు రాకుండ ఆటంక పరచవద్దు. నేను వారిని ఆశీర్వదించాలని కోరుతున్నాను. చిన్న పిల్లలు కూడ నా ఆశీర్వాదం పొంది, పరలోక రాజ్యానికి వెళ్తారు. పెద్ద వాళ్లని నేను పరామర్శించి నట్టే చిన్న పిల్లలపట్ల జాగ్రత్త వహిస్తాను. అని గద్దించాడు. వెంటనే శిష్యులు ప్రక్కకు తప్పుకున్నారు. ఇప్పుడు చిన్న పిల్లలంతా యేసు ప్రభువువద్దకు వచ్చారు. ఆయన వారిని తన చేతుల్లోకి తీసుకున్నాడు. వారిపై తన చేతిని ఉంచి ఆశీర్వదించాడు చిన్న పిల్లలనూ, పెద్దవారినీ



అందరినీ దీవించాడు. ఆయన వారి పట్ల ఎంతో కరుణ చూపించాడు. తరువాత తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటికి తీసుకుపోయారు.

ఈనాడు తల్లిదండ్రులు తమ పిల్లలను యేసు ప్రభును చూడడానికి తీసుకుపోలేరు. ఎందుకంటే ఆయన యిప్పుడు భూలోకంలో లేడు. ఆయన పరలోకంలో ఉన్నాడు. అయినప్పటికీ వారు ఆపని చేయవచ్చు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇప్పుడు కూడ యేసు నొద్దకు తేగలరు ఎలా? వాళ్ళు తమ పిల్లలకోసం ప్రార్థించ వచ్చు. బైబిలు చదివి వారికి యేసును గూర్చి చెప్పవచ్చు. లేదా బైబిలు చదివి వినిపించవచ్చు.

యేసు పిల్లలను దీవిస్తాడు. ఈదినంకూడ. అతి చిన్న పిల్లలను, శిశువులను దీవిస్తాడు. దీని కోసం తల్లిదండ్రులు తమ ప్రార్థనలో అడగాలి. చిన్న పిల్లలు కూడ ప్రార్థించాలి. మరి మీరు ప్రార్థిస్తున్నారా?

షాలోము తల్లులు తమ పిల్లలను
యేసు నొద్దకు తెచ్చినపుడు
శిష్యులు వారిని కఠినంగా
యేసు నుండి తోలివేసి
వెళ్లిపొమ్మని చెప్పారు.

అయితే యేసు వారు వెళ్లక ముందే చూచి తీయగ నవ్వి, దయతో యిట్లు చెప్పాడు.

"చిన్న పిల్లలను ఆటంక పరచక నాయొద్దకు రానీయండి".



20. మంచి కాపరి మరియు తప్పిపోయిన గొర్రె

సాధారణంగా యేసు ప్రజలకు కథల రూపంలో బోధించే వాడు. ఆ కథలు మనకు కూడ నీతి బోధిస్తాయి. ఎందుకంటే అవన్నీ బైబిలులో ఉన్న కథలు. ఏదో ఒక మంచిని బోధించడానికి యేసు ప్రభువు ఈ కథలు చెప్పేవాడు. ఈ కథలను ఉపమానాలు అని పిలుస్తారు. కాబట్టి ఉపమానానికి ఎప్పుడూ ఒక అర్థం ఉంటుంది. ఇప్పుడు మీరు ఒక కాపరి తప్పిపోయిన అతని గొర్రె కథ వినండి.

అప్పుడే తెల్లవారుతున్నది. రాత్రి గడిచింది. క్రొత్తదినం ప్రారంభమవుతున్నది. చూడండి, గొర్రెలు దొడ్డి నుండి బయటికి వస్తున్నవి. అవి కాపరితో వెళ్తున్నవి. కాపరికి తన గొర్రెలంటే చాల ప్రేమ. అతనికి ప్రతి గొర్రె తెలుసు. గొర్రెలు కూడ కాపరిని బాగా ఎరుగును. అవి అతని స్వరాన్ని గుర్తిస్తాయి.

కాపరి తన గొర్రెలను చాల జాగ్రత్తగ చూచుకుంటాడు. వాటి కోసం గడ్డి ఉన్న మంచి స్థలాలు వెదుకుతాడు. అక్కడ గొర్రెలు కావలసినంత పచ్చిక మేయవచ్చు. అంతే కాక మంచి నీళ్లు ఉన్న స్థలాలు కూడ చూస్తాడు. అక్కడ అవి నీళ్లు తాగుతాయి. ఒక్కోసారి ఏదయినా క్రూర మృగం రావచ్చు. వచ్చి గొర్రెను ఎత్తుక పోవచ్చు. దానిని చంపితినవచ్చు. అప్పుడు కాపరి ఆ మృగాన్ని కర్రతో తరిమి వేస్తాడు.

ఆ విధంగా అతడు తన గొర్రెలను చాల జాగ్రత్తగా కాపాడుతాడు. అవి అతని మాట వినాలి. అతనికి దగ్గరగా ఉండాలి. అప్పుడవి క్షేమంగా ఉంటవి.

సాయంకాలం అయ్యింది. కాపరి గొర్రెలను తీసికొని ఇంటికి తిరిగి వెళ్తున్నాడు. గొర్రెలు దొడ్డిలో చేరుతవి. ఆ రాత్రంతా అక్కడ పండుకొంటవి.

అయితే మొదట కాపరి యేంచేస్తాడు? తన గొర్రెలను లెక్కపెడతాడు. ఒకటి రెండు, మూడు. ఒక్కొక్క, గొర్రెనూ లెక్కవేస్తాడు. అన్ని గొర్రెలూ ఉన్నాయా? వంద గొర్రెలు ఉండాలి. అన్నీ ఉన్నాయా? లేదా. ఒక్క గొర్రె కనపడలేదు. మరి అది ఎక్కడ ఉన్నట్టు?.

కాపరి ఇప్పుడు ఏం చేయాలి? అతడు దాన్ని వెదకడానికి వెళ్తున్నాడు. బయట యిప్పటికే చీకటి పడింది. అయినప్పటికీ అతడు వెళ్లి దాని కోసం వెదకుతున్నాడు. అవును, అతడు మంచి గొర్రెల కాపరి.

అతడు అడవిలో వెదికాడు. పొదల్లో గాలించాడు. ఆ కాపరి కొండలెక్కాడు. లోయల్లో కూడ చూచాడు. ప్రతిచోటావెదికాడు. అదింకా దొరకలేదు. గొర్రె చాల దూరం వెళ్లిఉంటుంది! అది ఎక్కడికి పోయిందబ్బా? బహుశ అడవి మృగం ఏదయినా చంపి ! ఉంటుందా?

హఠాత్తుగా అతనికి ఏదో శబ్దం విని పించింది.....! కాపరి ఆ దిక్కుగా పరుగెత్తాడు. అవును, అది గొర్రె అరుపే. అది అక్కడ కనిపించింది!. బుద్ధిలేని ఆ గొర్రెను చూచి కాపరి ఆ గొర్రెపై కోపపడ్డాడా? "ఇది నీ తప్పే" అని గద్దించాడా? లేదు. ఎంత మాత్రం అనలేదు. పైగా దానిని తన బలమయిన చేతుల్లోకి తీసుకున్నాడు. ఆ గొర్రె చాల అలసి పోయింది. కాబట్టి కాపరి దాన్ని తన భుజాలమీద ఎక్కించుకున్నాడు. తిరిగి మంద ఉన్నచోటికి మోసుకు వెళ్లాడు. గొర్రె కాలుకు దెబ్బ తగిలించు కున్నదా? దెబ్బతింటే కట్టుకడతాడు. దానికి ఆకలి లేదా దాహం వేస్తున్నదా? కాపరి దానికి ఆహారం, నీళ్లు యిస్తాడు. అవును, అతడు మంచి గొర్రెల కాపరి. అతడు గొర్రెను తిరిగి సంపాదించాడు. అందువల్ల సంతోషంగా ఉన్నాడు.

ఈ కథ అర్థం తెలుసా? మంచి కాపరి యేసు ప్రభువు. గొర్రెలు ఆయన పిల్లలు. కాపరి తన గొర్రెలను ఎంత మంచిగ చూస్తాడు! అదే రీతిగ యేసుప్రభువు కూడ తన పిల్లలందరి పట్ల ఎంతో శ్రద్ధ చూపుతాడు.

గొర్రెల కాపరి తప్పి పోయిన గొర్రెను వెతుక్కొంటూ వెళ్లాడు. అదేవిధంగా యేసు ప్రభువు కూడ నశించుచున్న వారిని వెతుకుతాడు. తన వద్ద నుండి తొలిగి దూరంగా వెళ్లిపోయిన వారి కోసం గాలిస్తాడు. బుద్ధిలేని గొర్రె పిల్లలా మనుష్యులు తప్పి పోయినాసరే.

పాపం వలన గొర్రెలా మనమూ తప్పి పోయాం. అయితే మంచి కాపరి అయిన యేసు నశించిన దానిని వెదకి రక్షిస్తానని వాగ్దానం చేసాడు. నిన్ను తన గొర్రెల్లో ఒక గొర్రెగా చేసుకోమని యేసు ప్రభుని ప్రార్థించు.



21. నా పొరుగువాడు యెవడు?

మనం పొరుగు వారిని ప్రేమించాలని బైబిలు బోధిస్తోంది.

యేసును చూడ్డానికి ఎవరో వచ్చారు. అతడు యేసుతో ప్రభువా, నా పొరుగు వాడెవడు? అని ప్రశ్నించాడు. అంటే నేను ఎవరిని ప్రేమించాలి? ఎవరికి సాయం చేయాలి? అని అడిగాడన్నమాట. దానికి యేసు ఇచ్చిన జవాబేమిటి? దానికి యేసు చెప్పిన కథను వినండి.

ఒక మనిషి రోడ్డు మీద నడిచి వెళ్తున్నాడు. రోడ్డుకు రెండు వేపులా కొండలు, తుప్పలు ఉన్నాయి. ఆ ప్రదేశం చాల నిశ్శబ్దంగా ఉంది. మనుష్యులెవ్వరూ లేరు. ఆ ప్రయాణీకుడు ఒక్కడే ప్రశాంతంగా నడుచుకుంటూ వెళ్తున్నాడు. అంతలో హఠాత్తుగా.....

పొదల్లో ఏదో కదలిక అయ్యింది. ఒక్కక్షణంలో కొంతమంది మనుష్యులు వచ్చారు. అందరూ క్రూరంగా కనిపిస్తున్నారు. వాళ్లింతసేపూ పొదల వెనక దాగున్నారు. ఇప్పుడా ప్రయాణీకునిపై పడ్డారు. అతన్ని బలంగా పట్టుకున్నారు. ఆ దొంగలు అతని బట్టలు లాక్కున్నారు. అతన్ని నేల మీద పడేసారు. బాగ కొట్టారు. అతనికి భయంకరంగా దెబ్బలు తగిలాయి. అలా కొట్టాక, అతని డబ్బంతా దోచుకున్నారు. అప్పుడతనిని విడిచి, తిరిగి తుప్పల్లో దూరి మాయ మయ్యారు.

పాపం, అతడు యిప్పుడు నేల మీద పడి ఉన్నాడు. అస్సలు కదల లేని స్థితిలో ఉన్నాడు. బాధతో మూల్గుతున్నాడు. అబ్బ, ఎంత రక్తం కారుతోంది! త్వరలో ఎవరూ రాకపోతే అతడు చనిపోవచ్చు అతడు చాల బాధ పడుతున్నాడు!


అయితే, అదిగో చూడండి. ఎవరో ఈ వైపుగా వస్తున్నారు. అతడొక యాజకుడు. యాజకులు దేవుని సేవకులు.

ఆ యాజకుడు ఆవైపురావడం ప్రయాణీకుడు చూచాడు. అతడు పిలువనవరసంలేదు. అతడక్కడ పడి ఉండడం యాజకుడు చూడగలడు. అవును చూచాడు. అతనికి ఎంతగా రక్తం కారుతుందో చూచాడు. మరి యాజకుడేం చేస్తాడు? సాయం చేసాడా? లేదు. త్వరగా అతని ప్రక్క నుండి దాటిపోయాడు. యాజకుడు దొంగల చేతిలో పడ్డ వానిగురించి - వేరెవరైనా యితనికి సహాయం చేయాలి, నేను కాదు, అని అనుకొని ఉండవచ్చు. మరి కొంచెం సమయం గడిచాక దెబ్బలతో పడి ఉన్న వాడు మళ్లీ ఎవరో నడుస్తున్న అడుగుల చప్పుడు విన్నాడు. అవును, మరొకడు వస్తున్నాడు. ఇతడు లేవీయుడు. లేవీయుల దేవాలయంలో యాజకులకు సాయం చేస్తారు. యితడన్నా సాయం చేస్తాడా? ఏమో మరి. ఇతడు కూడ దెబ్బలతో పడి ఉన్నవాడ్ని చూచాడు. అతడు బాధతో పెడుతున్న మూల్గులు విన్నాడు. అతడు దగ్గరకు వచ్చి చూచాడు కాని త్వరగా ప్రక్కనుండి వెళ్లి పోయాడు. బహుశా ఇతడు కూడ వేరెవరయినా సాయం చేయాలని తలంచాడేమో, కాని అతడు మాత్రం చేయడానికి ఎంత మాత్రం ఇష్టపడలేదు.

ప్రయాణీకుడు కనులు మూసుకున్నాడు. తనకు ఎవ్వరూ సాయం చేయడం లేదు. వాడిక చనిపోవలసిందేనా?

ఆ సమయంలో మళ్లీ ఏదో చప్పుడు. అతడు కళ్లు విప్పాడు. మరొకడు ఆ దారిన వస్తున్నాడు. అతడు గాడిద మీద వస్తున్నాడు. అతడొక సమరయుడు. అతడు మరోదేశం నుండి వస్తున్నాడు. అది శత్రుదేశం. అవును చాలా కాలంగా ఇశ్రాయేలీయులు, సమరయులు శత్రువులుగా ఉన్నారు.

అతడు కనులు మూసికొన్నాడు. సమరయుడు తనకు సహాయం చేస్తాడను కోవడం బుద్ధి హీనత. అతడు ''నా శత్రువుకు తగిన శాస్తి అయ్యింది''- అని అనుకోవచ్చు. అయితే యేం జరిగింది? గాడిద ఆగింది. సమరయుడుదిగాడు. దెబ్బలతో పడిఉన్న వ్యక్తి దగ్గరకు వచ్చాడు. అతన్నిదయతో చూచాడు. జాలిపడ్డాడు. ''నేను నీకు సహాయం చేస్తాను'' అన్నాడు. అతని దెబ్బలకు మంచి ఒలీవ నూనె పూసి, కట్టు కట్టాడు. చూడండి రక్తం కారడం ఆగిపోయింది. సమరయుడు అతన్ని జాగ్రత్తగ గాడిద మీద ఎక్కించాడు. అదిగో,వాళ్లు వెడుతున్నారు. సమరయుడు గాడిద ప్రక్కనేనడుస్తున్నాడు. ప్రయాణీకుడ్ని జాగ్రత్తగ పట్టుకొన్నాడు. వాళ్లొక పెద్ద సత్రం దగ్గరకు వచ్చారు.



ఇదో పెద్ద భవనం. అక్కడ భోజనానికి ఉండడానికి వసతి ఉంటుంది. త్వరలోనే ప్రయాణికుడ్ని వెచ్చని మంచంపై పండబెట్టారు. సమరయుడు అతనికి ఆహారం నీళ్లు యిచ్చాడు. ఇప్పుడతడు త్వరలోనే కోలుకుంటాడు!

మరునాడు సమరయుడు వెళ్లిపోవాలి. అతడు సత్రం యజమానితో - ఇదిగో ఈ సొమ్ము తీసుకో. ఇతనికి ఏదీ తక్కువ కాకుండ చూడు. నేను త్వరలోనేతిరిగి వస్తాను. అప్పుడు మళ్లీ డబ్బు ఇస్తాను, అని చెప్పాడు.

ఇంతటితో కథముగిసింది.

గాయపడ్డవానికి సాయం చేసింది ఎవరు? అతని పొరుగు వాడు ఎవడు? అతనిపై ఎవరు దయచూపారు? అది సమరయుడే. అందుకనే అతన్ని మంచి సమరయుడు అంటాం.

మనం కూడ పొరుగు వారిని ప్రేమించాలి. అయితే మన పొరుగు వాడెవడు? మన స్నేహితుడు మాత్రమేనా? కాదు. నిన్ను విసిగించే ఆ పిల్లవాడు కూడ నీ పొరుగువాడే. లేదా నీతో అడడానికి యిష్టపడని ఆ బాలిక! అందరూ నీ పొరుగు వారే.

"నీ శత్రువును ప్రేమించు" అని బైబిలు చెబుతోంది. - "ప్రభువా, అలా చేసేలా మాకు బోధించు!"

22. తప్పిపోయిన కుమారుడు

యేసు ప్రభువు మరోకథ చెప్పారు. మనం దానిని తప్పిపోయిన కుమారుని కథ అంటాము. అది కూడ ఒక ఉపమానమే.

ఒక తండ్రికి యిద్దరు కుమారులున్నారు. అతడు వారి నెంతో ప్రేమిస్తాడు. వాళ్లకు కావలిసినవన్నీ యిస్తాడు.

అయినా చిన్న కుమారునికి తృప్తి లేదు. అతడికపై యింటిలో ఉండడానికి యిష్ట పడలేదు. అతడు - నేను వేరేదేశానికి వెళ్తాను. ఇక్కడ కంటె అక్కడ బాగుండవచ్చు. ఈ ప్రదేశం నాకేమీ నచ్చలేదు, అనుకున్నాడు.

ఒకనాడు ఆ చిన్న కుమారుడు - తండ్రీ, ఆస్తిలో నా భాగం ఇవ్వు. నీవు మరణించాక నాకు రావలసిన భాగం నాకిప్పుడే కావాలి. నేనొక దూర దేశానికి వెళ్లదలచాను. ఇకపై నీ యింటిలో ఉండడం నాకు యిష్టంలేదు, అన్నాడు.

తండ్రి అతని మాటలకు చాల దుఃఖించాడు! ఆయన ఎంతో దయగలవాడు! అయితే కుమారుడు ఆయన పట్ల చాల నీచంగ ప్రవర్తించాడు.

మన పిల్లలు తల్లిదండ్రులను బాగ చూడాలని దేవుని కోరిక. అయితే ఈ కుమారుడు తన తండ్రిని బాగుగా ప్రేమించలేదు!

తండ్రి అతనికి సంచి నిండా డబ్బు వేసి ఇచ్చాడు. అదిగో, ఆడబ్బు సంచి పట్టుకొని అతడు వెళ్లిపోతున్నాడు. అతడు వెళ్తూండడం తండ్రి చూచాడు కన్నీరు కార్చాడు. కాని కుమారుడు తిరిగి చూడలేదు, చేయి ఊపలేదు. అప్పుడే తండ్రిని మరిచాడు.

తండ్రి మాత్రం అతన్ని మరువలేదు. ప్రతిదినం అతని గూర్చి ఆలోచించేవాడు. అతన్ని మరువలేక పోయాడు.

చిన్న కుమారుడు చాలదినాలు ప్రయాణంచేసి ఒక దూర దేశం చేరాడు. అది అతనికి చాల నచ్చింది. చాల మంది స్నేహితుల్ని సంపాదించాడు. ప్రతిరోజూ వారితో విందులు చేస్తున్నాడు. మంచి ఆహారం, పానీయాలు సేకరించి ఖరీదయిన బట్టలు ధరిస్తున్నాడు. వీటన్నింటికీ చాల ఖర్చువుతున్నది. అయినా అతడు లెక్క చేయలేదు.

కొంత కాలానికి డబ్బంతా ఖర్చయి పోయింది. అవును డబ్బు సంచి మొత్తం ఖాళీ అయ్యింది. అతడిప్పుడు ఏం చేస్తాడు? విందు లిక లేవు. స్నేహితులు అతన్ని విడిచి పోతున్నారు. వాళ్లు నిజమయిన స్నేహితులు కారు. ఎందుకంటే నిజమైన మిత్రులు ఎప్పుడూ ఒకరికొకరు సాయం చేసుకుంటారు. ఇప్పుడు రొట్టె కొనడానికి కూడ అతని వద్ద డబ్బులేదు. అతడెంతో ఆకలితో ఉన్నాడు!

అతడు కాస్త రొట్టె యిమ్మని అడుగుతున్నాడు. అంటే భిక్షగాడయ్యాడు. అయితే అతడున్న దేశంలో ఇపుడు కరువు ఉంది. తినడానికే మనుష్యులకు భోజనం లేదు. కాబట్టి అతనికి ఎవరూ యేమీ యివ్వడంలేదు. అతని బట్టలు పాత బడి చినిగిపోయాయి. కొత్త బట్టలు కొనుక్కోడానికి డబ్బులు లేవు. అతడెంత పేదగ, మురికిగా కనబడుతున్నాడు! ఇప్పుడు అతడు ఒక తప్పిపోయిన కుమారుడు. అయితే యిదంతా అతడు చేసిన పొరపాటే. అతడొక పొలం ప్రక్కగా వెళ్తూ ఆ పొలం యజమానితో - అయ్యా, నేను నీ పొలంలో పని చేయవచ్చా? అని అడిగాడు. నాకీ రైతు కాస్త అన్నం అన్నా పెడతాడు కదా, అనుకున్నాడు. దానికి ఆ పొలం యజమాని - సరే, నీవు నా పందులను మేపు అన్నాడు. అయినా అతనికి తిండి ఏదీ దొరకలేదు. అయ్యో, పాపం. అతడు పందులు తినే ఆహారం అన్నా దొరుకుతుందేమోనని ఆశపడ్డాడు కాని యజమాని దానిని కూడ అతనికి అందకుండా చేసాడు.

అది రాత్రి సమయం. ఆకలితో ఆ చిన్న వానికి నిద్ర పట్టడం లేదు. అతడు తన మనసులో ఇలా అనుకుంటున్నాడు - నేను నా యిల్లు విడిచి రాకుండ యుండవలిసినది. నా తండ్రి వద్దనే ఉండవలిసింది. అతడు నన్నెంతో ప్రేమించాడు. ఆయన వద్ద ఉన్నప్పుడు నాకు ఆకలి అంటే ఏమిటో తెలియదు. ఇక్కడ నేను ఆకలితో చచ్చిపోవచ్చు.

ఇలా అతడు తన మనసులో చాల దుఃఖపడ్డాడు. తండ్రి పట్ల తాను ఎంత కఠినంగా ప్రవర్తించాడో అతడు ఇప్పుడు తెలుసుకున్నాడు.

అప్పుడతడు లేచి - నేను నా తండ్రి వద్దకు వెళ్లి, తండ్రీ నేను నీ పట్ల చాల కఠినంగా ప్రవర్తించాను. ఇకపై నీకుమారుడనని పించు కొనే యోగ్యత నాకు లేదు. నన్ను నీ సేవకులలో ఒకనిగా చేసుకో, అని అడుగుతాను, అని అనుకున్నాడు.



దారిలో ఒక ముసలి వాడు నిలబడి ఉన్నాడు. అతడెవరోకాదు. ఆ చిన్నవాని తండ్రియే. అతడు ఆ రోడ్డు చివరి వరకూ ఆశతో చూస్తున్నాడు. తనకుమారుడు తిరిగి వస్తాడేమోనని! అంతలో దూరంగా ఎవరో వస్తున్నారు. అదొక మురికి బిచ్చగాడు. చెప్పులు లేకుండా నడిచి వస్తున్నాడు. తండ్రి అలాగే చూస్తున్నాడు.

అంతలో హఠాత్తుగ ఆ అది ఎవరో తెలిసింది. అది తన కుమారుడే! తండ్రి అతన్ని ఎదుర్కోడానికి పరుగెత్తాడు. గట్టిగ కౌగిలించుకున్నాడు. తన కుమారుని ముద్దు పెట్టుకున్నాడు. సంతోషంతో కన్నీరు కార్చాడు.

అప్పుడా చిన్న కుమారుడు - తండ్రీ, నేను నీకు విరోధంగా, దేవునికి విరోధంగా పాపం చేసాను. నీకుమారుడనని పిలవబడే అర్హత నాకికలేదు, అన్నాడు.

అయితే తండ్రి - నీవు నాతో త్వరగా యింటికిరా. నీవునాకు అతి ప్రియ మయిన కుమారుడవు. నిన్ను మళ్లీ చూడడం నాకెంతో సంతోషం, అన్నాడు. తండ్రి తన చిన్న కుమారుని కోసం క్రొత్త బట్టలూ, క్రొత్త పాదరక్షలూ, తెమ్మని సేవకులతో చెప్పాడు. ఇప్పుడు అతడిక భిక్షగాడు కాదు. తన తండ్రి వద్ద చేరాడు. తండ్రి "ఈ దినం మనం పండుగ చేసికొందాము. ఎందుకంటే నా కుమారుడు తిరిగి వచ్చాడు. అతడు తప్పి పోయి తిరిగి దొరికాడు", అన్నాడు.

ఈ కథ అర్థం మీకు తెలుసా? మనం చేసిన పాపం వల్ల మన మందరమూ తప్పి పోయాము. ఎందుకంటే తప్పి పోయిన కుమారునిలా మన చెడు హృదయాలు దేవున్ని విడిచి పెట్టాయి. ఈ కారణంవల్ల మనం విచారంగా ఉంటున్నాము. అయితే తప్పి పోయిన కుమారుని వలె మనం కూడ మన పాపాల కోసం చింతిస్తూ తన వద్దకు రావాలని దేవుడు కోరుతున్నాడు. ఆ తండ్రివలె పాపుల పట్ల దయ చూపాలని దేవుడు కనిపెడుతున్నాడు. పశ్చాత్తాపంతో తన వద్దకు వచ్చే పాపులను దేవుడు ఎన్నడూ వెనక్కి పంపివేయడు. బహుశ నీవు - నా దుష్ట హృదయం దేవుని వేపు తిరగదని అనుకుంటున్నా వేమో. అయితే దేవుడు నీ హృదయాన్ని మార్చగలడు, మార్చుతాడు కూడ. ఆయన నామ మహిమ కోసం అలా చేయమని దేవున్ని ప్రార్థించు.



23. మనము ఎలా ప్రార్థించాలి?

మనమందరం దేవునికి ప్రార్థన చేయాలి,- అయితే ఎలా ప్రార్థించాలి? యేసు ప్రభువు ఎలా ప్రార్థన చేయాలో చెబుతున్నాడు. ఈ క్రింది కథ వినండి.

ఇద్దరు మనుష్యులు దేవాలయానికి వెళ్తున్నారు. దేవుని మందిరంలో వాళ్లు ప్రార్థన చేయడానికి వెళ్తున్నారు. అది మంచిదే. మనం ప్రార్థన చేయాలని దేవుడు కోరుతున్నాడు. ఆ యిద్దరిలో ఒకడు పరిసయ్యుడు. అతడు ప్రజలకు దేవుని గురించి చెబుతాడు. ప్రతి దినం ప్రార్థన చేస్తాడు. ఎప్పుడూ మరచిపోడు.

అదిగో, అతడక్కడ ఉన్నాడు. దేవాలయం ఎదుట ఉన్న ఆవరణలో నిలబడి ఉన్నాడు. అక్కడ నిలబడితే ప్రజలంతా అతన్ని చూడగలరు. అతడు చెప్పేది అందరికీ వినపడుతుంది కూడ. తన ప్రార్థన అందరూ వినాలని అతని కోరిక. అతడిలా ప్రార్థన చేయడం మొదలు పెట్టాడు - దేవా, నేను మిగిలిన వారిలా చెడ్డవాడిని కానందున నీకు వందనాలు చెల్లిస్తున్నాను. మిగిలిన వాళ్లు దొంగ పనులు చేస్తారు, అబద్ధాలు చెబుతారు. కాని నేను అలా చేయను. నేను దాన ధర్మాలు చేస్తాను. చాలమంచి పనులు చేస్తాను - అని ప్రార్థించాడు.

అతడెంత గర్విస్తున్నాడో చూచారా? ఎలా గొప్పలు చెబుతున్నాడో! తన హృదయం మంచిదనుకుంటున్నాడు. కాబట్టి అతడు నూతనమైన మనసు కోసం ప్రార్థించడంలేదు. తన పాపాలు క్షమించమని దేవున్ని అడగడం లేదు. ఎందుకంటే తాను పాపినని అతడు గ్రహించలేదు. నిజం చెప్పాలంటే ఈ పరిసయ్యుడు దేవున్ని ఏదీ అడగడం లేదు. తాను ఎంత మంచి వాడో ఆయనకు చెబుతున్నాడు. తన హృదయం ఎంత



పాపంతోనిండి ఉందో కూడ అతనికి తెలియదు. అతడు గర్విష్టి. అతని ప్రార్థన యథార్థ మయినది కాదు.

మరి రెండవ మనిషి ఎక్కడ? అతడు తనను ఎవరూ చూడకుండా దేవాలయం వెనక వైపున నిలబడ్డాడు. అతడు అంతగా సిగ్గు పడుతున్నాడు. అతడు తాను పాపినని గ్రహించాడు.

ఈ వ్యక్తి సుంకరి. అంటే పన్ను వసూలు చేసేవాడు. అతడు ప్రజల నుండి డబ్బు వసూలు చేస్తాడు. ప్రతివాడూ పన్ను కట్టాలి. అది సుంకం తీసుకొనే వాడికొరకే! అయితే ఈ సుంకరి దొంగ. తాను వసూలు చేసిన డబ్బులో చాల భాగం అతడే ఉంచుకుంటాడు. అతడు మరింత ఎక్కువ డబ్బుయిమ్మని ప్రజలను పీడిస్తాడు. అలా యింకా యింకా ధనవంతుడవ్వాలని ప్రయత్నం చేస్తాడు.


అవును. అతడు తన బ్రతుకంతా దుష్టునిగానే ఉన్నాడు. అయితే మరి యిప్పుడు? ఇప్పుడతడు చాల చింతపడుతున్నాడు. అతడు మనసులో - నేను అందరి కన్న నీచుడను. గొప్పపాపిని. ప్రజలకు నేను చాల అన్యాయం చేసాను. అంత కంటె ఘోరం ఏమంటే నేను దేవునికి విరోధంగా పాపం చేసాను, అని ప్రార్థన చేసాడు.

వినండి. అతడు యథార్థంగా సమస్తం దేవునితో చెబుతున్నాడు. అతనికి దేవునివైపు ముఖం ఎత్తడానికి కూడ ధైర్యం చాల లేదు. అతడు గుండె బాదుకొంటూ తన దుఃఖాన్ని చూపించుతున్నాడు. అతనిలో గర్వం లేదు. దీనత్వం ఉంది.

అతడు భక్తివినయాలతో - ఓ దేవా, పాపినైన నా పట్ల కరుణ చూపించు, అని ప్రార్థించాడు. అంటే - దేవా, నేను చాల దుర్మార్గుడను. నేను శిక్ష పొందడానికి తగినవాడను. అయితే దయచేసి నామీద దయ చూపి నాపాపాలు క్షమిస్తావా? అని అర్థం. ఈ వ్యక్తి ప్రార్థన యదార్థమయినది.

పరిసయ్యుడు, సుంకరి తిరిగి తమ ఇళ్లకు వెళ్లారు. సుంకరి ముఖం చూడండి. ఎంత సంతోషంగా కనబడుతున్నాడు! ఎందుకో తెలుసా? దేవుడు అతని పాపాలన్నిటినీ క్షమించాడు. అలా అని ఆయనే చెప్పాడు. అది గొప్ప అద్భుతం కాదా? అతడు ఎంతగా దేవుని దయపొందాడు!

మరి పరిసయ్యుని మాట యేమిటి? అతనిని గూర్చి యేసు ప్రభువు యేమీ చెప్పలేదు. ఎందుకంటే తన



పాపాలు క్షమించమని అతడు దేవుని అడుగ లేదు. మనం ఎలా ప్రార్థించాలి?

బహుశ కొన్ని సార్లు నీవు - నేను పరిసయ్యునిలా, మిగిలిన బాలబాలికలవలె అంత చెడ్డవాడను కాను, అని అనుకుంటున్నావేమో. పరిసయ్యుడు కూడ అచ్చం అలాగే అనుకున్నాడు. దేవుడు అతని ప్రార్థన వినలేదు.

కాబట్టి బాలల్లారా, సుంకరిలా ప్రార్థన చేయడం నేర్పించమని దేవున్ని అడగండి, దేవా, పాపినైన నన్ను కరుణించు, అని ప్రార్థించండి. అలాంటి ప్రార్థన దేవుడు తప్పక వింటాడు.

24. బుద్ధిలేని ధనవంతుడు

ఒక మనుష్యుడు ఓపెద్ద భవనంలో నివసిస్తున్నాడు. ఆ యింటిలోని ప్రతి వస్తువూ అందంగా ఉంటుంది. అవును, అతడు చాల ధనవంతుడు. అతనికి గల వస్తువులను బట్టి అది తెలుస్తున్నది.

చూడండి, అతడు తన ఇల్లు విడిచి వెళ్తున్నాడు. అతడేమి చేస్తున్నాడు? తన పొలాలు చూసుకోడానికి వెళ్తున్నాడు. అతనికి చాల పొలాలున్నాయి. ఎందుకంటే అతడు చాల ధనవంతుడు. అతడిప్పుడు పొలానికి వెళ్లి ధాన్యం సరిగా పండిందో లేదో చూస్తాడు.

ఎండాకాలం దాదాపు ముగిసింది. వాతావరణం అద్భుతంగా ఉంది. తరచుగ సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. అప్పుడప్పుడు జడివాన కురుస్తోంది. అన్నీ ఎంత చక్కగా ఎదిగినవో చూడండి. ధాన్యపు కంకులు పొడవుగా బలంగా ఉన్నాయి. వాటినుండి మంచి గోధుమలు వస్తాయి. ఇదెంత అందమయిన గోధుమ పొలం! అది బంగారు సముద్రంలా కనిపిస్తోంది. పిల్లగాలి ఆ సముద్రంలో చిన్న చిన్న కెరటాలను పంపుతున్నట్టు కనిపిస్తున్నది.


ధనవంతుడెంత సంతోషిస్తున్నాడు! అతడు మనసులో ఇదంతా నాది. నేను వసంతకాలంలో విత్తనాలు వేసాను. కొద్ది కాలంలో పొలం కోతకు వస్తుంది. నాకు ఎంతో పంట దొరుకుతుంది. నేను మరింత ధనవంతుడ్ని అవుతాను, అనుకున్నాడు.

అయితే దీనినంతా ఎదుగజేసిన వాడు ఎవడు? ప్రతిదినం సూర్యుడు ప్రకాశించేలా ఎవరు చేసారు? మేఘాల నుండి వర్షం కురిపించినది ఎవరు? ధనవంతుడు దీని విషయం ఆలోచించలేదు. తన గోధుమ పొలాలు చూచుకొని గర్వించాడు. అతడెన్నడూ పైకి చూచలేదు. దేవుడు ఉంటే పరలోకం వైపు చూడలేదు. అన్నీ ఎదిగేలా చేసింది దేవుడే కదా? ధనవంతుడు సమస్తాన్నీ దేవుని నుండే పొందాడు. మనం కూడ అంతే. మనకు కలిగిన సమస్తం దేవుడే యిచ్చాడు. మనం ఈ సత్యాన్ని మరువకూడదు. బట్టలు, ఆహారం మొదలైన మన అవసరాలెన్నో దేవుని నుండి మాత్రమే మనం పొందుతున్నాము.

ధనవంతుడు ఇంటికి తిగిరి వెళ్లాడు. తన ధాన్యపు కొట్లు చూచాడు. అవి చాల చిన్నగా ఉన్నాయి - అనుకున్నాడు. నాకు చాలినంత స్థలం లేదు. అయితే నాకో మంచి ఆలోచన వచ్చింది. ఈ ధాన్యపు గాదెలను పడగొట్టి కొత్తవాటిని కట్టిస్తాను. ఆ కొత్తవి పాత వాటి కంటె పెద్దవిగ ఉంటాయి. అప్పుడు నేనెంత ధనవంతుడనో అందరూ తెలుసుకుంటారు.

అతడు తన యింటిలోకి వెళ్లాడు. తన మనసులో యిలా అనుకున్నాడు - నేను చాల ధనవంతుడను. నాకు చాల డబ్బు ఉంది. అది ఎన్నో సంవత్సరాలకు సరిపోతుంది. ఇక నేను కష్టపడనవరం లేదు. ఇప్పటి నుండి నేను సంతోషంగా బ్రదకవచ్చు. తినడానికీ త్రాగడానికీ ఎంతో ఉంది.

బయట చీకటి పడింది. ధనవంతుడు మంచం ఎక్కాడు. నిద్రపోకముందు మోకరించాడా? దేవుని గూర్చి



ఆలోచించాడా? ఎందుకంటే అతన్ని ధనవంతునిగా చేసింది ఆయనే కదా? అయితే అతడు దేవుని గూర్చి తలంచనే లేదు. ఎంత భయంకరం! మనకు దయచేసిన అన్నిటిని గురించీ మనం ప్రతి రాత్రి దేవునికి వందనాలు తెలియచేయాలి.

అతడు దేవున్ని యేమయినా అడిగాడా? క్రొత్త మనసుకోసం ప్రార్థన చేసాడా? లేదు. అది కూడ చేయలేదు. దాని అవసరం ఉందని అనుకోలేదు. మరి మనం నిద్రపోకముందు దాని కోసం ప్రార్థిస్తున్నామా?

ధనవంతుడు పడకమీద పండుకొని ఉన్నాడు. అతడు తన గోధుమ పొలాలను గురించి ఆలోచిస్తున్నాడు. తన క్రొత్త గాదెలను గురించి తలంచుచున్నాడు. అవును, అది చాల మంచి ఆలోచన, తాను చాల తెలివిగలవాడని - అని అనుకొంటున్నాడు. నిజంగా తెలివిగల వాడే!

అయితే దేవుడేమి చెబుతున్నాడు? "ధనవంతుడా, నీవు తెలివిగల వాడవు కావు. చాల బుద్ధిలేని వాడవు. నీవు తెలివిలేని ధన వంతుడవు" అన్నాడు. ఆ రాత్రి ఏమి జరిగిందో తెలుసునా? అతడు నిద్రపోయాడు. అప్పుడు, అదేరాత్రి అతడు హఠాత్తుగా చనిపోయాడు. అవును అదే జరిగింది. జబ్బుయేదీ లేకుండానే నీవు చనిపోవచ్చు.

ఇప్పుడేం జరుగుతుంది? వేరొకరు అతని పంట కోస్తారు. వేరొకరు అందమయిన అతని యింటిలో ఉంటారు. ఆ ధనవంతుడిక ఏదీ అనుభవించడు.

ఇతడు పరలోకానికి వెళ్లాడా? లేదు. ఎందుకంటే అతడు మారు మనసు పొందలేదు. అతడు చనిపోవడానికి సిద్ధపడలేదు. అతడు నరకానికి వెళ్లవలసివచ్చింది. అక్కడ అతడు నిత్యం బాధ, దుఃఖం అనుభవిస్తాడు. అతడిప్పుడు ఇక ధనవంతుడు కాడు. ఎప్పటికీ పేదవాడే.

నీవు నిజంగా ఎప్పుడు ధనవంతుడవు? నీవు దేవుని బిడ్డ వయినపుడు! నీకు అందమయిన యిల్లు, డబ్బు లేకపోయినా పరవాలేదు.

నీవు ఎప్పుడు పేదవాడవు? నీ మనసు మారనపుడు. అప్పుడు నీవు రాజభవనంలో నివసించినా, కావలసినంత డబ్బు ఉన్నా నీవు పేదవాడవే!



25. మంచి నేలను పడిన విత్తనం

మనం సాధారణంగా బైబిలు కథలు వింటూ ఉంటాయి. ఆలయంలో, బడిలో, ఇంటిలో ఇలా అనేక చోట్ల వింటాం. అప్పుడు దేవుడు మనతో మాట్లాడుతాడు. ఆయన మనకు ఏదో నీతిని బోధించ నాశిస్తాడు. యేసు ప్రభువు చెప్పిన ఈ క్రింది కథను వినండి.

ఒక రైతు రోడ్డు మీద నడిచిపోతున్నాడు. అతడు తనపొలానికి వెళ్తున్నాడు. అతడో బరువయిన సంచి మోసుకపోతున్నాడు. అందులో చిన్నచిన్న విత్తనాలున్నాయి. వాటిని పొలంలో చల్లుతాడు.

అదిగో, అతడు పొలంలో నడిచివెళ్తున్నాడు చూడండి. నిండు సంచిని మోసుకు పోతున్నాడు. అతడు గుప్పెడు విత్తనాలు తీసుకుని చల్లుతున్నాడు. అతడు వాటిని పొలంలో ఉన్న మట్టిలో చల్లాడు. తిరిగి తన చేతిని సంచిలో పెట్టాడు. మళ్లీ గింజలు నేల మీద విసిరాడు. అలా చేస్తూపోతున్నాడు. వ్యవసాయకుడు విత్తనాలు చల్లుతున్నాడు.

బైబిలు నుండి మనం కథలు వింటూంటాము. అది దేవుని వాక్యం. ఆ వాక్యం విత్తనం లాంటిది. అది మన హృదయంలో విత్త బడుతుంది. భూమిలో పడిన గింజలాగే! వ్యవసాయకుడు తన పని పూర్తిచేసాడు. విత్తనాలు ప్రతిచోటా చల్లాడు. అతడు ఇంటికి తిరిగి వెళ్లాడు. అతడు వెళ్లిపోయాక పొలంలో ఏం జరుగుతోంది?

చూడండి. కొన్ని పక్షులు నేలకు దగ్గరగా ఎగురుతున్నాయి. రుచికరమైన ఆ విత్తనాలు ఆనేల మీద పడి ఉండడం అవి చూచాయి. పొలం పక్కనున్న త్రోవలో అవి పడ్డాయి. వెంటనే వాటిని అవి తినేసాయి. అన్నీ తినేసాయి. ఎంత విచారం.

చాల మంది పెద్దలూ, చిన్నల విషయంలో యిలాగే జరుగుతుంది. వాళ్లు బైబిలు కథలు వింటారు. కొందరయితే అసలు వినరు కూడ. కొందరు వింటారు. ఆ కథ ముగియగానే మరచిపోతారు. దేవుడేం చెబుతున్నాడు? దాని గురించి వారసలు ఆలోచించరు. వాళ్లు మిగిలిన విషయాలను గూర్చి ఆలోచిస్తారు. అది సాతాను చేసేపని. పక్షులు వచ్చి విత్తనాలన్నీ తినేసినట్టే.

పొలంలో ఇంకా ఏమి జరుగుతున్నది? కొన్ని విత్తనాలు రాతి నేలలో పడ్డాయి. అక్కడ మన్ను ఎక్కువగా లేదు. చూడండి, అక్కడో చిన్న మొక్కకనిపిస్తోంది. దాన్ని చూచి రైతు సంతోషిస్తాడు. కొన్నిదినాలకి అవి వాడిపోయి నేలపాలయ్యాయి. అవి గాలి ఆడక చచ్చిపోయాయి.

ఇది కూడ పెద్దలకూ, పిల్లలకూ సంభవింపవచ్చు. వాళ్లు బాగా వింటారు. నూతన హృదయం కోసం అడుగుతారు. దాని విషయం ఆలోచిస్తారు. అయినప్పటికీ వాళ్లు మిగిలిన విషయాలలో మునిగి తొందరలో పడతారు. వాళ్లు డబ్బు కూడబెట్టి అంద మయిన వస్తువులు కొనుక్కోవాలని కోరుకుంటారు. వీటిని గురించి ఎక్కువగా ఆలోచిస్తారు. అవి ముళ్ళలాంటివి. వాళ్లు దేవుని గురించి ఆలోచించరు కాని ప్రార్థన చేస్తారు. అది హృదయ పూర్వకమయినది కాదు.

ఆ పొలంలో మరోరకం మొక్కలు కూడ మొలిచాయి. ఆ విత్తనాలు మంచి భూమిలో పడ్డాయి. అవి ఎత్తుగా, మరింత ఎత్తుగా ఎదిగాయి. వాటి వేర్లకు నీరు బాగ అందుతున్నది. సూర్యుడు వాటిపై వెచ్చగ ప్రకాశిస్తున్నాడు. చూడండి, ఈ మొక్కలపై ఏం కనిపిస్తున్నది? చిన్న దంటులు! వాటిలో వెన్నులు వస్తాయి. అందులో నుండి గోధుమ గింజలు వస్తాయి. సూర్యుడు అవి ఎదిగేలా చేస్తాడు. వ్యవసాయకుడు చాలా ఆనందంగా ఉన్నాడు. అయితే కాసేపయ్యాక అతడా మొక్కను మళ్లీ పరీక్షిస్తాడు. అయ్యో, ఆ మొక్కకాస్తా ఎండిపోతున్నది. అది చచ్చిపోయింది. ఎందువల్ల? దానివేరు నేలలోకి వెళ్లలేదు. ఎందుకంటే క్రింద చాల రాళ్లు ఉన్నాయి. చిన్న మొక్కకు నీళ్లు అందలేదు. కాబట్టి అది చచ్చిపోయింది. ఎంత విచారకరం!

అవును. చాల మంది పెద్దల్లో చిన్న వారిలో కూడ ఇలాగే జరుగుతుంది. బైబిలు కథలు వింటారు. చాల బాగ వింటారు. కొంతసేపు వాటి గూర్చి ఆలోచించవచ్చు. నూతన హృదయం కోసం ప్రార్థించవచ్చు. అయితే కొంత

కాలానికి వాటిని మరిచిపోతారు. వీళ్లు కూడ రాతినేలలో పడిన విత్తనం మొలచి, త్వరలో చచ్చిపోయినట్టే. ఎంత దుఃఖకరం!

పొలాన్ని మరోసారి చూద్దామా? మళ్లీ చిన్న చిన్న మొక్కలు పైకి వచ్చినట్టు కనపడుతోంది. అవికొంచెం కొంచెం ఎదుగుతున్నాయి. అయితే వాటితో మిగిలిన మొక్కలు కూడ పైకి వస్తున్నాయి. అవిచాల తొందరగా ఎదుగుతున్నాయి. ఆ ముళ్ల చెట్లు మంచి మొక్కలను పూర్తిగా కప్పేసాయి. మంచి మొక్కలు గాలి వీల్చలేకపోయాయి. ఆగోధుమలతో పిండి చేయవచ్చు! దానితో రుచిగల రొట్టెలు కాల్చవచ్చు! ఇలాంటి పెద్దలూ, చిన్నలూ కూడ ఉన్నారు. వాళ్లు వాక్యం వింటారు. అది వారి హృదయాల్లో ప్రవేశిస్తుంది. వాళ్లు ప్రార్థించడం ప్రారంభిస్తారు. నిజంగా హృదయ పూర్వకంగా ప్రార్థన చేస్తారు. వాళ్లు తమ పాపాల కోసం దుఃఖపడతారు. దేవుడ్ని క్షమాపణ కోరుతారు. వారు నిజంగా దేవుని ప్రేమించినవారు. వారి హృదయాల్లో ఆయన నివసిస్తాడు. అవును, వీరు నిజంగా ధన్యులు!

దేవుడు ఎన్ని విత్తనాలు చల్లుతున్నాడో ఒకసారి ఆలోచించండి. అవి యేమవుతున్నాయి? వాటిని గూర్చి ఆలోచిస్తున్నావా?

మనం దేవుని వాక్యం వినినపుడెల్లా ఆయన విత్తనాలు చల్లుతున్నాడు. అంటే ఆయన హృదయాలను ఇప్పటికీ మార్చగలడు. మంచి విత్తనంలా! ఆయన వాక్యం మనహృదయాల్లో నాటుకొని మంచి ఫలాలు తేగలదు!



26. రాకుమారుని వివాహం

ఇది ఒక రాజు, ఒక వివాహం గూర్చిన కథ. యేసు ప్రభువు దీనిని మనకు చెప్పాడు.

రాజుగారి భవనంలో చాలహడావుడిగా ఉంది. ప్రతీది అందంగా అలంకరించబడింది. ఎందుకంటే అక్కడ ఒక పెళ్లి జరుగనున్నది. అది రాకుమారుని వివాహం. అవును, అక్కడ అద్భుతమయిన ఓ పెద్ద విందు జరుగుతుంది!

యేసు ఈ కథ ద్వారా! మనతో ఏమి చెప్పాలని ఆశిస్తున్నాడో తెలుసా?

పరలోకంలో ఉన్న దేవుడే ఆ రాజు. యేసు ప్రభువు ఆ రాజ కుమారుడు. రాజమందిరం పరలోకం. మరి ఆ వివాహం అంటే యేమిటి? దేవుడు పాపులను రక్షించాలని కోరుతున్నాడు. అందరూ పరలోక రాజ్యంలో ప్రవేశించాలని ఆయన కోరిక.

విందు శాలలో అన్నీ ఘనంగా ఏర్పాటు చేసారు. ఇప్పుడు ప్రజలు విందుకు రావచ్చు. వాళ్లు అతిథులు. రాజసేవకులు పోయి అతిథులను ఆహ్వానిస్తారు. వాళ్లు వెళ్లి - అందరూ వివాహానికి రండి. సమస్తం సిద్ధంగా ఉంది, అని చెబుతారు.

మనము కూడ పిలవబడ్డాము. అదెప్పుడంటే బైబిలు చదివినపుడు, లేదా వినినపుడు. ఆలయంలో, లేదా బడిలో, లేదా ఇంటిలో. అదే దేవుని పిలుపు. ఆయన మన అందరినీ రక్షించాలని ఆశిస్తున్నాడు.

అయితే విందుకు పిలువబడిన వారు యేమన్నారు? "మేము రాడానికి యిష్టపడము". వాళ్లెంత బుద్ధిహీనులు!

రాజు వేరే సేవకులను పంపాడు. అయినా ప్రజలు వారిమాట కూడ వినలేదు. వాళ్ల పనులు వాళ్లు చేసుకొంటున్నారు. అంటే చాల మంది దేవుని వాక్యం వినడానికి యిష్టపడటం లేదు.

రాజసేవకులు ప్రజలను పిలుస్తూనే ఉన్నారు. అయితే వాళ్లకి చాల కోపం వస్తోంది. వాళ్లు సేవకులను పట్టుకొని బాగ కొట్టారు. కొందరినయితే కొట్టి చంపారు!

రాజుకీ వార్త తెలిసింది. ఆయన యేం చేస్తాడు? ఆయన చాల కోపపడ్డాడు. ఆ ప్రజల వద్దకు తన సైనికులను పంపాడు. ఆ హంతకులను వారు చంపాలి.

అప్పుడు రాజు మిగిలిన ప్రజలను విందుకు పిలువమని సేవకులను పంపాడు. పేదవారిని, పాపులను చూడండి, వారు రాజ మందిరానికి వస్తున్నారు. వాళ్లు పెళ్లికి వెళ్తారు. అంటే వాళ్లు దేవుని మాట వింటారన్న మాట. అప్పుడు దేవుడు వాళ్లని మార్చుతాడు. నీవు పేదవాడవయినా సరే, నీవు చాల పాపాలు చేసినా సరే. వాటిని క్షమించి నిన్ను మార్చడం దేవునికి కష్టం కాదు.

చాల మంది విందు శాలకు వచ్చారు. అందరూ ఎంత అందంగ కనిపిస్తున్నారు! అవును రాజు వాళ్లకి కొత్త బట్టలు యిచ్చాడు. ప్రత్యేకంగా పెళ్లికోసం అంటే పరలోకానికి వెళ్లే వాళ్లు మనసు మార్చుకోవాలి. కాబట్టి పెళ్లి వస్త్రం కొత్త బట్టలన్నమాట.

మరెవరో పెళ్లికి వస్తున్నాడు. అయితే అతడు క్రొత్తపెళ్లి వస్త్రం ధరించలేదు. ఎందుకు? అతడు ఇలా అనుకుంటున్నాడు - నాకవి అవసరం లేదు. నేనిపుడు ధరించినవి బాగానే ఉన్నాయి. అవును. ఇలా తలంచే వాళ్లు చాల మంది ఉన్నారు. వాళ్లు - నేను పాపిని కాను, నాకు కొత్త మనసు అవసరం లేదు, అనుకుంటారు. ఇది బుద్ధిహీతన కాదా?

రాజు విందుశాలలో ప్రవేశించాడు. ఆ గొప్ప విందు ప్రారంభం కాబోతున్నది. అతడు అతిథులందరినీ చూస్తున్నాడు. అక్కడ ఒక్కవ్యక్తిని, పెళ్లి వస్త్రాలు లేని వాడిని చూచాడు.

రాజు ఇలా అన్నాడు - నీవు ఇలా పెళ్లి విందుకు రావడానికి నీకెంత ధైర్యం! రాజు మాటలకు అతడు భయపడ్డాడు. అతడు జవాబీయ లేకపోయాడు.

సేవకులు అతని బంధించి బయటికి తీసుకుపోయారు. విందుశాల లోపట ఎప్పుడూ వెలుగ్గా ఉంటుంది. అక్కడందరూ సంతోషంగా ఉంటారు. అయితే దాని బయటచాల చీకటిగ ఉంటుంది. ఎప్పుడూ విచారమే. ఈ వ్యక్తి అచ్చటికి వెళ్తాడు.



అది అతని సొంతపారపాటే. అతనికి రాజు నూతన వస్త్రాలు ఇచ్చేవాడు. దీని అర్థం ఏమిటో మీకు తెలుసుకదూ? నూతన హృదయం లేకుండా పరలోకంలో ప్రవేశించ లేము.

పరలోకంలో నిత్యం వెలుగే. అక్కడ ఏ బాధ, దుఃఖం ఉండవు. అయితే బయట ఎప్పుడూ చీకటే. బాధ, దుఃఖం.

నీవు ఈ వ్యక్తిని గుర్తుంచుకుంటావా? నీవుదేని గూర్చి ప్రార్థించాలో నీకు తెలిసింది కదూ?



27. హోసన్నా!

యేసు ప్రభువు యెరూషలేముకు వెళ్తున్నాడు. ఆయన శిష్యులు కూడ వెళ్తున్నారు. వారితో పాటు చాల మంది వెళ్తున్నారు. ఎందుకంటే పస్కాపండుగ దగ్గర పడుతున్నది. అప్పుడు జనులు ఆలయానికి అర్పణలు తెస్తారు. అప్పటికే రోడ్లు జనంతో రద్దీగ ఉన్నాయి. వాళ్లు దూరంగా నున్న అందమయిన యెరూషలేము నగరాన్ని సమీపిస్తున్నారు.

వాళ్లొక గ్రామం పక్కగా పోతున్నారు. యేసు తన శిష్యులలో యిద్దరిని చూచి - ఈ గ్రామంలోకి వెళ్లండి. ఒక చెట్టుకు కట్టి ఉన్న గాడిద పిల్ల కనబడుతుంది. దానిని విప్పితీసుకరండి!. 'ఇది ప్రభువుకు కావాలి' అని దాని యజమానికి చెప్పండి, అన్నాడు.

శిష్యులు వెళ్లారు. అవును, అక్కడ గాడిదను చూచారు. దాని కట్టు విప్పుతుండగ యజమాని చూచి - మీరెందుకు దానిని విప్పుతున్నారు? అని అడిగాడు.

''ఇది ప్రభువుకు కావాలి'' అని శిష్యులు జవాబిచ్చారు. అప్పుడు దానిని తీసుక పోడానికి అతడు సెలవుయిచ్చాడు. బహుశ అతడు యేసు మిత్రులలో ఒకడై యుండవచ్చు.

ఆ గాడిదను యేసు దగ్గరకు తెచ్చారు. వీధులు చాల రద్దీగ ఉన్నాయి.

ఇప్పుడు శిష్యులేం చేశారు? తమ బట్టలను గాడిదపై వేశారు. యేసు దాని మీద కూర్చున్నాడు. అచ్చం రాజులా! ఎందుకంటే ఆ కాలంలో రాజులు గాడిద మీద ఎక్కి తిరిగేవాళ్లు.

శిష్యులు కేకలు వేశారు. ఆ గొప్ప జన సమూహం కూడ కేకలు వేస్తున్నది. వారు తమ పై బట్టలు తీసి రోడ్డు మీద పరిచారు. యేసు ఎక్కిన గాడిద వాటిపై నడిచింది. ఈ రీతిగ వారు తమ విధేయతను చూపించారు. మిగిలిన వాళ్లు చెట్లకొమ్మలు నరికి వాటిని ఊపుతున్నారు. కొందరు ఒలీవకొమ్మలు నరకి నేల మీద పరిచారు.



శిష్యులెంత ఆనందంగా ఉన్నారు! ప్రజలెంత సంతోషిస్తున్నారు! వాళ్లంతా యేసుకు స్తుతి గీతాలు పాడుతున్నారు. వాళ్లు - హోసన్నా, మన రాజు ధన్యుడు, ఆయన దావీదు కుమారుడు, అని కేకలు వేయడం వినండి.

వాళ్లంతా యేసే రాజని అనుకుంటున్నారు. ఇప్పుడు ఆయన యెరూషలేముకు వెళ్తాడు. ఆయన శత్రువులయిన రోమీయులను తరిమివేస్తాడు. ఆయన సర్వశక్తి కలవాడు కాబట్టి యేదయిన చేయగలడు. ఆయన అనేక అద్భుతాలు చేయలేదా? అందుకనే వాళ్లు అలా కేకలు వేస్తున్నారు.

అయితే కొందరు పాడడంలేదు. వాళ్లు పరిసయ్యులు, కోపంగా ఉన్నారు. బైబిలు గూర్చి వాళ్లకు బోలెడంత తెలుసు. వాళ్లు తాము దేవుని సేవకులమనీ, పరలోకానికి వెళ్తామనీ అనుకుంటున్నారు.

అయితే వారి హృదయాలు మారలేదని యేసుకు తెలుసు. వాళ్లు తన మీద కోపంగా ఉన్నారని కూడ ఆయన ఎరుగును. వాళ్లు తనకు శత్రువులు. ప్రజలు వారిని పొగడకుండా యేసును స్తుతిస్తున్నారని అసూయ పడుతున్నారు. చివరికి యేసు ప్రభువును చంపాలని కూడ కుట్రపన్నుతున్నారు. జనులు తనను స్తుతించక ఉండలేరని యేసు పరిసయ్యులకు చెప్పాడు. చిన్న పిల్లలు కూడా ఆయనను స్తుతిస్తారని దేవుడే వాగ్దానం చేసాడు.


గాడిద మీద యెక్కి యేసు యెరూషలేముకు వస్తున్నాడు. ఆయన సంతోషంగా ఉన్నాడా? లేదు, ఏడుస్తున్నాడు. ఎందుకు? ప్రజలంతా తనను స్తుతిస్తూ పాటలు పాడడం, కేకలు వేయడం ఆయన కిష్టంలేదా? యెరూషలేములో రాజుగ అవ్వడం యిష్టం లేదా? అవును రాజులా రాజ మందిరంలో బ్రదకడం ఆయనకు యిష్టం లేదు. ఆయన ప్రజల హృదయాల్లో రాజుగ ఉండాలని కోరుతున్నాడు. అయితే మనుష్యులకది యిష్టం లేదు. ఈ కారణంగా యేసు ఏడ్చుచున్నాడు.

జనసమూహం ఇంకాకేకలు వేస్తున్నారు. అయితే కొందరు ఇకపై అలా కేకలు వేయరు. కొన్ని దినాలు అయ్యాక ఆయనను చంపాలని అనుకుంటున్నారు. ఆయనను వారు ప్రేమించడం లేదు. త్వరలో దేవుని శిక్షవారిపైకి వస్తుంది. యేసు ప్రభువుకు ఇది తెలుసు. అందుకే ఆయన విచారిస్తున్నాడు.

యేసు యెరూషలేమును సమీపించాడు. ఇప్పుడు ఆయన యేమి చేస్తాడు? తన శత్రువులతో యుద్ధం చేయడు. రోమీయులను తరిమి వేయడు. రోగులను తిరిగి బాగు చేస్తాడు.

ప్రజలిక ఆయనను స్తుతించరు. ఆయన బోధ వినడానికి యిష్టపడరు. తమ హృదయంలో ఆయన రాజుగ ఏలడం వారి కిష్టం లేదు.

మనహృదయాలు కూడ ఆయనకు సేవచేయడానికి యిష్టపడడంలేదు. అయితే దేవుడు ఎంత కఠిన హృదయాన్నయినా మార్చి తనను ప్రేమించేలా చేయగలడు. మనపై యేసు రాజుగ ఉన్నప్పుడే మనకు నిజమయిన ఆనందం దొరుకుతుంది.



28. ద్రోహియైన యూదా

యేసు ప్రభువు యెరూషలేములో తన శిష్యులతో పాటు ఉన్నాడు. రాత్రి కావస్తున్నది. ప్రజలంతా ఇళ్లకు చేరారు. వీధులు చీకటిగా నిశ్శబ్దంగా ఉన్నాయి. చూడండి ఎవడో ఒంటరికగా అక్కడ నడిచిపోతున్నాడు. అతడెవరైయుంటాడు? ఎక్కడికి వెళ్తున్నాడు? ఏమి చేయబోతున్నాడు?

అతడు యూదా, యేసు శిష్యులలో ఒకడు. అయితే అతడు నిజమయిన శిష్యుడుకాడు. అతడు యేసును నిజంగా ప్రేమించలేదు. యేసు రాజు కావాలని యూదా ఆశపడ్డాడు. అతడిలా అనుకున్నాడు, యేసు రాజయితే నేనాయన సేవకులలో ముఖ్యుడ నౌతాను. అప్పుడు నేను ధనవంతుడను కాగలను.

అవును, యూదాకు డబ్బంటే ఆశ. అతడు కొన్నిసార్లు డబ్బు దొంగిలించేవాడు. ఎలాగో తెలుసా? యూదావద్ద యేసు, అతని శిష్యుల డబ్బు ఉండేది. దానితో అతడు ఆహారం మొదలయినవి కొనాలి. పేద వాళ్లకు ఏదన్నా సాయం చేయాలి. దానికి బదులు యూదా యేం చేసాడు? ఎప్పుడూ డబ్బులో కొంత తన కోసం ఉంచుకుంటాడు. యూదా దొంగ.

దొంగతనం పెద్ద పాపం. మనుష్యులు దానిని చూడకపోవచ్చు కాని దేవుడు అన్నీ చూస్తాడు!

యూదా యేసుపై కోపగించాడు. ఎందుకంటే రాజుగ ఉండడానికి ఆయన ఒప్పుకోలేదు. రాజమందిరంలో ఉండడం ఆయన కిష్టంలేదు. తాను చచ్చిపోబోతున్నానని యేసు చెప్పాడు.

అప్పుడు యూదా ఇలా అనుకున్నాడు - అయ్యో, ఇలా అయితే నేనొక ముఖ్యసేవకుడను కాలేను, ధనవంతుడను కాలేను. ఈ కారణంగా అతడు యేసు మీద కోపగించాడు.

యుదా చాల నిశ్శబ్దంగా నడుస్తున్నాడు. అప్పుడప్పుడూ వెనక్కితిరిగి చూస్తున్నాడు. తనను ఎవ్వరూ చూడ కూడదు. చివరికతడో పెద్ద యింటి ముందు ఆగాడు. తలుపుతట్టాడు. అది తెరుచుకుంది. అక్కడ చాల మంది ముఖ్యమయిన వాళ్లు ఒక పెద్ద గదిలో కూర్చున్నారు. వాళ్లల్లో పరిసయ్యులు, మిగిలిన ప్రధానులు ఉన్నారు. మీకు గుర్తుందా? వాళ్లంతా యేసు శత్రువులు. ఆయనను చంపడానికి కుట్రపన్నుతున్నారు. అది మీకు బహుశ గుర్తుండి ఉంటుంది.

యూదా వారితో యిలా అన్నాడు - మీరు యేసుప్రభువును పట్టుకోవాలను కుంటున్నారు కదూ? నేను మీకు సాయం చేయనా? ఎందుకంటే ఆయన ఎక్కడ ఉంటాడోనాకు తెలుసు. నేనెప్పుడూ ఆయనతోనే ఉంటాను.

"చాల మంచిది. ఇది బాగుంది" అన్నారు వాళ్లు.

"దీనికి నాకు ఎంత డబ్బిస్తారు?" అని యూదా అడిగాడు.

"మేము నీకు ముప్పై వెండి నాణాలు యిస్తాం" అని వాళ్లు ఒప్పుకున్నారు.

యూదా కళ్లు మెరిసాయి. అప్పుడే అతడు డబ్బుకోసం చెయ్యిచాపాడు. దానిని జాగ్రత్తగ జేబులో దాచుకున్నాడు. తరువాత మళ్లీ చీకటి వీధిలోకి వెళ్లి పోయాడు. యేసు, ఆయన శిష్యుల దగ్గరికు వెళ్లాడు. నన్ను ఎవరూ చూడ లేదని యూదా అనుకున్నాడు.

అయితే యేసుకు ఇది తెలుసు. ఆయన అంతా చూచాడు. ప్రభువు ఎంత బాధ పడి ఉంటాడు! యూదాతనను అప్పగిస్తాడని తెలిసిన యేసు అతనిని మిగిలిన శిష్యులతో సమానంగా చూచాడు. అయితే యిప్పుడు అతడు ఆయనను అప్పగించాడు. ఎంత భయంకరం! యూదా దుష్టుడుకదా? అతని మనసు చెడుతనంతో నిండి ఉంది.

అయితే వినండి? మరి మన హృదయాలు దేనితో నిండి ఉన్నాయి? మనం ధనవంతులం కావాలని ఆశిస్తున్నామా? గొప్పపేరు సంపాదించాలని కోరుతున్నామా? అలా అయితే మనం కూడ యూదాలాంటి వారమే. పాపం ఎంత భయంకరమో చూచారా? మనం హృదయాన్ని మార్చుకోవాలి. అప్పుడు మన ధనం అంతా ఆయన వద్దనే ఉంటుంది. దీనికోసం ప్రార్థన చేయడం మరువకండి.



29. ఈస్టరు

పస్కాపండుగ దగ్గర పడుతోంది. ఈ పండుగ కోసం అందరూ సిద్ధపడుతున్నారు.

యేసు కూడ తన శిష్యులతో కలిసి ఈ పండుగను ఆచరించాలని కోరుతున్నాడు. కాబట్టి ఆయన పేతురు, యోహానులతో ఇలా అన్నాడు - మీరు వెళ్లి పస్కాకోసం సమస్తం సిద్ధపరచండి. ''ఇది ఎక్కడ, ఎవరి ఇంట్లో సిద్ధంచేయాలి?'' అని వాళ్లు అడిగారు.

దానికి యేసు - మీరు యెరూషలేముకు వెళ్లగానే ఒకడు నడుస్తూ రావడం చూస్తారు. అతడు ఒక కూజాలో నీళ్లు మోసుక పోతూంటాడు. అతని వెంట వెళ్లండి. పస్కా మనం ఎక్కడ జరుపుకోవాలో అతడు చెబుతాడు, అన్నాడు.

శిష్యులు యేసు చెప్పినట్టే చేసారు. ఆ మనుష్యుడు వారి కొక గొప్ప గదిని చూపించాడు వాళ్లు అక్కడ పండుగ భోజనం సిద్ధం చేస్తారు. వాళ్లు రొట్టె ద్రాక్షా రసంకొన్నారు. మాంసం కొంత వండారు. అదే పస్కా పశువు. ఆ గదిలో కొన్ని బల్ల లున్నాయి. ఒక పళ్ళెంలో నీళ్లు ఉన్నాయి. అది కాళ్లు కడుక్కోడానికి. దుమ్ములవలన అందరి పాదాలు మురికి అవుతాయి. ఎందుకంటే ఆ కాలంలో వాళ్లు సరైన బూట్లు వేసుకొనేవారు కారు. చెప్పలు ధరంచే వాళ్లు. కాబట్టి భోజనం చేయక ముందు ప్రతి ఒక్కడూ తప్పక కాళ్లు కడుక్కోవాలి. అది ఆనాటి ఆచారం.

సాయంకాలం అయ్యింది. యేసు తన శిష్యులతో పాటు వస్తున్నాడు. వారంతా ఆ గదిలో ప్రవేశించారు. అయితే వారి పాదాలు ఎవరు కడుగుతారు? అది చేయడానికి అక్కడ సేవకుడెవడూలేడు. పేతురు చేస్తాడా? లేదు. ''నేను పనివాడినికాను, నేను అందరిలో ప్రధాన మయిన శిష్యుడను. వేరెవరయినా ఈ పని చేయాలి'' అని అతడనుకున్నాడు. మిగిలిన శిష్యులు కూడ ఇది చేయడానికి యిష్టపడలేదు. అందరూ గర్విష్టులే. దానిని గురించి వారిలో కొంత చర్చ కూడా జరిగింది. అందరూ ప్రముఖులుగా ఉండాలని అనుకొనేవారే. అప్పుడే? ఆ తరువాత ఏం జరిగింది? ఆ - చూడండి. యేసు ప్రభువు లేచారు ఆయన ఆ పెద్ద నీటి పాత్రను తీశారు. తువ్వాలు చేతితో పట్టుకున్నారు. ఆయన మొదటి శిష్యుని వద్దకు వెళ్లి అతని మురికి పాదాలను కడిగారు. తువ్వాలుతో తుడిచారు.

తరువాత రెండవ శిష్యుని వంతు. తరువాత మూడు..... అలా అందరి పాదాలు కడిగి, తుడిచాడు. శిష్యులు ఆశ్చర్యపోయారు!

యేసు పేతురు వద్దకు వచ్చాడు. అతడు తన పాదాలు వెనక్కి తీసుకున్నాడు. ''వద్దు ప్రభువా, నా పాదాలు నీవు ఎన్నటికీ కడగ డానికి వీల్లేదు'' అన్నాడు, యేసు మా అందరి ప్రభువు, బోధకుడు. ఆయన ఈ నీచమయిన పని చేయరాదని అతని తలంపు.

యేసు పేతురును చూచి - పేతురూ, నన్ను నీ పాదాలు కడగనీయవా? అలా అయితే నీవునావాడవుకావు. నా శిష్యునిగా ఉండవు, నా బిడ్డవు కాలేవు'' అన్నాడు.

పేతురుకు ఆశ్చర్యం, బాధ కలిగాయి! యేసు లేకుండ అతడు బ్రదుకలేడు. అతడు ఆయనను అంతగా ప్రేమిస్తున్నాడు. కాబట్టి వెంటనే - ప్రభువా, నా పాదాలు కడుగు, పాదాలు మాత్రమే కాదు నా తల, చేతులు కూడ కడుగు, అన్నాడు. అయితే అవి కడగ వలసిన అవసరంలేదు.

కాబట్టి యేసు యూదాతో సహా శిష్యులందరి పాదాలూ కడిగాడు.

''నేనిలా ఎందుకు చేస్తున్నానో తెలుసా? నేను ప్రధానుడనని ఎవ్వరి మీదా అతిశయించ కూడదు. మీరు అందరికన్న తక్కువ స్థానంలో ఉండడానికి సిద్ధపడాలి. అన్ని వేళలా ఒకరి కొకరు సాయం చేసుకోవాలి. నేను మీ బోధకుడను. ప్రభువును అయినా నన్ను నేను తగ్గించుకొన్న విధంగా మీరూ చేయాలి'' అని యేసు వారికి బోధించాడు.

అందరూ నిశ్శబ్దంగా విన్నారు. ఇది వాళ్లు నేర్చుకోవలసిన ముఖ్యమయిన పాఠం. అవును, ఆయన భూలోకానికీ పరలోకానికీ ప్రభువు అయినా, దేవుని కుమారుడయినా తన్ను తాను తగ్గించుకున్నాడు. వాళ్లు ఎలా ప్రవర్తించాలో ఆ మాదిరి చూపించాడు.

పాపంతో నిండిన మన హృదయాలు కూడ గర్వంతో ఉన్నాయి. మనం కూడ ప్రధానత్వం కోరుతాము. కాబట్టి దీన మనసు కోసం ప్రార్థించాలి. ఎందుకంటే అలాంటి వారి హృదయంలోనే ఆయన నివసిస్తాడు.

ఇప్పుడు వాళ్ళంతా రాత్రి భోజనం చేస్తారు, అయితే యేసు చాల విచారంగ కనిపిస్తున్నాడు. కారణం యేమిటి? వినండి.

యేసు "చివరిసారిగ నేను మీతో భోజనం చేస్తున్నాను. నా శత్రువులు వస్తున్నారు. నన్ను బంధిస్తారు.....మీలో ఒకడు నన్ను అప్పగిస్తాడు" అని చెప్పాడు.

శిష్యులంతా ఆశ్చర్యపోయారు. తమలో ఒకడు ఆయనకు ద్రోహం చేస్తాడా? "ప్రభువా, అది నేనా?" అని అందరూ ప్రశ్నిస్తున్నారు.

వాళ్ల హృదయాలు పాపంతోనిండి ఉన్నాయని వాళ్లందరికి తెలుసు. అందుకే అలా అడిగారు. యూదా కూడ ప్రభువా, నేనా? అని అడిగాడు. యేసు మృదువుగా అవును, నీవే, అన్నాడు. కాని మిగిలిన శిష్యులు అది వినలేదు. యేసుకు అంతా తెలుసునని యూదా గ్రహించాడు. ఆయన అతనితో - యూదా, నీవు వెళ్లి చేయవలసినది చెయ్యి" అన్నాడు. యూదా లేచి వెళ్లి పోయాడు. యేసు శత్రువుల దగ్గరికి వెళ్తున్నాడు. అతడు వాళ్లకి దారి చూపుతాడు. వాళ్లు యేసును బంధిస్తారు.

బయట వీధిలో చీకటి అలము కుంది. యూదా హృదయంలో కూడ చీకటే - కటిక చీకటి. అతని హృదయంలో దీనత్వం లేదు. సాతాను అక్కడ నివసిస్తున్నాడు. అతడు యిప్పుడు పూర్తిగ సాతానుకు లొంగి పోయాడు ఎంత ఘోరం!



30. చివరి భోజనము


యేసు ప్రభువు, ఆయన శిష్యులు కాల్చిన పస్కాగొర్రె పిల్ల మాంసం భుజిస్తున్నారు.

వినండి, ఆయనరొట్టెను ఎత్తి దానిని ముక్కలుగా విరిచాడు. శిష్యులందరూ ఆయన నుండి ఒక్కోముక్క తీసుకున్నారు. దానిని తిన్నారు.

యేసు వారిలో - నేను మీతో ఇకపై ఉండకపోయినా మీరు ఇలాగే చేయాలి. ఈ భోజనంలో పాలు పొందేటప్పుడు నన్ను జ్ఞాపకం చేసుకోవాలి ఎందుకంటే మీ కోసం నేను నా ప్రాణాన్ని ఇస్తున్నాను. నా శరీరం ఈ రొట్టెలా విరువబడు తుందని మీకు గుర్తు చేయడానికి ఇది చేస్తున్నాను. అంటే నా పిల్లలందరి కోసం నేను చచ్చిపోతానని అర్ధం, అన్నాడు.

అప్పుడు శిష్యులు ద్రాక్షారసం ఉన్న పాత్రను చుట్టూ తిప్పారు. అది ఎర్రని రసం. దానిని యేసు ఒక గిన్నెలో పోసాడు. అప్పుడాయన - మీరు ఇది కూడ చేయాలి. ఎర్రని ఈ ద్రాక్షారసం నారక్తానికి గుర్తు. ఎందుకంటే దీనిని కూడ మీ కోసం నేను చిందిస్తాను. ద్రాక్షరసం పాత్రలో పోయ బడినట్టే నా రక్తం కూడ ఒలుకుతుంది. అంటే నా పిల్లల కోసం నా ప్రాణం యిస్తాను. దీని వలన ఆ తరువాత వారు నాతో పరలోకంలో జీవిస్తారు, అని చెప్పారు.

మన ఆలయాల్లో కూడ మన మీ చివరి రాత్రి భోజన కార్యక్రమాన్ని ఆచరిస్తాము. ఇలా చేయాలని ప్రభువు మనలను కోరుతున్నారు. అప్పుడాయన పిల్లలు ఒక



చిన్న రొట్టెముక్కను, కొంచెం ద్రాక్షారసాన్ని తీసుకుంటారు శిష్యులు చేసినట్టే. అప్పుడు "నేను మీ కోసం చచ్చి పోయాను. మీ శిక్ష భరించాను. ఎందుకంటే నేను మిమ్మును ప్రేమిస్తున్నాను" అని తన పిల్లలకు గుర్తు చేస్తున్నట్టు అనిపిస్తుంది. ప్రభువు తన పిల్లలను వారి దుఃఖంలో ఇలా ఆదరిస్తాడు. వారాయన ప్రేమను సదానమ్మి మరింతగా ప్రేమించాలని ఇది గుర్తు చేస్తుంది.

చివరి రాత్రి భోజనంలో ఎవరు పాల్గొనవచ్చు? దేవుని పిల్లలు మాత్రమే. నీవూ ఆయన బిడ్డ వయితే



అందులో పాలు పొందవచ్చు. నీవు పెద్ద వాడ వయ్యాక అది చేయవచ్చు.

ప్రభురాత్రి భోజనం అయ్యాక యేసు ఆయన శిష్యులు ఒక పాట పాడారు.

నా ఆత్మా, పరలోకపు రాజును స్తుతించు.

ఆయన పాదాలకు నీ అర్పణ చెల్లించు.

విమోచింపబడి, స్వస్థత పొంది, లేవనెత్తబడి, క్షమాపణ పొంది,

మరింతగా ఆయనకు స్తుతులు చెల్లించు

స్తుతించు, స్తుతించి

నిత్యుడయిన రాజును స్తుతించు.

తరువాత వారా ఇంటిని విడిచి పెట్టారు. తిరిగి నిశ్శబ్దంగా, చీకటిగా ఉన్న యెరూషలేము వీధుల్లో నడుస్తున్నారు. పట్టణం బయటికి వెళ్లారు. అక్కడ మరింత చీకటిగా ఉంది.

అప్పుడు యేసు శిష్యులతో - నేను బంధించబడి చచ్చిపోతున్నాను. మీరంతానన్ను విడిచి పోతారు. అయితే నేను మరల లేచి మీకు కనిపిస్తాను, అన్నాడు. ప్రభువు పేతురుతో - నేను నీ విశ్వాసం బలహీనం కాకుండా ఉండాలని ప్రార్ధన చేసాను, అని చెప్పాడు. అందుకు పేతురు - అందరూ నిన్ను విడిచినా నేను మాత్రం విడిచిపెట్టను. నీతో చెరలోకి వెళ్లడానికి చివరికి చచ్చిపోడానికి నేను సిద్ధమే, అని చెప్పాడు. అయితే యేసు పేతురు వైపుతిరిగి - కోడి కూయక మునుపు నీవు నన్ను ఎరుగనని మూడుసార్లు చెబుతావు, అన్నాడు.

దీని అర్థం యేమిటి? ఈ రాత్రి అతడు యేసు శిష్యులలో తాను ఒకడిని కానట్టు ప్రవర్తిస్తాడు. యేసును తిన్నగ కాదంటాడు. మూడు సార్లు, భయపడడంవల్ల అబద్ధ మాడతాడు.

పేతరు దానిని అప్పుడు నమ్మలేదు కాని అది అలాగే జరిగింది.

ఇప్పుడు పేతురు తాను ప్రభువు కోసం చచ్చిపోడాని క్కూడ సిద్ధమని అనుకోవచ్చు. ఎందుకంటే అతడాయనను అంతగా ప్రేమిస్తున్నాడు. అయితే జరిగింది అదికాదు. ప్రభువైన యేసే పేతురు కోసం చచ్చిపోతాడు. లేకుంటే పేతురుకు రక్షణ ఉండదు.

31. గెత్సేమనే తోటలో

యెరూషలేము వెలుపట ఒక పెద్దతోట ఉంది. దానిని గెత్సేమనే అనిపిలుస్తారు. అక్కడ నిశ్శబ్దంగా చీకటిగ ఉంటుంది. యేసు ప్రభువు తన శిష్యులతో అక్కడికి వెళ్తున్నాడు. అక్కడికి చేరాక ఆయన - మీరిక్కడ కనిపెట్టండి. నేను తోటలోనికి వెళ్లి ప్రార్ధన చేసుకుంటాను, అని చెప్పాడు. ఆయనతో పాటు శిష్యుల్లో ముగ్గురు వెళ్లారు.

వాళ్లు, పేతురు యోహాను యాకోబు.

వాళ్లొక ప్రశాంత మయిన చోటికి వచ్చారు.

యేసు మీరిక్కడ ఉండండి. నాతో పాటు ప్రార్ధనలో కనిపెట్టండి. నా హృదయం దుఃఖంతో నిండి ఉంది, అన్నాడు.

ప్రభువు ఇంకాస్త ముందుకు వెళ్లాడు. ఆయన ఎంత భారంతో ఉన్నాడు! ఆయన వేదన గొప్పది. ఎవడన్నా శత్రువు సమీపంగా ఉన్నాడా? అవును. వాడు కనబడడు. వాడే సాతాను. ఆయన ఎంతగా శ్రమ పొందాలో వాడు చూపిస్తున్నాడు. వాడు ప్రభువును భయపెడుతున్నాడు.


యేసు మొరకరించి, దుఃఖంతో తండ్రికి మొరపెడుతున్నాడు - తండ్రీ, సాధ్యమయితే ఈ శ్రమను నా నుండి తొలగించు. అయినా నాయిష్టం కాదు, నీ చిత్తమే జరుగనీయి.

యేసు ముగ్గురు శిష్యుల వద్దకు తిరిగి వచ్చాడు. వాళ్లు నిద్రపోతున్నారు. ఇప్పుడు కంగారు పడిలేచారు. యేసు వారిని ''ఒక్క గంటకూడ నాతో పాటు మెలకువగా ఉండలేరా?'' అని ప్రశ్నించారు. తిరిగి ఆయన అదే చోటికి వెళ్లాడు. చాల వేదనతో ఉన్నాడు. నిలబడలేకున్నాడు. ఏదో గొప్పభారం ఆయన వీపుపై ఉన్నట్టు అనిపిస్తోంది. తన పిల్లల వేదన, దుఃఖం, దోషం, వారి పాపాలు - అన్నీ ఆయన పై పడ్డాయి.

అయితే యేసు స్వయంగా ఏ పాపమూ చేయలేదు. అవునా? అవును, అది నిజం. అయితే ఆయన తన పిల్లల పాపాలన్నీ మోస్తున్నాడు. అందుకే ఆయన అంత దుఃఖం, భయం అనుభవిస్తున్నాడు. అందుకే మనం యేసును క్రయధనం అంటాము. మన శిక్షను ఆయన భరించాడు. అది ఎంత భారమయింది! చూడండి, మన ప్రభువు ఒక పురుగులా నేలపై ప్రాకుతున్నాడు! మన ప్రభువు, ఎంత ప్రియమయిన రక్షకుడు! వినండి, ఆయన మళ్లీ ప్రార్ధన చేస్తున్నాడు. మళ్లీ అదే ప్రార్ధన, తండ్రీ, సాధ్యమయితే ఈ శ్రమను నా నుండి తొలగించండి. అయినా నీ చిత్తమే జరుగుగాక!''

యేసు పైకి లేచి మళ్లీ ముగ్గురు శిష్యుల దగ్గరికి వెళ్లాడు. ఆయన వేదనలో వారు ఆదరణ నిస్తారా? లేదు వాళ్లింకా నిద్రపోతూనే ఉన్నారు. ఆయన మూడవ సారి అదే స్థలానికి వెళ్లాడు. ఈసారి మరీ భయంకరంగా వేదనపడ్డాడు. ఆయన నొసటిపై చెమట బిందువులు కనిపించాయి. కాని అవి చెమట బిందువులు కావు. అవి రక్త బిందువులు. అదెలా సాధ్యం? వినండి,

దేవుడు పరిశుద్ధుడు కాబట్టి ఆయన పాపాన్ని, సహించలేడు. పాపం అంటే చాల కోపం. దానిని మనం దేవుని ఉగ్రత అంటాము. అది మంటలాటిది. మనం చేసే పాపం వల్ల ఆ ఉగ్రతలో పడి కాలిపోవడానికి మనం



అర్హులం. యేసు ప్రభువు దేవుని ఉగ్రతను భరించాడు. ఇప్పటి వరకూ యేసు దేవునితో ఏకమై ఉన్నాడు. అయితే యిప్పుడు దేవుని ప్రేమను అనుభవించడానికి బదులు ఆయన కోపాన్ని భరిస్తున్నాడు. ఆయన తండ్రి చేత విడవబడ్డాడు. ఆయన ఎంత వేదనను భరిస్తున్నాడంటే రక్తాన్ని చెమట బిందువుల్లా కార్చుతున్నాడు. అవి నేల మీద పడుతున్నవి.

ఆయన మళ్లీ తండ్రికి ప్రార్థన చేసాడు. కాని తండ్రి జవాబివ్వక మౌనంగా ఉన్నాడు. యేసు శ్రమపడాలి. చీకటి శక్తుల భయంకరత్వం మనం ఊహించలేక పోయినా తండ్రి చిత్తం జరిగితీరాలి. ఆయన మన రక్షకుడు కాబట్టి తన పిల్లల దుఃఖాన్ని భరించాలి. వారికి రావలసిన శిక్షను భరించాలి, లేకపోతే వారికి రక్షణ ఉండదు. యేసు తండ్రిని ఎంతగా ప్రేమిస్తున్నాడు! అందుకే ఆయన చిత్తాన్ని నెరవేరుస్తున్నాడు. ఆయన వారి రక్షకుడు.

మనం ఆయన పిల్లలంకాక పోతే అది ఎంత విచారకరం! మనం మనసు మార్చుకోలేకుండా చనిపోవడం ఎంత విచారం! అప్పుడు మనమే ఆ శిక్ష భరించాలి. దేవుని ఉగ్రత భయంకరం.

కాబట్టి "యేసూ, నీవు నా రక్షకునిగా ఉంటావా?" అని ప్రార్థించాలి.



32. యేసు బంధింపబడుట

గెత్సేమనే వనంలో ఏం జరిగిందో గుర్తుందా? యేసు అనుభవించిన శ్రమలు ఎంత భయంకరమైనవి! శిష్యులాయనకు ఎలాంటి ఓదార్పూయివ్వలేదు. వారు నిద్రపోయారు. అప్పుడు దేవుడు పరలోకం నుండి ఓ దేవదూతను పంపాడు. ఆ దూత యేసును బలపర్చాడు.

ఇప్పుడు యేసు ఆ ముగ్గురు శిష్యుల వద్దకు తిరిగి వెళ్లాడు. వాళ్లు మళ్లీ నిద్రపోయారు. యేసు వారితో "ఇక మీరు నిదుర పోవచ్చు" అన్నాడు. అయితే వాళ్లు వెంటనే లేచారు. యేసు - లెండి, శత్రువులు వస్తున్నారు. నన్ను అప్పగించే వాడు కూడ వస్తున్నాడు, అన్నాడు.

అవును, వాళ్లు వచ్చారు. కత్తులు, గుదియలు పట్టుకొని సైనికులు వచ్చారు. చేతుల్లో దివిటీలు కూడ ఉన్నాయి. కాస్త వెలుగు నివ్వడానికి.

చూడండి, ఆ గుంపు ముందట నడుస్తున్న వాడెవడు? అతడు యూదా. యేసు ఎవరో అతడు చూపిస్తాడు. ఎందుకంటే సైనికులకు ఆయన తెలియదు. యూదా వారికి "ఆయన ఎవరో మీకు తెలిసేలా నేనాయనకు ముద్దు పెడతాను. అప్పుడతన్ని బంధించండి" అని చెప్పాడు. యూదా యేసుకు దగ్గరగా వస్తున్నాడు. అతడు స్నేహపూరితంగా "బోధకుడా" అని పిలిచాడు. ఇంకా ఆయన తన స్నేహితుడయినట్టు అతడు యేసును కౌగలించి ముద్దు పెట్టుకున్నాడు. ఇంకా ఆయనను ప్రేమిస్తున్నట్టు. ఎంత దుష్టత్వం!

యేసు యూదా వేపు విచారంగా చూచాడు. ఆయన - యూదా, ముద్దు పెట్టుకుని నన్ను అప్పగిస్తున్నావా?, అన్నాడు. అప్పుడు యేసు సైనికులతో - మీరు ఎవరిని వెదకుతున్నారు? అని అడిగాడు. వాళ్లు నజరేతు వాడయిన యేసును, అన్నారు. అప్పుడాయన "నేనే" అని జవాబిచ్చాడు.

అయ్యో, ఇప్పుడే మవుతుంది? హఠాత్తుగ సైనికులంతా నేల మీద పడ్డారు. అదెలా జరిగింది? యేసు ప్రభువుతన శక్తిని చూపాడు. ఆయన దేవుని కుమారుడు కదా? వాళ్లాయనను బంధించలేరు. దానికి ఆయన ఒప్పుకుంటేనే అది సాధ్యం. దేవుడు తన శత్రువుల మీద సహా అధికారం చేస్తాడు. సైనికులు మళ్లీ లేచారు. తిరిగి యేసు - మీరెవరి కోసం వెదుకుతున్నారు?, అని ప్రశ్నించాడు. మళ్లీ వాళ్లు నజరేతు వాడయిన యేసును, అన్నారు.

అప్పుడాయన - మీరునన్ను బంధించ వచ్చు కాని నా శిష్యులను వదిలి పెట్టండి, అన్నాడు. ఇప్పుడు కూడ యేసు తన శిష్యుల క్షేమం కోరుతున్నాడు.

అప్పుడు సైనికులు ఆయనను పట్టుకున్నారు. అంతలో.... హఠాత్తుగ ఒకడు తన కత్తిని అటూ ఇటూ ఊపుతున్నాడు. అతడెవరు? పేతురు. అవును అతడే పేతురు. తన ప్రభువు కోసం పోరాడాలనుకున్నాడు. అతడు శత్రువులను చంపుతాడు. సైనికులపై తన కత్తిని ఊపాడు. అయితే అది దైవచిత్తం కాదు. యేసు పేతురుతో - పేతురూ, నీ కత్తి తీసివేయి, పోరాడకు. పరలోకం నుండి దూతలు వచ్చి కూడ నా కోసం పోరాడగలరు. అయితే వారికా సెలవులేదు. ఎందుకంటే పేతురూ, ఇలాజరిగి తీరాలని బైబిలులో రాసి ఉంది. నా తండ్రి చిత్తాన్ని నేను చేయాలి, అన్నాడు.

అయితే పేతురు అప్పటికే ఒక సైనికున్ని తన కత్తితో కొట్టి అతని చెవి నరికాడు! తెగి పడిన చెవి రక్తం కారుతోంది. చూడండి, ఆయన యేంచేస్తున్నాడో.



ఆ చెవిని తీసి అతికించాడు. సైనికుడు పూర్తిగ నయమయ్యాడు అవును. యేసు తన శత్రువుల పట్ల కూడ దయ చూపిస్తాడు.

ఇప్పుడు యేసును పెద్ద తాళ్లతో బంధించారు. ఒక హంతకుని బంధించినట్టు! ఆయన వారితో వెళ్లాలి. మరి శిష్యుల మాటేమిటి? వాళ్లని బంధించలేదు స్వేచ్ఛగ ఉన్నారు. యేసు అదే కోరాడు. ఆయన తన శిష్యులను అంత బాగా చూచుకున్నాడు. తన పిల్లలందరినీ అలాగే చూచుకుంటాడు. వాళ్ల కోసం తాను బంధించబడతాడు. అది ఆయన వాళ్ల పాపాల కోసం భరిస్తున్న శిక్షలో ఒక భాగం. ఎందుకంటే ఆయన వారిని చాల ప్రేమిస్తున్నాడు.

నీకు రక్షకుడు కావాలా? నీకనులు విప్పమని దేవున్ని అడుగు.



33. శత్రువులతో యేసు, పేతురు

యేసు శత్రువులతో వెళ్లవలసి వచ్చింది. ఒక పెద్ద భవనం దగ్గరకు తీసుక వెళ్లారు. చూడండి, ఆ పెద్ద గదిలో చాల ముఖ్యులయిన వాళ్లు కూర్చొని ఉన్నారు. అందులో ప్రధానుడు కయప. అతడు ప్రధాన యాజకుడు. వాళ్లంతా యేసుని బంధించగలిగారు. అదిగో ఆయన అక్కడ ఉన్నాడు. ఆయన చేతులు కట్టేసారు. సైనికులు కొందరు ఆయనను పట్టుకున్నారు. వాళ్లాయనను యేం చేస్తారు? ఆయనకు శిక్ష వేయాలని వారి ఆశ. ఆయనకు అన్నిటికన్న ఘోరమయిన శిక్షపడాలి. ఆయన చనిపోవాలి. అయితే ఆయన ఏ పాపం చేసాడు? ఆయన ఎన్నడూ, ఎవరికీ కీడు చేయలేదు ఆయన సదా మేలే చేసాడు. ఆయన రోగులను బాగుచేయడం లాంటి చాల మంచి పనులు చేసాడు ఆయినా ఆయనను శిక్షించాలి.

అందుకనే కొందరు యేసును గూర్చి అబద్ధాలు చెబుతున్నారు. వారు చెప్పేది అబద్ధమని ఆయన ఎరుగును. అయినా ఆయన ఏమీ అనలేదు.

అప్పుడు కయప కోపం తెచ్చుకున్నాడు. ''నీవు జవాబు ఎందుకు చెప్పవు? నీవు దేవుని కుమారుడవా? నీవు దేవుని కుమారుడవా? అని అడిగాడు. అప్పుడు యేసు మాటలాడడం మొదలు పెట్టి - అవును, నేను దేవుని కుమారుడనే. నేను పరలోకానికి వెళ్తాను. అయితే ఒక రోజు తిరిగి వస్తాను. అప్పుడు మీరు నన్ను చూస్తారు. నేను మేఘాల మీద దిగివస్తాను, అని చెప్పాడు.

ఈ మాటలకు ఆ అధికారులు భయపడ్డారా? లేదు. వాళ్లకింకా కోపం వస్తోంది. కయప - ఇతడు అబద్ధం చెబుతున్నాడు. దేవుడ్ని ఎగతాళి చేస్తున్నాడు. ఎందుకంట ఇతడు దేవుని కుమారుడెలా అవుతాడు? ఇతనికి శిక్షపడాలి. ఇతనికి మరణశిక్ష వేయాలి. అవును, అవును - అని అందరూ అరిచారు. ''ఇతన్ని చంపాలి'' - అన్నారు.

యేసు జవాబివ్వలేదు. అప్పుడు వాళ్లు ఆయనను చాల హింసించారు. పిడిగుద్దులు గుద్దారు. ముఖంమీద ఉమ్మివేసారు. యేసు తిరిగి యేమీ చేయలేదు. ఆయన అలాగే నిలబడి ఉన్నాడు. ఈ శ్రమ కూడ అనుభవించవలసి ఉంది. అంతలో తలుపు తెరుచుకొని ఎవరో వస్తున్నారు. అది పేతురు. యేసును ఏం చేస్తున్నారో తెలుసుకోవాలని అతనికి ఆతృతగా ఉంది. అయితే అది చాల అపాయకరం. ఎందుకంటే అతడిప్పుడు శత్రువులకు చాల దగ్గర్లో ఉన్నాడు. తానెవరో వాళ్ళకి తెలిసిపోతే? తనను కూడ బంధిస్తారు. ఈ ఆలోచనతో పేతురకు భయం వేసింది. చూడండి, అక్కడ చలిమంట మండుతున్నది. సైనికులు చలి కాచుకుంటు న్నారు. పేతురు కూడ అక్కడికి వెళ్లి నిలబడ్డాడు. ఎవరూ అతన్ని గుర్తించకపోవచ్చును. అయితే ఒక పనిపిల్ల పేతురును గమనిస్తున్నది. ఆమె - నీవు యేసు శిష్యులలో ఒకడివి కావా? అని అడిగింది.

పేతురు కంగారు పడ్డాడు. తానిప్పుడు ఏం చెప్పాలి, సత్యం చెప్పాలా? అతనికి చాల భయం వేస్తోంది. వాళ్లు తనను కూడ బంధిస్తే. తను కూడ చంపేస్తే? ''నేను ఆయన శిష్యుడను కాను. ఆయన ఎవరో నాకు తెలియదు'' అన్నాడు. పేతురు అబద్ధం చెబుతున్నాడు. ఇప్పుడు యేసు ఎవరో తెలియదంటున్నాడు. అతడు మెల్లగా తలుపు దిక్కుగా కదిలాడు. చాల భయపడ్డాడు.

వినండి, మరో పనికత్తె వచ్చి, నీవు యేసుతో ఉన్నావు కదా? అని అడిగింది.

పేతురు భయపడిపోయాడు! ''లేదు, అది నిజంకాదు ఆయనెవరో నాకు తెలియదు'' అన్నాడు. అతడు మళ్లీ అబద్ధం చెబుతున్నాడు. అక్కడ నుండి వెళ్లిపోవడానికి ధైర్యం చాలలేదు. వెళ్లి మంట వద్ద కూర్చున్నాడు. అక్కడ సైనికులున్నారు.

అంతలో ఒకడు - నీవు యేసు శిష్యుడవే. ఈ రాత్రి నేను గెత్సేమనే తోటలో నిన్ను చూచాను, అన్నాడు. దానికి పేతురు - లేదు, ఆయన ఎవరో నాకు తెలియదు. నేను ఆయన శిష్యుడను కాను అన్నాడు. వినండి, ఇప్పుడు పేతురు శపిస్తున్నాడు! యేసును ఎరుగనని మూడుసార్లు అబద్ధం చెప్పాడు.


అప్పుడు.....దూరంగా ఓ కోడి కూసింది. పేతురు విన్నాడు. యేసు ప్రభువు అతనితో యేమన్నాడు? ''కోడి కూయకముందు నీవు నన్ను ఎరుగనని మూడుసార్లు అబద్ధం చెబుతావు''. ఇప్పుడు అదే జరిగింది.



యేసు వెనక్కి తిరిగి తిన్నగా పేతురు కళ్లలోకి చూచాడు. ఆయన ముఖంలో కనికరం కనిపిస్తోంది. ఆయన దుఃఖంతో నిండి ఉన్నాడు.

పేతురు హృదయం నిండా దుఃఖం. అతడాచోటు విడిచి వెళ్లిపోయాడు. దూరంగా, చీకటిలోకి వెళ్లిపోయాడు. కిందపడి అతడు ఏడ్చుచున్నాడు. "నా ప్రియమయని బోధకుని మూడుసార్లు ఎరుగనని బొంకాను. నేనాయనకు ఎంతో దుఃఖం కలిగించాను. ప్రభువు, ఇప్పుడు కూడ నా గురించి ఆలోచిస్తున్నాడా? ఆయన నన్ను క్షమిస్తాడా? ఎందుకంటే ఆయన లేకుండా ఏంచేయాలో నాకు తెలియదు".

నీవు వింటున్నావా? పేతురు తాను చేసిన పాపానికి చింతిస్తున్నాడు. దాని గూర్చి అతడు నిజంగా పశ్చాత్తాప పడతాడు. ప్రభువు తప్పక క్షమిస్తాడు. ఇది భయంకర పాపమయినాసరే. ఎందుకంటే యేసు పేతురు పాపాల కోసం కూడ చనిపోయాడు. పేతురు వలె నిజంగా దుఃఖించి తమ పాపాలను దేవుని వద్ద ఒప్పుకొన్న వారిందరి కోసం యేసు ప్రభువు శ్రమపొంది మరణించాడని నీకు తెలుసా?



34. పిలాతు యెదుట

సైనికులు యేసును తమతో తీసుకపోతున్నారు. ఆయన శత్రువులంతా వస్తున్నారు. వాళ్లంతా ఎక్కడికి వెళ్తున్నారు? యేసు ప్రభువును వాళ్లు యిప్పుడే చంపేస్తారా? లేదు. అప్పుడే కాదు మొదట పిలాతు అనుమతి పొందాలి.

పిలాతు ఒక ముఖ్యమయిన రోమా న్యాయాధిపతి. న్యాయాధిపతి అంటే తీర్పు నిచ్చి శిక్షించేవాడు. అంటే తప్పుచేసిన వారిని మాత్రమే. న్యాయాధిపతి ఎప్పుడూ యథార్థపరుడైయుండాలి. ఇప్పుడు వీళ్లంతా యేసును పిలాతు దగ్గరకు తీసుకపోతున్నారు.

అక్కడ చాల సందడిగా ఉంది. పిలాతు భవనం ఎదుట చాలమంది నిలబడి ఉన్నారు. "యేసు యే తప్పు చేసాడు? అతనెందుకు చనిపోవాలి?" అని పిలాతు ప్రజలను ప్రశ్నించాడు.

నిజంగా దీనికి జవాబు ఎవరికీ తెలియదు. ప్రభు యేసు ఎన్నడూ ఏ తప్పు చేయలేదు. ఆయన పరిశుద్ధుడు. అంటే పాపం చేయనివాడు. చాలమంది అబద్ధాలు చెబుతారు. "ఇతడు చావాలి" అని వాళ్ళు అరుస్తున్నారు.

పిలాతు యేసువైపు చూచాడు. విచారంతో, ప్రశాంతంగా ఉన్న ఆయన ముఖం చూచాడు. యేసు నిజంగా తప్పు చేసాడా? పిలాతు నమ్మలేకపోయాడు. ఈయన చచ్చిపోవాలా? లేదు. మరణశిక్షకు ఆయన పాత్రుడు కాడు. పిలాతుకు ఖచ్చితంగా అది తెలుసు. ఆయన ఏ పాపమూ చేయలేదు. ఆయన నిర్దోషి. అయితే యేసును విడుదల చేయడానికి పిలాతు భయపడ్డాడు. ఎందుకంటే ప్రజలంతా ఆయనపై పగపట్టారు. గట్టిగా అరుస్తున్నారు. వారిని చూచి అతడు భయపడ్డాడు. "యేసు మీ రాజా? ఆయనను నేనేం చేయాలి? అని అడిగాడు". వాళ్లంతా గట్టిగా, "అతడు మా రాజుకాడు. అతడు చావాలి. అతన్ని సిలువ వేయాలి" అని అరిచారు పిలాతు ఒక మార్గం ఆలోచించాడు. అతడు సైనికులను చూచి, "మీరు వెళ్లి చెరసాలలో ఒక ఖైదీని తీసుకరండి" అని చెప్పాడు.

సైనికులు చెరసాలకు వెళ్ళారు. కొంచెంసేపటిలో ఒక ఖైదీని పట్టుకవచ్చారు. అతని పేరు బరబ్బ. అతడు యేసు ప్రక్క నిలబడ్డాడు. ప్రజలు వాళ్లిద్దరినీ చూస్తున్నారు. ప్రజలు అరవడం మానారు. పిలాతు యిప్పుడు యేం చేస్తాడు? పిలాతు ఇలా అన్నాడు. "ఇది పస్కా పండుగ సమయం. కాబట్టి వీరిలో ఒక ఖైదీని విడుదల చెయవచ్చు. మీరు ఎవరు విడుదల కావాలని కోరుకుంటారు? యేసునా లేక బరబ్బనా?" పిలాతు తన మనసులో, వీళ్ళు యేసు ప్రభువునే కోరుకుంటారు. ఎందుకంటే బరబ్బ హంతకుడు. ప్రమాదకరమైనవాడు. కాబట్టి నేను యేసును విడుదల చేయవచ్చు - అనుకున్నాడు.

అయితే ప్రజలు - బరబ్బను విడుదల చేయండి యేసును చంపండి. యేసు చావాలి. అతన్ని సిలువ వేయండి, అని అరిచారు. కొంతసేపటి క్రితం ఏమయ్యిందో మీకు గుర్తుంది కదూ? ప్రజలు యేసు ప్రభువుకు హోసన్నా పాటలు పాడారు. ఒలీవ కొమ్మలు ఊపారు. అప్పుడాయనను రాజును చేయాలనుకున్నారు. మరి యిప్పుడు?....అంతా మారిపోయింది. ఇప్పుడు హంతకుడయిన బరబ్బను కోరుకున్నారు యేసుకు ఎంత అన్యాయం! ఆయన ఎలా శ్రమ నొందాలి?

బరబ్బ విడుదల అయ్యాడు. మరి యేసు మాట యేమిటి?

పిలాతు ఆయనను లోపటికి తీసుకువెళ్లాడు. అయితే సైనికులు ఆయనను యేమి చేయబోతున్నారు? ఆయన బట్టలు తీసి వేసారు. కొరడాలతో భయంకరంగా కొట్టారు. యేసు కొరడా దెబ్బలు తిన్నాడు. ఆయన వీపు నుండి రక్తం కారేంత భయంకరంగా కొట్టారు. తరువాత సైనికులు ఆయనకు ఊదారంగు అంగీ తొడిగించారు. "ఇప్పుడు ఇతడు ఓ రాజులా కనిపిస్తున్నాడు" అని గేలి

చేసారు. ఆయనను చూచి నవ్వుతున్నారు.

వాళ్లు ముళ్లతో ఓ కిరీటం కూడ చేసారు. "చూడండి. ఇతని కోసం చేసిన కిరీటం! ఇది రాజ కిరీటం!" అని చెప్పతూ నవ్వారు. దానిని ఆయన తలమీద దిగగొట్టారు. దానివల్ల ఆయన తల నుండి రక్తం కారింది. ఎంత భయంకరం!

"ఇప్పుడితడు నిజంగా రాజే" అని నవ్వుతూ ఆయన ముందు మోకరించారు. అది నిజంగా కాదు. ఆయనను వెక్కిరించడానికి మాత్రమే.

పిలాతు తిరిగి యేసును బయటికి తెచ్చాడు. "ఈ మనుష్యుని చూడండి" అన్నాడు. అంటే "మీ రాజును చూడండి. ఆయన పడుతున్న బాధను చూడండి" అని అర్థం.

ప్రజలు యిప్పుడు తప్పక ఆయనపై జాలిపడతారు. ఆయనను వదిలివేయమని అనవచ్చు. అయితే వాళ్లేం అరుస్తున్నారో వినండి. "ఇతన్ని సిలువ వేయండి, చంపండి".

పిలాతుకు యింకా భయం వేసింది. ఇతన్ని తప్పక విడిపించాలి. ఆయన యే తప్పూచేయ లేదు. అయితే యేసును సమర్థించడానికి భయపడ్డాడు. అతడో పిరికి న్యాయాధిపతి. చివరికి "సరే ఇతన్ని సిలువ వేసుకొనండి" అని చెప్పాడు. సైనికులిపుడు యేసును తీసుక పోతారు.

అవును మనుష్యుల హృదయాలన్నీ చెడ్డవే, మనవి కూడ. దేవుడే మనకందరికీ నూతన హృదయాలు యివ్వాలి. మన హృదయాలు క్రొత్తవయితే ఈ రక్షకుని తెలుసుకొంటాయి. మన కోసం ఆయన పడిన శ్రమ తెలిసి ఆయనను ప్రేమిస్తాయి.



35. కల్వరి కొండమీద

సైనికులు యేసును తీసుక పోతున్నారు. వాళ్లాయనను యెరూషలేము వీధుల గుండా నడిపిస్తున్నారు. వాళ్లు ఆయనను పట్టణం వెలుపల ఉన్న కలువరి కొండమీదికి తీసుకవెళ్తున్నారు. యేసు అక్కడ మరణించాలి.

చాల మంది ఆయనతో పాటు నడుస్తున్నారు. వాళ్ల కేకలు వినండి. యేసు ఒక బరువైన పెద్ద చెక్క సిలువను మోస్తున్నాడు. ఆయన భుజాల మీద అదెంతో బరువుగా ఉంది. దాని వల్ల ఆయన ఇంకా ఇంకా వంగి పోతున్నాడు. ఆయన చాల అలసిపోయాడు. ఇప్పటికే ఎంతో బాధ ననుభవించాడు. ఆయన ఇక ఆ సిలువను మోయలేడని సైనికులు గ్రహించారు. కాబట్టి ఎవరో ఒకరు దానిని మోయాలి. ఎవరు దానికి యిష్టపడతారు? ఎవరు యేసు ప్రభువుకు సాయం చేస్తారు? ఎవరూ చేయరు.

అంతలో ఒక వ్యక్తి ఆ దారిని వెళ్తున్నాడు. అతని పేరు సీమోను. అతడు ఒక దూర దేశానికి చెందినవాడు. కురేనియ ప్రాంతంవాడు. పస్కా పండుగను చేసుకోడానికి సీమోను యెరూషలేముకు వచ్చాడు. ప్రజలంతా గుంపులుగా వెళ్లడం అతడు చూచాడు. అప్పుడు హఠాత్తుగా.....సైనికులు సీమోనును పట్టుకున్నారు. వాళ్లు అతనితో - నీవు యేసు సిలువను మోయాలి, ఎందుకంటే ఆయన దానిని మోయలేకపోతున్నాడు - అని చెప్పారు. కాబట్టి సీమోను దానిని మోస్తూయేసును వెంబడించాడు. ఆ దృశ్యం ఒక్కసారి చూడండి! వాళ్లు కలువరి కొండ చేరారు. అక్కడ సీమోను ఆ సిలువను నేలపైదించాడు. తరువాత అతడు వెళ్లిపోయాడు. సిలువ వేయబడవలిసింది అతడు కాదు.

ఆ తరువాత అతి భయంకరమైనది సంభవిస్తుంది. సైనికులు పెద్ద మేకులు తీసి యేసు కాళ్లను చేతులను సిలువకు కొట్టి బిగించారు. తరువాత సిలువను ఎత్తి నేలలో నిలవ బెట్టారు. యేసు భయంకరమైన బాధను అనుభవించాడు!

వినండి. ఆయన యేదో చెప్పుతున్నాడు. ఆయన సైనికులను దూషిస్తున్నాడా? లేదు. ఆయన పరలోకంలో ఉన్న తన తండ్రికి ప్రార్ధన చేస్తున్నాడు.

తన శత్రువుల నందరినీ శిక్షించమని తండ్రిని అడుగుతున్నాడా? లేదు. ఆయన ఏమి ప్రార్థిస్తున్నాడో వినండి, "తండ్రీ, వీళ్లు ఏం చేస్తున్నారో వీళ్లకి తెలియదు, గనుక వీరిని క్షమించు". యేసు తన శత్రువుల కోసం ప్రార్ధన చేస్తున్నాడు. తండ్రి ఆ ప్రార్ధన తప్పక ఆలకిస్తాడు. ఎందుకంటే కొంత కాలానికి ఈ శత్రువులలో కొందరు మారిపోతారు!

యేసుతో పాటు మరో యిద్దరు సిలువ వేయబడ్డారు. వాళ్లు దొంగలు. వాళ్లని యేసుకు రెండు వేపులా సిలువ వేసారు.

ఇప్పుడు అక్కడున్న వాళ్లు యేసు ప్రభువును గేలి చేస్తున్నారు. వాళ్లు ఆయనను చూచి విచారపడడం లేదు. "నీవు దేవుని కుమారుడవు కావా? నీ వేమి చేయలేవా? సిలువ మీద నుండి దిగిరాలేవా? చూడండి, అతడు తనను తాను రక్షించు కోలేదు!" అని గేలి చేస్తున్నారు. వాళ్ల మాటలు యేసు వింటున్నాడు. కాని తిరిగి జవాబీయలేదు. అవును, ఆయన సిలువ దిగి రాగలడు. ఎందుకంటే ఆయన దేవుని కుమారుడు. అయినా ఏమీ చేయడం లేదు. ఎందుకంటే తన పిల్లల కోసం ఈ భయంకరమయిన శ్రమననుభవిస్తు న్నాడు. ఆయన వారి రక్షకుడు కాబట్టి ఆయన సిలువ దిగిరాడు. అలా వస్తే ఎవరూ రక్షణ పొందలేరు.

ఇరువైపుల ఉన్న దొంగల్లో ఒకడు - నీవు దేవుని కుమారుడవుకావా? అయితే నిన్ను నీవు రక్షించుకొని మమ్మును కూడ రక్షించు, అని చెప్పాడు. ఈ మాటలు రెండవ ప్రక్కనున్న దొంగ విన్నాడు. మొదట యితడు కూడ గేలి చేసాడు. కాని ఇప్పుడు అతడలాలేడు. ఇతడు మొదటి దొంగతో - నీవు యేసును గేలిచేయకు. ఈ శిక్ష మనకు తగినది. ఎందుకంటే మనం ఎన్నో పాపాలు చేసాం. అయితే ఈ శిక్ష యేసు ప్రభువకు తగదు. ఆయన యే పాపమూ చేయలేదు, అన్నాడు.

అవును. ఈ దొంగ తన పాపాల కోసం చాల చింతించాడు. ఇప్పుడతని హృదయంలో యేసు ప్రభువు భయం ఉంది. 'యేసు దేవుని కుమారుడు. సర్వ శక్తి గల రాజు ఆయన నన్ను రక్షించగలడు' - అని అనుకున్నాడు. దీనిని హృదయ పూర్వకంగా విశ్వసించాడు.

ఆ దొంగ ప్రార్థన చేస్తున్నాడు, వినండి - ప్రభువా, నా గురించి నీవు చింతిస్తావా? నీవునీ రాజ్యంలోకి వెళ్లినపుడు నన్ను గుర్తు చేసుకుంటావా?, అన్నాడు అతడెంత దీనంగా ప్రార్థించాడు! హృదయ పూర్వకంగ ప్రార్థన చేసాడు. తన పాపాల కోసం చింతించాడు. యేసు యెదుట మోకాళ్లూనాలని ఆశించాడు. ఆయనతో సదా ఉండాలని కోరాడు. అవును, ఈ దొంగ ఇపుడు యేసును ప్రేమిస్తున్నాడు!

యేసు అతని మాట వింటాడా? తప్పక, అలా ప్రార్థించే వారి మాట ఆయన తప్పక వింటాడు!


యేసు - నేను నీకో నిజం చెబుతాను. ఈ దినమే నీవు నాతో కూడ పరదైసులో ఉంటావు, అన్నాడు. దీని అర్థం యేమంటే ఈ దినం నీవు పరలోకానికి వెళ్తావు. అక్కడ నిత్యం నాతో ఉంటావు.

ఆ దొంగకు ఎంత కృప దొరికింది. ఇంక కొంతసేపు అతడు సిలువ మీద శ్రమ పడాలి. అప్పుడతడు చచ్చిపోతాడు. ఆ తరువాత..... పరలోకంలో చేరుతాడు. తన రక్షకుడయిన యేసుతో సదా అక్కడ ఉంటాడు. ఆ దొంగ పొందవలసిన శిక్షను ఆయన భరించాడు. అతని కోసం ఆయన చనిపోయాడు.

పరలోకంలో అతడిక దొంగకాడు. అక్కడ తను పాపం చేయడు. నిత్యం దేవుని సేవిస్తూ స్తుతిస్తూ ఉంటాడు!

ఒక దొంగను కూడ దేవుడెలా మార్చగలడో నీవు చూడగలవు. అతని జీవితంలో అది చివరి దినమయినా సరే.

నేను వృద్ధుడ నయ్యాక దేవున్ని వెతకుతానులే అని అనుకోకూడదు. మనం ఎంత కాలం బ్రదుకుతామో తెలియదు. కాబట్టి నూతన హృదయం కోసం ఈ దినమే నీవు ప్రార్థించేలా ఆయన దయచేయును గాక!



36. యేసు ప్రభువు మరణించినపుడు

గొల్గొత కొండ మీద చీకటి పడింది. అదెలా జరిగింది? సాయం కాలం కావడానికింకా చాల సమయం ఉంది. అయినప్పటికీ చీకటి అన్నిచోట్లా కమ్ముకుంది. సూర్యుడు ప్రకాశించడం లేదు. ఎందుకంటే యేసు ప్రభువు శ్రమలు అంత ఎక్కువయ్యాయి.

మనుష్యులు భయపడ్డారు. వాళ్లిక ఆయనను గేలి చేయడానికి సాహసించలేదు. అంతా మెల్లగా జారుకున్నారు. కల్వరి మీద అంతా నిశ్శబ్దంగా ఉంది. యేసు హృదయంలో చీకటి అలముకొంది. ఆయన విచారంతో భయంతో నిండి పోయాడు. ఆయన ఏకాకిగా ఉన్నాడు. ఆయన శిష్యులు లేరు. స్నేహితులు కూడ లేరు. మరి ఆయన తండ్రి మాటయేమిటి? తండ్రి ఆయనతో లేడా? ఆయన యేసును ప్రేమించలేదా?

అయ్యో, తన తండ్రి ప్రేమను యేను ఇక అనుభవించలేక పోయాడు. తండ్రి కూడ విడిచి పెట్టాడా? అదే అన్నిటికన్న భయంకరం. వినండి. చీకటిలో ఆయన స్వరం. నిండా విచారం భయం! ''నా దేవా, నాదేవా, నా చేయి ఎందుకు విడిచితివి? అవును. తండ్రి ఆయనను విడిచి పెట్టాడు. దేవుని ఉగ్రత గురించి గుర్తుందా? తన ప్రజల పాపాల వల్ల కలిగిన ఉగ్రత? యేసు ఆ ఉగ్రతను యిప్పుడు అనుభవిస్తున్నాడు. ఎంత భయంకరం! అది నరకమంత భయంకరయినది.

శిక్ష చాల గొప్పది. ఆయన పిల్లల పాపాలు కూడ అంతే గొప్పవి. యేసు పడుతున్న శ్రమ అధికం. అయితే తన పిల్లల పట్ల గల ప్రేమను బట్టి ఆయన దానిని భరించాడు. ఆయన వారి రక్షకుడు.

మళ్లీ వెలుతురు వచ్చింది. ప్రజలు మళ్లీ గొల్గొతా చేరారు. మళ్లీ ఆయనను ఎగతాళి చేస్తున్నారు. ఆయన పడుతున్న శ్రమవల్ల యేసుకు దాహం వేసింది. ఆయన ''నేను దప్పికగొనుచున్నాను'' అని పిలిచాడు. ఒక సేవకుడు స్పంజిని చిరకలో ముంచాడు. దానిని కర్రకు తగిలించి యేసు పెదవులకు అందించాడు. ఇప్పుడు ప్రభువు దానిని కొంచంత్రాగవచ్చు. శ్రమ దాదాపు వ్ పోయింది. ఆయన మరణించ బోతున్నాడు. అయితే మొదట ఆయన ఏదో చెప్పాలని అనుకొన్నాడు. అప్పుడు పెద్ద స్వరంతో ''సమాప్తమయనిది'' అని చెప్పాడు.

దీని అర్థం నా శ్రమ ముగిసింది, నా పిల్లల పాప పరిహారం చెల్లించాను. వారి శిక్షను నేను భరించాను. ఇప్పుడు వాళ్లు పరలోకంలో ప్రవేశించవచ్చు, అని. యేసు మరొక్కసారి తన ప్రియమైన తండ్రిని ప్రార్థించాడు. ''తండ్రీ, నీ చేతికి నా ఆత్మను అప్పగిస్తున్నాను''. అంటే - తండ్రీ, నేను చచ్చిపోనున్నాను.'' నీవునన్ను సంరక్షిస్తావా? అని.

అప్పుడాయన తన తలను వంచాడు. ఇక ఆయనలో కదలిక లేదు, శ్వాస లేదు. ఆయన మరణించాడు. అవును. ప్రియమయిన ఈ రక్షకుడు నరుల పాప పరిహారాన్ని పూర్తిగ చెల్లించాడు.

ఇద్దరు మనుష్యులు కొండ ఎక్కుతున్నారు. అందులో ఒకడు నికొదేము. రెండవవాడు అరిమతయియ యోసేపు. వారు ఆ పట్టణంలో ప్రముఖులు.

సిలువ పై నుండి యేసు దేహాన్ని తీసుకోడానికి పిలాతు వారికి సెలవిచ్చాడు. భక్తితో వారు దానిని మోసుకుపోయారు. అవును, వీరిద్దరూ యేసుకు నిజమయిన మిత్రులు. అరిమతయియ యోసేపు - యేసు ప్రభువు దేహాన్ని నా సొంత సమాధిలో పెడతాము అని అన్నాడు. అతడు తన తోటలో ఒక సమాధి తొలిపించుకున్నాడు.

అప్పుడు యేసును ఆ సమాధిలో ఉంచారు. అక్కడ కొందరు స్త్రీలు కూడ ఉన్నారు. ఈ యిద్దరు పురుషులనూ వారు నిశ్శబ్దంగా చూస్తున్నారు. వాళ్లు ఆ చీకటి సమాధి గుహను పెద్ద రాతితో మూసివేసారు. ఇప్పుడు యేసు సమాధి చేయబడ్డాడు.

ఆ యిద్దరు పురుషులూ మిగిలిన స్త్రీలు అందరూ ఇళ్లకు తిరిగి వెళ్లారు. వాళ్లెంత దుఃఖంలో ఉన్నారు! వాళ్లు యేసు ప్రభువును చాల ప్రేమించారు.

ఇది ఏ రోజు జరిగిందో తెలుసా? అది శుక్రవారం.

అందుకనే దీనిని మనం 'శుభశుక్రవారం' అని పిలుస్తాము వినండి.

యేసు ఆరోజు చనిపోయాడు.

దుష్టులు ఆయనను ద్వేషించి ఆయన మరణించాలని కోరారు.

ఇది దేవుని చిత్తం. ఎందుకంటే ఈ విధంగానే పాపులు రక్షణ పొందగలరు. యేసుకూడ అదే కోరాడు. తన తండ్రికి లోబడిన సేవకునిగా ఉండాలని ఆయన వాంఛ. ఆయన కూడ ప్రజలను ప్రేమించాడు.

ఇప్పుడు కూడ దేవుడు తన వాక్యం ద్వారా మనతో మాట్లాడుతున్నారు. తన వద్దకు వచ్చిన వారందరికీ ఆయన తన రక్షణ నిస్తాడని చెబుతున్నాడు. తన పిల్లల పట్ల ఆయన ఎంత ప్రేమ చూపించాడు! దీనికి నిదర్శనం వారి శిక్ష తానే భరించి వారి కోసం మరణించాడు.

అవును. ఈ విచారకరమయిన శుక్రవారం యిప్పటికీ శుభశుక్రవారమే.



37. యేసు నిజముగా లేచెను

అప్పుడే తెల్లవారుతున్నది. సూర్యుడు పూర్తిగా ఉదయించలేదు. బయట కొద్దిగ వెలుతురు ఉంది. నూతన దినం ప్రారంభం అవుతున్నది. యేసు మరణించి ఇది మూడవ రోజు.

యేసు సమాధి వద్ద సైనికులు నిలబడి ఉన్నారు. వాళ్లు కాపలా కాస్తున్నారు. ఎవరూ సమాధి దగ్గరకు వెళ్లడానికి వీల్లేదు.

అవును, యేసు శత్రువులు కాపలా ఉన్నారు. రాత్రి వేళ ఆయన శిష్యులు మెల్లగా వస్తారని వాళ్ల భయం. అప్పుడు యేసు దేహాన్ని వాళ్లు ఎత్తుకపోవచ్చు! ఆయన లేచాడని అందరికీ చెప్పవచ్చు. ఇలా జరగడం వాళ్ల కిష్టంలేదు.

హఠాత్తుగ..... ఆకాశం తెరుచుకుంది. ప్రకాశిస్తున్న బట్టలతో ఒక దేవదూత దిగి వస్తున్నాడు. సైనికులు నిర్ఘాంత పోయారు. అది మెరుపులా ఉండడం వల్ల. మరేదో జరిగింది. ఉన్నట్టుండి భూమి కదిలింది. సైనికులు భయపడిపోయారు. వారిక నిలబడలేక పారిపోయారు.



దూత సమాధి వద్దకు వెళ్లాడు. రాతిని దొర్లించాడు. సమాధి ద్వారం తెరుచుకుంది.

సమాధిలో ఓ గొప్ప అద్భుతం జరిగింది. యేసు ప్రభువు తిరిగి బ్రదికి సమాధి విడిచి వెళ్లాడు. ఇది దేవదూత చేసిన పని కాదు. యేసే స్వయంగా లేచాడు. ఎందుకంటే ఆయన దేవుని కుమారుడు. అన్నిటి మీద, చివరికి సమాధి మీద కూడ ఆయనకు అధికారం ఉంది. మరణం నుండి లేచి యేసు తన తండ్రి కోరిన పనినిచేసి ముగించాడు. అది తన పిల్లల పాప శిక్ష భరించి పరిహారం చెల్లించాడు.

ఇదంతా ఆదివారం జరిగింది. ఇందువల్ల మనం ఆదివారం ఆలయానికి వెళ్తాం. ప్రతి యేడూ ఈస్టరు పండుగ జరుపుకుంటాము.

కొందరు స్త్రీలు వస్తున్నారు చూడండి. వాళ్లు సమాధి దగ్గరకు వెళ్తున్నారు. వాళ్లు యేం తీసుకవస్తున్నారు? సుగంధ ద్రవ్యాలు. వాటిని యేసు శరీరానికి పూయాలని. వాళ్లు చాల విచారంలో ఉన్నారు. యేసును అధికంగా ప్రేమించారు.

హఠాత్తుగ వారికో విషయం గుర్తుకు వచ్చింది. సమాధి ముఖాన్ని ఒక పెద్ద రాయి మూసి ఉంది. మనం దాన్ని తొలగించలేము. ఎవరు సాయం చేస్తారు?



అనుకుంటున్నారు. ఏం చేయాలో వారికి తెలియదు. అయినా నడుస్తూనే ఉన్నారు.

అంతలో వాళ్లు అరిమతయియ యోసేపు తోట చేరుకున్నారు. అబ్బ, ఎంత ఆశ్చర్యం! రాయి పొరిలించబడి ఉంది సమాధి తెరిచి ఉంది! ఇలా ఎవరు చేసి ఉంటారు? యేసు దేహం అక్కడే ఉన్నదా?

ఆ స్త్రీలలో మగ్దలేనే మరియ అనే స్త్రీ వెనక్కి తిరిగి పరుగెత్తింది. ఈ సంగతి శిష్యులకు చెప్పాలని. మిగిలిన స్త్రీలు ముందుకు నడిచారు. భక్తితో వాళ్లు సమాధిలోకి చూచారు. ఎంత ఆశ్చర్యం! అక్కడ యిద్దరు మనుష్యులు సమాధిలో కూర్చుని ఉన్నారు. వారు మెరుస్తున్న బట్టలు వేసుకున్నారు. వారు దేవ దూతలు. స్త్రీలు భయంతో వణకుతున్నారు. ఆ దూతలు - భయపడవద్దు. మీరు ఎవరిని వెదకుతున్నారో మాకు తెలుసు. మీరు యేసు కొరకు చూస్తున్నారు. ఆయన యిక్కడ లేడు. ఆయన సజీవుడై మరణం నుండి లేచాడు. ఆయన మీకు ముందే చెప్పాడు కదూ? ఆయన ఉండిన స్థలాన్ని చూడండి అన్నారు. ఆ స్త్రీలు భక్తితో ఆ దూతల మాటలు విన్నారు "మీరు వెళ్లి ఆయన మరణం నుండి తిరిగి లేచాడని శిష్యులకూ, "పేతురుకూ చెప్పండి'

వెంటనే స్త్రీలు ఆశ్చర్యంతో, ఆనందంతో ఇంటికి వెళ్తున్నారు. అంతలో ఎవరో మార్గమధ్యంలో వారిని కలవడానికి వస్తున్నాడు. అది యేసే! అది నిజం. ఆయన సజీవుడు. ప్రేమతో ఆయన వారిని "మీకు శుభమగు గాక!" అని పలకరించాడు.

వినయంతో ఆ స్త్రీలు మొకరించి ఆయనను పూజించారు. "భయపడకండి, నా సహోదరుల దగ్గరకు శిష్యుల దగ్గరకు త్వరగా వెళ్లండి. వారిని గలిలయకు వెళ్లమని చెప్పండి. అక్కడ వారునన్ను చూస్తారు" అని యేసు వారికి చెప్పి మాయమయ్యాడు. స్త్రీలు వెళ్లి శిష్యులతో యేసు లేచినట్లు చెప్పారు.

ఈ స్త్రీలు యేసును ప్రేమించడంవల్ల ఆయనను వెదికారు. మనం హృదయ పూర్వకంగా వెదికితే ఆయనను కనుగొంటా మని బైబిలు చెబుతుంది కదూ? మనం మన పాపాలు ఒప్పుకొని ప్రార్థిస్తే యేసు యిప్పుడు కూడ వింటాడు.

38. మగ్దలేనే మరియ



మగ్దలేనే మరియ గుర్తుందా? సమాధి నుండి రాయి పొరిలించ బడి ఉండడం చూచిన స్త్రీ. అప్పుడామో తన శక్తి అంతటితో వేగంగా పరుగెత్తింది.

ఆమె వెళ్లి యేసు దేహాన్ని ఎవరో ఎత్తుకపోయారనీ, అది ఎక్కడుందో తెలియదనీ పేతురుకూ, యోహానుకూ చెప్పింది. ఆమె స్వరం ఎంత దుఃఖంగా ఉందో! ఆమె చాల ఏడుస్తున్నది. పేతురూ యోహానూ త్వరగా లేచి పరుగెత్తారు. ఎంత వేగంగానో! మొదట యోహాను సమాధి చేరాడు. అతడు వంగి చీకటిగనున్న సమాధిలోకి తొంగి చూచాడు. ఎంత విచిత్రం! అక్కడ ఎవ్వరూ లేరు చక్కగా మడిచి పెట్టిన ప్రేత వస్త్రాలు తప్ప! అరిమతయియ యోసేపు, నికొదేము ఆ బట్టలను ప్రభువు చుట్టూ చుట్టి ఆయనను సమాధి చేసారు.

అప్పుడు పేతురు వచ్చాడు. అతడు మొదట సమాధిలోకి వెళ్లాడు. యోహాను అతని వెనుక వెళ్లాడు. అక్కడే యేసు దేహాన్ని పెట్టారు. వారు దేవదూతలను చూడలేదు. ఖాళీ సమాధిని చూడగానే యోహాను యేసు సజీవుడయ్యాడని నమ్మాడు. మరికొంచం సేపటికి .....

కొద్దిసేపు తరువాత ఎవరు వస్తున్నారు? సమాధిలోకి మరెవరు తొంగి చూస్తారు? అది మగ్దలేనే మరియ. ఆమె చాల దుఃఖి స్తోంది. తన కోసం యేసు చేసిన దానిని బట్టి ఆమె ఆయనను చాల ప్రేమించింది. ఆమె సమాధి దగ్గరకు వచ్చి తొంగి చూచింది. అది ఖాళీగా ఉంది ప్రభువులేడు! ఎంత భయంకరం! ఆయన ఎక్కడ ఉన్నాడు? ఆమె రెండోసారి చూచింది. అక్కడ యిద్దరు దేవ దూతలు కూర్చుని ఉన్నారు. వాళు "అమ్మా, నీవెందుకు ఏడుస్తున్నావు?" అని అడిగారు.

"నా ప్రభువును ఎవరో ఎత్తుక పోయారు. ఆయన్ని ఎక్కడ ఉంచారో నాకు తెలియదు" అని ఆమె చెప్పింది. తరువాత ఆమె విచారంగా సమాధి నుండి వెళ్లింది. తోటలో ఒకరు నిలబడి ఉండడం చూచి మరియ అతడు తోట మాలి అనుకుంది.

అతడు ఆమె వైపు చూచి "అమ్మా, ఎందుకు ఏడ్చుచున్నావు? ఎవరిని వెదకుతున్నావు?" అని అడిగాడు.

దానికి మరియ - అయ్యా, ఆయనను నీవు తీసుక పోయావా? ఎక్కడ పెట్టావు? నేనాయనను తెచ్చుకుంటాను" అని చెప్పింది.

పరిచయం లేని ఆవ్యక్తి ఒకే మాట పలికాడు.


"మరియా"! అప్పుడు ..... ఆమె యేసు స్వరాన్ని గుర్తుపట్టింది. ఆయన ఎదుట మోకరించి, ఆనందంతో "రబ్బూనీ" అని పిలిచింది. అంటే 'బోధకుడా' అని అర్థం. అవును, అది ప్రభువే, ఆయనను కౌగలించుకోవాలనుకుంది. ఆమె ఆనందంతో ఏడుస్తోంది. తన ప్రభువు, తన ప్రియ రక్షకుడు సజీవుడు!

ఆమె ప్రభుని విడువక పట్టుకోవాలనుకుంది.

"లేదు, మరియా, నన్ను తాకవద్దు. ఎందుకంటే నేను ఇక్కడ ఉండను. పరలోకంలో నా తండ్రి దగ్గరకు వెళ్తున్నాను. నా తండ్రి కూడ నీ తండ్రే. మరియా, ఆ తరువాత నీవు నా స్నేహితులంతా అక్కడికి వస్తారు. జరిగినదంతా వెళ్లి నా శిష్యులకు చెప్పు" అని యేసు పలికాడు.

తరువాత ఆయన మాయమయ్యాడు, మరియ ఒంటరిగా నిలిచింది. అయితే ఆమె యిప్పుడు విచారంగలేదు. ఎందుకంటే యేసు ప్రభువు సజీవుడు అవును. యేసు తన పిల్లలను సంతోషపరచడానికి తిరిగి లేచాడు.

మరియ ఎందుకు అంతగా దుఃఖించింది? ఎందుకంటే అతి ప్రియమయిన స్నేహితుని కోల్పోయింది. ఆయన లేకుండ ఆమె బ్రదుక లేదు. అందుకని కొన్నిసార్లు మనం కూడ దుఃఖంలో మునిగిపోతాము. అయితే యేసు ప్రభువు లేడని మనం ఎప్పుడన్నా దుఃఖించామా మగ్దలేనే మరియలా? అదే నిజమయితే యేసు మనలను కూడ దీవించి నిజమయిన ఆనందాన్ని మనకు యిస్తాడు.



39. ఎమ్మాయి గ్రామానికి వెళ్లే మార్గములో

ఇద్దరు వ్యక్తులు కలిసి నడుస్తున్నారు. వాళ్లు యెరూషలేము నుండి ఎమ్మాయి గ్రామానికి వెళ్తున్నారు. అది వారు నివసించే చిన్న గ్రామం అదో అందమయిన, ప్రశాంతంగా ఉన్న సాయం వేళ. సూర్యుడు అప్పుడే అస్తమించబోతున్నాడు. కొద్దిసేపట్లో సూర్య కిరణాలు అన్నిటినీ అందంగా మెరిసేలా చేస్తాయి. అయితే మనుష్యులు ఇవేవీ గమనించరు. నిద్ర పోడానికి పక్షులు తమ గూళ్లు చేరుకుంటున్నవి. మొదట, కొంచెం సేపు, అవి పాటలు పాడుతవి. ప్రశాంతమయిన ఆ సంధ్యా సమయంలో వాటి స్వరాలు ఎంతో మధురంగా వినిపిస్తున్నవి. కాని ఈ ఇద్దరూ ఆ మాధుర్యాన్ని చవి చూడడం లేదు. వాళ్లు విచారంలోమునిగి ఉన్నారు.

ఈ వ్యక్తులెవరు? వాళ్లెందుకు విచారంగా ఉన్నారు? వాళ్లు యేసు శిష్యులు. వాళ్లెందుకు విచారంగా ఉన్నారో యిప్పుడు మీకు అర్థమైయుండాలి. వారి బోధకుడు సిలువ వేయబడ్డాడు. అందుకే వాళ్లు దుఃఖంలో ఉన్నారు.

''ఆయన ఎందుకు చనిపోవలసి వచ్చింది? ఆయన దేవుని కుమారుడు కాడా? శత్రువులందరి కన్న బలవంతుడు కాడా?'' అని వాళ్లు అనుకుంటున్నారు. వాళ్లకేమీ అర్థం కావడంలేదు.

అంతలో హఠాత్తుగ వారి ప్రక్కనే ఎవరో నడుస్తున్నాడు. ఆయనను వారెరుగరు. అతడే మాటలు ప్రారంభించాడు. ''మీరు దేని గురించి మాటలాడుతున్నారు? మీరు ఎందుకు విచారంగా ఉన్నారు?'' అని ప్రశ్నించాడు. అందుకు వారు ''యెరూషలేములో జరిగిన సంఘటనలు నీకు తెలియదా? వాటిని గూర్చి వినలేదా?'' అన్నారు. అందుకతడు - ఏం జరిగింది? నా కెందుకు చెప్పరు? అన్నారు. అప్పుడు వాళ్లు నజరేతు వాడయిన యేసు ప్రభుని గూర్చి మాటలాడడం మొదలుపెట్టారు. ''ఆయన గొప్ప ప్రవక్త'' ఆయన ప్రజలకు దేవుని గూర్చి బోధించాడు. చాల అద్భుతాలు చేసాడు. అయితే అధికారులాయనను బంధించి సిలువ వేసారు. ఆయన చనిపోయి సమాధి చేయబడ్డాడు. ఆయనే ఇశ్రాయేలును విమోచించే రక్షకుడనిమేము ఆశించాము. అందుకే దుఃఖంగా ఉన్నాము. ఇప్పుడు కొందరు స్త్రీలు సమాధి చూడ్డానికి వెళ్లారు. అది ఖాళీగా ఉందని చెప్పారు. వాళ్లు యిద్దరు దేవదూతలను చూచారు. యేసు తిరిగి లేచాడని దూతలు వారికి చెప్పారట. కొందరు శిష్యులు కూడ సమాధి చూడ్డానికి వెళ్లారు కాని వాళ్లూ యేసుని చూడలేదు'' అని చెప్పారు.

ఇలా ఆ ఇద్దరూ ఈ అపరిచితునికి సమస్తం చెప్పారు. అతడు ఎంతో ఆసక్తితో వినడం వారికి నచ్చింది. యేసు ప్రభువు సిలువ మీద ఎందుకు చచ్చిపోయాడో వాళ్లకి అర్థం కావడం లేదు. అప్పుడా నూతన వ్యక్తి మాటలాడడం మొదలు పెట్టాడు. ''మీరు దీనికి ఆశ్చర్యపడనవసరం లేదు. యేసు మరణించాలని మీకు తెలియదా? బైబిలు అలా అని చెప్పడం లేదా? తన పిల్లల శిక్షను ఆయన అనుభవించాలి కదా? తన పిల్లల కోసం చచ్చిపోడానికే ఆయన వచ్చాడు. ఆయన తిరిగి లేస్తాడని కూడ బైబిలు చెబుతోంది. ఆయన రక్షకుడు గనుక మహిమలో ప్రవేశించడానికి మరణించి తిరిగి లేస్తాడు''

ఈ మాటలను ఆ ఇద్దరూ శ్రద్ధగ విన్నారు. అవును ఇప్పుడు వాళ్లకి అర్థం అవుతున్నది. రక్షకుడు మరణించడం అవసరం. తరువాత సజీవుడవ్వాలి. వారి హృదయాల్లో ఉన్న దుఃఖం కాస్త విడిపోయి సంతోషం చోటు చేసుకుంటున్నది. వారి హృదయాలు యేసు కోసం తపిస్తున్నవి. ఇది ఆ నూతన వ్యక్తి చేసిన పనే అసలు అతడు ఎవరు?

వాళ్లు ఎమ్మాయిలోని తమ ఇంటి దగ్గరకు వచ్చారు. ఆ క్రొత్త వ్యక్తి వాళ్లను విడిచి ముందుకు ప్రయాణం చేసేలా కనిపించాడు. అయితే శిష్యులు - దయచేసి మాతో వచ్చి ఉండండి. చాల రాత్రి అయ్యింది, అని అడిగారు. వాళ్లు ఆ రాత్రి తమతో ఉండమని బలవంతం చేసారు. అర్థించారు.

చివరికి అతడు వారితో పాటు లోపలికి వచ్చాడు. వాళ్లు రాత్రి భోజనం కోసం బల్ల వద్ద కూర్చున్నారు. చూడండి, ఆ అపరిచితుడు కొంత రొట్టెను తీసుకున్నాడు. దానిని మొదట ఆశీర్వదించాడు. తరువాత ముక్కలు చేసాడు. ప్రతి ఒక్కరికీ ఒక్కొముక్క యిచ్చాడు. వాళ్లిద్దరూ ఆయన వైపు చూస్తున్నారు. అంతలో.... హఠాత్తుగ .... ఆ వ్యక్తి యెవరో గుర్తుపట్టారు! అది సాక్షాత్తు యేసు ప్రభువే. వాళ్లు ఆయనను ఏదో అడగాలని అడగలేదు, ఆయన అంతర్ధానమయి పోయాడు. ఎంత అద్భుతం!

"ఆ .... మన మనసులోని దుఃఖం ఎందుకు పోయిందో యిప్పుడు అర్థం అవుతోంది. మళ్లీ ఆనందం ఎందుకు కలిగిందో కూడ తెలిసింది. యేసు ప్రభువు మనతో ఉండడం వల్లనే అది జరిగింది. ఆయన తన గురించి చెబుతున్నపుడు మన మనసులు మండలేదా? మనం ఆయనను యిప్పటి వరకు గుర్తించ లేకపోయాము.

ఆ యిద్దరూ రొట్టె తినడం ఆపేసారు. వెంటనే తిరిగి యెరూషలేముకు వెళ్లారు. ఈ శుభవార్తను శిష్యులకు చెప్పడానికి వాళ్లెంతో సంతోషంగా ఉన్నారు.

యేసు ప్రభువు తమతో లేడని దుఃఖించే వారిని దేవుడు దర్శిస్తాడు. అది ఎప్పుడో తెలుసా, ఆయన వాక్యం చదివినపుడు. ఆయన వాక్యం వినినపుడు, వారి మనసులను సంతోష పరచి వారితో ఉంటాడు. ఎమ్మాయి గ్రామానికి వెళ్తుండిన శిష్యులతో ఉన్నట్టే.

మన హృదయం కూడ ఒక గృహం లాంటిదే. నీవు "దేవా, దయ చేసి నా ఇంటికి రావా? నా హృదయంలో నివసించవా?" అని దేవున్ని అడగవచ్చు.



40. యేసు తన శిష్యులను దర్శించుట

శిష్యులు ఒక ఇంటిలో చేరారు. అందరూ ఉన్నారా? లేరు. వారిలో ఇద్దరు అక్కడ లేరు. ఒకడు యూదా. అతడు చనిపోయాడు. ఎంత విచారకరం! రెండవ వాడు తోమా. తోమా మిగిలిన శిష్యులతో లేడెందుకు? స్త్రీలు చెప్పినది అతడు విన్నాడు కాని నమ్మలేదు. అతడు దుఃఖంలో మునిగి పోయాడు. యేసు సజీవుడు కాలేడు. అది అసాధ్యం, అనుకున్నాడు. కాబట్టి అతడు ఒంటరిగా తన దుఃఖాన్ని అనుభవిస్తున్నాడు. అందుకే అతడు మిగిలిన శిష్యుల వద్ద లేడు.

శిష్యులు మెల్లగా తమలో తాము మాట్లాడుకుంటున్నారు. వాళ్లుశత్రువులకు భయపడుతున్నారు. ఒక వేళ బలమైన సైనికులు తమ కోసం వస్తే .... అందుకని వాళ్లు జాగ్రత్తగా తలుపులన్నీ బిగించుకున్నారు.

వాళ్లు దేని గురించి మాట్లాడుతున్నారు? మీరు ఖచ్చితంగా ఊహించవచ్చు. యేసు ప్రభువు మరణం గురించే. ఆయన తిరిగి లేచాడని చెప్పిన స్త్రీల మాటలను గురించి. కాని వారు మాత్రం సాక్షాత్తు ఆయనను కనులారా చూడ లేదు.... అంతలో.... హఠాత్తగా ....ఒక్క క్షణంలో ఆ గదిలో వాళ్లతోపాటు మరో వ్యక్తి వచ్చి నిలిచాడు. ఆయన ప్రభువైన యేసే! కాని అదెలా సాధ్యం? తలుపులు బిగించి ఉన్నాయి కదా? అవును ఉన్నాయి. అయినా యేసుప్రభువు ప్రవేశించడలడు. ఆయన ఏదన్నా చేయగలడు. ఆయన సర్వశక్తిమంతుడు.

"మీకు సమాధానము కలుగును గాక!" అని యేసు చెప్పాడు. శిష్యులు భయపడిపోయారు. వారు భయంతో ఆయన వైపు చూచారు. అది దయ్యమా? లేక నిజంగా ఆయన యేసేనా?

"మీరెందుకు భయపడుతున్నారు? ఎందుకు ఆశ్చర్యపడుతున్నారు? నా చేతులు చూడండి, పాదాలు చూడండి, ఆయనను నేను, మీరు వచ్చినన్ను స్వయంగాతాకండి" అని ప్రభువు చెప్పాడు.

నిజమే. ఆయన కాళ్లు, చేతులలో చీలలు దిగిన గుర్తులు కనబడుతున్నవి. వారది నమ్మలేకపోయారు వాళ్లెంతో సంతోషించారు. ఇది నిజంగా ప్రభువేనా? ఇది నిజమేనా? అప్పుడు యేసు-తినడానికి నాకేమయినా యివ్వండి, అన్నాడు. వారాయనకు ఒక చేపముక్క,



కొంచెం తేనె యిచ్చారు. అప్పుడు యేసు - నేను చెప్పినది మీరు మర్చిపోయారా? నేను మరణించాలి కదా? తిరిగి లేస్తానని నేను మీతో చెప్పలేదా? నేను తరచు ఆ మాట చెప్పాను. బైబిలు కూడ అదే చెబుతోంది.

అవును అవన్నీ వారికిపుడు గుర్తు వచ్చాయి. ఇప్పుడు వాళ్లు నమ్మారు. ఎంత సంతోషించారు! అంతలోనే యేసు అంతర్ధాన మయ్యాడు.

ఒక దినం గడిచింది.

శిష్యులు తోమా కోసం వెతుకుతున్నారు. ఈ శుభవార్త చెప్పి అతనిని కూడ సంతోషపరచాలని వారి కోరిక తోమా, మేము ప్రభువును చూచాము. ఆయన మమ్మును దర్శించాడు" అని చెప్పారు.

తోమా తన తలను అడ్డంగా తిప్పాడు. "నేనది నమ్మను. నేను స్వయంగా ఆయన కాళ్లు, మరియు చేతులలో గాయాలను చూడాలి. అందులో వేళ్లు పెట్టాలి. ఆ తరువాత నమ్ముతాను" అని అన్నాడు. తోమా శిష్యుల మాటలను అనుమానించాడు. శిష్యులతనిని సంతోషపెట్టలేక పోయారు. ఒక వారం గడిచింది.

మళ్లీ శిష్యులంతా ఒక చోట చేరారు. తలుపులన్నీ గట్టిగా మూసి ఉన్నాయి. ఈసారి తోమా కూడ వారితో ఉన్నాడు. అతడింకా యేసు సజీవుడని నమ్మడంలేదు. మళ్లీ రెండవ సారి యేసు వారున్న గదిలోమధ్య నిలిచాడు. ఆయన "మీకు సమాధానము కలుగు గాక!" అన్నాడు. శిష్యులు ఆనందంలో మునిగి పోయారు.

అప్పుడాయన తోమా వైపు చూచి - తోమా, నా చేతులు మరియు నా కాళ్లలో ఉన్న గాయాలు చూడు. నీ వ్రేళ్లు అందులో పెట్టి తాకి చూడు. అవిశ్వాసివి కాక విశ్వాసం కలిగి ఉండు, అన్నాడు. అవును, ప్రభువు సమస్తం ఎరుగును.

తోమా చాల సిగ్గు పడ్డాడు. "నేను చాల అవిశ్వాసం చూపాను" అని యేసు పాదాల మీద పడి "నా ప్రభువా, నాదేవా" అని ఆయనను పూజించాడు.

"తోమా, నీవుయిప్పుడు నమ్మావు. ఎందుకంటే నీవు నన్ను చూచావు కాబట్టి. అయితే చాల మంది నన్ను చూడకయే నమ్ముతారు" అన్నాడు.

అప్పుడాయన తిరిగి మాయ మయ్యాడు. ఆయన ఎంత మంచి వాడు! తోమాను చూచి కోపించలేదు. నిజంగానే ఆయన మంచి కాపరి.

మనం సహా యేసును చూడక పోవచ్చు. ఎందుకంటే ఆయన ఇంకా పరలోకంలోనే ఉన్నాడు. అయినా మనలో నిజమైన విశ్వాసం పుట్టించగలడు. అప్పుడు నీ పాపాలను గూర్చి దుఃఖిస్తావు. దేవుని ప్రేమించి ఆయన కోసం తపిస్తావు. ఆయనను కనులార చూడక పోయానా ఆయనకు లోబడాలని కోరుకుంటావు. అప్పుడు నీకు నిజమైన ఆనందం దొరుకుతుంది.



41. గొప్ప సరస్సు ఒద్ద

అది రాత్రి వేళ, ఏడుగురు శిష్యులు ఒకే చోట ఉన్నారు. యెరూషలేములోని ఒక యింటిలో కాదు. వాళ్లు ఒక గొప్ప సరస్సు తీరాన కూర్చుని ఉన్నారు. తీరంలో వారి పడవ ఒకటి ఉంది.


శిష్యులు కనిపెడుతున్నారు. ఎవరి కోసం? యేసు ప్రభువు కోసం. ఈ దినం ఆయన వారి దగ్గర ఉంటాడు. అలా అని ఆయనే చెప్పాడు. కాని చాల ఆలస్యం అయ్యింది. పేతురు లేచాడు. "నేను చేపలు పట్ట బోతున్నాను" అన్నాడు. కొంతసేపటికి మిగిలిన వారు అతనితో కలిసారు. వారంతా పడవలో వెళ్తున్నారు. చీకటి పడింది. చేపలు పట్టడానికి అదేమంచి సమయం. నీటిలో వలలు వేసారు.

కొంతసేపయ్యాక వలలులాగారు. అందులో చేపలు లేవు. వాళ్లు పడవను మరోచోటికి నడిపించారు. అక్కడ కూడ చేపలు దొరకలేదు. రాత్రంతా ఇలాగే గడిచి పోయింది. వలలు యింకా పట్టిగానే ఉన్నాయి. ఉదయం కావస్తోంది. అయినా చేపలు మాత్రం దొరకలేదు. పడవ దాదాపు ఒడ్డున చేరింది. అదో, చూడండి ఎవరో సరస్సు ఒడ్డున నిలబడి ఉన్నాడు. అతడు "మీ వద్ద చేపలు ఏమయినా ఉన్నాయా?" అని కేక వేసాడు.

శిష్యులు - లేవు, అని జవాబిచ్చారు. అప్పుడతడు - మీవలలను పడవకు అవతలి వైపున విసరండి, అన్నాడు. శిష్యులాయన మాటకు లోబడ్డారు. వెంటనే.... వలనిండా పెద్ద పెద్ద చేపలు. వలనులాగలేనంతగా పడ్డాయి. యోహాను ఒడ్డున నిలిచి ఉన్న మనిషిని చూస్తున్నాడు.

హఠాత్తుగా అతడు - పేతురూ, ఆయన ప్రభువే సుమా, అన్నాడు. ఇప్పుడు పేతురు ఏం చేసాడు? వెంటనే నీటిలోకి దూకాడు. ఒడ్డుకు ఈదుకుంటూ పోయాడు. త్వరగా యేసును చేరాలని పేతురు ఆశించాడు. మిగిలిన వాళ్లు కూడ వలలాగుతూ వస్తున్నారు. వాళ్లు చాల చేపలు పట్టారు. అది యేసు చేసిన కార్యమని వాళ్లకి తెలుసు. సమస్తమూ దయ చేసేది దేవుడేనని మరువకండి.

శిష్యులు జాలరులే. అయితే ఇక కొద్ది సేపటిలో వారు ఇక చేపలు పట్టరు. వారు వెళ్లి యేసును ప్రకటిస్తారు.



వారు మనుష్యులను పట్టే జాలరులవుతారు. సువార్త అనే వలలో పడ్డవారు యేసుప్రభుని నమ్ముతారు. ప్రజలంతా మారుమనసు పొంది తనలో విశ్వాస ముంచాలని దేవుని కోరిక. వలలో చేపలు పడేలా చేసింది, ఆయనే కదా?

ఇప్పుడు శిష్యులు వెళ్లి యేసుతో కలిసి భోజనం చేసారు. "వచ్చి భోజనం చేయండి" అని ఆయన వారిని పిలిచాడు. చిన్న నిప్పు మీద చేపలుఉన్నాయి. కొంచం రొట్టె కూడ ఉంది. యేసు వాటిని తెచ్చాడు. వలలో ఉన్న చేపల్లో కొన్నిటిని తెచ్చి కాల్చారు. యేసు ఎంత దయగలవాడు!

యేసు మళ్లీ తన శిష్యులతో ఉన్నాడు. వాళ్లెంత ఆనందంగా ఉన్నారు! ప్రభువు వారిని వెంటనే విడువలేదు. వారు కూర్చుని ఉండగా ఆయన పేతురుతో హఠాత్తుగా మాటలాడాడు. నన్ను నీవు ప్రేమిస్తున్నావా? అని మూడు సార్లు అడిగాడు.

పేతరు యేసును ఎరుగనని మూడు సార్లు అబద్ధం చెప్పాడు గుర్తుందా? దానికి పేతురు చాల దుఃఖించాడు.

ఇప్పుడు ప్రభువు నన్ను ప్రేమిస్తున్నావా? అని మూడు సార్లు అడిగినందుకు చాల బాధపడ్డాడు. "ప్రభువా, నీకు సమస్తం తెలుసు. నేను నిన్ను ప్రేమిస్తున్నానని కూడ తెలుసు" అని జవాబిచ్చాడు. యేసు కూడ అతనికి మూడు సార్లు సమాధానం యిచ్చి - నా గొర్రెలను మేపు, అని చెప్పాడు. దీని అర్థం పేతురు తన ప్రభువు మరియు బోధకుడూ అయిన యేసును గూర్చి ప్రజలకు ప్రకటించాలని. అతడు ప్రభువు పిల్లలను పరామర్శించాలి. ఎందుకంటే గొర్రెలు వారే, యేసు పేతురును విడిచి పెట్టలేదు. అతన్ని ప్రేమించాడు. ప్రభువు మంచి వాడు.

"నీవు నన్ను ప్రేమిస్తున్నావా?" అని యేసు మనలను కూడ అడుగుతున్నాడు.

మనం ఆయనను వెంబడించాలని కోరుతున్నాడు. సహజంగ మన హృదయాలు రాయిలా కఠినమయినవి, అయినా ఆయన వాటిని మార్చగలడు.దేవున్ని ప్రేమించే హృదయం ఇవ్వగలడు. ఆయన మాత్రమే అది చేయగలడు.



42. ప్రభువైన యేసు పరలోకానికి వెళ్లుట

యేసు ప్రభువు మరి కొంత కాలం ఈ భూమిపై తన శిష్యులతో ఉన్నాడు. మిగిలిన తన పిల్లలతో కూడ ఉన్నాడు. చాల మంది ఆయనను చూచారు. తమ రక్షకుడు నిజంగా లేచాడని వారికిప్పుడు తెలుసు. ఆయన సజీవుడు. ఈ భూలోకంలో యేసు పని ముగిసింది. త్వరలోనే ఆయన పరలోకానికి తిరిగి వెళ్తాడు. బెత్లెహేంలో.... పుట్టకముందు ఆయన అక్కడే ఉన్నాడు. ఎందు కంటే తన తండ్రివలె, పరిశుద్ధాత్ముని వలె ఆయన దేవుడు కాబట్టి.

ఒకనాడు యేసు ప్రభువు తన శిష్యులను మరోసారి దర్శించాడు. వాళ్లంతా యెరూషలేములో కూడి ఉన్నారు. నగరం విడిచి వెళ్తున్న ప్రభువును వారు వెంబడించారు. దగ్గరలోనే ఓలీవల కొండ ఉంది. వాళ్లంతా అక్కడికి వెళ్లారు.

యేసు ప్రభువు శిష్యులతో యిలా అన్నాడు - మీరుప్రతి స్థలానికీ వెళ్లి నా గురించి ప్రకటించాలి. ఇది కష్టమయిన పని. అయితే దీనిని మీ అంతట మీరే చేయవలసిన అవసరం లేదు. నా తండ్రి పరిశుద్ధాత్ముని పంపుతాడు. ఆయన కూడ దేవుడే. మీరు ఆ ఆత్మకోసం యెరూషలేములో కనిపెట్టాలి. కష్టమయిన ఆ పని చేయడానికి ఆయన సాయంచేస్తాడు. అప్పుడు చాల మంది మారుతారు. నన్ను ప్రేమిస్తారు. ఎందుకంటే వాళ్లకి క్రొత్త మనసు దొరుకుతుంది. అది తప్పక జరిగేలా పరిశుద్ధాత్ముడు చేస్తాడు. ఆయన అంత శక్తిమంతుడు. వాళ్లంతా నా రాజ్యానికి చెందినవారు. నేను వాళ్లకి రాజుగ ఉంటాను. తరువాత మీవలెనే వాళ్లంతా పరలోకంలో నన్నుకలుసుకుంటారు.''

వారు ఒలీవల కొండ శిఖరం చేరుకున్నారు. చూడండి. యేసు వారి తలపై చేతులుంచి ఆశీర్వదించాడు. అప్పుడు.... అదిగో ప్రభువు పై పైకి గాలిలో లేస్తున్నాడు. ఇదో అద్భుతం! ఆయన మరింత పైకి వెళ్లి పోతున్నాడు. ఎంత ఆశ్చర్యం! ఆయన అలా వెళ్లి పోవడం శిష్యులు చూస్తున్నారు. వినయంగావారు మోకరించారు. ఆరాధించారు. వారు పైకి చూస్తున్నారు.

అంతలో ఒక మేఘం ఆయనను ఆవరించింది. ఇక తమ బోధకుడు వారికి కనబడలేదు. ఆయన పరలోకానికి వెళ్లిపోయాడు తండ్రి తో ఉండడానికి. అక్కడ దేవదూతలు ఆయన కోసం కనిపెడుతున్నారు. వందలు, వేలాదిదూతలు. వారు ఆయనను ఆరాధించి స్తుతిస్తున్నారు. రాజాధి రాజైన యేసుకు అద్భుతమయిన పాటలు పాడుతారు. పరలోకంలో యేసు అతి ముఖ్యమైన స్థానం తీసుకుంటాడు. అక్కడాయన తన సింహాసనంపై కూర్చుంటాడు. అది ఆయన తండ్రి చిత్తం.

శిష్యులు అలాగే తేరి చూస్తున్నారు అంతలో వారికో శబ్దం వినిపించింది. ఇద్దరు మనుష్యులు వారితో నిలబడి ఉన్నారు. వారు మెరుస్తున్న బట్టలు వేసుకున్నారు. వాళ్లు దేవుడు పంపిన దేవదూతలు. ఆయన తన శిష్యులను మరువలేదు.

''మీరు పైకి చూస్తున్నా రెందుకు? యేసు పరలోకానికి ఎక్కిపోయాడు. అయితే ఆయన తిరిగి వస్తాడు'' అని దూతలు చెప్పారు.

నిజమే ఒక దినం యేసు ప్రభువు పరలోకం నుండి భూమికి దిగివస్తాడు. బెత్లెహేంలో శిశువుగా కాదు. గొప్ప శక్తి, మహిమలతో వస్తాడు. అప్పుడు మరణించిన వారంతా తిగిరి లేస్తారు. చాల కాలం క్రిందట చచ్చిపోయిన వారు కూడ లేస్తారు. అప్పుడందరూ యేసును చూస్తారు. ఆయన పిల్లలంతా పరలోకానికి వెళ్తారు. వాళ్లాయనను ఆరాధించి లోబడతారు. వాళ్లు ''నీవు నీ రక్తంతో మమ్మును కొన్నావు. కాబట్టి మేం పరలోకానికి రాగలిగాము. కాబట్టి నిన్ను నిత్యం సేవిస్తాము''.- అని పాట పాడుతారు.

ఆయన రాక కోసం కనిపెట్టని కఠిన హృదయుల మాట యేమిటి? వారు నరకంలో నిత్య శిక్షనను భవిస్తారు. ప్రభువు తిరిగి వచ్చినపుడు గొప్ప శబ్దం, బూరధ్వని వినిపిస్తాయి. యేసు ప్రభువు తీర్పరిగా, రాజుగ వస్తాడు. అప్పుడిక మారడానికి ఎవరికీ అవకాశం ఉండదు. ఆయన కృప ఉన్న ఈ సమయంలోనే పరలోకం కోసం సిద్ధపడడం ఎంత ప్రాముఖ్యం! మరణించి లేచిన రక్షకుని తెలుసు కొనేలా ప్రతి ఒక్కరూ ప్రార్థించాలి.

శిష్యులు యెరూషలేంకు తిరిగి వెళ్లారు. ప్రియమైన తమ బోధకుడు వెళ్లిపోయాడు. అయినా వారు దుఃఖించ లేదు. ఆనందంగా ఉన్నారు. ఎందుకో తెలుసా? యేసు ప్రభువుయిప్పుడు కూడ వారికి దగ్గరగా ఉన్నాడు. ఆయన దేవుడు కాబట్టి యిది సాధ్యం అయ్యింది. ఇప్పటికి ఆయన వారిపట్ల జాగ్రత్త వహిస్తాడు. వారిని మరువడు. ఆ తరువాత ఆయనతో నిత్యం ఉండడానికి పరలోకం వెళ్తారు. వాళ్లెందుకు సంతోషంగా ఉన్నారో యిప్పుడు నీకు అర్థం అయ్యిందా?



43. పరిశుద్ధాత్ముడు వచ్చుట!

యెరూషలేము అంతా చాల సందడిగా ఉంది. చాల మంది దేవాలయానికి వెళ్తున్నారు. విదేశాలనుండి. దూర దేశాల నుండి కూడ ఎంతోమంది వచ్చారు. వాళ్లంతా దేవునికి అర్పణలు చెల్లించి, కృతజ్ఞత తెలుపడానికి ఆలయానికి వెళ్తున్నారు. దేవుడు వాళ్లకి మంచి పంటను దయచేసాడు. దేవాలయానికి దగ్గరగా ఒక యింటిలో శిష్యులు ఉంటున్నారు. వాళ్లంతా కలిసి ప్రార్ధన చేస్తున్నారు. పరిశుద్ధాత్ముడు రావాలని వాళ్లు కనిపెడుతున్నారు.

అంతలో .... హఠాత్తుగ .... అదేమిటి? వాళ్లకి వినబడిన శబ్దం ఎలాంటిది? గాలివీస్తున్నశబ్దం! ఇంటి బయటనున్న వాళ్లు కూడ దాన్ని విన్నారు. ఆశ్చర్యంతో వాళ్లంతా ఆగి వింటున్నారు. దీని అర్ధం యేమిటి?

అక్కడ చూడండి....శిష్యుల తలల మీద. చిన్న అగ్ని జ్వాలలు! అది నిజంగా మంటలా? లేదు. అవి నిజంగా మండడంలేదు. అయితే అవి నిజమయిన జ్వాలలాగ కనిపిస్తున్నాయి.

కాస్త వినండి! శిష్యులు భిన్నమయిన భాషలు మాట్లాడుతున్నారు. వారి ముఖాలు చూడండి. అవి సంతోషంతో వెలిగి పోతున్నాయి. ఏమి జరిగినది?

పరిశుద్ధాత్ముడు దిగివచ్చాడు. ఆయన శిష్యుల హృదయాల్లోకి వచ్చాడు. అందువల్లనే గాలి వీస్తున్న శబ్దం వినబడింది. అగ్ని జ్వాలలు కనిపించాయి. పరిశుద్ధాత్ముడు వచ్చాడు. అది పెంతెకోస్తుదినం!

శిష్యులు యేసు ప్రభువును గురించి చెబుతున్నారు వినండి. వారిప్పుడు ఎంత మాత్రం భయపడడంలేదు. ఇంతకు ముందు భయపడే వాళ్లు! భయంతో వాళ్లెలా తలుపులు మూసుకుని ఉండేవారో గుర్తుందా? అయితే యిప్పుడు వారికి ఎవరన్నా భయంలేదు ఈ పెంతెకొస్తు దినాన దేవుడు వారిని ప్రత్యేకంగా దీవించాడు.

ప్రజలలో కొందరు శిష్యులను చూచి నవ్వుతున్నారు. "వీళ్లు ఎక్కువగా మద్యం తాగారు. అందుకే మత్తులో ఉన్నారు" అని ఎగతాళి చేసారు. పరిశుద్ధాత్ముని వెక్కిరించారు. ఎంత ఘోరం!

అయితే పేతురు లేచి - మేము మద్యం త్రాగిన మత్తులో లేము. పరిశుద్ధాత్ముడు దిగి వచ్చాడు. దేవుడు వాగ్దానం చేసినట్టే యిది జరిగింది. దీని గురించి బైబిలులో రాసి ఉంది".

అతడింకా ఇలా చెప్పాడు - యేసు ప్రభువును మీరు సిలువ వేసారు. ఆయన మీలోనున్న రోగాలను బాగు చేసాడు. ఆయన చనిపోయి తిరిగి లేచాడు. పరలోకానికి ఎక్కి పోయాడు. ఎందుకంటే ఆయన నిజంగా దేవుని కుమారుడు ఆయన లోకరక్షకుడు.

చాలమంది ఆగి, అతని మాటలు విన్నారు. వాళ్లు చాల ఆశ్చర్యపోయారు. వారు నిజంగా దుఃఖపడ్డారు. ఇప్పుడు తాము ఎంత గొప్ప పాపం చేసారో గ్రహించారు. దేవుని కుమారుని చంపారు. ఆయన లోకరక్షకుడు. ఎంతఘోరం! వాళ్లు నిజంగా పశ్చాత్తాపపడ్డారు.

వాళ్లు గేలిచేయడంలేదు. వారి హృదయంలోకి పరిశుద్ధాత్ముడు వచ్చాడు. అందుకే వాళ్లు ఇప్పుడు



విచారిస్తున్నారు. పరిశుద్ధాత్ముడు ఎంత శక్తిగలవాడు! అవును ఆయన కూడ దేవుడే! బలంగా వీచే గాలిని గూర్చి కాస్త ఆలోచించండి! ప్రజలంతా పేతురు దగ్గరకు వచ్చి మేమిప్పుడు ఏమి చేయాలి? అని అడిగారు.

''మీ పాపాలు ఒప్పుకొనండి. దేవుడు వాటిని క్షమిస్తాడు. అవి ఎంత ఘోరమైనవియైనా సరే. ఆయనే అలా చెప్పాడు'' అని పేతురు జవాబిచ్చాడు.


ఈ విధంగా అతడు ప్రజలను ఓదార్చాడు. పరిశుద్ధాత్ముడు వారిని ఆదరించాడు. వాళ్లాయనను వెంబడించాలనుకున్నారు. ఇప్పుడు వాళ్లు యేసుప్రభుని ప్రేమిస్తున్నారు. ఇప్పుడాయన వారి రక్షకుడు. పెంతెకోస్తులో జరిగిన గొప్ప అద్భుతం ఇదే!

అప్పుడా ప్రజలతో పేతురిలా అన్నాడు - మీరంతా యేసుక్రీస్తు నామంలో బాప్తిస్మం తీసుకొనండి. అది సత్యానికి గుర్తు. యేసు మీ పాపాలు క్షమించడానికి గుర్తు. ఆయనే మీ పాప శిక్షను భరించాడు. మీ పాపాల కోసం మరణించాడు.

ఆ రోజు మూడు వేల మంది యేసు నందు విశ్వాసం ఉంచారు. అది పెద్ద సంఖ్య కాదా? వారి జీవితాలు మారిపోయాయి. హృదయాలు మారిపోయాయి. అంతకు పూర్వం వాళ్లు సాతానుపిల్లలు. అతని ఇష్టప్రకారం జీవించారు. వారి హృదయాల్లో చీకటి ఉండింది. ఇప్పుడు దేవుని పిల్లలయ్యారు. ఇప్పుడాయన యిష్ట ప్రకారం చేయాలని ఆశిస్తున్నారు. వారి హృదయంలో యిప్పుడు వెలుగు వ్యాపించింది.

దేవుడు ఇప్పుడు కూడ తన వాక్యం ద్వారా మనతో మాట్లాడుతున్నారు. ''నన్ను వెంబడించండి'' అని చెబుతున్నారు. నీ తండ్రి గాని తల్లిగాని, బోధకుడుగాని దానిని నీకివ్వలేదు. పరిశుద్ధాత్ముడే ఆ వెలుగు నీయగలడు. కాబట్టి - ప్రభూ, పరిశుద్ధాత్ముని నా హృదయంలో కూడ కుమ్మరించు, అని యేసు ప్రభుని ప్రార్థించు.

నీవు నిజంగా అలా ప్రార్థించితే యేసు ప్రభువు దాన్ని విని జవాబిస్తారు. అలా అని ఆయనే చెప్పాడు.



44. చెరసాలలో పేతురు

శిష్యులు ప్రతి రోజూ యేసుప్రభువును గురించి ప్రజలకు చెబుతున్నారు. అందుకు వారిని 'అపోస్తలులు' అని పిలిచారు. వారు - మారుమనసు పొంది దేవుని తట్టు తిరగండి. ఎవ్వరూ నశించడం ఆయనకిష్టంలేదు. ఆయన చనిపోయాడు. అయితే యిప్పుడు తిరిగి సజీవుడై పరలోకంలో ఉన్నాడు. పరిశుద్ధాత్ముని ద్వారా ఆయన మీకు క్రొత్త మనసును ఇవ్వగలడు. అని అందరికీ ప్రకటించారు.

ఆనాటి నుండి ఈ దినం వరకూ ప్రజలు మారు మనసు పొందుతూనే ఉన్నారు. అది పరిశుద్ధాత్ముని కార్యం.

అయితే శత్రువులు వీరిపై మరింతగా కోపపడుతున్నారు. వారు అపొస్తలులతో - మీరు యేసుప్రభువును గురించి ఇకపై మాట్లాడకూడదు. అలా చేస్తే మిమ్ములను చెరసాలలో వేస్తాము, అని చెప్పారు.



అయితే అపొస్తలులు ఇంకా ప్రకటిస్తూనే ఉన్నారు. ఎందుకంటే అది దేవుని చిత్తం.

అంతలో సైనికులు వచ్చారు. హేరోదు రాజు వాళ్లని పంపాడు. వాళ్లు పేతురును పట్టుకొని చెరసాలలో బంధించారు.

అక్కడ పేతురు, చెరసాలలో ఒక చిన్న చీకటి గదిలో కూర్చొని ఉన్నాడు. అతని రెండు వైపులా ఇద్దరు సైనికులున్నారు. పేతురు చేతులతో వాళ్ల చేతులు కలిపి సంకెళ్లతో కట్టివేసారు. పేతురు పారిపోవాలని చూస్తే ఆ సైనికులకు వెంటనే తెలుస్తుంది.

చెరసాల తలుపులు గట్టిగ మూసి వేసి ఉన్నాయి. వాటి ముందు కూడ సైనికులు కాపలా కాస్తున్నారు. పేతురు పారిపోడానికి ఏమార్గమూ లేదు. మరునాడు పేతురును చంపేస్తారు. హేరోదు అలా అని ఆజ్ఞ యిచ్చాడు. పాపం పేతురు! తరువాత యేం జరుగుతుందో బాగా వినండి.

అది రాత్రి వేళ. పేతురు నిద్రపోతున్నాడు. అదెలా సాధ్యం? అతనికి భయం వేయడం లేదా? మరునాడు అతన్ని చంపేస్తారు కదా? లేదు, అతనికి ఏ భయమూ లేదు. యేసుప్రభువే అతన్ని కాపాడుతాడు. అతడు మరణించవలసి వచ్చినా భయంలేదు. అందుకే అతడు హాయిగా నిద్రపోతున్నాడు. పాపం పేతురు అనవద్దు, సంతోషంగా ఉన్న పేతురు, అనాలి!

హఠాత్తుగా చెరసాలలో, పేతురు ఉన్న చిన్న గదిలో గొప్ప వెలుగు ప్రకాశించింది! పరలోకం నుండి వచ్చిన దూత అతని ముందు నిలిచాడు. అతడు - పేతురూ, త్వరగా లేచిరా, అన్నాడు.

పేతురు ఆశ్చర్యపోయాడు. ఏం జరుగుతోంది? అతడు లేచాడు. బలమైన సంకెళ్లు అతని చేతి నుండి విడిపోయాయి. అతని రెండు ప్రక్కలా ఉన్న సైనికులు అది గమనించ లేదు. వాళ్లు అలాగే నిద్రపోతున్నారు. "నీ చెప్పులు తొడుక్కో. నీ అంగీపైన వేసుకో, నా వెనుకరా" అని దూత చెప్పాడు.

పేతురు గది తలుపులు వాటంతట అవే తెరుచుకున్నాయి. అదే విధంగా చెరసాల ముఖ్యద్వారం కూడ తెరుచుకొంది. అది దేవుడు చేసినపని. ద్వారం వద్ద కాపలా ఉన్నవారికి యిదేమీ కనిపించలేదు. ఇది కూడ దేవుని కార్యమే.

ఇప్పుడు పేతురూ మరియు దూత వీధుల్లో నడుస్తున్నారు. కొంతసేపటికి దూత పరలోకానికి వెళ్లిపోయాడు. పేతురుకు జరిగిందేమిటో ఇప్పటికి అర్థం అయ్యింది. అతడు - యేసుప్రభువు తన దూతను పంపి నన్ను చెరసాల నుండి విడిపించాడు. అని గ్రహించాడు. అవును, దేవుడు మన శత్రువుల కన్న బలవంతుడు. ఆయన తన సేవకులను ఎంత బాగ కాపాడుతాడు! అందుకే ఆయన పిల్లలు సదా సంతోషంగా ఉంటారు.

పేతురు వేగంగా తన స్నేహితులవద్దకు తిరిగి వెళ్లాడు. వాళ్లంతా ఒక యింటిలో కలిసిఉన్నారు. అది రాత్రి సమయం. అందరూ పేతురు కోసం ఆ రాత్రంతా ప్రార్థిస్తున్నారు. పేతురు చెరసాలలో ఉన్నందుకు వారు చాల కలవరపడుతున్నారు. మరునాడు అతన్ని చంపుతారు. అది అన్నిటి కన్న విచారకం.

హఠాత్తుగ వారు కంగారుపడ్డారు. ఎవరో తలుపు తడుతున్నారు వారెవరు? రోడా అనే పని పిల్ల ఎవరో చూద్దామని వెళ్లింది. పిలుపు విన్నది. అది పేతురు స్వరమే అని గుర్తు పట్టింది. సంతోషంతో తలుపు తీయడం మర్చిపోయింది. వెనక్కి పరుగెత్తి, "పేతురు తలుపు దగ్గర నిలిచి ఉన్నాడు" అని కేకవేసింది. అది విని వాళ్లంతా "అది అసాధ్యం. పేతురు చెరసాలలో ఉన్నాడు కదా?" అన్నారు.

పేతురు యింకా తలుపు తడుతూనే ఉన్నాడు. అది విని వెంటనే వెళ్లారు. అవును అది పేతురే! నిజంగా పేతురే! అతడు తనకు జరిగినదంతా చెప్పాడు. చెరసాలలో తాను సైనికుల మధ్య ఉండడం, దూతరావడం అంతా చెప్పాడు. వారెంతో ఆనందించారు. దేవుడు వారి మొర ఆలకించాడు.

మీరిది విన్నారా? పేతురు స్నేహితులంతా విడవకుండా ప్రార్థన చేసారు.

కొన్నిసార్లు మన హృదయంలో ఓ స్వరం - నువ్వు చాల కాలంగా ప్రార్థన చేస్తున్నావు. ఇక ప్రార్థించ నవసరం లేదు. దేవుడు ఎలాగూ వినడు అని చెబుతుంది. అది సాతానుస్వరం. దానిని వినవద్దు. ప్రార్థన చేస్తూనే ఉండు. ఈ మనుష్యుడు చేసినట్టే. మనం అలా ప్రార్థించాలని దేవుడు కోరుతున్నాడు.

45. సౌలు మార్పు చెందుట

ప్రజలకు యేసు ప్రభుని గూర్చి ప్రతిచోటా ప్రకటించుచున్నారు. దేవుడు వారి బోధను ఆశీర్వదిస్తున్నాడు. మరింత మంది ప్రభువును అంగీకరిస్తున్నారు. యెరూషలేము లోనూ ఇతర ప్రాంతాలలోనూ మనుష్యులు మారి పోతున్నారు.

ఇలా జరగడం యేసును ద్వేషించిన వారికి అస్సలు యిష్టం లేదు. కాబట్టి వెళ్లి ఈ విశ్వాసులను పట్టుకొని చెరసాలలో వేసి చంపేస్తున్నారు. ప్రభుని బిడ్డలను హింసల పాలు చేస్తున్నారు. విశ్వాసులు ముఖ్యంగా సౌలు అనే యువకునికి భయపడుతున్నారు. అతడు యేసుప్రభువుకు శత్రువు. అతడు ఇప్పటికే చాల మందిని బంధించాడు!

ఒక నాడు సౌలు చాల మంది సైనికులను తీసుకొని బయలుదేరాడు. ఎక్కడికి వెళ్తున్నారు? వాళ్లు దూరంగా ఉన్న దమస్కు పట్టణానికి వెళ్తున్నారు. అక్కడ కూడ క్రీస్తు బిడ్డలు నివసిస్తున్నారని విన్నాడు. వారిని బంధించాలని పెద్ద పెద్ద త్రాళ్లు తీసుకొని బయలు దేరారు. సైనికులు వాటితో ఆ క్రైస్తవులను బంధిస్తారు. తిరిగి యెరూషలేముకు తెస్తారు.

సౌలు ఎందుకిలా చేస్తున్నాడు? ఇలా చేసి తాను దేవున్ని సంతోషపెడుతున్నానని అనుకుంటున్నాడు. ఎందుకంటే యేసు దేవుని కుమారుడని క్రైస్తవులు చెబుతున్నారు. కాబట్టి యేసును ప్రేమించి వెంబడించే వాళ్లందరినీ చంపేయాలి. సౌలు తాను దేవుని సేవకుడననీ కాబట్టి యేసును వెంబడించే వారినందరినీ చంపాలనీ అనుకున్నాడు.

సౌలు అలా అనుకోవచ్చు కాని నిజం యేమంటే అతడు సాతాను సేవకుడు. దేవునికి, యేసుకు అతడు శత్రువు.

సౌలు సైనికులతో కలసి వేగంగా వెళ్తున్నాడు. వాళ్లు అప్పుడే దమస్కుకు దగ్గర పడ్డారు.

అంతలో గొప్పకాంతి ఆకాశం నుండి మెరుపులా ప్రకాశించింది. వాళ్లు వణికి పోయారు. సౌలు నేలమీద పడ్డాడు. "సౌలా, సౌలా, నీవు నన్నెందుకు హింసిస్తున్నావు?" అనే స్వరం ఆకాశం నుండి వినవచ్చింది. అంటే, సౌలా, నీవెందుకునన్ను కష్టపెడుతున్నావు. నా పిల్లలను హింసిస్తే నన్ను హింసించినట్టే - అని అర్థం"

సౌలు నేలమీదపడి వణుకుతూ - ప్రభువా, నీవెవరవు? అని అడిగాడు. దానికి తిరిగి - నేను నీవు హింసిస్తున్న యేసును అనే స్వరం వినిపించింది.

ఏమిటీ? ప్రభుయేసు నిజంగా తిరిగి లేచాడా? ఆయన నిజంగా దేవుని కుమారుడా? సౌలు భయపడిపోయాడు. ఇప్పుడు దేవుడు తప్పక తనను చంపేస్తాడు. ఎంత భయంకరం! దేవునికి వ్యతిరేకంగా తాను ఎంత చెడ్డగ ప్రవర్తించాడో అతడు గ్రహించాడు. తానిపుడు యేమి చేయాలి? అని వినయంగా దేవున్ని వేడుకున్నాడు. అతన్ని దమస్కుకు వెళ్లమని యేసు చెప్పాడు. ఆ తరువాత ఏం చేయాలో అక్కడ ఆయన తెలియజేస్తాడు. సౌలేలేచాడు. కాని అతనికి చూపుపోయింది. తనంత తాను ప్రయాణం చేయలేడు. సైనికులు చేయి పట్టినడిపించారు. వారు అతన్నిదమస్కులో ఒక యింటికి తీసుకెళ్లారు. సౌలు అక్కడ మూడు దినాలు ఉన్నాడు. అతడేమీ తిన లేకపోయాడు. త్రాగలేక పోయాడు. దుఃఖంలో మునిగి పోయాడు. అతడు దేవునికి విరోధంగా ఎంత పాపం చేసాడో గ్రహించాడు. తాను ఇంకా బ్రతికి ఉండడం ఓ అద్భుతం! అతడు నరకంలో పడి ఉండాల్సింది. సౌలుయిపుడు నిజంగా పశ్చాత్తాప పడుతున్నాడు.

అయితే అతడిప్పుడు ఏం చేస్తున్నాడో తెలుసా? ప్రార్థన చేస్తున్నాడు. ముందులా కాదు. అప్పుడతని హృదయం నిండా గర్వం ఉండేది. ఇప్పుడయితే దీన మనసుతో, విరిగిన హృదయంతో ప్రార్థిస్తున్నాడు. పరిశుద్ధాత్మ బోధించగా అతడు తన పాపాలు క్షమించమని వినయంగా దేవుని అడుగుతున్నాడు.

మూడవ రోజు ఒక వ్యక్తి సౌలును చూడ్డానికి వచ్చాడు. అతని పేరు అననీయ. అతడు దేవుని సేవకుడు. ఆయనే అతనిని పంపాడు.

మొదట సౌలు దగ్గరకు రాడానికి అననీయ భయపడ్డాడు. ఎందకంటే అతడెంత కీడు చేసాడో


అననీయ ఎరుగును. అయితే ప్రభువు - అననీయ, సౌలు ఇక ఎవరికీ కీడు చేయడు. అతడిక పై శత్రువు కాదు. నేను అతన్ని నాసేవకునిగా ఎంపిక చేసుకున్నాను, అని చెప్పాడు. అననీయ వచ్చి సౌలు తలమీద చేతులుంచి - సౌలా, సోదరుడా, నిన్ను ఆదరించమని యేసుప్రభువు నన్ను పంపాడు. ఆయన నీ పాపాలన్నీ క్షమించాడు. ఆయన నిన్ను రక్షింప కోరుతున్నాడు. నీ కనులు బాగు పడడమే కాదు, నీవు పరిశుద్ధాత్మతో నింపబడతావు అని చెప్పాడు.

వెంటనే సౌలు కన్నులు తెరవబడ్డాయి. అతడు చూడగలిగాడు. అతని హృదయం ఆనందంతో నిండిపోయింది. ఎందుకంటే యేసు తన పాపాలు క్షమించాడు. ఆయన తనకు కూడ రక్షకుడే. పరిశుద్ధాత్ముడే ఈ సత్యాన్ని సౌలుకు తెలిపాడు. సౌలు బాప్తిస్మం పొందాడు. తిరిగి ఆహారం తీసుకున్నాడు. ఇప్పుడతడు నిజంగా దేవుని పిల్లవాడు. ఇది అద్భుతం కాదా?

ఇప్పటి నుండి పౌలు అపొస్తలుడు, అంటే దేవుని సేవకుడు. ప్రతిచోటికీ వెళ్లి తాను ప్రేమించే యేసును గూర్చి ప్రకటిస్తాడు.

కాబట్టి అతడు విదేశాలకు దూర ప్రయాణాలు చేస్తాడు. "నేను మీ అందరికన్న నీచుడను. గొప్ప పాపిని. ఎందుకంటే యేసును ద్వేషించి ఆయన పిల్లలను హింసించాను. అయినా దేవుడు నన్ను ప్రేమించి తన శిష్యునిగ చేసుకొన్నాడు. కాబట్టి గొప్ప పాపిని కూడ ఆయన మార్చగలడని తెలుస్తోంది. నీ కనులు కూడ తెరువమని ప్రార్థించు" అని అందరికీ బోధించాడు.

దేవుడు ఇప్పటికీ మారుమనసు పొంది ఆయను వెంబడించమని తన వాక్యంద్వారా మనతో మాట్లాడుతున్నాడు.



46. జైలు అధికారి మారుమనసు పొందుట

పౌలు దేవుని సేవకునిగా ఎలా మారిపోయాడో గుర్తుందా? అతడు యేసు శిష్యుల వలె అపొస్తలుడయ్యాడు. ఇప్పటి నుండి పౌలు పౌలు అనే పేరుతో పిలవబడతాడు.

పౌలు చాల ప్రయాణాలు చేసాడు. అతడు యేసును ఎరుగని దేశాలు దర్శించాడు. అక్కడి ప్రజలు యేసును గూర్చి ఎన్నడూ వినలేదు. పౌలు ఒక మిషనరి. అంటే ఆ అన్యదేశంలోని ప్రజలకు దేవుని గూర్చి చెప్పేవాడు. వీరిలో చాల మందికి దేవుడు నూతన హృదయమును దయ చేసాడు. ఇప్పుడు వాళ్లు దేవున్ని మాత్రమే సేవిస్తారు. ప్రభువైన యేసు విదేశాలలో ఉన్న వారికి కూడా రక్షకుడే.

ఒకసారి పౌలు ఒక దూర దేశానికి వెళ్లాడు. అతనితో పాటు సీల అనే సేవకుడు కూడ వెళ్తున్నాడు. వారిద్దరూ ఫిలిప్పీపట్టణం చేరుకున్నారు. అక్కడ ప్రజలకు యేసు ప్రభువును గూర్చి చెప్పారు. అయితే ఇక్కడ చాలమంది శత్రువులున్నారు. పౌలు, ఇలా చెప్పడం వాళ్లకు యిష్టంలేదు.

సైనికులు ఈ దిశగా వస్తున్నారు చూడండి. వాళ్లు పౌలు, సీలలను పట్టుకొని చెరసాలలో వేయాలని వచ్చారు. మొదట వీరిద్దరినీ కొరడాలతో కొట్టారు. పౌలు, సీలలు చాల బాధలో ఉన్నారు.

అప్పుడు వారిని చెరసాలలో పడేసారు. అవి చీకటి కొట్లు. చెరసాల యజమాని వారికి కాపలా ఉండాలి. అతడు వీరిద్దరి కాళ్లనీ చెక్కపలకలమధ్య బిగించాడు. అవి బరువైన చెక్కలు. కాబట్టి వాళ్లు తప్పించుకోలేరు. జైలు అధికారి - వీళ్లేదో పెద్ద నేరం చేసి ఉంటారని అనుకున్నాడు.

పౌలు, సీలలు కదలకుండా పడి ఉన్నారు. చాల బాధ ననుభవిస్తున్నారు. వారికి సైనికుల మీద, జైలు అధికారి మీద కోపం వచ్చిందా? లేదు. పోనీ విచారంగా ఉన్నారా? లేనే లేదు. "మనం బాధలో ఉన్నాం కాని యేసు ప్రభువు మన కోసం యింతకంటె ఎక్కువగా బాధ పడలేదా? ఆయన ఏనేరమూ చేయలేదు. దేవుడు యిక్కడ సహా మనలను కాపాడగలడు" అని చెప్పుకున్నారు.

ఇలా వాళ్లు కోపంగా గాని విచారంగా గాని ఉండలేదు. వాళ్లు సంతోషంగా ఉన్నారు. ఎందుకంటే దేవుడు వారికి తోడుగ ఉన్నాడని తెలుసు. వాళ్లు పాటలు పాడుతున్నారు. వినండి. దేవుని స్తుతిస్తూ పౌలు సీలలు ఆనందిస్తున్నారు.

అది మధ్యరాత్రి.

హఠాత్తుగా భూమి కంపిస్తున్నది. భూకంపం! తలుపులన్నీ వాటంతట అవే తెరుచుకున్నాయి. పౌలు సీలల కాళ్లకున్న బంధాలు విడి పోయాయి. ఎందుకంటే భూకంపం వల్ల ఆ బోండలు, అంటే చెక్కలు విరిగిపోయాయి. ఖైదీలు ఇప్పుడు నడిచివెళ్లిపోవచ్చు! భూకంపం వల్ల జైలు అధికారికి మెలకువ వచ్చింది. త్వరగా చెరసాలకు పరుగెత్తాడు. తలుపులన్నీ తెరచి ఉన్నవి! ఖైదీలందరూ తప్పించుకు పారిపోయి ఉంటారు - అనుకున్నాడతడు. అలా జరిగితే అధికారిపై శిక్ష పడుతుంది. అది తలచుకొని అతడు భయపడిపోయాడు. కత్తి తీసి తనను తానే పొడిచి చంపుకోచూచాడు.

అంతలో ఒక స్వరం వినిపించింది. "నీకు నీవు హాని చేసుకోవద్దు. మేము పారిపోలేదు. మేమంతా ఇక్కడే ఉన్నాము" అది పౌలు స్వరం.

జైలు అధికారి కత్తిని క్రింద పడేసాడు. అతను ఒక దీపం తీసుకొని చీకటి గదిలోకి వచ్చాడు. పౌలు, సీలలు అక్కడ నిలబడి ఉండడం చూచాడు. అవును, వాళ్లు పారిపోలేదు. అయితే వారు చెడ్డ మనుష్యులు కారు. వాళ్లు ఏ చెడు కార్యం చేయలేదు. వాళ్లు ప్రజలకు రక్షణ గురించి మాత్రమే చెప్పారు. ఇలా అతడు ఆలోచించ నారంభించాడు - అయ్యో, నేను వీరిని

యింతగా కొట్టాను! నేనెంత క్రూరంగా ప్రవర్తించాను. నా హృదయం ఎంత చెడ్డది!

అతడు పౌలు సీలల ఎదుట భయంతో దుఃఖంతో మోకరించాడు. - అయ్యాలారా, రక్షణ పొందడానికి నేనేం చేయాలి? అని భక్తితో అడిగాడు.

అతడెంత బాధ పడుతున్నాడో పౌలు గ్రహించాడు. జైలు అధికారి తాను పాపినని తెలుసుకున్నాడు. అప్పుడు పౌలు - యేసుక్రీస్తు ప్రభువును విశ్వసించు. అప్పుడు నీవు రక్షణ పొందగలవు, అన్నాడు.

పౌలు, సీల జైలు అధికారితో అతని యింటికి వెళ్లారు. అక్కడ అతనితోను, అక్కడ చేరిన వారందరితోను యేసుప్రభువుని గురించి చెప్పారు. ఆయన ఒక్కడే పాపులను రక్షించగలడు. అందరూ భక్తి పూర్వకంగా వారి మాటలు విన్నారు.

ఇక్కడ, ఈ యింటిలో దేవుడు వేరు దేశాల వారికి నూతన హృదయాలు యిచ్చాడు. జైలు అధికారీ, అక్కడ నివసిస్తున్నవారూ యేసును నమ్మి బాప్తిస్మం తీసుకున్నారు. యేసు వారందరికీ రక్షకుడే.

జైలు అధికారి పౌలు సీలలకు భోజనం పెట్టారు. వారి వీపుపై తగిలిన దెబ్బలను కడిగాడు. ఇప్పుడు అతడు వాళ్లను ప్రేమిస్తున్నాడు! అవును. ప్రభువు నీకు కొత్త హృదయం యివ్వగానే నీవు ఆయన సేవకులనూ బిడ్డలనూ ప్రేమిస్తావు.

మరునాడు పౌలు సీలలు తిరిగి ప్రయాణమయ్యారు. వారు ప్రతిచోటా తిరిగే సువార్తికులు. వాళ్లు బైబిలును, అంటే దేవుని వాక్యాన్ని మనదేశానికి కూడ తెచ్చారు. ఈ పనిచేయడానికి దేవుడే సాయం చేసాడు. జైలు అధికారిలా మనం కూడ దేవుడు పాపులను ఎలా రక్షిస్తాడో చదువవచ్చు.

మనం ఎన్నోసార్లు బైబిలు కథలు చదువుతాము. ఇంటిలో, బడిలో, ఆలయంలో, అప్పుడు "ప్రియ ప్రభువా, నన్ను కూడ నీ బిడ్డగా చేసుకుంటావా?" అని భక్తితో ప్రార్థించు.

